
ఆకాశమే... హద్దుగా

(మధ్యయుగ, ఆధునిక యుగాల
తెలుగు సాహిత్యంలో స్త్రీల చైతన్యం)



డా. జంధ్యాల కనకదుర్గ

ఆకాశమే.... హద్దుగా

(మధ్యయుగ, ఆధునికయుగాల తెలుగు సాహిత్యంలో స్త్రీలచైతన్యం)

డా. జంధ్యాల కనకదుర్గ

జంకదు ప్రచురణలు

'ఆకాశమే...హద్దుగా'

(మధ్యయుగ, ఆధునికయుగాల తెలుగు సాహిత్యంలో స్త్రీలచైతన్యం)

ప్రథమ ముద్రణ : మే, 2026

జంకదు ప్రచురణలు

ప్రతులు : 500

ISBN Number : 978-93-5782-171-1

ముద్రణ :
శ్రీ శ్రీ ప్రింటర్సు, విజయవాడ
srisriprinters.vja@gmail.com
ఫోన్ : 94906 34849

ప్రతులకు చిరునామా :
డా.జె.కనకదుర్గ
ఇం.నెం.5-35-18 లైను,
18 వ అడ్డరోడ్డు, బ్రాడీపేట
గుంటూరు-2
ఫోను : 94911 40299

ధర : రూ. 200 /-

అంకితం

'ఆకాశమే...హద్దుగా'

పుంజుకొన్న స్త్రీలచైతన్యం మూర్తీభవించేలా

ఉటంకించిన **సాహిత్యసృజనకారులకు** మరియు

స్త్రీలచైతన్యాన్ని అవగాహనచేసుకొనే ఆకాంక్ష కలిగిన **పురుషలోకానికి**

నా తల్లిదండ్రులైన



కీ.శే.శ్రీ జంధ్యాల కుమారస్వామి, లక్ష్మీ ప్రసన్నమ్మ ల ఆత్మీయ దివ్య

ఆశీస్సులతో

స్వీయరచనయైన 'ఆకాశమే... హద్దుగా'

(మధ్యయుగ, ఆధునికయుగాల తెలుగు సాహిత్యంలో స్త్రీలచైతన్యం)

అనే ఈ పుస్తకాన్ని అంకితం ఇస్తూ, శుభాకాంక్షలతో

మీ **జె.కనకదుర్గ**



చిన్నమాట

జంధ్యాల కనకదుర్గ తెలుగుసాహిత్య పరిశోధకులలో ముఖ్యులైనవారు. స్త్రీల సాహిత్యపరిశోధన ఆమెకు అభిమాన అంశం. ఆ విషయం గురించి ఇప్పటికే మంచి పుస్తకాలు రాసి ఉన్న కనకదుర్గ మరో కొత్త పరిశోధనతో 'ఆకాశమే.. హద్దుగా' అనే ఈ పుస్తకం తీసుకొచ్చారు.

ప్రాచీనసాహిత్యంలో ప్రతిఫలించిన సామాజికస్త్రీలు తమకు సజావైన జీవనం లేకుండా చేసిన మహిళాసంస్కృతిని అధిగమించాలనుకొనే ఆలోచనలను పెంచుకొనే ప్రయత్నం చేయటం, వారి ఒంటరిపోరాటాలలోని చైతన్యం, దాని ప్రేరకాంశంగా చారిత్రక వ్యక్తియైన రాణిరుద్రమదేవి పరాక్రమశక్తి – ఆధునికయుగంలోని స్త్రీవిద్య పుట్టుపూర్వోత్తరాలనుంచీ సాహిత్యరంగంలో స్త్రీలు వేసిన తొలి మలి అడుగులు, వారు ఎంచుకొన్న కొత్తదారులు, మనకు సోదాహరణ సహితంగా వివరించి చెప్పే పుస్తకం ఇది. తొలి తెలుగు రచయిత్రి, తెలుగులో తొలి స్త్రీలపత్రిక, జాతీయోద్యమానికి రచయిత్రులందించిన సహకారం, వ్యక్తిస్వాతంత్ర్యసాధనకై వారిలో కలిగిన హక్కుల చైతన్యం, అలాగే మైనారిటీవాద, ఆదివాసీల సాహిత్యంలో కూడా స్త్రీలచైతన్యం పుంజుకొంటున్న రచనలు వచ్చాయి. దళితస్పృహ వంటివి పేర్కొనటం విశేషం. నాటకరంగంలో ముఖ్యంగా నాటకరచనలో స్త్రీలు పోషించిన పాత్ర– స్త్రీపురుష సమానత్వసాధనకై స్త్రీపాత్రల చైతన్యం – ప్రపంచీకరణ సందర్భంలో వచ్చిన సాహిత్యంలో ఆకాశమే హద్దుగా ఎదగాలనుకొన్న స్త్రీల వ్యక్తిత్వ, అస్తిత్వ చైతన్యాలు – ఇటువంటి ఎన్నో విషయాలను పరిశోధించి విలువైన విషయాలను ఈ పుస్తకంలో పొందు పరిచారు. భవిష్యత్తులో స్త్రీల సాహిత్యంమీద ముఖ్యంగా మొదటితరం రచయిత్రులమీదా పరిశోధనకు పూనుకునే విద్యార్థులకు ఈ పుస్తకం మార్గదర్శకంగా ఉంటుంది.

తెలుగులో స్త్రీల చరిత్ర గురించి అతితక్కువ పుస్తకాలు వచ్చాయి. అనేకరంగాలలో స్త్రీలు చేసిన కృషి, వారు వేసిన ముద్రలుగురించి వివిధ పరిశోధకులు విడివిడిగా జరిపే పరిశోధనలు మొత్తంగా స్త్రీలచరిత్ర రచనకు ఉపయోగపడతాయి. అలా ఉపయోగపడే పుస్తకాలలో కనకదుర్గగారి పుస్తకాలు ముందువరసలోనే ఉంటాయి. స్త్రీలచరిత్ర రచనకు అవసరమైన ముడిసరకులను అందించటంలో తనవంతు పాత్రను బాధ్యతగా భావించి నిర్వహిస్తున్న కనకదుర్గను అభినందిస్తూ......

– ఓల్గా



ఆకాశమే హద్దుగా ఆలోచనల విన్యాసం

జంధ్యాల కనకదుర్గ "స్వతంత్రత నుండి... స్వాతంత్ర్యానికి (తెలుగులో స్త్రీల సాహిత్యం – క్రీ.శ. 1900–1947)" అనే బృహద్గ్రంథం ప్రచురించి ఐదుసంవత్సరాలు కాకుండానే 'ఆకాశమే... హద్దుగా' అనే మరొక ఉద్గ్రంధాన్ని ప్రచురిస్తున్నందుకు అభినందనలు. ఇది కేవలం స్త్రీల సాహిత్యానికే పరిమితమైనది కాదు. స్వల్పంగానైనా స్త్రీల చైతన్య స్థాయిని నమోదుచేసిన పురుషుల సాహిత్యం కూడా ఇందులో ప్రస్తావించబడింది. ఏడువ్యాసాల సంపుటి ఇది. ఒకటి ప్రాచీన సాహిత్య సంబంధి. మిగిలినవి అన్నీ ఆధునిక సాహిత్య సంబంధులే.

పితృస్వామ్య సమాజంలో ఆధిక్యత, అణచివేత ఉన్న చోటల్లా చైతన్యం దానంతట అది పుట్టుకొస్తుంది. అది ప్రాథమిక దశలో మూగగా వ్యక్తిగతంగా ఉండవచ్చు. పరిస్థితుల ప్రాబల్యాన్నిబట్టి, అవకాశాలను బట్టి అది క్రియాశీల చైతన్యంగా పరిణమిస్తుంది అన్నది ఆమె అవగహన. దానిని అన్వయిస్తూ ప్రాచీన సాహిత్యంలో మహిళల చైతన్యాన్ని అంచనా వేసే ప్రయత్నంచేసింది. ప్రాచీన సాహిత్యంలో స్త్రీల చైతన్యాన్ని అంచనా వేసేటప్పుడు ఆయా కావ్యాలు రాణి రుద్రమదేవి పాలనాకాలానికి పూర్వపువి తరువాతవి అని వింగడించి చూడాలి అన్నది ఆమె మరొక ప్రతిపాదన. పితృస్వామ్య నిర్దేశిత విలువలకు భిన్నంగా ఒక స్త్రీ వారసత్వ హక్కుగా సింహాసనం ఎక్కి కాకతీయ సామ్రాజ్యాన్ని విస్తరింపచేసిన చరిత్ర రుద్రమదేవిది. సాంస్కృతిక సాహిత్య రంగాలపై ప్రభావం నెరిపిన చరిత్ర అది అని కనకదుర్గ భావించింది. నరకాసురుడితో సత్యభామ యుద్ధం, జైమిని భారతంలో ప్రమీల కథ ఆ ప్రభావం నుండే వచ్చాయి అంటుంది ఆమె. బుద్ధిలో మెరుపులా మెదిలే ఒక ఊహను కేంద్రంగా చేసి సాహిత్యాన్ని వ్యాఖ్యానించటం కనకదుర్గకు ఇష్టం. స్వతంత్రత నుండి స్వాతంత్ర్యానికి పుస్తకంలోనూ అది ఉంది. స్త్రీల వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని కోరుతూ ప్రారంభమైన సంస్కరణ ఉద్యమం ఇచ్చిన చైతన్యం స్త్రీలను దేశ స్వాతంత్ర్యంకోసం జాతీయోద్యమంలో భాగస్వాములు అయ్యేట్టు చేసింది అని అందులో చేసిన ఊహకు కొనసాగింపు రుద్రమ రాజకీయ సాధికారత సామాజిక సాంస్కృతిక భావజాల నిర్మాణాన్ని విశేషంగా ప్రభావితం చేసిందన్న వూహ. ఆ ఊహను అన్వయ సూత్రంగా చేసుకొని ప్రాచీన సాహిత్యాన్ని వ్యాఖ్యానించే ప్రయత్నం ఈ

వ్యాసంలో జరిగింది. ఊహను తాత్విక బలంతో ఒక భావనగా అభివృద్ధి చేయటం ఉదహరించిన కావ్యాలలోని స్త్రీల జీవితాలను వ్యాఖ్యానించటంలో కథా సందర్భాన్ని వివరించటం చెప్పదలచుకొన్న ఐడియా పరిపక్వమయ్యేంతవరకు తర్కాన్ని కొనసాగించటం అవసరం.

ఈ వ్యాసంలో కనకదుర్గ ఆంధ్రీకరణ సాహిత్యంలో ఔత్తరాహిక చరిత్ర పురాణేతిహాసాలలోని కథలకు కల్పన జోడించి వ్రాసే కావ్యాలలో దక్షిణాత్య జీవనసంస్కృతి ప్రతిఫలిస్తాయి అని ఆసక్తికరమైన ఒక ప్రకటన చేసింది. దానిని ఎలా నిర్ధారించవచ్చో ఆ రెండింటికి మధ్య భేదం ఏమిటో సాహిత్యంలో దానిని ఎలా గుర్తించవచ్చో, అందువల్ల కలిగే ప్రయోజనం ఏమిటో తెలుసుకొనాలనే కుతూహలం కలుగుతుంది.

ఇక ఈ పుస్తకంలో సింహభాగం స్వాతంత్ర్యానికి పూర్వం స్త్రీల సాహిత్య పరామర్శ. సమాచారం "స్వతంత్రత నుండి... స్వాతంత్ర్యానికి (తెలుగులో స్త్రీల సాహిత్యం – క్రీ.శ.1900–1947)" పుస్తకం కోసం సేకరించి వినియోగించుకొన్నదే. దీనిని జాతీయోద్యమకాలపు సాహిత్యంగా నిర్ధారించి స్త్రీ విద్యా వికాసం, స్త్రీల హక్కులు, దళిత స్పృహ అన్న మూడు కోణాలనుండి పరిశీలించింది. జాతీయోద్యమ కాలం జాతీయ కాంగ్రెస్ ఏర్పడినప్పటి నుండి అనుకొంటే 1885 నుండి. వంగదేశ విభజన నుండి అనుకొంటే 1905 నుండి. స్త్రీవిద్యా వికాస చరిత్రను వీరేశలింగం పంతులును ప్రస్తావించకుండా వివరించటం న్యాయం కాదు కనుక కనకదుర్గ అక్కడి నుండే ప్రారంభించింది. అందువల్ల 1885 నుండి 1947 లో బ్రిటిష్ వలస పాలన నుండి స్వాతంత్ర్యం వచ్చేవరకు జాతీయోద్యమ కాలంగా ఆమె భావించినట్లు అర్ధం చేసుకోవచ్చు. 97 ఉపశీర్షికలతో ఉన్న ఈ వ్యాసం చదువుతుంటే అది విస్తృత సమాచారపు తత్వాన్ని బోధపరచటానికి రచయిత్రి చేసిన వర్గీకరణ కావచ్చునని ప్రారంభంలో అనిపిస్తుంది కానీ వెళ్లేకొద్దీ అది వర్గీకరణ కాదని ఆయా వ్యాసాల కీలకాంశాన్ని సూచించటానికి పెట్టిన ఉపశీర్షిక అని అర్ధం అవుతుంది. ఇంతకూ రచయిత ఎంచుకొన్న పద్ధతి అరవై రెండేళ్లపాటు స్త్రీ విద్య కేంద్రంగా స్త్రీలు వ్రాసిన వ్యాసాలు, కథలు, నాటకాలు అన్నిటినీ కాలక్రమ వరుసలో పరిచయం చేయటమే. ఇదే పద్ధతిలో ఆ కాలంలోనే స్త్రీల హక్కులగురించి వచ్చిన సాహిత్యాన్ని, దళిత చైతన్యంతో వచ్చిన స్త్రీల సాహిత్యాన్ని పరిచయం చేస్తూ మరో రెండు వ్యాసాలు వ్రాసింది. ఈ మూడింటినీ జాతీయోద్యమకాలపు స్త్రీల సాహిత్యం అనే గొడుగు కింది విషయాలుగానే భావించింది. స్త్రీ విద్య – స్త్రీ స్వాతంత్ర్యం, స్త్రీల హక్కుల చైతన్యం – దేశ స్వాతంత్ర్య చింతన, దేశ దాస్య విముక్తి – స్త్రీల గృహ బానిసత్వ విముక్తి, స్త్రీ పురుష సమానత్వం – వర్ణసమానత్వం పరస్పర ప్రచోదకాలు, పరస్పరాశ్రితాలు అన్న అవగాహన ఈ వ్యాసాల అంతస్సూత్రం.

ఈ వ్యాసాలకు రచయిత్రి ఉపయోగించిన ముడిసరుకునే కాలక్రమ వరుసలోనే కాక ఆయా అంశాలకు సంబంధించిన వ్యాసాలను, సృజనప్రక్రియలు అయిన కథలను నాటకాలను మూడు ప్రధానభాగాలుగా విభజించి వాటిని మళ్ళీ ఆయా రచనలలోని సామాన్యాంశాలను బట్టి వర్గీకరించి చర్చించటం వలన స్త్రీవిద్యకు, స్త్రీల హక్కులకు, స్త్రీల దళిత స్పృహకు సంబంధించిన చింతనలోని ప్రధాన ధోరణులు, కాలక్రమ పరిణామాలు తెలిసివచ్చి వర్తమానాన్ని అధ్యయనం చేయటానికి, అర్థం చేసుకొనటానికి అవసరమైన జ్ఞానంగా అందివస్తుంది.

తరువాతి వ్యాసాలు స్వతంత్ర భారతదేశంలో స్త్రీల చైతన్యాన్ని అంచనా వేసేవి. ఆ చైతన్యాన్ని వ్యక్తిత్వ చైతన్యం, సాధికార చైతన్యం, స్త్రీవాద చైతన్యం ఇలా వేరువేరు విశేషణాలతో పేర్కొన్నది. సాహిత్యమే వీటికి కూడా ముడిసరుకు. 1947 నుండి 2026 వరకు 79 ఏళ్ళ కాలం మీద వచ్చిన స్త్రీపురుషుల సృజన సాహిత్యాన్ని విశ్లేషించిన వ్యాసాలు. పుస్తకానికి పేరు 'ఆకాశమే... హద్దు'. ఈ వ్యాసాల్లో స్త్రీల జీవిత వ్యాఖ్యానం మొత్తంగా పితృస్వామ్యం, దాని ఫలితమైన స్త్రీల లైంగికత, లైంగిక సంబంధాల పరిధిని దాటుకపోవటం కనిపిస్తుంది. జంధ్యాల కనకదుర్గ అధ్యయనానికి, ఆలోచనలకు మాత్రం ఆకాశమే హద్దు.

ఆలోచనలు సంకల్పితం కావచ్చు. అసంకల్పిత ప్రవాహమూ కావచ్చు. ఆలోచనలు నిలకడగా ఉండవు. ఒకదాన్ని తోసుకొని మరొకటి వస్తుంటాయి, అర్థాంతరంగా ఆగిపోతుంటాయి. అర్థవంతమైన నిర్ధారణ వరకు కొనసాగేవి కొన్ని ఉంటాయి. ఆలోచనల వేగం అపరిమితం. ఆలోచనలకు విషయ గత వరుస, కాలక్రమ వరుస ఏవీ ఉండవు. ఒకే ఆలోచన మళ్ళీమళ్ళీ వస్తూ ఉంటుంది. ఆలోచనలను రచనలోకి తేవటం అంటే అది చైతన్యవంతమైన పని. ఆ దిశగా చేసే ప్రయత్నం పుస్తకంయొక్క జనాదరణకు కారణమవుతుందని భావిస్తూ నాకీ నాలుగుమాటలు వ్రాయటానికి అవకాశం ఇచ్చిన స్నేహితురాలు జంధ్యాల కనకదుర్గకు (జంకదు) కృతజ్ఞతలు.

కనకదుర్గ ఉత్సాహశక్తికి అభినందనలు.

– కాత్యాయనీ విద్మహే

ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక
జాతీయ సమన్వయకర్త

పశ్యంతి
వరంగల్
8-5-2026



'ఆకాశమే.... హద్దుగా'

(మధ్యయుగ, ఆధునికయుగాల తెలుగు సాహిత్యంలో స్త్రీలచైతన్యం)

(ఆరు విభాగాలుగా)

అవగాహన

సమాజానికి ఒక చరిత్ర, తాత్వికత ఉంటుందనేది అందరి గ్రహింపుకు వచ్చేవిషయమే. మానవజీవిత చరిత్రలో కాలనిర్ణయం ప్రధానవిషయంగా సాగుతుంది. అయితే సామాజిక మానవ జీవనవిధానం నమోదు అయింది మాత్రం కాలానుగుణ సృజన సాహిత్యంలోనే. ఆ జీవనవిధానం ఒకతాత్వికతను ఆధారంచేసుకొని ఉంటుంది. ఆ తాత్వికత జీవనసంస్కృతిలో ప్రతిఫలిస్తుంది. చారిత్రకంగా ఆ తాత్వికసంస్కృతి రూపాంతరం చెందుతూ ఉంటుంది. దానికి కారణం పరిణామశీలమైన సామాజికచలనసూత్రాలు. అంటే ఆయాకాలాలలోని ఆర్థిక – రాజకీయాలు ప్రభావితంచేసిన సామాజిక–సాంస్కృతిక జీవనవిధానం. సుప్రసిద్ధ చరిత్రకారిణి రొమిల్లా థాపర్ 'సాహిత్యవస్తువు చరిత్రతో సంబంధం కలిగి ఉంటుంది. సాహిత్యం దేనిని చారిత్రకంగా ప్రాధాన్యత కలిగిన దానిగా గుర్తిస్తుందో దానివల్ల ఆ సంబంధం ఏర్పడుతుందని చెప్పడం జరిగింది. అటువంటి చారిత్రక మానవ జీవనవిధానాన్ని ప్రతిబింబించిన సాహిత్యంలో మహిళల జీవనచిత్రణ, ఆ చిత్రణలో ప్రతిఫలించిన సంస్కృతి, ఆ సంస్కృతిపట్ల మహిళలమనోభావాలు అర్థంచేసుకోవాలంటే ప్రాచీన, ఆధునికసాహిత్యాల పఠనం తప్పనిసరి. ప్రాచీనసాహిత్యం పద్యాత్మకం. అనేక సాహిత్య ప్రక్రియలసమాహారం ఆధునిక సాహిత్యం. ఆ క్రమంలో మధ్యయుగాలనాటి తెలుగు సాహిత్యాన్ని రుద్రమదేవి పరిపాలనకు ముందుది, ఆ తరువాతదిగా పరిశీలించడం వల్ల పరిణామశీలమైన మహిళాసంస్కృతి స్పష్టమైంది. ప్రాచీనసాహిత్యంలోను, ఆధునికయుగానికి చెందిన తెలుగు సాహిత్యంలోను ఆయా రచయితలు సామాజిక చలనసూత్రాల ప్రభావితమైన మానవ సంబంధాల చిత్రణ చేసేటప్పుడు స్త్రీ పురుష సంబంధాలు ప్రతిఫలిస్తాయి. అప్పుడే నేడు రోదసీ పరివ్యాప్తమైన స్త్రీల చైతన్య ప్రస్థానపు ప్రారంభ, వికాశము అర్థం కాగలుగుతాయి. కావ్యసృజన కాలంనాటి చారిత్రకసంస్కృతి ప్రభావం కావ్యాంతర్గత పాత్రల ఆలోచనలో చైతన్యం కలిగించగలిగితే అది ఊహామాత్రమేకాక దాని తాత్వికత సత్యావిష్కరణకు దారి దీపం అవుతుంది.

జంధ్యాల కనకదుర్గ

అనాదిగా పితృస్వామ్య సామాజిక కుటుంబ నిర్మాణం ఏర్పడిందనేది సామాజిక సత్యం. దానితో స్త్రీలకు సామాజిక సంబంధాలు శూన్యమవటంతో మధ్యయుగాలవరకు మహిళల జీవనవిధానం కుటుంబపరిధిలోనే సాగింది. అప్పటివరకు స్త్రీలు జీవించింది పూర్తిగా పితృస్వామ్యకుటుంబాలలోనే కాబట్టి వారు తమ మనుగడకోసం పితృస్వామ్యం నిర్దేశించిన సంస్కృతినే పాటించక తప్పని పరిస్థితి. అయితే అది పీడనగా ఉంటే, ఆ అసమసంస్కృతి తమ జీవితాలకు బాధలను సృష్టించుతోందనే స్పృహ ఆ బాధితమహిళలలో కలగకమానదు. కాని స్త్రీలు పోషింపబడే స్థితిలో ఉండటంతో నోరుమెదపలేని స్థితి వారిది. తమ జీవితాలను కొనసాగించటంకోసం మౌనంగా స్త్రీలు మూగరోదనను అనుభవించేవారు. కాని పీడన పరాకాష్ఠదశకి చేరుకొన్నప్పుడు వారి ఆలోచనలుకూడా అదే మేరకు పెరిగి, ప్రత్యామ్నాయాలను వెదుకుకొనే క్రమంలో, ఏదో ఒక స్థాయిలో ఆ సమస్యలను అధిగమించే చైతన్యం ఉద్భవిస్తుంది. దానికి ప్రేరణాంశం ఒకటి ఉంటుంది. దాన్ని గ్రహిస్తేనే ఆ చైతన్యానికి ఉన్న విలువలు అర్థం అవుతాయి. అయితే అది ఒంటరిమహిళలయొక్క చైతన్యం కాబట్టి పితృస్వామ్యపు మానవసంబంధాల చిత్రణలో భాగంగా సాహిత్యంలో సినీవాలిగా ప్రతిఫలిస్తుంది. ప్రాచీనసాహిత్యంలో ఆ చైతన్యాన్ని ఒడిసి పట్టుకున్నప్పుడే ఆయాకాలాలనాటి సాంఘిక వ్యవస్థలో స్త్రీల చైతన్యం చాపకింద నీరులాగా పారుతూనే ఉందనేది అర్థమౌతుంది.

మొదటి భాగం – ప్రాచీనాంధ్ర కవులు, కవయిత్రులు తమ కావ్యాలలో సామాజిక చిత్రణలో భాగంగా భూస్వామ్యవ్యవస్థలో స్త్రీపురుషసంబంధాలను వర్ణించేటప్పుడు ఆయాకాలాలనాటి మహిళాసంస్కృతి అప్రయత్నంగానే చోటుచేసుకుంటుంది. ప్రాచీన తెలుగు సాహిత్యంలో ముఖ్యంగా చారిత్రకవ్యక్తియైన రాణి రుద్రమదేవి పరిపాలనానంతరం సాంస్కృతిక పరిణామఫలితంగా సాహిత్యంలో ప్రతిఫలించిన మహిళలు సతీసహగమనాన్ని, బహుభార్యాత్వపు సంస్కృతిని, సామాజిక కుటుంబనిర్మాణసంస్కృతిని అధిగమించాలనుకోవటం, వారియొక్క ఒంటరిపోరాటంలోని నివురుగప్పిన నిశ్శబ్దచైతన్యాన్ని వెలికితీసే ప్రయత్నం మొదటి భాగంలో ఉంది.

రెండవ భాగం – మధ్యయుగాల తరువాతది అని చెప్పబడినది ఆధునిక యుగం. ఆధునికయుగంలోని పరిణామశీలమైన సామాజిక చలనసూత్రాల ప్రభావంవల్ల మహిళాసంస్కృతిలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఆధునికయుగ ప్రారంభంలో వలసవాదుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా స్వరాజ్యపోరాటం ప్రారంభమైంది. భారతదేశ స్వాతంత్ర్యానికి పూర్వమే పెట్టుబడిదారీ వ్యవస్థలో మహిళలకు సామాజికసంబంధాలు అనివార్యంకావటంతో స్త్రీవిద్యకు ప్రాధాన్యత ఏర్పడింది. ఆ క్రమంలో స్త్రీలు తమకున్న పరిమితులలోనే చదువుకోవటంవల్ల తమ జీవితాలకు విలువ

ఉంటుందనే ఆలోచనలు పెరిగి మహిళలలో సామూహిక చైతన్యానికి అవకాశాలు ఏర్పడ్డాయి. ఆధునికయుగ ప్రారంభంలోనే మహిళా సంస్కృతి సామూహికత్వాన్ని సంతరించుకొని, అది వ్యక్తిస్వాతంత్ర్య – చైతన్యంగా పరిణమించింది. ఈ విషయాన్ని గ్రహించటానికి తెలుగుసాహిత్యాన్ని, స్త్రీవిద్యా చైతన్యం, హక్కులచైతన్యం, దళిత స్పృహ అనే మూడు ఉపవిభాగాలుగా చేయటం జరిగింది. విషయం స్త్రీలచైతన్యం కాబట్టి ఎక్కువగా నాడు స్త్రీలు రాసిన సాహిత్యంలో ఆ చైతన్యం స్పష్టమైంది. ఈ రచనలన్నీ విస్తృతంగా నాటి పత్రికలైన, కందుకూరి వీరేశలింగంగారి 'వివేకవర్ధిని', 'చింతామణి', 'సత్యసంవర్ధని' పత్రికలు, రాయసం వేంకట శివుడు నిర్వహించిన 'జనానా' పత్రిక, సత్తిరాజు సీతారామయ్యగారి ఆధ్వర్యంలో కాలక్రమంగా మాడభూషి చూడమ్మ, బాలాంత్రపు శేషమ్మ, మొసలికంటి రామాబాయమ్మ నిర్వహించిన 'హిందూసుందరి' పత్రిక, పులుగుర్తి లక్ష్మీనరసమ్మ నడిపిన 'సావిత్రి' పత్రిక, వింజమూరి వెంకటరత్నం నిర్వహించిన 'అనసూయ' పత్రిక, చిల్లరిగె రమణమ్మ 'వివేకవతి' పత్రిక, కళ్లేపల్లి వెంకటరమణమ్మ నిర్వహించిన 'ఆంధ్రలక్ష్మి' పత్రిక, అనిబిసెంటు మరియు ముత్తులక్ష్మి ఆధ్వర్యంలో వచ్చిన 'స్త్రీధర్మ' పత్రిక, కె.న్.కేసరి నడిపిన 'గృహలక్ష్మి' పత్రిక, కాశీనాధుని నాగేశ్వరరావు గారి ఆంధ్రపత్రిక వంటి పత్రికలలో ప్రచురితమయ్యాయి. ఆనాడు స్త్రీలుకూడా పత్రికా నిర్వహణం చేసిన విషయం అందరికీ తెలిసిందే. ఉదహరించిన సాహిత్యానికి అనుబంధంగా పాతబడిన ఆయా పత్రికలలో విస్మృతంగా పడి ఉన్న స్త్రీలు రాసిన సాహిత్య సమాచారంయొక్క వివరాలను పాఠకుల సౌలభ్యంకోసం ఆనవాళ్ళను ఇవ్వటం జరిగింది. ప్రసిద్ధిపొందిన పురుషుల రచనలను అవసరంమేరకు గ్రహించటం జరిగింది.

ఆధునికయుగ ఆరంభంనాటినుండి భారతదేశం స్వాతంత్ర్యంపొందే ముందువరకు స్త్రీవిద్యాప్రచారానికై స్త్రీలు సృష్టించిన అనంతసాహిత్యం నాటి పత్రికలలో లభ్యమైనా, ఉదాహరణలుగా మాత్రమే పేర్కొనటం జరిగింది. వివిధప్రాంతాలకు చెందిన తెలుగుస్త్రీలు స్త్రీవిద్యాఉద్యమ ప్రయోజనాలను ప్రచారంచేసే క్రమంలో సాహిత్యంలో పునరుక్తులున్నట్టు అనిపించినా, ప్రధానంగా స్త్రీవిద్యాఉద్యమ విషయంలో భిన్నత్వంతో ఉండి ముందుగా పేర్కొన్న స్త్రీలరచనలను స్వీకరించటం జరిగింది. కాలానుగుణంగాచేసిన స్త్రీవిద్యాఉద్యమాన్ని, దాని కొనసాగింపుకై స్త్రీలు చేసిన క్రియాశీలాత్మకమైన ఆలోచనల పరిణామశీలతను ప్రతిఫలించిన స్త్రీలసాహిత్యాన్ని పేర్కొనటం జరిగింది. సమాజ సంబంధాలలోనుండి పుట్టుకొచ్చిన ఈ స్త్రీలసాహిత్యంలో ప్రతిఫలించిన స్త్రీవిద్యా ఉద్యమం ప్రయోగాత్మకంగా సాధించిన స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్య చైతన్యాన్ని, దానితో పొందిన సమాజ, దేశ ప్రయోజనాలను నిరూపించగలిగింది. చదువు, దానితో పాటు వృత్తివిద్యలు నేర్చుకోవటంతో ఆర్థిక స్వావలంబనను, స్త్రీపురుష సమానత్వపు ఆలోచనలను పెంపొందించుకొన్నారు.

జంధ్యాల కనకదుర్గ

స్త్రీలు తమ వ్యక్తిస్వాతంత్ర్యంకోసం హక్కులచైతన్యం తెచ్చుకొన్నారు. భారతదేశ స్వాతంత్ర్యానికై చేసిన పోరాటంలో భారతీయులు తమకు జాతీయహక్కులు కావాలని బ్రిటిష్ వారిని చట్టాలను చేయవలసిందని అడిగినట్టుగానే, సమాంతరంగా స్త్రీలు తమ వ్యక్తిస్వాతంత్ర్యంకోసం జీవనహక్కులు కావాలని, దానికై చట్టాలుచేయాలని ఆకాంక్షించి, స్త్రీలు ఉద్యమంలో భాగంగా సాహిత్యాన్ని సాధనంగా చేసుకొన్నారు.

20వ శతాబ్దప్రారంభంనుండి స్త్రీలు పురుషులతోపాటు సమానత్వాన్ని కోరుకునే క్రమంలో మానవహక్కుల స్పృహ ఏర్పడటంతో తమ సమస్యలను పరిష్కరించుకోవాలనుకొన్నారు. అంతేకాక, తమవలె సమాజంలో గౌరవప్రదమైన జీవనహక్కులు లేని అస్పృశ్యులను గురించిన ఆలోచనలుపెంచుకునే క్రమంలోనే జాతీయోద్యమకాలంలో వారిని కలుపుకొని, భారతీయులు ఐకమత్యాన్ని కాపాడుకోగలిగితేనే స్వాతంత్ర్యం వస్తుందనే భావన కలగటంతో స్త్రీలలో దళిత స్పృహకూడా ఏర్పడింది. దానితో సమాజంలో దళితస్పృహను కలిగించటానికై స్త్రీలు సాహిత్యాన్ని సృజించారు.

మూడవ భాగం – భారతదేశ స్వాతంత్ర్యానంతరం మహిళలలో ప్రజాస్వామిక దృక్పథం అభివృద్ధిచెంది, స్త్రీపురుషసమానత్వ సంస్కృతీచైతన్యం, వ్యక్తిత్వచైతన్యం వెల్లి విరిసింది. ఆ క్రమంలోనే మహిళలలో తమ మనసుకు, శరీరాలకు ఉన్న విలువలు అర్థంకాగలిగాయి. మహిళలలో శారీరక స్పృహ పెరిగి పితృస్వామ్యసమాజం దృష్టిలో తమ శరీరానికి, తమ ఉనికికి ఉన్న విలువలు, సామాజిక కుటుంబజీవనంలో తమస్థాయికున్న విలువలను అంచనావేసుకోగలిగే ప్రజాస్వామికదృక్పథం ఏర్పడింది. స్త్రీలు తమ జీవితాలమీద తమకే సాధికారికత ఉండాలనే వ్యక్తిత్వచైతన్యం కలిగి అది పుంఖానుపుంఖాలుగా స్త్రీల రచనలలోను, ఏదో ఒకమేరకు పురుషుల రచనలలోను ప్రతిఫలించింది.

నాల్గవ విభాగం – మార్కెట్ శక్తులు వాణిజ్యం ప్రధానంగాగల ప్రపంచీకరణ సందర్భాలలో మారిన రాజకీయ–ఆర్థిక, సామాజిక–సాంస్కృతిక పరిస్థితులలో మహిళల జీవనవిధానంలో వచ్చిన మార్పులు, మహిళలు తమ వ్యక్తిత్వపు విలువలను పెంచుకుంటూ అస్తిత్వపు చైతన్యాన్ని తెచ్చుకొన్నారు. మైనారిటీవాదం, ఆదివాసీల సాహిత్యంలో ఈ చైతన్యం కొత్తవెలుగులను సంతరించుకొంది. పోటీప్రపంచంలో తమ సామర్థ్యాలను పెంచుకుంటూ ముందుకుసాగే రోజులు కాబట్టి మహిళాసంస్కృతిలో విభిన్నమైన అస్తిత్వ–సాధికారచైతన్యం తప్పనిసరి అయింది. ఆ దిశగా అడుగులు వేసే రచనలు వచ్చాయి. విప్లవభావ చైతన్యాన్ని తెచ్చుకొన్న స్త్రీలను గురించిన రచనలు వచ్చాయి.

ఐదవ విభాగం – ఆధునికయుగంనుండి ప్రపంచీకరణ సందర్భంవరకు తెలుగులో వచ్చిన సాంఘిక నాటకాల ప్రతిఫలించిన స్త్రీవాద చైతన్యాన్ని ప్రస్తావించటం జరిగింది.

ఆరవ భాగం – మహిళల చైతన్యప్రస్థానం నిరంతరం కొనసాగాల్సిన అవసరాన్ని ప్రస్తావించటం జరిగింది. సమాజంలో వ్యక్తిగతం అంతా రాజకీయమే అన్న ఓల్గాగారి మాటలు శాశ్వతసత్యం. సమాజంలో రాజకీయాలు మహిళల జీవనంలో అలజడులు సృష్టింపబడినప్పుడల్లా రచయితలు ముందుకువచ్చి ప్రశ్నను పెట్టి, పాఠకులను ఆలోచింపజేయగల సాహిత్యసృజనలు రావటం అనివార్యం. సామాజిక పితృస్వామ్య కుటుంబాలు ఏర్పడిననాటినుండి నేటికీ చాపకింద నీరులాగా పితృస్వామ్యసంస్కృతి కొనసాగుతూ వస్తున్నదన్నది అందరికీ అర్థమైన విషయమే. కాబట్టి పితృస్వామ్య రాజకీయాలు ఉన్నన్నాళ్ళు మహిళలకు ఆటుపోట్లు తప్పవు కాబట్టి మహిళాచైతన్య దోహదకారమైన సాహిత్యం ఉత్పన్నమవుతూనే ఉంటుంది. కాబట్టి మహిళాచైతన్య ప్రస్థానం నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది.

సమాజంలో ఏ కాలంలోనైనా స్వీయ ఆలోచనలలోను, చదువు వల్లను, ఉపాధి కారణంగాను మహిళలలో తమ జీవనసమస్యపట్ల విప్లవాత్మక చైతన్యం పుట్టుకొస్తుంది కాబట్టి ఆ చైతన్యానికి విలువలు ఉంటాయి. మధ్యయుగాల భూస్వామ్యవ్యవస్థలో వచ్చిన ప్రాచీన తెలుగుసాహిత్యంలో స్త్రీలు తమజీవితాలపై నిర్దేశించిన పితృస్వామ్యసంస్కృతిపట్ల సంఘర్షించే చైతన్యం తెచ్చుకొన్నా అది కుటుంబ పరిధిలోనే ఉండటంచేత అది ఒంటరిమహిళల మూగ, వ్యక్తిగత సాంస్కృతిక చైతన్యంగా ఉండి ఎవరికీ స్పష్టమవలేదు. అయితే ఆధునికయుగ ప్రారంభంలో ఏర్పడిన సామాజిక చలనసూత్రాల పరిణామ ఫలితంగా పుట్టిన జాతీయోద్యమంవల్ల స్త్రీవిద్యకు ప్రాధాన్యత పెరిగి, స్త్రీలకు సామాజిక సంబంధాలు అభివృద్ధిచెందటంతో, మహిళల సామూహిక చైతన్యం స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్య చైతన్యంగా పరిణామం చెందింది. భారతదేశంలో ప్రజాస్వామ్యం ఏర్పడినా మహిళలకు ఇంటాబయటా స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు లేకపోయేసరికి మహిళలు తమ గౌరవప్రదమైన జీవనానికై తమ జీవితాలపై అస్తిత్వ–సాధికారచైతన్యాన్ని తెచ్చుకొనే క్రమంలో మహిళాచైతన్యం సైద్ధాంతిక భూమికను సంతరించుకొని స్త్రీవాదచైతన్యంగా స్థిరపడింది.

ఆ క్రమంలోనే మార్కెట్ శక్తుల వ్యాపారసంస్కృతి స్త్రీలజీవితాలను శక్తియుక్తులను కబళిస్తుంటే వ్యక్తిత్వ, అస్థిత్వచైతన్యాలుగా బలాన్ని పుంజుకోవటం జరిగింది. ఆయా కాలాలసాహిత్య సృజనలలో ప్రతిఫలింపజేసిన మహిళాచైతన్యప్రష్థానాన్ని గ్రహించే నేర్పును కలగజేయటానికి సాహిత్య–విమర్శకులు మునుపు చేసిన ప్రయత్నాలు ఉండనే ఉన్నాయి. కాని మానవసంబంధాల అభివృద్ధికై మహిళా చైతన్యానికి ఉన్న ప్రాధాన్యతను బట్టి మరొక ప్రయత్నంగా ఈ విమర్శపుస్తకాన్ని రూపొందించటం జరిగింది. కాలానుగుణంగా పరిణితి చెందిన మహిళాచైతన్య ప్రస్థానపు విలువలను గ్రహించటానికి

అందుబాటులో ఉన్న మధ్యయుగాలచరిత్రలో వచ్చిన ప్రాచీనసాహిత్యంలో, ఆధునికయుగంలోను వచ్చిన తెలుగు సాహిత్యంలోను ప్రతిఫలించిన మహిళల సాంస్కృతిక జీవనవిధానంలోని క్రమానుగత మహిళాచైతన్యం మహిళాభివృద్ధికి దోహదకారి అయిన విషయం, మహిళలచైతన్యపు విలువలను గుర్తించేందుకు ఆకాశమే...హద్దుగా అనే ఈ రచన కొంత దోహదకారి కాగలుగుతుందని, ఆధునికయుగంలో బాగా ప్రజాదరణ పొంది, అందుబాటులో ఉన్న రచనలను, ముఖ్యంగా స్త్రీల రచనలను ఎక్కువగా ఉటంకించటం జరిగింది. అనంతసాహిత్యంలో అన్ని రచనలను పరిగణనలోకి తీసుకోగలిగే వెసులుబాటు లేనందుకు సహృదయులు అర్థం చేసుకొగలరని ఆశిస్తూ, ఆత్మీయులు ఆదరించగలరనే భావనతో పాఠకులముందుకు ఈ పుస్తకాన్ని తీసుకురావటం జరిగింది.

కృతజ్ఞతలు

ప్రముఖ స్త్రీవాద సిద్ధాంతకర్త, కథ, నవల, నాటకరచనలలో సుప్రసిద్ధులు, కేంద్రసాహిత్య అకాడెమి సన్మానగ్రహీతలు ఈ పుస్తకానికి ముందుమాట రాస్తే మరింతగా విలువలు సంతరించు కుంటుందని ఆశించి అడగగానే చిన్నమాట అంటూ అల్పాక్షరాలలో అనల్పభావనలను పొందుపరిచి రాసి పంపిన శ్రీమతి ఓల్గా (పోపూరి లలితకుమారి) గారికి ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పడం నా బాధ్యత, గురుశిష్య సంబంధానికి కొనసాగింపుగా తీరికచేసుకొని అడగగానే వెంటనే తమ అభిప్రాయాన్ని రాసి పంపిన కేంద్రసాహిత్య అకాడెమి పురస్కార గ్రహీత, పూర్వ ఆచార్యులు కాత్యాయనీవిద్మహే గారికి గౌరవపూర్వక కృతజ్ఞతలు తెలియజేయటం మిక్కిలి సంతోషదాయకం. 'ఆకాశమే ...హద్దుగా' (మధ్యయుగ, ఆధునికయుగాల తెలుగు సాహిత్యంలో స్త్రీలచైతన్యం) అనే ఈ పుస్తకంలో ఉటంకించిన సాహిత్యసృజనకారులందరికీ పేరుపేరున కృతజ్ఞతలు చెప్పుకోవటం నా బాధ్యత. అలాగే నా యీ కృషిని ప్రోత్సహించి సహకరించిన నా ఆత్మీయులందరికి కృతజ్ఞతలు.

ఈ గ్రంథాన్ని అచ్చురూపంలో ప్రజల ముందుకు తేవటానికి పూనుకొన్న శ్రీశ్రీ ప్రింటర్సు, విజయవాడ శ్రీ విశ్వేశ్వరరావు గారికి ప్రత్యేక కృతజ్ఞతలు, ముఖ చిత్రాన్ని ఓపికతో డిజైన్ చేసిన శ్రీ గిరిధర్ గారికి కృతజ్ఞతలు.

పాఠకలోకానికి ముందుగా కృతజ్ఞతలు.

జంకదు

(జంధ్యాల కనకదుర్గ)

ఇందులో....

1. మధ్యయుగాలనాటి ప్రాచీన తెలుగు సాహిత్యంలో మహిళల సాంస్కృతిక చైతన్యం

మధ్యయుగాల చరిత్ర కాలంలో వచ్చినది ప్రాచీన తెలుగుసాహిత్యం. అనగా క్రీ.శ.11 వ శతాబ్దానికి చెందిన ఆదికవి నన్నయ్యనుండి మధ్యయుగాల చరిత్ర ముగింపుదశవరకు వచ్చిన సాహిత్యం. భారతదేశ చరిత్రలో క్రీ.శ.1858 నాటి ఆధునికయుగ ప్రారంభదశకు అనగా భారతదేశంలో వలసవాదులైన బ్రిటిష్ వారు చేసిన పాలనలో భాగంగా ఉన్న విక్టోరియారాణియొక్క పరిపాలన ముందువరకు ఉన్నకాలాన్ని మధ్యయుగం అని చరిత్రకారులు నిర్ణయించారు. దాని ప్రకారం మధ్యయుగాల కాలంలో వచ్చిన తెలుగుసాహిత్యాన్ని ప్రాచీన తెలుగుసాహిత్యంగా సాహిత్య చరిత్రకారులు భావించారు. సమాజంలో స్త్రీపురుషుల మానవజీవన ప్రతిఫలనం సాహిత్యం. ఆధునికంగా భావింపబడే మహిళా చైతన్యం ప్రాచీన తెలుగుసాహిత్యంలో ఉందా అనే సందేహం కలగవచ్చు. దేనికైనా ఒక మౌలికత ఉంటుంది. పితృస్వామ్య సమాజంలో ఆధిక్యత, అణచివేత ఉన్నచోటల్లా చైతన్యం దానంతట అదే పుట్టుకొస్తుంది. అది ప్రాథమిక దశలో మూగగా, వ్యక్తిగతంగా ఉండవచ్చు. చరిత్రలో స్త్రీలుకూడా మనసున్న మనుష్యులే కాబట్టి వారికి శరీరం, మెదడు ఉందన్న స్పృహతో సాహిత్య చరిత్రను తరచిచూసినప్పుడు పితృస్వామ్యసామాజిక కుటుంబం పరిధిగా గల స్త్రీలు తమ సమస్యల పట్ల సంఘర్షించే స్పృహను, సాంస్కృతిక–చైతన్యాన్ని తెచ్చుకొన్నట్లుగా అర్థమౌతుంది. ప్రధానంగా స్త్రీలలైంగికతను అదుపుచేస్తూ స్త్రీస్వేచ్ఛను అణచివేయటానికి పురుషాధిక్య కుటుంబ నిర్మాణం ఏర్పడిందనేది సామాజిక చరిత్రకారులు చెప్పిన విషయం. లైంగికత అనేది స్త్రీగా పుట్టటమేకాక, ఎదిగేక్రమంలో ఆమెయొక్క లైంగికతచుట్టూ అల్లిన భావజాలం. అది స్త్రీపురుషలైంగికసంబంధాలకు, దానికి సంబంధించిన అనుభూతుల, అనుభవాల భావజాలానికి సంబంధించినదిగా ఉంటుంది. కుటుంబం స్త్రీలపునరుత్పత్తిశక్తి చుట్టూ అభివృద్ధిచెందిన లైంగికతా భావజాలానికి సంబంధించిన వ్యవస్థ. లైంగికసంబంధాలు ప్రకృతిసహజమైనవే అయినా సామాజిక ఉత్పత్తిసంబంధాలవల్ల కలిగిన ఆర్థిక సంబంధాల మార్పుల దృష్ట్యా లైంగికసంబంధాలు వ్యవస్థీకృతమవుతూ కాలానుగుణంగా అవి స్వరూప స్వభావాలను సంతరించుకొంటాయి.

రాజకీయాలుకూడా చోటుచేసుకుంటే అవి లైంగికరాజకీయాలుగా కూడా పరిణమిస్తాయి. అనాదిగా కొనసాగుతూ, నాటికీ, నేటికీ చెలామణి అవుతున్న పితృస్వామ్యపు సంస్కృతి నిర్దేశించిన ఈ లైంగికతా భావజాలం స్త్రీలకు సంక్లిష్టతలను కలుగచేస్తూ సంఘర్షణలకు లోనుచేస్తోంది. ఆ సామాజిక కుటుంబసంస్కృతి స్త్రీలమనుగడకు సమస్యగా మారినప్పుడు, పరిస్థితులయొక్క ప్రాబల్యాన్నిబట్టి దానిని అధిగమించే చైతన్యం స్త్రీలలో కలగటం సహజపరిణామం. ఈ చైతన్యం ముందు దశలో సమస్యపట్ల స్పృహను కల్గించి, కదలిక ఏర్పడి, విప్లవాత్మక ఆలోచనలను పెంచి, ఆ సమస్యను అధిగమించే క్రియాశీలకమైన చైతన్యంగా పరిణమించటం జరుగుతుంది. ఈ చైతన్యం అవకాశాలనుబట్టి ఉంటుంది. కుటుంబమే పరిధిగా ఉండి, సామాజికసంబంధాలులేని ఒంటరి మహిళలో వ్యక్తిగతంగా మూగస్థాయిలో ఉంటుంది. అది సంఘటితమైనప్పుడు సామాజిక చైతన్యంగా గుర్తింపును పొందుతుంది. ప్రాచీన, ఆధునిక తెలుగుసాహిత్యచరిత్రలో ప్రతిబింబించిన స్త్రీలయొక్క జీవనచిత్రణలో, వారు తమసమస్యలపట్ల ఏమేరకు చైతన్యవంతులు కాగలిగారనే పరిశీలనలోనే వారిచైతన్యం అర్థమౌతుంది. ప్రాచీనసాహిత్య చరిత్రలో ప్రతిఫలించిన మానవజీవనచిత్రణలో స్త్రీలకు సామాజికసంబంధాలు లేవు. వారు తామున్న కుటుంబపరిధిలోనే ఒంటరిమహిళలుగా తమపాలిటి పీడాకరమైన సంస్కృతిని వ్యతిరేకించి దానిని అధిగమించే చైతన్యం తెచ్చుకోవటాన్ని పరిశీలిస్తే నేటి సామూహిక మహిళాఉద్యమాలకు ఆనాటి కుటుంబాలపరిధిలోనే అడుగులు పడ్డాయని అర్థమౌతుంది.

అనాదిగా సాహిత్య మార్గదర్శకత్వాన్ని వహించిన భారత, రామాయణ ఆంధ్రీకరణ కావ్యాలు ఔత్తరాహిక భారతదేశ సామాజికసంస్కృతిని ప్రతిఫలిస్తాయి. ఏ ప్రాంతంలోని వారయినా స్త్రీలే కదా. సర్వసామాన్యమైన రాజకీయవ్యవహారాలలో భాగంగా ఆయా కావ్యాలలోని ప్రతినాయకులు రాజులయొక్క భార్యలపై లైంగికదాడులకు పూనుకొన్నప్పుడు ద్రౌపది, సీత వంటివారు శత్రువుల ఎదుట తమ భర్తలపరాక్రమాన్ని పేర్కొంటూ వారు నశించక తప్పదని హెచ్చరించే చైతన్యం వారిలో కనపడుతుంది.

రామాయణంలో కైకపాత్ర చైతన్యాన్ని అర్థంచేసుకోవటానికి ముందుగా రాముడు, భరతులయొక్క పుట్టుక కాలాన్ని గమనించాలి. ఎందుకంటే ఆ కాలాన్ని బట్టే చిన్నపెద్ద అనే తేడా ఉంటుంది. రాముని పుట్టుక పునర్వసు నక్షత్రం చివరిపాదమని చెప్పబడింది. అంటే ఆ నక్షత్రకాలంలో చివరి క్షణం అని కూడా భావించవచ్చు. ఆ వెంటనే వచ్చిన పుష్యమి నక్షత్రం మొదటిపాదంలో, భరతుని పుట్టుక అని చెప్పబడింది. గడియారాలులేని ఆ కాలంలో కైకయొక్క పురిటిగదినుండి

మంత్రసాని బయటికి వచ్చి వార్తాహరునుకి చెప్పిన తరువాత, ఆతడు వచ్చి చెప్పటానికి పట్టిన కాలాన్ని మనసులో పెట్టుకోవాలి. అదేవిధంగా జ్యేష్ఠుడికోసం కౌసల్య ప్రసవగృహంనుండి వచ్చే వార్తకోసం ఆ సమీపంలోనే దశరథుడు ఎదురుచూసే అవకాశం ఉంటుంది. అందుకనే పిల్లల జననాన్ని గురించి వార్తాహరులు దశరథుని దగ్గరకువచ్చి తెలియచేయటంలో క్షణమాత్రపు తేడా ఉండే అవకాశం ఉంటుంది. మనుస్మృతి ప్రకారం పెద్ద భార్యయైన కౌసల్యకు పుట్టినవాడే జ్యేష్ఠుడు అవుతాడనే ఆలోచన దశరథుడికి ఉంటుంది. రాముని జ్యేష్ఠుడిగా భావింపజేయటానికిని, సమర్థురాలైన కైక తన కొడుకైన భరతుని యువరాజుని చేయమనే అవకాశం ఉంటుందనే ముందుచూపుతోనే దశరథుడు భరతుని చిన్నప్పుడే, అతడు తన తాతయైన కేకయరాజుదగ్గర పెరిగేటట్లుగా చేయగలిగాడని అర్థం అవుతుంది. ఆ దృష్టికోణంలో ఆలోచించినప్పుడు రాముడు, భరతుల పుట్టుకలలోని ఆ క్షణమాత్రపు ముందువెనకల తేడానే కైకకు తన రాజమాతగౌరవాన్ని తగ్గించటం జరిగిందని గ్రహించిన కైకలో కలిగిన వారసత్వచైతన్యం అర్థమైతే, రణరంగంలో భర్తను కాపాడుకోగలిగిన సమర్థురాలైన కైకది వ్యతిరేకచైతన్యంకాదని, అది గౌరవప్రదమైన అస్తిత్వచైతన్యమని తెలుస్తుంది. అదే సీత విషయంలో ఆమెను అగ్నిలో దూకమన్నప్పుడైన ఆమె తన జీవనహక్కుకు సంబంధించిన చైతన్యం తెచ్చుకోలేకపోవటానికి సమాజంలో బలంగా నాటుకొన్న పితృస్వామ్యసంస్కృతియే కారణం.

భారతంలో ద్రౌపది పాత్రలో ప్రశ్నించే చైతన్యమేగాని తదుపరి క్రియాశీలత కనపడకపోవటానికి కారణం పితృస్వామ్య రాజకీయసంస్కృతియే. ధర్మరాజు తన బలగాన్ని పెంచుకొనే రాజకీయపు ఎత్తుగడలో భాగంగా ద్రౌపది లైంగికతపై హక్కును సంపాదించాలనుకోవటంతో ఆమె పంచభర్తృక కాబడింది. దీనినే స్త్రీలలైంగికతపై రాజకీయాలు చోటుచేసుకోవటంగా భావించాలి. అందుకే ఆ వెంటనే వచ్చిన కథలో ధర్మరాజుకు ద్రౌపదితో జరిగిన వివాహానంతరం దుర్యోధనుడు ధర్మరాజుయొక్క బలాబలాలను అంచనా వేసిన క్రమంలో ఈ విషయం రుజువు అవుతుంది. పితృస్వామ్య రాజకీయాలలో భాగంగా ద్రౌపది తన వివాహసందర్భంలో లైంగికపీడనకు గురిచేయబడే అసమనైతిక సంస్కృతికి తాను బలి కాబడుతున్నా, పితృస్వామ్యకుటుంబంలోని అనైతికసంస్కృతిని మూగచైతన్యంతో ప్రశ్నించలేకపోయింది. భారతంలోని సభాపర్వంలో ద్రౌపది తన భర్తలు నిస్సహాయస్థితిలో ఉన్నప్పుడు మాత్రమే న్యాయాన్ని ప్రశ్నించే చైతన్యం తెచ్చుకోవటం ద్రౌపదిపాత్రలో కనపడుతుంది. భారతంలోని ఉద్యోగపర్వంలో ద్రౌపది తన అవమానం పట్ల ప్రతీకార చైతన్యాన్ని ప్రదర్శించగలిగింది. అయితే అది తన భర్తలు రాజ్యంకోసంప్రయత్నం చేస్తున్న సందర్భం యిచ్చిన అవకాశంలో భాగంగా తెచ్చుకొన్నచైతన్యమే.

భారతంలో స్త్రీలలైంగికతపై ఉన్న పితృస్వామ్య అధికారసంస్కృతిలో భాగంగా మారకవ్యాపారంలో మనుష్యులమధ్య రవాణాచేయబడుతున్న భోగవస్తువుగా, యయాతి కూతురైన మాధవి లైంగికపీడనకు గురియైనా ఎదిరించలేని మూగచైతన్యం ఆమెది.

ఈ భారతకథలోనే, సమాజానికి తెలియదనే భావంతో తనను గాంధర్వవివాహం చేసుకొని వెళ్ళిపోయినటువంటి దుష్యంతుని కలవటానికి వెళ్ళిన శకుంతల, సభలోఉన్న అతడు తనను గుర్తించనట్లుగా నటిస్తున్నప్పుడు, భర్తతో కుటుంబధర్మాలను అర్థంచేసుకోమని చెప్పే సందర్భంలో సత్యంయొక్క గొప్పతనాన్ని బోధించగల గురుచైతన్యాన్ని శకుంతల ప్రదర్శించింది. కాని ఆ సమయంలో గగనవాణి మూగపోయి ఉంటే శకుంతల చైతన్యం ఎటువంటిదో అర్థమయ్యేది. సావిత్రి తన తార్కికమేధతో భర్తప్రాణాలకోసం అందరు ఎదుర్కొనలేని శత్రువుగా భావింపబడే యముడినే ఎదిరించి కృతకృత్యురాలైన వీరచైతన్యవంతురాలిగా కనపడుతుంది. సావిత్రి తనభర్త విగతజీవుడైనప్పుడుమాత్రం తెగింపును, క్రియాశీలచైతన్యాన్ని తెచ్చుకోగలిగింది. ఆనాడు స్త్రీలు తమకోసంకాక, తమ ఉనికికి అవసరమైన భర్తలకోసం చైతన్యం తెచ్చుకోవటం కనపడుతుంది.

ఈ భారతంలోనే ప్రద్వేషిణి తనయొక్క భర్త పుట్టుగుడ్డియైన దీర్ఘతముడు కుటుంబపోషణకు సంబంధించిన బాధ్యతలేకుండా ఉంటున్నప్పుడు ఆతనిని, ఆతనివల్లకలిగిన సంతానాన్నిపోషించలేక విసుగుచెంది భర్తను నీళ్ళల్లో తోయించింది. అది వ్యతిరేకచైతన్యం అనిపిస్తుంది. కాని లోతుగా ఆలోచిస్తే దీర్ఘతముడు భార్యమీదఉన్న కోపంతో స్త్రీలందరూ పతివిరహితులైనప్పుడు మాంగల్యానికి దూరమై వితంతువులుగా జీవించాలని శాపాలిచ్చినప్పుడు మాత్రం ఆతనికి స్త్రీజాతి మీద ఉన్న ద్వేషభావం అర్థమయి, ఆతడికి మునుపటినుండి స్త్రీలందరిమీద ఉన్న ద్వేషంచేతనే అట్లావెళ్ళగ్రక్కాడని అర్థమౌతుంది. కేవలం తన భార్యయైన ప్రద్వేషిణిమీద మాత్రమే కోపం ఉంటే ఆమెనే శపించేవాడు. ఇక్కడ ప్రద్వేషిణికి వికలాంగుడైన భర్తమీద కోపంకన్నా, ఆతనికి స్త్రీలపై ఉన్న ద్వేషాన్ని భరించలేకనే ఆమె ఆతనిని నీళ్ళల్లో పడవేయించే స్థితికి చేరుకున్నట్లు ఆమె చైతన్యం అర్థమౌతుంది. అంతేకాక పనివిభజనతో ఏర్పడిన పితృస్వామ్యకుటుంబ నిర్మాణానికి వ్యతిరేకపు పనివిభజన ఉండటంతో, సంతానోత్పత్తితోపాటు అదనంగా కష్టపడటంతో ఆమెది కుటుంబ పనివిభజనకు వ్యతిరేకమైన చైతన్యంగా కనపడుతుంది.

కురుక్షేత్రయుద్ధానంతరం భారతంలోని స్త్రీపర్వంలో కొడుకులయొక్క శవాలను చూసినప్పుడు గాంధారి నాటి సభలో ద్రౌపదిని తన కొడుకులు అవమానించిన విషయాన్ని గుర్తుచేసుకుంటూనే, ఆనాడు యుద్ధానికి వెడుతూ తన ఆశీర్వాదానికివచ్చిన దుర్యోధనునితో తాను పరోక్షార్థంలోనైనా

ఆతడికి 'చావుమేలు' (2-33) అని తాను అన్నమాటలను తలచుకోవటంలోనే ఆమెలోని న్యాయచైతన్యం స్పష్టమౌతుంది. అక్కడ పడిఉన్న కొడుకుల శవాలను, వీరుల శవాలనుచూస్తూ వారి మరణాలకు కారణంగా వారు స్త్రీలపట్ల చేసిన అఘాయిత్యాలను తలచుకొన్నదంటే, సాటి స్త్రీలపట్ల గాంధారికున్న సానుకూల సహానుభూతి చైతన్యం అర్థమౌతుంది. కానీ ఆ చైతన్యం క్రియాశీలతను అందుకోలేకపోయింది. భారతంలోని స్త్రీపాత్రలలో చైతన్యం ఉన్నా ఆ చైతన్యం పితృస్వామ్య కుటుంబసంస్కృతి పరిధిలోనే ఉంది. అయితే ఈ వ్యక్తిగత స్త్రీలచైతన్యాలను పితృస్వామ్యం విలువనివ్వకపోగా పట్టించుకోవటంకూడా జరగలేదు.

స్త్రీలు తమసమస్యలను గుర్తించటం, వాటిపట్ల సంఘర్షించటం, ప్రశ్నించుకుంటూ క్రియాశీలత్వాన్ని పొందే క్రమంలో వారిలో కలిగేదే ఈ చైతన్యం. అందుకే చైతన్యం అనేది ప్రథమంగా సమస్యలపట్ల స్పృహకలిగియుండి వ్యక్తిగత నిశ్శబ్ద చైతన్యంగా ప్రారంభమై వాటితో సంఘర్షించటం, తెలివిని పెంచుకొని ప్రశ్నించటం, వాటిపరిష్కారానికై దారులువెదకటంగా పరిణామం చెందుతుంది. అది సామాజిక సంబంధాలలో విస్తృతమై సామూహికత్వాన్ని సంతరించుకొని క్రియాశీలదృక్పథాన్ని పొంది సామూహికస్త్రీల చైతన్యంగా రూపాంతరం చెందటం దానియొక్క పరిపక్వదశ. సామాజిక చలనసూత్రాలకు అనుగుణంగా స్త్రీలచైతన్యంకూడా పరిణామం చెందుతూ అది ఒక స్థిరత్వాన్నిపొంది బలంగా సాంఘికస్వభావాన్ని సంతరించుకుంటూ సత్ఫలితాలను యివ్వగలుగుతుంది. అయితే స్త్రీలయొక్క సమస్యలు అన్నీ స్త్రీపురుషసంబంధాలలో ఉత్పన్నమైనవే. ఇవన్నీ సామాజిక కుటుంబసంబంధాలలో సంక్లిష్టమైన స్త్రీపురుష లైంగికసంబంధాల కారణంగా ఏర్పడినవని అర్థమౌతుంది. కవయిత్రులైనా, కవులైనా సామాజిక జీవన మానవసంబంధాలను, కుటుంబ సంబంధాలను కావ్యంలో వర్ణించేటప్పుడు మానవ సమాజంయొక్క సాంస్కృతిక ప్రతిఫలనం తప్పనిసరి అవుతుంది కాబట్టి స్త్రీలచిత్రణ చేయకతప్పదు. కవయిత్రులు స్వీయానుభవంతో రాయగలరు కాని పురుషకవులు స్త్రీపాత్రలను చిత్రించే క్రమంలో అప్రయత్నంగానే తమ కాలంనాటి సామాజికస్త్రీల జీవనసంస్కృతిని చిత్రించటం జరుగుతుంది. కాబట్టి కేవలం స్త్రీలు రాసిన కావ్యాలలోనేకాక, పురుషులు రాసిన కావ్యాలలో ప్రతిఫలించిన నాటి స్త్రీలచైతన్యాన్ని గ్రహించినప్పుడే కాలానుగుణ పరిణామశీలతగల స్త్రీలచైతన్యాన్ని అర్థంచేసుకోవటానికి ఎక్కువ అవకాశం ఉంటుంది.

చారిత్రకంగా మానవసంబంధాలు విస్తృతత్వాన్ని పొందినప్పుడు వాటి ప్రభావం స్త్రీపురుష సంబంధాలపై ఉంటుంది. మారకవ్యాపారం అభివృద్ధిచెందే క్రమంలో సుదూరప్రాంతాలకు వ్యాపారం విస్తరించే క్రమంలో స్త్రీపురుషసంబంధాలు మార్పుకులోనవటం, వాటి ప్రభావం సాగుచేసుకొనే

రైతులపై కూడా పడి అవి స్త్రీలకు సమస్యలుగా పరిణమించిన విషయం, వాటియెడల నాటి స్త్రీలు తమ భర్తలను ప్రశ్నించే చైతన్యం తెచ్చుకోవటాన్ని 1 వ శతాబ్దానికి చెందిన శాతవాహనరాజైన హాలుడు సంకలనం చేసిన 'గాథాసప్తశతి' అనే ప్రాకృతకావ్యంలో కనపడుతుంది. ప్రజల వ్యవహారంలో ఉన్న గాథల యొక్క కూర్పు ఆ గ్రంథం. ఆధునిక కాలంలో దానికి ఆంధ్రీకరణాలు వచ్చాయి. శాతవాహనుల పరిపాలనా కాలం నాటి ఆంధ్రసామ్రాజ్యంలోని స్త్రీలు క్రీస్తు శకారంభం నాటికే భర్తల అన్యస్త్రీసంబంధాలవల్ల బాధాతప్తసతులుగా పితృస్వామ్యపు అసమనైతికసంస్కృతిని ప్రశ్నించే చైతన్యాన్ని తెచ్చుకొన్న విషయం అర్థమౌతుంది. నాటి స్త్రీలు తమ వ్యక్తిత్వాలకు విలువనిచ్చుకునే దిశగా సాగి అభిమానవంతులుగా నిలిచి భర్తలతో మాట్లాడకుండా తమ నిశ్శబ్దచైతన్యాన్ని ప్రదర్శించారు. అంతేకాదు, అన్యసంబంధాలను పెట్టుకొన్న భర్తను నిగ్గదీసి ప్రశ్నించటం (1-90), భర్త క్షమించమంటూ తన కాళ్ళపైపడ్డప్పుడు, ఆ స్త్రీ తన కాలిగోళ్ళతో ఆతని జుట్టును పెనవేసి ఈడ్చివేయాలనుకొన్నట్లుగా భావించటంలో (2-8) ఆ భార్యల యొక్క నిరసనచైతన్యం కనపడుతుంది. ప్రతిసారి అతడు భార్యకాళ్ళమీదపడి క్షమించమని అడిగినా తిరిగి దేశాటనకు బయలుదేరుతాడని తాను క్షమించనని అంటుంది. అంతరంగానికి అనుకూలుడిగా లేని భర్త "అంతరంగమునకు అనుకూలబడడేమినాప్తుడేననాప్తుడగుట నిజము !" (4-5) అతడు ఆప్తుడుకాదని అంటుంది. భర్తకు మంచి మనసులేనప్పుడు తన మనసు కాలి మసైపోయినాసరే ఆతనికి ఇన్ని నీళ్ళు వదిలివేయటం సమంజసమని ఆమె అనుకోవటం (5-1) కుటుంబనిర్మాణం పట్ల వారిలో కలిగిన భావచైతన్యానికి మచ్చుతునక.

రేవా అనే కవయిత్రి చెప్పిన గాథలలో "చేసినవియో లేక చేయుచున్నవో, చేయునున్నవియో చెప్పు నిజము వేని సైచుమనిదు? నీ నేరముల సిగ్గు బొగ్గులైనవాడా ! పోకలాడా ! (1-90) ని భర్తయొక్క తప్పులను నిగ్గదీసినది. ఈమెయే రాసిన మరొక గాథలో కోపంతో అలిగి, కొట్టవచ్చిన భార్యలను పురుషులు సంబాళించటాన్ని (1-87) వ్యక్తం చేసింది.

క్రీ.శ. 1వ శతాబ్దంనాటికే స్త్రీలు భర్తల అన్యస్త్రీలసంబంధాలను ప్రశ్నించే చైతన్యం తెచ్చుకొన్నారు. దానికి నిదర్శనంగా నాటి స్త్రీ మాటల్లో జన్మాంతరబుద్ధి కాబట్టి వంకీలుగా ఉన్నజుట్టును సాఫీచేయలేనివిధంగా ఆతని బుద్ధికూడా వేసంకాలం రాగానే "మరలనూరేగన్ దలబెట్టుకుంటివటరా కటిక గుండెవాడా?" (3-73) అని ప్రశ్నించే చైతన్యం తెచ్చుకోవటం కనపడుతుంది.

భర్తలు అదే ఊళ్ళో అన్యస్త్రీలసంబంధాలలో ఉంటూ యింటికి రానప్పుడు కొంతమంది స్త్రీలు తాము విడిగా ఒంటరిగా ఉండాలనుకొంటూ కుటుంబభారాన్ని మోయాలని (7-6)

నిశ్చయించుకొన్నారంటేనే, వారియొక్క ఆత్మవిశ్వాసం పురికొల్పిన సాంస్కృతిక విప్లవచైతన్యానికి మచ్చుతునకగా ఈ గాథలు కనపడుతాయి. 'గాథాసప్తశతి' అనే ఈ ప్రాకృతకావ్యాంధ్రీకరణంలో క్రీ.శ. ఒకటవ శతాబ్దంనాటికే ఆంధ్రప్రాంతపు స్త్రీలలో కుటుంబసంస్కృతిపట్ల విప్లవాత్మక చైతన్యం వెల్లివిరిసినట్లు అర్థమౌతుంది. చారిత్రక కాలప్రవాహంలో స్త్రీలచైతన్యం ఎన్నోమైలురాళ్ళను దాటుకుంటూ, సామాజికవ్యవస్థలకు అనుగుణంగా మార్పులకు గురి అవుతూ క్రియాశీలకంగా పరిణమించి పితృస్వామ్యాన్ని ప్రతిఘటించే స్థితికి చేరుకొని ఆధునిక యుగారంభానికి స్పష్టమైన రూపాన్ని సంతరించుకొంది.

తెలుగులో ముందుగా ఆంధ్రీకరణకావ్యాలు వచ్చినా, తరవాతి కవులు తమ కావ్యాలలో తాము జీవిస్తున్న వ్యవస్థయొక్క ప్రయోజనాన్ని దృష్టిలోపెట్టుకొని పురాణప్రసిద్ధమైన కథాంశాలను మాత్రమే తీసుకొని రాయటంచేత ఆయా కవులయొక్క కాలంనాటి సామాజిక జీవన చిత్రణలో భాగంగా నాటి సంస్కృతి చోటుచేసుకుంటుంది.

మధ్యయుగాల ఆంధ్రదేశచరిత్రలో స్త్రీయైన రాణిరుద్రమదేవి రాజ్యాధికారంచేపట్టటం అనేది రాచరికపువ్యవస్థలోనేకాక ప్రపంచస్థాయిలోనే ప్రథమంగా గుర్తింపతగ్గ పరిణామంగా భావించాలి. ఎందుకంటే ప్రపంచచరిత్రలో క్లియోపాత్ర సహపరిపాలకురాలిగా కనపడుతుందిగాని ఆమె యుద్ధంచేసినట్లులేదు. భారతదేశచరిత్రలోకూడా 13 వ శతాబ్దానికి చెందిన షంషుద్దీన్ ఇల్ టిట్మిష్ కూతురైన రజియాసుల్తానా అన్నదమ్ములను, అమీరులను ధిక్కరించి రాజ్యవారసత్వాన్ని పొందినట్టున్నా, ఆమె దేశబహిష్కరణకు గురికాబడింది. అయినా ఓఢ్రరాజుసహాయంతో యుద్ధానికి బయలుదేరి వస్తున్నసమయంలో దారిలోనే ఆమె హతురాలవుతుంది. ఆమె రుద్రమదేవి కంటే కాస్త ముందుకాలానికి చెందినది. కాని ప్రపంచచరిత్రలోనే ఒక స్త్రీగా 13వ శతాబ్దానికి చెందిన కాకతిరుద్రమదేవి యుద్ధాలుచేసి విజయాలు సాధించిన ప్రథమాంధ్రసామ్రాజ్ఞిగా గుర్తింపబడుతుంది. ఈమె ఆంధ్రరాజ్యానికి రాణి. పితృస్వామ్యానికి భిన్నమైనరీతిలో స్త్రీయొక్క రాజకీయ అధికారానికి నిదర్శనమైన రాణిరుద్రమదేవి పరిపాలన సామాజికసంస్కృతిపై తీవ్రప్రభావం చూపిస్తుంది. కాబట్టి నాటి సామాజికసంస్కృతిలో స్త్రీలచైతన్యాన్ని అర్థంచేసుకోవటానికై సమాజాన్ని ప్రతిఫలించే సాహిత్యాన్ని అర్థంచేసుకోవాలి. ఆ క్రమంలో తెలుగుసాహిత్యాన్ని రుద్రమదేవి పరిపాలనకుముందు, ఆమె పరిపాలన తదనంతరం వచ్చిన ప్రాచీన తెలుగుసాహిత్యపు పరిశీలనలోనే స్త్రీలచైతన్యంలో వచ్చిన పరిణామశీలత అర్థమౌతుంది. ఔత్తరాహికచరిత్ర ప్రతిఫలించిన ఆంధ్రీకరణసాహిత్యంలోకంటె పురాణాలలో, ఇతిహాసాలలోని మూలకథను గ్రహించిన తెలుగుకవులు తమ కావ్యాలలో స్వతంత్ర

కల్పనను జోడించేటప్పుడు తాము చూస్తున్న సమాజాన్ని చిత్రించటం జరుగుతుంది. అందుకే కాకతీయులకాలంనుండి వచ్చినకావ్యాలలో సంస్కృతంలోని మూలకథను గ్రహించినా తెలుగుకవుల కల్పనలో దాక్షిణాత్యజీవనసంస్కృతి ప్రతిఫలించటం జరిగింది. అయితే చారిత్రకవ్యక్తియైన రాణి రుద్రమకు కాస్త ముందుకాలానికిచెందిన వ్యక్తిగా మౌఖికసాహిత్యమైన జానపద వీరగాథల్లో చెప్పబడిన నాయకురాలు నాగమ్మ కనపడుతుంది. ఆమెకు చరిత్రపుస్తకాలలో చోటులేకపోయినా, 'కోడిపోరు'గా ప్రజలవ్యవహారంలో చెప్పుకోబడిన చారిత్రక జానపదగాథలలోను, ఆ తరువాతి కాలంలో వచ్చిన శ్రీనాథకవి రాసిన 'బాలచంద్రయుద్ధమ'నే లిఖితకావ్యంలోను నాగమ్మగురించిన ప్రస్తావన ఉంది.

'పల్నాటి వీరచరిత్రం'గా ప్రచురితమై ప్రసిద్ధిపొందిన ద్విపదకావ్యంలో 'కోడిపోరు' కావ్యంలో ముందు భాగంలో ఉంది. ఈ కావ్యంలోనే నాగమ్మ యొక్క రాజకీయచైతన్యం ప్రస్ఫుటమౌతుంది. మహిళ అవటంచేత మంత్రిణిగా ఆమెను చెప్పకపోయినా, నాగమ్మ కావ్యంలో నలగామరాజుయొక్క సింహాసనం ప్రక్కన ఆసీనురాలిగా ఉందని (3- 155 పంక్తులు), శత్రువైన బ్రహ్మనాయుడి విషయమై రాజుకు రాజకీయవిషయాలలో సలహాలను యిచ్చినట్లును, యుద్ధవ్యూహాలు పన్నినట్లును చెప్పబడింది. అంటే కులవ్యవస్థగల సమాజంలో శూద్రకాంతయైనప్పటికి ఒక మహిళగా రాజుకు సలహాలను యివ్వగలిగిన స్థాయిలో నాగమ్మ ఉన్నదంటే ఆమెయొక్క రాజకీయచైతన్యం ఏపాటిదో అర్థమౌతుంది. అందుకే నాటి జనశ్రుతిలో అశ్వవిద్యానైపుణ్యంగల ఆమె 'నాయురాల్, నాయకురాల్' గా (పంక్తులు- 682,965) చెప్పబడింది. అయితే ఆమె రాజకీయచైతన్యాన్ని ఓర్వలేని పితృస్వామ్యం ఆమెకు 'కుటిలురాల' నే ముద్రను (పంక్తులు 1900-1910) ఆపాదించింది. క్రీ.శ. 1160-80 ల మధ్యన ఈ పల్నాడులో జరిగిన ఆంధ్రదేశంలో జరిగిన ప్రథమయుద్ధం అని చెప్పుకుంటారుగాని, దీనికి చారిత్రక ఆధారాలు కనపడవు. ఈ కాలంలోనే సమాజంలో స్త్రీపురుషసంబంధాలు మార్పుకు లోనవుతున్న క్రమం అర్థమౌతుంది. ఈ మార్పులే తదుపరి రాజకీయచరిత్రలో రుద్రమదేవి అనే స్త్రీ రాణి కావటానికి తగిన రాచబాటకు అవకాశం ఏర్పడినట్లుగా భావించవచ్చు.

కాకతీయరాజైన గణపతిదేవ చక్రవర్తికి కొడుకులు లేనందువల్ల కూతురికే పరాక్రమవిద్యలను నేర్పించి రాణిని చేయాలనుకొన్నాడు. ఆమె 1262 నుండి 1295 సం.వరకు పరిపాలించిన విషయానికి చరిత్రయే నిదర్శనం. రాణిరుద్రమ పరిపాలన, ఆమె పన్నిన యుద్ధవ్యూహాలు, వాటి విజయాలు స్త్రీశక్తి ఆవిష్కరణకు నిరుపమాన ఉదాహరణలు. దాని ప్రభావం సమాజంమీద తప్పనిసరిగా ఉంటుంది. చరిత్రను గమనిస్తే పరిణామశీలత గలిగిన రాజకీయ - ఆర్థికవ్యవస్థల ప్రభావంవల్ల ఆయా కాలాలనాటి సామాజిక - సాంస్కృతిక వ్యవస్థ మార్పుకు గురికావటం సహజం. అదేమేరకు రాణిరుద్రమయొక్క స్త్రీశక్తి ప్రభావం ఆనాటి స్త్రీలలో కాస్తోకూస్తో చైతన్యాన్ని కలిగించకమానదు. అందుకే రుద్రమ పరిపాలనానంతరమే కవయిత్రులలో సృజనాత్మక చైతన్యం

పుట్టుకురావటం జరిగింది. ఆనాటి ఖడ్గతిక్కనయొక్క తల్లి ప్రోలమ, భార్య చానమ్మలలో స్త్రీల కవితాచైతన్యం పెల్లుబుకి రావటం జరిగింది. కుటుంబంలోని స్త్రీలమీద తన పరాక్రమం చూపించే ఖడ్గతిక్కన యుద్ధరంగంనుండి వెనుతిరిగి వచ్చినందుకు, పరాక్రమరూపంలోనే నెపంపెట్టి ఆతని పురుషాధిక్యతను అధిక్షేపంగా చెప్పాలనుకొనే క్రమంలోనే "పగరకు వెన్నిచ్చివచ్చె, నగరే నగరపు నాయకులెల్లన్, ముగురాడవారమైతిమి, వగపేటికి స్నానమాడ వచ్చినవేళన్" అంటూ వెలువడిన ఆ స్త్రీల కవితాచైతన్యంతో తెలుగుస్త్రీల కవిత్వారంభం జరిగింది.

13వ శతాబ్దంలోని రుద్రమదేవి పాలనాకాలంనాటి సామాజికసాంస్కృతిక పరిణామం కవులకావ్యాలలో ప్రతిఫలించటం సహజం కాబట్టి కవుల, కవయిత్రుల కావ్యాలలోని స్త్రీలు చైతన్యాన్ని సంతరించుకోవటం కనపడుతుంది. ఈదృష్టితో గమనించినప్పుడు ప్రాచీనతెలుగు సాహిత్యంలోని స్త్రీలచైతన్యం స్పష్టమౌతుంది. రాణిరుద్రమదేవి సమకాలీన లేదా అనంతర శీఘ్రకాలకవులుగాని స్త్రీపరాక్రమశక్తిని ప్రత్యక్షంగా ప్రశంసించకుండా ఉండలేకపోయినప్పటికీ, ఆ శక్తిచైతన్యాన్ని తమకావ్యాలలోని స్త్రీపాత్రలలో నిక్షిప్తం చేయాలనుకోవటంచేతనే రుద్రమదేవి తదనంతరం వచ్చిన తెలుగుకావ్యాలలో స్త్రీలచైతన్యం వెలుగులను సంతరించుకుంది. అందువల్లనే రుద్రమ పరిపాలనలో ఆమె ఎక్కడెక్కడ శత్రువులను స్వాధీనపరచుకోవటానికి యుద్ధాలుపన్ని, విజయాలు సాధించిందో ఆయాప్రాంతపు తెలుగు కవులు రుద్రమ యుద్ధపరాక్రమశక్తిని నిక్షిప్తంచేస్తూ మొట్టమొదటగా తమ కావ్యాలలో సత్యభామచేత యుద్ధంచేయించారు. 13 వ శతాబ్దానికి పూర్వమున్న సంస్కృతాంధ్ర కావ్యాలలోగాని, పురాణాలలోగాని ఎక్కడా సత్యభామ యుద్ధంచేసిన దాఖలాలు లేవు. కాని రుద్రమ తరువాతి తెలుగు కవులు మాత్రమే సత్యభామ నరకాసురునితో యుద్ధంచేసినట్టుగా వర్ణించగలిగారు. సంస్కృత భాగవతంలో సత్యభామ కేవలం కృష్ణునితో కలిసి రణభూమికి వెళ్ళినట్టుగా మూడుపదాల వచనం కనపడుతుంది. కాని తెలుగుకవులలో అద్దంకి ప్రాంతానికి చెందిన 13వ శతాబ్దపు కవి ఎఱ్ఱన తన 'హరివంశకావ్యం'లో కృష్ణుడు మురాసురుని గాని, నరకాసురుని గాని ఎదురొడ్డి నిలవలేనప్పుడు సత్యభామ

'వీరంబాడుదనంబునొందెననగా విక్రాంతిశాతిత్వ
లక్ష్మీరేఖంబచరించెనాగ ధృతిం యాయక్షీణకృతజెందె నా
ధీరోదాత్త పతిప్రియచరణభక్తిప్రౌఢ యాతన్విదా
ప్రారంభించె మహారణక్రియకునాప్రత్యర్థిలోనెక్కునన్' (ఉత్తరభాగం,4-162)

అని సత్యభామ యుద్ధక్రీడను వర్ణించిన సందర్భం ఒక స్త్రీయొక్క ధీర వీర చైతన్యానికి ప్రతీకగా నిలుస్తుంది.

14 వశతాబ్దానికి చెందిన పోతన తన భాగవతంలోను సత్యభామ మహాపరాక్రమంతో

'ఆ విల్లంది బలంబునొంది తదగణ్యానంత తేజోవిశే

షావిర్భూత మహాప్రతాపమున 'వీరాలోకదుర్లోకయై'

తావేగన్ సుగుణంబుఁజేసె ధనువుందన్వంగి దైత్యాంగనా

గ్రీవాసంఘము నిర్గుణంబుగ రణక్రీడా మహోత్కంఠతోన్' (దశమస్కంధం,ఉత్తరభాగం-.175), అనీ

'వీరశృంగారభయరౌద్ర విస్మయములు

గలిసి భామిని' యయ్యనో కాకయనఁగ

నిషువుఁ దొడగుటదివుచుటయేయుటెల్ల

నెఱుఁగరాకుండననిసేసెనిందువదన' (దశమస్కంధం, ఉత్తరభాగం-ప. 177) అని సత్యభామ యుద్ధం చేసినట్లుగా ఆమె శక్తియుక్తులను వర్ణించాడు.

15 వశతాబ్దానికి చెందిన నాచనసోమన రాసిన 'ఉత్తరహరివంశమ' నే కావ్యంలో

'ఊఁచినకట్టు వంపని పయోరుహలోచన మింటమంటలన్

బూఁచిన బాణజాలమునఁ బూర్వసుపర్వపురాణగర్వమున్

వేఁచినచందమున్ విపుల' వీరరసంబున నాత్మచిత్తముం'

దోఁచిన చందముం దెలియఁదోఁచిన నచ్చరలిచ్చమెచ్చరే' (1-163)

అంటూ కృష్ణునికంటె గొప్పగా సత్యభామచేత యుద్ధంచేయించగలిగారంటే అదంతా రుద్రమదేవియొక్క పరాక్రమశక్తిమీదున్న అభిమానమే. ఈ కావ్యాలలో స్త్రీపరాక్రమశక్తిచైతన్యం వెల్లివిరిసింది. అయితే వారు పితృస్వామ్యానికి ప్రాతినిధ్యం వహించిన కవులుగా ఆయా అంతిమ విజయాన్నిమాత్రం కృష్ణునికే దక్కేటట్టుగా చేయటం పితృస్వామ్యకవుల కథాగమన వక్రతలో స్పష్టమయ్యే విషయం.

ఓరుగల్లును ఆక్రమించాలనుకొన్న రాష్ట్రకూటులను రుద్రమదేవి దేవగిరివరకు వారిని తరిమికొట్టిన విషయం చారిత్రక సత్యం. ఇది ప్రస్తుతం మహారాష్ట్రలో ఉంది. ఆయాయుద్ధాల సమయంలో రాజులతోపాటు కవులుకూడా వెళ్ళి సాయంత్రపు విరామ కాలలంలో కవిత్వంచెప్పి వారిని ఉత్సాహపరచటం ఆనవాయితిగా ఉండేది. రాష్ట్రకూటులకు, రుద్రమదేవికి జరిగినయుద్ధంలో రుద్రమ పరాక్రమశక్తికి అబ్బురపడటంచేతనే రుద్రమకు సమకాలీనుడిగా భావింపబడిన, 13వ శతాబ్దానికి చెందిన జైమిని అనబడే మహరాష్ట్రకవి తన 'అశ్వమేధపర్వమ'నే సంస్కృతకావ్యంలో రుద్రమదేవియొక్క పరాక్రమశక్తిని నిక్షిప్తంచేస్తూ ప్రమీలపాత్రను సృష్టించినట్లు అర్థమౌతుంది. దీనినే 16 వ శతాబ్దానికి చెందిన పిల్లలమర్రి పినవీరభద్రుడు 'జైమినిభారతమ'నే కావ్యంగా

యథాతథానువాదంగా తెలుగులో రచించాడు. ఈ 'అశ్వమేధపర్వాని'కి ఆంధ్రీకరణమైన జైమినిభారతంలో స్త్రీపాత్రలన్నీ అంతకుమునుపు ఏ పురాణాలలోగాని, సంస్కృతకావ్యాలలోగాని లేని నూతనమైన పాత్రలు. రుద్రమశక్తిప్రభావాన్ని సంతరించుకొన్న చైతన్యవంతమైన స్త్రీపాత్రలు. దీనికి కారణం రుద్రమదేవి పరాక్రమశక్తి చైతన్యప్రభావం. అందుకే సమకాలీన లేదా రుద్రమదేవి తరువాత వచ్చిన కావ్యాలలో భౌతికవాస్తవికచైతన్య ప్రదీప్తులైన స్త్రీపాత్రలు కనపడుతాయి. దాక్షిణాత్యప్రాంత మరాఠి కవియైన జైమిని నూతనంగా కల్పింపబడిన ఆ స్త్రీపాత్రలలో దక్షిణదేశరాజ్య సంస్కృతి నూతనచైతన్యాన్ని సంతరించుకొంది. మధ్యయుగాల చరిత్రలో పితృస్వామ్యం నిర్దేశించిన సతీసహగమనసంస్కృతి స్త్రీలపాలిటి అశనిపాతమై స్త్రీలకు జీవనాన్ని కొనసాగనీయని సంస్కృతి. ఇది స్త్రీపురుషలైంగిక సంబంధాలవిషయమై వివాహితస్త్రీలకు జీవనసమస్యను కలిగించిన విషసంస్కృతి. దానికితోడు తురుష్కుల పరిపాలనలో భర్తల మరణానంతరం భార్యలకు లైంగికభద్రత ఉండదనే భావనతో సతీసహగమనంయొక్క ఆచరణ పరాకాష్ఠదశను పొందింది. దీనికి ప్రత్యామ్నాయంగా స్త్రీలు ఆత్మరక్షణచేసుకొనే ధైర్యస్థైర్యాలనుపెంచుకొనే విధంగా వారంతటవారు ప్రబలలుగా తయారుఅయ్యే అవకాశాలను కల్పించి ఉంటే బాగుండనని నాటి పితృస్వామ్యం భావించ లేకపోయింది. అయితే స్త్రీలు తమ కుటుంబ పరిధిలోనే ఆ సహగమనసమస్యను అధిగమించే చైతన్యం తెచ్చుకొన్న క్రమం కనపడుతుంది. కావ్యంలో స్వాహాదేవి అనే రాజకుమార్తె ఆమె తన వివాహవిషయంలో తండ్రి పేర్కొన్న రాజకుమారులను, ఆఖరికి ఇంద్రుడిని కూడా వద్దని చెబుతూ 'పతిపరోక్షంబునందుదద్భార్య తన శరీరమాహుతిగా విసర్జించెనేని వారి దురితంబులడంచి కైవల్యమొసంగు వహ్నిబోలంగనొండుదైవంబుగలదె' అంటూ ఆ అగ్నినే పెళ్ళిచేసుకుంటే సమాజంలో సహగమనపు చితిమంటలయొక్క అవసరం ఉండదని భావించటం జరిగింది. అలాగే సుమాలిని అనే మరొక రాజకుమార్తె యముడిని పెళ్ళిచేసుకుంటానంటూ దానికి కారణంగా

"జనులకునెల్ల చావు సహజంబు నరున్ వరియించి వానితో
ననుగమనంబొనర్చి తుదినంతకు చేబడి పుణ్యపాపసం
జనిత ఫలంబులంది బహుజన్మములంబడుకంటె కాలుని
బెన్మిటిగా నరింతునది మిక్కిలి ధర్మమునాకు నావుడన్"

అంటూ యముడినే పెళ్ళిచేసుకుంటే సమాజంలో సహగమనం ద్వారా అంతిమంగా యముడ్ని చేరుకోవాల్సిన అవసరం ఉండదుకదా అని సహగమన చెయ్యాల్సిన అవసరం ఉండదంటూ, పితృస్వామ్యం నిర్దేశించిన సతీసహగమన సంస్కృతిని అధిగమించే నిరసన చైతన్యం తెచ్చుకోవటం

స్పష్టమౌతుంది. దీనినే కుటుంబపరిధిలోనే ఉన్న వివాహితస్త్రీలు భర్తమరణానంతరం స్త్రీలకు నిర్దేశించిన పితృస్వామ్యసామాజిక సంస్కృతిని అధిగమించే వ్యక్తిగతచైతన్యం తెచ్చుకోవటంగా భావించవచ్చు. అంతేకాక ప్రభావతి అనే స్త్రీ తన భర్త యుద్ధానికి వెడుతూ వీరతిలకం దిద్దించుకోవటానికి ఆమెను సమీపించినప్పుడు

"అనవుడు నేటితోడ పదియాఱుదినంబులు నిండె ముందటన్
దినములు లేవు పైతృకతిథిన్ ఋతుదానముసేయఁన్ జెల్లు యా
మిని కడజామునఁ విను సమీకము చేసెదనంచునిట్లు పో
వనుటుచితంబౌనె నీవెఱుంగవా నిగమార్థ రహస్యధర్మముల్" అంటూ

ఆమె తన సంగమకోర్కెను వెల్లడిస్తుంది. దానికి ఆ భర్త పగటిపూట ఇటువంటి కోర్కె విరుద్ధమనగా ఆమె దాంపత్యలైంగిక ధర్మాన్ని చెప్పగా ఆతడట్లే ప్రవర్తిస్తాడు. అంటే యిక్కడ ఆమె ఆ విధంగా కోరుకోవటం ఆశ్చర్యమనిపించినా ఆమె ఉద్దేశ్యంలో తాను గర్భవతి కాగలిగితే సహగమన సంస్కృతినుండి మినహాయింపును పొంది కొన్నాళ్ళపాటు జీవనహక్కును కొనసాగించవచ్చనే ఊహతోనే ఆమె అటువంటి కోరికను వ్యక్తపరచి తన అస్తిత్వపు చైతన్యాన్ని ప్రదర్శించిందని అర్థమౌతుంది.

ప్రతికుటుంబంలో పురుషాధిక్యత ఉంటేనే పితృస్వామ్యం రాజ్యమేలగలుగుతుంది. ఆ క్రమంలో సమాజాలలోని స్త్రీపురుష లైంగికసంబంధాలను ప్రధానసాధనంగా చేసుకొంది. స్త్రీలకు ఇష్టమైన వ్యక్తితో మునుపటివలె జతకూడి ఉండే స్వేచ్ఛలేకుండా చేయటానికై స్త్రీలకు నిర్దేశించిన పాతివ్రత్యం పితృస్వామ్యకుటుంబసంస్కృతికి ముఖ్యమైన విషయమైంది. అందుకనే స్త్రీలసమస్యలన్నీ సంక్లిష్టమైన స్త్రీపురుషలైంగికసంబంధాలలో చిక్కుకొని స్త్రీల అణచివేతకు కారణభూతమవటంతో స్త్రీలు సంఘర్షణలకు లోనవటం సాహిత్యమంతా కనపడేవిషయం. ఆ క్రమంలోనే పితృస్వామ్యం స్త్రీలకు బాల్యవివాహసంస్కృతిని నిర్దేశించింది. దానిని వ్యతిరేకించే చైతన్యం జైమినిభారతంలో చండిక అనే స్త్రీపాత్రలో కనపడుతుంది. నేటికి లోకంలో భర్తకు అణగిమణగి ఉండక ఎదురుమాట్లాడే స్త్రీలను చండికతో పోల్చి చెప్పటం గమనించేవిషయమే. ఈ చండికకూడా పురాణపాత్ర కాదు. 13 శతాబ్దపు కావ్యమైన ఈ జైమినిభారతంలో సృష్టింపబడిన నూతనపాత్ర. చండికకు ఉద్దాలకుడనే తాపసితో బాల్యవివాహం జరిగింది. ఆతని జపతపాలకు వీలుగా మడిబట్టలు ఆరవేసిపెట్టటం, పంచపాత్ర, రాగిచెంబులు తోమిపెట్టటం, హోమగుండాన్ని శుభ్రంచేయటంవంటివి భార్యగా ఆమె చెయ్యాల్సిన విధులు. ఆ ముని తన భార్యను చిన్నప్పటినుండి తాను చూస్తూనే ఉన్నాననీ, తన భార్యయందు 'నయమొకింతగాననయ్యెడు' (4-86) అని చెప్పటంతో ఆ బాలిక బాల్యవివాహంవల్ల

ఆతని భార్యగా వచ్చి యిక్కడే యవ్వనవతిగా పెరిగిందని అర్థమౌతుంది. వయసువచ్చిన ఆమెశరీరానికి కోరికలు పుట్టటం ప్రకృతిసహజ విషయం. వయోభేదంతోపాటు తాపసవృత్తిలో ఉన్న భర్తతో ఆమెకు కోరికలు తీరే అవకాశం లేకపోవటం, కుటుంబాన్ని దాటి బయటకు పోలేని స్థితి ఉండటం ఆమెకు సమస్యగా పరిణమించటంతో, ఆ సమస్యపట్ల సంఘర్షించిన చండిక తన నిరసనను తెలపాలని అనుకొంది. క్రమంలో భర్తవృత్తికి, ప్రవృత్తికి సంబంధించిన విషయంగా జపతపాలు చేసుకోవటానికి ఉపయోగించే వస్తువులైన ఉద్ధరిణ, పంచపాత్రలను బావిలోపడవేయటం, మడిబట్టలనుచించి పోగులుపెట్టటం, హోమగుండంలో నీళ్ళుపోయటంవంటి క్రియలతో(4-87) నిరసనచైతన్యాన్ని ప్రదర్శించటం కనపడుతుంది. అందుకే ఆమె నిరసనచైతన్యానికి విరుగుడుగా ఆ తాపసియొక్క స్నేహితుడైన మునివచ్చి వ్యతిరిక్తపు సంభాషణలతీరుతోనే ఆమెకు చెప్పి ఆమె చేత కావాల్సినపనులు చేయించుకోమని సలహాయిస్తాడు. ఇక్కడ చండిక బాల్యవివాహసంస్కృతిని నిరసించే వ్యతిరేకచైతన్యాన్ని తెచ్చుకొన్నట్లుగా నూతనపాత్రను సృష్టిచేయటం 13 వ శతాబ్దపు సామాజికస్త్రీల చైతన్యాన్ని కవి తన కావ్యంలో ప్రతిఫలింపచేయాలనుకోవటమే. ఈ చైతన్యానికి మూలకారణం రుద్రమ ప్రభావంతో తమ ఉనికిని, తమ శక్తియుక్తులను స్త్రీలు గుర్తించగలిగిన పరిణామశీలత యే.

జైమిని భారతంలోనే ఒక భటుని యొక్క తల్లికి ఉన్న స్పృహ ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ధర్మరాజు అశ్వమేధయాగం చేయాలనుకొని అర్జునుని పంపుతాడు. ఆతడు యౌవనాశ్వుని జయించి తెచ్చిన ఆ అశ్వంతోనే కృష్ణుని ముఖ్యఅతిథిగా చేసి ధర్మరాజు యజ్ఞప్రారంభం చేస్తాడు. ఆ పూజకు కృష్ణ భక్తుడైన యౌవనాశ్వుడు తన నగరంలోని వారందరిని తప్పక తీసుకురావలసినదని భటులను ఆజ్ఞాపించాడు. ఆ భటుడు జనాలను బండ్లమీదకు ఎక్కించి తీసుకువెళ్ళేటప్పుడు తన తల్లివద్దకు వచ్చి ఊరికి వెడదామని, అక్కడ కృష్ణపరమాత్మ దర్శనం జరుగుతుంది కాబట్టి రమ్మనమని అడుగుతాడు. ఆ తల్లి రానంటూ

"తంద్రితరమునన్ బెనిమిటితరమునందు
వీసమంతయున్ బుణ్యంబున్ జేసియెఱుంగ
వార్థక్యంబున నాకేల వట్టితొడుసు
కృష్ణుదర్శింపకున్న నాకేమిచిక్కు" (2-109)

అంటూ తనమామ, భర్త బతికి ఉన్నప్పుడు ఎప్పుడుకూడా పూజలు, వ్రతాలును చేయలేదని, ఇప్పుడు 'కృష్ణుదర్శింపకున్న నాకేమి చిక్కు' అని నాస్తికచైతన్యంతో అనగలిగింది. అంతేకాక,

"ఏ రీతి ధర్మసుతునకు
శౌరికినధ్వరమున్ జేయు సంతసమగు నా

కారీతిన తప్పదు సం

సారముసేయునెడ నిది నిజంబు కుమారా" (2-110)

అని ధర్మరాజు యాగంతో పొందేఫలితాన్ని తాను సంసారాన్ని నిర్వహించటమనే కర్మయజ్ఞంతో పొందుతున్నానని అంది. ఇక్కడ ఆమె యొక్క నాస్తికచైతన్యమేకాక, కష్టేఫలీ అనే కర్మజ్ఞానచైతన్యం వెలుగులీనటం స్పష్టమౌతుంది. ఇక్కడ స్త్రీలు చేసే ఇంటిచాకిరి పురుషుడు చేసే మహాయజ్ఞాలతో సమానమని చెప్పి స్త్రీల ఇంటిచాకిరీకి ఉండే విలువలను గుర్తించగల చైతన్యం ఆమెలో ఉందని అర్థమౌతుంది.

13 వ శతాబ్దానికి చెందిన రుద్రమదేవి సమకాలీన సాహిత్యంగా భావింపబడే జైమిని రాసిన అశ్వమేధపర్వానికి ఆంధ్రీకరణమైన 'జైమినిభారతం' లో ప్రమీలపాత్ర విశిష్టమైనది. ప్రపంచసాహిత్యంలోనే అపూర్వమైనదని భావించవచ్చు. అందుకే ఈ కావ్యం 19 వ శతాబ్దం నాటికే ప్రపంచభాషలలోకి అనువదింపబడింది. రుద్రమ రాజ్యాధికారాన్ని ప్రతిబింబించే విధంగా ప్రమీలకూడా ఒక స్త్రీమండలానికి రాణి. ఆమెయొక్క పరాక్రమశక్తిని అర్జునుడుకూడా జయించలేడు. పితృస్వామ్యంలో పురుషులు స్త్రీలలైంగికతపై తమకు ఆధిక్యత, అధికారం ఉందని భావించి, ఏ విధంగా స్త్రీలలైంగికతను అణచివేతకు గురిచేసారో, దానికి ప్రతీకారంగా అటువంటి అణచివేతనే అర్జునుడు ఎదుర్కొనే విధంగా ప్రమీల అతనితో

"కనుగొని నన్నునాహవముఖంబున మార్కొన నిల్వనీకకా

దనిమిషసిద్ధ సాధ్యులకునైననసాధ్యము కార్యకాంక్ష నె

మ్మనమునఁగల్గెనేని దురభిమానము మాని ప్రియంబెలర్పన

న్నెనసిన వేడ్కతోడ వరియింపు హయంబుఁబరిత్యజించెదన్" (5 ఆ.-116 ప.)

అని దురభిమానంబు మాని తనని గెలిచి యాగాశ్వాన్ని తీసుకెళ్ళమని అంటుంది. అంతేకాదు, ఆతనికంటె పరాక్రమశీలియైన ప్రమీల తనయొక్క అధికారం తెలిసేటట్లుగా అర్జునునితో

"సోమపానంబు నీయగ్రజుఁడొనర్చి

యిష్టఫలభోగములబొందనిమ్ము నీవు

నిట 'మదీయాధరామృతంబెలమి గ్రోలి

యువతీమండలమునకెల్లనొడయఁడగుము" (5-117) అని ఆశపెడుతుంది. అంతేకాక అర్జునునియొక్క పురుషలైంగికతపైనే సవాలు విసరుతూ ప్రమీల

"రణమున నాదు భీకర శరంబులనైన లసత్కటాక్షవీ

క్షణములనైన నిన్నిప్పుడ చంపుట తప్పదు రిత్తచావగా

రణమదియేల నన్ రతిరాజ సుఖంబులఁదేల్చితీఱినన్
గణనకునెక్కఁబావకముఖంబుననీబడినేగుదెంచెదన్”

(5-120) అని అనటం చాలా విచిత్రంగా అనిపిస్తుంది. స్త్రీలు ఏకాంతంగా భర్తతోకూడా లైంగికసంపర్కానికి సంబంధించిన మాటలు మాట్లాడకూడదనే సంస్కృతిగల భారతీయసమాజంలో పరాక్రమ ఆధిక్యతగల ప్రమీల బహిరంగంగా అర్జుననిలైంగికతపై సవాల్ విసురుతూ, లైంగికసంభాషణ చేయటంలో ఆమెయొక్క లైంగికతా ఆధిపత్యచైతన్యం అర్థమౌతుంది. అందుకే ప్రమీల అతనితో తనని ఆతడు గెలవలేదని, తనని వరియించి రతిరాజసౌఖ్యములందు తేల్చిమాత్రమే ఆ యజ్ఞాశ్వాన్ని తీసికెళ్ళమంటుంది. నిజానికి స్త్రీయైన ప్రమీలకోరుకొంటే కోటిమందిమగవాళ్ళు పెళ్ళిచేసుకోవటానికి సిద్ధంగానే ఉండి ఉంటారు. అన్నిచోట్ల విజయుడైన అర్జునుని విషయంలో ఆమె అటువంటి సవాల్ విసరటం అంటేనే ఏ లైంగికత స్త్రీల అణచివేతకై నిర్దేశించిన పితృస్వామ్య కుటుంబసంస్కృతికి వెన్నుదన్నుగా నిలిచిందో, అటువంటిదే అయిన స్త్రీపురుష లైంగికసంబంధాలలోని వివక్షా సంస్కృతికి విసరిన సవాలుగా భావించాలి. ఇటువంటి పురుషలైంగికతాధిపత్యానికి సవాలువిసిరే స్త్రీపాత్రయొక్క శక్తిచైతన్య చిత్రణకు కవి కాలంనాటి రుద్రమదేవి పరాక్రమ శక్తియుక్తులప్రభావమే కారణంగా భావించవచ్చు. స్త్రీలలోగల ఆత్మశక్తియొక్క అస్తిత్వచైతన్యమిది. రాణిరుద్రమకు కూడా వ్యక్తిగతజీవితంలో ఆమెకు భర్తయైన వీరభద్రుడు కాకతిరాజ్యానికి వారసత్వం పొందాలనుకొన్నాడు. కాని భార్యయైన రుద్రమదేవి రాణి కావటంతో భంగపడి ఆమెతో ఉన్న కుటుంబసంబంధాలను తెంచుకొన్నాడని చరిత్ర తెలుపుతోంది. ఆ రకంగా ఆమెను గెలవాలను కొన్నాడుకాని, రుద్రమ ఆ విషయానికి ప్రాధాన్యత యివ్వకపోవటంతో ఆతడు ఓడిపోవటంగా భావించవచ్చు. ఆ చారిత్రక సత్యానికి తుదిమెరుగుల స్త్రీలఅంతరంగ చిత్రీకరణ ఫలితమే ఈ ప్రమీలపాత్ర.

13 వ శతాబ్దానికి చెందిన మంచన రాసిన 'కేయూరబాహుచరిత్రమ' నే కథాకావ్యంలో నిపుణిక అనే భార్య తన గర్భధారణవిషయంలో మాతృత్వం ఆరాధనీయమనే పితృస్వామ్యపు సంస్కృతీ భావజాలానికి వ్యతిరేకచైతన్యం తెచ్చుకోవటం కనపడుతుంది. పురుషుని కుత్సితబీజాన్ని వహిస్తూ ఆపసోపాలుపడుతూ నిద్రాసౌఖ్యానికి భంగకరమైన గర్భాన్ని మోయటాన్ని నిరసించే చైతన్యాన్ని ఆ స్త్రీ తెచ్చుకోవటం ఆధునిక స్త్రీలగర్భస్రావపు హక్కుకు పునాదిప్రాయమైన చైతన్యంగా అర్థమౌతుంది. అందుకే భార్య అంటే కాస్త సానుకూలతగల ఆమె భర్తకు తన గర్భాన్ని నిపుణిక బదలాయించి తిరుణాళ్ళకు వెడుతుంది. తిరిగి యింటికి వెడితే ఆ గర్భభారాన్ని తిరిగి మోయాల్సివస్తుందని

భావించిన నిపుణిక 'ఆతని కుత్సితబీజము వానిమీదనే త్రొంబితినింత నాకొరుల దూఱుపొగద్దయు చూడనేటికి?' (4-90), అని 'చూలువహించి వెక్కుచును, స్రుక్కుచునుండి ప్రసూతివేదనం జాలనలింగి యాపదనబడ్డ పడంగను నాకునేల నాపాలిటి దయ్యమడ్డొసగువాడినం గ్రమ్మరునేలపోదునంచా లలితాంగి - (4-91) అని గర్భధారణ తనపాలిటి దయ్యం వంటిదని భావించి తిరిగి ఆమె తిరిగి భర్త దగ్గరకు వెళ్ళదు. గర్భధారణపట్ల ఆ స్త్రీ క్రియాశీలకమైన నిరసనచైతన్యాన్ని చూపించింది. 13వ శతాబ్దకాలపు ఈ చైతన్యమే ఆధునికయుగ ప్రజాస్వామ్యంలో స్త్రీలకు గర్భస్రావంచేసుకొనే హక్కుకు పునాదిప్రాయంగా కనపడుతుంది.

పితృస్వామ్యం తన ఆధిక్యతను నిలుపుకోవటానికి స్త్రీలలైంగికతపై అదుపుకు ప్రాధాన్యతను ఇవ్వటం జరిగింది. అందుకే 14 వ శతాబ్దానికి చెందిన దగ్గుపల్లి దుగ్గన రాసిన - నాసికేతోపాఖ్యానంలో పితృస్వామ్యపు భావజాలానికి వీలుగా స్త్రీలలైంగికత చుట్టూ అల్లిన సాంస్కృతిక భావజాలంలో బాధితురాలైన చంద్రవతి పాత్ర కనపడుతుంది. చంద్రవతి స్నానానికై కాలువకి వెళ్ళగా, ఆమెకు నాసికద్వారా వీర్యకణం జొరబడి ఆమె గర్భవతి అవుతుంది. దానివల్ల రాజ్యం శత్రువులపాలవుతుందని జ్యోతిష్కుడు చెప్పటంతో ఆమె తండ్రియైన ఆ రాజు కూతురు అనే కనికరం లేకుండా ఆమెను దేశబహిష్కరణకు గురిచేస్తూ అడవుల్లో వదిలిపెట్టిస్తాడు. అయితే ఆమెమీద కన్నేసిన ఆ జ్యోతిష్కుడే వెంటపడగా ఆమె తప్పించుకుంటుంది. ఇక్కడ స్త్రీలలైంగికతపై అల్లిన భావజాలం చంద్రవతిని బలితీసుకోవాలనుకొనే సందర్భంలో ఆమె స్వీయచైతన్యాన్ని తెచ్చుకొని ఆత్మరక్షణకై పరుగులుతీసి చివరకు బిడ్డకు జన్మనిచ్చింది. కాని సమాజసంస్కృతిలో అవివాహిత బిడ్డ అవాంఛనీయమని భావించి నదిలో వదిలిపెట్టిన తరువాత తాను చనిపోవాలనుకొంది. కాని మాతృత్వపు మమకారంతో కన్నబిడ్డను వెతుకుతూవెళ్ళి, చివరకు తనబిడ్డను కాపాడిన ఉద్దాలకుని వీర్యమే తన గర్భానికి కారకమని తెలుసుకొంది. ఆ ముని చంద్రవతిని వివాహమాడి ఆమెను భార్యగా స్వీకరిస్తానన్నా, ఆమె మాత్రం తండ్రి అయిన రాజు సమక్షంలోనే తన గర్భధారణవిషయంలో తన తప్పులేదని నిరూపించిన తరువాతనే, ఆ రాజు సమక్షంలోనే తనని వివాహమాడమని చెప్పి, రాజసభలో చంద్రవతి ఉద్దాలకునిచేత తాను - అహీనచరిత- (2-149) అని నిరూపింపచేసుకుంది. ఆవిధంగా ఆమె లైంగికతకు సంబంధించిన విషయంలో తనతప్పులేదని నిరూపించుకొని సామాజిక గౌరవప్రదమైన జీవనాన్ని పొందే ఆత్మగౌరవ అస్తిత్వచైతన్యాన్ని తెచ్చుకొన్నట్లు నాసికేతోపాఖ్యానమనే కావ్యంలో చంద్రవతి అనే స్త్రీపాత్ర అర్థమౌతుంది.

రుద్రమదేవి తనశక్తియుక్తులతో చేసిన రాజ్యపరిపాలనానంతరమే స్త్రీలు తమలోనిశక్తులను

గుర్తించగలిగి తమ సృజనాత్మకశక్తి చైతన్యాన్ని బహిర్గతంచేయగలిగారు. స్త్రీలు కావ్యసృజనచేయటం ప్రారంభమైంది. 15 వ శతాబ్దానికి చెందిన తాళ్ళపాక తిమ్మక్క ప్రథమాంధ్రకావ్యయిత్రిగా – సుభద్రా పరిణయం – అనే ద్విపదకావ్యాన్ని రాసింది. తన రచనారంభంలోనే – ఇంతులకథలెంతవారికైనా చిరాకుకల్గు – అని పేర్కొనటంలోనే స్త్రీలు కావ్యరచనచేస్తే సహించలేని సమాజం ఉందని అర్థమౌతుంది. అందుకే కావ్యంలో తాళ్ళపాక తిమ్మక్క ఒక స్త్రీగా సామాజిక పురుషుల స్వభావాన్ని విమర్శకుపెడుతూ – పొలతి నమ్మగరాదు, పురుషులనెపుడు పలురీతి కృష్ణసర్పమ్ములై యుంద్రు – అని రుక్మిణిచేత సుభద్రకు చెప్పించింది. కావ్యంలో రుక్మిణి సాహసోపేతంగా పితృస్వామ్యపు పురుషప్రవృత్తిని వేలెత్తిచూపించే విధంగా కవయిత్రి స్త్రీచైతన్యాన్ని కావ్యనిక్షిప్తంచేసింది.

మొల్ల రామాయణాన్ని తెలుగులో రాస్తూ, పాఠకులు చదవగానే అర్థం తేటతెల్లమయేవిధంగా సంక్షిప్తంగా రాయాలనుకోవటంలోనే సాహిత్యప్రయోజకత్వచైతన్యం అర్థమౌతుంది. అయితే మొల్ల సామాజికంగా కిందికులానికి చెందటంవల్ల తన మేధకంటే కూడా దైవకృపవల్లనే తానా కావ్యరచన చేయగలిగినట్లు చెపితేనే ఆమె కావ్యాన్ని ఆదరిస్తారనే భావనతో చెప్పటంగా అర్థమౌతుంది. అంటే పితృస్వామ్యధోరణిని విమర్శించే ఆమె చైతన్యం మూగపోయిందని భావించవచ్చు.

16 వ శతాబ్దపు సామాజికభావాలకు ప్రాతినిధ్యం వహించే కవుల కావ్యాలలో సమాజం ప్రతిఫలించకతప్పదు. రుద్రమ పరిపాలనానంతరం పితృస్వామ్యసమాజంలో స్త్రీలు తమ సమస్యలపట్ల సంఘర్షించటం, వ్యతిరేకచైతన్యం తెచ్చుకోవటాన్ని సాహిత్యం ప్రతిఫలించింది. ప్రాథమికంగా పితృస్వామ్యం తన వారసుల విషయంలో ఖచ్చితత్వంకోసం, స్త్రీలకుమాత్రమే పాతివ్రత్య నియమాన్ని మహిళాసంస్కృతిగా నిర్దేశించి కుటుంబనిర్మాణం జరిగింది. పితృస్వామ్యంలో పురుషుడిపరంగా ఉన్న అసమనైతికత బహుభార్యాత్వపు సంస్కృతిని వేశ్యావ్యవస్థను ఏర్పాటుచేసుకొంది. అది స్త్రీల గౌరవప్రదమైన ఉనికికి, జీవనభద్రతకు గొడ్డలిపెట్టుగా తయారయిన విషయం. అందుకే ఆత్మశక్తి ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తే ఆత్మగౌరవంగా బతకాలనుకొన్న స్త్రీగా సత్యభామ కృష్ణునియొక్క బహుభార్యాత్వపు సంస్కృతియెడల నిరసనచైతన్యం చూపించటం తిమ్మన రాసిన – పారిజాతాపహరణం – అనే కావ్యంలో అర్థమౌతుంది.

రుక్మిణికి పారిజాతపుష్పాన్ని యిచ్చి ఎక్కువగా గౌరవించటమేకాక తనని సవతిముందు అగౌరవపరిచాడని తెలిసిన సత్యభామ, దానికి పితృస్వామ్యబహుభార్యాత్వపు సంస్కృతి కారణమని భావించి దానిని నిరసించే క్రమంలోనే ఆమె కృష్ణుని తన్నటం జరిగింది. అందుకే బహుభార్యత్వపు సంస్కృతిపట్ల సత్యభామయొక్క ప్రతిఘటనాచైతన్యాన్ని గుర్తించిన కవికూడా–అట్లయగు!

నాథుల్నేరముల్ సేయబేరలుకంజెందినయట్టి కాంతలుచిత వ్యాపారముల్నేర్తురే-(1-121) అని అనగలిగాడు. కాని సత్యభామయొక్క నిరసనచైతన్యం పితృస్వామ్య ప్రయోజనాలకు ఆటంకప్రాయమైన విషయంకాబట్టే కృష్ణుడు నారదుడితో కుటుంబవిషయాన్ని సంప్రదించాడంటే అది ఒక లైంగిక రాజకీయవిషయంగా భావించాల్సిన విషయం అయింది. దానిని అర్థంచేసుకోవటంచేతనే సత్యభామ -పరికింపరు తమ జాడలు, తరుణుల తగులమ్ములు నమ్మదగదంద్రు మదిన్ శరదంబుదచపలచిత్తులు పురుషులెపో వారినమ్మబోలునే చెలియా-(1-87) అని అంటూ సామాజికపురుష ప్రవృత్తిని విమర్శిస్తూ తన నిరసన చైతన్యాన్ని చూపించింది. పితృస్వామ్య ప్రయోజనాలకు అనుకూలమైన బహుభార్యాత్వపు సంస్కృతియెడల సత్యభామయొక్క వ్యతిరేకచైతన్యాన్ని అణచివేయటానికే నారదుడు ఆమెచేత పుణ్యకవ్రతంచేయించి, ఆమెయొక్క బాహిరచైతన్యాన్ని అధోముఖచైతన్యస్థాయికి దిగజారేవిధంగా మార్చగలిగాడు. అందుకే ఆమె వ్రతంలో భాగంగా సవతులను ఆహ్వానించటం, కృష్ణుడు వస్తూపోతూ ఉండేటట్లుగాను, పారిజాతపుష్పాలను కృష్ణుని అష్టభార్యలకే కాక 16 వేలమంది గోపికలకు కూడా పంచగలస్థితికి ఆమె మనస్సు మార్చబడటంచేతనే, ఆమె చైతన్యం అణచివేతకు గురియైందని అర్థమౌతుంది. అందుకే తమపాచిక పారి, బహుభార్యత్వాన్ని కాపాడటానికి చేసిన కృష్ణుని రాజకీయం ఫలించిందని తెలియచేస్తూ నారదుడు కృష్ణుని స్తుతించే క్రమంలో-సత్యభామశుకీకేళీపంజరం-(5-107) గా కృష్ణుడు ఉన్నాడని స్తుతించాడు. ఈ బహుభార్యాత్వపు సంస్కృతి భార్యల గౌరవప్రదమైన జీవనానికి, జీవనభద్రతకు పీడనగాభావించి నిరసించే చైతన్యాన్ని తెచ్చుకుంటూ ఒక స్త్రీ అడుగువేస్తే, ఆ తరువాత పదిమంది వేయగలుగుతారనే విషయం క్రమంగా సాహిత్యంలో కనపడుతుంది.

16 వ శతాబ్దపు మధ్యయుగాలచరిత్రలో రామరాజభూషణుడు రాసిన - వసుచరిత్రము - నే కావ్యం హాలాహలసదృశులైన తురుష్కుల పరిపాలనలో (2-158) స్త్రీల లైంగికతకు భద్రత కరువైందని తెలియచేసే కావ్యం. సంగీతసాహిత్య సమ్మేళనపు రసానుభూతికి పట్టుకొమ్మగా ఆ కావ్యాన్ని సాహిత్యవేత్తలు భావించినప్పటికి, శుక్తిమతి పాత్రను పరిశీలించినప్పుడు ఒక స్త్రీ అత్యాచారానికి గురియైనప్పుడు ఎటువంటి ఆత్మగౌరవ జీవనచైతన్యాన్ని తెచ్చుకొన్నదో గ్రహింపుకు వస్తుంది. భారతకథలోని సత్యవతిపాత్రకు మనుమరాలు ఈ శుక్తిమతి. భారతకాలంనాటి స్త్రీగా సత్యవతి తనను పరాశరముని కామించినప్పుడు (భారతం3-26వపద్యం) ఆమె వారించినా (భారతం3-38) ఆ ద్వీపంలో ముని సృష్టించిన అకాలపు చీకట్లో నిస్సహాయస్థితిలో ఆమె మూగచైతన్యంతో ఉన్నదనే విషయం తెలిసిందే. కాని మధ్యయుగాలచరిత్రనాటికీ అదే నిస్సహాయస్థితిలో ఉన్న శుక్తిమతియొక్క జీవితంలో హాలాహలం సృష్టించాడు కోలాహలుడు. అంటే

భారతకాలంనుండి 16 వ శతాబ్దానికి చెందిన ఈ కావ్యకాలానికి కూడా అనుశ్రుతంగా స్త్రీలపై జరిగే అత్యాచార పీడన సంస్కృతి వస్తున్నవిషయం స్పష్టం. పితృస్వామ్య ఆధిక్యసంస్కృతి ఉన్ననాళ్ళు కొనసాగుతున్న విషయం విదితమే. అతడు ఆమెను - పెద్దయుప్రొద్దు - (2-139) నిరోధింపబడి చేసిన అత్యాచారఫలితంగా ఆమె గర్భవతియై గిరిక, వసుపాదుడులనే కవలలకు జన్మనిచ్చింది. ఈ కారణంగా శుక్తిమతి కోలాహలులు గిరికకు తల్లితండ్రులవటం జరిగింది. కోలాహలుడిపై తన ప్రతీకారం తీర్చుకునే క్రమంలోనే శుక్తిమతి తన కూతురికి తండ్రిగా అతడుపెట్టిన రత్నాలను శుక్తిమతి తీసిపడేసి తన కూతురుకు శంఖాల హారాలను (3-31) వేస్తుంది. శుక్తిమతి ఏనాడు కోలాహలునికి భార్యగా ఉండదలచుకోలేదు కాబట్టియే ఆతనితో ఆమె సంభాషించినట్టుగాని, సంసారంచేసినట్టుగాని కావ్యంలో లేదు. ఆమె తన ఆత్మగౌరవాన్ని నిలపెట్టుకున్న విషయం గిరిక పెళ్ళిసందర్భంలో అర్థమౌతుంది. పెళ్ళికొడుకైన వసురాజును ఎదురేగి ఆహ్వానించే కార్యక్రమానికి కోలాహలుడు గంగాది స్త్రీలతో వెళ్ళినట్లున్నది కాని శుక్తిమతి ఆతనితో ఉన్నట్లు కనపడదు. అందుకే గిరికను అత్తవారింటికి పంపిస్తూ ఆమెతో తల్లి శుక్తిమతి పగవాళ్ళకుకూడా ఆడపడచులు ఉంటారని, స్త్రీలకు పగవాళ్ళతోనే బ్రహ్మ బాంధవ్యం ఏర్పరుస్తాడని (6-62) అనటంలోను, కోలాహలుడు గిరికతో పతివ్రతగా ఉండాలనే అర్థంతో కూతురికి చెప్పటంలోను (6-57) ఆ విషయం అర్థమౌతుంది. శుక్తిమతిది ప్రతిఘటనతో కూడిన నిశ్శబ్ద నిరసనచైతన్యంగా అర్థమౌతుంది.

రాణిరుద్రమవంటి స్త్రీలశక్తియుక్తుల చైతన్యం సమాజంలో విస్తరించినకొద్దీ పితృస్వామ్యం బీటలువారే ప్రమాదం ఉందనుకొన్నారేమోగాని రాజ్యంలోను, సమాజంలోనూ స్త్రీలలైంగికతపై అదుపును తీవ్రతరం చేయాలనుకోవటం ఈ కథాకావ్యాలలో కనపడుతుంది. స్త్రీలసమస్యలన్నింటికి స్త్రీపురుషలైంగిక సంబంధాలనే భావనను కలిగించేవి తెలుగులో వచ్చిన స్వతంత్ర కథాకావ్యాలు. 13 వ శతాబ్దం నుండి 18 వ శతాబ్దంవరకు వచ్చిన ఈ కథాకావ్యాలు మధ్యయుగాల చారిత్రక సమాజాన్ని ప్రతిఫలించినవిగా చెప్పబడతాయి. కథాకావ్యాలుగా మంచన రాసిన కేయూర బాహుచరిత్రం, కొఱవిగోపరాజు సింహాసనద్వాత్రింశిక, జక్కన విక్రమార్కచరిత్ర, అనంతామాత్యని భోజరాజీయం, పాలవేకరి కదిరీపతి శుకసప్తతి, అయ్యలరాజు నారాయణ హంసవింశతి, వెన్నెలకంటి అన్నమయ్య షోడశకుమారచరిత్రం వంటి కావ్యాలు అవి. మధ్యయుగాలచరిత్రలో వచ్చిన ఈ కావ్యాలన్నీ స్త్రీల లైంగికతను మరింత పటిష్ఠంగా అదుపుకు గురిచేయబడాలనే ఉద్దేశ్యంతో రాయబడ్డాయి. అదేమేరకు పితృస్వామ్యపు అసమనైతికసంస్కృతి కారణంగా స్త్రీలు కుటుంబసంస్కృతిని అధిగమించే చైతన్యాన్నివ్యక్తం చేసిన కావ్యాలుకూడా యివి. ఈ కథాకావ్యాలలోని స్త్రీలు తమ

లైంగికత విషయంలో విప్లవాత్మక సాంస్కృతిక చైతన్యాన్ని తెచ్చుకోవటాన్ని గమనించవచ్చు. స్త్రీలు పురుషుడితో సమానంగా లైంగిక స్వేచ్ఛను పొందవచ్చునే స్త్రీల లైంగికచైతన్యం కనపడుతుంది.

క్రీ.శ. 13 నుండి 18 వ శతాబ్దాల మధ్యన వచ్చిన ఈ కథాకావ్యాలలో స్త్రీలు తమ భర్తలకు లైంగికసామర్థ్యం లేనప్పుడుగాని, భర్త జపతపాలతో కాలంగడుపుతూ భార్యయొక్కలైంగిక అవసరాన్ని తీర్చలేనప్పుడుగాని, నిర్వీర్యులైనప్పుడుగాని, భర్తలు అన్యసంబంధాలలో మునిగితేలుతూ తమని నిర్లక్ష్యం చేసినప్పుడుగాని మధ్యయుగాల చారిత్రకాలంనాటికే, స్త్రీలు తాముకూడా అన్యపురుషసంబంధాలు పెట్టుకోవాలనుకొన్నారు. అయితే వారు తమ చాతుర్యంతో కుటుంబ సంస్కృతిలోనే యిముడుతూ లైంగికస్వేచ్ఛను అనుభవించాలనుకొంటారు. సమాజంలో కులవ్యవస్థ స్పష్టమైన కాలంలో అన్నికులాల, అన్నివర్గాల స్త్రీలు యిటువంటి లైంగికతాచైతన్యం తెచ్చుకోవటానికి కారణం కుటుంబంలోని అసమనైతికసంస్కృతియే. అందుకే నాటిస్త్రీలు అప్పుడప్పుడే స్త్రీపురుష లైంగికసంబంధాలలో పితృస్వామ్యం నిర్దేశించిన కుటుంసంస్కృతిపట్ల వ్యతిరేక లైంగికచైతన్యాన్ని తెచ్చుకోవటాన్ని స్త్రీల విప్లవాత్మక చైతన్యానికి మచ్చుతునకగా భావించాలి.

17 వ శతాబ్దానికి చెందిన విజయరాఘవనాయకుని ప్రియురాలైన రంగాజమ్మ అష్టభాషా విశారదురాలిగా మన్ననలను పొందటంతో ఆ రాజును రాజగోపాలదైవంతో సమానుడిగా భావించి – మన్నారుదాసవిలాసనాటకమనే యక్షగానసాహిత్యప్రక్రియను,–ఉషాపరిణయం– అనే కావ్యరచనను ఆమె ప్రియుడిపరంగా చూపించాలనుకొన్న సృజనాత్మకశక్తిచైతన్యం ఆమెలో స్పష్టమవుతుంది.

18వ శతాబ్దపు పూర్వార్ధ కాలానికి చెందిన ముద్దుపళని అనే కవయిత్రి – రాధికా సాంత్వనమనే కావ్యంరాస్తూ తన కావ్యరచనలో దోషాలు ఎత్తిచూపే ఆక్షేపజీవకవులు అమంగళకవులని చెప్పి పితృస్వామ్యానికి ముందరికాళ్ళబంధం వేసింది. స్త్రీలు సిగ్గువిడిచి రాయకూడని సంభోగశృంగారాన్ని రాసిందని కందుకూరివంటి సంఘసంస్కర్త విమర్శించినా, ముద్దుపళని లింగవివక్షను అధిగమించగల చైతన్యంతో రాధ పాత్రచేత ఇళకు లైంగికవిద్యను నేర్పించింది. పురుషుడు ఈ లైంగికవిద్యకు తానే అధికారినని భావించేటట్టు చేయటంకోసమే స్త్రీలు లైంగికసంభాషణలు భర్తదగ్గర కూడా చేయకూడదనే సంస్కృతిని ప్రచారం చేయటం జరిగిందని, కేవలం తమ పురుషాధిక్యతను నిలబెట్టుకోవటానికే అనే స్పృహ ముద్దుపళనికి ఉందనిపిస్తుంది. స్త్రీపురుషలైంగిక సంబంధాలలో – ఏవేళన్ మందుచునుండు – (4–81) భర్తలవల్ల సంతృప్తిచెందలేని కుటుంబినియైన రాధ ఇంటింటా చంద్రుడైన కృష్ణునితో అన్యపురుషసంబంధాలలోకి వెళ్ళినప్పుడు స్త్రీని – కీలుబొమ్మగా – (3–124) భావించకూడదని అంటుంది. ఆమె కృష్ణుని తన ప్రాణనాయకునిగా భావించటంచేత, ఆతడు

ఇళనువదిలి రానందుకు - ప్రాణనాయకులనవ్వలనివ్వల బాయు రామలు మదనతాపంబొరగ న్యాయమకటా? - (2-110) అని రాధపాత్రచేత స్త్రీలకు ఉండాల్సిన లైంగికన్యాయాన్ని ప్రశ్నింప చేయటంలోనే కవయిత్రికిఉన్న లైంగికతాస్పృహ స్పష్టమౌతుంది. స్త్రీలయొక్క శారీరకధర్మమైన లైంగికన్యాయ చైతన్యాన్ని బహిర్గతంచేసిన రచన యిది.

క్రీ.శ. 1817 సం. లేదా 1840 సం. వరకు జీవించిన కవయిత్రి తరిగొండ వెంకమాంబ బహుకావ్య రచయిత్రి. ప్రకృతిశక్తి ప్రసాదితంగా తాను రచనచేస్తున్నట్టుచెప్పి తనది బాలభాషయని విమర్శించవద్దనీ, తాను అన్ని కావ్యాలను రాయటం మాటలుకాదని చెప్పి తన ఆత్మ విశ్వాసాన్ని వ్యక్తంచేసుకొనే చైతన్యంతో రచనలుచేసింది. ఆమెను ఒక ఆధ్యాత్మికభక్తురాలిగా భావించే ఆనవాయితి ఉన్నా ఆమె రచనలలోని సామాజిక స్పృహమాత్రం అపూర్వమైనది.

ఆమె రాసిన - నృసింహశతకంలో ఆధ్యాత్మిక, రాజయోగసారానికి సంబంధించిన విషయాలేకాక, సామాజికస్పృహతో భార్యను కుటుంబహింసకు గురిచేసే పురుషప్రవృత్తిని ప్రశ్నించటం కనపడుతుంది. భర్త అన్యస్త్రీలసంపర్కపు మక్కువతో - పాటిగనగ్నిసాక్షిగా వివాహమైన పతివ్రతా మణిన్ నీటున నొల్లకన్ మిగుల నేరములనెన్నుచుఁ గొట్టితిట్టుచున్ ధాటిగనన్యకాంతను ముదంబున రక్షణచేసి దానితోఁగూటమిపాపహేతు ! - (ప.95) అంటూ సమాజంలో పురుషుల అనైతికత పాపహేతువని, దాని ఫలితమైన కుటుంబహింసను బయటపెట్టి, ప్రశ్నించే స్త్రీగా తరిగొండ వేంకమాంబయొక్క చైతన్యం ఆమె రాసిన నరసింహశతకంలో తెలియటం విశేషంగా భావించాలి. అంతేకాక స్త్రీల ఋతుకాలధర్మంయొక్క మర్మాన్ని గ్రహించమంది. (ప.85) తరిగొండ వేంకమాంబ వితంతుసంస్కృతిని వ్యతిరేకించినట్లు జనశ్రుతిలో వినపడే విషయం కాని ఆమె ఆ విషయాన్ని తన కావ్యాలలో ఎక్కడా పేర్కొనకపోవటం విచారణీయం. ఆ విషయంలోనే వేంకమాంబను సమాజం వెలివేయగా, ఆమె తలకోన అడవుల్లో తపసుచేసుకుందని వినికిడి. కాని ఆ అడవులలో ఉన్న చెంచులయొక్క జీవనవిధానాన్ని పాత్రోచితభాషా వ్యవహారిక ప్రయోగంతో రాయటం వేంకమాంబ యొక్క నూతన రచనా నైపుణ్యచైతన్యం అర్థమౌతుంది. ఒక ఆదివాసి స్త్రీని నాయికగా చేసి, ఆమె భర్త కంటె ఆమెయే శక్తిసంపన్నురాలనిచెప్పటం, పితృస్వామ్య కుటుంబంచేసిన పనివిభజనలో భాగంగా పురుషులకు నిర్దేశించిన సామాజికపనిని ఆ చెంచెతచేయగలిగినట్లుగా, ఆమె ఆహార సంపాదనకై వేటకు వెడితే ఆమె భర్త పిల్లవాడిని జాగ్రత్తగా చూసుకోలేక పోయాడని కావ్యంలో పేర్కొనటం జరిగింది. అంటే స్త్రీలు చేసే సామాజికపనితోపాటు ఇంటిపని విలువైందని చెప్పటమే. ఆ కావ్యంలో చెంచుస్త్రీలయొక్క కుటుంబ నిర్వహణా చైతన్యం కనపడుతుంది. అంతేకాక తరిగొండ

వేంగమాంబ పురుషులకే పరిమితమైన ఆధ్యాత్మికవిషయాలనేకాక, యోగవిద్యకు సంబంధించిన రాజయోగసారమనే కావ్యాన్ని, ద్విపదలో భాగవతాన్ని రచించింది.

తెలుగు సాహిత్యచరిత్రలో 17-18 శతాబ్దాలకాలం యక్షగానయుగం. సాహిత్యాన్ని శ్రోతల అందుబాటులోకి తీసుకురావటానికి జరిగిన సాహిత్య ప్రక్రియాపరిణామదశ. యక్షగానం అంటే అటు పద్యకావ్యం ఇటు నాటకలక్షణాన్ని పొందుపరచుకొన్న సాహిత్యప్రక్రియ. ఈమె శివనాటకం, రమాపరిణయంవంటి యక్షగానాలను, విష్ణుపారిజాతం, వేంకటాచలమహాత్మ్యం అనే కావ్యాలను రచించింది. శివనాటకంలోను, విష్ణుపారిజాతమనే కావ్యాలలో సవతులమధ్య ప్రత్యక్షంగా వాగ్బాణాలతో పోరాటం జరగటం, శివుడు, కృష్ణుడు ఆ విషయంలో తమ తప్పులేదంటూ వారి జగడాలను వినోదంగా చూడటంవంటి పితృస్వామ్యరాజకీయాలను అర్థంచేసుకోవాల్సిన చైతన్యాన్ని కలిగించే రచనలవి. పురాణపాత్రలపరంగా సామాజిక కుటుంబవ్యవస్థలో పురుషప్రయోజనాలకు వీలుగా తమవైపు తప్పులేదంటూ బహుభార్యాత్వపు సంస్కృతిని తమకు అనువుగా ఉండేటట్లు చేసుకొనే కుటుంబరాజకీయసంస్కృతీ కుట్రను స్త్రీలు గ్రహించే చైతన్యాన్ని అందించిన కావ్యాలు అవి. కేవలం గ్రహిస్తే సరిపోదని స్త్రీలలో క్రియాశీలచైతన్యం కలగించాలనుకొని ఆ లైంగిక రాజకీయాలకు విరుగుడుగా తరిగొండ వేంకమాంబ లక్ష్మి, హరులను భూలోకపాత్రలుగా మలచి - వేంకటాచల మహాత్మ్యమనే కావ్యాన్ని రాసింది. అయితే సవతులు పురుషప్రయోజన రాజకీయాలను అర్థంచేసుకోకుండా సవతులు తమలో తాము కలహించుకుంటే ఆ సమస్యకు పరిష్కారం కాదని గ్రహించగలిగిన తరిగొండ వేంగమాంబ స్త్రీలలో కలగాల్సిన క్రియాశీలకమైన విప్లవాత్మకచైతన్యానికి 18వ శతాబ్దపు ఉత్తరార్ధనికే - వేంకటాచలమహాత్మ్యమ- నే కావ్యంలోపాదులు వేసింది.

వేంకటాచలమహాత్మ్యమనే కావ్యంలో వేంకమాంబ తాను కావ్యంలో మొదటి ఐదాశ్వాసాలలో బ్రహ్మాండ, భవిష్యోత్తర, పద్మ పురాణవిషయాలను పొందుపరిచి రాసినట్లును, ఆరవ ఆశ్వాసంలో పద్మపురాణమందు వింతగు వేంకటాద్రివిభుడు సిరిని గూరిచి చేసినట్టి చరితములు కొన్ని లభియింప, సంగ్రహముగ సరవినాశ్వాసమునకవి చాలవనుచు వేఱకల్పనకొంతగావింపవలసె (6-3) అని తాను పద్మావతి శ్రీనివాసులకళ్యాణ ఘట్టాలను కల్పనచేసి రాసినట్టు తరిగొండవేంకమాంబ చెప్పింది. పైపెచ్చు దీనికి - పెద్దల అనుమతంమున - వీరలక్ష్మి విలాసమనెడు నామంబు - పెట్టాలనుకొన్నట్లు (6-5) చెప్పింది. కాని పితృస్వామ్యంలో కావ్యానికి కవయిత్రి పెట్టాలనుకొన్న ఆ పేరుకు పెద్దల ఆమోదం లభించలేదేమోగాని ఆ వీరలక్ష్మి విలాసమనుపేరు మరుగున పడిందని భావించవచ్చు. ఈ కావ్యంలో సగభాగం వరకు కథావిషయం పురాణవిషయమైనా మిగిలిన కథావస్తువులో

పద్మపురాణంలో వింతలుమెరిసిన విషయాలకు తాను కల్పనజోడించి (6-227) రాస్తున్నట్టుగా పేర్కొంది. ఆమె అలా కల్పించాలనుకోవటానికి కారణం ఆనాటి వ్యవస్థలోని బహుభార్యాత్వపు సంస్కృతిని వ్యతిరేకించి స్త్రీలు ఆత్మగౌరవంతో బ్రతికే చైతన్యాన్ని కలిగించటం కొరకే అని అర్థమౌతుంది. బహుభార్యాత్వపు సంస్కృతివల్ల భార్యాభర్తలు గొడవలుపడి విడిపోతే, ఆతడు మళ్లీ వివాహం చేసుకుంటే నష్టపోయేది స్త్రీయే అని, స్త్రీదే తప్పని భావింపచేసే సామాజికప్రచారం జరుగుతుంటుంది. దానికి కారణం కుటుంబం ఏర్పడినప్పటినుండి స్త్రీ పోషింపబడే స్థితిలో ఉండటమే. భర్తను ఎదిరిస్తే ఆమెకు సామాజిక మనుగడ కష్టతరం అవుతుంది.

పితృస్వామ్యపు బహుభార్యాత్వపు సంస్కృతివల్ల స్త్రీలకు గౌరవప్రదమైన జీవితం లేకపోవటమేకాక జీవితభద్రతకూడా కరువవుతుంది. దానికి పరిష్కారం స్త్రీలు స్వీయపోషకత్వం కలిగి ఉండటం. స్త్రీలకు విద్య, ఆస్తి, సామాజిక జీవితం లేనిరోజుల్లో స్త్రీలు నోరుమూసుకొని పడి ఉండటమే పరిష్కారంగా పెద్దలు చెప్పేవాళ్ళు. కాని 18వ శతాబ్దపు కథాకావ్యాలలో స్త్రీలు అప్పుడప్పుడే తమ ఆర్థికస్వావలంబనకై అడుగులువేసే క్రమంలో వారు కుటీరపరిశ్రమలను ఏర్పాటు చేసుకున్నట్టుగా అర్థమౌతుంది. సంపదలేని నిస్సహాయస్థితిలో ఉన్న స్త్రీలు బహుభార్యాసంస్కృతి ఆచరణలో ఉన్న సమాజంలో తమ అస్తిత్వానికై పెనుగులాడే క్రమంలో సవతులతో కొట్లాట పెట్టుకోవటం రివాజుగా తయారయింది. ఆ పరిణామక్రమంలోనే ఆర్థికస్వాలంబన ఉంటే స్త్రీ బహుభార్యల కుటుంబవ్యవస్థలో ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకొనే మార్గముంటుందనే వ్యక్తిత్వచైతన్యాన్ని కవయిత్రి కలిగించాలనుకొంది. అందుకే మానవలోకం ధనానికి చిరునామాగా భావింపబడే వైకుంఠలక్ష్మిని పాత్రగా చేసుకొని కథాకల్పనతో - వేంకటాచల మహాత్మ్యమనే భక్తిపూర్వక గ్రంథాన్ని రాసింది. అంతవరకు పురుషప్రయోజనాలకు వీలుగా బహుభార్యాత్వపు సంస్కృతిని సమాజంలో ఆచరణలో పెట్టేందుకు దానిని సమర్థనీయంచేస్తూ కవులు ఆధ్యాత్మికం, మధురభక్తి అంటూ పురుషదేవుళ్ళచుట్టూ కథలల్లి కావ్యాలను రాసారు. దానికి భిన్నంగాను, పితృస్వామ్యానికి హెచ్చరికగాను తరిగొండ వేంగమాంబ కావ్యార్థభాగం నుండి పద్మపురాణంలో లేని కథను సృష్టించి కుటుంబంలో బహుభార్యాత్వపు సంస్కృతికి గురియైన స్త్రీ కుటుంబంనుండి విడిపోయి ఆత్మగౌరవంగా బ్రతికే మార్గాన్ని కవయిత్రి సూచించింది. అందుకే ఆధ్యాత్మిక కేంద్రంచుట్టూ సామాజికకుటుంబ సంస్కృతిని నిక్షేపిస్తూ తరిగొండ వేంకమాంబ - రమ్యతరమగు పద్మపురాణమునను వింతలగుచుఁ బ్రకాశించు వెంకటాద్రిపతి చరితములుగొని యేర్పరచి మీకుఁజెప్పితిని -(6-227) అని చెప్పి తాను అల్లిన కథయే ఈ - వేంకటాచలమహాత్మ్యంలో ఉంటుందని చెప్పింది. పద్మావతి శ్రీనివాసులకల్యాణాన్ని తిరుమలక్షేత్రంచుట్టూఉన్న కథావిషయంగా

చెప్పబడటం ఈ వేంకటాచలమహాత్మ్యమనే కావ్యంలోనే ఉంది. ఈ కథావిషయం పద్మపురాణంలో కనపడదు.

పద్మపురాణంలోని పద్మావతి అనే స్త్రీ వేరుగా చిత్రీకరింపబడింది. పూర్వగాథాలహరి – గ్రంథంలోకూడా ఈ పద్మావతి శ్రీనివాసులయొక్క పేర్లు పురాణాలపరంగా పేర్కొనబడలేదు. కేవలం అందులోకూడా తరిగొండ వేంకమాంబ రాసిన ఈ వేంకటాచలమహాత్మ్యమునే ఉటంకించటం జరిగింది. తరిగొండ వేంకమాంబ ఈ కావ్యంలో ఒక స్త్రీ బహుభార్యాత్వపుసంస్కృతిని నిరసించే విధంగా ఎటువంటి విప్లవాత్మకచైతన్యం తెచ్చుకుంటుందో పితృస్వామ్యానికి రుచిచూపించాలనుకొంది. దానికోసం వైకుంఠంలోని లక్ష్మీహరులను భూలోకపుపాత్రలుగా చేసుకొని వారి మధ్యవిభేదాన్ని సృష్టించటానికే భృగుముని అనే పాత్రకు కొత్తభావనను జోడించి సృష్టించింది. అందుకే ఈ భృగుముని వేరు. పురాణాలలో భృగువు వేఱు. ఈ భృగువు భూలోకమందలి పూజార్హతకై హరిని తన్నినా ఆతడు సహించి ఊర్కొనటం లక్ష్మికి కోపకారణం అయింది. భర్త తనహృదయంలో భార్యను పెట్టుకొని చూడటం అంటే పరస్పరం ఒకరికొకరుగా మానసికంగా నమ్మకంతో ఉండటం.

అప్పుడే స్త్రీకి గౌరవప్రదమైన జీవితం ఉంటుందనేది తరతరాల కుటుంబస్త్రీల సామాజికదృక్పథం. ఆ ముని హరియొక్క హృదయాన్ని తన్నటం అంటే ఆ స్థానంలో ఉండే తనని ఆ ముని తనని అవమానించినట్లుగా లక్ష్మి భావించటమే కాక, భర్తకూడా దాన్ని ఆమోదించటం భార్యయొక్క ఆత్మగౌరవానికి భంగకరమైన విషయంగా భావించింది లక్ష్మి. సామాజిక కుటుంబాలలో యిలాంటివి జరుగుతూనే ఉంటాయి. అత్తవారింట్లో అందరూ అవమానిస్తున్నా, భర్త పట్టించుకోకపోతే స్త్రీలకు కలిగేకోపం ఇలాంటిదే. భృగువు చేసినపనిని తాను ఖండించినా హరి దాన్ని తప్పుపట్టకపోయేసరికి లక్ష్మి తన భర్తయైన హరిని, వైకుంఠాన్ని వదిలి భూలోకంలోని కొల్లాపురానికి (మహారాష్ట్ర ప్రాంతమై ఉండవచ్చు.) వచ్చి అక్కడ తపస్సుచేసుకుంటుంది. అలావచ్చేటప్పుడు భర్త తనని అనుమానించకుండా ఉండేందుకు తాను హరిని హృదయంలో పెట్టుకొని తపస్సుచేసుకోవటానికి వెడుతున్నట్టు చెపుతుంది. అంటే లక్ష్మి తాను అన్యపురుషాసక్తితో భర్తను వదిలి వెళ్ళలేదని తెలియచెప్పటమే. ఏ పురాణగాథలలోను లక్ష్మి హరిని వదిలిపెట్టి వెళ్ళటం కనపడదు. ఇదంతా వేంకమాంబ కల్పనయే. కావ్యంలో పైకి మునిశాపం కారణంగా కన్పడినా, వైకుంఠంలో హరి భూదేవి, నీళలతోకూడి ఉన్నట్టు ఉంది (4–139). కాని బహుభార్యాత్వం ఉన్నచోట లక్ష్మి తనకు ఆత్మగౌరవం ఉండదనే స్థితిలో అప్పటికే ఆమె మనసు ఉండటంతో, ముని చేసిన పనిని అవకాశంగా తీసుకొని లక్ష్మి హరినుండి విడిపోవాలనుకొందా అని అనిపించకమానదు. ఏ లోకంలో అయినా

భార్య అలా వెళ్ళిపోవటమనేది, పితృస్వామ్యకుటుంబ వ్యతిరేకసంస్కృతి. పితృస్వామ్యపు పుట్టకీళ్ళు కదిలే విషయం. భార్యకుటుంబాన్ని వదిలిపెట్టి వెళ్ళిందంటే భర్తయొక్క పురుషాధిక్యతకు మాయనిమచ్చ. అవమానంకూడా.

బహుభార్యాత్వపుసంస్కృతికి ఆటపట్టువైన పితృస్వామ్యంలో భర్తగాబట్టి హరిలోకవిడంబనార్థం శ్రీనివాసుడి రూపంలో పద్మావతిని మరొక పెళ్లిచేసుకొంటాడు. అందుకే శ్రీనివాసునిరూపంలో ఉన్న హరి లక్ష్మితో తాను లోకవిడంబనార్థంబుగనీ ప్రయత్నంబు నేడు కాలకర్మానుగుణంబుగఁగల్గె (5-129) అని లోకరీతితో (పితృస్వామ్యపు బహుభార్యాత్వపు సంస్కృతి యిచ్చిన వెసులుబాటు) తనని తాను సమర్థించుకుంటూ లక్ష్మియొక్క సానుభూతిని పొంది ఆమెను ధనాన్ని అడగాలనుకొంటాడు. హరి తనకు ధనంకావాల్సి వచ్చి స్వప్రయోజనార్థం తిరిగి ధనానికి మూలమైన లక్ష్మిని రమ్మన్నాకూడా వ్యక్తిత్వంగల స్త్రీగా లక్ష్మి, లోకాన్నికూడా పట్టించుకోవాల్సిన అవసరంలేదనే స్పృహతో, వ్యూహలక్ష్మిని సృష్టించి ఆమెను హరి తీసికెళ్ళేటట్టుచేసింది, కాని లక్ష్మిమాత్రం భర్తదగ్గరకు తిరిగి వెళ్ళలేదని, ఆమెయే వీరలక్ష్మిగా, అలిమేలుమంగగా ప్రసిద్ధిపొంది ప్రజలచేత పూజలు చేయించుకోబడిందని కవయిత్రి తెలియచేసింది. ఈ విషయంలో పితృస్వామ్యపు ఆగ్రహానికి అడ్డుకట్టవేసే ఉద్దేశ్యంతో పద్మావతి విషయంలో ఆమెకు రామాయణంలోని మాయాసీత అని ఒక పూర్వజన్మను కల్పించి ఆమె లక్ష్మీదేవియొక్క అంశగా చెప్పటం జరిగింది. 18 వ శతాబ్దపు ఉత్తరార్థానికే వివాహసంస్కృతిని వ్యతిరేకించే చైతన్యాన్ని స్త్రీ దేవతాపరంగా ప్రతిపాదించి, తరిగొండ వేంకమాంబ రాయటం ఆశ్చర్యమనిపించక మానదు. అంతేకాదు స్త్రీకి సంపద ఉంటే పురుషుడే స్త్రీమీద ఆధారపడేటట్లు ఉంటుందని తెలియజేసింది.

లక్ష్మిపాత్ర విషయంలోనే తరిగొండ వేంకమాంబ విప్లవాత్మక వైవాహికసంస్కృతిని నిక్షిప్తంచేసింది. నిజలక్ష్మిపాత్ర మాత్రం ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని భావించి ఆతనితో కాపురంచేయటం యిష్టంలేక పద్మతీరానికి వచ్చి తపసుచేసుకుంటుంటే, ఆమెను ప్రజలు వీరలక్ష్మిగా పూజిస్తుంటారు. దాన్ని తెలిసికొన్న హరివచ్చి ఆ వీరలక్ష్మిని రమ్మనమని అడుగగా, ఆమె ఆత్మలో నిన్నుచూసుకుంటూ అక్కడే ఉంటానంటుందిగాని హరితో వెళ్ళదు. చేసేది లేక శ్రీనివాసుని రూపంలో ఉన్న హరి వెళ్ళిపోతాడు. అయితే బలరామకృష్ణులకు అక్కడ అంతకు మునుపే శుకుడు ఆవాసం కలిగించటంతో, అక్కడే ఉన్న బలరాముడు అదే ప్రదేశంలో వీరలక్ష్మిని ప్రజలు అర్చిస్తున్నందుకు పరకాంతయగు లక్ష్మి హరిచెంతఁ జేరియుండక యిందుఁజేరియున్నప్పుడు నేనిచ్చట నిల్చియుండుట నీతికాదు (6-200) అని పరసతివేడ్కగనిప్పుడు దానిందు నిలిచెనింపుతలిర్పన్ (6-201) అని బలరాముడు అంటూ లక్ష్మి భర్తను వదిలి ఒంటరిగా ఉండగలిగి వీరలక్ష్మిగా ప్రసిద్ధిచెందినది కావున నేనిందు నిలువ వెఱతునని (6-205,) బలరాముడు అంటాడు.

ఇక్కడ బలరాముడు ఆమెను వదిలి వెళ్ళాలనుకోవటమంటే ఆమెను వెలివేయటమనే భావనయే. అంతేకాక ఒకసారి భర్తని వదిలిన స్త్రీని తిరిగి ఆదరించకూడదనే సామాజిక భావనను ప్రతిబింబించేవిధంగా బలరాముడు అన్నట్టు పితృస్వామ్య భావజాలాన్ని కవయిత్రి తేటతెల్లంచేసింది. అయినా, లక్ష్మికి తెలియకుండా హరి మరొక పెళ్ళిచేసుకొన్నందుకు, భర్తదగ్గరకు వెళ్ళాల్సిన అవసరంలేదంటూ లోకానికి వెరవాల్సిన పనిలేదంటూ వీరలక్ష్మిని తీర్చిదిద్దటంలోనే కవయిత్రి వీరచైతన్యంతో ఆర్థికస్థోమతగల స్త్రీలు తమ వ్యక్తిత్వపు ఆత్మగౌరవాలను నిలబెట్టుకొనే మార్గమని భావించింది. దీనినే బహుభార్యాత్వపు కుటుంబసంస్కృతిలో స్త్రీలు సవతులతో గొడవపడకుండా ఉండే పరిష్కారంగా చూపించి తరిగొండ వేంకమాంబ తన క్రాంతదర్శనంతో భవిష్యత్తులోని ప్రజాస్వామ్యంలో విడాకుల చట్టానికి బాటలు వేసిందని అర్థమౌతుంది. ఇక్కడ బహుభార్యత్వపు సంస్కృతిపట్ల స్త్రీలు తెచ్చుకోవలసిన విప్లవాత్మకచైతన్యాన్ని తెలియచేస్తూ 'తిరుమల' అనే ఆధ్యాత్మిక క్షేత్రంచుట్టూ తరిగొండ వేంకమాంబ అల్లిన కథయే వేంకటాచలమహాత్మ్యమనే కావ్యం. ఆధ్యాత్మికవిషయంలో అంతర్గత సామాజిక స్పృహను కలిగించినది తరిగొండ వేంకమాంబ. ఆ తర్వాత ఆ వీరలక్ష్మియే అలివేలుమంగగా ప్రసిద్ధిపొందినట్లు (6-248) వేంకమాంబ పేర్కొంది. అంటే భర్తను వదిలి విడిగా జీవిస్తున్నా, ఆ స్త్రీ సమాజంలో గౌరవింపబడుతుందని కవయిత్రి తెలియజేయటమే.

పద్మావతి శ్రీనివాసుల కథను 'వింతలుమెరియగ తాను కల్పించినట్లు' తరిగొండ వేంకమాంబ పేర్కొనటంలో విచిత్రచైతన్యపు వింతజ్ఞానం ప్రకాశించటమే. ఓనమాలైనా నేర్వనితాను ఈ కావ్యాన్ని రాయటమంటే అది శ్రీనివాసుని దయ అనిచెపుతూనే, 'నాస్వతంత్రతకిల బుధుల్నవ్విపోరె' అని (1-20) అనటంలోని ఔచిత్యాన్ని ఆలోచిస్తే తరిగొండ వేంకమాంబ ప్రజలు దైవంగా భావింపబడే వేంకటేశ్వరుని చుట్టూ సామాజికకుటుంబసంస్కృతిని వ్యతిరేకించే సామాజికస్పృహతో కథావస్తువును స్వతంత్రంగా అల్లి రాయాలనుకోవటం జరిగిందనీ, దానిని పండితులు ఒప్పుకోకపోవచ్చని ఆమె భావించినట్లు అర్థమౌతుంది. భక్తి భావంతో చదవటానికి ఉద్యుక్తులయ్యేవారు కుటుంబవ్యవస్థలో భర్తలు బహుభార్యాత్వాన్ని పాటించాలనుకొంటే భార్యలు తమనుండి విడిపోయి బతకగలరననే జ్ఞానాన్ని అందిస్తూ హెచ్చరిక చేసినట్లుభావించాలి. పురాణపాత్రయైన లక్ష్మికి కుటుంబ వ్యతిరేక చైతన్యాన్ని నిక్షేపిస్తూ రాయటమంటే సమాజంలో దానిని ఒకనమూనాగా చూపిస్తూ స్త్రీలు బహుభార్యాత్వపు సంస్కృతికి లొంగి ఉంటూ సవతియైన మరొకస్త్రీని దుర్భాషలు ఆడటం కంటేకూడా, అటువంటి భర్తను వదిలిపెట్టి విడిగా ఉంటే ఆత్మగౌరవచైతన్యాన్ని తెచ్చుకోవాల్సిన అవసరాన్ని తెలియజేసింది. దానికై ముందుగా స్త్రీలు ధనలక్ష్మివలె, ఆర్థికస్వావలంబనను పొందాలని పితృస్వామ్యసామాజిక కుటుంబ స్త్రీలలో అస్తిత్వగౌరవచైతన్యాన్ని నింపటానికి కవయిత్రి సాహిత్యపరంగా చేసిన ప్రయత్నమిది అని అర్థమౌతుంది.

ఇక చివరగా క్రీ.శ. 1830 సం.లో దార్ల సుందరమ్మ రాసిన భావలింగశతకాన్ని చెప్పుకోవాలి. ఇందులో సామాజికసంబంధాలలో మానవులు మాటకున్నవిలువను గ్రహించవలసిన వేదాంతజ్ఞానాన్ని తెలియచేస్తూ, తాను సూటిగా చూసినట్టి సత్యాన్ని యింపుగా రాస్తున్నానంటూ 'గొప్పకులముగాదు, గొప్పద్రవ్యముగాదు, కోటియేల మాటనిల్పెనేని మాదిగైననుగొప్ప (ప.44) అని 'మాటనిలుపువాడు మాలవాడైనను గొప్పవాడు' అని అంటుంది. అంటే గుణాన్ని పట్టి మనిషివిలువ ఉంటుందికాని కులాన్నిపట్టి కాదనే స్పృహను, సాంఘికన్యాయచైతన్యాన్ని కలిగించాలనే కవయిత్రి చైతన్యం రచనలో అర్థమౌతుంది. అందుకే ఆమెను మహిళావేమనగా కీర్తించాలి.

ప్రాచీన తెలుగుసాహిత్యంలో సామాజిక కుటుంబాలలోని స్త్రీపురుషలైంగికసంబంధాలనే సంక్లిష్టవలయం స్త్రీలసమస్యలన్నంటికి కారణం అనే స్పృహను పొందిన స్త్రీలు సంఘర్షణలకు లోనై కుటుంబపరిధిలోనే వాటిని అధిగమించే చైతన్యాన్ని అభివృద్ధిచేసుకొన్నారని, ఒంటరిగానైనా చేసిన పోరాటంలో వారు నిశ్శబ్దంగాను, వ్యక్తిగతంగాను తెచ్చుకొన్న చైతన్యం స్పష్టమైంది. 13 వ శతాబ్దంలో రాణిరుద్రమ పరిపాలనలో సామాజికచలనసూత్రాలు పరిణామానికి గురియైనప్పుడు స్త్రీపరాక్రమశక్తి – చైతన్యంగా ప్రారంభమై, పరిణతిపొంది క్రియాశీలతను సంతరించుకొని 18,19 శతాబ్దాలనాటికి పితృస్వామ్యపు కుటుంబసంస్కృతిని అధిగమించే వీరశక్తి చైతన్యంగా విస్తృతిని పొందిందని, స్త్రీలచైతన్యం పితృస్వామ్యపు పుట్టకీళ్ళను కదల్చాలనుకొందని అర్థమౌతుంది. సాహిత్య సామాజికప్రతిఫలనంలో భాగంగా కవయిత్రులచైతన్యంతోపాటు కవులుకూడా అప్రయత్నంగానే స్త్రీలను చిత్రించేటప్పుడు ఆయా చారిత్రక కాలాలనాటి స్త్రీలచైతన్యాన్ని ప్రతిఫలింపచేయటంతో ప్రాచీనసాహిత్యంలోని స్త్రీలచైతన్యం గురించిన ఆనవాళ్ళను అర్థంచేసుకోవచ్చు. ఆనాటి స్త్రీల సాంస్కృతిక – చైతన్యమే ఆధునికయుగంలో ప్రజాస్వామిక సామాజిక, సామూహిక స్త్రీలచైతన్యానికి అడుగుజాడల ముద్రలను వేయగలిగిందని అర్థమౌతుంది.

2. ఆధునికయుగం - జాతీయోద్యమకాలంలో తెలుగు సాహిత్యం - మహిళల వ్యక్తిస్వాతంత్ర్య చైతన్యం

ఆధునికయుగ ప్రారంభంలో బ్రిటిష్ వారి పాలననుండి భారతదేశపు విముక్తికై సాగించిన స్వాతంత్ర్యపోరాటం ప్రథమంగా సంఘసంస్కరణోద్యమంగా మొదలైంది. బ్రిటిష్ వారు భారతదేశంలో తమ పాలనాసౌలభ్యంకోసం ఆంగ్లభాషను నేర్పటానికి విద్యాసంస్థలను నెలకొల్పటంతో, అక్కడ చదువుకున్న పురుషులకు విదేశీసాహిత్యంతో పరిచయం కలిగి దేశాభివృద్ధికై సంఘసంస్కరణ అవసరమని భావించారు. భారతీయులకు పరిపాలనాదక్షత లేదని భావించి బ్రిటిష్ వారికి చెంపపెట్టుగా, రాజకీయ స్వాతంత్ర్య ఫలితాలను అనుభవించటానికి ముందే సాంఘిక, విద్యాసంస్కరణలతో ప్రజలందరూ సమానంగా అభివృద్ధిచెందటం ముఖ్యమనే భావన పెరగటంతో సంఘసంస్కరణయే జాతీయచిహ్నమైంది. ఆ క్రమంలోనే భారతదేశంలో సంస్కరణోద్యమం ప్రారంభమై, దానిలో భాగంగా స్త్రీవిద్యకు ప్రాధాన్యత పెరిగింది. 1858లో భారతదేశంలో బ్రిటిష్ పరిపాలనా పటిష్ఠతకై పగ్గాలను చేపట్టిన విక్టోరియారాణి భారతదేశంలో తమ పాలనకు, పారిశ్రామిక ఉత్పత్తుల అభివృద్ధికీ, భారతీయపురుషుల సహకారం అవసరమని భావించింది. ఆ క్రమంలో గృహనిర్వహణ బాధ్యతకై స్త్రీలకు సామాజిక సంబంధాలు అనివార్యమయ్యాయి. దానికై స్త్రీలకు కొంత జ్ఞానం, వ్యక్తి స్వాతంత్ర్యం అవసరమనే ఉద్దేశ్యంతో భారతదేశంలో బాలికల పాఠశాలలను ప్రారంభించటం జరిగింది. అదే సమయంలో దేశాభ్యుదయానికి స్త్రీల అభివృద్ధికి ఉన్న లంకెపై అవగాహన ఏర్పడిన సంఘసంస్కర్తలు స్త్రీవిద్యాప్రచారానికి పూనుకొన్నారు.

క్రీ.శ. 1900 సం. నాటికి భారతదేశ స్వాతంత్ర్యోద్యమంలో ప్రథమంగా సంఘసంస్కరణలను చేపట్టిన క్రమంలో జాతీయోద్యమానికి స్త్రీవిద్యావశ్యకత భూమిక కాగలిగింది. సమాజంలో స్త్రీలు కుటుంబ బానిసత్వం నుండి విముక్తి కావటానికి ముందుగా వారికి విద్య అవసరం అని, అప్పుడే వారి ఆలోచనలు విస్తృతమవుతాయని భావించిన సంఘసంస్కర్తలు ముందుగా స్త్రీలలో సాంఘిక-సాంస్కృతిక చైతన్యాన్ని కలిగించాల్సిన అవసరాన్ని గుర్తించారు.

ఆంధ్రప్రాంతంలో కందుకూరి వీరేశలింగం కుటుంబస్త్రీలను కష్టాలకు గురిచేస్తున్న సాంఘికదురాచారాల నిర్మూలన జరగాల్సిన అవసరాన్ని చెప్తుతూ "ఇంటనుండు స్త్రీల కష్టములను నివారింపలేనివారము రాజ్యాంగ స్వాతంత్ర్యములను పొంది దేశముయొక్క కష్టములనెట్లు నివారింప గలుగుదము" అని చెప్పాడు. విద్యావంతులైన ప్రజలే మిగిలినవారిని విద్యావంతులను చేయగలిగేటట్లుగా స్వీయసంస్కరణ మార్గాలలోనే స్త్రీల అభివృద్ధిని కోరుకొన్నారు. భారతదేశ రాజకీయస్వాతంత్ర్యంకంటే ముందు స్త్రీల సాంఘికస్వాతంత్ర్యం ముఖ్యమని, దానికోసం స్త్రీవిద్యాభివృద్ధి జరగాలని, అదే దేశాభ్యున్నతికి దారితీసి దేశస్వాతంత్ర్యానికి దోహదం కాగలుగుతుందని భావించాడు. దానికై 1874 సం.లో కందుకూరి వీరేశలింగం రాజమండ్రిలో మొదటి బాలికాపాఠశాలను నెలకొల్పాడు. 'స్వరాజ్యం నా జన్మ హక్కు' అని చాటిన బాలగంగాధర తిలక్ కూడా క్రీ.శ.1890 సం.లో 'పెళ్ళి' అనేది దురాచారంగా ఉండకూడదనీ, బాల్యవివాహాలు ఆచరణయోగ్యంకాదని, స్త్రీవిద్య ఉండాలనీ, ఈ విషయాలను బ్రిటిష్ వారిచేత చెప్పించుకోవటం భారతీయుల ఆత్మగౌరవానికి భంగకరమనీ, స్వీయసంస్కరణలు అవసరమని భావించాడు.

సామాజిక ఆంక్షలు తగ్గితేగాని స్త్రీలు విద్యావంతులు కాలేరని భావించిన కందుకూరి తన ఉపన్యాసాలతోపాటు, పత్రికాముఖ వ్యాసాలద్వారా సమాజాన్ని చైతన్యపరచాలనుకొన్నాడు. భారతీయుల మూఢత్వానికి కారణం కుటుంబవ్యవస్థ అనీ, స్త్రీలు పురుషులకు విధేయులై ఉండాలని, వారు స్వంతంత్రులుగా ఉండకూడదనే భావాలను వ్యక్తంచేయటమే స్త్రీలను హీనస్థితిలో ఉంచటానికి కారణమని తెలిపాడు. పురుషులలోని భయాలను పోగొడుతూ, స్త్రీలకు చదువువల్ల వచ్చే జ్ఞానంతో వారు భర్తలకు మంచి సలహాలను యిస్తారని, కుటుంబాన్ని మితవ్యయంతో సమర్థవంతంగా నిర్వహించగలరని (న.1880.వివేకవర్ధని), కుటుంబంలోని వ్యక్తులతో సత్సంబంధాలలో ఉంటారని తెలియజేసాడు. నీతిమంతంగా మెలుగుతారనీ, బిడ్డలను చదివించి సత్ప్రవర్తనులుగా పెంచుతారని (సె.1892సం.సత్యసంవర్ధని) చెప్పాడు. కుటుంబవ్యవస్థకు మూలమైన వివాహసంస్కృతిని సంస్కరించటం (సె.1894,.చింతామణి) అవసరమని భావించి, ఆ దిశగా ప్రజలను చైతన్యపరచాలనుకొన్నాడు.

బాల్యవివాహాలవల్ల పన్నెండేళ్ళకే కాపురానికి పంపటంతో (అ.1894 సత్యసంవర్ధని) బాలికల చదువు కుంటుపడేది. అందుకని బాల్యవివాహాలను నిషేధించకపోతే స్త్రీవిద్యాభివృద్ధి జరగదని గుర్తించాడు. పూర్వకాలం హిందూదేశంలో హానికరమైన బాల్యవివాహాలు ఉండేవికావని, రజస్వలానంతర వివాహాలు పూర్వం జరిగేవని, దానికోసం శాస్త్రప్రమాణాలను పేర్కొన్నాడు.

యుక్తవయసు వచ్చిన తరువాత స్త్రీ పురుషుని వివాహం చేసుకున్నట్టును, పురుషుడుకూడా యుక్తవయసు వచ్చిన తరువాత యువతిని పెళ్ళాడినట్లు చెప్పిన శ్లోకాలను పరాశరస్మృతినుండి, బోధాయన సూత్రాలనుండి ప్రమాణాలను (న. 1895 సత్యసంవర్ధని) పేర్కొని, రజస్వలానంతరం మూడేళ్లుదాటిన తరువాతనే వివాహాలు చేసినట్టు ప్రమాణాలను ఉదాహరించాడు.

స్త్రీలు విద్యద్వారా లోకజ్ఞానాన్ని పొందగలుగుతారని, కుటుంబనిర్వహణ సమర్థవంతంగా చేయగలరని, (ఆ. 1897 సత్యసంవర్ధని) తెలిపాడు. కాని స్త్రీలు విద్యావంతులైతే చెడిపోతారని, తమమాటను వినరని, స్వతంత్రులవుతారనే భయంతో పురుషులు తమస్త్రీలు ఉద్యోగాలు చేయాలా, ఊళ్ళేలా అని, ప్రశ్నిస్తూనే స్త్రీలచదువు విటులకు ఉత్తరాలు రాయటానికా అనే పరిహాసాన్ని వ్యక్తంచేస్తున్నారని (అ. 1897సం. సత్యసంవర్ధని) తెలిపాడు. తీరికసమయాలలో స్త్రీలు సద్గ్రంపఠనంతో(న. వివేకవర్ధని) ఔషధసేవను తెలుసుకొని కుటుంబవ్యక్తుల ఆరోగ్యాన్ని సంరక్షించగలరనీ, స్త్రీలు ప్రసవాలను (అ. 1897సం. సత్యసంవర్ధని) చేయగలుగుతారని, స్త్రీలను గౌరవించి వారి స్వాతంత్ర్యాన్ని పాటించి, ఆదరించడమే నాగరికత (డి. 1898సం. సత్యసంవర్ధని) అని చెప్పాడు. స్త్రీలు స్వతంత్రులయితేనే పురుషులతోపాటు వారికీ గౌరవస్థానం ఉంటుందని తెలియచేస్తూ, కందుకూరి తన వ్యాసాలద్వారా ప్రజలను చైతన్యపరిచాడు. స్త్రీవిద్య, స్త్రీలస్వాతంత్ర్యం, స్త్రీలగౌరవం (డి. 1896సం. సత్యసంవర్ధని) అనే పదాలను పేర్కొని కందుకూరి వీరేశలింగంగారు ఆధునికయుగంలో కాలక్రమేణ ఆచరణ సాధ్యంచేయటానికి మార్గదర్శకత్వాన్ని వహించాడు. అంతేకాదు, తాను రాసిన 'రాజశేఖర చరిత్రం' అనే నవలలో స్త్రీలు చదువుకోగలిగితే కుటుంబాలను చక్కపెట్టగల ధైర్యసాహసాలను పెంచుకోగలరని నిరూపించాడు. 'ఆఁడుమళయాలం' అనే గ్రంథంలో కందుకూరి స్త్రీలకు సాధికార చైతన్యం వస్తే పితృస్వామ్యం ఎలా తలకిందులవుతుందో తెలియజేసి పురుషాహంకారానికి సంకెళ్ళువేయాలనుకొన్నాడు.

గురజాడ అప్పారావు 'దిద్దుబాటు' అనే కథలో భార్య చదువుకుంటే భర్త ప్రవర్తనను కూడా సరిచేసుకోగలదనే స్పృహను కలిగించాడు. అంతేకాదు, గురజాడ తన 'ముత్యాలసరాలు' అనే కవితలో బాల్యవివాహసంస్కృతి, దాని పరిణామాలపట్ల ప్రజలలో అవగాహన కలిగించాడు. పుత్తడిబొమ్మ 'పూర్ణమ్మ' వంటివారి ఆత్మ బలిదానాలను నలుగురు కూర్చొని నవ్వుకొనే వేళ గుర్తుచేసుకోవలసిన అవసరాన్ని తెలిపాడు. ముఖ్యంగా కుటుంబస్త్రీలకు బాల్యసంస్కృతిపట్ల స్పందించి మాట్లాడే స్వేచ్ఛలేకపోవటంతో మనసులోనే కుమిలిపోయే స్త్రీలను 'కన్యాశుల్కమ'నే నాటకంలో చూపిస్తూనే, మరొకపక్కన ఎటువంటి కుటుంబ ఆంక్షలులేని మధురవాణి వంటి పాత్రద్వారా నాడు

బాల్యవివాహాలను అరికట్టగలిగే వీలున్న ప్రత్యామ్నాయ పరిష్కారాలను సూచించాడు.

వీరికి సమకాలీనుడైన చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు

"చదువ న్నేర్తురు పూరుషుల్ బలెను శాస్త్రంబున్ పఠింపించుచో
చదువన్నేర్తురు శత్రుసేనల ధనుర్వ్యాపారముల్ నేర్చుచో
ముదితోత్సాహముతోడ నేలగలరీ యుర్విన్ ప్రతిష్ఠించుచో
ముదితల్ నేర్వగరాని విద్యగలదె ముద్దార నేర్పించినన్"

అని స్త్రీలను చదివిస్తే వారు అన్ని విద్యలను నేర్చుకోగలరని భావించాడు.

సంఘసంస్కర్తలు కలగజేసిన చైతన్యాన్ని విలువైనదిగా భావించటంతో స్త్రీల విద్య, స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యం, స్త్రీల ఉనికికి గౌరవం ఉండాల్సిన అవసరాన్ని గుర్తించిన కొంతమంది స్త్రీలు విద్యను అభ్యసించారు. ఒకరిద్దరికంటె ఉన్నతవిద్యావంతులు లేని సమాజస్థితిలో స్త్రీలు తాము నేర్చిన ప్రాథమిక విద్యతోనే తోటిస్త్రీలందరూ విద్యావంతులు కావాలనే ఆశయంతో స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్య సాధనకై అవసరమైన స్త్రీవిద్యాఉద్యమానికి స్త్రీసమాజాలద్వారాను, సృజనసాహిత్యం ద్వారాను పాదులువేసారు. స్త్రీలఅభివృద్ధికై స్వీయానుభూతిని జోడించి స్త్రీలకోసం స్త్రీలు రాసిన స్త్రీవిద్యా ఉద్యమసాహిత్యానికి ప్రాధాన్యత ఉంటుంది. అయితే పురుష రచయితలు తమ సృజనసాహిత్యంలో స్త్రీవిద్యకు అంతగా ప్రాధాన్యతనిచ్చిన సందర్భాలు తక్కువ. అందుకే స్త్రీలవిద్యాభివృద్ధికి సంబంధించిన విషయాలకోసం స్త్రీలు రాసిన సాహిత్యాన్నే ఎక్కువగా ఉటంకించటం జరిగింది. స్త్రీవిద్యాఉద్యమ ప్రారంభవికాసాలు, దాని ఫలితాలను తెలుసుకోవటానికి ఆనాటి స్త్రీలు రాసిన ఉద్యమసాహిత్యాన్ని పరిశీలించాలి. సాహిత్యం ప్రధాన ప్రచారసాధనం కాబట్టి కాస్త విద్యావంతులైన స్త్రీలు సాహిత్యసృజన చేయటం జరిగింది. అందుకే 20 శతాబ్దం ప్రారంభంలో ఆరంభమైన స్త్రీవిద్యాఉద్యమాన్ని తెలుసుకోవటానికి ఆనాటి స్త్రీలసాహిత్యసృజనయే ముఖ్యాధారమైంది. స్త్రీలు వ్యాసాలు, కథలు, నాటికలు, కవిత్వం, పాటలు, లేఖలు వంటి సాహిత్యప్రక్రియలద్వారా నాటి స్త్రీలలో విద్యాచైతన్యాన్ని కలిగించారు. కాబట్టి 20 శతాబ్దప్రారంభంలో వచ్చిన స్త్రీలసాహిత్యాన్ని సవివరంగా తెలుసుకోవాలి.

2.1 స్త్రీలసాహిత్యం - స్త్రీవిద్యాఉద్యమ ఆరంభ వికాసాలు

స్త్రీలకు విద్యవలన సాంఘికవికాసం కలుగుతుందనే సంఘసంస్కర్తల భావనతో భారతదేశంలో బాలికాపాఠశాలలను ఏర్పడ్డాయి. కాని ఆ పాఠశాలలకు ఆడపిల్లలను పంపటానికి నాటి తల్లిదండ్రులు అంతగా యిష్టపడలేదు. బాల్యవివాహాలను చేసి ఆడపిల్లల బరువును వదిలించుకునే రోజులవి. స్త్రీలు విద్యావంతులవటానికి బాల్యవివాహాలు ప్రధాన అవరోధమని భావించటంతో ముందుగా

వాటిని రూపుమాపాలనుకున్నారు. ఆ క్రమంలోనే స్త్రీలు తమ విద్యాభివృద్ధికోసం తామే పాటుపడాలనీ, దానికోసం బాల్యవివాహాలను నిషేధించాలనీ, పల్లెల్లోకూడా బాలికాపాఠశాలలు ఉంటేతప్ప ఆడపిల్లలు చదువుకోలేరని గ్రహించారు. స్త్రీవిద్యను గురించిన ఆలోచనలను స్త్రీలు పెంచుకోవటం, తోటిస్త్రీలలో చైతన్యాన్ని కలిగించటం, స్త్రీవిద్యకు కార్యాచరణను రూపొందించుకోవటంతోపాటు క్రియాశీలత్వాన్ని పొందటానికై స్త్రీవిద్యకు ఉద్యమస్థాయి ప్రచారం అవసరమైంది. స్త్రీవిద్యాఉద్యమానికి ఒక సామాజికచరిత్ర ఉంది. ఇది స్త్రీలయొక్క సమాజసంబంధాలలోనుండి పుట్టుకొచ్చిన ఉద్యమసాహిత్యం. స్త్రీల సర్వతోముఖాభివృద్ధికై స్త్రీవిద్యాప్రయోజనాలను ఆశించి స్త్రీలు చేసిన ముమ్మరప్రయత్నమే స్త్రీవిద్యాఉద్యమం. కందుకూరివంటివారు సభలలో ఉపన్యాసాలు ఇస్తున్నా వాటికి స్త్రీలు వెళ్ళటం అరుదు. పత్రికాముఖప్రచారం చేసినా అక్షరాస్యతలేని స్త్రీలు చదువుకోలేరు. స్త్రీవిద్య అంటేనే గిట్టని మగవారు ఇంట్లో స్త్రీవిద్యను గురించి ప్రస్తావించే అవకాశంలేదు.

స్త్రీలకు సామాజిక, సామూహికసంబంధాలు లేకపోయినా, కరెంటు, రవాణాసౌకర్యం, వైజ్ఞానిక పరికరాలు లేని రోజులు అయినప్పటికి, పల్లెల్లో స్త్రీలు తమ విద్యాఉద్యమాన్ని ఆరంభించాలను కొన్నారు. దాన్ని తీవ్రంగా ఆచరణలో పెట్టటానికై యింటిబడిలోగాని, వీధిబడిలోగాని రాయటం, చదవటం నేర్చుకున్న స్త్రీలు ముందుకువచ్చి తోటిస్త్రీలలో స్త్రీవిద్యనుగురించిన స్పృహను, చైతన్యాన్ని కలిగించాలనుకొన్నారు. స్త్రీలు చదువుకుంటే తమ బానిసత్వాన్ని తెలుసుకుంటూ, స్వతంత్రంగా జీవించే వ్యక్తిత్వాలను ఏర్పరచుకోగలరని భావించారు. అందుకనే క్రమక్రమంగా స్త్రీలు ప్రాపంచికజ్ఞానాన్ని, శాస్త్రజ్ఞానాన్ని పొందటానికై స్త్రీవిద్యాభివృద్ధి ప్రణాళికలను రూపొందించుకుంటూ సాహిత్యంద్వారా ప్రచారంచేసారు. దానికోసం ముందుగా స్త్రీలందరూ వారానికి ఒకసారి ఒకయింటిలో సమావేశమయి, స్త్రీల సమస్యలను చర్చించుకుంటూ, స్త్రీవిద్యాప్రాధాన్యతను గుర్తించగలిగేవిధంగా తోటిస్త్రీలలో చైతన్యాన్ని కలిగించగలిగే సమావేశాలను ఏర్పాటుచేసుకోవటం మొదలుపెట్టారు. అవే స్త్రీసమాజాలుగా గుర్తింపబడ్డాయి. చిన్నచిన్నసభలుపెట్టి ఉపన్యాసాలను ఇవ్వటం మెదలుపెట్టారు. స్త్రీలకోసం విస్తృతప్రచారానికై స్త్రీలే పత్రికలను నిర్వహించాలనుకొన్నారు. మాడభూషి చూడమ్మ, బాలాంత్రపు శేషమ్మ, మొసలిగంటి రామాబాయమ్మ వంటి వారు 'హిందూసుందరి' పత్రికకు సంపాదకులుగా ఉంటే, పులుగుర్తి లక్ష్మీనరసమ్మ 'సావిత్రి' అనే పత్రికను, కళ్ళేపల్లి వెంకటరమణమ్మ ఆంధ్రలక్ష్మి అనే పత్రికను, వింజమూరి వెంకటరత్నమ్మ 'అనసూయ' పత్రికను చిల్లరిగె రమణమ్మ 'వివేకవతి' వంటి పత్రికలను స్వీయ ఆధ్వర్యంలో ప్రారంభించి నిర్వహించారు. స్త్రీల విద్యాభివృద్ధికై స్త్రీలుచేసిన ఉపన్యాసాలను మిగిలినవారు తెలుసుకోవటానికై

ఆయా ఉపన్యాసాలను ప్రచురించటం, వ్యాసాలను, కథలను, నాటకాలను, కవితలను వ్రాసి స్త్రీలు విద్యావంతులు కావటానికి వారిలో సాంఘిక–సాంస్కృతిక చైతన్యం కలిగించాలనుకొన్నారు. సాహిత్యంద్వారా స్త్రీవిద్యాఉద్యమాన్ని పటిష్ఠంచేసారు. అందుకే దేశస్వాతంత్ర్యసాధనకు స్త్రీవిద్య ప్రధానవేదిక కాగలిగింది. ఆ తరవాత అనిబిసెంటు, ముత్తులక్ష్మి కలిసి 'స్త్రీధర్మ' అనే పత్రికను ప్రారంభించి స్త్రీలలో రాజకీయ చైతన్యాన్ని కలిగించారు.

స్త్రీలవిద్యాచైతన్యమే స్త్రీల అభివృద్ధికి సోపానపంక్తి. దాని శిఖరం స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యం–దేశస్వాతంత్ర్యం. జాతీయోద్యమ సమయంలో స్త్రీవిద్య–స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యం, స్త్రీలస్వాతంత్ర్యం–దేశస్వాతంత్ర్యం పరస్పరప్రచోదకాలు, పరస్పరాశ్రితాలు కాబట్టి స్త్రీవిద్యాఉద్యమచైతన్యం అత్యంత ఆవశ్యకమైన విషయంగా స్వాతంత్ర్యోద్యమకారులుకూడా భావించారు. స్త్రీవిద్యకు సంబంధించిన స్పృహను కలిగియుండటమే చైతన్యానికి ప్రధానలక్షణం. అది సామూహికత్వాన్నిపొంది, స్త్రీలవిద్యా ఉద్యమచైతన్యంగా తెలుగుసాహిత్య చరిత్రలో గుర్తింపును పొందింది. స్వాతంత్ర్యోద్యమ కాలంనాడు తెలుగులో ఆవిర్భవించిన స్త్రీలసాహిత్యంలో ఈ స్త్రీలవిద్యాఉద్యమ చైతన్యమే భారతదేశ స్వాతంత్ర్యోద్య మానికి దారితీసిందనీ, స్త్రీలు స్వతంత్రజీవనాన్ని గడపటానికి అవకాశం యివ్వగలిగే విధంగా లింగవివక్షారహితమైన భారతదేశరాజ్యాంగ రూపకల్పనకు దారితీసిందని అర్థమౌతుంది. అందుకే స్త్రీల విద్యాఉద్యమచైతన్యం ఒక ప్రాధాన్యతను సంతరించుకొంది. ఈ చైతన్యమే స్త్రీలలో సాంఘిక, ఆర్థిక రాజకీయచైతన్యాలకు బలమైన పునాదులను వేయగలిగిందని, ఆనాడు తెలుగుపత్రికలలో వచ్చిన స్త్రీలసాహిత్యం తేటతెల్లంచేసింది. కాలప్రవాహంలో మార్పుకు గురి అవుతున్న సామాజిక చలనసూత్రాలకు అనుగుణంగా అవసరంమేరకు స్త్రీలవిద్య పరిణామశీలతను సంతరించుకుంటూ నేటి ప్రపంచీకరణంవరకు కొనసాగుతూనే ఉంది. ఆధునికయుగ తెలుగుసాహిత్యంలో ప్రతిఫలించిన స్త్రీలచైతన్యవిన్యాసానికి పట్టుగొమ్మలవంటి స్త్రీలసాహిత్యపరిశీలన అవసరం. మధ్యయుగాల చరిత్రలో తెలుగులోని ప్రాచీనసాహిత్యంలో ప్రతిఫలించిన స్త్రీలచైతన్యం వ్యక్తిగతంగా ఉండి పితృస్వామ్యసంస్కృతి ఆచరణ ప్రధానాంశంగా ఉన్న కుటుంబ పరిధిలోనే ఉండటంతో, అంతగా గుర్తింపును పొందలేదు, కాని అది ఆధునికకాలంలో మార్పుకు గురిఅవుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయపరిణామ వ్యవస్థలో సామూహికత్వాన్ని సంతరించుకోవటంతో, స్త్రీలఉద్యమ చైతన్యానికి సామాజిక స్వభావం ఏర్పడింది. అందుకే ఆ చైతన్యపు పరిధి అన్ని రంగాలలో విస్తృతత్వాన్ని పొంది, బలంగా పటిష్ఠమై, ఆకాశమే హద్దుగా కొనసాగుతోంది. సామాజికవ్యక్తులు దానిని అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆధునికయుగంలోని స్త్రీలవిద్యాఉద్యమం ప్రారంభదశలోనే స్త్రీలను పత్రికారంగంలోకి అడుగుపెట్టేట్లు చేసి విస్తృతత్వాన్ని పొందింది. అది క్రమంగా పరిణామంచెందుతూ, ఉన్నతవిద్య, శాస్త్రసాంకేతికతను పుణికిపుచ్చుకొని, ఉపాధిమార్గాలను ఎన్నుకొంటూ స్త్రీపురుషసమానత్వంవైపు వడివడిగా పరుగులెత్తిందనే దానికి ఈ విస్తృత, విస్మృతమైన స్త్రీల ఉద్యమసాహిత్యమే నిదర్శనం. స్త్రీవిద్యా ఉద్యమమే సాంఘికస్వాతంత్ర్య స్వభావాన్ని సంతరించుకొని, ఆర్థిక, రాజకీయస్వాతంత్ర్యాల చైతన్యాన్ని పుంజుకోగలిగింది. స్త్రీపురుషసమానత్వ సంస్కృతికి ప్రధాన రహదారులను వేయగలిగింది. భారతదేశ స్వాతంత్ర్యానికి, భారతదేశాభివృద్ధికి దోహదకారియైన స్త్రీలచైతన్యంగా పరిణామాన్ని చెందిందని తెలుగుసాహిత్య పఠనంవల్ల అర్థమౌతుంది. నాటి స్త్రీలసాహిత్యపఠనం నేటికీ స్త్రీలు తెచ్చుకోవాల్సిన స్పృహను రగిలించి, ఆలోచనలను పెంచుకొనేటట్టు కదలికను పుట్టించి, ఉద్యమచైతన్యాన్ని అందుకునేటట్టు చేసింది. భారతదేశ స్వాతంత్ర్యసాధనకు ముందు వచ్చిన స్త్రీలసాహిత్యం నేటి స్త్రీవాదఉద్యమానికి ఉన్న బలమైన పునాదులను గుర్తుకుచేస్తుంది. అంతేకాదు తెలుగు సాహిత్యంలో ప్రతిఫలించిన స్త్రీవాదఉద్యమ ఫలితాలను అందుకోగలిగి ఆచరణలో పెట్టేటట్లు చేయగలుగుతుంది. అంతిమంగా సార్వజనీనకతను సంతరించుకుంటూ విశ్వవ్యాప్తం చేయ గలుగుతుంది.

క్రీ.శ.1900 సం.ల నాటికే స్త్రీవిద్యకు, స్త్రీలలోని శక్తియుక్తుల వెలికితీతకు స్త్రీలసాహిత్యం ద్వారా అడుగుజాడలు ఏర్పడ్డాయి. క్రీ.శ.1881-99 సం.ల మధ్యన జీవించిన వేమూరి(దాసు) శారదాంబ వ్రాసిన 'మాధవశతకం' లో కవయిత్రి చెప్పినట్లుగా 'స్త్రీజన వికాసాన్ని' కోరుకొన్న శతకం. దీనిని ఆధునిక కాలంలోని స్త్రీలసాహిత్యంలో మొదటిగ్రంథంగా చెప్పుకోవాలి. వేమూరి శారదాంబ 1896 సం.పు ప్రాంతంలో వ్రాసిన వంద పద్యాల కూర్పుతో ఆమె మరణాంతరం 'మాధవశతకం' గా 1901 సం.నాటి జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే వరకు 'కలావతి' పత్రికలో ప్రచురింపబడినది. సామాజిక కుటుంబసంబంధాలు బలపడటానికి అవసరమైనది స్త్రీలవిద్య అని ప్రబోధించేందుకు వచ్చిన సాంఘికశతకంగా 'మాధవశతకా'న్ని పేర్కొనవచ్చు. అందుకే ఈ శతకం స్త్రీలలో ఆలోచనలను పెంచి, స్పృహను రగిలించటానికి, అంతర్ముఖత్వాన్ని పొంది, ప్రశ్నించే చైతన్యాన్ని కలిగించే సాహిత్యంగా ఆధునికయుగంలో మొదటగా చెప్పుకోదగిన స్త్రీరచన ఇది. కవయిత్రి ఇంటిబడిలోనే సంస్కృతాంధ్ర గ్రంథాలను అభ్యాసం చేయటంవల్ల పొందిన జ్ఞానశక్తిచే స్త్రీవిద్యావశ్యకతను గుర్తించింది. స్త్రీలచదువంటే చెవులు మూసుకునే నాటి సమాజంలో ఉన్న పెద్దలలో, తల్లిదండ్రులలో, భర్తలలో, ఆడపిల్లలలో స్త్రీవిద్యకు సంబంధించిన ఆలోచనలను, ప్రశ్నలను

రేకెత్తింపజేసిన శతకమిది. సమాజంలో పురుషులతో పాటు స్త్రీలకు సమానమైన విద్యావకాశాలు లేవని వేలెత్తి చూపిన శతకమిది. గృహ నిర్వహణను, శిశు పోషణాన్ని, స్త్రీలు మరింత సమర్థవంతంగా నిర్వహించటానికి గాని 'కరణేషు మంత్రి'గా భార్య ఉండాలన్నా గాని స్త్రీవిద్య అవసరమని చెప్పింది. సంసారరథం సజావుగా నడవాలంటే విద్యావంతులైన భర్తతో సమానంగా విద్యావంతురాలైన భార్యలుకూడా ఉండాలని గుర్తించమంది. నాటి స్త్రీలకు శాస్త్రజ్ఞానం అందుబాటులో లేకపోయినా, శిశుపోషణ విజ్ఞానం, బాలచికిత్స, చరిత్ర, భూసమాచారం తెలిసిఉండాలని చెప్పింది. దేశభాషలను స్త్రీలు నేర్చుకోవాలనీ. చదువుకున్న పురుషులు దుష్టులు కానప్పుడు స్త్రీలు చదువుకుంటే దుర్గుణులెట్లు అవుతారని సమాజ సంస్కృతిని ప్రశ్నకు పెట్టిన శతకమిది.

స్త్రీవిద్యపట్ల వ్యతిరేకతగల సమాజాన్ని సామ, దాన, భేదోపాయాలతో సంస్కరించాలని అనుకొంది. అందుకే ముందుగా స్త్రీపురుషులలో మేధోశక్తులు సమానమనే భావనను కలిగిస్తూ

"వలదనుటెట్లు విద్య మగవారలకెట్టులనట్లేకదా
పొలతులు విద్యయందు రుచి పూనకయుండుట తప్పిదంబుగా
లలనలు నాలుగక్షరములం జదవంగనె విద్య కాదుగా
'తెలివి' సమమ్ము పూనగను స్త్రీపురుషులిద్దరయందు మాధవా !" (ప. 19)

స్త్రీలలో, పురుషులలో తెలివితేటలు సమానంగానే ఉంటాయని భావించేటట్లు చేసింది. స్త్రీపురుషులవిద్యపట్ల ఉన్న సామాజిక వివక్షాస్వభావాన్ని వేలెత్తి చూపించింది. అంతేకాక,

"తరుణులు విద్య నేర్చిన 'స్వతంత్రము' లిమ్మనుచుంద్రటంచునం
దురె యది కల్ల దాము దగునో యెవి పూనగనెవ్వి గూడదో
యెరిగియె పొందుచుంద్రు గద యెప్పుడు గూడను బాగ విద్యలన్
గరచినవారు గాననిది 'న్యాయమె' జెప్పగ చూడ మాధవా!" – (ప. 79)

అని స్త్రీవిద్యాభివృద్ధిలో సామాజిక లింగవివక్షాన్యాయాన్ని ప్రశ్నకు పెట్టింది. విద్యావంతులైన స్త్రీలు స్వాతంత్ర్యాన్ని ఇవ్వమంటారనే భయం పురుషులలో ఉందనీ, అది అసత్యమనీ, అన్యాయమనీ కవయిత్రి ధైర్యంగా చెప్పింది. స్త్రీలు చదువుకుంటే ఏ మేరకు స్వతంత్రతను అనుభవించాలో వారికి తెలుస్తుందని చెప్పి స్త్రీలకు స్వతంత్రత ఉండాలనీ, దానికి పురుషులు భయపడాల్సిన అవసరం లేదని స్పష్టపరిచింది. నాటి సామాజిక స్థితిలో స్త్రీలు చదువుకోవల్సిన కర్తవ్యాన్ని ప్రబోధించింది. దీనిలో పరోక్షంగా స్త్రీ విద్యకు స్త్రీల స్వతంత్రజీవనానికి ఉన్న లంకెకూడా అర్థమవుతుంది. స్త్రీవిద్యకు బలమైన పునాదిని వేసింది ఈ మాధవశతకం.

ఫిబ్రవరి, మార్చి, 1898సం. నాటి చింతామణి పత్రికలో 'అబలా సచ్చరిత్ర రత్నమాల' రచనోద్దేశాన్ని గురించి భండారు అచ్చమాంబ వ్యక్తంచేసిన అభిప్రాయాలను 'ఉపోద్ఘాతము' అనే శీర్షికన చేసిన ప్రచురణలో 'స్త్రీలు అబలలనీ బుద్ధిహీనులనీ, వివేక శూన్యులని, సకల దుర్గుణాలకు నిలయమనియు చెప్పే భావాలన్ని అసత్యములని చెప్పింది. స్త్రీలకు విద్యనేర్పించి స్వాతంత్ర్యం ఇస్తే స్త్రీలు చెడిపోతారనే ఆరోపణలు నిరర్థకాలనీ, స్త్రీ విద్యా స్వాతంత్ర్యాలవల్ల దేశానికి లాభమే గాని నష్టం కలుగదనీ, స్త్రీ విద్య అత్యంతావశ్యకము' అని తెలియజేసింది.

సామాజిక ఆంక్షలమధ్యన స్త్రీలు చదువుకోవాలంటే బాలికా పాఠశాలలు ఉండాలని నాటి స్త్రీలు భావించారు.

బాలికాపాఠశాల – మొదటి మహిళా వ్యవస్థాపకురాలు

గొడవర్తి బంగారమ్మ 'దేశాభిమానం గల స్త్రీలకొక ప్రార్థన' (జూన్ 1903 హిందూ సుందరి) అని వ్రాస్తూ హిందూదేశం బీదదేశంగా ఉండటానికి కారణం స్త్రీవిద్య లేకపోవటమేననీ, వయసున్న వితంతు వివాహాలకంటే కూడా స్త్రీవిద్యాసంస్కరణం ముందు జరగాలని తెలిపింది. ఆనందగజపతిరాజు విజయనగరంలో బాలికాపాఠశాలను ఏర్పరచినా అది సరిగా నిర్వర్తింపబడటం లేదనీ, పురుష ఉపాధ్యాయులుండటంచేత పదిఏండ్లు వచ్చిన బాలికలు సిగ్గుతో విద్యాభ్యాసం చేయటంలేదని తెలియజేసింది. అందుకనే తాను 1897 సం. ఫిబ్రవరిలో విజయనగరంలో ఒక బాలికాపాఠశాలు పెట్టి తెలుగు, ఇంగ్లీషు చదవటం వ్రాయటం నేర్పటానికి తాను పూనుకున్నట్లు పేర్కొంది.

ఈ వ్యాసరచయిత్రి ఒక వ్యక్తిగా, స్త్రీగా సమాజంలో ముందుకు వచ్చి వితంతు స్త్రీలకు పునర్వివాహం కంటె ముందు చదువుకే ప్రాధాన్యత నివ్వాలనీ, అదే అన్ని సమస్యలను తీరుస్తుందని భావించి, బాలికావిద్యకు కృషి చేయటం అభినందనీయం. స్త్రీలు ఉపాధ్యాయినులుగా ఉంటే స్త్రీ విద్య అభివృద్ధి చెందుతుందని, స్త్రీవిద్యకు ఆటంకప్రాయమైన విషయాలపట్ల సూక్ష్మమైన సునిశిత పరిశీలనతో రచయిత అర్థంచేసుకోవటమే సామాజిక ప్రగతిగా భావించవచ్చు. అంతేగాక ఆంధ్ర వనితగా ఆంధ్రదేశంలో 1897వ సం.లోనే బాలికాపాఠశాలను నెలకొల్పి బోధకురాలైన ప్రథమస్త్రీగా గొడవర్తి బంగారమ్మ ప్రశంసనీయురాలని అర్థమయే విషయం.

కందుకూరి వీరేశలింగంగారు బాలికలకోసం ప్రత్యేకంగా పాఠశాలలను, రాజమండ్రి, ఏలూరు వంటి పట్టణాలలోను, గొడవర్తి బంగారమ్మ విజయనగరంలో బాలికా పాఠశాలను నెలకొల్పినా బాలికల విద్యాశాతం చాలా తక్కువగా ఉన్నదని ఆ నాటి గణాంకాలు తెలియజేసాయి.

స్త్రీవిద్యాగణాంకాలు

20 వ శతాబ్దపు ప్రారంభంనుండి తెలుగుప్రాంతపు స్త్రీలు స్త్రీవిద్యాశాతానికి సంబంధించి పత్రికలలో వచ్చిన గణాంకాలను అక్షరాస్యులైన స్త్రీలు అవగాహనచేసుకొని స్త్రీలవిద్యాభివృద్ధికి తగిన ఆలోచనలను పెంచుకోవటం ప్రారంభించారు. చదువుకున్న స్త్రీలు ముందుకువచ్చి తోటిస్త్రీలలో స్త్రీవిద్యపట్ల స్పృహను కలిగించే ప్రయత్నంలో భాగంగా స్త్రీవిద్యావశ్యకతనుగురించి వ్యాసాలను రాయాలనుకోవటం జరిగింది. స్త్రీ విద్యకు ఆటంకమైన విషయాలకు కారణాలను అన్వేషిస్తూ బాల్యవివాహాలు ప్రధానకారణం అని వారి గ్రహింపుకు వచ్చింది.

ఆనాడు ఆంధ్ర ప్రాంతం ఉమ్మడి మద్రాసురాష్ట్రంలో ఉండేదని అందరికీ తెలిసిన విషయమే.

1900 సం.లో చెన్నపురిలో ప్రకటింపబడిన తెలుగువారిలోని స్త్రీవిద్యాశాతం గురించి (జనవరి 1901 జనానా పత్రిక) పేర్కొంటూ ప్రతి వెయ్యిమంది పురుషులలో 77 మంది పురుషులు చదువుకుంటూంటే 1000 కి 5 గురు అంటే 0.5 శాతం మాత్రమే తెలుగు స్త్రీలు చదువుకుంటున్నట్లు తెలియజేసింది. మొత్తం 1,29,067 మంది బాలికలలో 1,06,718 మంది ప్రైమరీ స్కూళ్ళలో ఉండగా మిగిలిన వారిలో సగం (66,025) మంది అప్పర్ ప్రైమరీ స్కూళ్ళలోనూ, లోయర్ సెకండరీలో 36,096 మంది, అప్పర్ సెకండరీలో 425 మంది, సర్వకళాశాలలో 20 మంది బాలికలు చదువుతున్నారనియూ, సెకండరీ, కళాశాలలో క్రైస్తవులు, యురోపినియన్లు, ఈస్టిండియనులు చదువుకుంటున్నారనీ, హిందూస్త్రీలు ప్రైమరీ వరకే చదువుకున్నారని తెలియజేసింది. స్త్రీ విద్య లేకపోతే దేశం అభివృద్ధి చెందదనీ, చదువుకున్న పురుషులు తమ స్త్రీలను చదివించాలనీ, బాలికలకు బాల్యంనుండి విద్యను నేర్పించాలనీ, ప్రభుత్వం బాలికాపాఠశాలలను ఏర్పాటు చేయాలని నాటి పత్రిక సూచించింది.

యం.ఏ. పరీక్షను ఇచ్చిన ఒక తెలుగు స్త్రీ గురించి పత్రిక తెలియజేస్తూ (ఏప్రిల్1901 జనానా) బందరు లోని ఓరుగంటి శివరామకృష్ణయ్య పుత్రికయైన 'కమలాంబ సత్యనాథం' బందరులో ఎఫ్.ఎ, బి.ఏ. లలో గెలుపొందిందనీ, ఆ సంవత్సరం చెన్నపురిలో ఇంగ్లీషులో ఎమ్.ఏ పరీక్షలో జయము పొందటమే విద్యాభిమానులకు పండగ దినమని పేర్కొంది. ఈమె చెల్లెలు రత్నాంబకూడా ఎమ్.ఏ. పరీక్షకు చదువుతోందనీ, ఉన్నత విద్యావంతులుగా వీరిద్దరూ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన రోజును విద్యాభిమానులు పండుగరోజుగా భావించారంటే స్త్రీవిద్యకు ఉన్న విలువ అర్థమౌతుంది. కమలాంబ ఉన్నతవిద్యను పొందినందుకు తన బాధ్యతగా స్త్రీలకు విద్యను నేర్పించాల్సిన అవసరాన్ని తన ఉపన్యాసాలద్వారా ప్రచారం చేసింది.

స్త్రీవిద్య- ఆటంకాలు

ముందుగా స్త్రీలకు విద్యలేని దుస్థితికి కారణాలను అన్వేషించే క్రమంలో బాల్యవివాహాలు, ఆడపిల్లలకు ప్రత్యేకపాఠశాలలు లేకపోవటంగా భావించారు. స్త్రీలు విద్యావంతులయితే ఎన్నో ప్రయోజనాలుంటాయని తోటి మహిళలకు తెలియజేసి చైతన్యపరచాలనుకొన్నారు.

పి.కౌసల్య 'అహో ! స్త్రీవిద్యకు ఎంత గతి పట్టినది' (జూన్ 1901 జనానా) అనే శీర్షికన వ్రాస్తూ దేశాభివృద్ధికిగాని, జ్ఞానాభివృద్ధికిగాని స్త్రీలకు విద్యనేర్పించుట ప్రధానమనీ, స్త్రీవిద్య తగినంతగా అభివృద్ధి చెందుటలేదని తెలిపింది. బాలురువలె బాలికలు కుటుంబానికి ధనసహాయము చేయలేరనే భావన ఉండటమేకాక, బాల్యవివాహాల కారణంగా స్త్రీవిద్య వెనకబడిఉందనీ, స్త్రీలు చదువుకోవటానికి వీలుగా జనానాపాఠశాలలను ఎక్కువగా స్థాపించాలని తెలియజేసింది. బాలికావిద్య అభివృద్ధి చెందకపోవటానికి బాల్యవివాహాలను ప్రధానకారణంగా గుర్తించింది.

స్త్రీలు విద్యావంతులు కాగలిగితే అనేకమైన ప్రయోజనాలు ఒనకూడుతాయనే చైతన్యాన్ని కలిగించే ప్రచార బాధ్యతను స్త్రీల సాహిత్యం వహించింది.

స్త్రీ విద్యాఉద్యమ ప్రారంభం

నిరక్షరాస్యులైన స్త్రీలలో స్త్రీవిద్యావశ్యక స్పృహను కలిగించటానికి స్త్రీలు ఉపన్యాసాలను ఇవ్వటం మొదలుపెట్టారు. అవన్నీ స్త్రీలపత్రికలలో ప్రచురితమయ్యాయి. తోటిస్త్రీలు బానిసత్వంనుండి విముక్తి చెందాలన్నా, స్త్రీవిద్యాభివృద్ధి జరిగి స్వతంత్రులు కావాలన్నా స్త్రీలలోనేకాక పురుషులలోకూడా సాంస్కృతిక చైతన్యం రావాలని, దానికోసం స్త్రీలు, పురుషులు చదువుకోవటానికి వీలుగా వ్యాసాలను రాసారు.

బాలాంత్రపు శేషమ్మ వ్రాసిన 'స్త్రీవిద్యాభిమానులకు విన్నపం' (జనవరి 1902 హిందూసుందరి) అనే వ్యాసంలో ఆర్యులు స్త్రీలకు కట్టుబాట్లను పెట్టారనీ, స్త్రీలకు ఎటువంటి స్వతంత్రత లేదనీ, స్త్రీలు బానిసలనీ, వారు గౌరవపాత్రులు కారనే జీవన సంస్కృతిని పెట్టారని తెలిపింది. విద్యావిహీనులుగా స్త్రీలు కాంతివిహీనులయి జీవిస్తున్నారు కాబట్టి, స్త్రీలు విద్యావంతులై గౌరవాన్ని, కొంతైనా స్వతంత్రను పొందాలనీ, స్త్రీలు పురాణాలు కాకుండా వార్తాపత్రికలు చదివితే ప్రపంచజ్ఞానం ఏర్పడుతుంది కాబట్టి స్త్రీలు విద్యావంతులయ్యేటట్టు చూసే బాధ్యత పురుషులమీదనే ఉందని తెలియజేసింది.

స్త్రీవిద్య - ప్రచారవిన్నపాలు

సమాజంలో స్త్రీలవిద్యను అడ్డుకునే శక్తులకు నయంతో విన్నపం చేసుకోవాలనుకొన్నారు. బాల్యవివాహాలవల్ల కాపురాలకు వెళ్ళకపోయినా సాంస్కృతిక ఆంక్షలవల్ల చదువుకోలేని స్త్రీలు చదువుకోవాలంటే ముందుగా భర్తలసహకారం అవసరమని భావించారు.

'విద్యాధికులగు హిందూపురుషులకొాక విజ్ఞాపనం' (ఏప్రిల్ 1902 జనానా) అని సత్యవతి రాస్తూ ఒకస్త్రీగా విజ్ఞాపన చేయటాన్ని పురుషులు చిన్నతనంగా భావించవద్దనీ, పురుషులతో స్త్రీలు మిత్రులుగా ఉంటారనీ, దేశాభివృద్ధికి స్త్రీవిద్య అవసరమనీ, బ్రిటిష్ వారివల్లనే స్త్రీవిద్య ప్రోత్సహింపబడినదని తెలిపింది. పురుషుల ఆలోచనలలో స్త్రీలను గురించి వారు గృహకృత్యాలు చేస్తే చాలనుకుంటున్నారు గానీ, ఆ కృత్యములను నిర్వహించటానికి కూడా స్త్రీలు గృహవిద్యను నేర్చుకోవాలనీ, కుటుంబాలలో స్త్రీలకు బొత్తిగా స్వతంత్రత లేకుండా ఉంటోందనీ, విద్యలేనిస్త్రీలను దాసీలుగా భావిస్తున్నారని చెప్పింది. స్త్రీలు చదవను వ్రాయటమేగాక గృహనిర్వాహణకు ఉపయోగపడు దేహారోగ్యధర్మములు, ఇంటి శుభ్రతను నేర్చుకోవాలనీ, బాలికల కొఱకు పాఠశాలలు నెలకొల్పాలనీ, నూటికిద్దరే బాలికలు చదువుకుంటున్నారనీ, స్త్రీలు తమ విద్యావిషయంలో పట్టుదలతో ఉండాలని తెలిపింది. దేశీయవిద్యను, పరదేశవిద్యను సమానంగా నేర్చుకోవాలనీ, స్త్రీల మానసికాభివృద్ధికి అడ్డుపడవలదనీ, పురుషులకు విన్నవిస్తూ, స్త్రీల విద్యకు, స్త్రీలయొక్క స్వతంత్ర జీవనానికి ఉన్న లంకెను తెలియజేస్తూ స్త్రీవిద్యను ఆటంకపరచవద్దని పురుషులకు విన్నవించింది. స్త్రీలు అస్వతంత్రులుగా ఉన్నారనే స్పృహను సత్యవతి కల్గించింది.

1902 ఏప్రిల్ చెన్నపురిలో 'బాలికావిద్య' (మే 1902 జనానా) ను గురించి కమలాంబ ఉపన్యసిస్తూ స్త్రీలు అవిద్యవలననే వెనకబడియున్నారని గ్రహించి దేశంలో బాలికలకు విద్యనేర్పించటం ఆవశ్యకమని అందరూ గుర్తిస్తున్నారని చెప్పింది. పాఠశాలలలో గృహకృత్యాలకు ఉపయోగించుకునే విద్యతోపాటు లెక్కలు, వ్యాకరణం, కళలుకూడా నేర్పిస్తున్నారనీ, భర్త ప్రోత్సాహిస్తే స్త్రీవిద్య బాగా విజృంభిస్తుందని చెప్పింది. స్త్రీలను ఉపాధ్యాయినులుగా నియమించటమే గాక గాలి, వెలుతురుగల గదులలో సభలు ఏర్పాటుచేసుకొనే విధంగా బాలికా విద్యను నేర్పిస్తేనే, స్త్రీవిద్య అభివృద్ధి చెందుతుందని పురుషులు కూడా గ్రహించాలని కమలాంబ సత్యనాథం తెలియజేసింది.

'స్త్రీవిద్యయొక్క ప్రభావం' (ఆగష్టు 1902 హిందూ సుందరి) ను గురించి భండారు అచ్చమాంబ ఉపన్యసిస్తూ అయిస్ లండన్ ద్వీపంలో స్త్రీ పురుషులందరూ సమానంగా విద్య నేర్చుకుంటారనీ, అక్కడ స్త్రీలకు పురుషులకు సమానంగా రాజకీయహక్కులు ఉన్నాయనీ, స్త్రీ పురుషులు కలిసి రాజ్యవ్యవస్థను నిర్వహించుకుంటారనీ, విద్యాశాఖలో స్త్రీలే పాఠశాలలో విద్యనేర్పిస్తారనీ, అక్కడ కారాగృహాలు, సైన్యము వంటివాటి అవసరం లేకపోవటానికి కారణము స్త్రీ విద్యా ప్రభావమేనని తెలియజేసింది.

స్వదేశంలోని స్త్రీవిద్యను విదేశాలలోని స్త్రీవిద్యాభివృద్ధితో పోల్చిచూసుకొని స్త్రీలు తమయొక్క విద్యాస్థితిని అంచనావేసుకునేటట్లు చేయటమేకాక, మహిళాఉపాధ్యాయినులు లేకపోవటమే

స్వదేశంలో స్త్రీవిద్య అభివృద్ధి చెందకపోవటానికి కారణంగా గుర్తించింది. సామాజికశాస్త్రవేత్తలు కూడా నిరూపించిన విషయం ఇది.

స్త్రీవిద్య – స్త్రీసమాజాల స్థాపన

స్త్రీలకు విద్యాజ్ఞానాన్ని అందించటానికి, స్త్రీవిద్యావశ్యకతను స్త్రీలు గుర్తించటానికి స్త్రీసమాజాల ఆవిర్భావం జరిగింది. కాస్తోకూస్తో విద్యనేర్చిన స్త్రీలు ముందుకువచ్చి ఏర్పరచుకున్న గురుకులాలు ఈ స్త్రీసమాజాలు. వీటిస్థాపనకై ముందుగా ఆలోచనచేసిన కొటికలపూడి సీతమ్మ అభినందనీయురాలు.

కొటికలపూడి సీతమ్మ 'నీతిని' గూర్చి ఉపన్యసిస్తూ (మే1902 హిందూసుందరి) ఆత్మాభివృద్ధి దాయకమగు విద్యను అభివృద్ధి చేసుకోవటానికి పుస్తకపఠనానికై తప్పనిసరిగా కాలాన్ని నిర్దేశించు కోవాలనీ, విద్య సమకూరకపోతే స్త్రీలను బానిసలుగా భావిస్తారని తెలిపింది. వారానికొకసారి స్త్రీలందరూ ఒకచోట సమావేశమై నీతి, స్త్రీవిద్యావిషయాలు చర్చించుకోవాలనీ, స్త్రీలు ఐకమత్యంగా ఉండటం స్త్రీల ముఖ్యధర్మం అని తెలియజేసింది.

కొటికలపూడి సీతమ్మ స్త్రీల బానిసత్వ నిర్మూలనకు స్త్రీవిద్యకు ఉన్న లంకెను తెలియజేసింది. స్త్రీలు వారానికి ఒకసారి తరచుగా ఒకచోట చేరి స్త్రీసమస్యలపైన చర్చించుకోవాలనే స్త్రీసమాజాల యొక్క ఆలోచనలకు కొటికలపూడి సీతమ్మయే బీజం వేయటం జరిగింది. ఆ ఆలోచనయే స్త్రీసమాజాలు ఏర్పడటానికి భూమిక అయి ఆస్కా స్త్రీసమాజము, బృందావన స్త్రీసమాజము, స్త్రీవిద్యార్థినీ సమాజాలు ఏర్పడటం జరిగింది. స్త్రీసమాజాల స్థాపనతో స్త్రీవిద్యాఉద్యమం ఊపందుకొన్నది. స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్యానికి ఆటంకప్రాయమైన ప్రతి చిన్న విషయాన్ని విశ్లేషణకుపెడ్తూ స్త్రీవిద్యకోసం తోటిస్త్రీలను చైతన్యపరిచే కృషి స్త్రీసమాజాలు చేసాయి. స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యోద్యమానికి ఈ స్త్రీసమాజాలే పునాదిరాళ్ళయినాయి. స్త్రీవిద్యను గురించి, స్త్రీల శక్తియుక్తులను తెలియజేస్తూ, సమాజంలో రావల్సిన భావపరిణామాన్ని తెలిపి, స్త్రీలకు ధైర్యాన్నిచ్చే ప్రయత్నం స్త్రీసమాజాలద్వారా చేయటం జరిగింది.

'హిందూస్త్రీలవిద్యావశ్యకత' (జులై 1902 హిందూసుందరి) అనే శీర్షికన కొటికలపూడి సీతమ్మ చేసిన ఉపన్యాసంలో 'విద్యాలక్ష్మిని దూషించవద్దనీ, విద్యాలక్ష్మి పూజనీయం కాబట్టి పురుషులు స్త్రీలకు కూడా విద్యాలక్ష్మి అనుగ్రహం ఉండాలని భావించాలని చెప్పింది. స్త్రీలు తీరిక వేళలోను విద్య నేర్పవచ్చని, చిన్నతనంలోను విద్య నేర్చుకోనందుకు బాధపడవద్దనీ, భండారు అచ్చమాంబగారు స్త్రీసంఘాల యందు అభిమానంతోనే స్వదేశీ స్త్రీల చరిత్రలను తెలియజేస్తూ 'అబలా సచ్చరిత్రరత్నమాల' అనే గ్రంథాన్ని వ్రాసిందనీ, దాన్ని చదుకోవాలని తెలియజేసింది. అంతేకాదు, ఈమె 'స్త్రీవిద్య'ను

గురించి ఉపన్యసిస్తూ (1902 ఆగస్టు హిందూసుందరి) విక్టోరియా పరిపాలనలోని భారతదేశంలో బాలికా పాఠశాలలు ఏర్పడ్డాయి గానీ, తల్లిదండ్రులు కూతుళ్ళను నిజమైన విద్యాభిలాషతో పంపటంలేదని చెప్పింది. విద్యాజ్ఞానం ప్రారంభమయ్యే ఐదేండ్ల వయసుకే బాల్యవివాహాలు చేయటంతో, వివాహానంతరం గృహసంబంధ పనుల వత్తిడితోను బాలికలు పాఠశాలకు వెళ్ళకపోవటంతో బాలికల విద్యాభివృద్ధి జరగటం లేదని తెలియజేసింది. ఉచితబోధన చేసే ఉపాధ్యాయులను నియమించినప్పటికీ, తల్లిదండ్రులు తమ బాలికలను సరిగ్గా పాఠశాలలకు పంపటం లేదనీ, ఐదేండ్లు వచ్చిన తర్వాత గ్రహణశక్తి, పెరిగి 2,3 తరగతులు చదివే సరికి పెళ్ళిచేస్తుంటే బాలికలు చదువును ఆపేస్తున్నారనీ, ఆటలాడుతూ విలువైన కాలాన్ని బాలికలు వ్యర్థంజేస్తున్నారని తెలియజేసింది.

'స్త్రీవిద్య' ను (సెప్టెంబరు 1902 హిందూసుందరి) గురించి కొటికలపూడి సీతమ్మచేసిన మరొక ఉపన్యాసంలో స్త్రీలు చదువుకోలేకపోతే సత్యాన్ని గ్రహించగలిగే మంచిచెడుల విచక్షణా జ్ఞానం ఏర్పడదనీ, స్త్రీలు విద్యవల్ల వృద్ధినొందితేనే సంతతిని వృద్ధిలోకి తీసుకురాగలరని, విద్యతోనే మానవజన్మ సార్థకం కాగలుగుతుందని తెలియజేసింది.

స్త్రీలలో విద్యాచైతన్య ప్రచారం

స్త్రీవ్యక్తిస్వాతంత్ర్య సాధనకు ప్రధానమైనది స్త్రీవిద్యాభివృద్ధి. దానికై స్త్రీసమాజాలను ఏర్పాటుచేసుకొని, స్త్రీవిద్యా ప్రచారం చేసారు. నిరక్షరాస్యతగల స్త్రీలలో చదువుపట్ల ఆసక్తిని రేకెత్తించటానికి ఉపన్యాసాలు చేయటంతోపాటు, స్త్రీలే చిన్నచిన్న నాటకాలవంటివి వేసి, పాత్రలపరమైన సంభాషణలద్వారా తోటి స్త్రీలలో విద్యాసక్తిని కలిగించాలని అనుకొన్నారు. రంగస్థలహంగు, ఆర్భాటం, ఆహార్యాలు లేకుండానే సహజమైన యింటి వాతావరణంలోనో, స్త్రీసమాజాలు సమావేశమయ్యే గదులలోను, లేదా స్త్రీలు కలుసుకోగలిగే చెఱువుగట్ల దగ్గరగాని స్త్రీలచదువును చర్చించుకొన్నట్లును, సునాయాసంగా నాటకప్రయోగానికి వీలుగా ఉండేటట్లుగా స్త్రీలు లఘునాటకాలను వ్రాసారు. 20 వ శ.పు మొదటి దశకంలోనే ఈ నాటికలు వచ్చాయి.

అప్పుడప్పుడే స్త్రీలు సమూహాలుగా ఒకచోటచేరి స్త్రీవిద్యకు సంబంధించిన విషయాలను చర్చించుకోవటానికి వీలుగా స్త్రీసమాజాల స్థాపనోద్దేశ్యం కలిగిందనీ, స్త్రీలు అలా కలిసినప్పుడు స్త్రీవిద్యా ప్రయోజనాన్ని కుటుంబసభ్యులు గుర్తించాలనే భావాన్ని నాటికల రూపంలో తెలియజేస్తే, నిరక్షరాస్యులైన స్త్రీలు అర్థంచేసుకోగలరనే భావనకు స్త్రీలసాహిత్యంలో చిన్న చిన్న నాటకాలరూపంలో ఉన్న రచనలు నాంది పలికాయి.

విన్నకోట లక్ష్మీజోగమ్మ వ్రాసిన 'అవివేకపు వెంకమ్మ' (జులై నుండి సెప్టెంబరు 1902 హిందూసుందరి క్రమసంచికలు) నాటకంలో ఇద్దరు స్త్రీల సంభాషణలో భాగంగా ఇంకా కాపురానికి రాని కోడలికి ఆమె పుట్టింటివారు ఇంటి దగ్గర చదువుచెప్పించటాన్ని విమర్శిస్తూ ఆమె అత్త యిరుగమ్మ పొరుగమ్మ మాటల ప్రభావంచేత కోడలు చదువుకోవటాన్ని నిరసించిందని తెలిపింది. ఆమె చెల్లెలువచ్చి స్త్రీలు చదువుకున్నా యింటిపనులు చక్కగా నిర్వహించగలరనీ బాధపడవద్దని చెబుతుంది. వియ్యపురాలు కూడా తన కూతురును చదువుమాన్పించుదామంటే కూతురు ఏడుస్తోందనీ, వీణ కూడా నేర్చుకుంటోందనిచెప్పింది. స్త్రీలు భండారు అచ్చమాంబలాగా విద్యావంతురాలు కావాలనీ, ఆడపిల్లల్ని చదివించాలని ఆ చెల్లెలిపాత్రద్వారా తెలియజేసింది.

మొసలిగంటి రామాబాయమ్మ వ్రాసిన 'నీలాటిరేవు' (డిసెంబరు 1902 హిందూసుందరి) అనే చిన్న నాటకంలో బాల్యదశలో పిల్లలు తల్లులదగ్గర మసలుతుంటారు గాబట్టి తల్లి విద్యావంతురాలైతే పిల్లలను మంచిగుణములు గల వారిగా పెంచగలరని తెలియజేసింది. అంతేగాక గృహనిర్వహణతో బాటు స్త్రీలు చదువుకుంటే పత్రికలు చదవగలిగి దేశంలోని సంగతులన్ని గ్రహించవచ్చని "నీలాటి రేవు దగ్గర" చేరిన ఇద్దరు స్త్రీల సంభాషణలో భాగంగా స్త్రీవిద్యావశ్యకతను తెలియజేయటం జరిగింది. నీళ్ళకోసం స్త్రీలు చెరువులు, రేవులదగ్గరకు చేరుకొన్నప్పుడు స్త్రీవిద్యావిషయాలే చర్చించుకోవాల్సిన అవసరాన్ని తెలియజేసింది.

స్త్రీలలో ఒక్క శాతం కూడా పూర్తిగా అక్షరాస్యతలేని రోజుల్లో మౌఖికంగా చెప్పుకోగల కథలద్వారా విషయాన్ని హత్తుకొనేటట్లుగా చేయవచ్చని భావించారు. ఆ క్రమంలోనే చదువుకొన్న స్త్రీలు తమ ఆలోచనల పరిణామ ఫలితాలను స్త్రీలు సులభంగా ఆకళింపు చేసుకుంటూ పదిమందితో పంచుకోవటానికి, తోటి స్త్రీలలో ఆసక్తిని కలిగిస్తూ కథల రూపంలో ప్రచారం చేయటానికి వీలుగా రచయిత్రులు కథాప్రక్రియను చేపట్టారు. స్త్రీవిద్యాభివృద్ధికి ఆటంకప్రాయమైన విషయాలను సాహిత్యంలో చర్చకుపెట్టారు. స్త్రీలవిద్యాఉద్యమాన్ని ధ్యేయంగా చేసుకొన్న సాహిత్యప్రచారానికి కారణాలను అన్వేషించారు.

అక్షరాస్యులైన స్త్రీలు కథలను చదివి తోటిస్త్రీలతో ఆ కథలను గురించి చెప్పటం జరుగుతుందని భావించటంతో స్త్రీలసాహిత్యంలో కథారచనమొదలయింది. స్త్రీలు ఆనోటా ఈ నోటా స్త్రీవిద్యా ప్రాధాన్యతను ప్రచారంచేయటానికి వీలుగా చిన్న చిన్న కథలను రాసారు. పెళ్ళికి మునుపు పల్లెల్లో బాలికాపాఠశాలలులేక చదవలేకపోయిన స్త్రీల విషయంలో భర్తలు ముందుకువచ్చి వారికి చదువు వచ్చేటట్టుచేసే బాధ్యత వారిదేనని తెలియచేయటంకోసం బండారు అచ్చమాంబ కథారచనను ప్రారంభించింది.

స్త్రీవిద్యాభివృద్ధి – పురుషులబాధ్యత

స్త్రీలు పితృస్వామ్యకుటుంబ సంస్కృతిని అధిగమించి విద్యను నేర్వటానికి భర్తల బాధ్యతకై ముందుగా వారిని చైతన్యపరచాలనుకొన్నారు.

బండారు అచ్చమాంబ వ్రాసిన 'భార్యభర్తల సంవాదం–స్త్రీ విద్య' (డిసెంబరు 1902 హిందుసుందరిలో) అనే కథారూప ప్రక్రియలో భర్త ప్రోత్సాహం ఉంటే, స్వీయ ప్రయత్నంతో భార్య పుస్తక పఠనం చేయగలిగిన స్థితికి చేరుకుంటుందని తెలిపింది. స్త్రీ చదువుకుంటే వైధవ్యం వస్తుందని చెప్పే ముసలి వారి మాటలకు శాస్త్రంలో ఆధారంలేదనీ అది ఒక మూఢనమ్మకం అని చెప్పి, భార్య చదువుకొంటే భర్తకు స్వయంగా ఉత్తరాలు వ్రాయగలుగుతుందనీ, పిల్లలకు చదువు చెప్పగలదని చెప్పింది. పిల్లలను సద్గుణవంతులుగా పెంచినందుకు ఆ తల్లిదండ్రులను సమాజంలోని వారు రూపుదాల్చిన దేవతలుగా వారిని కొలిచేరోజు వస్తుందని భర్తచేత భార్యకు తెలియజేసింది.

భార్యలో తాను విద్యావంతురాలు కాగలననే ఆత్మవిశ్వాసాన్ని పెంచటం భర్తయొక్క బాధ్యత అని అటువంటి దంపతులను సమాజం గౌరవిస్తుందని కూడా కథలో తెలియజేయటం జరిగింది. స్త్రీ చదువుకుంటే భార్యాభర్తల మధ్య ప్రేమానురాగ సంబంధాలు పెరిగే అవకాశం ఉంటుందని చెప్పటమే కాక స్త్రీ విద్యకు ఆటంకప్రాయమైన మూఢవిశ్వాసాన్ని, అపప్రథను నిర్మూలించే ప్రయత్నం జరిగింది.

బండారు అచ్చమాంబ వ్రాసిన "భార్యా భర్తల సంవాదం" (ఆగస్టు 1903 హిందూసుందరి) అనే మరో కథలో భార్యకు పుస్తకాల మీద ధ్యాస లేకుండా నగల మీద వ్యామోహం ఉండటాన్ని భర్త విమర్శిస్తూ తరతమ భేదంలేని సద్గుణాలంకారములే స్త్రీల సౌందర్యానికి చిహ్నమనీ, స్త్రీలు నగలు ధరించడంలో మాత్రమే స్వతంత్రంగా ఉన్నామనే భావనలో ఉన్నారని ఆ భర్త వ్యక్తం చేసాడని తెలియజేసింది. స్త్రీలు తమకు ఎన్ని నగలుంటే అంతగా తాము గొప్ప అని భ్రమించే వారియొక్క భ్రమను తొలగించి చదువుమీద వారిదృష్టిని మళ్ళింపుచేయటం భర్తబాధ్యత అని కథలో తెలియజేసింది.

స్త్రీవిద్యాస్ఫూర్తి

నిరక్షరాస్యులైన స్త్రీలు విద్యాస్ఫూర్తిని పొందేవిధంగా నాటి మహిళలు స్త్రీసమాజాలలో ఉపన్యాసాలను యిచ్చారు. విద్యను అభివృద్ధిచేసుకొన్న మహిళలను పేర్కొంటూ, వారు స్త్రీవిద్యాభివృద్ధికై పాటుపడుతున్న విషయాలను తమ ఉపన్యాసాలలో తెలియజేస్తూ స్త్రీలలో విద్యాస్ఫూర్తిని కలిగించే ప్రయత్నంచేసారనే విషయం ఆనాటి పత్రికలలో వచ్చిన వ్యాసాలలో ప్రతిఫలించింది.

వేమవరపు మహాలక్ష్మి ఒక స్త్రీసమాజంలో చేసిన ఉపన్యాసం (ఫిబ్రవరి 1903 హిందూసుందరి) లో భండారు అచ్చమాంబ జనానా స్త్రీల అభివృద్ధికోసం సమాజాలను స్థాపించి వార్తాపత్రికలు, సద్గ్రంథ పఠనం చేయిస్తూ స్త్రీలకు నానాదేశ విశేషాలను చెబుతున్నారని పేర్కొంది.

రుద్రవరపు కామేశ్వరమ్మ చేసిన ఉపన్యాసం (ఫిబ్రవరి 1903 హిందూసుందరి) లో భాగంగా భండారు అచ్చమాంబ సాన్నిధ్యమే ఆనందాన్ని కలుగిస్తుందనీ, పురుషులు స్త్రీలకు విద్యనేర్పించక పోయినా అచ్చమాంబవంటి వివేకవతులు సభలు పెట్టి స్త్రీలకు ఉత్సాహం కల్గిస్తున్నారని చెప్పింది. అచ్చమాంబ అనేకభాషలను నేర్చియున్నారనీ, ఆమె సాన్నిధ్యంలో ఉన్నప్పుడు సమాజము 'స్త్రీలవిద్య'ను అణచిపెట్టి, వారిని బానిసలుగా చూస్తున్నారనే ఆలోచన కలుగుతుందని తెలిపింది. దూషణ భూషణలను పట్టించుకోకుండా స్త్రీతెగయొక్క అభివృద్ధి కొరకు ఉపకారం చేస్తున్న అచ్చమాంబను ప్రశంసించారని, సభలోని స్త్రీలందరూ స్త్రీవిద్య యెడల స్ఫూర్తి పొందేటట్లుగా ఆమె చేసిందని తెలిపింది. భండారు అచ్చమాంబలోని స్త్రీశక్తిని ఉదాహరిస్తూ ఆమెలాగా స్త్రీలు ఆలోచించాల్సిన అవసరాన్ని తెలియజేసింది. తమజాతి అభివృద్ధికై ఒక స్త్రీ మరొకస్త్రీని ప్రశంసించి స్ఫూర్తిని పొందే విషయం అర్థం అవుతుంది.

స్త్రీల ఉన్నతవిద్య

స్త్రీలు ఉన్నతవిద్యద్వారా శాస్త్రవిజ్ఞానాన్ని పొందితే వారిలో శాస్త్రీయమైన ఆలోచనలు అభివృద్ధిచెందుతాయనే స్పృహను కలిగించాలనుకొన్నారు. స్త్రీలు ఉన్నత చదువు స్థాయికి చేరుకోవటమే కాక, వారికి శాస్త్ర పరిజ్ఞానం అవసరమని, అప్పుడే వారిలో శాస్త్రీయదృక్పథం పెరిగి వారు అభివృద్ధి చెందుతారని భావించారు. ఉన్నతవిద్య అంటే శాస్త్రీయపరిజ్ఞానాన్ని పొందటంగా భావించారు.

'స్త్రీల యున్నత విద్య' (మే 1903 హిందూసుందరి) ను గురించిన వ్యాసంలో ప్రచురించిన పులుగుర్త లక్ష్మీనరసమాంబ ఉపన్యాసంలో స్త్రీలకు ఉన్నత విద్య వలన ప్రయోజనం ఉందనీ, అల్పవిద్యతోనే స్త్రీలు సంతోషపడకూడదనీ, సులభగ్రాహ్యంకాని కావ్యాలను పెద్దలచేత చెప్పించుకొని యైనా విద్యాభివృద్ధిని పొంది తద్వారా లోకజ్ఞానాన్ని పొందాలని చెప్పింది. అంతేకాదు, 'నేటి స్త్రీలు స్త్రీలేకాదు, పురుషులునూ' అని చెప్పి స్త్రీల ఉన్నతవిద్యను అంగీకరించని వారి విషయాలను పట్టించుకోవద్దని తెలియజేసింది. స్త్రీలు తీరిక చేసుకొని సద్గ్రంథాలు చదివాలని, స్త్రీలు ఉన్నత విద్యాభ్యాసం చేయటం వల్ల సులభగ్రంథములనే గాక కఠినమైన శాస్త్రగ్రంథాలను కూడా పఠించగల నేర్పు వారికి ఏర్పడుతుందనీ, దానివల్లనే స్త్రీలలో జ్ఞానాభివృద్ధి కలిగి, లోకాభివృద్ధికూడా జరుగుతుంది కాబట్టి స్త్రీలు విద్యావంతులు కావాలని చెప్పింది.

వివాహితులైన స్త్రీలు కూడా తమ విద్యాభివృద్ధిని చేసుకునే అవకాశం ఉంటుందనే చైతన్యాన్నిచ్చిన వ్యాసమిది. స్త్రీ పురుషుల సమానత్వానికి దారితీసేది స్త్రీల ఉన్నత విద్యయే అని అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. స్త్రీల ఉన్నత విద్యావ్యాప్తికి బీజం వేయటం జరిగింది. స్త్రీల విద్యను గురించి మరొక అడుగు ముందుకు వేసి స్త్రీలకు శాస్త్రజ్ఞానం కావాలనీ, అదే స్త్రీల అభివృద్ధికి సోపానం అవుతుందని తెలియజేస్తూ స్త్రీలకు ప్రాథమిక విద్యయే కాక స్త్రీల ఉన్నత విద్యకు ఉన్న ప్రాధాన్యాన్ని పులుగుర్త లక్ష్మీనరసమాంబ తెలియజేయటం జరిగింది.

స్త్రీ సమాజాల క్రియాశీలత

స్త్రీవిద్యకై ఉపన్యాసాలతోనేకాక, ఆచరణాత్మకంగా చేయగలిగే చైతన్యాన్ని స్త్రీసమాజాలద్వారా కలిగించాలనుకొన్నారు.

కాకినాడలో 'స్త్రీ విద్యార్థినీసమాజం' (మార్చి 1903 హిందూసుందరి) అనే వ్యాసంలో స్త్రీ సమాజస్థాపన సభలో పులగుర్త లక్ష్మినరసమాంబ ఆనాటి సభకు వచ్చిన అచ్చమాంబను గురించి ప్రసంగిస్తూ ఆమె జాత్యభిమానంతో స్త్రీల అభివృద్ధికొరకు మానవరూపాన్ని దాల్చిన అవతారమనీ, అబలాసచ్చరిత్ర రత్నమాలను వ్రాసిందని చెప్పింది. కాలమును వృథాచేయక ఆమె హిందీ, గుజరాతీ, బెంగాలి భాషలో పాండిత్యాన్ని సంపాదించిందనీ స్త్రీల సమాజాలకు వచ్చి అందరినీ విద్యాభివృద్ధికై ప్రోత్సహిస్తోందనీ, స్త్రీలు ఐకమత్యంతో ఉండి విద్యాభివృద్ధి చేసుకోవాలనీ, కాకినాడలోని స్త్రీవిద్యార్థినీ సమాజ స్థాపనకు భండారు అచ్చమాంబయే కారకురాలని తెలియజేసింది.

వెంపల శాంతబాయి వ్రాసిన 'సమాజలాభము' (నవంబరు 1903 హిందూసుందరి) అనే వ్యాసంలో స్త్రీసమాజాలు ఏర్పడాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తూ వాటివల్ల స్త్రీవిద్యను అభివృద్ధి చేసుకోవచ్చనీ, స్త్రీసమాజాలలో ఒకరికి తెలిసిన విషయాలను మరొకరు పంచుకోవచ్చనీ, అక్షరజ్ఞానంతో ప్రపంచ విషయాల పట్ల అవగాహనను పెంచుకోవచ్చనీ మొసలిగంటి రామాబాయమ్మ ఆస్కాసమాజానికి మాత అని తెలియజేసింది.

ఇల్లు పరిధిగాగల స్త్రీలను స్త్రీసమాజాలలో అడుగుపెట్టేటట్లు చేసి చూట్టూరా ఉన్న సమాజాన్ని, దేశాన్ని అవగాహన చేసుకునే స్థితికి స్త్రీని తీసుకువచ్చే ప్రయత్నం స్త్రీసమాజాలద్వారా జరిగిందని భావించవచ్చు. స్త్రీసమాజాలవల్ల స్త్రీలకు సామాజికసంబంధాలు అభివృద్ధిచెందసాగాయి.

'అస్కాస్త్రీసమాజాన్ని' (సెప్టెంబరు – అక్టోబరు1905 సావిత్రి) గురించి బుర్రా బుచ్చిబంగారమ్మ ఉపన్యసిస్తూ అసికా పట్టణమునందు మూడుసంవత్సరములనుండి స్త్రీసమాజం నడపబడుతోందనీ, 1902 సం.లో ఉన్నవ లక్ష్మీబాయమ్మ అధ్యక్ష్యురాలిగా అసికా (మచిలీ) పట్టణంలో స్త్రీసమాజసభ

ప్రారంభమైనదని చెప్పింది. యువతీమణులందరూ ఐకమత్యంతో కలసిమెలసిఉంటూ, స్త్రీలకుపయుక్తములగు వివిధాంశములను వారు ఉపన్యసించటం, గ్రంథపఠనం చేస్తూ ఉండటం స్త్రీల భవిష్యదభివృద్ధికి సూచకంగా ఉందనీ, ప్రతిసంవత్సరం దాదాపుగా 30 సభలను నిర్వహించారని తెలియజేసింది. స్త్రీలందరూ సమావేశమై సద్గ్రంథాంశములను శ్రోతలకు తెలియజేస్తూ, స్త్రీవిద్యను గురించి, స్త్రీల ఐకమత్యం గురించి, స్త్రీ, సంఘాభివృద్ధి గురించి చర్చించుకోవటానికి అనువుగా సభలను నిర్వహించేవారని తెలియజేసింది. పిల్లలపని, ఇంటిపని ముగించుకొని వ్యయప్రయాసలకు ఓర్చి ఈ స్త్రీసమాజాల సమావేశానికి అధ్యక్షులుగా వచ్చిన కళ్ళేపల్లె వెంకటరమణ, పులగుర్త లక్ష్మీ నరసమాంబ మొదలగువారి యొక్క సహకారాన్ని ప్రశంసించింది. అంతేకాదు, స్త్రీలు విద్యావంతులై ఐకమత్యాన్ని అర్థం చేసుకుని సామూహికంగా స్వేచ్ఛపొందాలనీ, తమ అభిప్రాయాలను స్త్రీలు స్వేచ్ఛగా వ్యక్తీకరించ గలిగితేనే వివేకం, స్వాతంత్ర్యం వాళ్ళకు కలుగుతాయని చెప్పి, స్త్రీలవిద్యా ప్రగతికై మార్గాలను బుర్రా బుచ్చిబంగారమ్మ సూచించింది.. అంతేకాదు, చూడికుదుత్తమ్మ ఇంటిదగ్గర తన కూతురుకు చదువుచెప్పిస్తూ స్త్రీవిద్య అనే దానిని ఒక సంస్కరణోద్యమంగా ఇంటి నుండి ప్రారంభించిందని తెలిపింది. స్త్రీలు తమ తీరిక వేళలను చదువుకు వెచ్చించి కాలాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరాన్ని బుర్రా బుచ్చిబంగారమ్మ సూచించింది.

స్త్రీల అభివృద్ధికి స్త్రీసమాజాలే మూలస్థంభాలని అర్థమవుతుంది. స్త్రీవిద్య, స్త్రీలఅభిప్రాయ ప్రకటనకు, స్త్రీలస్వేచ్ఛకు, స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యానికి పునాదులను వేసి, స్త్రీలలో వ్యక్తిస్వాతంత్రకాంక్షను ఆమె వెలిగించటం కనపడుతుంది. స్త్రీలు విద్యను అభ్యసించాలనీ, దేశ ప్రకృతిని అవగాహన చేసుకునే జ్ఞానం స్త్రీలకు అవసరమని చెప్పింది. ఏ సామాజిక ఉద్యమమైనా ముందుగా తమ యింటినుండి మొదలుపెడితేనే ఆ ఉద్యంపట్ల ప్రజలకు నమ్మకం ఏర్పడుతుంది.

వితంతు స్త్రీల విద్యాప్రచారం

సమాజంలో పితృస్వామ్య కుటుంబాలలో బాల్యవివాహాల ఫలితంగా వితంతువుల సంఖ్య ఎక్కువగా ఉండేది. వారు యింటిలో వంటలక్కల పాత్రను పోషిస్తూ కుటుంబ పరిధిలోకూడా స్వేచ్ఛగా నడవలేని దుస్థితి వారిది. కాబట్టి వారి బానిస జీవనానికి వెసులుబాటును కలిగించేది, ఉపాధిని కలిగించేది విద్య అని వితంతువులలో ఆశాజనకమైన జీవనాన్ని కొనసాగించే స్పృహను కలిగించాలనుకొన్నారు ఆనాటి స్త్రీలు.

కొటికలపూడి సీతమ్మ 'హిందూసుందరుల విద్యాభివృద్ధి' (జనవరి1905 జనానా) అంటూ ఉపన్యసిస్తూ తన గురువైన కందుకూరి వీరేశలింగం గారు 'శ్రీవిక్టోరియా వితంతు శరణాలయమను

పేర' ఒక అనాథరక్షణశాలను ఏర్పరచారనీ, విద్యాభివృద్ధికొరకు లోయర్ సెకండరీ పాఠశాలను స్థాపించి బాలికలు, సంసారస్త్రీలు, వితంతు స్త్రీలు చదువుకోవటానికి అవకాశాలు కల్పించారని చెప్పింది. వితంతుస్త్రీలవిద్య అభివృద్ధి చెందాలంటే ఇటువంటి పాఠశాలలు అవసరమనీ దేహపోషణకు, అన్నవస్త్రాదులకు, అల్పపోషణకు తగిన విద్యాస్వాతంత్ర్యాలు కరువై దుఃఖించే వితంతు స్త్రీల జ్ఞానప్రచారానికై కందుకూరి వీరేశలింగంగారు కంకణం కట్టుకొన్నారని తెలియజేసింది. అంతేకాదు, పురుషులచే నిర్బంధింపబడే హిందూ స్త్రీలు తాము పురుషులతో సమానంగా స్వాతంత్ర్యము వహించాలంటే మానవ జన్మను సార్థకంచేసుకున్న యితరదేశ స్త్రీల చరిత్రలను తెలుసుకోవాలనీ, గృహభారం వహించే స్త్రీలకు గణితశాస్త్ర విజ్ఞానం ఉంటే వారు గృహకృత్య నిర్వహణంలో సమర్థులగుదురనీ, వేడుకకోసంకాక జ్ఞానంకోసం స్త్రీలు చదువుకుంటే ఫలమెక్కువ ఉంటుందని తెలిపింది.

స్త్రీవిద్య – ఉపాధ్యాయినుల పాత్ర

పితృస్వామ్యసంస్కృతి బలంగా నాటుకొన్న సమాజంలో స్త్రీవిద్య అభివృద్ధిచెందాలన్నా, వారిలో వ్యక్తిస్వాతంత్రస్ఫూర్తి కలగాలన్నా చదువుకున్న స్త్రీలు ఉపాధ్యాయినులుగా ఉంటే దానిని సమర్థవంతంగా నిర్వహించగలరని భావించి స్త్రీలు ఉపాధ్యాయినులుగా ఎదగగల చైతన్యాన్ని కలిగించాలనుకొన్నారు.

స్త్రీవిద్యాభివృద్ధిలో స్త్రీపురుషుల బాధ్యతలను స్పష్టంచేయాలనుకొని 'యువతులకొక విన్నపం' (జూన్ 1903 హిందూసుందరి) అంటూ బండారు అచ్చమాంబ చేసిన ఇంకొక ఉపన్యాసంలో పురుషులు స్త్రీవిద్యా ప్రోత్సాహకరములైన పనులు చేసినా, స్త్రీలయుపేక్షవల్ల స్త్రీవిద్యాభివృద్ధి జరగటంలేదని చెప్పింది. బాల్యవివాహానంతరం బాలికలు పురుష ఉపాధ్యాయులుగల పాఠశాలలకు వెళ్ళటంలేదనీ, నేర్చిన విద్యనుకూడా వారు వివాహానంతరం మరిచిపోతున్నారనీ, వారికి గణిత, వ్యాకరణాలు అసలు గుర్తుకు రావటంలేదని తెలిపింది. బాలికాపాఠశాలలో స్త్రీలు విద్యావంతులవటం కష్టంగా ఉన్నదనీ, బాలికలు అల్పవిద్యలో ఉన్నారనీ, కాబట్టి ఉపాధ్యాయినులను పాఠశాలల్లో నియోగిస్తే స్త్రీవిద్యాభివృద్ధి జరుగుతుందని చెప్పింది. అంతేకాక, విద్యావంతులకు స్త్రీ స్వాతంత్ర్యం వంటి సంస్కరణల విలువ తెలుస్తుందనీ, స్త్రీలు బోధకులుగా ఉంటే స్త్రీవిద్యాలయాలలో స్త్రీలు స్వేచ్ఛగా విద్యను ఆర్జించగలరని తెలియజేసింది. చదువుకొన్న స్త్రీలు వంతులవారీగా రెండుగంటల చొప్పున బాలికాపాఠశాలలో పాఠాలను బోధించాలనీ, ప్రతిగ్రామాలలో పాఠశాలలు ఏర్పాటు చేసి, గణితం, వ్యాకరణం దేశచరిత్రలు చెప్తూ బాలికలకు శాస్త్రపరిజ్ఞానాన్ని అందించాలని చెప్పింది. ఆ

విధంగా స్త్రీవిద్య యెడల విద్యావంతులైన స్త్రీలు బాధ్యత వహించాల్సిన విషయాన్ని విన్నవించింది.

స్త్రీవిద్య – స్త్రీపురుషసమానత్వస్పృహ

సమాజంలో స్త్రీలను గురించి అబలలనే నానుడి ఉంది. ముందుగా ఆ దుష్ప్రచారాన్ని పోగొట్టే విధంగా స్త్రీలు తమ విద్యావసరాన్ని గుర్తించగలిగి, పురుషులతోపాటు తాము సమానులమనే స్పృహను వారిలో కలిగించే ప్రయత్నంచేసారు.

వలివేటి బాలాత్రిపుర సుందరమ్మ, 'రాజామునందలి జనానాసభ' (జులై 1903 హిందూ సుందరి) లో చేసిన ఉపన్యాసంలో స్త్రీల కంటే పురుషులు శారీరక, మనో ధార్యమునందు, విద్యయందు ఎక్కువగా ఉండి, స్త్రీ జన్మకు రెండవస్థానాన్నిచ్చారనీ, 'అబలలని' పిలువబడే స్త్రీలు విద్య నేర్చుకుంటేనే ఉన్నతస్థితిలో ఉండగలరని చెప్పింది. విద్యవలన సృష్టిలోని జీవ, నిర్జీవపదార్థాల సృష్టిని గురించి తెలుసుకోవచ్చునీ, పంచభూతాలను గురించి, వివిధ దేశాచారాలను గురించి, శరీరశాస్త్రం గురించి తెలుసుకోవచ్చని, గృహనిర్వహణను నేర్పుగా చేయవచ్చని తెలిపింది. స్త్రీలు అందరూ ఒక యింటిదగ్గర కలసి ఒక్కొక్క సంగతిని గురించి చదువుతూ అవసరమైన జ్ఞానాన్ని సంపాదిస్తే చాలా ఉపయోగములు ఉంటాయని తెలియజేసింది.

పుట్టుకతో స్త్రీ, పురుషులు సమానమైనప్పుడు ఇరువురి స్థాయిలలో ఉన్న తేడా యొక్క స్వభావాన్ని అర్థంచేసుకునే క్రమంలో ముందుగా 'స్త్రీవిద్య' యొక్క అవసరాన్ని గుర్తించారు.

అదే సభలో వెంపల శాంతాబాయి ఉపన్యసిస్తూ హిందూదేశంలో స్త్రీలకు విద్య లేకుండాచేసి వారిని మూఢులుగా మార్చారనీ, స్త్రీ రత్నముల సాంగత్యంలో విద్యావంతులు అవుతున్నారు కాబట్టి స్త్రీలందరూ కాలాన్ని వ్యర్థపుచ్చక విద్యావంతులు కావాలనీ, బాలికలకు రెండక్షరాలను మాత్రమే నేర్పించి, విద్యాసారాన్ని నేర్పించటంలేదని, స్త్రీలను దుర్గుణులని చెప్పే విషయాలను నమ్మవద్దని చెప్పింది. విద్యనేర్చితే స్త్రీలు చెడునడత కల్గియుంటారంటే మరి పురుషులు కూడా అట్టివారే అని అనవలసివస్తుందనీ విద్యాద్వేషులు పన్నే కుతంత్రాలకు లోబడకుండా స్త్రీలు విద్యాధనాన్ని ఆర్జించాలని తెలియజేసింది.

స్త్రీలు ఉన్నత స్థితికి ఎదగటానికి ప్రకృతిశాస్త్ర జ్ఞానం అవసరమనీ, అప్పుడేవారిని పురుషులు గౌరవిస్తారని తెలియజేసింది. స్త్రీవిద్యను ఆటంకపరుస్తున్న పురుషుల కుట్రను అర్థంచేసుకోమని చెప్పింది. స్త్రీలు తమ సామాజిక హోదాని గురించి ఆలోచించాలని భావించింది.

మానవాభివృద్ధి సూచికలో విద్య ప్రధానవిషయం. అందుకే స్త్రీవిద్యాశాతం స్త్రీల అభివృద్ధికి నమూనా కాబట్టి ఎప్పటికప్పుడు పత్రికాముఖంగా వచ్చిన విద్యాగణాంకాలను అవగాహన

చేసుకొన్నారు. అప్పుడే సమాజంలో మానవసంబంధాలమధ్య ఉండవలసిన సమతుల్యసంబంధాలు పెంపొందుతాయి. విద్యాఫలితంగానే స్త్రీలు బానిసత్వం నుండి విముక్తి కాగలుగుతారని నాటి స్త్రీలు భావించారు.

స్త్రీవిద్యాగణాంకాలు - ఉమ్మడిమద్రాసురాష్ట్రం

స్త్రీ విద్యా శాతాన్ని గురించి స్త్రీలకు గుర్తుచేయటం, వారిని చైతన్యవంతంచేయాల్సిన బాధ్యత పత్రికలకు ఉందని గ్రహించారు.

ఆగస్టు 1903 జనానా పత్రికయొక్క ప్రచురణలో చెన్నపురి రాజధానిలో 1901 సం.లో దొరతనం వారు వేయించిన జనాభా లెక్కలను, విద్యావంతుల పట్టిక ప్రకారం 1,74,68491 మంది హిందూస్త్రీల సంఖ్యలో 1,21,462 మంది నాలుగు భాషలలో విద్యావంతులైన స్త్రీలు ఉండగా అందులో చెన్నపట్నంలోని విద్యావంతులైన స్త్రీలలో ప్రతి 1000 మందికి తెలుగు స్త్రీలు కేవలం 5 గురు మాత్రమే చదువుకున్నారని తెలియజేసింది. 10 సం.లలోపు హిందూ బాలికలు 0.58 శాతం, 10-15 సం.ల వారు 0.68 శాతం, 15-20 సం.ల విద్య నేర్చిన వారు 0.46 శాతం, 20 సం.ల పైబడిన హిందూ స్త్రీలు 0.13 శాతం చదువుకున్నారని తెలియచేసింది. వివిధ వయస్సులవారిగా స్త్రీల సంఖ్య 1,95,84,070 ఉండగా వారిలో 1,80,488 మంది విద్యావంతులైన స్త్రీలు 1 శాతంగా ఉన్నారని పత్రిక తెలియజేసింది. అంటే ఆంధ్రస్త్రీల విద్య 1900 నాటికి ఒక (1) శాతం మాత్రమే ఉన్నట్లుగా అర్థమవుతుంది.

స్త్రీవిద్య- వ్యక్తిత్వస్పృహ

ఆనాటి స్త్రీలు అస్వతంత్రజీవనం నుండి విముక్తి చెందటానికై వారికి సామాజిక సంబంధాలు అవసరమని భావించారు. అందుకోసం వారిలో సాంస్కృతిక నిర్భయత్వం కలగాలని, దానికోసం వారిలో ధైర్యసాహసాలను పెంచగలిగితే స్వేచ్ఛావ్యక్తిత్వం ఏర్పడుతుందని, దానికి స్త్రీవిద్య ప్రధాన దోహదకారి కాగలుగుతుందనే చైతన్యాన్ని కలిగించటానికి సాహిత్యసృజనను స్త్రీలు చేపట్టారు.

ఉన్నవ లక్ష్మీబాయమ్మ 'దేవునియెడల మనము చెల్లించవలసిన విధులు' (జనవరి 1904 జనానా) అని వ్రాస్తూ స్త్రీలు స్వేచ్ఛగా, నిర్భయంగా బతకాలంటే విద్యావంతులు కావల్సిన అవసరాన్ని పేర్కొని స్త్రీలు తమ విద్యకై చేసే కృషియే దైవభక్తిగా భావించమని తెలియజేసింది. పితృస్వామ్యం స్త్రీలకు పూజలు, నోములు, వ్రతాలను నిర్దేశించి, కుటుంబ వ్యవస్థలో వారిని మరింతగా పనిపాటలలో నిమగ్నులను చేస్తే, వారికి సామాజిక జీవనావసరం ఉండదని భావించింది. స్త్రీలు సమాజంలో పురుషులతో సమానంగా సంచరిస్తే పురుషాధిక్యతకు ముప్పనే సామాజిక ఆలోచనలను, కుట్రను

పసిగట్టమని ఉన్నవ లక్ష్మీబాయమ్మ మృదువుగా స్త్రీలను హెచ్చరించటం కనపడుతుంది. స్త్రీవిద్య స్త్రీలస్వేచ్ఛకు, నిర్భయత్వంతో జీవించటానికి మార్గమని సూచించింది.

బాలాంత్రపు శేషమ్మ 'ధైర్యస్థైర్యములు' (జనవరి 1904 సావిత్రి) అనే సంభాషణాత్మక నాటకాన్ని వ్రాస్తూ బాలికలు చదువుకుంటే వారిలో ధైర్యస్థైర్యాలు పెరుగుతాయనీ, బయటకు వెళ్ళినపుడు సమస్యలు ఎదురైనా యుక్తితో ఆలోచించి ఆత్మరక్షణ చేసుకోగలరని, బాలికలు పాత్రలుగా చేసిన చర్యల ద్వారా తెలియజేసింది. దానికై స్త్రీలరచనలను ప్రచురించే పత్రికలైన 'హిందూసుందరి' అనే పాతపత్రికతోపాటు పులగుర్త లక్ష్మీనరసమాంబచేత ప్రారంభింపబడి నూతనంగా పెట్టిన 'సావిత్రి' పత్రికను కొనుక్కొని చదువుకోమనీ, దానివల్ల ప్రాపంచికజ్ఞానం లభిస్తుందని మరొక బాలికాపాత్ర చేత చెప్పించింది. స్త్రీలు నిర్భయంగా పత్రికలను చదువుకునేటట్టుగా రచయిత్రి వారిని ఆలోచింపచేసింది.

కమలాంబ సత్యనాథం 'స్త్రీవిద్య'ను గురించి (ఫిబ్రవరి 1904 తెలుగు జనానా) ఇంగ్లీషులో చేసిన ఉపన్యాస అనువాదంలో మానవులలో ఉన్న శక్తులను అభివృద్ధి చేసేది విద్య అనీ, జ్ఞానస్వీకారము మనస్సునకు అభిరుచిని కలుగజేస్తుందని పెద్దలు చెబుతారనీ, గృహకృత్య సంబంధపు పనులన్నీ నేర్పుతో చేస్తూనే, నీతిమంతంగా ఉండే స్త్రీలకు సాధనతో విద్యను బోధించే స్త్రీలు కావాలని ఆమె తెలియజేసింది. విద్యనేర్చితే శిశుపోషణలో మెలకువలు, వారి సుగుణాలు వన్నెకెక్కుతాయనీ వివాహానంతరం కూడా స్త్రీలు స్వయంకృషితో చిన్నప్పుడు నేర్చుకొన్న విద్యను అభివృద్ధిచేసుకోవాలని పిలుపునిచ్చింది. స్త్రీలు విద్యాలాభములను తెలుసుకోవాలనీ, బాలికలు మెట్రిక్యులేషన్ వరకు చదువుకోవాలనీ, వివాహితస్త్రీలకు ఇంటిదగ్గర స్త్రీసంఘంచేత వారానికి రెండుగంటలు చదువునేర్పించాలనీ, విద్యాలాభం తెలియని అసూయగ్రస్థులైన వారియొక్క అజ్ఞానతిమిరాన్ని పోగొట్టాలని కమలాంబ తన ఉపన్యాసంలో చెప్పింది.

ఉన్నవ లక్ష్మీబాయమ్మ వ్రాసిన 'స్త్రీవిద్య' (మార్చి1904 హిందూసుందరి) అనే నాటకంలో ఒకస్త్రీ మరొక స్త్రీతో చేసిన సంభాషణలో భాగంగా స్త్రీలు విద్యనేర్చి పరీక్షలు వ్రాసి, మీటింగులో ఉపన్యసించటాన్ని అపోహతో విమర్శించటం కూడదనీ, నోములు వ్రతాలు చేయటం, నగలు ధరించి తిరగటం కంటే కూడా సద్గుణసంపన్నతలో, విద్యావంతులుగా ఉంటేనే స్త్రీలకు గౌరవం ఉంటుందని చెప్తుంది. విద్యలేని స్త్రీలు మగవాళ్ళతో నిర్భయంగా, స్వేచ్ఛగా మాట్లాడలేకపోతున్నారనీ, మంచివిద్యను అనభ్యసించిన స్త్రీ సత్ప్రవర్తనతో నిర్భయంగా సమాజంలో సంచరించగలదని ఒక స్త్రీపాత్ర పేర్కొనటంతో నాటకం ముగుస్తుంది.

స్త్రీలు విద్యావంతులయితే సమాజంలో నిర్భయత్వంతో స్వేచ్ఛగా సంచరించగలరనీ అదే స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్యానికి చిహ్నమని ఉన్నవ లక్ష్మీబాయమ్మ భావించింది.

కొలిచిన కాంతమ్మ 'స్త్రీ విద్య' (ఆగష్టు 1904 హిందూ సుందరి) ను గురించి వ్రాస్తూ విద్య నేర్చిన స్త్రీలకు మంచినడత ఏర్పడుతుందనీ, వారు తమపిల్లలకు మంచి నడతను నేర్పించగలరనీ, పురుషులవలె స్త్రీకి విద్య అవసరమని తెలిపింది. ప్రతి ఊళ్ళో బాలికాపాఠశాలలున్నాయనీ, కొంచెం చదవటం, వ్రాయటం, కుట్టుపని వంటివి వస్తున్నాయిగానీ, అది అసంపూర్తిగానే ఉందని తెలియజేసింది.

'సావిత్రి' పత్రికాధిపురాలు ప్రచురించిన 'కమలా విమలా సంవాదము' అనే నాటకంలో (నవంబరు 1904 సావిత్రి) స్త్రీలు చదువుకుంటుంటే, పత్రికలలో వ్యాసాలు వ్రాస్తుంటే పురుషులు విమర్శిస్తున్నారనీ, దాన్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదనీ తెలిపింది.

స్త్రీలు సామాజిక విమర్శకు లొంగకూడదనీ, పట్టించుకోకుండా విద్యాభివృద్ధికై ముందుకు సాగాలనీ చెప్పటమే స్త్రీలను వెన్నుతట్టే విషయమిది. నాటి సాంఘిక వ్యవస్థయొక్క స్వరూప స్వభావానికి అద్దంపట్టిన నాటకమిది.

స్త్రీవిద్య – మానవసంబంధాల అభివృద్ధి

స్త్రీలకు సామాజిక మానవసంబంధాలు ఉండగలిగితే, వారు అభివృద్ధిచెందే మార్గం ఏర్పడుతుందని, అటువంటి సంబంధాలు ఏర్పడటానికి స్త్రీవిద్యాచైతన్యం అవసరమని భావించారు.

భట్టిప్రోలు రాజరాజేశ్వరమ్మ 'స్త్రీవిద్య' (ఫిబ్రవరి 1904 హిందూసుందరి) ను గురించి ఉపన్యసిస్తూ స్త్రీలు విద్యావంతులైతే బంధువులకు మిత్రులకు లేఖలు వ్రాసి సమాచారములను తెలుసుకోవచ్చునీ, స్త్రీలమధ్య సత్సంబంధాలు ఏర్పరచుకోవచ్చునీ చెప్పింది. చదువులేక అజ్ఞానంతో బాలికలు పరస్పరం తగవులు పెట్టుకుంటూ అనైక్యమత్యంతో ఉంటున్నారని చెప్పింది. మానవ సంబంధాల అభివృద్ధికి స్త్రీవిద్య ఎంతఅవసరమో తెలియజేసి, జాతీయ సంస్కరణోద్యమంలో స్త్రీల భాగస్వామ్యాన్ని తెలియజేయటం జరిగింది.

స్త్రీవిద్య – బాల్యవివాహాల నిర్మూలనాచైతన్యం

స్త్రీవిద్యకు ప్రధానంగా ఆటంకమైన విషయం పితృస్వామ్యం నిర్దేశించిన బాల్యవివాహసంస్కృతి అని గుర్తించి, దాని మూలాల నిర్మూలనకై కంకణం కట్టుకోవాల్సిన అవసరాన్ని గుర్తించిన స్త్రీలు ఆ దిశగా స్త్రీలను చైతన్యపరచి స్త్రీవిద్యను అభివృద్ధి చేయాలనుకున్నారు.

వల్లూరి మాణిక్యమ్మ వ్రాసిన అనామకరచనయైన సంభాషణాత్మక నాటకం (మార్చి1904

జనానా) లో భాగంగా అసికాపట్టణంలో జరుగుతున్న మీటింగుకి వెళ్ళివచ్చిన ఒక స్త్రీ పాత్ర మిగిలినవారికి మీటింగ్ విశేషాలను మిగిలిన వారికి చెబుతూ, చాలా మంది స్త్రీలు ఆ సభకువచ్చారనీ, బుచ్చిబంగారమ్మ ఆ సభలోని స్త్రీలు చేసిన ఇంగ్లీషు ఉపన్యాసాన్ని తెలుగులో అనువదించి సభలో వారికి తెలియజేసిందనీ, అతిబాల్యవివాహం గురించి మాణిక్యమ్మ (బహుశా ఈవ్యాస రచయిత) మాట్లాడినట్లుగా చెప్పింది. పెళ్ళంటే తెలియని బాలికలకు పెళ్ళిచేయటం, ముసలివాళ్ళకు ఇచ్చి పెళ్ళిచేయటంతో తత్ఫలితంగా నిర్బంధవైధవ్యం ఏర్పడుతోందని, పూర్వాచార పరాయణియైన చదువురాని స్త్రీని వెకసక్కెము లాడుతున్నారనీ, స్త్రీలు చదువుకుంటే నీతి, జ్ఞానాలు సంపాదించు కుంటారని మాణిక్యాంబ చెప్పినట్లు ఆ స్త్రీపాత్ర చెప్పింది. అంతేకాక స్త్రీలు ముచ్చట్లతో కాలాన్ని దుర్వినియోగం చేస్తున్నారనీ, స్త్రీసమాజాలకు మగవాళ్ళురారని మాణిక్యాంబ చెప్పినట్లుగా ఆ స్త్రీ పాత్ర చెప్పగా తమ ఊరిలో కూడా స్త్రీసమాజం పెట్టుకోవాలని మరొక స్త్రీపాత్ర అనటంతో నాటకం ముగుస్తుంది.

పుస్తకపఠనం చేయలేని స్త్రీలు స్త్రీసమాజాలలో ప్రదర్శించిన నాటకాల ద్వారా స్త్రీలకు విద్యపట్ల ఆసక్తిని పెంచుతూ కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలనీ, బాల్యవివాహాలు నిర్బంధ వైధవ్యానికి కారణమనీ గుర్తించేటట్లు చేసారు. స్త్రీలుసమస్యలను చర్చించుకొనే సమావేశాలకు స్త్రీలు వెళ్ళగలిగే చైతన్యాన్ని కల్గించే ప్రయత్నమే స్త్రీలు బాహ్యప్రపంచంలో వేసే ముందడుగుగా భావించవచ్చు. స్త్రీలు అనువాదకులుగాకూడా ఉన్నట్లు అర్థంమవుతుంది.

స్త్రీల చదువేగాక తెలుగుస్త్రీల విద్యాభివృద్ధిని గురించిన అంచనాలను అవగాహన చేసుకోవటానికి సామాజికాభివృద్ధితో మానవ సంబంధాల అభివృద్ధి సూచికను తెలియజేయటం ఆ నాడే ప్రారంభమైందని అర్థం అవుతుంది. 1904 సం.వరకు వచ్చిన స్త్రీల సాహిత్యంలో బాలికలు చదువుకుంటే మంచి వ్యక్తిత్వాన్ని, స్వేచ్ఛను పొందగలిగి మగ పిల్లలతో పాటు సమానంగా ఎదగగలరనే విశ్వాసాన్ని కల్గించింది. వారిలో సాంస్కృతికంగా ఏర్పడిన బిడియాల్ని ఆత్మన్యూనతను తగ్గించే క్రమంలో వారిలోని ధైర్యస్థైర్యాలను వెలికితీసి స్త్రీలు స్వేచ్ఛావాయువులు పీల్చుకునే వాతావరణాన్ని కల్గించే చైతన్యం ఈ సాహిత్యం కలిగించింది. అంటే స్త్రీవిద్యవల్ల స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్యానికి బలమైన పునాది ఏర్పడటంగా భావించాలి.

'ఇండియా దొరతనంవారి నిర్ధారణ' (మే 1904 జనానా) అనే శీర్షికన పత్రిక ప్రచురిస్తూ దొరతనంవారు ప్రవేశపెట్టిన స్త్రీవిద్యవలన బాలికా విద్య తక్కువగా వున్నదనీ, 1901-02వ సం.లో బాలికసంఖ్య 444-470 అనీ, నూటికిద్దరే బాలికలువిద్య నేర్చుకుంటున్నారని తెలిపింది.

1901–02 లో జరిగిన జనాభా లెక్కల ప్రకారం తెలుగు ప్రజలలో ప్రతి వెయ్యిమందిలో 67 మంది పురుషులు చదువుకుంటే కేవలం ఏడుగురు స్త్రీలు మాత్రమే చదువుకున్నట్టు నమోదు చేయబడిందని పత్రిక తెలియజేసింది.

స్త్రీవిద్య – సాంస్కృతికవివక్షా చైతన్యం

ప్రభుత్వం వారు ప్రకటించిన విద్యాగణాంకాల పరిశీలనలో విద్యాభివృద్ధిలో స్త్రీలు వెనకబడి ఉన్నారని గ్రహించి, దానికి వెనక ఉన్న కారాణాలను విశ్లేషించే క్రమంలో సమాజసంస్కృతిలోని లింగవివక్షను ముఖ్యాంశంగా గ్రహించారు. స్త్రీవిద్యపట్ల ఉన్న సాంస్కృతికమైన లింగవివక్షతను గ్రహింపుకు తెచ్చుకొని పురుషులలో రావలసిన భావపరిణామ చైతన్యం యొక్క అవసరాన్ని గుర్తించారు.

మోటుపల్లి రామాబాయమ్మ 'బృందావని స్త్రీ సమాజంలో స్త్రీవిద్య' (ఫిబ్రవరి – మార్చి 1905 హిందూ సుందరి) ను గురించి చేసిన ఉపన్యాసంలో జీవితాలకు వెలుగును, జ్ఞానాన్ని యిచ్చే విద్య స్త్రీ పురుషుల బేధం లేకుండా ప్రతిమనిషికీ అవసరమనీ, పురుషులకు లాభాన్ని చేకూర్చే విద్య స్త్రీలపట్ల నష్టదాయకమెలా అవుతుందనీ, స్త్రీలు విద్యను నేర్చుకోవటం విటులకు ఉత్తరాలు రాయటానికా అని అంటున్నారంటే అదేవిధంగా పురుషులు చదువుకోవటం కూడా జారభామినులకు ఉత్తరాలు వ్రాయటానికేనా అని ప్రశ్నకు పెట్టింది. అంతేకాదు, విద్యరాని స్త్రీకి విచక్షణా జ్ఞానమెలా ఉంటుందనీ, అందుకే సంసారంలో విద్యలేని తేడాతోనే అనవసరంగా గొడవలు వస్తున్నాయనీ, స్త్రీ విద్యావంతురాలైతే కుటుంబసంబంధ వ్యవహారాలను స్త్రీ చక్కబెట్టగలదని తెలిపింది. స్త్రీలకు విద్యనేర్పింపక, వారిని నీచులని చూడటంవలనే దేశం పరులచేత జయింపబడి స్వతంత్రాన్ని కోల్పోయిందనీ, దేశం బాగుపడాలంటే అందరూ స్త్రీవిద్యాభివృద్ధికి కృషిచేయమని ప్రార్థించింది.

స్త్రీలకు విద్యలేకపోవటం చేతనే వారిని తక్కువచేసి మాట్లాడుతున్నారని, అదే దేశం స్వతంత్రం కోల్పోవటానికి కారణమని మోటుపల్లి రామాబాయమ్మ ముఖ్యమైన ప్రతిపాదన చేసింది. స్త్రీలు చదువుకుంటే సంసారాన్ని చక్కదిద్దుకునే నేర్పు వారికి అలవడుతుందనీ, సంసారాలు సమాజాలు బాగుండాలంటే పురుషులకువలె విద్య ద్వారా స్త్రీల అభివృద్ధి జరగాలనీ, అలా జరగకపోవటం చేతనే దేశం స్వాతంత్ర్యాన్ని కోల్పోయిందని తెలియజేసి స్త్రీవిద్యకు, జాతీయోద్యమానికి ఉన్న లింకును బయటపెట్టింది.

స్త్రీవిద్య – స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యస్పృహ

స్త్రీలు తమ బానిసబతుకునుండి విముక్తి చెందాలంటే ముందుగా విద్య నేరిచి వారు వ్యక్తిస్వాతంత్ర్యాన్ని తెచ్చుకోవాలని చైతన్యపరిచారు.

నూలు సత్యవతమ్మ 'స్త్రీవిద్య' (ఫిబ్రవరి – మార్చి 1905 హిందూసుందరి) ను గురించి రాస్తూ ప్రస్తుతం మనదేశాన్ని పరిపాలించే ఇంగ్లాండ్ దేశ ప్రభుత్వం స్త్రీలు తప్పక చదువవలెనని చట్టాలు చేయాలని తెలిపింది. స్త్రీలకు విద్య లేకపోతే పశుతుల్యులుగా భావింప బడతారనీ, సద్గ్రంథపఠనం చేయాలనీ, స్త్రీలు విద్యనేర్వనందున వారికి వ్యక్తిస్వాతంత్ర్యం లేదని భావించటంచేతనే ఆంగ్లేయులు బాలికాపాఠశాలలను పెట్టారని తెలిపింది. విద్యాభ్యాసం దేహపరిశ్రమఅనీ, పురుషులు స్త్రీలను చదివింపజేయాలనీ, ప్రభుత్వ సహాయంకూడా కావాలని తెలియజేసింది. బ్రిటిష్ ప్రభుత్వం బాలికాపాఠశాలలను నెలకొల్పటంలోని ఉద్దేశంగా స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్యాన్ని ఆకాంక్షించారనీ భావించింది. స్త్రీవిద్యను తప్పనిసరి చేస్తూ చట్టము వస్తేగాని స్త్రీలకు స్వతంత్రజీవనం లభించదని భావించింది.

స్త్రీల ఉన్నతవిద్య – ఉద్యోగం – స్వేచ్ఛాస్పృహ

స్త్రీలు కేవలం రెండుమూడు తరగతులు చదవటంకాక, శాస్త్రపరిజ్ఞానానికై ఉన్నతవిద్యలను చదువుకోగలగాలని, అవసరమైతే ఉద్యోగాలుకూడా చేసుకోవచ్చనే అలోచనలను రేకెత్తించారు.

'ఉన్నతవిద్య' (జులై 1905 హిందూ సుందరి) ను గురించి ఉపన్యసిస్తూ స్త్రీలు ఉన్నతవిద్యను అభ్యసించటానికి తగిన ధైర్యవంతులుగా మారాలనీ, విద్యను అభివృద్ధిచేసుకోవాలనీ, విశేష భాషాభివృద్ధి, దేశచరిత్రలు, భూగోళం, శరీరశాస్త్రాన్ని, సాహిత్యాన్ని తెలుసుకోవాలని చెప్పింది. ఉన్నతవిద్యతో తమలోని దుర్గుణాలను పోగొట్టుకొని ఐకమత్యంతో మెలగాలనీ, స్త్రీలు ఉద్యోగాలు చేయగలిగితే పురుషులకంటేకూడా విశేషస్వేచ్ఛ కలవారవుతారనీ, అంతరించిపోయిన స్త్రీలయొక్క స్వాతంత్ర్యాన్ని నిలబెట్టటానికి అందరూ కంకణం కట్టుకోవాలని పిలుపునిచ్చింది.

స్త్రీవిద్య – పురుషాధిక్య ఖండనాచైతన్యం

కుటుంబాలలో స్త్రీలు చదువుకోకపోవటానికి పురుషాధిక్యసంస్కృతి ప్రధానంగా ఉందని, దానిని ఎదుర్కోగలిగే చైతన్యం అవసరమని భావించి దానికి తగ్గట్టుగా స్త్రీలు రచనలు చేసారు. 20వ శతాబ్దపు ప్రారంభ దశాబ్దంలోనే స్త్రీవ్యక్తిస్వాతంత్ర్య సాధనకు అవసరమైన స్త్రీవిద్యా ప్రయోజనాన్ని తెలుసుకోవటానికి స్త్రీలు ముందుగా స్త్రీసమాజాల సభలకు రావటానికి స్త్రీలు నాటకాలను రచించినట్లు అర్థమవుతుంది. స్త్రీవిద్యకు ఆటంకప్రాయమైన బాల్యవివాహాలను, వైవాహికసంస్కృతిలోని లోపాలను గుర్తించి, వాటిని నిర్మూలించగలిగే స్వతంత్రతను పొందాలను కోవటం, పితృస్వామ్యంలోని పనివిభజనను వ్యతిరేకించాలనుకోవటం 20వ శతాబ్దపు ప్రారంభంలోనే వచ్చిన నాటకాలలో స్పష్టమయింది. ప్రయోగాత్మకమైన ఈ నాటక రచనలద్వారా తోటి స్త్రీలలో విద్యాచైతన్యాన్ని కలిగించే ప్రయత్నం చేసారు.

పత్రికాసంపాదకురాలి ప్రచురణలో వచ్చిన 'కమల' (డిసెంబరు1905 – జనవరి1906 హిందూసుందరిలో) అనే నాటకంలో కమలా విమలా పాత్రల సంభాషణలో భాగంగా బాల్యవివాహాల వల్ల కుటుంబంలో స్త్రీలు కష్టపడుతున్నారనీ, వధూవరులకు బుద్ధి తెలిసి చదువుకున్న తరువాత నచ్చినవానిని వివాహం చేసుకుంటే కుటుంబంలో సంతోషం ఉంటుందని చెబుతుంది. కమలపాత్ర సంభాషిస్తూ తనతండ్రి చదువుకోక పోవటంతో తన తల్లిని బాధపెడుతున్నాడనీ, తల్లి చదువుకొని నౌకరీ చేస్తానని చెప్పి తనతండ్రిని ఇంట్లో వంటచేయమని అడిగిందని చెప్పింది. అంతేకాదు, తన తండ్రి కూతుర్ని చదువుకోని వాడికిచ్చి పెళ్ళిచేయాలనుకుంటున్నానని చెప్పి తన మాటే సాగనిస్తానని అంటే, తన తల్లి అతని ఉద్దేశాన్ని కొనసాగనీయనని చెప్పినట్లుగా వివరించింది.

ఈ నాటకంలో స్త్రీలకు చదువుకోవాలని ఉన్నా అటువంటి పరిస్థితులు లేకపోవటాన్ని తెలియజేసింది. సమాజసంస్కృతిగా కుటుంబాలలో ఉన్న పురుషాధిక్య భావాలతో ఉన్న తండ్రి తాను చదువుకోననీ, ఆమెనూ చదువుకోనీయననీ, కూతురిని చదువుకోని వాడికిచ్చి పెళ్ళిచేస్తానని మాట్లాడే ఆ అజ్ఞానియైన తండ్రియొక్క మూర్ఖత్వపు పురుషాధిక్య స్వభావాన్ని బయటపెడుతుంది. స్త్రీ విద్యపట్ల భర్తల యొక్క అజ్ఞానాన్ని ఖండించాల్సిన బాధ్యత భార్యలకుందని తెలియజేసిన నాటకమిది. స్త్రీ విద్యావంతురాలైతే తనకు నచ్చిన వానిని పెండ్లి చేసుకునే స్వతంత్రం వస్తుందనీ, అవసరమైతే భార్యగా ఉద్యోగం కూడా చేసుకోవచ్చనీ, పురుషుని అధికారం క్రింద స్త్రీ బ్రతకాల్సిన అవసరం లేదనీ తెలియజేసిన నాటకమిది.

కుటుంబ సంస్కృతి ఏర్పాటుచేసిన పనివిభజనను స్త్రీ విద్యావంతురాలై తారుమారుచేస్తేగాని స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్యం సాధ్యపడదనే ప్రేరణను కలిగించారు. ఇక్కడ స్త్రీకి విద్య, ఉపాధి ఉండేటట్లు చేసుకొంటే, కుటుంబంలోని పురుషుడి పెత్తనం వల్లే అవకాశం లేకుండా చేయవచ్చని భావించటమంటే, స్త్రీపురుషసమానత్వం స్త్రీవిద్యా ధ్యేయంగా గల ఒక విప్లవాత్మకమైన ఆలోచనగా అర్థమవుతుంది.

స్త్రీవిద్య – దేశాభిమానం

ఆనాటి ప్రజలకు ముఖ్యమైనది దేశస్వాతంత్ర్యం. అందుకే స్త్రీవిద్యవల్ల దేశాభిమానం అభివృద్ధిచెందితే దేశానికి స్వాతంత్ర్యం రావటం సులభతరం అవుతుందనే ఆలోచనలను కల్పించటంతో స్త్రీలను చదువుకోనిస్తారనే భావించారు.

'దేశాభిమానం' (ఏప్రిల్ 1905. హిందూసుందరి) గురించి కొలిచిన కాంతమ్మ రాస్తూ, స్త్రీవిద్యవల్ల స్త్రీలకు జ్ఞానాభివృద్ధి కలిగితే, తాము చేయవలసిన అర్హకృత్యములు తెలుసుకోగలరని,

దేశాభిమానం కలిగి దేశమునకు మేలుచేయు పనులు చేయగలరనీ, ప్రాణములు ధారపోసియైన దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత స్త్రీలపై కూడా ఉందనీ తెలియజేసింది.

స్త్రీలను ప్రోత్సహిస్తూనే స్త్రీవిద్యాజ్ఞానానికి, దేశాభిమానానికి, దేశరక్షణకు ఉన్న సంబంధాన్ని గ్రహింపుకు తేగలిగింది. స్త్రీలు తమ విద్యాజ్ఞానంతో దేశాభిమానాన్ని పెంచుకొని దేశాన్ని బాగుచేసుకోవాలని చెప్పటంతో స్త్రీల విద్యాభివృద్ధికొరకేకాక, పరతంత్రపాలనలో మగ్గుతున్న దేశాన్ని గురించిన ఆలోచనలను పెంచుకోవటం జరిగింది. దేశాభివృద్ధిలో స్త్రీల కర్తవ్యాన్ని సూచించటం జరిగింది. స్త్రీవిద్యకు దేశస్వాతంత్ర్యానికి ఉన్న సంబంధాన్ని కొలచిన కాంతమ్మ తెలియజేసింది.

స్త్రీవిద్యాప్రయోజన చైతన్యం

స్త్రీవిద్యవల్ల స్త్రీలకేకాదు పురుషులకుకూడా అది లాభదాయకమైన విషయమని చెప్పి, స్త్రీవిద్యావిషయంలో పురుషలలో కూడా చైతన్యం కలగవలసిన అవసరాన్ని గుర్తించారు

బాలాంత్రపు శేషమ్మ 'స్త్రీ విద్య'(జనవరి1907 హిందూసుందరి) ను గురించి రాసిన వ్యాసంలో స్త్రీలు తమ బానిసబతుకునుమడి విముక్తులు అవ్వాలంటే స్త్రీలకు విద్య అవసరమని, అంతరించిన స్త్రీస్వాతంత్ర్యం తిరిగి రావాలంటే స్త్రీలు చదువుకోవాలనీ, స్త్రీలు దేశభాషలో ఉన్నతవిద్యను అభ్యసించే అవకాశాలు పెరిగాయని తెలియజేసింది.

స్త్రీవిద్య స్త్రీల స్వతంత్రజీవనానికి మార్గాన్ని ఏర్పరుస్తుందనీ, అప్పుడే స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యాన్ని పొందగలదని చెప్పింది. నాటి స్త్రీలలో పరభాషలో చేయాల్సిన విద్యాభ్యాసంవల్ల కలిగే భయాన్ని పోగొట్టటంతో పాటు స్త్రీస్వాతంత్ర్యకాంక్షను రగులుకొల్పటం కన్పడుతుంది. స్వభాషలోని స్త్రీవిద్యకు స్త్రీ వ్యక్తిస్వాతంత్ర్యానికి ఉన్న సంబంధాన్ని బాలాంత్రపు శేషమ్మ పేర్కొంది.

దామెర్ల సీతమ్మ వ్రాసిన 'విద్యవలన లాభాలు' (జులై 1907 సావిత్రి) అనే ఇంకొక వ్యాసంలో పురుషులకు వలె స్త్రీలకు కూడా విద్య లాభకారి అనీ, స్త్రీ విద్యావంతురాలైతే జ్ఞానం కలుగుతుందనీ, భర్తకు కూడా అన్నివిధాల అనుకూలంగా ఉంటుందనీ, విద్యవల్ల లాభాలు ఉన్నాయని కూడా దామెర్ల సీతమ్మ తెలియజేసింది.

ఉప్పల నరసమాంబ వ్రాసిన 'స్త్రీ విద్యాపంచరత్నములు' (సెప్టెంబరు1910 సావిత్రి) అనే కవితలో స్త్రీల చదువు వల్ల పిల్లలపెంపకం బాగుండటమే కాక "చేడె చదివినప్పుడు సేమమొదవు, కీడులెవ్వియు నెన్నడు మూడబోవు కానఘనులారా ! పురుషాగ్రగణ్యులారా కాంతలకు విద్య నేర్పింపఁగడక వలయు" అని తెలిపింది. స్త్రీలదుస్థితిని మదిలో ఆలోచించి పాడుపద్ధతులను పోగొట్టమనుచూ, స్త్రీలకు విద్యలేకపోతే దేశమంతయు దీనస్థితిని పొందుననీ, స్త్రీ విద్యతోకూడిన

సత్ప్రవర్తనతో అమితకీర్తి పొందగలదనీ తెలియజేసింది. స్త్రీల విద్యను యిష్టపడని పురుషులలో చైతన్యాన్ని కలిగించే కవితను వ్రాసింది. స్త్రీవిద్యపట్ల స్త్రీలలో చైతన్యం కల్గిస్తూనే పురుషులలో కూడా చైతన్యాన్ని కలిగించాల్సిన అవసరాన్ని గుర్తించటం జరిగింది

మామిడన్న కామేశ్వరమ్మ "స్త్రీవిద్య" (ఆగష్టు 1910 హిందూసుందరి) ను గురించి చేసిన ఉపన్యాసంలో స్త్రీలకు విద్యఅవసరమనీ, ఇంటినిర్వహణ, పరిశుభ్రత గురించి చక్కగా బాధ్యత వహించగలరని, స్త్రీలలోని మూఢత్వాన్ని పోగొట్టేది విద్యఅనీ, పూర్వకాలంలో విద్యావంతులైన స్త్రీలున్నారనీ, స్త్రీలు శ్రద్ధతో చదివితే ఉద్యోగాలను కూడా చేసుకోవచ్చునీ, నేడు మైసూరులో స్త్రీలు ఉపాధ్యాయినులుగా ఉద్యోగాలు చేస్తున్నారనీ, కలకత్తా, బొంబాయిలో ఉన్నత విద్యనభ్యసించిన స్త్రీలున్నారనీ తెలియజేసింది.

స్త్రీవిద్య – ప్రపంచజ్ఞానం

స్త్రీలు తమ బానిసత్వాన్ని గుర్తించగలగాలంటే వారికి ప్రపంచజ్ఞానం అవసరమని, అటువంటి ప్రపంచజ్ఞానాన్ని అందించగల విద్య స్త్రీలకు ముఖ్యమని గుర్తింపజేస్తూ, స్త్రీలను ప్రపంచంవైపుకు నడిపించే చైతన్యాన్ని కలిగించింది.

జూలూరు తులశమ్మ 'స్త్రీవిద్య' (అక్టోబరు 1910 హిందూసుందరి) ను గురించి ఉపన్యసిస్తూ విద్యాధికులగు స్త్రీలు అక్కడక్కడా కనపడుతున్నా, స్త్రీ పురుషుల హేళనలతో ఆడపిల్లలను నాల్గవ తరగతి కంటె హెచ్చుగా చదివించటంలేదనీ, స్త్రీల అల్ప విద్యవల్ల నష్టాలున్నాయనీ, గ్రంథపఠనానికి తగిన సమర్థత ఏర్పడక మంచిగ్రంథాలను చదవలేక పోతున్నారని చెప్పింది. బాల్యవివాహాలు చేస్తున్నారనీ, స్త్రీలను అబలలుగా, జ్ఞానశూన్యులుగానూ వక్కాణిస్తున్నారనీ, సాంప్రదాయాలను పాటిస్తూనే విద్యను నేర్పించినయెడల స్త్రీలోకమునకు శ్రేయోదాయకంగా ఉంటుందని తెలిపింది. వితంతువులకు విద్య నేర్పించాలనీ, కుట్టుపనిని నేర్పించాలనీ, వారిని గృహ బానిసలుగా తయారు చేయవద్దనీ, వారికి బ్రహ్మవిద్య కంటె ముందుగా అవసరమయ్యేది ప్రపంచజ్ఞానం అని తెలియజేసింది.

స్త్రీలకు ఆధ్యాత్మిక విద్యలు తెలియజేసేవారు గానీ లౌకిక ప్రపంచ జ్ఞానం మాత్రం తెలియాల్సిన అవసరంలేదని భావించి, స్త్రీలను ఇంటి బానిసలుగా మార్చిన సామాజిక సంస్కృతిని విమర్శకు పెట్టటం జరిగింది. స్త్రీల హైన్యానికి కారకమైన వైవాహిక సంస్కృతిపట్ల స్పందించాలని చెప్పింది. విద్యతో స్త్రీలు వ్యక్తిస్వాతంత్ర్యాన్ని పొందగలరని తెలిపింది.

స్త్రీవిద్య – వృత్తివిద్యలు

స్త్రీని పోషింపబడేటట్లుగా చేస్తూ పితృస్వామ్యకుటుంబనిర్మాణం జరిగిందనేది సత్యం. అందుకే స్త్రీ బానిసబతుకును అనుభవిస్తోందనే స్పృహను కలిగించి, దానినుండి విముక్తికై స్త్రీలకు ఉపాధిని

కలిగించే విద్య అవసరమనుకున్నారు. దానికై స్త్రీలు కుటీరపరిశ్రమలను ఏర్పాటుచేసుకోవటానికి వీలుగా వృత్తివిద్యలను నేర్చుకోగలిగి ఆర్థిక స్వావలంబనకై ప్రయత్నంచేసే చైతన్యం కలిగించాలను కొన్నారు.

చిన్నారప్పగారి వెంకమ్మ 'స్త్రీవిద్య' (జులై 1910 హిందూసుందరి) అనే అంశాన్ని గురించి స్త్రీ సమాజంలో ఉపన్యసిస్తూ, విద్య అనేది స్త్రీ పురుషులిద్దరికీ అవసరమనీ, వృత్తివిద్య సరిగా బోధపడటానికి తగిన భాషాజ్ఞానం విద్యయే ఇచ్చునని చెప్పింది. స్త్రీలు కూడా తమతమ దేశాలకు ప్రాంతాలకు తగినట్టుగా వృత్తివిద్యలను అభ్యసించాలనీ, స్త్రీలను విద్యావంతులుగా, వివేకరాండ్రుగా చేయగలిగితే ఇంట్లో భర్తకే కాక దేశానికి కూడా ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేసింది. స్త్రీలు సాధారణ చదువులు, శాస్త్రవిద్యయేకాక వృత్తివిద్యలను కూడా నేర్చుకోవాలనీ, ఆ విద్యలే దేశాభివృద్ధికి మూలమని చెప్పింది.

స్త్రీల జీవితాలకు దేశస్థాయిలో విలువ ఉన్నదని భావించి, స్త్రీలు ఆ దిశగా అడుగులు వేయాలనుకోవటం స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్య సాధనలో వేసిన మరొక అడుగుగా భావించాలి.

స్త్రీవిద్య – రాజకీయవ్యవహారాలు

స్త్రీలు అక్షరాస్యులై పత్రికా పఠనం చేయగలిగిన స్థితికి చేరుకొన్న మహిళలలో రాజకీయ వ్యహారాల పట్ల ఆసక్తి కలిగింది. స్త్రీవిద్యాభివృద్దికి ప్రభుత్వాలు ఏ మేరకు సహకరిస్తున్నాయో అంచనా వేసుకొంటున్న క్రమంలో స్త్రీల ఆలోచనలలో రాజకీయాలపట్ల చైతన్యం కలిగిందని అర్థమౌతుంది.

'ప్రస్తుతపు తెలుగుస్త్రీల విద్యాస్థితి' గురించి (జులై 1910 సావిత్రి) పులుగుర్త లక్ష్మీనరసమాంబ వ్రాస్తూ బంగళా (బెంగాల్), పారసి, కేరళ స్త్రీలు విద్యయందు ముందంజ వేస్తున్నారని తెలుగు స్త్రీలు ఆంగ్ల విద్యాభ్యాసంలో వెనకబడి ఉన్నారని దేశభాషలో విద్యనభ్యసించటానికి తెలుగు స్త్రీలు ముందుకు వస్తున్నారని తెలిపింది. తల్లిదండ్రులు స్త్రీవిద్యా లాభాలను తెలుసుకోవటంలేదని, అక్షరజ్ఞానంకల స్త్రీలు పత్రికాపఠనం చేస్తున్నారని బాలికావిద్యకు సంబంధించిన పుస్తకాలు తగినంతగా ప్రచురింపబడటంలేదని, ఆంధ్రస్త్రీలు రాజకీయ వ్యవహారంలో తాము స్వతంత్రంగా ఉండాలని పట్టుబడుతున్నారని తెలియజేసింది.

స్త్రీవిద్య – స్త్రీలపత్రికా నిర్వహణచైతన్యం

పితృస్వామ్యంలో స్త్రీవిద్య అభివృద్ధిచెందాలంటే స్త్రీలే పత్రికలు నడిపి స్త్రీలను సాంస్కృతికంగా చైతన్యపరిచే వ్యాసాలను స్త్రీలచేతనే రాయించగలిగితే, స్త్రీలు చైతన్య వంతులుకాగలుగుతారని

భావించారు. మాడభూషి చూడమ్మ, బాలాంత్రపు శేషమ్మ, మొసలిగంటి రామబాయమ్మ నిర్వహించిన 'హిందూసుందరి' పత్రిక, వింజమూరి వెంకటరత్నమ్మ నడిపిన 'అనసూయ' పత్రిక, పులుగుర్తి లక్ష్మినరసమ్మ నిర్వహించిన 'సావిత్రి', కళ్ళేపల్లి వెంకటరమణమ్మ నడిపిన 'ఆంధ్రలక్ష్మి' పత్రికలే నాటి స్త్రీలఉద్యమచైతన్యానికి పట్టుగొమ్మలు.

గుంటూరు సభలో 'ఆంధ్రవార్తాపత్రికల ప్రచారము' (నవంబరు 1910 హిందూ సుందరి)ను గురించి మాడభూషి చూడమ్మ చేసిన ఉపన్యాసంలో భాగంగా వార్తాపత్రికలవల్లనే స్త్రీలు విశేషజ్ఞానాన్ని సంపాదిస్తున్నారనీ, స్వల్ప విద్యావంతులుగా కూడా పత్రికలకు వ్యాసాలు వ్రాయగలుగుతూన్నారని చెప్పింది. దేశాభిమానంతో విద్యాభివృద్ధియే ప్రయోజనంగా కొన్ని పత్రికలు ప్రచురింపబడుతున్నాయనీ, స్త్రీలచే నడపబడే హిందూసుందరి, సావిత్రివంటి, పత్రికలలో స్త్రీల వ్యాసాలు ఉంటాయనీ, స్త్రీలు చదువుకోవటం తప్పని భావించిన జానపదులు కూడా తమ భార్యాబిడ్డలచేత పత్రికలను చదివింప జేస్తున్నారనీ, ఖండాంతర విశేషాలను తెలుసు కొంటున్నారనీ, పత్రికలను పోషించటం పురుషార్థం క్రింద భావించాలని తెలియజేసింది.

అక్షరాస్యతను అభివృద్ధిచేసుకున్న స్త్రీలు పత్రికాపఠనం ద్వారా ప్రపంచాన్ని అవగాహన చేసుకునే స్థితిని చేరుకోవటం అర్థం అవుతుంది. అంతేకాక పత్రికలను స్త్రీలు నడుపుతున్నారనీ పత్రికా పోషణను ఒక పురుషార్థంగా భావించాలని చెప్పి పత్రికలకున్న ప్రాధాన్యతను తెలియజేసింది. నాడైనా నేడైనా ప్రజలకు ప్రపంచజ్ఞానాన్ని అందించగలిగేది పత్రికారంగమే.

స్త్రీవిద్య – లింగవివక్షాచైతన్యం

జ్ఞానానికి లేని లింగ వివక్ష స్త్రీవిద్యాభివృద్ధిలో కూడా ఉండకూడదనే చైతన్యం రావలసిన అవసరాన్ని గుర్తించారు.

ఉ.నారాయణాంబ వ్రాసిన 'స్త్రీ విద్యాప్రశంస' (ఆంధ్ర పత్రిక సంవత్సరాది సంచిక ఏప్రిల్ 1910) అనే కవితలో 'స్త్రీవిద్య సంఘదురాచారులపాలిట వజ్రాయుధమని', 'నెలత' కు విద్య దగినట్లు నేర్చుకున్న దేశమంతకంతకు దీనదశకు వచ్చుననియు... సౌఖ్యములిచ్చును విద్య తల్లికాన రమణులకద్ది వద్దనెడు రాక్షసనీతిని నమ్మరాదుగాక మృతమా హాయి యెక్కరికి హాని మఱొక్కరి కింపొనర్చునే" అని స్త్రీలకువిద్య అందాల్సిన అవసరాన్ని నొక్కి వక్కాణించింది. విద్య పురుషుల పాలిట అమృతమైతే స్త్రీలపాలిట హానికరం ఎలా అవుతుందని సమాజాన్ని ప్రశ్నకుపెట్టింది. స్త్రీలువిద్యావంతులైతే సమాజం వాళ్ళపాలిట నిర్దేశించిన దురాచారాలను ఎదుర్కోగలరని, స్త్రీలకు విద్యకూడదనేది రాక్షసనీతి అని స్పష్టం చేసింది.

పిళ్ళారిసెట్టి లక్ష్మీకాంతమ్మ విజయనగరమందలి సత్యసంవర్ధనీ సమాజపు సభలో 'విద్యావశ్యకత' (జనవరి 1911 హిందూసుందరి) ను గురించి చేసిన ఉపన్యాసంలో పురుషులకువలె స్త్రీలకు విద్యఅవసరమనీ, బిడ్డలు తెలివిగలవారుగా తయారవ్వాలంటే స్త్రీవిద్య అవసరమనీ, స్త్రీలు చదువుకోవటం చేతనే వైద్యం నేర్చుకొని శిశువుల దేహారోగ్యాలను గురించి అర్థంచేసుకుంటున్నారని తెలిపింది. అంతేకాదు, స్త్రీల చరిత్రలను చదువుకొని స్త్రీల శక్తిసామర్థ్యాలను అర్థం చేసుకుంటున్నారనీ, తమ బిడ్డలను చదివించగలుగుతున్నారనీ చెప్పింది. ఆ సభలో న్యాయపతి విజయలక్ష్మమ్మ మాట్లాడుతూ స్త్రీ పురుషులకు లింగభేదమేగానీ, జ్ఞానభేదం లేదనీ తెలిపింది. జ్ఞానానికి లింగవివక్షలేదనే భావనయే స్త్రీలఅభివృద్ధికి మూలమైన విషయంగాను, స్త్రీలు తమ శక్తిసామర్థ్యాలను గుర్తించగలిగేటట్లుగా చైతన్యపరచటం స్పష్టమవుతుంది. స్త్రీవిద్యాఫలితాలను తెలియజేసింది.

'సత్యసంవర్ధినీసమాజ' సభలో (జనవరి 1911 హిందూసుందరి) గుండాల సుభద్రమ్మ చేసిన ఉపన్యాసంలో, ఇప్పటి స్త్రీలు చదవను, వ్రాయను చేయగలిగేంత వరకు చదవగలిగితే చాలని అనుకుంటున్నారుగానీ, ఆ స్థాయి విద్యకూడా ప్రభుత్వంపెట్టిన బాలికాపాఠశాలలను నెలకొల్పటంచేత వీలయిందని చెప్పింది. ఆడపిల్లలు మగపిల్లల మధ్య తేడా కన్పించటానికి ఆడపిల్లలకు విద్యను నేర్పించకపోవటమేననీ, స్త్రీలను చిన్నతనంలో చదివించగలిగితే పురుషులతోపాటు తెలివితేటలుగలవారిగా స్త్రీలు భావింపబడతారు. కాబట్టి స్త్రీలు విద్యను అభివృద్ధి చేసుకొంటేనే స్త్రీ పురుషులు సమానంగా చూడబడతారని తెలియజేసింది. విద్యావిషయంలో స్త్రీల పెంపకంలోని తేడాను ఆనాడే స్త్రీలు గుర్తించారు. స్త్రీవిద్యపట్ల గల సామాజిక లింగవివక్షను తెలియజేస్తూ విద్యావంతులైన స్త్రీలు తోటిస్త్రీలవిద్యకు కృషిచేయాల్సిన అవసరాన్ని తెలియజేసింది.

స్త్రీలు – విద్యాహక్కు చైతన్యం

స్త్రీలు విద్యను పొందటం తమ జన్మహక్కుగా భావించారు. హక్కులకు సంబంధించిన చైతన్యం స్త్రీలను అభివృద్ధిమార్గంలో నడిపించగలుగుతుందనేది నిర్వివాదాంశం.

పెనుగొండ తాలూకాలోని కొత్తచెర్వులో జరిగిన 'సంఘసంస్కరణ' సభలో కమ్మచిన్నారప్ప వెంకమ్మ స్త్రీ పురుషులను సంబోధిస్తూ 'స్త్రీ విద్య'ను (మార్చి 1911 హిందూసుందరి) గురించి చేసిన ఉపన్యాసంలో భాగంగా స్త్రీలకు విద్యలేనందువల్ల కలిగే మూఢత్వానికి ప్రతీకారం ఆలోచించలేక పోతున్నారనీ, భండారు అచ్చమాంబ, పులుగుర్త లక్ష్మీనరసమాంబ విద్యావంతులుగా ప్రశస్తి పొంది ఉన్నారనీ, విద్యాదేవత సరస్వతి కాబట్టి, పురుషులకంటే స్త్రీలకే చదువుకునే హక్కు ఎక్కువగా ఉందని చెప్పింది. స్త్రీల విద్యాహక్కును ప్రతిపాదించటం జరిగింది. స్త్రీలు తమ విద్యాహక్కుల

చైతన్యాన్ని పొందటమే స్త్రీవ్యక్తిస్వాతంత్ర్య సాధనకై చేరుకొనే మార్గంగా భావించాలి.

వెన్నా మంగతాయారమ్మ 'స్త్రీవిద్య' (అక్టోబరు 1914 హిందూసుందరి) ను గురించి వ్రాస్తూ విద్యావశ్యకత అందరికీ సమానమేననీ, బాలికలకు విద్యనేర్పించాలనీ, విద్యాచట్టం స్త్రీలకు ఉపయుక్తమగు విద్యలను నేర్పాలనీ, దేశచరిత్ర గణితం, భాషాజ్ఞానం, శారీరకశాస్త్రాలు, శిశు పోషణం, పాకశాస్త్రం, సంగీతం, చిత్రలేఖనాలు వంటి విద్యలను నేర్పాలని తెలిపింది. ఆరోగ్యంగా ఉండి ఇంటినిర్వహణ చేయగలిగితేనే భవిష్యత్తులో స్త్రీలు రాజకీయోద్యోగాలు చేయగలుగుతారనీ, మాతృభూమిని సంస్కరించుకొనేవిధంగా స్త్రీ విద్యావ్యాప్తికి కృషిచేయాలని చెప్పింది. ఇది ఆమెయొక్క క్రాంతదర్శనానికి మచ్చుతునక. స్త్రీల జీవితాలలో విద్య, ఆరోగ్యంయొక్క ప్రాధాన్యతను తెలియజేసింది.

వివిధశాస్త్రాధ్యయనంతో కూడిన స్త్రీల గృహనిర్వహణాసామర్థ్యమే వారు చేయగల రాజకీయ ఉద్యోగాలకు అర్హతగా భావించింది. స్త్రీలు పాలనా వ్యవహారాలలో చోటు కల్పించుకోవాలనే ఆలోచనలను రేకెత్తించింది.

స్త్రీవిద్య – లింగవివక్షా విమర్శనా చైతన్యం

స్త్రీల దుస్థితికి పితృస్వామ్యసంస్కృతియే ప్రధానకారణమని గుర్తించి స్త్రీవిద్యకు రహదారులు వేయగల చైతన్యాన్ని అందించే కృషి జరిగింది. ఆ సంస్కృతిని తేటతెల్లం చేస్తూ తూర్పారబట్టిన విమర్శను ఆనాటి స్త్రీ చేయటం గమనార్హం. సమాజంలో తన జీవనభద్రతకై ఆ కవిత అనామక రచనగా ఉన్నప్పటికి, అది ఒక స్త్రీయొక్క స్వానుభవంయొక్క పరాకాష్ఠస్థితిని ప్రతిఫలించటంవల్ల దానిని స్త్రీరచనగా గుర్తించాల్సి ఉంటుంది.

అనామక కవయిత్రి వ్రాసిన 'పంచరత్నములు' (నవంబరు 1911 సావిత్రి) అనే పద్యాలను 'భార్యలపాలిటి మృత్యుదేవతలు' అనే శీర్షికన పత్రికాధిపురాలి ప్రచురణలో వచ్చాయి. తల్లిదండ్రులను వదిలి భర్తను నమ్మి వచ్చిన స్త్రీలను ఇంటినుండి గెంటివేసేవారును, భార్యలను మానసిక శారీరక హింసకు గురిచేసేవారును, ఆలిని మోసపుచ్చి వెలయాలికి ధనము వెచ్చించువారును, విద్య కులకాంతలకు తగదని ఇంట్లోనే బందీచేసి స్వేచ్ఛనివ్వని వారును, చదువుకుంటున్న స్త్రీలను కులటలని నిందించు భర్తలు భార్యలపాలిటి మృత్యుదేవతలని పేర్కొంది.

"చదువులఁబ్రొద్దుఁబుచ్చుటను సార్థమౌనరజన్మమంచు, స
త్పథముల నేర్పుగ్రంథములఁ దద్దయుఁగాంచెడు స్త్రీలఁజూచి, యి
య్యది కులటంచు నారటము నందుచు నారడి బెట్టివారలం
బ్రతుకగనీయనివారెకద భార్యలపాలిటి మృత్యుదేవతల్"

అని కవయిత్రి తెలియజేయటం భర్తలు పెట్టేహింసలను బట్టబయలుచేయటం ఆ నాటికది స్త్రీలసాహసంగా భావించాలి. అందుకే కవితా కర్తృత్వం అనామకంగానే ప్రచురింపబడిందని అర్థమవుతుంది. భార్యలవిద్యను ఆటంక పరిచేది భర్తలే నని స్త్రీలపాలిటి వారే మృత్యుదేవుళ్ళని స్పష్టంచేసింది. భర్తల కుసంస్కారపు జీవనవిధానాన్ని బట్టబయలు చేసింది. స్త్రీలవ్యాసాల ప్రచురణకే పరిమితమైన పత్రిక కాబట్టి రాసినది కవయిత్రి అని భావించవచ్చు.

స్త్రీవిద్య – వైవాహికసంస్కృతీచైతన్యం

గూడపాటి లక్ష్మీనరసమ్మ 'హైందవ యువతీపతనము' (సెప్టెంబరు 1911 హిందూ సుందరి) అనే శీర్షికన వ్రాస్తూ పూర్వకాలంలో స్త్రీలలో విద్యావంతులు ఉన్నారనీ, బాల్యవివాహాల వల్ల స్త్రీలకు విద్యావికాశం కలగటంలేదనీ, బాల్యవివాహాలను మాన్పించి విద్యార్జన చేసేటట్లుచేసి రజస్వలానంతర వివాహాలు చేయాలని తెలిపింది. అప్పుడే దేశం, సంఘం, బాగుపడుతుందనీ, దానికై బాలికా పాఠశాలలు ప్రతిగ్రామాలలో పెట్టాలని కోరారు.

'స్త్రీవిద్యకు భంగకరమగు వైవాహికధర్మములు, వానిని తొలగించునుపాయములు' (మే 1912 హిందూసుందరి) అని కళ్ళేపల్లి వెంకటరమణమ్మ వ్రాస్తూ వైవాహిక సంబంధ బాంధవ్యములు శాశ్వతంకాదనీ, పరలోకానికి వెళ్ళేటప్పుడు వెంటరావని తెలియజేస్తూ, భర్తచనిపోతే స్త్రీలను మూర్ఖురాండ్రుగా చేయటంచేతనే స్త్రీ విద్యాభ్యుదయానికి ఆటంకం కలుగుతోందని తెలిపింది. దానికై రజస్వలానంతర వివాహాలకై ఉద్యమాలు చేయాల్సిఉందనీ, బాల్యవివాహాల రూపుమాపి దేశాభ్యుదయానికి కృషిచేయాలని తెలిపింది. అంతేకాక, స్త్రీలకు మైనారిటీ తీరువరకు గర్భాదానం కూడదనియు, సంరక్షకులు చేసిన వివాహములు రద్దుచేసుకొనేటట్లుగా యువతులకు స్వాతంత్ర్యం ఇప్పించే విధంగా బిల్లులు ప్రవేశపెట్టాలని కూడా తెలియజేసింది.

బాల్య వివాహాలకు, స్త్రీల ఉన్నత విద్యకును, స్త్రీల స్వాతంత్ర్యానికి, దేశాభ్యుదయానికి ఉన్న సంబంధాన్ని తెలియజేసింది. అసమానవైవాహిక సంస్కృతి స్త్రీల సమస్యలకు కారణం అనీ, రజస్వలానంతర వివాహబిల్లు పెట్టి ఉద్యమం చెయ్యాలని భావించింది. అవసరమైతే తనకు జరిగిన బాల్యవివాహాన్ని రద్దుచేసుకొని స్వాతంత్ర్యాన్ని పొందేవిధంగా బిల్లును ప్రవేశపెట్టాలని భావించింది. అంటే విడాకులబిల్లుకు అంకురార్పణ చేయటంగా అర్థమవుతుంది. స్త్రీలకు వైవాహిక స్వాతంత్ర్యం ఉండటమే స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్యసాధన అని అర్థమవుతుంది. కుహనా శాస్త్రరూపంలో స్త్రీలపై ఏర్పడిన భావజాలాన్ని ఖండించే చైతన్యాన్ని సాహిత్యంద్వారా ప్రచారం చేస్తూ స్త్రీలలో వ్యక్తి స్వాతంత్ర్యపు స్పృహను కళ్ళేపల్లి వెంకటరమణమ్మ కలిగించాలనుకొన్నది. అంతేకాక, దేశస్వాతంత్ర్య సాధనకు స్త్రీవిద్యాస్వాతంత్ర్యం ముఖ్యమని ఈమె భావించింది.

స్త్రీవిద్యాభివృద్ధి - పల్లెలు

బ్రిటిష్ పరిపాలనలో భారతదేశంలోని పట్టణాలలో విద్యాసంస్థలు ఏర్పాటయినాయి గాని నిరక్షరాస్యత, సాంస్కృతికకట్టుబాట్లు ఎక్కువగాఉన్న పల్లెలనుకూడా పట్టించుకొని అక్కడ స్త్రీలవిద్యను అభివృద్ధి చేయాలనుకొన్నారు.

'స్త్రీవిద్య' (డిసెంబరు 1910 హిందూ సుందరి) ను గురించి స్త్రీ సనాతనధర్మమండలి సభలో ఏకా వెంకటరత్నమ్మ ఉపన్యసిస్తూ మిస్ బ్రూయర్ దొరసానిగారు స్త్రీల విద్యాభివృద్ధికై అనేక ఉపాయములు చెప్పి పాఠశాలలను ప్రారంభించమని చెప్పగా, తాను బాలికాపాఠశాలను గుంటూరు నందు ఏర్పాటుచేసినట్లు చెప్పింది. పల్లెల్లో కూడా పాఠశాలను ఏర్పాటుచేసి బీదలకు, అంగవిహీనులకు, సహాయము చేస్తూ విద్యనేర్పినట్లయితే స్త్రీలలో విద్యాభివృద్ధి ఉంటుందని తెలిపింది. స్త్రీలకు జ్ఞానోదయాన్ని కలిగించవచ్చనీ, నాగరికత కూడా అలవడుతుందనీ, ప్రపంచజ్ఞాన్నాన్ని పొందుతున్నారనీ, విక్టోరియా దయాస్వభావంతో బాలికాపాఠశాలలు వెలయటంతో స్త్రీల విద్యాభివృద్ధి జరిగిందని తెలియజేసింది.

'హిందూస్త్రీల ప్రస్తుతస్థితి' (ఏప్రిల్ 1911 ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక) ని గురించి మామిడన్న కామేశ్వరమ్మొ రాస్తూ పల్లెటూళ్లలో కూడ స్త్రీ సమాజాలు ఏర్పడటంవల్ల స్త్రీలు చదువుకుంటున్నారని, తమలో తాము ఐకమత్యాన్ని అభివృద్ధి చేసుకొంటున్నారనీ, స్త్రీలు పత్రికాధిపత్యాన్ని చక్కగా నిర్వహించగలుగుతున్నారని తెలిపింది. అంతేకాక, సభలలో స్త్రీలు చక్కగా ఉపన్యసించ గలుగుతున్నారనీ పట్టణాలలో జనానా (స్త్రీ) పాఠశాలలో స్త్రీలు బోధకురాండ్రుగా ఉన్నారనీ, పల్లెల్లో కూడా స్త్రీలు బోధకురాండ్రుగా ఉంటే స్త్రీవిద్య అభివృద్ధి చెందుతుందని తెలియజేసింది.

పల్లెల్లో స్త్రీవిద్యాభివృద్ధి జరగటానికి ఒక సాంస్కృతిక పరిష్కారాన్ని సూచించింది. స్త్రీసమాజాలు ఏర్పడాలనే ఆలోచన వచ్చిన దశాబ్దంలోపే పల్లెలోకూడా స్త్రీసమాజాలు ఏర్పడాలని భావించడమే స్త్రీలవిద్యాభివృద్ధికి సోపానాలు వేయటంగా భావించవచ్చు. స్త్రీలు విద్యావంతులైతే పురుషుల యొక్క కష్టాలను మాన్పించగలుగుతారనీ, స్త్రీల చదువు గృహనిర్వహణకు బాగా ఉపయోగపడుతుందని భావించింది. అవసరమైతే ఉద్యోగానికిగాని ఆర్జనకుగాని ఉపయోగపడుతుందనీ, స్త్రీవిద్య అవసరంలేదనే పురుషుల మనస్తత్వానికి మందు వేయటంగా భావించాలి.

బులుసు సూరమ్మ 'అవున్నత్యము' (అక్టోబరు 1913 హిందూసుందరి) ను గురించి చేసిన ఉపన్యాసంలో విద్యావంతులైన స్త్రీలుగా వితంతువులు పల్లెల్లోకి వెళ్ళి స్త్రీవిద్యను గురించి

ఉపన్యాసాలివ్వాలనీ, అక్కడ స్త్రీల సమాజాలను ఏర్పరచాలనీ, దేశాభ్యుదయం దేశస్త్రీల మీదనే ఆధారపడి ఉంటుందని దేశచరిత్రలు ఘోషిస్తున్నాయని చెప్పింది. స్త్రీజాతిని ఉద్ధరించటానికి స్త్రీలు విద్యాఉద్యమంలో భాగంగా స్త్రీలు 'ఇండియా సేవకసంఘం' వంటి సంఘాన్ని స్థాపించి ప్రతిపల్లెలోనూ ఉపసంఘాలను ఏర్పాటుచేయాలనీ స్త్రీలకు విద్యాగంధం కలిగేవిధంగా వితంతుస్త్రీలు ప్రయత్నించాలని తెలియజేసింది. దేశాభివృద్ధిలో వితంతువులపాత్ర గొప్పదని తెలియజేసి వారిలో ఆత్మవిశ్వాసాన్ని కలిగించటం అర్థం అవుతుంది. ఈ ఆలోచనలే స్త్రీలలో దేశస్వాతంత్ర్యసాధనకు దారులు వేసాయి.

స్త్రీవిద్యాభివృద్ధి - నారీప్రముఖుల స్ఫూర్తి

సాంస్కృతిక ఆంక్షలున్న సమాజంలో స్త్రీలు ముందుకువచ్చి తోటి స్త్రీలలో విద్యాకాంక్షను రగిలించటానికి స్త్రీవిద్యకై సమాజంలో పాటుబడే స్త్రీలున్నారనే స్ఫూర్తిని కలిగించే ప్రయత్నం చేయటం జరిగింది.

'సోదరి' అనే పేరుతో వ్రాసిన 'నవీన నారీరత్నాలు' (జనవరి1911 హిందూసుందరి) అనే వ్యాసంలో బరోడా, విజయనగరం, కురుపాం రాణుల పేర్లను పేర్కొని వారు అభివృద్ధి చేసిన స్త్రీవిద్య, చేతిపనులు దేశాభివృద్ధికి ముఖ్యధనమని తెలియజేసింది. ఆంధ్రదేశంలో బుర్రాబుచ్చి బంగారమ్మ, గొల్లకోట సూరమ్మ, బులుసు సూరమ్మ, సీతమరాజు నర్సమాంబ, పులుగుర్త లక్ష్మీనరసమ్మ, ఏకా వెంకటరత్నమ్మ, యిప్పకుంట వెంకమాంబ, కొటికలపూడి సీతమ్మ, దామెర్ల సీతమ్మ, కళ్ళేపల్లి వేంకటరమణమ్మ, మోటుపల్లి రామాబాయమ్మ, మొసలిగంటి రామాబాయమ్మ వంటి వారు స్త్రీ సమాజాలను నెలకొల్పుతూ బాలికావిద్య, స్వదేశీబట్టల తయారీని నేర్పుతున్నారని ప్రశంసించింది. ఆ నారీరత్నాలు స్వతంత్ర జీవనేచ్ఛగలవారగుటచే స్త్రీలకుపయోగపడే పనులు చేస్తున్నారనీ తెలియజేసింది. దానికి అనుబంధంగా నాటి పత్రికాధిపురాలు, మరికొంతమంది స్త్రీలను పేర్కొంటూ బాలంత్రపు శేషమ్మ, మాడభూషి చూడమ్మ, పి.లక్ష్మీకాంతమ్మ, జూలూరు తులశమ్మ, దేవదారు సీతమ్మ, చొప్పనమాణిక్యాంబ, చిలుకూరి వెంకట రత్నమాంబ, పిల్లలమర్రి కామేశ్వరమ్మ, కె.అలమేలుమంగమ్మ వంటి మరికొంతమంది నారీరత్నాలున్నారని తెలియజేసింది. స్త్రీల అభివృద్ధికై పాటుపడిన నాటి నారీరత్నాలను స్మరించుకుని స్ఫూర్తిని పొందేటట్లు చేసింది. స్త్రీసమాజాలలో నేర్పుతున్న స్త్రీవిద్య, స్త్రీలవృత్తివిద్యలు దేశాభివృద్ధికి అవసరమనిభావించి, దేశ ఆర్థికవ్యవస్థనలో స్త్రీల భాగస్వామ్యానికి గుర్తింపు కలిగేలా అడుగులు వేయటం స్పష్టమవుతుంది.

ఉన్నతవిద్య - శాస్త్రపరిజ్ఞానం

మాడభూషి చూడమ్మ వ్రాసిన 'శాస్త్రములు స్త్రీలకవశ్యకమా' (మార్చి1911 హిందూసుందరి) అనే వ్యాసంలో స్త్రీలకు 14 సం.లోపే శాస్త్రజ్ఞానాన్ని పాఠశాలలో తెలియజేయాలనీ, స్త్రీలు

జ్ఞానవంతులైతే పిల్లలను తెలివిగల వారిగా పెంచుతారనీ, ముఖ్యంగా స్త్రీలకు శారీరకశాస్త్ర పరిజ్ఞానం అవసరమనీ తెలియజేసింది. స్త్రీల విద్యలో ప్రధానమైనది శాస్త్రవిజ్ఞానసముపార్జన అని, అది కుటుంబ, సామాజిక అభివృద్ధికి అవసరమనీ తెలియజేసింది. స్త్రీల చదువు, ఉన్నతవిద్యతో పాటు స్త్రీలకు శాస్త్రవిజ్ఞానం దేశాభివృద్ధికి అవసరమని భావించింది.

కాకినాడలో జరిగిన 'ఆంధ్ర మహిళా సభ' కు (ఏప్రిల్ 1911 సావిత్రి) అధ్యక్షత వహించిన కళ్ళేపల్లి వేంకటరమణమ్మ చేసిన ఉపన్యాసంలో స్త్రీలు కాలాన్ని వ్యర్థపుచ్చక దేశాభ్యుదయాన్ని గురించి ఆలోచించాలనీ, స్త్రీలకు ఉన్నతవిద్యయొక్క ఆవశ్యకత ఏర్పడిందని తెలిపింది. స్త్రీలు భౌతిక, ఆధ్యాత్మిక విద్యలను నేర్చుకోవాలనీ, మాతృభాషలో బోధన జ్ఞానసముపార్జనకు ఉపయోగపడుతుందనీ, స్త్రీలు కర్మవిద్యలయిన వృత్తి విద్యలను, కళలను కూడా అభ్యసించాలని తెలియజేసింది. స్త్రీవిద్యాభివృద్ధిలో స్వభాషలో బోధన ముఖ్యమని చెప్పింది.

'పులివర్తి ఈశ్వరమ్మ 'ప్రస్తుతోన్నతవిద్య' (జనవరి 1914 హిందూసుందరి) ను గురించి వ్రాస్తూ బాలికాపాఠశాలలో విద్యాభ్యాసానంతరం స్త్రీలు ఉన్నతవిద్యను అభ్యసిస్తేనే శాస్త్రజ్ఞానం కలుగుతుందని, తండ్రి విద్యాభిమాని అయితేనే కూతురిని ఉన్నతవిద్యను అభ్యసించేటట్లు చేస్తున్నాడని తెలిపింది. ఉపాధ్యాయులు కూడా బాలికల విద్యాభివృద్ధికి తోడ్పడాలనీ, స్త్రీలు గణితము, చరిత్రాన్ని చదువుకోవాలనీ, బాలికలకు నరసాపురి పరీక్ష వ్రాయటమే ఉన్నతవిద్యగా ప్రస్తుతం ఉన్నదనీ, వారిని దొరతనంవారు ఉపాధ్యాయినులుగాను నియమిస్తున్నారనీ, దానివల్ల బాలికావిద్యాఅభివృద్ధి చెందుతోందని తెలియజేసింది.

స్త్రీవిద్య – ఆర్థికస్వావలంబనా స్పృహ

చారిత్రకంగా స్త్రీలను తక్కువస్థాయిలో ఉంచటానికే వారిని పోషింపబడేస్థాయిలోకి పితృస్వామ్యం నెట్టిందనేది ప్రతిస్త్రీకి అనుభవంలోకి వచ్చిన విషయమే. స్త్రీలు విద్యను పొందితే ఆర్థిక స్వావలంబనదిశగా అడుగులు వేయగలరని భావించి, స్త్రీలలో ఆర్థిక – సాంస్కృతిక చైతన్యం కలిగించాలనుకొన్నారు.

మందపాటి భారతమ్మ "హిందూస్త్రీల ప్రస్తుతపుస్థితి" (జనవరి 1912 హిందూసుందరి) ని గురించి వ్రాస్తూ, లోకంలో ప్రతి వస్తువు మార్పుచెందుట ఎంతసహజమో అలాగే స్త్రీలలోనూ మార్పు ఉండాలనీ, మార్పునకు కాలమే ఆధారమనీ, స్త్రీవిద్యయందు అటువంటి మార్పే వచ్చిందని తెలిపింది. విరామం కలిగినపుడల్లా స్త్రీలు పుస్తకపఠనం చేయటమో, వీణవంటి వాయిద్యాలు నేర్చుకోవటమో, పత్రికలకు వ్యాసాలు వ్రాయటమో చేస్తున్నారనీ, స్త్రీలు మంచి చరిత్రములు చదివి పాఠశాలలో బోధకురాండ్రుగా ఉద్యోగాలు చేస్తున్నారనీ, కొద్దిరోజుల్లో స్త్రీలు ఉన్నతస్థితికి చేరుకోగలరని

తెలియజేసింది. స్త్రీల ఆలోచనలలో మార్పును కోరుకోవటమే అభివృద్ధి సూచకమనే భావనను కలిగించటం జరిగింది. స్త్రీలు బోధకురాండ్రుగా ఉద్యోగాలలో నియామకాన్ని పొందటం స్త్రీల ఆర్థికస్వేచ్ఛకై వేసిన మరొక అడుగు. ఒక ఆశావాదిగా రచయిత్రి వ్రాసిన వ్యాసమిది.

కందుకూరి వెంకాయమ్మరావు స్త్రీల స్థితిని గురించి చేసిన 'ఉపన్యాసము' (జూన్ 1912 వివేకవతి) లో విద్యావంతులైన స్త్రీలు తమ అభివృద్ధికొరకు పాటుపడాలనీ, మీటింగులు, సమాజసమావేశాలకు వెళ్ళగలగాలని పిలుపునిచ్చింది. స్త్రీలు తమ తోటివారిని విద్యావిషయంలో ప్రోత్సహించాలనీ, చదవటం, వ్రాయటం అనే విద్యాసాధనలను ఉపయోగించి విదేశీస్త్రీలవలె ఉన్నతవిద్యను అభ్యసించాలనీ, స్త్రీ వైద్యులుగా, ఉపాధ్యాయినులుగా ఎదిగి స్త్రీల అభివృద్ధికి కృషిచేయటం దేశగౌరవమని తెలియజేసింది. అంతేకాదు, 'స్త్రీ స్వాతంత్ర్యం' (సెప్టెంబరు 1912 వివేకవతి) ను గురించి ఈమె ఉపన్యసిస్తూ స్త్రీలు విద్యావంతులై, భర్తలవలె సద్వృత్తిని చేపట్టి ద్రవ్యార్జన చేయాలని తెలియజేసింది.

స్త్రీవిద్య – మహిళాసభలు

స్త్రీవిద్యా ప్రచారంకోసం ఆరంభమైన స్త్రీసమాజాలు సమైక్యంగా విస్తరించి మహాసభలకింద రూపాంతరం చెందుతున్న దశలో స్త్రీల చైతన్యం ఆంధ్రదేశమంతటా బలంగా పునాదులను సంతరించుకోగలిగింది. ఆర్థిక – రాజకీయరంగాలవైపు తమ దృష్టిని సారించటం మొదలుపెట్టింది.

పులుగుర్త లక్ష్మీనరసమ్మ వ్రాసిన 'ఆంధ్రమహిళాసభ' అనే (ఏప్రిల్ 1911, సావిత్రి) వ్యాసంలో ఆంగ్లేయ ప్రభువులు, స్వదేశీప్రభువులు, సజ్జనులవల్ల స్త్రీవిద్య ఉదయించిందనీ, స్త్రీలు వార్తాపత్రికలను చదువుతున్నారనీ, స్త్రీసమాజాలను ఏర్పాటుచేసుకొని స్త్రీవిద్యాభివృద్ధికై పాటుపడుతున్నారనీ, కొందరు స్త్రీలు బాలికాపాఠశాలలను స్థాపించి పనిచేస్తున్నారని తెలిపింది. ఆంధ్రస్త్రీలు ఐకమత్యంతో మహాసభలను ఏర్పాటుచేసుకొని స్త్రీవిద్యాభివృద్ధికై తీర్మానాలు చేసుకొంటున్నారనీ, స్వభాషలోను, రాజకీయభాష (ఆంగ్లం) లలోను స్త్రీలు విద్యాభివృద్ధిని పొందాలని తెలియజేసింది.

బెజవాడలో ఏప్రిల్ 11–12వ తేదీలలో 1914 సంవత్సరంలో ఏర్పాటు చేసిన (ఏప్రిల్ 1914 హిందూసుందరి) ఆంధ్రమహిళా మహాజన సభలో చర్చించబడే విషయాలను గురించి ఆ సభకు కార్యదర్శులుగా ఉన్న ముద్దాసుబ్బమ్మ, అయ్యదేవర దుర్గాంబ సంయుక్తంగా తెలియజేస్తూ, స్త్రీల ఉన్నతవిద్యాభివృద్ధికై అధికసంఖ్యలో బాలికాపాఠశాలలు ఏర్పడాలనీ, వితంతురక్షణ, స్త్రీ శరణాలయాలుండాలనీ, ఉపాధ్యాయినీ నియామకానికి అర్హతగా గుర్తింపునివ్వాలనీ, యుక్తవయస్సు వచ్చిన బాలికలను పాఠశాలలకు పంపేటట్టు చూడాలనే విషయాలను చర్చనీయాంశాలుగా పెట్టారు.

స్త్రీధనాన్ని కాపాడుకునే మార్గాలను బోధించాలనీ, శిశుసంరక్షణ, గృహనిర్వాహకత్వం, ఆరోగ్యశాస్త్రాలను పాఠశాలలో నేర్పి బాలికలకు 16 సంవత్సరములు వచ్చిన తరువాత వివాహం చేయాలనే నిబంధన పెట్టాలని, స్త్రీసమాజాలను అభివృద్ధిపరుచుటవంటి కార్యక్రమాలను సభలో చర్చించే విషయాలుగా నిర్ణయించటం జరిగింది. సభలలో సమర్థవంతంగా స్త్రీవిద్యకు సంబంధించిన చర్చలను నిర్వహించాలనుకోవటం స్త్రీలప్రగతి సూచకంగా భావించాలి.

స్త్రీవిద్య – పరీక్షాధికారిణి

స్త్రీవిద్యకు న్యాయం చేకూర్చటానికి స్త్రీలు తామే పరీక్షాధికారులుగా ఉండాలనుకొన్నారు. అప్పుడే స్త్రీవిద్యాభివృద్ధికి అవకాశం ఎక్కువగా ఉంటుందని, ఉద్యోగార్హతను కలిగించగలుగుతుందని భావించారు.

'కళ్ళేపల్లె వెంకటరమణమ్మ' (డిసెంబరు 1910 హిందూ సుందరి) ను గురించి మాడభూషి చూడమ్మ వ్రాస్తూ పండిత పుత్రిక అగుటచే రమణమ్మ బాల్యమునుండి సద్గ్రంథ పఠనం చేసిందనీ, వివాహానంతరం భర్తకు స్త్రీవిద్య, స్త్రీలంటే గౌరవభావం ఉండటంచేతనే ఈమెను పాఠశాలకు పంపి చదివించారని తెలిపింది. ఆమె అత్తింట్లో విశేషవిద్యను సంపాదించిందనీ సంగీతాన్ని నేర్చుకుందనీ, మామగారు ఈమెకు శాస్త్రజ్ఞానం తెలియజేసి కవిత్వంచెప్పే సామర్థ్యాన్ని కలిగించారని చెప్పింది. చక్కగా ఉపన్యాసాలిచ్చేదనీ శశిరేఖ, హిందూసుందరి, కృష్ణాపత్రికకు వ్యాసాలు వ్రాసిందనీ, తెలుగుస్త్రీల మూఢాచారములను నివారణామార్గాలను గురించి వ్యాసాలు వ్రాసిందని తెలిపింది. నర్సాపురంలోని విద్యార్థినీ సంఘపరీక్షలకు విచారణాధికారిగా సేవ చేసిందనీ, కాకినాడలో విద్యాభివృద్ధిని గురించి చక్కటి ఉపన్యాసాలను ఇచ్చిందని తెలియజేసింది. విద్యవల్ల సృజనాత్మక శక్తిని, పరీక్షల నిర్వహణాసామర్థ్యాన్ని పెంచుకొన్నస్త్రీగా ఆధునిక తెలుగు స్త్రీకి నమూనాగా కళ్ళేపల్లె వెంకటరమణమ్మ గురించి చెప్పటం జరిగింది.

'పరీక్షాప్రయోజనం' (సెప్టెంబరు 1911 హిందూ సుందరి) ను గురించి మామిడన్న కామేశ్వరమ్మ వ్రాస్తూ స్త్రీలు అజ్ఞానాంబుధిలోపడి మునిగి పోకుండా పరీక్షలనే నావను ఏర్పరచారని తెలిపింది. స్త్రీవిద్య అభివృద్ధి చేసుకోవటానికి పరీక్షలు అవసరమనీ, స్త్రీలకు పరీక్షాధికారాలనిచ్చి, స్త్రీవిద్యకు ప్రోత్సాహం ఇవ్వాలని సూచించింది. స్త్రీలు చదువుకోవటమే కాక పరీక్షలు కూడా వ్రాయాలనీ, స్త్రీలను పరీక్షాధికారులుగా చేయాలని మామిడన్న కామేశ్వరమ్మ భావించింది.

స్త్రీలే పరీక్షాధికారులుగా ఉంటే స్త్రీలకు పరీక్షల్లో న్యాయం జరుగుతుందని భావించటంగా అర్థం అవుతుంది. పురుషులు పరీక్షాధికారులుగా ఉంటే స్త్రీల ఉత్తీర్ణత సందేహాత్మకమని మామిడన్న కామేశ్వరమ్మ భావించింది.

స్త్రీవిద్యాభివృద్ధి – ఉద్యమ ప్రచారం

దామెర్ల సీతమ్మ 'స్త్రీవిద్యావిషయం' (జనవరి 1912 హిందూ సుందరి) అనే అంశం మీద గుంటూరునందలి 'సనాతన ధర్మమండలి'లో ఉపన్యసిస్తూ విద్యవల్ల లాభమున్నదని స్త్రీలు గ్రహించగలిగారనీ, స్త్రీవిద్యను అభివృద్ధిచేసే మార్గాలనుకూడా తెలుసుకోవాలని తెలిపింది. విద్యాహీనతవల్ల స్త్రీలకు కలిగే బాధను పురుషులు తెలుసుకోలేక పోతున్నారని చెప్పింది. వితంతువుల కష్టాలు పురుషులకు తెలియటంలేదనీ, స్త్రీల బాధలను పోగొట్టుకునే ప్రయత్నం స్త్రీలే చేయాలని చెప్పింది. అంతేకాదు ఇతరదేశాలలో ఉన్న స్త్రీల విద్యాభివృద్ధిని గ్రహించాలనీ, 'నరసాపుర మండలాభివర్ధనీ' సంఘము వారు బహుమాన పరీక్షలు ఏర్పరిచినారని తెలిపింది. పరీక్షలు వ్రాయటానికైనా స్త్రీ విద్యార్జన చేయాలనీ, దానికోసం పాఠశాలల నేర్పరచి ఉపాధ్యాయురాండ్రను నియోగించటానికి తగిన చేయూతను నివ్వాలని స్త్రీసమాజమువారు స్త్రీల విద్యావిషయంపై పాటుపడాలని పిలుపునిచ్చింది. సనాతనధర్మమండలివారు బాలికాపాఠశాలలో ఖద్దరు వర్తకాన్ని మొదలెట్టి మార్గదర్శకులవుతున్నారనీ, దానికి ఏకా వెంకటరత్నమ్మ మరియు ఇప్పగుంట వెంకమాంబ పూనుకున్నారనీ, విద్యవలన వివేకము, జ్ఞానం కలిగి తమను పశుప్రాయులుగా చూసే స్థితినుండి స్త్రీలు విముక్తిపొందుతారని తెలియజేసింది.

ఈమె 'స్త్రీ విద్యయెట్లున్నది దానినభివృద్ధి చేయుటెట్లు?' (ఏప్రిల్ 1912 వివేకవతి) అని రాసిన మరొక వ్యాసంలో స్త్రీవిద్య హీనస్థితిలో ఉందనీ, మైసూరు, బరోడా, మహారాజులు బాలికా పాఠశాలలు స్థాపించినా స్త్రీలు పాఠశాలకు వెళ్ళక మూర్ఖురాండ్రుగా ఉన్నారనీ, విద్యావంతులవటానికి ప్రయత్నించటం లేదని తెలిపింది. అంతేకాదు, తమ స్త్రీలను విద్యావంతులు చేయాలనే భావన పురుషులకే ఉండాలనీ, కొంతమంది సత్పురుషులు స్త్రీవిద్యకు పాటుపడుతున్నారని తెలిపింది. స్త్రీలు దేశభాషయైన సంస్కృతం, మాతృభాషయైన తెలుగును, రాజకీయ భాషయైన ఇంగ్లీషును నేర్చుకోవాలనీ, నాటికే చదువుకున్న మాఢభూషి చూడమ్మ, మామిడన్న కామేశ్వరమ్మ నడింపల్లి బుచ్చివేంకటసుబ్బమ్మ, బాలాంత్రపు శేషమ్మ, గార్లపాటి సత్యవతి, దామెర్ల సీతమ్మ ఉపాధ్యాయినులుగా స్త్రీవిద్యను బోధిస్తున్నారని పేర్కొంది. గుంటూరులో 'సనాతనమండలి' వారు బాలికాపాఠశాలను స్థాపించి బోధిస్తున్నారనీ, మాగంటి వేంకటరత్నమ్మగారు దాని అభివృద్ధకి కృషిచేస్తున్నారనికూడా దామెర్ల సీతమ్మ తెలియజేసింది.

'నవీనోద్యమము' (మార్చి 1914 హిందూసుందరి) ను గురించి బాలాంత్రపు శేషమ్మ వ్రాస్తూ 'నూతన ధర్మములగు కార్యములతో చేయు ఉద్యమంద్వారా నూతన వికాసము కలిగే విధంగా

స్త్రీసమాజాలు స్థాపించి విద్యను, చేతిపనులను స్త్రీలకు నేర్పిస్తూ సభలను నిర్వహించాలి' అని తెలిపింది. ఊరూరా తిరిగి బాలికలకు విద్యను నేర్పించేవిధంగా బోధించాలనీ, బాలికావిద్యతో పాటు వితంతువిద్యను ప్రోత్సహించేలా జాతీయవిద్యను నేర్పించటానికి బులుసు సూరమ్మగారు కృషిచేస్తున్నారనీ, స్త్రీలసంఘాలు మరికొన్ని నూతన ఉద్యమాలను ప్రారంభించాలని తెలియజేసింది. స్త్రీలవిద్యాభివృద్ధి మార్గాలను అన్వేషించే క్రమంలో పరీక్షలుపెట్టాలనీ, స్త్రీసమాజాలద్వారా స్త్రీలకు విద్యను, చేతిపనులను నేర్పించాలనీ, నూతన విద్యాఉద్యమం రావాలని బాలాంత్రపు శేషమ్మ సూచించారు.

చోరగుడి సీతమ్మ విజయనగరంలోని ఆంధ్రమహిళామహాసభలో చేసిన ఉపన్యాసం (అక్టోబరు 1915 హిందూసుందరి) లో నిర్బంధ వైధవ్యంతో పుట్టింట్లో కష్టాలు పడుతన్న స్త్రీలకోసం ప్రభుత్వం అనాథశరణాలయాలను కట్టించారనీ, అలాగే కొండ వెంకటప్పయ్య గుంటూరులోని వేటపాలెంలో 'శారదానికేతనము' ను పేర అనాథ శరణాలయాన్ని ఏర్పాటు చేసారని తెలిపింది. ఇంద్రియగోచరం కాని ఆర్ష, పుణ్యపాపాలవంటి విషయాలుగాక ప్రపంచంలోని సజీవ, నిర్జీవ విషయాలతో కూడిన ప్రకృతిశాస్త్ర పరిజ్ఞానం స్త్రీలకు ఏర్పడాలని చెప్పింది. దానికై విజ్ఞానచంద్రికా పరిషత్తువారు 'విజ్ఞానసర్వస్వ' మనే గ్రంథాన్ని సమకూర్చారని తెలిపింది. బాలికాపాఠశాలలో ఉపాధ్యాయిను లుంటే బాలికావిద్య అభివృద్ధి చెందుతుందనీ, భార్య కరణేషుమంత్రిగా ఉండటానికైనా స్త్రీలు శరీరశాస్త్రాలకు సంబంధించిన ఉన్నతవిద్యను అభ్యసించాలనీ, స్త్రీలు సమాజాలను ఏర్పరచుకొని స్త్రీవిద్యా ఉద్యమాన్ని చేపట్టాలని పిలుపునిచ్చింది. రజస్వలానంతర విద్యాభ్యాసానికి వీలుగా స్త్రీలే ఉపాధ్యాయినులుగా, పరీక్షాధికారులుగా ఉండే స్త్రీవిద్యాలయాలు అవసరమని తెలియజేసింది.

స్త్రీలు విద్యవల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకోలేకపోతున్నారని భావించింది. స్త్రీవిద్య అంటే పరీక్షలలో ఉత్తీర్ణత చెందటమేకాక ప్రయోగాత్మక విద్యలో భాగంగా బాలికలకు చేతిపనులను నేర్పి వారు తయారు చేసిన ఖద్దరును విక్రయించే వర్తకాన్ని గుంటూరులోని బాలికాపాఠశాలలో ప్రారంభించటం చాలా గొప్ప అని భావించాలి. అప్పటికింకా గాంధియొక్క ఖద్దరు, స్వదేశీదీక్షను గురించిన ప్రచారం జరగలేదనీ కూడా గుర్తించాలి. స్త్రీలకు ఉపాధివిద్యలను అందించాలని తెలియజేసి స్త్రీల విముక్తిని మార్గాలను దామెర్ల సీతమ్మ సూచించింది.

స్త్రీవిద్యాభివృద్ధి – స్వీయ గణాంకాల సేకరణ

స్త్రీవిద్యాభివృద్ధిని ఎప్పటికప్పుడు ఆంధ్రప్రాంతపు గణాంకాలను అంచనా వేసుకొంటూ స్త్రీల ఉన్నతచదువులకై మార్గాన్వేషణ చేయటం జరిగింది.

కాశీనాథుని రామాబాయమ్మ 'ఆంధ్రమహిళాసభ' లో చేసిన ఉపన్యాసంలో (మార్చి 1913 హిందూసుందరి) స్త్రీల విద్యాస్థితిని తెలుపుతూ బాలికలు ప్రథమపాఠశాలలో చదువటం వ్రాయటమే కాక, అంకగణితం వంటివి నేర్చుకుంటున్నారనీ, బాలికల చదువుకు తల్లిదండ్రులు ఖర్చుపెట్టటానికి యిష్టపడక పోవటంచేతనే బాలికావిద్య కుంటుపడుతోందని తెలిపింది. అంతేకాదు, వితంతుస్త్రీలకు ఉన్నతవిద్యను కల్గించాలనీ, శాస్త్రజ్ఞానంగలవిద్య స్త్రీలకు అవసరమనీ, పురుషులకువలె శారీరకబలాన్నికల్గించే వ్యాయామ విద్యలను అందిస్తే దేహారోగ్యం ఉంటుందనీ, బుద్ధిబలాన్నిపెంచే భాషాసాహిత్య గ్రంథపఠనం చేస్తే శిశుపోషణమువంటి శాస్త్రజ్ఞానం అలవడుతుందని తెలిపింది. స్త్రీల విద్యాభివృద్ధికై విజ్ఞానచంద్రికామండలి, ఆంధ్రభాషాభివర్ధనీ సంఘము కృషిచేస్తోందనీ, మాతృభాషలో విజ్ఞానాన్నిపొంది, పరభాషలనునేర్చి ఆ భాషలలోని పుస్తకపఠనం చేస్తే విజ్ఞానం విస్తృతమవుతుందనీ తెలియజేసింది. అంతేకాదు, ప్రస్తుతకాలంలో తల్లిదండ్రులు మగపిల్లవాడిని మడిమాన్యాలమ్మి చదివించుతున్నారుగానీ, ఆడపిల్ల చదువుకు అల్పవ్యయాన్ని పెడుతున్నారని చెప్పింది. అయినా చదువువచ్చిన ఆడపిల్లలు గంజాంలో 5327, విశాఖపట్టణంలో 7493, గోదావరి జిల్లాలు 11,793, కృష్ణాజిల్లా 16,199, గుంటూరు లో 8564, నెల్లూరులో 6214, కడప లో 2808, కర్నూలు 2844, మంది ఉన్నారనీ, కృష్ణాజిల్లాలో అధికంగాఉన్నారనీ, క్రైస్తవబాలికలు పెద్దవారైన తర్వాతకూడా విద్యనుకొనసాగిస్తున్నారని చెప్పింది.

బాల్యవివాహాలతో హిందూబాలికలు చదువును కొనసాగించటంలేదని తెలియజేసింది. ఆడపిల్లలచదువుకు ఖర్చుపెట్టటానికి తల్లిదండ్రులు వెనకాడటానికి లింగవివక్షయే కారణమని, అదే స్త్రీవిద్యాభివృద్ధికి ఆటంకప్రాయమైన విషయమని గుర్తించటం జరిగింది.

వితంతువుల విద్యాభివృద్ధి

వై.వి.రంగనాయకమ్మ 'అనాథస్త్రీవిద్యాభివృద్ధి' (సెప్టెంబరు 1913 హిందూసుందరి) ని గురించి వ్రాస్తూ విశాఖపట్నంలో వితంతువులకై ఉన్నత విద్యాలయం స్థాపించారనీ, భర్తపోయిన స్త్రీలు దుఃఖంలో మునిగిపోయి యింటిచాకిరికి పరిమితం కాకుండా ఈ బాలికా విద్యాలయాలలో చేరాలని పిలుపునిచ్చింది. స్త్రీలు వైద్యురాండ్రుగా, ఉపాధ్యాయినులుగా వృద్ధిచెందాలనీ, సమాజ విమర్శకు వెరవ వద్దనీ ఆంగ్లేయుల పాఠశాలలో హిందూబాలికలకు ప్రవేశం ఉందనీ, క్రైస్తవమతాన్ని బోధించరనీ, ఇంటిదగ్గర దేశభాషలు చదివినా ఇంగ్లీషులో శాస్త్రజ్ఞానం ఉంటుంది కాబట్టి అవన్నీ తెలుసుకోవాలంటే ఉన్నతవిద్యాలయాలకు వెళ్ళాలనీ, అదే స్త్రీలకు రాజమార్గమని తెలియజేసింది.

సమాజంలో బాల్యవివాహాలవల్ల వితంతుస్త్రీలు ఎక్కువ కాబట్టి వారి విద్యాభివృద్ధి ముఖ్యమని భావించారు. ప్రత్యేకంగా ఉన్నతవిద్యాలయం ఉందని వితంతుస్త్రీలకు తెలియజేసే ప్రయత్నం

జరిగింది. వితంతు ఉన్నతవిద్యాలయ విద్యార్థినిగా ఈ వ్యాస రచయిత్రి తోటిస్త్రీల విద్యాభివృద్ధికై చేసిన ప్రయత్నం అర్థం అవుతోంది.

ఆరణి చూడామణి వ్రాసిన 'జ్ఞానోదయం' (జనవరి1915 హిందూసుందరి) అనే నాటక సారాంశంగా స్నేహితురాలి పాత్రచేత చెప్పిస్తూ, వితంతువులైన స్త్రీలు సభలకు వెళ్ళాలనీ, అక్కడ స్త్రీలకు చదువు వల్ల లాభాలు అర్థం అవుతాయనీ, విద్య నేర్చుకున్న స్త్రీలు గ్రంథపఠనంతో పాటు స్వయంగా తమకు తెలిసిన విషయాలను ఉపన్యాసించాలని చెప్పటం జరిగింది.

ఈ నాటకంలో వితంతుస్త్రీలు చదువుకోవటమేకాక పదిమందిలో ఉపన్యసించగలగాలని చెప్పి సమాజంలో వితంతువులకు గుర్తింపుకలిగితే వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని భావించింది. అట్టి విశ్వాసమే వారి అభివృద్ధికి, స్వతంత్ర జీవనానికి అవకాశాన్ని యివ్వగలుగుతుంది. సాంస్కృతిక సంకెళ్లలో ఉన్న వితంతు స్త్రీలు సమాజంలోకి వచ్చి స్త్రీల విద్యను గురించిన ఆలోచనలు పెంచుకోవటమే గాక సభలలో ఉపన్యసించగల శక్తిని వారు పొందగలరని చెప్పటం జరిగింది. వితంతుస్త్రీలలో ధైర్యోత్సాహాల వంటి వ్యక్తిత్వాన్ని పెంచే విధంగా ప్రోత్సహిస్తే, స్త్రీలలో జ్ఞాననేత్రం తెరుచుకొంటుందనే భావన కూడా అర్థం అవుతుంది. స్త్రీలు, అందునా వితంతుస్త్రీలు విద్యాభివృద్ధితో సమాజ ప్రస్థానాన్ని ప్రారంభించటమంటే వ్యక్తిస్వాతంత్ర్యానికై మరోప్రపంచంలో అడుగుపెట్టటమే.

'ఆర్.ఎన్.సుబ్బలక్ష్మమ్మగారు' (ఫిబ్రవరి1915 హిందూసుందరి) అంటూ ఆమెను గురించిన పత్రికా సంపాదకురాలి ప్రచురణలో ఆమెకు మూడేండ్ల వయస్సున్నప్పుడే విద్యాభ్యాసంచేయటానికి చెన్నపురిలోని మిషనరీ స్కూలుకు వెళ్ళిందనీ, ఆమె బాల వితంతువైనా తల్లియొక్క పట్టుదలతో బి.ఏ, యల్ టి. పూర్తి చేసినట్టు తెలిపింది. ఆమె బి.ఏ చదవుకునేటప్పుడే చెన్నపురిలో వితంతు విద్యార్థులకోసం గవర్నమెంటు సహాయంతో వితంతు శరణాలయం ప్రారంభించిందనీ, ఆ శరణాలయంలో శని, ఆదివారాలలో పిల్లలకు ఉచితంగా సంస్కృతం, వీణ వంటి వాయిద్యాలు నేర్పించేవారని చెప్పింది. ఆ శరణాలయంలోనే ఈమె సహోపాధ్యాయినిగా ఉందనీ బాలికలను కన్నతల్లివలె ఆమె చూసేదని పత్రిక ఆర్.ఎన్.సుబ్బలక్ష్మిని గురించి పేర్కొనటం జరిగింది.

ఒక వితంతుస్త్రీ వితంతుశరణాలయాన్ని స్థాపించి, స్వయంగా బోధించగలగటమంటేనే స్త్రీల అభివృద్ధికి సోపానాలను నిర్మించటంగా భావించాలి.

స్త్రీవిద్యావారసత్వ చైతన్యం

కుటుంబంలో ఒకస్త్రీ చదువుకుంటే కుటుంబం అంతా చదువుకోగలదనే నానుడిలోని నిజాన్ని గ్రహించేవిధంగా ప్రయోగాత్మకంగా స్త్రీలను చైతన్యపరచటం కనపడుతుంది.

పి.లింగమాంబ వ్రాసిన 'సంభాషణము' (మార్చి 1914 హిందూసుందరి) అనే ప్రయోగాత్మకమైన నాటకంలో భాగంగా కూతురిని చదువుయందు శ్రద్ధచూపించమని హెచ్చరించే విద్యావంతురాలైన తల్లిపాత్ర కూతురు పాత్రకు చరిత్రగురించి చెపుతూ హిందూ దేశ వైశ్రాయిగా హార్డింజ్ ప్రభువు ఉన్న సమయంలో 1911లో రాజధాని కలకత్తా నుండి ఢిల్లీకి మార్చబడిందనీ, ఇంతకుమునుపు బ్రిటిష్ వారు ప్లాసీ యుద్ధంలో సురాజుద్దౌలాను జయించిన మొదలుగా కలకత్తాను రాజధానిగా చేసుకొన్నారని చెప్పింది. యుద్ధాలు రావటానికి కారణాలుగా దేశసరిహద్దులు, వర్తకవిషయాలు, మతవిషయాలుంటాయని, కూతురుకు తల్లి చరిత్రపాఠాన్ని ప్రశ్నోత్తరాల రూపంలో చెప్పటం జరిగింది.

విద్యావంతులైన తల్లులు యింట్లోకూడా తమ బాలికల విద్యాభివృద్ధికి పూనుకుంటారనీ తెలియజేసిన ప్రయోగాత్మక సాహిత్యరూపకమిది. స్త్రీ చదువుకుంటే ఆ కుటుబంలోని వారంతా చదువుకోగలుగుతారు అనేది సత్యమని తెలియజేయటం జరిగింది. తల్లులవిద్య తరువాతి తరంవారి విద్యాభివృద్ధికి మూలవనరుగా భావించటమే స్త్రీవిద్యాఉద్యమ ఫలితాలకు, పరిణామాలకు నిదర్శనంగా భావించాలి.

స్త్రీలు – ఆంగ్లవిద్య

సుభద్ర 'స్త్రీలకు ఇంగ్లీషు విద్య అవసరమా?' (ఫిబ్రవరి 1912 హిందూసుందరి) అనే శీర్షికన వ్రాస్తూ స్త్రీలకు ఇంగ్లీషువిద్య అవసరమేననీ, విదేశీయులు, మిషనరీ స్త్రీలు దొరసానులుగా ఉన్నారనీ, ఇంగ్లీషువారు మనభాషను నేర్చుకోవాలని ప్రయత్నించినా కష్టమగుటచే వారివిద్యను మనకు నేర్పుతున్నారని తెలిపింది. ఇంగ్లీషును నేర్చుకొని మిగిలినరాష్ట్రాలకు స్త్రీలు కలెక్టర్లుగా గొప్పఉద్యోగినులుగా వెళ్ళగలుగుతున్నారనీ, మగవాళ్ళు హేళనచేసినా పట్టించుకోకుండా స్త్రీలు ఇంగ్లీషుభాషను నేర్చుకొని నాగరికులై పరిపాలిస్తే హైందవ దేశాన్ని ఉన్నత స్థితిలోకి తీసుకొని వెళ్ళగలరని భావించింది. స్వభాషను నేర్చుకుంటూనే పరభాషను నేర్చుకొని ప్రపంచవిషయాలు నేర్చుకోవాలని, నాడు స్వభాషతోపాటు పాలనాభాషనుకూడా నేర్చుకుంటే స్త్రీలకు ప్రపంచ జ్ఞానం అలవడుతుందని సుభద్ర భావించింది.

'ఉన్నతవిద్య' (మే 1917 హిందూసుందరి) ను గురించి యర్రగుంట్ల జనార్దనమ్మ చేసిన ఉపన్యాసంలో బాలికలను సంబోధిస్తూ దేశకాలపాత్రములననుసరించి స్త్రీలకు ఉన్నతవిద్య అవసరమనీ, పురుషులవలె స్త్రీలు కూడా స్వభాషను ముందుగానేర్చి తర్వాత ఇంగ్లీషు విద్యను అభ్యసించాలనీ, తల్లిదండ్రులు తమ పుత్రికా ప్రేమను ఆడపిల్లలకు చదువునేర్పించటం ద్వారా

వ్యక్తం చేయాలని చెప్పింది. స్త్రీలు కూడా ఉద్యోగం చేయవచ్చనీ, స్త్రీలు ఉన్నత విద్యనేర్చుకొని పాఠశాలలో బోధకురాండ్రుగా ఉంటే బాలికావిద్య అభివృద్ధి చెందుతుందనీ, సరోజనీదేవి ఉన్నత విద్యనభ్యసించటం చేతనే ఇంగ్లీషులో కవిత్వం చెప్పగలుగుతోందనీ, స్త్రీలకు ఉన్నతవిద్యయే గౌరవాన్ని కల్గిస్తుందని తెలియజేసింది. ఆడపిల్లలకు చదువుచెప్పించటమే తల్లిప్రేమకు నిదర్శనమని యర్రగుంట్ల జనార్దనమ్మ చెప్పింది.

స్వయంగా ఆమె విజ్ఞానచంద్రికా పరీక్షలో మొదటిస్థానంలో నిలిచిన అనుభవంతో చెప్పటం జరిగింది. తల్లీకూతుళ్ళకు ఏకకాలంలో చైతన్యాన్ని యివ్వవలసిన అవసరాన్ని గుర్తించింది. స్త్రీవిద్య స్త్రీలకు సామాజికగౌరవాన్ని ఇస్తుందని భావించింది. స్త్రీలు స్వేచ్ఛగా చదువుకోవటానికి స్త్రీలకు ప్రత్యేక ఉన్నత పాఠశాలలు ఉండాలనే ఆలోచనలను పెంచుకొన్నట్లు అర్థమవుతుంది.

అష్టమాంధ్ర మహిళాసభలో కోకా కృష్ణవేణమ్మ చేసిన ఉపన్యాసం (ఆగష్టు 1917 హిందూసుందరి) లో భాగంగా, స్త్రీ విద్యనభివృద్ధిచేయటానికి పాఠశాలలు పెట్టినా స్త్రీ విద్యావిహీనులుగా పరితపిస్తూనే ఉన్నారనీ, స్త్రీలకున్నతవిద్య గరిపి వారిని ఉన్నతస్థితికి తేవాలని చెప్పింది. తల్లులే విద్యావంతులైతే పిల్లలకు పసితనములో సద్విద్యను అందిస్తారనీ, స్త్రీలు ఐకమత్యంతో ఉండి శిశుపోషణాది కృత్యములను తెలుసుకోవాలనీ, స్త్రీలను ఉపాధ్యాయినులుగా నియామకంచేస్తే బాలికాభివృద్ధి చెందుతుంది కాబట్టి స్త్రీలకు ఉన్నతవిద్యను అందించాలని తెలియజేసింది.

స్త్రీవిద్య స్వతంత్ర జీవనావశ్యక స్పృహ

చట్రాతి లక్ష్మీనరసమ్మ 'స్త్రీ స్వతంత్ర జీవనావశ్యకత'ను (ఏప్రిల్ 1916 ఆంధ్రపత్రిక ఉగాది సంచిక) గురించి వ్రాస్తూ విద్యావంతులైన స్త్రీలు తమబిడ్డల విద్యాభివృద్ధికై ప్రోత్సహిస్తున్నారనీ, స్త్రీలు గృహకృత్య నిర్వాహణలో 24 సమర్థులుగా ఉన్నారు గాని వారికి స్వతంత్ర జీవనం అవసరమని వారు భావించటం లేదని తెలిపింది. పూర్వము స్త్రీ, పురుషులు కలసి వృత్తులు చేసుకునేవారనీ ఇప్పుడు స్త్రీలు నవీన విజ్ఞానాన్ని పొంది వ్యాపారవేత్తలై జీవించాల్సిన అవరసముందని అందరూ గుర్తించాలని తెలియజేసింది. ద్రవ్యము పదార్ధ రూపముగ మారినప్పుడే అభివృద్ధి అనేది జరుగుతుందనీ ఆర్థికాభివృద్ధి లేనిది దేశాభివృద్ధి జరగదనీ, స్త్రీలు పురుషులతో పాటు వివిధ విద్యలు నేర్చితే వారికి స్వతంత్రజీవనం ఉంటుందనీ, అప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందని తెలిపింది. స్త్రీలకు ఆర్జనావకాశం కలిగించి స్త్రీలకు ఆర్థికస్వాతంత్ర్యం ఉండేటట్లుగా చేస్తేనే ఐకమత్యం పెరిగి వారిలో దేశాభిమానం పెరుగుతుందని చట్రాతి లక్ష్మీనరసమ్మ తెలియజేసింది.

స్త్రీలు పురుషులవలె శాస్త్రవిద్యలను అభ్యసించాలని భావించి, స్త్రీల స్వతంత్రజీవనావశ్యకతను గుర్తించటమే వారి స్వేచ్ఛకు చిహ్నంగా భావించింది. దేశఆర్థికస్థితిని పెంచగలిగే మార్గాలను రచయిత్రి ఒక ఆర్థికశాస్త్రవేత్తగా తెలియజేస్తూ స్త్రీలు వస్తూత్పత్తిరంగానికి ఉపయోగపడే వివిధ విద్యలు నేర్చుకొని నాటి కాలానుగుణంగా స్త్రీలు వ్యాపారవేత్తలుగా ఎదగగలిగితేనే స్త్రీలకు స్వతంత్రజీవనం ఏర్పడుతుందని భావించింది. అప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందని తెలియజేస్తూ స్త్రీవిద్యకు, స్త్రీలస్వతంత్ర జీవనానికి, జాతీయాభిమానానికి ఉన్నలంకెలను చట్రాతి లక్ష్మీనరసమ్మ నాడే పట్టుకోవటం గొప్పవిషయం.

స్త్రీవిద్యాసంస్కరణచైతన్యం

స్త్రీల ప్రగతికై స్త్రీలకు బోధించే విద్యలో సంస్కరణలను చేయాల్సిన అవసరాన్ని గుర్తించారు.

ద్రోణంరాజు వెంకటలక్ష్మాంబ వ్రాసిన 'స్త్రీవిద్యా-సంస్కరణము' (ఏప్రిల్ 1917 ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక) అనే వ్యాసంలో ఆంగ్లవిద్యాధ్యయనంతో పాటు మాతృభాషలో అక్షరజ్ఞానము కలిగించకపోవటంచేత గ్రంథములు అర్థంకాక మాతృభావన తగ్గుతోందనీ, జ్ఞానప్రబోధం కలిగించే గ్రంథాలు మాతృభాషలోలేవని తెలిపింది. స్త్రీలపాఠశాలలో వైద్యశాస్త్రం, ప్రకృతిశాస్త్రం, దేశచరిత్రములు నేర్పాలనీ, స్త్రీలకు నిర్బంధ ఉచిత పాఠశాలను ఏర్పాటుచేయాలని చెప్పింది. స్త్రీలవిద్య అభివృద్ధి చెందాలంటే గ్రంథాలయాలు, సంఘములు అవసరమనీ గ్రంథాలయాలలో పుస్తకపఠనంతో పాటు, స్త్రీసమాజాలలో స్త్రీలు ఒకరి జ్ఞానాన్ని ఒకరు పంచుకొనే అవకాశం ఉంటుందనీ, స్త్రీవిద్యాభివృద్ధి జరిగితే దేశము యధాగతి ఉన్నతస్థితిని చేరుకుంటుందని తెలియజేసింది. మాతృభాషలో విద్యాబోధన ఉంటే స్త్రీవిద్య అభివృద్ధి చెందుతుందనీ, స్త్రీలు ఉన్నతవిద్యావంతులు కాగలరనీ, స్త్రీ విద్యాభివృద్ధి దేశాభివృద్ధికి మిక్కిలి సహకరిస్తుందనీ, స్త్రీవిద్యకై గ్రంథాలయాలు ప్రతి పల్లెయందు ఉండాలని భావించింది. స్త్రీలు వైద్యశాస్త్రాన్ని అభ్యసించాలని చెప్పటమేకాక స్త్రీలనిర్బంధవిద్యకై ఉచిత విద్యాలయాలను ఏర్పాటుచేయాలని సూచించింది.

నాటి బ్రిటిష్ ప్రభుత్వం ఏర్పరచిన పాఠశాలలో నిర్బంధ ఉచితవిద్యను అందించాలని, ఆంగ్లమాధ్యమం స్త్రీల విద్యకు ఆటకంగా ఉందనీ, మాతృభాషలో బోధన ఉంటే స్త్రీలు ఎక్కువ సంఖ్యలో చదువుకోగలరని భావించింది. అంతే గాక పల్లెలో గ్రంథాలయాలు ఉంటే స్త్రీలు వెళ్ళి పత్రికలు చదువుకొని ప్రపంచజ్ఞానాన్ని పొందగలరని భావించింది. స్త్రీ విద్యాభివృద్ధికున్న సోపానపంక్తులను స్త్రీలు నిర్మించుకోవటం అర్థం అవుతుంది. పల్లెటూళ్ళలో పాఠశాలలేగాక గ్రంథాలయాలు ఉంటే స్త్రీలకు ప్రపంచజ్ఞానం అలవడుతుందని భావించటమే స్త్రీలవిద్యాభివృద్ధి కాంక్షను తెలియజేస్తోంది. స్త్రీలు తమచూపును ప్రపంచం వైపు విస్తరింప చేయాలనుకోవటమే స్త్రీల అభివృద్ధి, దేశౌన్నత్యాన్ని చాటి చెప్పేందుకు తగిన వాతావరణం ఏర్పడటంగా భావించవచ్చు.

'ఆంధ్రస్త్రీల విద్యాస్థితి' (సెప్టెంబరు 1917 హిందూసుందరి) అనే శీర్షికన కాశీనాథుని రామాబాయమ్మ వ్రాస్తూ భారతదేశంలోని వంగ రాష్ట్రములో (బెంగాళ్), బొంబాయి రాష్ట్రంలో స్త్రీ విద్యాభివృద్ధి ఉందనీ, చెన్న రాష్ట్రంలో క్రైస్తవాంగనల విద్యాభివృద్ధి ఉందనీ, ఆంధ్ర స్త్రీల విద్యాభ్యాసం వెనుకబడి ఉండటానికి వారి విద్యాభ్యాసానికి తగిన సదుపాయాలు లేవని తెలియజేసింది. ఆంధ్ర దేశంలో ఒక్కటి కూడా స్త్రీల కళాశాల లేదనీ, చెన్నరాష్ట్రంలో గల 42 బాలికా మధ్యమ పాఠశాలలో 7 మాత్రమే ఆంధ్ర దేశంలోనూ, అక్కడ 1553 బాలికా ప్రథమ పాఠశాలలు ఉండే 554 తెలుగు జిల్లాలలో ఉన్నాయనీ, ఉపాధ్యాయినుల పాఠశాలలో చెన్నరాష్ట్రంలో 22 ఉంటే తెలుగు దేశంలో 8 మాత్రమే ఉన్నాయనీ, ఇతర వృత్తి విద్యలు నేర్పే పాఠశాలలు ఆంధ్ర దేశంలో ఒక్కటి కూడా లేదని తెలియజేసింది. అంతేకాక ప్రథమ పాఠశాలలో 40,000 బాలికలు, మధ్యమ పాఠశాలలో 500 మంది బాలికలు, ఉపాధ్యాయిని వృత్తివిద్యయందు 120 మంది తెలుగు స్త్రీలు చదువుతున్నారనీ, ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఆంధ్ర రాష్ట్రం ఉపస్థాపితం అయితేనే స్త్రీవిద్య ఆంధ్రదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతుందని భావించింది. ఆంధ్రస్త్రీలకు మాతృభాషను బాగుగా నేర్పటానికి విద్యాలయాలు లేవనీ, కొండా వెంకటప్పయ్య పంతులు గారు స్త్రీవిద్యాభివృద్ధికి శారదానికేతనాన్ని ప్రతిష్టించారనీ దానివలన ఆంధ్రస్త్రీల అభివృద్ధి జరుగుతుందని విశ్వాసం ఏర్పడుతోందని తెలిపింది. వితంతు శరణాలయాల వంటి శరణాలయాలు ఆంధ్ర దేశంలో ఉంటే స్త్రీలను విద్యావంతులను చేసి స్వతంత్ర జీవనాధారాన్ని కల్పించవచ్చునీ స్త్రీలు మాతృదేశాభిమానంతో తమ జ్ఞానాన్ని దేశసేవకు వినియోగించాలని కాశీనాథుని రామాబాయమ్మ తెలియజేసింది.

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో భాషాపరంగా జాతివివక్షను ఎదుర్కొంటున్న తెలుగు స్త్రీలు తమవిద్యాభివృద్ధికి అవకాశాలు లేకపోతుంటే ఆంధ్రరాష్ట్రోద్యమభావాలను పెంచుకొని ఆంధ్రవిశ్వవిద్యాలయ స్థాపన జరగాలని కాశీనాథుని రామాబాయమ్మ ఆకాక్షించింది. ఆ తర్వాతే అంటే 1926 లో ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని నెలకొల్పారు.

స్త్రీవిద్య – స్వదేశాభివృద్ధి చైతన్యం

దేవరకొండ వెంకటసుబ్బమ్మ వ్రాసిన 'మన యభివృద్ధియెట్లు?' (సెప్టెంబరు 1913 హిందూ సుందరి) అనే వ్యాసంలో పూర్వకాలమందు హిందూస్త్రీలలో విద్యావంతులు, పరాక్రమవంతులు ఉన్నారనీ, కాని నేడు స్త్రీలు ఇంటిలో బానిసలుగా ఉన్నారనీ, స్త్రీజాతి అభివృద్ధి చెందితేనే సంఘము, దేశము అభివృద్ధి చెందుతుందని తెలిపింది. సమాజంలో స్త్రీవిద్య, స్త్రీకిస్వాతంత్ర్యం ఉండాలని సంఘసంస్కర్తలు కృషిచేస్తున్నారనీ, స్త్రీలు వైద్యగ్రంథాలు, గృహనిర్వాహకత్వం, శిశుపోషణ, పాకశాస్త్రం,

ఆరోగ్యశాస్త్రంతోబాటు గృహాదాయవ్యయములను చక్కని గణితశాస్త్రాన్ని అభ్యసించాలని చెప్పింది. రాజకీయవిద్యకాబట్టి ఇంగ్లీషు నేర్చుకోవాలనీ, బాల్యవివాహాలు, కన్యాశుల్క, వరశుల్కాలను నిర్మూలించాలనీ, బాలికాపాఠశాలలో స్త్రీలను ఉపాధ్యాయినులుగా ఉంచాలని ప్రభుత్వాన్ని కోరాలని తెలియజేసింది.

'స్త్రీవిద్య' ను గురించి కాంచనపల్లి కనకాంబ చేసిన ఉపన్యాసం (మార్చి 1915 హిందూసుందరి) లో స్త్రీ పురుషులందరి బుద్ధిబలాలు సమానమేనని, అల్పవిద్యతో పదార్థ విషయములందు గుణదోషాలను గ్రహించు జ్ఞానం లభించదు కాబట్టి స్త్రీలు కేవలం చదవటం వ్రాయటమేగాక ఉన్నతవిద్యావంతులు కావాలని చెప్పింది. శిశుపోషణకై విద్య అవసరమనీ దానికి తల్లులు బాధ్యతవహించాలనీ, దేశాభివృద్ధికి స్త్రీలే ముఖ్యకారణమనీ, బాలికలకు విద్యనేర్పిస్తేనే వారియొక్క స్వాభావిక ప్రజ్ఞ, బుద్ధి స్వాతంత్రం వెల్లడి అవుతుందని తెలిపింది. ఆదాయవ్యయాలను కనిపెట్టి భర్తకు చేదోడు వాదోడుగా ఉండగలుగుతారనీ. వివిధదేశ చరిత్రలు చదివితే మానవజాతి అభివృద్ధి కూడా ముఖ్యమని తెలుసుకుంటారనీ, అప్పుడే సగభాగంగా ఉన్న భారతీయస్త్రీల అభివృద్ధి 50 శాతంగా ఉంటుందని తెలియజేసింది. విద్యద్వారా మంచిచెడులను గురించిన తెలివి కలిగియుండటమే మనిషిలక్షణమనీ ఆ తెలివితోనే స్త్రీలు స్వదేశాభివృద్ధికి పాటుపడగలరని తెలియజేసింది. దేశాభివృద్ధిలో స్త్రీల సగ, సహ భాగస్వామ్యాన్ని గుర్తించమని రచయిత్రి తెలియ చేయటం విశేషం. స్త్రీలజీవితాలకు విలువ ఉందని భావింపచేస్తూ, స్త్రీపురుషుల మేధాశక్తి సమానమేనని చెప్పి స్త్రీలలో ఆత్మన్యూనతను పోగొట్టే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా స్త్రీలు వృత్తివిద్యలతోపాటు, మనోవిజ్ఞానవిద్యను నేర్చుకోవాలని తెలిపింది.

స్త్రీవిద్యామూల్యత - దేశస్వాతంత్ర్యం

'విద్యామూల్యత' (ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక ఏప్రిల్ 3వ తేది1916) గురించి జూలూరి తులశమ్మ రాస్తూ స్త్రీలు పురుషులవలె విద్యను ఆర్జించితే స్వతంత్రజీవనాన్ని సాగించగలరనీ, స్వదేశాభిమానం, స్వజన సంఘీభావం, ధైర్యస్థైర్యాలు వారిలో పెరిగితే దేశం పారతంత్ర్యంనుండి విముక్తి పొందాలనే ఆలోచనలు వారికి వస్తాయని జూలూరు తులశమ్మ తెలియజేసింది. స్త్రీలు స్వతంత్రజీవనాన్ని పొందాలని, స్త్రీల స్వతంత్రతయే దేశస్వాతంత్ర్యసాధనకు ప్రథమ సోపానం అని ఆనాటి రచయిత్రిగా తులసమ్మ ప్రజలలో చైతన్యం కలిగించింది. 1916 సం.నాటికే స్త్రీలలో అభివృద్ధికావల్సిన భావజాలాన్ని తెలియజేయటం జూలూరు తులశమ్మ యొక్క క్రాంత దర్శనానికి నిదర్శనంగా భావించవచ్చు

స్త్రీవిద్యాభివృద్ధి - దేశసేవ

ఎమ్.ఎన్.కమల వ్రాసిన 'హైందవ స్త్రీలు-దేశసేవ' (ఏప్రిల్ 1917 ఆంధ్రపత్రిక ఉగాది వార్షిక సంచిక) అనే వ్యాసంలో దేశాభివృద్ధికై రాజకీయ, సాంఘిక, నైతిక విషయాలలో స్త్రీలసహాయం అవసరమనీ, స్త్రీలు దేశసేవకు అర్హులని గుర్తించాలనీ, స్త్రీ విద్యాభివృద్ధి జరగాలని తెలిపింది. అహల్యాబాయియొక్క రాజ్యమునందలి స్త్రీలు పాటుపడి సంఘసేవ, దేశసేవ చేసారనీ, స్త్రీల ఔన్నత్యమే దేశాభ్యుదయం కాబట్టి దేశభక్తులెల్లరు స్త్రీజనులకు ఉన్నతవిద్యను నేర్పి దేశసేవకు వారిని అర్హులుగా చేయాల్సిన కర్తవ్యం ఉందని తెలియజేసింది. స్త్రీలు తమ ఇంటిలోని వారికి సేవచేయటమే గాక దేశానికి కూడా సేవ చేయాల్సిన కర్తవ్యాన్ని ప్రబోధించిన వ్యాసమిది.

గుడిపూడి ఇందుమతి దేవి వ్రాసిన 'స్త్రీవిద్యా ప్రశంస' (జూన్ 1918 అనసూయ) అనే నాటకంలో తోటి స్త్రీలకు చదువు చెప్పటమే దేశసేవగా భావించాలనీ, ఇంటింటికీ వెళ్ళి స్త్రీలకు విద్య నేర్పాలనీ దానితోపాటు చేతిపనులు, కుట్టుపనులు నేర్పాలని స్త్రీపాత్రల మధ్యన జరిగిన సంభాషణ ద్వారా తెలియజేయటం జరిగింది.

స్త్రీ విద్యాభివృద్ధి దేశసేవలో భాగమని గుర్తిస్తేనే దేశాభివృద్ధి, దేశస్వాతంత్రం ఉంటుందని భావించటంవల్లనే నేటి మానవాభివృద్ధి సూచికలో విద్య ఒక కొలమానం అయ్యింది. అంతర్గత స్వపరిపాలనకై హోమ్‌రూల్ ఉద్యమ ప్రభావంతో దేశసేవలో భాగంగా స్త్రీ విద్యాభివృద్ధి ప్రముఖమైందని భావించింది. స్త్రీ విద్యావంతురాలైతే స్వతంత్ర జీవనమనే ఆలోచనలు పెరుగుతాయనీ, దానంటదే దేశ స్వాతంత్రానికి మార్గం చూపుతుందని భావించారు.

స్త్రీవిద్య - స్వభాషాబోధనా చైతన్యం

గోపిసెట్టి సూర్యనారాయణమ్మ వ్రాసిన 'స్త్రీవిద్య' (నవంబరు1919 అనసూయ) అనే వ్యాసంలో స్త్రీలకు చదువులేక జ్ఞానశూన్యులుగా ఉండటం చేతనే దేశం క్షీణదశలో ఉందనీ, స్త్రీలు స్వభాషలో చదువుకుంటే తమ పిల్లలకు బాల్యవివాహాలు చేయరనీ, వారు పిల్లల్ని బాగా చదివించేటట్లు చేస్తే కుటుంబం, దేశాభివృద్ధి జరుగుతుందని తెలియజేసింది.

స్త్రీలు స్వభాషలో విద్యాధ్యయనం చేస్తేనే సామాజిక విషయాలపట్ల అవగాహన బాగా పెరుగుతుందనీ, అప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందని భావించటం స్పష్టమవుతోంది.

20 వ శతాబ్దపు ప్రారంభంలో ఒక్క శాతంగా ఉన్న బాలికావిద్యను అభివృద్ధిచేయటానికి బ్రిటిష్ ప్రభుత్వం ప్రతిపట్టణంలో బాలికాపాఠశాలలను నెలకొల్పినా, బాలికావిద్య అభివృద్ధి చెందకపోవటానికి కారణాలను విశ్లేషించుకున్నారు. స్త్రీలలో వ్యక్తిత్వస్పృహ పెరిగింది. స్త్రీవిద్యా

ప్రాముఖ్యతను గురించి ప్రచారం చేయటానికి స్త్రీసమాజాలను ఏర్పరచుకొంటూ ఐక్యతా భావాన్ని పెంచుకోవాలనీ స్త్రీవిద్యకు ఆటంకప్రాయమైన బాల్యవివాహాలను నిర్మూలించాలనీ, స్త్రీవిద్యా విషయంలో తండ్రి, సోదరులు, భర్తల బాధ్యతలను తెలియజేసారు. స్త్రీవిద్యాభివృద్ధికి అడ్డువచ్చిన సామాజిక కుటుంబసంస్కృతిని అధిగమించే చైతన్యం రావాల్సిన అవసరాన్ని తెలియజేస్తూ సాహిత్యసృజన చేసారు. స్త్రీలవిద్యపట్ల సామాజిక నిరసనను పట్టించుకోవాల్సిన అవసరంలేదని భావించారు. స్త్రీలు చదువుకుంటే దూరంగా ఉన్న భర్తకు, స్నేహితులకు ఉత్తరాలు వ్రాయచ్చునీ, స్త్రీలందరూ ఐకమత్యంతో ఉండాలనీ, పత్రికాపఠనం చేయాలని తెలియజేసారు. స్త్రీలు విద్యవల్ల ధైర్యంగా నిర్భయంగా, స్వేచ్ఛగా భావప్రకటన చేసేశక్తి, గౌరవం తెచ్చుకున్నప్పుడే స్త్రీలకు స్వాతంత్ర్యం వస్తుందని అప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందని భావించారు. స్త్రీలు ఉన్నతవిద్యను అభ్యసించి చరిత్ర, గణితం, శిశుపోషణ, ప్రకృతి, శరీర శాస్త్రాల పరిజ్ఞానాన్ని పొందాలనుకున్నారు. స్త్రీలు ఉద్యోగాలు చేయాలనే ఆలోచనలను పెంచుకున్నారు. స్త్రీలు ముందుకువచ్చి బాలికలకు తెలుగు, ఆంగ్లములలో వ్రాయటం, చదవటం నేర్పించేందుకు పాఠశాలలను నెలకొల్పారు. కుటుంబంలో భర్తపెత్తనాన్ని అడ్డుకొని స్త్రీవిద్యను అభివృద్ధి చేయాలనుకోవటం, పితృస్వామ్యపు పనివిభజనను తారుమారుచేస్తూ స్త్రీలు ఉద్యోగం చేయాలనుకోవటం, ఉపాధినికూడా పొందాలనుకోవటం జరిగింది. స్త్రీవ్యక్తిస్వాతంత్ర్య సాధనకై బలమైన పునాదులు వేసుకొంటూ 20 శతాబ్దపు మొదటి పాతికేండ్లలోనే స్త్రీవిద్యాభివృద్ధిని అభివృద్ధిచేసుకోవాలని భావనతో పితృస్వామ్యపు కుటుంబసంస్కృతిని ప్రశ్నించటం, దానిని అధిగమించే చైతన్యాన్ని నాటిస్త్రీలు తెచ్చుకోవటం జరిగింది.

స్త్రీలు – వ్యాయామవిద్యా చైతన్యం

స్త్రీలు తమ శరీరాలకు వ్యాయామం ఉంటే శారీరక ఆరోగ్యం పెరుగుతుందని, దానితో తమ మెదడు చురుగ్గా పనిచేసుందని, అప్పుడే స్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యపు స్పృహ కలుగుతుందని భావించారు.

ఆకెళ్ళ కామేశ్వరమ్మ ఆంధ్రజన మహిళాసభలో 'స్త్రీవిద్య'ను గురించి చేసిన ఉపన్యాసంలో (జూన్, జులై 1915 హిందూసుందరి) దేశసేవలో భాగంగా పురుషులతోపాటు స్త్రీలు సహచర్యము చేయాల్సిన అవసరమున్నది కాబట్టి విదేశీ స్త్రీలవలె భారతదేశ స్త్రీలు విద్యావంతులు కావాలనీ, మద్రాసులో స్త్రీల కళాశాలను విజయనగరంలో రాజావారి ఆధ్వర్యంలో బాలికలకు హైస్కూలును ఏర్పాటుచేసారని చెప్పింది. స్త్రీ పురుషుల నడవడిని బట్టి, బుద్ధికుశలతలను బట్టి స్వాతంత్ర్యం అలవడుతుందనీ, అందుకని స్త్రీవిద్యాభివృద్ధి అవసరమనీ, స్త్రీవిద్యకు ఆటంకప్రాయమైన అతి

బాల్యవివాహాలను నిరోధించాలనీ, కన్యాశుల్క, వరశుల్కాలు నిషేధించాలని తెలిపింది. స్త్రీలు నగలను కాక విద్యను అలంకారంగా చేసుకోవాలనీ, సమావేశాలలో దేహారోగ్యం, శిశుపోషణకు సంబంధించిన విషయాలను చర్చించి జ్ఞానాన్ని పొందాలనీ, స్త్రీలకు ప్రత్యేక వ్యాయామశాలలు ఉండాలని తెలియజేసింది. బుద్ధికుశలత్వంతో స్త్రీలు వ్యక్తిస్వాతంత్ర్యాన్ని సాధించాలని భావించింది. స్త్రీలు తమ ఆరోగ్యానికై వ్యాయామంపై దృష్టిని పెట్టమని చెప్పింది.

స్త్రీలు – వైద్యవిద్యా చైతన్యం

'స్త్రీవిద్య' (జులై 1914 హిందూసుందరి) ను జూలూరి తులసమ్మ గురించి వ్రాస్తూ విద్యామహిమవల్ల అమెరికా, జపాన్, ఇంగ్లండు అభివృద్ధిని సాధించాయనీ, పురుషులకు దేశాభిమానం, సత్ప్రవర్తన ఉండాలంటే వారికి బోధించే తల్లులు స్త్రీలే కాబట్టి ముందుగా స్త్రీలు విద్యావంతులు కావాలని తెలియజేసింది. స్త్రీలు సాహిత్యం, గణితం, ఇంగ్లీషు కళలు నేర్చి దేశాభివృద్ధికి పాటుపడాలనీ, ఉన్నతవిద్యనేర్చి ఉపాధ్యాయినులుగా చదువును బోధించవచ్చునీ, స్త్రీలు వైద్యవిద్యను అభ్యసించాలనీ, ఆ రకంగా దేశానికి సేవచేయాలనీ తెలియజేసింది.

స్త్రీవిద్యాస్వాతంత్ర్య చైతన్యం

యర్రగుంట్ల జనార్దనమ్మ వ్రాసిన 'విజ్ఞాన చంద్రికా పరీక్షలు' (మార్చి 1915 వివేకవతి) అనే వ్యాసంలో స్త్రీలకు, పురుషులకు దైవం సమాన బుద్ధి, గుణాలనిచ్చిందనీ, అజ్ఞానాన్ని కదలించటానికి విద్య అనే విసనకర్ర అవసరమని తెలిపింది. అంతేకాదు, స్త్రీలు చదువనారంభిస్తే తమకు దాస్యం సరిగా జరగదనే భావనతోనే పురుషులు స్త్రీలను చదువుకోనీయకుండా చేస్తున్నారనీ, స్త్రీలపై అభిమానం ఉంటే వారికి స్వాంతంత్ర్యాన్ని ఇవ్వాలనే తలంపు వారికి కలగాలని చెప్పింది. స్త్రీలు కూడా ఎన్నిపాట్లు పడియైనా విద్య నార్జించవలెననీ, నేటి ఏలికయైన పంచమ జార్జిచక్రవర్తి స్త్రీలకు ఉన్నత పాఠశాలను విశాఖపట్నంలో, చెన్నపట్టణంలో స్థాపించాడని తెలిపింది. కొంతమంది పురుషులు ముందుకొచ్చి స్త్రీలకు చదువునేర్పించి తమతోపాటు స్వతంత్రం కలిగించాలనుకుంటున్నారు కాబట్టి స్త్రీ పురుష భేదం లేకుండా విద్యనార్జించాలనీ, పిల్లలకు విద్యనేర్పించటానికి తల్లులు జ్ఞానాన్ని వృద్ధిపరచుకోవాలని తెలిపింది. తీరిక సమయాలలో దేశచరిత్రలు, పురాణగాథలు ఆరోగ్యసూత్రాలను తెలుసుకుంటూ తాము రచించిన వాటిని పఠన గ్రంథాలుగా ఏర్పరచాలనీ, విద్యావ్యాసంగం ఏర్పడిన తరువాత చాలునని అనుకోకుండా విజ్ఞానచంద్రికా పరీక్షను నరసాపురం తాలుకాభివృద్ధినీ సంఘంవారి పరీక్షను వ్రాయాలని చెప్పింది. విద్య లభిస్తే సృష్టియందున్న ప్రతి వస్తువుల ఉత్పత్తిని గుర్తించవచ్చని తెలియజేసింది. సమాజంలో పురుషులు స్త్రీవిద్యాస్వాతంత్ర్యానికి విలువను యిచ్చినప్పుడే, వారికి

స్త్రీలమీద అభిమానమున్నట్లని తెలియజేసింది.

'మహిళాసభ' లో కళ్ళేపల్లి వెంకటరమణమ్మ ఉపన్యసిస్తూ (జూన్ 1916 హిందూసుందరి) లో నేటి స్త్రీలకు కావల్సింది, స్త్రీ విద్యాస్వాతంత్రం అనీ, స్త్రీలు ఉన్నతవిద్యను అభ్యసించటానికి దేశభాష అవసరమనీ, వితంతువులకు దేశసేవకు పనికివచ్చే విద్యనేర్పించాలనీ, స్త్రీవిద్యాస్వాతంత్రానికి అడ్డువచ్చేది నిర్బంధ బాలికావైవాహిక ధర్మమని చెప్పింది. దాని నివారణకు స్త్రీలు సమాజాలుగా ఏర్పడి ప్రచారం చేయాలనీ, పారతంత్ర్యపాలకులను పారద్రోలటానికి స్త్రీలకు విద్యాస్వాతంత్ర్యం అవసరమని కళ్ళేపల్లి వెంకటరమణమ్మ తెలియజేసింది

గుడిపూడి ఇందుమతీదేవి వ్రాసిన 'స్త్రీలు పురుషులకంటే తక్కువ వారా?' (సెప్టెంబరు1918 అనుసూయ) అనే వ్యాసంలో స్త్రీలకు, పురుషులకు వారివారి పంచేంద్రియాలలో తేడా ఉన్నా స్త్రీల అంతరేంద్రియాలలో సత్యం, దయ, శౌచంతోపాటు లోకజ్ఞానంకూడా ఎక్కువేననీ, స్త్రీలకు స్వాతంత్ర్యం యిచ్చి సద్విద్యను అందిస్తే వారు లోకాన్ని ఉద్ధరించగలరని తెలియజేసింది.

మద్దాలి సీతారావమ్మ వ్రాసిన 'స్త్రీలకు విద్యాస్వాతంత్ర్యావశ్యముల యావశ్యకత' (ఫిబ్రవరి 1930 గృహలక్ష్మి) అనే వ్యాసంలో తల్లుల స్వాతంత్ర్యకాంక్ష పిల్లలపై ప్రతిబింబిస్తుందనీ, భారత పురుషులకు స్త్రీల విద్యాస్వాతంత్ర్యములే తమకు సిద్ధించే జయమని గుర్తించటం లేదనీ, స్త్రీలకు విద్యాస్వాతంత్ర్యాలు లేకపోతే అది స్త్రీలకు పురుషులకు హానికరమని గుర్తించాలని తెలియజేసింది. స్త్రీల విద్యాస్వాతంత్రకాంక్ష భర్తకు, పిల్లలకు జయాన్ని కల్గించే విషయంగా గుర్తించమని తెలియజేస్తోంది.

స్త్రీలు – రాజకీయస్వాతంత్ర్య చైతన్యం

పురుషాధిక్యతను పేర్కొని స్త్రీలస్వాతంత్ర్యానికి అది అడ్డుగా ఉందనీ, స్త్రీలు స్వతంత్రులైతేనే రాజకీయస్వాతంత్ర్యాన్ని అనుభవించగలరనీ, అప్పుడే దేశానికి స్వతంత్రం వస్తుందని భావించింది. పితృస్వామ్యసంస్కృతి స్త్రీలస్వాతంత్ర్యానికి, దేశస్వాతంత్ర్య సాధనకు గొడ్డలిపెట్టువంటి విషయమనీ, దానిని విమర్శకు పెట్టిన తొలి వ్యాసము ఇది. దేశానికి స్వాతంత్ర్యం కావాలనుకొంటే పురుషులు ముందుగా స్త్రీల రాజకీయస్వాతంత్ర్యాన్ని ఒప్పుకోవాలని చెప్పిన తొలి మహిళ కనుపర్తి వరలక్ష్మమ్మ.

కనుపర్తి వరలక్ష్మమ్మ 'స్త్రీ స్వాతంత్ర్యం' (సెప్టెంబరు 1918 అనసూయ) అనే శీర్షిక క్రింద వ్రాస్తూ స్త్రీలు పురుషుల క్రింద బానిసలు కారనీ, స్త్రీలకొకింత స్వేచ్ఛ ఉండాలనీ, స్త్రీలు పురుషుల వలె సమానంగానే పుట్టారనీ, స్త్రీలకు బుద్ధి, మనసు, జ్ఞానం యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం ఉన్నా కూడా పురుషులు స్త్రీలను అణగద్రొక్కుతున్నారని తెలిపింది. అంతేకాదు, స్త్రీలు విద్యావంతులైతే

లోకజ్ఞానం ఏర్పడి స్వాతంత్ర కాంక్ష ఉదయిస్తుంది కాబట్టి స్వాతంత్ర్యవాదులు స్త్రీలను స్వతంత్రులుగా భావించటమే గాక రాజకీయస్వాతంత్ర్యానికి కూడా స్త్రీలు అర్హులు అని భావించమని తెలియజేసింది. స్త్రీల పుట్టుక, ఎదుగుదల, స్వేచ్ఛవంటి విషయాలలో స్త్రీలు పురుషులతో సమానమనే భావన ఏర్పడాలనీ, అదే సమాజాంతర్గత సంస్కృతిగా స్వాతంత్ర్యాన్ని ఇస్తుందని తెలియజేసింది.

జరుగుమిల్లి రామాబాయమ్మ వ్రాసిన 'స్త్రీనియోజక స్వాతంత్ర్యము' (జులై 1919 అనసూయ) అనే వ్యాసంలో సౌతుంబరో విచారణ సంఘంవారు భారతాంగనలకు నియోజకవర్గ స్వాతంత్ర్యమును వినియోగించుకునే అర్హత లేదని ఇచ్చిన నివేదికను రాజదాససతీ, అనిబిసెంటు, సర్ నారాయణ సావర్కరు వ్యతిరేకించారనీ. భారతాంగనలకు నియోజకవర్గ స్వాతంత్ర్యం ఉండాలని తెలిపింది. స్త్రీలు రాజకీయ విద్యను నేర్చుకోవాలనీ, ప్రపంచంలో జరిగే ప్రతివిషయంపట్ల అవగాహన పెంచుకోవాలనీ, అమెరికా, ఫ్రాన్స్, ఐరోపా దేశాలలో స్త్రీలు పార్లమెంట్ సభ్యులుగా ఉన్నారనీ, అలా భారతాంగనలు రాజకీయోద్యోగాలలో ఉండాలంటే భారత స్త్రీలకు ప్రత్యేక నియోజకవర్గ స్వాతంత్రం ఉండాలని పేర్కొన్నది. దానికి అవసరమైన విద్యావంతులైన స్త్రీలు భారతదేశంలో ఉన్నారనీ, సరోజనిదేవి బ్రిటిష్ సభకు తెలియజేసిందనీ, అనిబిసెంటు స్త్రీలకు జాతీయ ప్రబోధం చేస్తున్నారని రచయిత తెలియజేసింది.

స్త్రీలు తమ రాజకీయ హక్కులను ఒడిసి పట్టుకోవాల్సిన అవసరాన్ని తెలియజేయటం జరిగింది. 1919 చట్టం ముస్లింలకు సభలలో ప్రాతినిధ్యం వహించటానికి ప్రత్యేక నియోజపు వర్గం కేటాయించినట్లుగానే, కేంద్ర రాష్ట్రశాసన సభలలో స్త్రీలు కూడాప్రాతినిధ్యం వహించగల సభ్యులుగా ఉండాలనే అలోచనలతో స్త్రీలకు కూడా ప్రత్యేక నియోకవర్గ స్వాతంత్ర్యం కావాలని భావించారు. స్త్రీలలో రాజకీయస్వాతంత్ర్యం పొందాలనే చైతన్యం కలగటమే, స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యసాధనలో చేరుకొనే ఉన్నతమైన మెట్టుగా భావించాలి.

స్త్రీవిద్య – పితృస్వామ్యానికి చికిత్సాస్పృహ

పత్రికాధిపురాలు ప్రచురించిన "చంపక సందేహ నివృత్తి" (నవంబరు – డిసెంబరు 1919 అనసూయ) అనే నాటకంలో గురుశిష్యుల సంభాషణలో భాగంగా స్త్రీవిద్యను మాన్పించే పురుషులను ముందుగా విద్యావంతుల్ని చేయాలనీ, స్త్రీల ఆశయాలను అణచివేసే మగవారిలోనే తప్పంతా ఉన్నదని చెప్పింది. సాంఘిక జీవనంలో స్త్రీల యెడల నిరాదరణ, తిరస్కారం ఉందనీ, సమాజంలో స్త్రీల యెడల పెట్టిన దురాచారాలన్నీ పురుషులు పెట్టినవేయని తెలిపింది. యువకులు చదువుకున్న అమ్మాయినీ పెళ్ళి చేసుకుంటామంటే తప్ప ఆడపిల్లలను చదివించరనీ, అప్పుడు స్త్రీల స్థితి బాగుపడి

స్త్రీలకు స్వతంత్ర జీవనం ఏర్పడుతుందని తెలియజేయటం జరిగింది.

స్త్రీల అణచివేతకు మూలాలను అన్వేషిస్తూ సామాజిక సంస్కృతిని ఏర్పరచినది పురుషులేనని అందుకే ముందుగా పురుషులలో మార్పుకలగాలని భావించటం జరిగింది. స్త్రీవిద్యకు, స్త్రీలవైవాహిక సంస్కృతిపట్ల పురుషులలో రావల్సిన మార్పును సూచించింది. స్త్రీవిద్యాభివృద్ధి జరగాలంటే ముందుగా పురుషుల్లో జ్ఞానం కలగటానికై వారిని విద్యావంతుల్ని చేయాలని భావించింది.

20 శ. రెండవ దశాబ్దపు స్త్రీలసాహిత్యంలో ప్రతిఫలించిన విషయాలుగా స్త్రీలలో స్వతంత్ర భావాలు అభివృద్ధిచెంది జన్మసిద్ధమైన స్వతంత్రజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకునే క్రమంలో మానవ పునరుత్పత్తికి సంబంధించిన శరీరశాస్త్రము, శిశుపోషణ గురించి తెలుసుకోవటమేగాక, వృత్తివిద్యల ద్వారా ఆర్థికస్థితిని పెంచుకోవాలని అనుకున్నారు. స్త్రీల ఆరోగ్యం గురించిన ఆలోచనలను పెంచుకొన్నారు. స్త్రీవిద్యాశక్తి దేశానికి ఉపయోగకరంగా ఉంటే స్త్రీజాతికి విలువ పెరుగుతుందని భావించారు. విదేశాలలోని స్త్రీలవలె విద్యాభివృద్ధితోపాటు స్త్రీలు రాజకీయ వ్యవహారాలలో స్వతంత్రంగా ఉండాలనుకొన్నారు. ఉద్యోగాలు కూడా చేసుకోవాలను కోవటంవంటి ఆలోచనల పరిణామశీలతతోపాటు దేశముయొక్క దీనస్థితిని అవగాహన చేసుకోవాలనుకున్నారు. వివాహితస్త్రీలు కూడా విద్యనుకొనసాగించాలనీ శాస్త్రపరిజ్ఞానము గణితము, చరిత్ర, వైద్యం, మనోవిజ్ఞానం వంటి విషయాలతో స్త్రీవిద్య అభివృద్ధిచెందాల్సిన అవసరాన్ని గుర్తించారు. స్త్రీలకు ఆధ్యాత్మిక జ్ఞానముకంటే ప్రపంచజ్ఞానము అవసరమనే స్థితికి చేరుకున్నారు. స్త్రీల పుస్తకపఠనంకోసం స్త్రీలే ముందుకువచ్చి స్త్రీల గ్రంథాలయాలను స్థాపించారు. పర్యావరణము, పరిశుభ్రత, స్త్రీల ఆరోగ్యానికి సంబంధించిన ఆలోచనలను పెంచుకున్నారు. రజస్వలానంతర వివాహాలను క్రియారూపంలో చూపించి సమాజసంస్కృతిని అధిగమించారు. స్త్రీలవిద్యావిషయాలలోను స్త్రీలసమావేశాలకు వెళ్ళనీయకుండా చేసే సోదరుల భావాలను గుర్తించారు. స్త్రీలు పుస్తకపఠనము చేస్తుంటే కులట అంటారనీ నిరంతరం హింసకు గురిచేస్తున్న భర్తలే స్త్రీలపాలిటి మృత్యుదేవతలని భర్తల దుర్మార్గాన్ని బట్టబయలుచేసారు. స్త్రీవిద్యకు, స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్యానికి గొడ్డలిపెట్టయిన సామాజిక కుటుంబ సంస్కృతిని నిరసించే స్థితికి స్త్రీలు చేరుకోవటం కనపడుతుంది. స్త్రీవిద్యను అణచివేస్తున్నది పురుషులేనని, వారిలో మార్పురావలసిన అవసరం ఉందని భావించారు. అంతేకాక, వైవాహిక సంస్కృతిపట్ల స్త్రీల నిరసన చూపించి స్వీయనిర్ణయం తీసుకోవటం స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యానికి నిదర్శనమని అర్థమవుతుంది.

స్త్రీలు నెలకొల్పిన బాలికాపాఠశాలవిద్యలో ఉపాధి కల్గించే నూలువడకటం, ఖద్దరు వర్తకము చేయటాన్ని ప్రారంభించిన స్త్రీలు ఆర్థికస్వావలంబన దిశగా అడుగులు వేసారు. దేశభాషతో పాటు

ఆంగ్లభాషనుకూడా స్త్రీలు నేర్చుకోగలిగితేనే దేశాన్ని పాలించే శక్తి స్త్రీలకుంటుందనీ, స్త్రీకి స్వతంత్ర జీవనం అవసరమని భావించారు. స్త్రీలస్వాతంత్ర్యాన్ని గురించి విశ్లేషణ చేసారు. స్త్రీసమాజాలను విస్తృతంచేసుకొని ఆంధ్రమహిళాసభలను ఏర్పాటుచేసుకొన్నారు.

బ్రిటిష్ వారు ముస్లిములకు ప్రత్యేకనియోజకస్వాతంత్ర్యాన్ని యిస్తూ 1919 చట్టంచేయగా స్త్రీలుకూడా తమకు ప్రత్యేక నియోజకస్వాతంత్ర్యంకావాలని, దానికోసం తమకు ఎన్నికల అధికారం ఉండాలనే ఆలోచనలను చేసారు. అంతేకాక గాంధిపిలుపును అందుకొని సత్యాగ్రహ ఉద్యమంలో భాగంగా ఖద్దరు తయారీలో పాల్గొన్న స్త్రీలలో ఆత్మవిశ్వాసం పెరిగి స్త్రీపురుషసమానత్వం కోసం ఆర్థికస్వావలంబనదిశగా అడుగులు వేయటం మొదలుపెట్టారు. దానికోసం స్త్రీలందరూ విద్యావంతులుకావాలని భావించి స్త్రీలపురోభివృద్ధికై మార్గాన్వేషణచేసారు.

స్త్రీలు నిర్బంధవిద్య

సామాజిక ఆంక్షలను తప్పించుకొని స్త్రీలు విద్యావంతులు అవటం కష్టమని భావించారు. అందుకనే స్త్రీలు పాలనా వ్యవహారాలలో అడుగుపెట్టి స్త్రీలకు విర్బంధవిద్యను ప్రవేశపెట్టాలని ఆకాంక్షించారు.

సమర్థి స్వర్ణమ్మ 'నిర్బంధవిద్య'ను (స్త్రీధర్మపత్రిక, డిశెంబరు1924) గురించి వ్రాస్తూ బాలికలకు విద్య సర్వార్థసిద్ధినిచ్చు కల్పవృక్షమనీ, కామధేనువనీ, దానిని కులాచారంచేయాలనీ, స్త్రీలపురోభివృద్ధికై స్త్రీలకు ఎన్నికల అధికారంయివ్వాలనీ, స్త్రీలుకావ్యపఠనంచేయాలనీ, లలితకళలను అభ్యసించాలనీ, చర్కాతిప్పుతూ ఉండాలని ఉద్బోధించింది. స్త్రీలు చదువుకోవటంచేతనే తమకున్న అధికారాలను తరచిచూసుకుంటూ పురుషలతోపాటు సమానంగా తమకు ఎన్నికల అధికారం ఉండాలని కోరుకున్నారు. ఓటుహక్కు, పాలనావ్యవహారాలలో పాల్గొనే భాగస్వామ్యంకావాలని భావించారు.

వి.పద్మ 'స్త్రీవిద్య' (స్త్రీధర్మ, డిశెంబరు1924) ను గురించి వ్రాస్తూ స్త్రీలు విద్యను సేకరించటానికి మార్గాలను సూచిస్తూ సత్సాంగత్యం, సద్గ్రంథపఠనం, దేశసంచారం అవసరమనీ, ప్రతిమానవులకు విద్యను అభ్యసించుట సర్వసామాన్యమైన హక్కు అని తెలిపింది.

స్త్రీవిద్య – స్త్రీలస్టాండిగ్ కమిటీ

స్త్రీలకు సమానహక్కులు ఏర్పడాలంటే స్త్రీల విద్యాసంబంధమైన పాఠ్యాంశాలను నిర్ణయించే కమిటీలలో స్త్రీలకు స్థానం ఉండాలని భావించారు. స్త్రీవిద్యాభివృద్ధిలో స్త్రీలకు ఉండాల్సిన నిర్ణయాత్మక అవకాశాలను గుర్తించారు.

'స్త్రీవిద్య – వెంటనే చేయవలసిన పని' (స్త్రీధర్మపత్రిక, జూన్1926) అనే శీర్షికన శ్రీమతి

ఎ.ఎల్ హైడికోపర్ వ్రాస్తూ 'స్త్రీలకమిషన్' ను వెంటనే నియమించాలనీ, దానివలన భారతస్త్రీలకు విద్యాలాభమేకాక స్త్రీలసమస్యలకు పరిష్కారం ఏర్పడుతుందని తెలిపింది. పాఠ్యాంశాలను, పరీక్షలను నిర్ణయించేందుకు స్త్రీలే స్టాండింగ్ కమిటీలే ఉండాలనీ, స్త్రీకార్మికులు పనిచేసేచోట శిశు పోషణాలయాలు ఉండాలనీ, స్త్రీపురుషులకు సమానహక్కులు ఉండాలని తెలియజేసింది. స్త్రీలసమస్యలకు స్త్రీవిద్య పరిష్కారం చూపుతుందని, భావించి స్త్రీపురుషసమానహక్కులను ప్రతిపాదించింది.

స్త్రీవిద్య – సెలక్టుకమిటీ

1928వ సంవత్సరం ఫిబ్రవరి 1వ తేదీన ఢిల్లీలో జరిగిన రెండవ 'అఖిలభారత మహిళావిద్యావిషయక' సభలో (ఏప్రిల్ 1928 హిందూ సుందరి) చేసిన తీర్మానాలుగా సి.సుబ్బలక్ష్మమ్మ తెలియజేస్తూ బాలికలకు నిర్బంధ విద్యను పెట్టాలనీ, అతి బాల్యవివాహాల నిర్మూలన చేయాలనీ, స్త్రీ విద్యావిషయంలో ఇనస్పెక్టర్లగానూ, టెక్ట్స్ బుక్కు కమిటీలో స్త్రీలను మెంబర్లుగా చేయాలని తీర్మానించారు. బాలికలకు దేశసేవను నేర్పాలనీ, వ్యవసాయాన్ని బాలికలకు నేర్పాలనీ, బాలికలకు నర్సింగ్ స్కూల్స్ పెట్టాలనీ, స్త్రీ విద్యాభివృద్ధి విషయమైన ఫిల్ములు ప్రదర్శించాలని తీర్మానాలు చేసారు. ఈ విషయాలను అసెంబ్లీలో ప్రవేశపెట్ట గలిగే విధంగా సెలెక్టు కమిటీలో స్త్రీలు మెంబర్లుగా ఉండాలనీ, దానికై ప్రతిప్రావెన్సు నుండి ఒక్కొక్క స్త్రీని ప్రతినిధిగా పెట్టుకోవాలనీ, దానికై ఆంధ్రరాష్ట్రం నుండి కోకా కృష్ణవేణమ్మ ఎన్నుకోవటం జరిగిందనీ, ఆమె స్త్రీ విద్యావిషయంలో సభలో చేసిన తీర్మానాలను కోకా కృష్ణవేణమ్మ స్టాండింగ్ కమిటీ (స్థిర సమాజంలో) కి నివేదిస్తారని తెలియజేసింది.

1928 నాటికి విద్యావంతులైన స్త్రీలు విద్యావిషయంలో, పాఠ్యాంశ నిర్ణయం చేయటంలోనూ, స్థాయీ సంఘాలలో సభ్యురాండ్రుగా ఎదగగలగటమే స్త్రీల ప్రగతికి సూచికగా భావించవచ్చు.అంతేగాక స్త్రీలకు వ్యవసాయవిద్య, నర్సింగ్ విద్యను నేర్పాలని సూచించింది.

స్త్రీవిద్య – స్త్రీవిద్యాధికారిణి

'డా.కొటికల లక్ష్మమ్మ' (నవంబరు 1929 గృహలక్ష్మి) ను గురించి పత్రికాధిపులు వ్రాస్తూ బళ్ళారికి చెందిన ఆమె సాంకేతికవిద్యా సముపార్జనానికై ఢిల్లీ, బొంబాయిలో వైద్యవిద్య నభ్యసించిందనీ, సంఘసేవాభిలాషతో ప్రజాజీవనంలో పాల్గొన్నదనీ, బొంబాయి రాష్ట్రీయ ఆంధ్రమహాసభను ఏర్పాటుచేసిందని తెలియజేసింది. అంతేకాదు, హార్టాంగుకమిటీవారి నివేదిక ప్రకారం ఆంధ్రప్రాంతములో స్త్రీవిద్య వెనుకబడి యున్నదనీ, 1917–22 మధ్య బాలికాపాఠశాలలు ఏర్పాటైనా, బాలురసంఖ్యలో నాల్గవవంతు మాత్రమే బాలికలే విద్యను నేర్చుకుంటున్నారనీ, స్త్రీ విద్య అభివృద్ధి

చెందటానికి ప్రతి రాష్ట్రమునందు స్త్రీ విద్యాధికారిణి ఉండాలని చెప్పింది. స్త్రీలు మున్సిపల్ సంఘములలో, తాలుకా బోర్డులో, జిల్లాలు, మండల బోర్డులో సభ్యురాండ్రుగా ఉండాలనీ, వీలైతే వితంతువులకు నిర్బంధస్త్రీవిద్యను ఏర్పాటుచేయాలనీ, స్త్రీలనైతిక, శారీరాభివృద్ధికి ఉపయోగపడే విద్యను నేర్పించాలని తెలియజేసింది. స్త్రీలు విద్యావంతులై విద్యాధికారిణిగా ఉంటూ మున్సిపల్ బోర్డులలో సభ్యులై స్త్రీవిద్యను ప్రోత్సహించే విధంగా స్త్రీలు ప్రజాజీవనంలోకి రావాలని డా.కొటికల లక్ష్మమ్మ పిలుపునిచ్చినట్లుగా పత్రిక తెలియజేసింది.

స్త్రీవిద్య – గరల్ గైడింగ్ విద్య

'బాలికలు – లోకసేవ' (జూన్ 1927 భారతి) అనే వ్యాసంలో రొట్టెకల్ సుబ్బమ్మ భారతదేశంలో కూడా 'గరల్ గైడింగ్' ఉద్యమం బాలికలలో ప్రచారం కావాలనీ, దాని ప్రకారం స్త్రీలు లోకమునకు, తమ స్వదేశమునకు, ప్రజాకోటికి సేవచేసే విధంగా బాలికా వ్యవస్థలోనే శిక్షణ పొందగలుగుతారనీ, దేశానికి వారి అవసరముందని తెలియజేసింది. దేశసేవను బాలికా విద్యలో భాగంగా పాఠ్యాంశ శిక్షణారూపంలో పెట్టాలనుకోవటమే నాటి బాలికలను భవిష్యత్తులో దేశపౌరులుగా తీర్చిదిద్దాలనుకోవటంగా అర్థమై ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది.

స్త్రీవిద్య – స్త్రీలహక్కుల సాంఘికపునర్నిర్మాణ చైతన్యం

కాకినాడలోని స్త్రీవిద్యార్థినీసమాజంవారు ప్రతి పౌర్ణమినాడు జరిపే సభలో "ఉమెన్స్ డే" (ఫిబ్రవరి 1928 హిందూసుందరి) ను గురించి పత్రికాసంపాదకురాలు తెలియజేస్తూ 'మదరాసులో ఉమెన్స్ డే' అనే నవీన సంస్థను స్థాపించారనీ, ఆ సభలో వారు స్త్రీవిద్యాసంస్కరణలు అవసరమనీ, సంపూర్ణవిద్యావికాసాలలో వైద్యపరీక్షను ముఖ్యాంశంగా చేసినట్లు పత్రిక తెలియజేసింది. అంతేకాదు, స్వీయాభివృద్ధికి, సామాజికపునర్నిర్మాణాలకు మహిళాసంఘాలను స్థాపించి వాటిని కాపాడే బాధ్యతను ఈ 'ఉమెన్స్ డే' సంస్థ వహించాలనీ, మాతృధర్మం, శిశుశ్రేయానికై జాతీయసేవ చేయటానికి ఔషధాలయాలు, అనాధశరణాలయాలను ఏర్పాటుచేయాలనీ, చెరసాలలమార్పులు, గౌరు విద్యావిధానం, బాలికలకు ఉపచారకార్యవిద్యను (నర్సింగ్), జారగృహ నిర్మూలనం, చిత్రలేఖనం, సాంఘికపునర్నిర్మాణం, ధార్మిక, రాజకార్య విషయాలలో స్త్రీలు పాల్గొనటం వంటివి చెయ్యాలని నిర్ణయించారని తెలిపింది. వైవాహిక వయోకాలపరిమితిని శాసన పూర్వకంగా చేయటానికి ప్రభుత్వం వారిని కోరటం చేయాలనీ, వధూవరులను ద్రవ్యమిచ్చి కొనే దురాచారాన్ని ఖండించాలని కూడా భావించారని సభావిశేషాలను తెలియజేసింది. ఆ సభలో ఆనందబాయి మాట్లాడుతూ అవిభక్త, విభక్త కుటుంబాలలోని ఆస్తి, స్త్రీ ధనాన్ని అనంతర వారసత్వంలోను స్త్రీల భాగస్వామ్యవిషయాన్ని,

స్త్రీల స్వత్వముల (హక్కులు) దిశగా సాగి సాంఘిక పునర్నిర్మాణం జరగాలని చెప్పింది. స్త్రీల గృహపరిశ్రమకు, దేశపరిశ్రమలకు తమ శక్తిని సమర్పించటం స్త్రీల కర్తవ్యమని చెప్పిందని తెలియజేసింది.

మదరాసులో జరిగిన సభలో స్త్రీలు తమ అభివృద్ధిని గురించి, సామాజిక, ఆర్థిక, రాజకీయాల లోని భాగస్వామ్యాన్ని, స్త్రీలహక్కులను గురించిన అవగాహనను కల్గించి, స్త్రీలు తమజీవితాలపైన గాక దేశంయొక్క స్వరాజ్య సంపద గురించి కూడా ఆలోచించాలని భావించారు.

కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాసిన 'స్త్రీలకు నవీనచట్టములు, వాని ప్రయోజనము' (ఏప్రిల్ 1930 ఆంధ్రపత్రిక ఉగాది సంచిక) అనే వ్యాసంలో పూర్వ సమాజంలో స్త్రీలు పరాధీనులుగా ఉన్నారనీ, కాని నేడు స్త్రీలకు కూడ ప్రత్యేక మనోబుద్ధి శక్త్యాదులు కలవనీ, అవకాశాన్ని కలిగిస్తే వారియొక్క బుద్ధి, వివేకాలు దేశపురోవృద్ధికి సాధనములు అవుతాయని తెలిపింది. దానికై శారదాచట్టము, వయోవివాహనిర్ణయం, స్త్రీపునర్వివాహ చట్టములు ఏర్పడి స్త్రీలకు వైవాహిక స్వాతంత్ర్యమును ఒనగూర్చాయని తెలియచేసింది. అంతేకాక, వారసత్వచట్టంవల్ల స్త్రీలకు ఆర్థికలాభం తోడ్పడుతుందనీ, దేవదాసీల చట్టములు, వ్యభిచార నిరోధక చట్టము స్త్రీలనైతికాభివృద్ధికి సహాయం అవుతుందని చెప్పింది. చట్టసభలో, స్థానిక సంఘములో స్త్రీలకు ఇచ్చిన హక్కు స్త్రీలకు రాజకీయ స్వాతంత్ర్యాన్ని కలగజేస్తుందనీ, కాని వీటిని స్త్రీలు వినియోగించుకొనే నేర్పుకావాలనీ విద్యలేకపోవటంచేత ఆ హక్కులపై అవగాహన స్త్రీలకు ఉండటం లేదని భావించింది. అంతేకాదు, స్త్రీలు విద్యను అభివృద్ధి చేసుకుంటే కన్యాశుల్కం, బాల్యవివాహాలు తగ్గుతాయనీ, బాలవితంతువులు ఉండాల్సిన అవసరం ఉండదనీ, స్త్రీలకు సాంఘిక నిర్భంధాన్ని విధించారనీ, ఆర్థిక హక్కు లేకుండా చేయటంతో స్త్రీలు అస్వతంత్రులుగా ఉన్నారనీ, దానికై స్త్రీలు సంఘాలుగా ఏర్పడి, సభలు జరుపుకుంటూ తీర్మానాలు చేసుకోవాలని చెప్పింది. స్త్రీలు రాజకీయాలలో కృషిచేసేలా స్త్రీసమస్యలు తీర్చుకోగలిగే చట్టాలను ప్రవేశపెట్టేస్థితికి స్త్రీలు చేరుకుంటేనే భారతదేశ పురోభివృద్ధికి, సాంఘికపునర్నిర్మాణానికి దోహదం కాగలుగుతుందని కూడా తెలియజేసింది.

స్త్రీవిద్యాభివృద్ధి – ఎన్నికలప్రశ్నావళి–చట్టపరమైన హక్కులచైతన్యం

'మదరాసు శాసనసభ యెన్నికలు' (మే 1929, విద్యానంద పత్రిక) అనే శీర్షికన స్త్రీసంఘములు ఎన్నికలలో నిలబడే అభ్యర్థులకు ప్రశ్నావళిని రూపొందించి మద్రాసు ఎన్నికల సంస్థకు పంపించారు. అవి వరుసగా స్త్రీలకు ఉన్నతవిద్యాభివృద్ధికి తగిన సాధనములను సమకూర్చుతున్నారా అనీ, మాతాశిశు వైద్యశాలలను పాఠశాలలలో పిల్లలకు వైద్యతనిఖీని ఏర్పాటుచేసున్నారా అనీ,

శారదాబిల్లును సమర్థిస్తున్నారా లేదా అనీ, పసికూనలను వివాహమాడే ముసలివానిని శిక్షిస్తారా లేదా అనీ, వరశుల్క దురాచారాన్ని అణగద్రొక్కుతారా లేదా అనీ, 18 ఏండ్ల వయసు గర్భాదానాన్ని అంగీకరిస్తారా లేదా అనీ, వితంతువివాహాన్ని ప్రోత్సహిస్తారా లేదా అనీ, వ్యభిచారంనుండి బాలికాసంరక్షణ, దేవదాసివ్యవస్థ నిర్మూలన, భార్యాభర్తలకు అర్హనీయ వివాహములు, భార్యకు, కుమార్తెకు పారంపర్య ఆస్తిహక్కును కూర్చగలరా లేదా అనీ, మద్యపాననిషేధం, అస్పృశ్యతానిర్మూలనం, కార్మికస్త్రీల దురవస్థను పోగొట్టే చట్టాలను కలిగిస్తారా లేదా అని స్త్రీల అభివృద్ధికి సంబంధించిన విషయాలలో ఎన్నిక కాబడబోయే శాసనసభ్యులయొక్క అభిప్రాయసేకరణ చెయ్యాలనుకొన్నారు. స్త్రీలసంక్షేమానికి కావలసిన విషయాలను ఎన్నికలకు ముందుగానే శాసనసభ్యులుగాఎన్నిక కాబోయేవ్యక్తులకు స్పష్టంచేయగలగటానికి స్త్రీవిద్యాభివృద్ధియే నిదర్శనంగా భావించాలి.

స్త్రీవిద్యాసంస్థల ప్రచారం

'ఆంధ్రదేశ స్త్రీవిద్యాసంస్థలు' (అక్టోబరు 1929 గృహలక్ష్మి) అనే శీర్షికన స్త్రీలకోసం పెట్టిన విద్యాసంస్థలను గురించి పత్రికాధిపులు తెలియచేస్తూ రాజమండ్రిలో 'వైశ్యసేవాసదనాన్ని' వైశ్యస్త్రీల అభివృద్ధికోసం 1920 లో నాళం రామలింగయ్యగారు స్థాపించారనీ, వాఙ్మయం వైద్యం, లలితకళలు, కార్మికవిద్యలు నేర్పేవారని తెలియజేసింది. 1922 వ సంవత్సరమున గుంటూరులో స్త్రీలకు ఉన్నత విద్యను గడపటానికి 'శ్రీ శారదా నికేతనము' ఉన్నవ లక్ష్మీబాయమ్మచేత స్థాపింపబడిందనీ, దానిలో 8 సంవత్సరముల విద్యావిధానం ఉందనీ, మొదటి ఐదు సంవత్సరములు సాహితీ ప్రకరణమనీ, చివరి మూడు సంవత్సరములు విదుషీ ప్రకరణమని నిర్ణయింపబడింది. చదవను, వ్రాయను వచ్చిన బాలికలకు సాహితీప్రకరణలో ప్రవేశం కల్పిస్తారనీ. సంస్కృతాంధ్రాలతోపాటు, ఆంగ్లం గానీ, హిందీని గాని అభిమాన భాషగా తీసుకొనవచ్చుననీ, ఆయా భాషలలో ఉత్తీర్ణులైతేనే విదుషీ పట్టభద్రులవుతారని పత్రిక తెలియజేసింది. నెల్లూరులో కస్తూరిదేవి విద్యాలయాన్ని 1923లో పొణకా కనకమ్మ స్థాపించారనీ, జాతీయపద్ధతిలో ఉచిత విద్యను అందిస్తూ, తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీషు భాషా విద్యలను, రాట్నం, ఫేముపని వంటి పరిశ్రమలు, సంగీతం, యోగాను నేర్పుతూ గృహిణులైన స్త్రీలకు కూడా ప్రవేశం కల్పించారనీ తెలియజేసింది. కాకినాడలో 1924లో మహిళా జాతీయ విద్యాలయంగా స్త్రీల పురోభివృద్ధికై 'విద్యార్థినీ సమాజము' నెలకొల్పబడిందనీ, విద్యాలయంయొక్క యాజమాన్యంలో సభ్యురాలైన బాలాంత్రపు శేషమ్మగారి ఆధ్వర్యంలో 'హిందూసుందరి' అనే పత్రిక వెలువడిందని తెలిపింది. దీనిలో సంస్కృతం, హిందీ పరీక్ష, కుట్టుపని, సంగీతం, ఊలుపని, నేర్పబడుతుందనీ, ప్రభుత్వం వారిచే ఈ విద్యాలయం గుర్తింపబడిందనీ,

దీనిలో ఉన్న గ్రంథాలయానికి రాజ్యలక్ష్మి పుస్తక భాండాగారమని పేరును పెట్టటం జరిగిందని తెలియజేసింది. పత్రికాముఖంగా స్త్రీలవిద్యాసంస్థలకు సంబంధించిన సమాచారాన్ని అందించేప్రయత్నం స్త్రీవిద్యాభివృద్ధి కార్యక్రమంగానే భావించాలి.

స్త్రీవిద్య – గృహకృత్యవిజ్ఞానం

కొడాలి సీతారామదేవి 'గృహకృత్య విజ్ఞానం' (నవంబరు 1929 గృహలక్ష్మి) ను గురించి వ్రాస్తూ స్త్రీలు గృహనిర్వహణలో పరిశుభ్రతపాటించాలన్నా, ఆరోగ్యాన్ని యిచ్చే పాకములు చేయాలన్న శిశుసంరక్షణలో పరిశుభ్రతపాటించాలన్నా, శిశుపోషణానికై పుష్టికర ఆహారం అందించాలన్నా గృహవిజ్ఞానం స్త్రీలకు అవసరమని తెలిపింది. ఇంట్లో క్రమపద్ధతిలో వస్తు సంరక్షణచేయాలన్నా, దాసదాసీజనాలతో మానవసంబంధాలు నెరపాలన్నా స్త్రీలకు గృహవిజ్ఞానం అవసరమని తెలియజేస్తూ గృహయజమాన్యానికి, ఇంటి కీర్తికి, గౌరవానికి స్త్రీవిద్య అవసరమని తెలియజేసింది. నేటి గృహవిజ్ఞానశాస్త్ర విద్యాపాఠ్యాంశాలను ఆనాడే స్త్రీలు నిర్ణయించారు.

స్త్రీల ఉన్నతవిద్య – స్త్రీలవిశ్వవిద్యాలయం

పితృస్వామ్యసంస్కృతీ సమాజంలో స్త్రీలకు ప్రత్యేక విశ్వవిద్యాలయం ఉంటే స్త్రీలు ఉన్నత విద్యను అభ్యసించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని భావించారు.

తుర్లపాటి రాజేశ్వరి 'బెజవాడలో జరిగిన ఆంధ్ర మహిళా సభలో' (డిసెంబరు1929 గృహలక్ష్మి పత్రికలో) ఇచ్చిన ఉపన్యాసంలో స్త్రీవిద్య మిగులు అధోగతిలో ఉందని 'హార్టాంగ్' కమిటీ సూచించిందనీ, ప్రొ.కార్వేగారు మహరాష్ట్రలో హైందవ స్త్రీల విశ్వవిద్యాలయం స్థాపించారనీ, మద్రాసులో క్వీన్ మేరీ కళాశాల ఏర్పడిందని తెలిపింది. బాలికలకు ఉన్నత విద్యనీయగల పాఠశాలలు పెడుతున్నారనీ, స్త్రీలకు దేశభక్తిని పెంపొందించే విద్య అవసరమని చెప్పింది.

స్త్రీవిద్య – స్త్రీలగౌరవం

లేళ్ళ నాగభూషణమ్మ 'స్త్రీవిద్య' (జనవరి 1930 గృహలక్ష్మి) ను గురించి వ్రాస్తూ. స్త్రీలు గృహపరిశ్రమలందే గాక, రాజకీయ విషయములు, విద్యావిషయ వ్యవహారాలలోనూ సహాయసహకారాలు అందించాలనీ, దేశంకోసం కష్టపడాలనీ దానికి సరోజనీదేవియే తార్కాణమని తెలియజేసింది. స్త్రీలు రాజకీయవిషయాలలో భాగస్వాములు కావల్సిన అవసరాన్ని తెలియజేసింది. స్త్రీలు విద్యావంతులైతే గౌరవించాల్సి వస్తుందని వారి మీద అపోహలు కల్గిస్తున్నారని తెలియజేసింది. సమాజంలో స్త్రీలను గౌరవించే సాంప్రదాయం పెరగాల్సిన అవసరాన్ని సూచిస్తుంది. స్త్రీలకు గౌరవప్రదమైన జీవితమే వారి స్వతంత్ర జీవనానికి చిహ్నమని భావించింది.

స్త్రీవిద్య మహిళాన్యాయాధికారిణి - న్యాయచైతన్యం

పులవర్తి కమలావతిదేవి 'దామెర్ల కమలరత్నమ్మ' (ఆగష్టు 1930 గృహలక్ష్మి) ను గురించి వ్రాస్తూ కమలరత్నంగారి తల్లి బాగా చదువుకున్నదనీ, ఆమె నరసాపురము నందు స్త్రీసమాజమును ఏర్పాటు చేసిందనీ, స్త్రీలకు గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయటానికి, నరసాపుర తాలుకాభివృద్ధికి సంఘాన్ని అభివృద్ధిచేయటానికి చేసిన సేవ నిరుపమానం కాబట్టి విద్యాధికురాలైన స్త్రీ గౌరవానికి పాత్రురాలు కాదగినదని తెలియజేసింది. కమలారత్నంకూడా నరసాపురంనందు ప్రముఖులైన ట్రైలరోన్నత పాఠశాలలో చదువుకొన్నదనీ, రాజమహేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో లెక్చరర్ గా పనిచేస్తోందనీ, ఢిల్లీలోని అఖిలభారతమహిళాసభలో పాల్గొన్న ఆదుర్తి భాస్కరమ్మ ఈమెకు ఆడబడుచు అని చెప్పింది. ఈమె చేస్తున్న సాంఘికసేవను గుర్తించి ప్రభుత్వంవారు ఈమెను రాజమండ్రిలో మహిళాన్యాయాధికారిగా నియమించారనీ, బెంచికోర్టులలో స్త్రీలకు కూడా ప్రాతినిధ్యముంటే గానీ నేరస్థస్త్రీల కష్టాలు తొలగవని భావించిందనీ, ఈమె అనంతపురమున స్త్రీల రాజకీయ పారిశ్రామిక నైతికాభివృద్ధికై విశేషకృషి చేసిందని పులవర్తి కమలావతిదేవి తెలియజేసింది.

స్త్రీ న్యాయాధికారిణి స్థాయికి చేరుకోవటమే స్త్రీ సాధికారికతకు ముందడుగు వేయటంగా భావించవచ్చు. తల్లి విద్యావంతురాలు అవటంచేతనే కూతురుకూడ బాగా చదువుకొని ఉన్నతమైన ఉద్యోగార్హతను పొందగలిగిందని నిరూపితమైనట్లుగా అర్థమవుతుంది.

స్త్రీవిద్య - స్త్రీలస్వతంత్ర జీవనచైతన్యం

గుమ్మడిదల దుర్గాబాయమ్మ వ్రాసిన 'అబలలయెడ అన్యాయములు' (మార్చి1930 గృహలక్ష్మి) అనే వ్యాసంలో ముసలివానికిచ్చే బాల్యవివాహాల ఫలితంగా వితంతువులు పునర్వివాహం చేసుకోకూడదనటం అన్యాయమనీ, ఈ అన్యాయంపట్ల స్త్రీలు మౌనంగా ఉండటానికి కారణం వారికి విద్య లేకపోవటమేనని చెప్పింది. వారు చదువుకోవాలనుకున్న తండ్రి, సోదరులు అడ్డుపడుతున్నారని, స్త్రీలు చదువుకోకపోవటమే స్త్రీల కష్టాలన్నిటికీ కారణమనీ మిగిలిన వారిని అబలలను చేస్తున్నారనీ బాధపడింది. స్త్రీల అవిద్య స్త్రీల పరాధీనతకు, అస్వతంత్రతకు కారణమని చెప్పింది.

ముప్పలనేని పుష్కరాంబ వ్రాసిన 'స్త్రీవిద్య - దాని ఆవశ్యకత' (మార్చి 1930 గృహలక్ష్మి పత్రిక) అనే వ్యాసంలో శిశుపోషణానికి స్త్రీవిద్య అవసరమనీ, విదేశీ స్త్రీల వలె భారతదేశంలో స్త్రీ శక్తులు కూడా ధైర్యంగా, స్వతంత్రంగా మాట్లాడాలనీ, స్త్రీలు వీరమాతలైతేనే భారతమాత సంతోష పడుతుందని చెప్పింది. స్త్రీలు విద్యావంతులై ధైర్యంగా తమ అభిప్రాయ ప్రకటనకు పూనుకోవటమే స్వతంత్రతయొక్క చిహ్నంగా భావించింది.

స్త్రీవిద్య – వయోజనవిద్య

యువతులవిద్యను ప్రోత్సహించినా ఇంకా సమాజంలో తల్లులవిద్యను పెంపొందించాల్సిన అవసరాన్ని గుర్తించి స్త్రీలలో వయోజనవిద్యా చైతన్యాన్ని కలిగించాలనుకొన్నారు.

'నాల్గవ అఖిల భారత మహిళామహాసభ' ను (ఏప్రిల్ 1930 వాసవి) గురించి పత్రికాధిపులు వ్రాస్తూ ఆ సభలో చేసిన తీర్మానాలను తెలియజేస్తూ, స్త్రీల పాఠశాలలో సంగీత, నృత్య, గృహపారిశుధ్యం, పాకశాస్త్రం శిశుపోషణ ఆరోగ్యశాస్త్రానికి సంబంధించిన పాఠ్యాంశాలు తప్పక ఉండాలనీ, స్త్రీలకు తీరుబడియైన మధ్యాహ్న సమయాలలోను, రాత్రిపాఠశాలవంటివి ఏర్పాటుచేయాలని తీర్మానాలు చేసారని తెలిపింది. బీదరికం, వయసుతో సంబంధం లేకుండా అందరి స్త్రీలకు విద్యాభివృద్ధి చేయాలనీ, సేవాసదనాలైన శాంతినికేతనం, కార్వే స్త్రీలవిశ్వకళాశాల, దేవదారు సదనం, మధువాసరం, గుంటూరులోని శారదానికేతనము మొదలగు సంస్థలలో నవీనపద్ధతిలో విద్యావిధానం ఉండేవిధంగా ఉపాధ్యాయినులకు శిక్షణయివ్వాలని, స్త్రీలకు వయోజనవిద్యాసౌకర్యాన్ని కలిగించాలని తీర్మానంచేసారని తెలియజేసింది.

1920–30 సం.ల మధ్యన వచ్చిన స్త్రీలసాహిత్యంలో విద్యావంతులైనస్త్రీలు స్వతంత్రంగా రాజకీయాలలో పాల్గొనగలిగితేనే దేశంబాగుపడుతుందనీ, స్త్రీల శరీరం, మనస్సు, మెదడు పొందే స్వేచ్ఛనే స్త్రీ వ్యక్తిస్వాతంత్ర్యం అని నిర్వచించటం జరిగింది. ఆడపిల్ల, మగపిల్లల పుట్టుకలోని తేడాను గుర్తించి, స్త్రీలపుట్టుకకు విలువనిచ్చే విధంగానూ, స్త్రీలు గృహపరిశ్రమల ద్వారా ఆర్థికస్వావలంబన పొందాలనీ, 1919 – చట్టం ప్రకారం నామనిర్దేశకంగాకాక స్త్రీలు మున్సిపల్ లోకల్ బోర్డులయొక్క ఎన్నికలలో పాల్గొని స్త్రీల అభివృద్ధికి పాటుపడాలనుకున్నారు. స్త్రీలు తమ జన్మహక్కుయైన సమానత్వాన్ని పొంది వ్యక్తిస్వాతంత్ర్యంతో జీవించటాన్ని స్త్రీలమానవహక్కుగా గుర్తించారు. ఈ దశాబ్దంలో స్త్రీలలో హక్కులచైతన్యం పెరిగింది. విద్యావంతులైన స్త్రీలు సాంఘిక సంస్కృతీ పునర్నిర్మాణం జరగాల్సిన అవసరాన్ని గుర్తించి, స్వాతంత్ర్యోద్యమంలో స్త్రీలు ముమ్మరంగా పాల్గొనాల్సిన అవసరాన్ని గుర్తించి దానికి తగ్గ సాంఘిక నేపథ్యాన్ని తయారుచేసుకోవటం జరిగింది. సత్యాగ్రహఉద్యమంలో భాగంగా ఖద్దరుతయారీతోపాటు స్వదేశీదీక్షను పొందారు. స్త్రీలు నర్సింగ్ విద్యను అభ్యసించగలిగితే దేశసేవకు ఎక్కువ ఆస్కారముంటుందని భావించారు. అన్నిరంగాలలో స్త్రీలప్రతినిధులు ఉండాలని తీర్మానాలు చేసుకున్నారు. ప్రతిరంగంలో తమహక్కులను వినియోగించుకుంటూ స్త్రీలు ముందడుగు వేయాలనుకోవటం కనబడుతుంది. అంతేకాదు స్త్రీలమధ్య మానవసంబంధాలు అభివృద్ధి కావటానికి స్త్రీమిత్రోత్సవాలు జరుపుకోవాలని అనుకున్నారు.

మద్రాసులో ప్రతినెలా పౌర్ణమినాడు ‘ఉమెన్స్ డే’ ను చేసుకోవాలని నిర్ణయించుకుంటూ తమ సంస్థకుకూడా ‘ఉమెన్స్ డే’ అనే పేరుపెట్టి స్త్రీలు తమ విద్యాభివృద్ధికి, తమ సమస్యలపరిష్కారాలకు తగిన అభిప్రాయాల వితరణకై ఒకరోజును కేటాయించాలనుకోవటం జరిగింది. అంటే స్త్రీలు విద్యావంతులుగా అవటంచేతనే తమజీవితాలను గురించి తాము ఆలోచించుకోగలుగుతున్నారని అర్థంచేసుకోవచ్చు.

స్త్రీవిద్య – తరతరాలనిధి

వెలువోలు వసంతకుసుమావతి ‘స్త్రీవిద్య’ (మార్చి1929 గృహలక్ష్మి) అనే

“విద్య నేర్చిన తల్లులు బిడ్డలకును
మొదటి నుండియుఁ జాలసద్బోధ కఱపి
వీరబుధులుగ వారిఁగావింపఁ గలరు
కాన స్త్రీవిద్య దూరంగఁ గాదు మీకు !
విద్య నేర్చిన వారలు విరివి జ్ఞాన
వార్తలన్ వ్రాయు నేర్పును బడయఁగల్గి
జగతి మాహాత్మ్యములనెన్నొ సలువుకతన
బాలికావిద్య దూరంగఁ బాడియౌనె !!” అంటూ

స్త్రీవిద్యను నిషేధించటం సిగ్గుచేటని, విద్య నేర్చిన స్త్రీ బిడ్డలకు సద్బోధ చేయగలదనీ, విద్యనేర్చుకుంటే జ్ఞానవార్తలను వ్రాయనేర్చుకోగలుగుతుంది కాబట్టి బాలికావిద్యను నిషేధించకూడదని అభిప్రాయపడింది.

స్త్రీవిద్య – తల్లిబాధ్యత

బండారు సరోజనీదేవి వ్రాసిన ‘స్త్రీ విద్యా సంవాదం’ (జులై 1931 వాసవి) అనే నాటకంలో ఇద్దరు స్త్రీలమధ్య సంభాషణలో భాగంగా స్త్రీలకు విద్య మూలధనమనీ, ఇంట్లోవాళ్ళు ఒప్పుకోకపోయినా చదువుకోవాలనీ దానివల్ల వివేకం కలుగుతుందని చెప్పింది. దేశోపయోగకరమైన నూలు వడకటం వంటి పనులతో సత్కాలక్షేపం చేయవచ్చునీ, బాలికలను గుంటూరు శారదానికేతనానికి, రాజమండ్రి స్త్రీసేవాసదనానికి గానీ పంపిస్తే అన్ని విద్యలు నేర్చుకుంటారని తెలియజేసింది. దీనినినాటకంగానేకాక, ఒక పత్రికాముఖప్రకటనగా భావించవచ్చు.

స్త్రీవిద్యపై విముఖతను చూపిన తల్లికి బోధచేసి ఆమెయొక్క కూతుర్ని చదివించేటట్టు చేసి, చదువుకోవటానికి ఉన్న సదుపాయాలు కూడా చూపించేసరికి ‘స్త్రీవిద్య’ అంటే అభిమానం కలిగింది.

ఆమె తన కూతుర్ని పాఠశాలలో చేర్పించాలనుకొనే చైతన్యాన్ని తెచ్చుకొందంటే చదువుకున్న స్త్రీలు సమాజంలో స్త్రీవిద్యావ్యాప్తికై కృషిచేస్తూ స్త్రీల దృక్పథంలో మార్పు రావటానికి చేసిన ప్రయత్నానికి నిదర్శనంగా ఈనాటకం అర్థం అవుతోంది

స్త్రీవిద్య – ఆంధ్రరాష్ట్రీయ మహిళాసభ

గుంటూరులో జరిగిన "ఆంధ్రరాష్ట్రీయ మహిళాసభావిశేషాలు" (ఫిబ్రవరి 1932 గృహలక్ష్మి) ను గురించి కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాస్తూ ఆ సభకు అధ్యక్షతవహించిన విద్యావతియైన వసుంధర యొక్క కట్టుబొట్టులో జాతీయత ఉందనీ, కుగ్లర్ ఆసుపత్రి వైద్యురాలిగా ప్రజలమన్ననను పొందిన క్రైస్తవ సోదరియైన దానమ్మచేసిన ఉపన్యాసంలో స్త్రీ సంఘమునకు ఉపయుక్తములగు అనేక విషయాలను పొందుపరిచిందని తెలిపింది. సభలో ఆంగ్లవిద్యను అభ్యసించినవారు అల్లోపతి వైద్యం ఉండాలని చెప్పగా మిగిలినవారు ఆయుర్వేదం ఉండాలనీ భావించారని చెప్పింది. అంతేకాదు, బాలికల పాఠశాలలో స్త్రీలే ఉపాధ్యాయులుగా ఉండాలనీ, స్త్రీలు ఉద్యోగం చేయటం గౌరవ ప్రదంగా భావించాలనీ, ఆంధ్రదేశంలో స్త్రీలకొక ప్రత్యేక కళాశాల ఉండాలనీ, బాలికలను జాతీయ విద్యాసంస్థలలో చేర్పించాలనీ, స్త్రీలకు కట్టుబాట్ల రూపంలో ఉన్న ఉక్కుపంజరం ముక్కలు ముక్కలవుతోందని తెలిపింది. విడాకుల తీర్మానం స్త్రీ – పురుషుల హృదయాలలో ఆందోళన కల్గిస్తోందనీ శారదాచట్టం ప్రకారమే వివాహ వయోనిర్ణయం ఉండాలని చెప్పినట్లు తెలియచేసింది. అంతేకాక, స్త్రీలకు ఉభయ కుటుంబాలలో ఆస్తిహక్కు ఉండే తీర్మానాలు చేయాలనీ, పునర్వివాహేచ్ఛగల బాలవితంతువులను సంరక్షకులే వివాహం చేయాలనీ, సంసారేచ్ఛలేని స్త్రీలు సన్యాసం పుచ్చుకొని దేశసేవ చేయవచ్చని తెలియచేసింది. పురుషులు భార్య బ్రతికుండగా మరో యువతిని పెండ్లిచేసుకోవటాన్ని నిషేధించే తీర్మానం ఉండాలి కానీ విడాకుల తీర్మానం అవసరం లేదనీ, భార్యావియోగం కలిగిన వ్యక్తి భర్తృవియోగం కలిగిన స్త్రీనే వివాహంచేసుకోవాలని తెలియజేసింది.

స్త్రీవిద్య – రాత్రిపాఠశాల

పగలంతా ఇంటిచాకిరి చేసే స్త్రీలు దానినుండి విముక్తి చెందాలంటే వారికి ముందుగా విద్య అవసరం. అటువంటి స్త్రీలకోసం రాత్రిపాఠశాలలు ఉంటే చదువుకోగలరనే స్పృహతో స్త్రీలు విద్యాసేవచేయాలనుకొన్నారు.

'చోరగుడి సీతమ్మ' (ఏప్రిల్ 1932 గృహలక్ష్మి) ను గురించి కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాస్తూ బాపట్లలో జన్మించిన చోరగుడి సీతమ్మ 40 ఏండ్లు మాత్రమే జీవించినను ఆమె ఒక విదుషీమణి, కవయిత్రి అనీ ఆనాటి స్త్రీల పత్రికలైన హిందూసుందరి, సావిత్రి పత్రికలకు గద్యపద్యవ్యాసాలు

వ్రాసేదని తెలిపింది. ఆమె 1913 లో ప్రథమాంధ్ర మహాసభకు అధ్యక్షత వహించినదనీ 1915లో యుక్తవయస్కులగు కుటుంబీకులు బాలవితంతువులు చదువుకోవటానికి 'త్రిపుర సుందరీసమాజ యువతీవిద్యాలయా'న్ని స్థాపించిందనీ, ఆర్థికంగా సహాయపడి స్త్రీవిద్యాభివృద్ధికి కృషి చేసిందని తెలియజేసింది. ఆమె స్మారకార్థం వరలక్ష్మమ్మ (బాపట్లలో) స్థాపించిన స్త్రీహితైషిణీ మండలిలోని గ్రంథాలయానికి 'సీతా పుస్తకసదనమని' పేరుపెట్టి కృతజ్ఞత తెలుపుకోవటం జరిగిందనీ, 'జానపదులకు రాత్రి బడినీ, ప్రౌఢస్త్రీలకు పాఠశాలను, స్త్రీలకొక సమాజమును ఏర్పరచి సేవ చేసిందని కొనియాడింది. "స్త్రీ హితైషిణీ సీతామాంబను, స్త్రీహితైషిణీ మండలిని నేడు గౌరవింతుము, నాడు భక్తిని గ్రంథ సుమమాలన్" అని చోరగుడి సీతాంబకు కనుపర్తి వరలక్ష్మమ్మ నివాళులర్పించింది.

స్త్రీవిద్య - గ్రామాలపునరుజ్జీవనం - పాలనా చైతన్యం

స్థానికసంస్థల ఎన్నికలు వచ్చిన తరుణంలో స్త్రీలు గ్రామీణస్థాయి పాలనలో భాగస్వామ్యం వహించి స్త్రీల అభివృద్ధికి అవసరమైన విద్యను అందించి తమ గ్రామాలలో ఉన్న స్త్రీలందరి అభ్యున్నతికై పాటుపడాలనుకొని స్త్రీలు అబలలు కారని నిరూపించుకోవాలనుకొన్నారు.

గంటి శేషమ్మ వ్రాసిన 'గ్రామపునర్నిర్మాణం-స్త్రీల బాధ్యత' (ఏప్రిల్ 1931 గృహలక్ష్మి) అనే వ్యాసంలో ఏకార్యము చేపట్టిననూ స్త్రీలే బాధ్యత వహిస్తారు కాబట్టి కొత్తగా బాధ్యతను గురించి గుర్తు చేయక్కరలేదనీ, ప్రస్తుతం గ్రామాలన్నీ దుర్వాసనతో, మురుగు గుంటలతోనూ, మంచినీటి చెరువులు బురదగుంటలుగానూ ఉన్నాయనీ, గ్రంథాలయాలు గానీ క్రీడాస్థలముగానీ లేవనియూ, స్త్రీవిద్యాభివృద్ధి లేదని, గ్రామాలలో అంతటా బాలవితంతువులేనని శారదాబిల్లుకు అడ్డుపడుతున్నారని తెలియజేసింది. స్త్రీని అబల అని పిలిచిననాటి నుండియే దేశం క్షీణదశనొందుచున్నదనీ, సబలలనే భావనతోనే గాంధీ స్త్రీలను ఉద్యమానికి ఆహ్వానించాడనీ, గ్రామాలు పునర్నిర్మాణం కంటెకూడా ముందుగా గ్రామాలు పునరుజ్జీవనం చెందాల్సిన అవసరం ఉందనీ, దానికై విద్యావంతులైన స్త్రీలు గ్రామాలలోని స్త్రీలకు విద్యా, దేహ మనోబలములను అభివృద్ధిచేయాలనీ, అదే సమస్తకార్యసాధనకు వీలుకల్గిస్తుందని తెలిపింది. స్త్రీలు ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకునే మెలకువలను, పూలమొక్కలు, కూరగాయల పెంపకాన్ని, ఆరోగ్యమార్గాలను, శిశుపోషణా పద్ధతులను పల్లెలోని స్త్రీలకు చెప్పాలనీ, మద్యపానాన్ని రూపుమాపటానికి స్త్రీలు పూనుకోవాలనీ తెలిపింది. అంతేకాక, గ్రామస్థులు అందరూ కలసి సహకార సంఘాలేర్పరచుకొని తమతమ వృత్తులను అభివృద్ధిచేసుకోవాలనీ, స్త్రీలు విద్యావంతులైతే అబలలు అనే, తమకున్న అపప్రథను పోగొట్టుకోగలరని తెలియజేసింది.

లోకల్ బోర్డు ఎన్నికలలో నిలబడటానికి ముందుగా గ్రామాల స్థితిగతులు అధ్యయనం చేయటం, గ్రామీణాభివృద్ధికి ప్రణాళికలను రూపొందించుకునే స్థాయికి స్త్రీలు ఎదగాల్సిన అవసరాన్ని

తెలిపే సాహిత్యం వచ్చింది. ఉప్పుసత్యాగ్రహానంతరము స్వయంప్రతిపత్తికై రౌండుటేబుల్ సమావేశాలకు వెళ్ళి విఫలమవుతున్న సమయంలో జిల్లాలు, పంచాయితీస్థాయిలో ఎక్కడికక్కడ స్వయంప్రతిపత్తి కలిగేవిధంగా గ్రామీణాభివృద్ధి పునర్నిర్మాణానికై స్త్రీలు నడుముకట్టాలన్న ఆలోచనలు పెరిగాయి. పల్లెలలో స్త్రీలకున్న గృహపరిపాలనా బాధ్యతతోపాటు, గ్రామపునరుజ్జీవనంలో స్త్రీల భాగస్వామ్యం అవసరమని తెలియచేయటం జరిగింది. 1928లో మున్సిపాలిటీలు మరియు లోకల్ బోర్డులలో స్త్రీలకు ప్రాతినిధ్యం ఏర్పడిన సమయంలో స్త్రీల బాధ్యతను గుర్తుచేయటం జరిగింది.

స్త్రీవిద్య – గ్రామీణాభివృద్ధి

సమయమంత్రి రాజ్యలక్ష్మమ్మ వ్రాసిన 'గ్రామపునర్నిర్మాణం – స్త్రీల బాధ్యతలు' (మే. 1931 గృహలక్ష్మి) అనే వ్యాసంలో గ్రామ పునర్నిర్మాణంలో స్త్రీ పురుషులు సమానంగా భాగస్వాములవ్వాలనీ, దేశాభివృద్ధికి గ్రామాభివృద్ధి ముఖ్యమనీ, గ్రామాలలో సామాజిక ఆరోగ్యం, పాడి, పశుపోషణ, మంచినీరు, గ్రామప్రజల విద్యాభివృద్ధి జరగాలని తెలిపింది. ఆర్థిక పుష్టికై ఖర్చులు తగ్గించుకోవటం, అభివృద్ధికర నూతన వ్యవసాయ పద్ధతి, నూలు వడకటం, వ్యసనాలు వీడటం, స్త్రీవిద్యాభివృద్ధి, పత్రికాపఠనం, శిశుపోషణ, కుట్టుపని వంటి విషయాలలో వృద్ధి జరిగేటట్టు చూడాలనీ, అప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందని తెలియచేసింది. సమగ్ర గ్రామీణాభివృద్ధిలో స్త్రీల భాగస్వామ్యం పునాదిగా ఏర్పడటమే రాజకీయపాలనా చైతన్యానికి, స్వపరిపాలనకోసం కలిగిన ముందుచూపునకు మచ్చుతునకగా భావించవచ్చు.

ఆదిలక్ష్మి, వేంకటరత్నసోదరీలు కలిసి వ్రాసిన 'పల్లెటూళ్ళ సాంఘిక దుస్థితి (జూలై 1940 గృహలక్ష్మి) అనే వ్యాసంలో పట్టణాలవలెగాక పల్లెలో కులకట్టుబాట్లు కఠినమనీ గ్రామాలలో స్త్రీ విద్య శూన్యమనీ, భర్తకు ఉత్తరాన్ని వ్రాయగల ప్రాథమికవిద్య అబ్బితే చాలని భావిస్తున్నారనీ, బాలవితంతువులకు చదువుచెప్పించి వారిస్థితిని బాగుచేయాలని తెలియజేసింది. అంతేకాదు స్త్రీలు కత్తుల బోనులో కాపురం చేస్తున్నారనీ, బాలవితంతువులు మూఢాచారాలకు బలి అవుతున్నారనీ, ఆచారాలపట్ల పల్లెటూరి స్త్రీలకు పట్టుదల ఎక్కువనీ, పల్లెలో అవినీతి దురాచారాలను వదిలించి స్త్రీలకు యభివృద్ధి మార్గమును చూపిస్తేనే సంఘజీవితం బాగవుతుందని భావించారు. పట్టణాలలో మహిళాసభలు, గ్రంథాలయాలు పట్టణస్త్రీల పురోభివృద్ధికేగానీ అవి పల్లెలలో లేకపోవటంతో స్త్రీలు అభివృద్ధి చెందటంలేదనీ, పల్లెలలో మహిళా సంఘాలు స్థాపించి అనాథస్త్రీలను, నిరక్షరవనితా లోకాన్ని ఉద్ధరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పల్లెల్లో స్త్రీల అభివృద్ధికి మహిళాసమాజాలను స్థాపించాల్సిన అవసరాన్ని తెలియజేసింది.

స్త్రీవిద్య – స్త్రీపట్టభద్రులు

'మదరాసు విశ్వవిద్యాలయము – స్త్రీపట్టభద్రులు' (సెప్టెంబరు 1932 గృహలక్ష్మి) ను గురించిన పత్రికాధిపుల ప్రచురణలో 1932 ఆగష్టులో మదరాసు విశ్వకళాపరిషత్ వారిచే పట్టప్రధానోత్సవము జరిగిందనీ, 1835 మంది పట్టభద్రులు పట్టములను పొందగా వారిలో 110 మంది స్త్రీలు ఉన్నారనీ, ఒక స్త్రీ బి.యల్. పట్టా పొందిందనీ, ఆరుగురు యమ్.బి.బి.యస్. పట్టాను, నలుగురు బి.యస్.సి. పట్టాను పొందారనీ, ఐదుగురు యల్.టి. పట్టభద్రులున్నారనీ, ఎనిమిదిమంది స్త్రీలు యమ్.ఏ. లోనూ, తొమ్మిదిమంది బి.ఏ. ఆనర్స్ లోనూ, యభైమంది స్త్రీలు బి.ఏ. పట్టాలను తీసుకొన్నారని తెలియజేస్తూ స్త్రీలు డాక్టర్లు, ఉపాధ్యాయులు అగుటకు మాత్రమే కాక ఇతర వృత్తులయందును చొరబడాలని పత్రిక తెలియజేసింది.

స్త్రీవిద్య – సమానత్వసంస్కృతీ స్పృహ

వీరుబొట్ల రామలక్ష్మమ్మ 'స్త్రీవిద్య' (సెప్టెంబరు1933 గృహలక్ష్మి) అనే కవితలో వ్రాసిన

పుడమి యందున గొందరు పొలతుకలకు
విద్య జెప్పింపరాదంచు వెఱ్ఱి మొఱ్ఱి
వాదములు జేయుచుందురవ్వారి బుద్ధి
జాడ్యమేమని కట్ట ! ప్రశంలజేతు
ఎంచనొక గర్భమందె జన్మించినట్టి
పురుషులే విద్యలన్నిటిఁ గఱచుటకును
స్త్రీలు నేర్వంగరాదని చెప్పుటకును
బాపురే ! మేము చేసిన పాపమేమొ? అని

స్త్రీవిద్యను అడ్డగించే పితృస్వామ్యాన్ని ప్రశ్నకు పెట్టింది. స్త్రీలు దేశస్వాతంత్రోద్యమంలో పాల్గొంటూకూడా ఇంకా స్త్రీవిద్యాభివృద్ధి జరగాల్సిన అవసరాన్ని తెలియజేసారు.

మైదవోలు పద్మావతి వ్రాసిన 'స్త్రీ పురుష సమానత్వమావశ్యకమా ఎందేని యనర్థదాయకమా?' (నవంబరు 1936 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీ గౌరవమే దేశగౌరవమనీ, మహిళాభివృద్ధియే దేశాభివృద్ధి అనీ, స్త్రీలు వెనుకబడిన దేశము వెనుకబడటమేననీ, స్త్రీ పురుషులు సమానస్థితి యందున్నప్పుడే స్వరాజ్యమునకు అర్హత వస్తుందనీ, జపాన్, టర్కీ, రష్యాదేశములు స్వతంత్ర దేశములగుటకు స్త్రీ – పురుష సమానత్వమే కారణమని తెలియజేసింది. స్త్రీకి విద్య ఉంటేనే సాంఘిక, రాజకీయ, ఆర్థిక సమస్యలను ఎదుర్కొనే సమాన బాధ్యత స్త్రీకి కలుగుతుందనీ, స్త్రీలకు

పునర్వివాహపు హక్కు ఉండాలనీ, స్త్రీకి స్వాతంత్ర్య సమానత్వం ఉంటేనే దేశస్వాతంత్ర్యం ఏర్పడుతుందని తెలియజేసింది.

స్త్రీల సమస్యలన్నింటికి కుటుంబ సామాజిక సంస్కృతి కారణమనీ, అది స్త్రీలకు స్వతంత్రం లేకుండా చేస్తోందనీ, స్త్రీలు కూడా మానవులేనని భావించాలనీ, స్త్రీలు తమ స్వేచ్ఛాధికారాలను సంపాదించుకొని సాంఘిక, ఆర్థిక, రాజకీయ హక్కులను సాధించుకొని స్వాతంత్ర్యాన్ని పొందితేనే దేశస్వాతంత్ర్యం కలుగుతుందని భావించింది. స్త్రీలలో మానవహక్కుల గురించిన ఆలోచనలు ఏర్పడ్డాయి. స్త్రీలకు, పురుషులతో సమానంగా విద్య, వివాహస్వాతంత్ర్యం, ఆర్థిక, రాజకీయహక్కులు గల శాసనసభ్యత్వం ఉంటేనే స్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యం ఏర్పడుతుందనీ, స్త్రీల స్వాతంత్ర్యమే దేశస్వాతంత్ర్యానికి మూలమని భావించింది.

ఆచంట సత్యవతమ్మ 'సాంఘిక దురాచారములు వాటి దిద్దుబాట్లు' (సెప్టెంబరు 1939 గృహలక్ష్మి) గురించి రాస్తూ శాసనాలతోనే గాక ఆత్మసంకల్పం కూడా మిళితమైతేనే సాంఘికవిప్లవం వచ్చి దురాచారాలు రూపుమాపబడతాయనీ తెలియజేసింది. స్త్రీలకి పురుషసమానమైన విద్య కావాలనీ, స్త్రీలు ఉన్నత చదువులు చదువుకొంటేనే, జీవిత విమర్శన చేసుకుంటూ పెడదారిన బడకుండా స్వేచ్ఛతో ఉంటారనీ, జాతీయతతో కూడిన విద్యనేర్చుకోవాలనీ, చేతివిద్యలు, సంగీత సాహిత్యాలేకాక గౌరవానికి ఇంగ్లీషు, పురాణపఠనం, సంగీతం, జాతీయతకు హిందీనేర్చుకోవాలని భావించింది.

విద్యావంతులైన స్త్రీలు పురుషులతోపాటు సమాజంలో తమకు సమాన హక్కులు ఉండాలనీ, ముఖ్యంగా ఆస్తి హక్కు ఉండాలనీ, తన కిష్టమైన చదువు నభ్యసించే విషయంలోగానీ, వివాహ విషయంలో గానీ స్వేచ్ఛ ఉండాలని భావించిన ప్రగతిశీలురుగా స్త్రీలు తమ అభిప్రాయాలను వెల్లడించటం జరిగింది. నాడు భర్తల ఇష్టానుసారంగా ప్రవర్తించే సంస్కృతిగల స్త్రీలు, నేడు విద్యావంతులైన స్త్రీలు భర్తతో సమానంగా జీవించే స్వేచ్ఛకావాలనుకొనే స్థితికి చేరుకోవాలను కోవటంలోనే వారి అభివృద్ధి అర్థమవుతుంది.

స్త్రీవిద్య – పారిశ్రామికవిద్యాలయాలు

'సప్తమాంధ్ర మహిళాసభ' లో చుండూరి రత్నమ్మ చేసిన ఉపన్యాసంలో (డిసెంబరు 1933 గృహలక్ష్మి) స్త్రీ గౌరవాన్ని గురించి చెబుతూ సంస్కరణ విధానంలో భాగంగా ప్రతిజిల్లాలో స్త్రీవిద్యానికేతనాలు, అనాథశరణాలయాలు, వైద్యాలయాలు, శిశుపోషణాలయాలు, వ్యాయామ సంఘములు, పారిశ్రామిక విద్యాలయాలు ఉండాలని కూడా స్త్రీ జనాభ్యుదయ పత్రికలు, పుస్తక పఠన మందిరాలు ఉండాలని తెలియజేసింది.

ఆ సభలోనే సరస్వతీబాయి ఎమ్.ఎ., ఎల్.టి. ఆధ్వర్యంలో సభాతీర్మానాలు చేసారనీ, అందులో భాగంగా ప్రతిగ్రామంలో బాలబాలికలకు నిర్బంధోచిత విద్యాలయాలుండాలనీ, ఆంధ్రరాష్ట్రంలో ప్రత్యేక స్త్రీల కళాశాల ఉండాలని తీర్మానం చేసారు. స్త్రీల ఆరోగ్యం కొరకు ప్రతి ఊరినందు పబ్లిక్ పార్కులు ఉండాలనీ, ప్రతి తాలుకా ముఖ్యపట్టణాలలో స్త్రీ సబ్–అసిస్టెంటు సర్జను, యిద్దరు మంత్రసానులు ఉండాలనీ, స్వదేశీ తయారీయైన వస్తువులు, ఖద్దరు వాడాలనీ, బాల్యవివాహనిషేధ చట్టము అమలు పరిచేటట్టు చూడటం చేయాలని తీర్మానాలు చేసినట్లు తెలియజేసింది.

ప్రతిగ్రామంలో ఆడపిల్లలకు నిర్బంధ ఉచితవిద్యను బోధించే విద్యాలయాలు ఉంటేనే బాలికావిద్యాభివృద్ధి ఉంటుందని భావించింది. సాంప్రదాయమైన బాధ్యతతోనే స్త్రీల అభ్యుదయ సంస్కరణలు ఉండాలనీ, స్త్రీల గృహనిర్వహణాబాధ్యత ముఖ్యమని భావించారు. స్త్రీలు చదువుకోవటం వల్లనే మానవాభివృద్ధిలో ప్రధానాంశాలైన స్త్రీలవిద్య, వైద్యం, ఉపాధిని గురించిన ఆలోచనలను పెంచుకోగలిగారని అర్థమౌతుంది.

స్త్రీవిద్య – పారిశ్రామికస్త్రీవిద్యాసంస్థ

రాణిరావురాజ్యలక్ష్మి మురళీకృష్ణరావు అనే ఆమె చెన్నపురిలోని దుర్గాబాయమ్మ నెలకొల్పిన 'ఆంధ్రమహాసభ–స్త్రీలశాఖ' (ఆగష్టు1941లో గృహలక్ష్మి) లో పారిశ్రామిక శాఖయొక్క ప్రారంభోపన్యాసం చేస్తూ ఆంధ్రనారీఉద్ధరణ, స్త్రీలశాఖా విద్యావ్యాప్తి, విజ్ఞానాభివృద్ధి, కళావికాసనానికి చేస్తున్న కార్యక్రమాలు గొప్పవనీ, హిందీ, తెలుగు, బెనారస్ మెట్రిక్యులేషన్, నృత్యం, సంగీతం, చిత్రలేఖనం నేర్పుతున్నారని చెప్పింది. స్త్రీల పారిశ్రామిక శాఖలో బట్టలకు రంగువేయుట, అద్దకములు చేయుట, బుట్టలల్లుట, కాగితాల తయారీ, నవారు నేత మొదలగు గృహపరిశ్రమలలో ఉచితంగా స్త్రీలకు తర్ఫీదునిచ్చుటవంటివి ఆంధ్రుల కీర్తికి నిదర్శనమని భావించింది.

స్త్రీలు – వ్యవసాయవిద్య

సుశీలాదేవి వ్రాసిన 'ఆంధ్రరైతాంగ విద్యాలయం' (జులై 1935 గృహలక్ష్మి) అనే వ్యాసంలో రైతాంగ విద్యాలయంలో స్త్రీలు చేరుతున్నారనీ దేశానికి స్వరాజ్యం రావటానికి కృషిచేస్తున్నారనీ, భారతమాత రక్షణ కొరకు పురుషులు పట్టించుకోకపోయినా స్త్రీలు పట్టించుకోవటం తప్పుకాదనీ, స్త్రీలు చేయగలిగేది చాలా ఉందనీ, స్త్రీలు, రైతురక్షకులుగా ఉన్నారని తెలిపింది. వ్యవసాయ విద్యతోపాటు, దేశమునందలి ఆర్థిక, రాజకీయపరిస్థితులను స్వాతంత్రోద్యమ చరిత్రనుకూడా బోధిస్తే స్వరాజ్య పిపాస ఏర్పడుతుందని భావించింది. రష్యాలోవలె కాక గాంధి ఏర్పరచిన పునాదిపై

దౌర్జన్యరాహిత్యంతో కూడుకొనిన సాంఘికవాదంతో పూంజీదారులను పడద్రోసి కార్మిక కర్షకుల సౌధాన్ని నిర్మించవచ్చునీ, నూతన ఆర్థికవ్యవస్థను ఏర్పరచుకోవచ్చని చెప్పింది. వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో ఎన్.జి.రంగా బోధనచేస్తున్నా మిగతా విషయాలన్నీ అతని భార్య భారతీదేవి చక్కబెట్టినట్లు తెలుపుతూ ఆంధ్ర రైతాంగ విద్యాలయం గురించిన విషయాలు తెలియజేసింది.

స్త్రీలు మామూలు చదువుకాకుండా వ్యవసాయ రంగంలో ఉండి ఉన్నత వృత్తివిద్యలు నేర్చుకుంటూ స్వరాజ్య పోరాటపు ధృక్పథాన్ని అలవర్చుకున్న విషయం అర్థం అవుతుంది. భారతస్వాతంత్ర్య సంగ్రామంలో స్త్రీలు రైతులుగా మారగలిగేటట్లు చేసే విద్యను అభ్యసించటమేగాక, కర్షకులను నడిపిస్తూ స్వాతంత్ర సాధనలో దేశఆర్థికాభివృద్ధిలో కర్షకుల భాగస్వామ్యాన్ని గుర్తించటమే స్త్రీలు సాధించిన ప్రగతిగా భావించవచ్చు.

స్త్రీవిద్య – కుటుంబసంబంధాలు

సమయమంత్రి వందేమాతరం వ్రాసిన 'గాజుల జత' (జులై 1934 గృహలక్ష్మి) అనే కథలో భర్తను గాజుల జత తెమ్మని అడిగిన భార్యకు అతడు పుస్తకం హస్తభూషణం కావాలనీ చదువుకోమని చెప్పినా తలకెక్కకపోతే ఆమెతో మాట్లాడటం మానేస్తాడు. అప్పుడు ఆ భార్య ప్రక్కింటి విద్యావతి దగ్గరకువెళ్ళి అక్కడే ఉండి చదువు నేర్చుకొనిరాగా మెచ్చుకొన్న భర్త గాజులజత నిచ్చినా, అలంకారాలకంటే చదువే గొప్పదని గ్రహించిన భార్య వాటిని తన గురువుకు గురుదక్షిణగా ఇచ్చిందనీ, కాని ఆ గురువైన విద్యావతి తిరిగి శిష్యురాలికే ఆ గాజుల జతను కానుకగా ఇచ్చినట్లుగానూ తెలియజేసింది. ఈ కథలో స్త్రీలకు విద్యయందు అభిరుచిని కల్గించే విధంగా భర్త భార్యవిషయంలో కఠిన నిర్ణయం తీసుకోవటం, ఆమె కూడా విద్య విలువ తెలుసుకోవటంతో ఆ కుటుంబం ప్రేమానురాగాలకు నిలయమవటంగా అర్థం అవుతుంది.

సమయమంత్రి వందేమాతరం వ్రాసిన 'లీలావతి' (డిసెంబరు 1934 గృహలక్ష్మి) అనే మరొక కథలో వాస్తవ విషయాన్ని పేర్కొంటున్నానని చెపుతూ వియ్యాలవారు చదువు మాన్పించమన్నప్పుడు వివాహమైనప్పటికీ కూతురును చదివిస్తున్నందుకు కోపం వచ్చి తమ కొడుకుకు మరో వివాహం చేయటం జరిగింది. కాని ఆమె విశాఖపట్నంలో డాక్టరు కోర్సు చదివి డాక్టరయి ఒకరోజు తన సవితికి రోగం వస్తే ఆమెకు వైద్యం చేసిందనీ, కానీ అప్పటికే రోగం ముదిరి ఆమె చనిపోవటం జరిగింది. మొదటిభార్యయొక్క చదువు విలువ తెలిసి అతడు క్షమించమని అడగటమే గాక విద్యావంతులైన స్త్రీలకు వినయం ఉంటుందనే భావన అతనిలో కలిగిందని సమయమంత్రి వందేమాతరం తెలియజేసింది.

వి.ఎస్.ఎన్. లక్ష్మి వ్రాసిన 'జీవిత వికాసమునకు విద్య' (అక్టోబరు 1938 గృహలక్ష్మి) అనే వ్యాసంలో విద్యావిధాన సంస్కరణ అవసరమనీ స్త్రీల కొసగు విద్య ఎలా ఉండాలో ఆలోచించాలనీ, సంగీతము, అల్లిక పనుల వంటి కళలతో పాటు, ఆరోగ్యకరమైన పిల్లల పెంపకానికి సంబంధించిన విద్యను, ప్రపంచ విజ్ఞాన చరిత్రను నేర్పాలని తెలిపింది. భార్యలు విద్యావిహీనులగుటచే భర్తలకు నచ్చటంలేదనీ, సుఖసంసారయాత్రకు స్త్రీవిద్య ఆవశ్యకమని చెప్పింది.

తమ భార్యలకు చదువులేదనే అసంతృప్తి భర్తలలో కలుగుతోందనే స్పృహను స్త్రీలలో కలిగించే వ్యాసం ఇది. భార్యలకు చదువు అవసరంలేదనే స్థాయినుండి భర్తలు తమకు విద్యావంతురాలైన భార్య కావాలనుకోవటమే ఒక సామాజిక సాంస్కృతిక పరిణామం క్రింద భావించాలి. ఆ రకంగా స్త్రీలు చదువుకోవటం తప్పుకాదనీ, పైపెచ్చు చేసుకునే భర్తకు స్త్రీవిద్యయిష్టమని భావించగలిగితే తల్లితండ్రులు ఆడపిల్లలను చదివించే స్థితికి చేరుకోగలుగుతారని భావించటం అర్థం అవుతుంది.

స్త్రీవిద్య – నిర్ణయాధికారచైతన్యం

కూనిశెట్టి రామరత్నం వ్రాసిన 'మార్పులమంగ' (ఫిబ్రవరి 1935 గృహలక్ష్మి) అనే కథలో బాలవితంతువుగా విరూపిణియైన మంగ తల్లిదండ్రుల మరణానంతరం చూసేదిక్కులేక వితంతు కళాశాలలో చేరుతుంది. అక్కడ ఆమె గుండును వెక్కిరిస్తే, మాలతిగా పేరు రిజిష్టరు చేయించుకొని వెంట్రుకలను పెంచుకొని వేషభాషలను మార్చుకుంటుంది. వార్తాపత్రికలు చదివి అవగాహన పెంచుకొని పురుషులకు వివాహవిషయంలో స్వేచ్ఛ ఉందనీ, స్త్రీలకు మాత్రం రజస్వలకుముందే వివాహం ఎందుకుచేయాలని ఆలోచించింది. రజస్వల అయిన కన్యకు మూడు సంవత్సరాలవరకే తండ్రికి కన్యాదాన అధికారమనీ, ఆ తర్వాత కన్యకే స్వయంగా వివాహాధికారాన్ని మనువు ఇచ్చాడని భావించి, పరిచయమైన యువకుడ్ని పెళ్ళిచేసుకుంటుంది.

వితంతువులు దీనంగా బ్రతకాల్సిన అవసరం లేదనీ, సంస్కృతిని ఎదిరించి, స్వతంత్రనిర్ణయాలు తీసుకోవచ్చునీ, దానికై ముందుగా విద్యాధికురాలు కావాలనీ తెలియజేసిన కథయిది. విద్యావతిగా పీడాకరమైన మహిళాసంస్కృతిని ఎదిరించి ఒక స్త్రీ తన జీవితంమీద, తనశరీరంమీద తనకే నిర్ణయాధికారం ఉందని భావించటమే స్త్రీలు వ్యక్తిస్వాతంత్ర్యాన్ని పొందటంగా అర్థం చేసుకోవాలి.

మామిడిపూడి వెంకమ్మ వ్రాసిన 'నేనేమో మొద్దునుగాను' (ఆగష్టు 1935 భారతి) అనే కథలో భార్య చదువుకోలేదనీ నలుగురిలో నాగరికంగా మసలుకోవటం, మాట్లాడటం ఆమెకు తెలియదనీ భావించి ఏ మీటింగ్ లకు తనను బయటకు వెళ్ళనీయడని స్నేహితురాలికి చెప్పగా, ఆమె వచ్చి ఆ భర్తతో మాట్లాడి ఒప్పిస్తానంటుంది. తన భర్త తనను ముందుగా చదువుకుంటే గానీ బయటకు వెళ్ళొద్దన్నాడని స్నేహితురాలికి చెప్పి, భర్తకిష్టం లేకుండా తాను బయటకు పోదల్చుకోక

ఇంటిదగ్గరే మాస్టార్ని పెట్టి చదువునేర్పించమని భర్తనడుగుతుంది. అతడు తన మిత్రుడ్ని గురువుగా ఏర్పాటు చేసినా, ఆ గురువు ఆమెను తక్కువచేసి మాట్లాడుతున్నా పట్టుదలగా స్కూలుఫైనల్ పరీక్షకు కడుతుంది. కాని ఆ గురువు ఒక పాఠాన్ని మాత్రమే చెప్పి ఆంగ్లభాష నేర్చుకోవటం ఆడవాళ్ళకు సులభంకాదని చెబుతూ, ఆమె చదువును ముందుకు సాగనీయకుండా చేస్తాడు. పురుషుల కుట్రను అర్థంచేసుకొని, స్త్రీలకు పాఠాలుచెప్పటం రాకపోతే గురువును వెళ్ళిపొమ్మని ఆమె చెప్పటంతో కథ ముగిస్తుంది.

సమాజంలో స్త్రీలు చదువుకోవటం పురుషులకు సుతరామూ యిష్టముండదు కాబట్టి స్త్రీలు పట్టుదలతో ఇంటిదగ్గర గానీ, పాఠశాలలో గానీ, విద్యనభ్యసించాలనీ మీటింగ్ లకు హాజరవటానికి బయటకు వెళ్ళే పరిస్థితులు కల్పించుకోవాలనీ చదువురాని భార్యను భర్త అగౌరవపరుస్తూ ఉంటాడనీ, పురుషులకు చదువుకున్న స్త్రీలే నాగరికులుగా కన్పిస్తారనీ గ్రహించమని కథ తెలియజేసింది. స్త్రీవిద్యాభివృద్ధిని కుంటుపరచే పురుషాధిక్యపు సంస్కృతీ కుట్రను గ్రహించగలిగింది.

స్త్రీవిద్య – స్త్రీసమాజాలఫలితాలు

మహిళాప్రగతికై ఏర్పడిన స్త్రీసమాజాలు చేస్తున్న కృషి, వాటి వల్ల సాధించిన ప్రయోజనాలను అంచనావేసుకున్నప్పుడే స్త్రీలు చేస్తున్న స్త్రీవిద్యాఉద్యమానికి విలువ ఉంటుందని భావించారు.

కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాసిన 'మహిళాప్రబోధం' (సెప్టెంబరు 1935 ఆంధ్ర భూమి) అనే కవితలో కాలంలో మార్పు వచ్చిందనీ, ఇదివరకటి పద్ధతులు ఇప్పుడూ లేవనీ స్త్రీలు సంఘసేవకు ముందుకొస్తున్నారనీ, 'హితైషిణీ' మండలి వంటి స్త్రీల సమితులను స్థాపించారనీ, ఆ సమితులలో స్త్రీలకూ వోటింగ్ హక్కు, క్రొత్త వివాహచట్టాలు, దేశదాస్యం పోగొట్టటానికి రాజకీయాలలో స్త్రీ, పురుష సమానత్వం గురించిన ఊహలను పెంచుకుంటున్నారనీ, వివిధ దేశాల వార్తలు స్త్రీసమితులలో ఏనాటికానాడే తెలుసుకోగలుగుతున్నారనీ, నిజదేశ విషయాలు, ప్రాచీన గాథలు, మహనీయుల బోధలు తెలుసుకుంటూ తోటిస్త్రీలతో స్నేహసంబంధాలతో ఉండటానికి స్త్రీసమాజాలు మేలు చేస్తున్నాయని చెప్పింది. స్త్రీసమాజాలలో పత్రికాపఠనం వల్ల స్త్రీలు విజ్ఞానవంతులు అవుతున్నారని తెలిపింది.

"వివిధ దేశములందు వెలసెడి వార్తల
కేనాటికానాడే యెఱుగవచ్చు
నిజదేశమునగల్గు నిఖిల విశేషముల్
తేటతెల్లముగాగ దెలియవచ్చు
పరగనన్యోన్య పరిచయ భాగ్యమునకు

స్నేహమభివృద్ధి జెందగ చేడెలెంద
రొక్కతల్లి బిడ్డలవలె నుండవచ్చు
స్త్రీ సమాజంబులిడు మేలు జెప్పదరమె" అంటూ

మహిళా సమాజాలలో స్త్రీలు పాల్గొంటే ఒనగూడే ప్రయోజనాలను తెలియజేస్తుంది. స్త్రీలు చైతన్యవంతులు కాగలగటానికి స్త్రీ సమాజాల కృషి ఎంతో ఉందని అర్థం అవుతోంది.

స్త్రీవిద్య – దేశమాతవిముక్తి – దేశభక్తిచైతన్యం

చిల్కపాటి సీతాంబ 'స్త్రీ మహిమ' (జనవరి 1934 గృహలక్ష్మి) ను గురించి వ్రాసిన వ్యాసంలో డబ్బుగల స్త్రీ పురుషులు తమ సంతానంయొక్క అభివృద్ధికై విద్యావతిని పెళ్ళిచేసుకుంటున్నారు గానీ, అదే గ్రామాలలో స్త్రీలు విద్యావతులైతే నగర యువతులవలె తమ భర్తలను దేశమాత దాస్యవిముక్తికై పంపి గాంధీ ఆశయాలను నెరవేర్చగలరని తెలిపింది. స్త్రీలు విద్యాజ్ఞానంతో దేశానికి ఉన్నతిని కలిగించాలనీ, దేశ ప్రయోజనమైన కార్యాచరణకు పూనుకోవాలనీ, దానికై స్త్రీలు జ్ఞానం సంపాదించాలి కాబట్టి విద్యావంతులు కావాలని చెప్పింది. వితంతు స్త్రీల పునర్వివాహం కంటె కూడా వారికి ఉన్నత విద్య నేర్పించి బాలికాపాఠశాలలో ఉపాధ్యాయినులుగా నియోగించి గ్రామాల్లోని స్త్రీ విద్యకు పాటుపడేటట్లు చేయాలని కోరింది.

స్త్రీల విద్య కుటుంబానికి లేదా దేశాభివృద్ధికి కూడా అవసరమని వారు విద్యనేర్చి జ్ఞానవంతులైన తర్వాత ఆ జ్ఞానాన్ని దేశభవితకు దేశదాస్యవిముక్తికి ఉపయోగించాల్సిన అవసరాన్ని సూచించటం జరిగింది. పల్లీయుల, పట్టణవాసులయొక్క దేశభక్తికి సంబంధించిన విషయాలలోని అంతరాలను గుర్తించటం జరిగింది.

స్త్రీవిద్య – నూతనవిద్యావిధానం

భువనగిరి లక్ష్మీకాంతమ్మ వ్రాసిన 'స్త్రీవిద్యావిధానం' (ఫిబ్రవరి 1935 గృహలక్ష్మి) అనే కవితలో స్త్రీలకు విద్య అవసరమనీ, ధైర్యము, సంసార నిర్వహణము తెలుస్తుందనీ, స్త్రీలు దేశీయవిద్యలు నేర్చుకోవాలనీ, దేశాభివృద్ధికి భాషాభివృద్ధికి విద్య ఉండాలనీ "స్త్రీలకు ప్రథమ చికిత్సయు, బాలెంతల వైద్యమందు బ్రావీణ్యంబున్ వీలుగా శిశుపోషణమును వాలాయముగా నేర్పవలయును చెల్మిన్" – అనీ, కుట్టుపనులు నేర్చుకొని ధనలాభాన్ని పొందాలనీ, ఆంగ్లభాషను నేర్చుకోవచ్చుగానీ, ఆ దేశవేషాలు అనవసరమనీ, చదివినందుకు ఫలితం జ్ఞానం పొందాలనీ, స్త్రీలు ఉద్యోగాలు చేస్తున్నా కుటుంబాన్ని విస్మరించకూడదనీ, గురుకులాల్లో బాలికలకు విద్య వస్తోందిగానీ, "స్త్రీల విద్యావిధానంబు చెప్పుకొనుటే కాని దారిద్ర్య భూతంబు కౌగలించి యున్న భారతదేశాననున్న విద్య మార్పుచెందిన గతిలేదు

మానినులకు" అని స్త్రీలవిద్యలో ఆర్థిక పుష్టిని కల్గించే నూతన విద్యావిధానం కావాలని తెలియజేసింది.

కనుపర్తి వరలక్ష్మమ్మ ఏలూరునందలి 'శ్రీలక్ష్మి సేవాసదనము' (నవంబరు 1935 గృహలక్ష్మి) యొక్క వార్షికోత్సవ సభలో ఉపన్యసిస్తూ నూటికిద్దరికంటే స్త్రీలు చదువుకోవటం లేదనీ, స్త్రీవిద్య ఉద్యోగం కొరకే కాదనీ, మాతృస్థానమునందున్న స్త్రీలు చదువుకుంటే బాలబాలికలను విద్యావంతులను చేయగలుగుతారని చెప్పింది. మూఢనమ్మకాలు, మూఢాచారాలు ఉండటంతో స్త్రీలకు చేతిపనులు రాక వారు స్వయంపోషకత్వం స్వతంత్ర జీవనం లేక ఉన్నారనీ, కాయకష్టం లేకుండా పరులమీద ఆధారపడకూడదనీ, స్త్రీలకు నీతి విజ్ఞానం, సేవా ప్రయత్నం అలంకారాలుగా ఉండాలని తెలిపింది. స్త్రీలు సేవాసదనాలను ఏర్పరచి పత్రికాపఠనంతోపాటు ఖగోళ, భూగోళ, చరిత్ర, భౌతిక శాస్త్రమువంటి వివిధ విషయక జ్ఞానాన్ని తోటిస్త్రీలలో కల్గించాలనీ, స్త్రీల అభ్యుదయమే దేశాభ్యుదయమనీ, రాబోయే రాజ్యాంగ సంస్కరణలవల్ల స్త్రీలు తమహక్కులను, అధికారాలను స్వతంత్రంగా స్వసంఘక్షేమకరంగా ఉపయోగించగల సామర్థ్యాన్ని పెంచుకోవాలని తెలియచేసింది.

స్త్రీవిద్య – స్త్రీలపరిశోధనలు

కె.నాగమణి అనే మద్రాసులోని క్వీన్ మేరీ కళాశాల అనే విద్యార్థిని 'స్త్రీ విద్య' (ఏప్రిల్ 1937 హిందూ సుందరి) ను గురించి వ్రాస్తూ పూర్వకాలంలో స్త్రీలు చదువుకొన్నారనీ, ఇప్పుడు కూడా స్త్రీలు జీవిత పర్యంతము విద్యాభిలాషులై పరోపకారపారీణతతో ఉండాలనీ, దానికై భాషాజ్ఞానం, గృహకృత్య నిర్వాహకత్వం తెలియాలని భావించింది. పురుషులకన్నా స్త్రీలకు గణిత శాస్త్రంలో ఆలోచనాశక్తి ఎక్కువగా ఉంటుందనీ, విద్యాభివృద్ధి కావాలనుకున్న స్త్రీలు పరిశోధనలు చేయాలనీ, మెదడు చేసే పనికి తగినంత శాంతం వారిలో ఉంటుందనీ వారే వైద్యసేవలు, ఉద్యోగాలు చేయటానికి అర్హులని తెలియజేసింది.

స్త్రీలు అన్నిరకాల విద్యలను నేర్చుకోవటానికి అర్హులని భావించింది. స్త్రీలకు ఇంద్రియ నిగ్రహం ఉంటుందని స్త్రీల మెదడు ప్రకృతి సహజంగానే గొప్పదనీ, స్త్రీలు చదువుకోవటమేగాక పరిశోధనలు చెయ్యాలనే ఆలోచలను పెంచుకోవటంగా అర్థం అవుతుంది. ప్రాథమిక, ఉన్నత, వృత్తివిద్యలేకాక స్త్రీలుపరిశోధనారంగంలోకూడా ఉడుగు పెట్టాల్సిన అవసరాన్ని సూచించింది.

స్త్రీవిద్య – దేశస్వాతంత్ర్యచైతన్యం

వల్లభనేని సీతామహాలక్ష్మి 'స్త్రీలకు విద్యలేనిచో దేశమునకు ముక్తిలేదు' (జూన్ 1937 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాసిన రెండు వ్యాసాలలో బిడ్డలు జ్ఞానవంతులు కావాలంటే తల్లి జ్ఞానవంతురాలు అవ్వాలనీ, అప్పుడే పిల్లలు స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొనగలుగుతారనీ, స్త్రీలకు విద్యను తప్పనిసరి

చేయటానికి స్త్రీవిద్యాలయాలు నెలకొల్పాలని తెలియజేసింది. అంతేకాదు ఎవరో వచ్చి స్త్రీలను స్వతంత్రులను చేస్తారని అనుకోకుండా స్త్రీలు తమంతటతామే సంఘాలు నిర్మించుకొని వాటిద్వారా స్త్రీస్వాతంత్ర్యం, స్త్రీవిద్య, బాల్యవివాహనిషేధం, పునర్వివాహాలు మొదలగు సాంఘిక సంస్కరణలను పాఠశాలలోవలె బోధించాలనీ, స్త్రీలను తమశక్తికొలది జాతీయసేవలో పాల్గొనేటట్లు చేయాలని భావించింది. అంతేకాదు, – స్త్రీలకు విద్యలేనిచో దేశమునకు ముక్తిలేదు – (తెలుగుతల్లి, సెప్టెంబరు1937) అనే శీర్షికన ఈమె మరొక వ్యాసాన్ని వ్రాస్తూ, స్త్రీలు విద్యావంతులయితేనే బిడ్డలు యోగ్యులుగా పెరిగి దేశస్వాతంత్ర్యంకోసం పోరాడగలరనీ, స్త్రీలకు విద్య, పత్రికాస్వాతంత్ర్యం, వాక్స్వాతంత్ర్యం వంటి ప్రజాస్వామిక హక్కులు ఉండాలని తెలిపింది. స్త్రీలస్వాతంత్ర్యంకోసం పోరాడే స్త్రీసంఘాలు స్త్రీలను దేశసేవలో నిమగ్నులు అయ్యేటట్లుగాచేయాలనీ, స్త్రీలదాస్యం పోతేనే దేశానికి దాస్యవిముక్తి కలుగుతుందని తెలిపింది.

స్త్రీవిద్య – పురుషసంస్కరణ

శ్రీమతి సత్యం వ్రాసిన 'విద్యావతులు సంసారమున కనర్హులా' (ఏప్రిల్ 1936 గృహలక్ష్మి) అనే వ్యాసంలో విద్యావంతురాలైన కన్య సంసారానికి పనికొస్తుందని తెలుసుకోవాల్సిన అక్కర ఉందనీ, ఆమెకే గృహనిర్వహకత్వంలో ఎక్కువబాధ్యత తెలుస్తుందనీ, వివిధదేశాల సాహిత్య అధ్యయనంతో వారు జీవితాన్ని చక్కగా అవగాహన చేసుకోగలుగుతారని తెలియజేసింది. అంతేకాక, చదువుకున్న స్త్రీపై హుకుం చెలాయిస్తూ అగౌరవపరిస్తే, కందిరీగతుట్టెను కదిలించటం లాంటిదనీ, తెలివిగల భర్త అయితే విద్యావతియే తనభార్య కావాలని కోరుకుంటాడనీ, ఆమె తన భర్తను కూడా విజ్ఞానవంతుడ్ని చేయగలుగుతుందనీ, పురుషుడు స్త్రీని ఉత్తమురాలిని చేయలేడు గాని విద్యావతి భర్తను మనిషిగా తీర్చిదిద్ద గలుగుతుందని తెలియజేసింది. విద్యావంతులైన గృహిణులకుండే శక్తిసామర్థ్యాలను తెలియజేస్తూనే పురుషులకు మానసికచికిత్స చేయగలిగింది.

సు.అన్నపూర్ణ వ్రాసిన 'తుదిమెట్టు' (జులై 1936 గృహలక్ష్మి) అనే కథలో చెడుస్నేహాలు, వ్యసనాలకు అలవాటుపడి చదువును ఆపేసిన కొడుక్కి తండ్రిపెళ్ళి చేసి పోషిస్తున్నా బాధ్యత తెలీక పోవటంలో చదువుకున్న భార్య కాపురానికి వచ్చిన తరువాత కొడుకును బాగుచేయమని మామ అడుగుతాడు. చదువుకున్న ఆ కోడలు భర్తకు బాధ్యతను తెలియజేసి చదువును కొనసాగించేటట్టు చేయటంతో అతని జీవితం బాగుపడుతుంది. చదువుకున్న స్త్రీ భర్త ప్రవర్తనను కూడా సరిదిద్దగల సామర్థ్యం కలిగియుంటుందని తెలియజేసిన కథ యిది. కుటుంబపరిధిలోని స్త్రీలశక్తి సామర్థ్యాలకు నిదర్శనంగా కన్పడుతుంది.

స్త్రీవిద్య – స్వీయసంస్కరణ

స్వాతంత్ర్యసాధనలో వ్యక్తుల స్వీయసంస్కరణ జరగాల్సిన అవసరాన్ని గుర్తించటం ముఖ్యమనుకొన్నారు. అదే విధంగా స్త్రీలు వ్యక్తిస్వాతంత్ర్యసాధనలో స్వీయసంస్కరణకై విద్యాభివృద్ధి చేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తించారు.

చెరుకూరు నాగభూషణమ్మ వ్రాసిన 'మన పతనానికి మనమే కారణము' (నవంబరు 1937 గృహలక్ష్మి) అనే వ్యాసంలో జ్ఞానాభివృద్ధి స్త్రీలలో లేకపోవటంతోపాటు, స్త్రీలు విద్యావంతులై పిల్లలను విద్యావంతులు చేస్తూ సంఘంలోని కల్మషాలను పారద్రోలి సంస్కరించే బాధ్యత స్త్రీలు వహించక పోతే స్త్రీల పతనానికి స్త్రీలే కారకులవుతారనీ హెచ్చరించటం జరిగింది.

స్త్రీలు సమాజాభివృద్ధితో ముందుండాలని హెచ్చరిక చేసింది. స్త్రీలు తమ స్వాతంత్ర్యాన్ని నిలుపుకోవటం స్త్రీలచేతులలోనే ఉందని భావించింది. స్త్రీలు సామాజిక కార్యక్రమాలలో స్వేచ్ఛగా పాల్గొన గలిగితే వారికి సాంఘిక స్వాతంత్ర్యం ఉన్నట్టనీ, దానికి రక్షణగా ఆర్థిక హక్కులు ఉంటే, రాజకీయహక్కులనుకూడా సాధించుకోగలిగి స్త్రీలు సర్వ స్వతంత్రులయి దేశస్వాతంత్ర్యాన్ని సాధించగలరని భావించింది.

స్త్రీవిద్య – పత్రికారంగం

పసుపులేటి లలితాదేవి వ్రాసిన 'స్త్రీలు పత్రికా సంపాదకులుగా ఉంటే' (అక్టోబరు 1938 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీలు పత్రికా సంపాదకులుగా మారితే స్త్రీ సంఘం బాగుపడుతుందనీ దేశక్షేమం స్త్రీలపై ఆధారపడి ఉందనీ, స్త్రీలే విద్యార్థులకు ఉపాధ్యాయినులుగా ఉండాలనీ, శిశువులను తీర్చిదిద్దటానికి నైతిక, ఆర్థిక, లౌకిక, రాజకీయ విషయాలలో స్త్రీల ద్వారానే బోధన జరగాలని తెలిపింది. శిశుపాలన, ఆరోగ్యాభివృద్ధి, రోగనివారణ, కుటుంబనియంత్రణవంటి విషయాలను స్త్రీలకు బోధించాలన్నా స్త్రీలే పత్రికా సంపాదకులుగా ఉండాలని తెలియచేసింది. స్త్రీల సమస్యలను పత్రికల ద్వారా పదిమందికి తెలియజేసి ఆలోచింపచేస్తూ పరిష్కారాలను సూచించటానికి స్త్రీలు పత్రికాసంపాదకులుగా ఉంటే స్త్రీల ప్రగతి కలుగుతుందని కూడా తెలియజేసింది. స్త్రీల సమస్యలకు పరిష్కారాలు పత్రికా ముఖంగా తెలియజేయాలంటే విద్యావంతులైనస్త్రీలు పత్రికారంగంలో ఉండాలని భావించింది. పత్రికారంగం సామాజికాభివృద్ధిలో ప్రముఖపాత్ర వహించగలదని స్త్రీలు గుర్తించగలిగారు.

స్త్రీవిద్య – స్త్రీలగ్రంథాలయాలు

పాకల రాజమణెమ్మవ్రాసిన "స్త్రీసమాజములు స్థిరంగా ఉండాలంటే" (అక్టోబరు 1938 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీలు తీరిక సమయాలలో ఊరి గొడవలతో కాలక్షేపం చేయక స్త్రీలందరూ

ఒక చోట చేరి స్త్రీల కష్టస్థితులను, తన్నివారణోపాయాలు ఆలోచించుకోవటానికి వేదికగా స్త్రీసమాజాలు ఉండాలని తెలిపింది. భర్త ఆఫీసుకు వెళ్ళినపుడు, శని, ఆదివారాలు బయటకు వెళ్ళినపుడును స్త్రీసమాజలలోను, గ్రంథాలయాలలోను పుస్తక పఠనం చేయాలని తెలిపింది.

పంతం అమ్మాజీ వ్రాసిన 'స్త్రీలకు ప్రత్యేక గ్రంథాలయములు' (డిసెంబరు 1938 గృహలక్ష్మి) అనే వ్యాసంలో వ్రాస్తూ స్త్రీలకు గ్రంథపఠనము, పత్రికలు చదువుట యందు అభిరుచి కలిగితే వారియొక్క మూఢత్వం తగ్గుతుందనీ, అది స్త్రీవిద్యవల్ల కొంతతగ్గినా, పల్లెలలో విద్యావ్యాప్తి లేక మూఢాచారలున్నాయి అని తెలిపింది. పల్లెలలో స్త్రీల జ్ఞానాభివృద్ధికి స్త్రీలకు ప్రత్యేకంగా గ్రంథాలయాలు నెలకొల్పాలనీ దానికై ప్రభుత్వంపై వత్తిడి తేవాలని అభిప్రాయపడింది. పల్లెలలో స్త్రీలు పత్రికాపఠనం చేయటానికి గ్రంథాలయాలకు వెళ్ళి పురుషులతో కూర్చొని పుస్తకపఠనం చేయటానికి బిడియంగా ఉంటుందనీ, పల్లెస్త్రీలు పట్టణ స్త్రీల నాగరికతలలో తేడా ఉంటుంది కాబట్టి పల్లెలలో స్త్రీలకు ప్రత్యేక గ్రంథాలయాలను పెట్టటాన్ని అత్యవసరంగా భావించింది.

స్త్రీవిద్య – ఆర్థికస్వాతంత్ర్యచైతన్యం

కామరాజు సరోజినీ దేవి వ్రాసిన 'ఏ జీవిక స్త్రీలకు?' (ఏప్రిల్ 1939 భారతి) అనే వ్యాసంలో అనాది నుండి స్త్రీలు తమకు గృహజీవితమే పరమార్థం అనే విశ్వాసంలో ఉన్నారనీ, కానీ మారుతున్న ఆర్థిక, సాంఘిక పరిస్థితులలో పశ్చిమదేశాలలోని స్త్రీలకు స్వాతంత్ర్య కాంక్ష పెరిగి నవీనభావాలు ఏర్పడ్డాయని తెలిపింది. స్త్రీలవిద్య, ఉద్యోగం వారి సాంఘిక పరిస్థితులపై ఆధారపడి ఉందనీ, స్త్రీలకుఉపాధ్యాయ, న్యాయవాద, వైద్యవృత్తిలో ప్రవేశాలనుకల్పిస్తే చాలామంది చదువుకుంటారని చెప్పింది. అంతేకాక స్త్రీవిద్యవల్ల స్త్రీలకున్న హక్కులేమిటో అర్థమవుతాయనీ, ఆర్థికస్వాతంత్ర్యం ఉంటేనే వారికి దాస్యవిమోచనం కల్గుతుందనీ, స్త్రీలలో స్వయంనిర్ణయం చేయగలశక్తి పెరుగుతుందని భావించింది. తమహక్కులకోసం పోరాడాలంటే న్యాయశాస్త్రపఠనం అవసరమనీ, అదే స్త్రీ స్వాతంత్ర్య ప్రాప్తికి మార్గమవుతుందనీ జాతీయాభివృద్ధికి ఆరోగ్యం ముఖ్యం కాబట్టి మాతృహృదయం కల స్త్రీ వైద్యవృత్తిలో ఉంటే ప్రజారోగ్యం బాగుంటుందని తెలిపింది. సారస్వతంలో స్త్రీల నూతనాదర్శమును, నూతనవ్యక్తిత్వాన్ని నిరూపించే సాహిత్య సృజన జరగాలనీ, స్త్రీహృదయం స్త్రీలకే అర్థం అవుతుందని తెలియజేసింది.

స్త్రీవిద్యకు, స్త్రీలవ్యక్తిత్వానికి, స్త్రీలసాహిత్యానికి ఉన్న లింకును తెలియజేసింది. వివిధ శాస్త్రీయవిజ్ఞానంతో స్త్రీల విద్యాస్థాయి సామాజికాంశాలకు అనుగుణంగా పెరగగలిగితేనే వారికి ఆర్థిక స్వాతంత్ర్యం, నిర్ణయాధికారం పెరుగుతుందని భావించింది. సామాజిక, రాజకీయమార్పులకు

అనుగుణంగా స్త్రీల జీవికకు, స్త్రీలధర్మాలు మారాల్సిన అవసరం ఉందనీ, అప్పుడే స్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యం ఏర్పడే వీలుంటుందనీ, ఆ జీవిక, జీవితం స్త్రీలకు ఉండాలని భావించింది.

స్త్రీవిద్యకై ఉద్బోధ

టి. కామాక్షమ్మ వ్రాసిన 'ఉద్బోధము' (ఫిబ్రవరి 1939 గృహలక్ష్మి) అనే కవితలో భూమిమీద విద్య మానవులకు శీలవృత్తములను అలవడచేస్తుంది కాబట్టి ఆడపిల్లలను చదివించాలనీ, కావ్యాలు వ్రాసిన స్త్రీలు ఉన్నారనీ, విద్యకు సాటియైనది లేదనీ, తొలితరం తల్లులకు చదువులు కల్లలైన నేటితరం ఆడపిల్లలు రేపటి గృహకల్పవల్లులు కాబట్టి వారికి చదువు చెప్పించాలని చెబుతూ

"సకల వాంఛితములఁదీర్పజాలునట్టి
కలుషములబాపు మార్గంబుఁ గరపునట్టి
విద్యసాటికి పుడమిలో వేరేగలదే
ఆడబిడ్డలచదివింపుడన్నలారా..

ఒక సోదరిగా సమాజంలోని పురుషులను అర్థించటం కనబడుతుంది. కఠినగుండెలను కూడా 'అన్నా' అంటూ ప్రాధేయపడితే ఆడపిల్లల విషయంలో కరగకుండా ఉంటారా అని భావించినట్లు కనబడుతుంది.

1930-40 దశాబ్దంలో వచ్చిన సాహిత్యంలో స్త్రీవిద్యాభివృద్ధి, బాల్యవివాహాల నిరసన, స్వాతంత్ర్యోద్యమ స్త్రీల స్ఫూర్తి, కుటుంబస్త్రీల వెతలు, మహిళలకు, యువతకు ఉద్యమప్రబోధం, స్త్రీలు అబలలు కాదు సబలలని భావింపజేయటం, ప్రజలలో ఉద్యమచైతన్యాన్ని కలిగించటం కనపడుతుంది. 20 శతాబ్దపు నాలుగవ దశకంలో వచ్చిన సాహిత్యంలో స్త్రీల భావపరిణామశీలతలో పెనుమార్పులు చోటుచేసుకొన్నాయి. 1930 సం.లో స్త్రీలు ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని జైళ్ళజీవితాన్ని గడపటంతో ఆత్మవిశ్వాసం పెరిగి తాము పురుషులతో సమానమనే ఆలోచనలు పెరిగి నూతనోత్సాహము కలిగింది. 1935వ చట్టం భారతదేశానికి రాష్ట్రీయ స్వాతంత్ర్యం ఇవ్వటంతో స్త్రీలు దేశస్వాతంత్ర్యం కోసం క్విట్ ఇండియా నేపథ్యంలో అభ్యుదయపంథాలో నడిచి విప్లవాత్మక ఆలోచనలను పెంచుకున్నారు.

1940 సం. నాటికే స్త్రీలసాహిత్యంలో స్త్రీవిద్యాచైతన్యంతో స్త్రీపురుషసమానత్వ ఆవశ్యకతను తీవ్రతరంచేసారు. దానికై స్త్రీలు సాంఘిక, రాజకీయ, ఆర్థికస్వాతంత్ర్యాలను పొందటానికి అవసరమైన హక్కులప్రాధాన్యతను చర్చకుపెడుతూ స్త్రీలు వ్రాసిన సాహిత్యం అనంతంగా ఉంది. ఓటింగ్ హక్కు, విద్యాహక్కు, వివాహనిర్ణయ స్వతంత్రం ఉంటేనే స్త్రీ, పురుష సమానత్వం ఉంటుందనీ, దాన్ని

కాపాడుకోవటానికి స్త్రీలకు రాజకీయహక్కులు ఉండేలా శాసనసభలలో సభ్యత్వం ఉండాలని భావించారు. గృహిణులుగా ఉంటూనే స్త్రీలు సంపూర్ణస్వేచ్ఛను పొందే మార్గాలను అన్వేషించారు. మాతృభాషలో విద్యాబోధన ఉండాలని కోరుకొన్నారు. గ్రామ, జిల్లా, రాష్ట్రస్థాయి మహిళాసభలలో స్త్రీలు తీర్మానాలను చేసి పంపి కేంద్ర, రాష్ట్ర శాసనసభలలో స్త్రీలుప్రాతినిధ్యం వహించాలని భావించారు. అఖిలభారత మహిళాసభలలో పాల్గొనటానికి హిందీభాషా నైపుణ్యాన్ని పెంచుకోవాలనుకున్నారు. సంపూర్ణస్వాతంత్ర్య ముఖ్యోద్దేశ్యంగా ఉద్యమాలు జరుగుతుంటే మరొకప్రక్క మహిళలకు సంపూర్ణస్వేచ్ఛ కావాలనే ఆలోచనలను పెంచుకొన్నారు. స్త్రీలు విద్యావంతులై పరిశ్రమలద్వారా ఆదాయ మార్గాలను పెంచుకుంటూ ప్రజాహిత సంస్థలలో పాల్గొని దేశసేవలో నిమగ్నులైనా కూడా భారతస్త్రీలు సంపూర్ణస్వాతంత్ర్యాన్ని పొందలేకపోవటానికి కారణాలను అన్వేషించారు. రాష్ట్రీయ స్వాతంత్ర్యం వచ్చిన సందర్భంలో స్త్రీలు తమకు గృహహింస నుండి వైవాహిక విముక్తికై బిల్లును ప్రతిపాదించేటప్పుడే దానికి, సవరణలకై సభలలో చర్చించటమేకాక, పత్రికాముఖంగాను సూచనలను చేసారు.

స్త్రీ విద్యార్థిసంఘాలు

కనకదేశగుప్త చేసిన ఉపన్యాసానికి అనువాదంగా 'స్త్రీవిద్యార్థి సంఘములెందుకు' అనే శీర్షికన ఆంధ్రరాష్ట్ర విద్యార్థిసంఘం (అక్టోబరు 1940 గృహలక్ష్మి) వారు తెలియజేస్తూ దేశీయోద్యమంలో విద్యార్థి సంఘాలు ఉపాంగాలనీ, సాంఘిక, ఆర్థిక, రాజకీయ మనోదాస్యాల నుండి రక్షించే విధంగా విద్యావిధానం ఉండటంలేదనీ, పైపెచ్చు విద్యార్థినుల ప్రత్యేక సమస్యలను విద్యార్థి సంఘాలు ఆలోచించటంలేదు కాబట్టి స్త్రీల విద్యార్థినీ సంఘాలు ఉండాలని భావించిందనీ విద్యార్థి సంఘం తెలియజేసింది. అంతేకాక, బాలికలకు తగినన్ని విద్యాలయాలు గ్రామాలలో కూడా ఉండాలనీ, దూరగ్రామాల నుండి వచ్చి విశ్వవిద్యాలయాల్లో చదివే స్త్రీలకు వసతి గృహాలుండాలనీ జాతులవారీగా విద్యాలయాలు పెడితే వివక్షతలు, భేదాలు ఏర్పడితే దేశాభ్యుదయానికి భంగకరమని భావించిందనీ విద్యార్థి సంఘం తెలిపింది. స్త్రీవిద్యార్థులకు సమాజంలో గౌరవంలేదనీ, వారసత్వపు హక్కు యువకులతోపాటు యువతులకు సమానంగా ఉండాలనీ, స్త్రీలకు ప్రత్యేక ఆటస్థలాలుండాలనీ, ప్రతి విద్యాలయాలలో ప్రాథమిక సంఘాలు ఉండాలనీ, పఠనబృందాలు, వాగ్వాదసభలు జరగాలని భావించిందనీ విద్యార్థి సంఘం తెలిపింది. విద్యార్థినులు స్వాతంత్ర్యం కోసం లాఠీదెబ్బలు తిని జైళ్ళకుపోవాలని భావించవద్దనీ, వారి సమస్యలు విద్యార్థి సంఘాలలో చర్చించుకొనే సావకాశం కల్పిస్తే చాలనీ, వారే సంఘంలోని స్వార్థపరులనోళ్ళను కట్టేస్తారనీ ఆమె చెప్పిందని విద్యార్థిసంఘం

తెలియజేసింది. స్త్రీవిద్యాభివృద్ధిలో ఆనాడే స్త్రీవిద్యార్థినీ సంఘాల ఉనికి అవసరమనీ, విద్యార్థినుల సమస్యలను గుర్తించి పరిష్కార సూచన చేస్తూనే విద్యార్థిసంఘాల బాధ్యతలను కూడా తెలియజేసిన వ్యాసమిది.

స్త్రీవిద్య – మహిళాప్రగతి

'బత్తుల కామాక్షమ్మ' (మార్చి 1941 గృహలక్ష్మి) ను గురించి వేదవల్లితాయారమ్మ వ్రాసిన వ్యాసంలో ఆమె జీవిత విశేషాలను వ్రాస్తూ ఆమె సంఘసేవాధురీణ, 'విద్యాప్రదాయినీ' అనే బిరుదగ్రహీత అనీ, స్వశక్తిపై కృషిచేసి స్త్రీ లోకమున వారి ఉన్నతికై అకుంఠిత దీక్షతో పనిచేసి ఆంధ్రయువతీ సంస్కృత కళాశాలను స్థాపించిన వినిర్మల ఆదర్శజ్యోతి అని పేర్కొంది. ఆమె పట్టుదల, కృషి, దైవబలాన్ని కలిగి ఉన్నతాశయాలలో జీవించినదని తెలియజేసింది. 1886 లో జన్మించిన ఈమెకు పూసప్రాయమునందే వైధవ్యం వచ్చినా, పదిమందికి నాయకత్వం వహించి మద్రాసులో మాతామహులగు నాళము లక్ష్మీ కాంతంగారింట 15 సంవత్సరాలు గడిపి వచ్చిన తరువాత తన 34 వ ఏట కాలము యొక్క విలువను గ్రహించి వృథాకాలక్షేపం చేయటం యిష్టంలేక రాజమండ్రి నుండి వీరేశలింగంగారి సలహాతో 'వైశ్యసేవాసదనము'ను స్థాపించటంలో పాత్రపోషించింది. బాలికలను పరీక్షలకుపంపాలని భావించి, వారిని చదివించటానికై ఆంధ్రయువతీ సంస్కృత కళాశాలను స్థాపించినదని కూడా తెలియజేసింది. స్వార్థత్యాగి, నిరాడంబర జీవి, ఉత్సాహ పూరిత, ప్రేమస్వరూపిణి, విశ్రాంతి ఎరుగని కార్యదీక్షయే గాక ఈతవిద్యను నేర్చి పదిమందికి నేర్పిన ఆమె, అఖండ గౌతమీనదిలో అతిస్వేచ్ఛగా పరుండి పద్మాసనము వేసి పరతత్వాన్ని ధ్యానించిన యోగీశ్వరీ అనీ, వేగవంతముగల నడక కలిగిన ఈమె పండ్లనే ఆహారంగా తీసుకునేదని తెలియచేసింది. 1924లో గుంటూరులో జరిగిన 'ఆర్యవైశ్య మహిళాసభ' కు అధ్యక్షత వహించిందనీ, సంఘసేవ చేస్తూనే 'విద్వాన్' పరీక్ష చదివిందనీ, 1927లో అఖిలాంధ్ర మహిళాసభకు కార్యనిర్వాహక సభ్యురాలిగాను మహిళాసభ యొక్క సాంఘిక, రాజకీయ, వైజ్ఞానిక శాఖల కార్యనిర్వాహక సభ్యురాలిగాను ఉంటూ మహిళాభ్యుదయానికై శక్తివంచనలేని ప్రచారం చేసిందని తెలిపింది. 1929లో ఆంధ్రవిశ్వవిద్యాలయం నుండి ఉభయ భాషాప్రవీణ పట్టాన్ని పొందిందనీ, ఆ సంవత్సరమే పెద్దాపురము నందలి ఆర్యవైశ్యమహాసభలో ఈమెకు 'సంఘసేవాధురీణ' అని బిరుదునిచ్చారని తెలియజేసింది. 1931 నాటికి 'వైశ్యసేవాసదనం' అనేసంస్థ 'ఆంధ్రయువతిసంస్కృతకళాశాల'గా పరిణామంచెందిందనీ, రాజమండ్రిలోని గరల్స్ హైస్కూలు, గౌతమీ గ్రంథాలయం, అఖిలభారత స్త్రీల ఆటల సంఘానికి ఉపాధ్యక్షురాలుగా, పురపాలక సంఘ సభ్యురాలుగాను, రాజమండ్రిలో

గౌరవ న్యాయాధికారిణిగా భాగస్వామురాలయిందని చెప్పింది. 'ఆంధ్రరాష్ట్రమహాసభలో వస్తుప్రదర్శన ఏర్పాటు చేయించినదనీ, విద్యార్థినులను కేవలం ప్రాచ్యవిద్యలందే గాక చిత్రలేఖనం, కుట్లు, సంగీతం, హిందీ, ఇంగ్లీషు మొదలగు గవర్నమెంటు వారి పరీక్షలకు పంపి స్త్రీలనుద్ధరించిన దేశోపకారిణి అని బత్తుల కామాక్షమ్మను ప్రశంసించింది.

నాటి వితంతు స్త్రీగా ఈత వంటి క్రీడారంగంలో ఒక స్త్రీ ఉండటం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. స్త్రీలకు ఇంటిపనితప్ప వ్యాయామం అవసరంలేదనుకొనే రోజుల్లో, ఒక వితంతుస్త్రీగా విద్యావంతురాలై, వ్యాయామవిద్యను నేర్చుకోవటమేకాక,అందులోనూ ఈతకొట్టే విద్యను నేర్చుకొన్నదంటేనే ఆమెదొక ప్రత్యేకవ్యక్తిత్వమనీ, అదే స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్యమని భావించాలి. బత్తుల కామాక్షమ్మవిద్యావంతురాలై స్త్రీలకోసం పాఠశాలలు, కళాశాలలను స్థాపించటంతోపాటు, ఆమె నిర్వహించిన పదవులే స్త్రీజాతియొక్క ఔన్నత్యాన్నికి చిహ్నం.

స్త్రీవిద్య - వేసంగిపాఠశాల

కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాసిన 'స్త్రీల వేసంగి పాఠశాల' (సెప్టెంబరు 1941 గృహలక్ష్మి) అనే ఇంకొక వ్యాసంలో విద్య, ఆరోగ్యం, వైద్యం, రాజకీయం, సాంఘిక సహకారంవంటి గ్రామ పునర్నిర్మాణానికి సంబంధించిన అవసరమైన విషయాలను తెలియజేయాలంటే యువకులకు వేసంగి పాఠశాలలను పెట్టినట్లే ప్రతిగ్రామంలో స్త్రీలకు కూడా ప్రత్యేకమైన వేసంగి పాఠశాలను (వేసవికాలంలో) గ్రామాలలో ఏర్పాటు చేయాలని భావించింది. బాపట్లలో ఏర్పడిన స్త్రీహితైషిణి ఏర్పాటుచేసినటువంటి వేసంగి పాఠశాలలు పట్టణాలలో ఉన్నాయనీ, అనుభవజ్ఞుల చేత వారికి పారిశ్రామిక విద్యలను కూడా నేర్పాలని తెలియజేసింది. రోజువారి ఇంటిపని, పొలంపని పనితో పాఠశాలలో చేరి చదువుకునే వీలులేని స్త్రీలకు ఇటువంటి వేసంగి పాఠశాలలు బాగా ఉపయోగపడ్తాయనీ, తద్వారా వారిలో విజ్ఞానం పెరిగి, ఆర్థికస్థితిని కూడా పెంచుకోగలిగితే స్త్రీలకొక స్వతంత్ర జీవనం విధానం ఏర్పడుతుందనీ అదే దేశస్వాతంత్ర్యంలో భాగమవుతుందని తెలియజేసింది. స్త్రీలసమస్యలను దృష్టిలో పెట్టుకొని, వారికి వీలుగా స్త్రీవిద్యాభివృద్ధిమార్గాలను అన్వేషించటం కనపడుతుంది.

స్త్రీవిద్యాభివృద్ధి - స్త్రీలచైతన్యఫలితాలు

కాకినాడలోని విద్యార్థినీ సమాజం, మహిళావిద్యాలయం, రాజ్యలక్ష్మి పుస్తకభండాగారం సంయుక్తంగా ఏర్పాటు చేసిన హిందూసుందరి పత్రిక 30 వ రజతోత్సవ సభలో (మార్చి 1944 హిందూసుందరి) విద్యాసంస్థల నివేదికల ప్రచురణలో 1910లో విద్యార్థినీ సమాజం

పునరుద్ధరింపబడిందనీ, స్త్రీలకు విజ్ఞానాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకుందనీ, 1923లో బాలికలకు యువతుల విద్యాభివృద్ధికై మహిళావిద్యాలయం పేరుతో సంస్కృత పాఠశాలను స్థాపించగా, దానిని 1927లో ప్రభుత్వం ప్రాథమిక బాలికాపాఠశాలగా గుర్తించిందని తెలిపింది. అంతేకాక, ఈ పాఠశాలలో తెలుగు, ఇంగ్లీషు, ఆంగ్లం, కుట్టుపని, సంగీతం, ఎంబ్రాయిడరీ, ఫేము అల్లిక మొదలగునవి బాలికలకు నేర్పిస్తున్నారనీ చేతిపరిశ్రమలో భాగంగా రాట్నం పరిశ్రమను నడుపుతున్నారని తెలిపింది. కందుకూరి రాజ్యలక్ష్మీ పేరుతో ఉన్న గ్రంథాలయంలో 1679 గ్రంథాలున్నాయనీ, నేడు విద్యార్థినీ సమాజంలో లేసు అల్లిక, ఖద్దరుగుడ్డలను నేయించి అమ్మకంచేసి కళాశాల అప్పులను తీర్చటం జరిగిందని పేర్కొన్నది. రాట్నపరిశ్రమవల్ల పెట్టుబడికంటె ఆదాయం అధికంగా వచ్చిందనీ, విద్యార్థులచే తోటపనిచేయించి పండ్లు, కూరగాయలు అమ్మి స్వల్పాదాయంలో విత్తనాలను కొనటం చేస్తున్నారన్న విషయాలను నివేదికలో తెలియజేయటం జరిగింది. వ్యాసంలో పేర్కొన్న విద్యాలయంలో దారిద్ర్యనిర్మూలనలో భాగంగా వస్తూత్పత్తిని నేర్పి, ప్రయోగాత్మక శిక్షణను యిచ్చినట్లుగా అర్థమవుతుంది.

కాకినాడలో జరిగిన 'విద్యార్థినీ సమాజం' (మే 1944 హిందూసుందరి) యొక్క రజతోత్సవ సభలో చుండూరి వెంకట రత్నమ్మ తన అధ్యక్షోపన్యాసంలో భాగంగా స్త్రీలప్రగతికోసం స్త్రీవిద్యకై ఉద్యమస్థాయిలో విద్యార్థినీ సమాజం చేస్తున్న కార్యక్రమాన్ని అభినందించింది. విద్యార్థినులు తయారు చేసిన వస్తుప్రదర్శనను తిలకించి 'ఉత్సాహవంతులైన స్త్రీలు చేస్తున్న వస్తూత్పత్తి దేశదారిద్ర్యాన్ని పోగొడ్తుతుందని ఆమె తెలియజేసిందని పత్రికాధిపులు ప్రచురించారు.

1941 నాటి జనాభాలెక్కలను (జనవరి 1947 గృహలక్ష్మి) పత్రిక ప్రచురిస్తూ 1000 మంది పురుషుల నిష్పత్తికి 935 మంది స్త్రీలున్నారనీ, పంజాబ్‌లో పశ్చిమోత్తర పరగణాలో స్త్రీల జనన నిష్పత్తి 84.7 శాతం మాత్రమే ఉందని తెలిపింది. ప్రాథమిక విద్యాభ్యాసం చేసేవారిలో 1040 మంది మగపిల్లలు పాఠశాలలకు పోతుంటే ఆడబిడ్డలు 10 మంది మాత్రమే వెళుతున్నారనీ చదవనూ వ్రాయనూ నేర్చిన స్త్రీలు పురుషులలో 4వ వంతు మాత్రమే ఉన్నారనీ తెలియజేసింది.

స్త్రీవిద్యాఉద్యమఫలితాలు

జనాభాలో సగం శాతంగా ఉన్న స్త్రీలకు స్వతంత్రత ఉంటేగానీ దేశ స్వాతంత్ర్యం వచ్చినా ప్రయోజనం లేదనే గ్రహింపుతో సంఘసంస్కర్తలు అడుగులు వేయటం జరిగింది. స్త్రీల వ్యక్తి స్వతంత్రతను అంగీకరించటానికి సిద్ధంగా లేని నాటి సమాజంలో స్త్రీలు స్వీయచైతన్యంతో స్వతంత్ర జీవనాన్ని పొందటానికి ప్రయత్నం చేసారు. దానికై ముందుగా స్త్రీలలో విద్యాచైతన్యాన్ని కలిగిస్తూ

అనంత సాహిత్యాన్ని స్త్రీలు సృజించారు. ఆనాడు జనాభాలో 0.5 శాతం స్త్రీలు మాత్రమే అక్షరాస్యులు ఉన్నారు. కనీస అక్షరజ్ఞానంకల స్త్రీలు పత్రికాపఠనం ద్వారా సామాజిక, రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకునే శక్తిని పొంది, తోటి స్త్రీలను విద్యావంతుల్ని చేస్తూ వారు తమ బానిసత్వాన్ని గుర్తించగలిగేటట్లు చేసారనీ, దాని ఫలితంగా స్వతంత్ర జీవనావశ్యకత గురించిన ఆలోచనలను స్త్రీలు పెంచుకోగలిగారనీ ఈ సాహిత్యం తెలియజేస్తుంది. అంతేకాదు సృజనకారులైన స్త్రీలు తమకు తోచిన రూపంలో చిన్న చిన్న సంభాషణాత్మక నాటకాలు, కథలు వ్రాసి స్త్రీవిద్యను ప్రోత్సహించటం చేసారు. అంతేకాక స్త్రీవిద్యకు కంటకప్రాయమైన బాల్య వివాహాల నిరోధానికై, స్త్రీ సమాజాలలో నాటకాలు వేసి, వంటింటి కుందేళ్ళుగా భావించబడ్డ స్త్రీలను చైతన్య పరిచిన విషయం క్రీ.శ.1900 సం.నుండి ప్రారంభమైన స్త్రీలసాహిత్యం ఋజువు చేసింది. అందుకే ఇది ప్రయోగాత్మకమైన ప్రగతిమార్గసాహిత్యం. వసతులు లేని ఆరోజుల్లోనే అనగా గత 120 సం.ల నుండి వచ్చిన స్త్రీలవిద్యా ఉద్యమ సాహిత్య చైతన్యమే మిన్నగా ఉన్నదనీ, ఆ చైతన్య ప్రవాహమే నేటి స్త్రీలకు ఆధారమని అర్థం అయింది. బహుశ స్త్రీలు విద్యావంతులై స్వతంత్రతను పొందితే పితృస్వామ్యపు పుట్టకీళ్ళు కదులుతాయనే భయం ఉండటంచేతనే విస్తృతమైన ఈ స్త్రీలసాహిత్యం విస్మృతికి గురియైందని భావించవచ్చు.

ఆధునికయుగంలో స్వాతంత్ర్యానికి పూర్వము సృజింపబడిన స్త్రీలసాహిత్య ప్రతిఫలనంలో స్త్రీవిద్యాభివృద్ధి కొంత జరగగానే, ఉన్నతచదువులు, వృత్తివిద్యలు నేర్చుకొని ఉద్యోగాలుచేయాలని, ఉపాధ్యాయినులుగా బాలికావిద్యకై తమతోడ్పాటును అందించాలనుకొన్నారు. స్త్రీవిద్యాభివృద్ధికై స్త్రీసమాజాలకు వెళ్ళటంతో స్త్రీలకు సామాజిక సంబంధాలు అభివృద్ధిచెందటం, తమవ్యక్తిస్వాతంత్ర్యపు విలువలను గ్రహించటం, తమకు స్వతంత్రజీవనం ఉండాలనుకోవటంతో ఆర్థికస్వావలంబన దిశగా స్త్రీలు అడుగులు వేయటం జరిగింది. దేశంలోని సామాజిక-సాంస్కృతిక, ఆర్థిక-రాజకీయ పరిణామాలపై అవగాహనను పెంచుకొన్నారు. ఆ క్రమంలోనే స్త్రీలు దేశాభిమానాన్ని పొంది దేశస్వరాజ్యంకోసం సత్యాగ్రహఉద్యమంలో భాగంగా ఖద్దరు తయారీలో పాల్గొనటంతో స్త్రీలకున్న హక్కులకు సంబంధించిన పరిజ్ఞానం సమాంతరంగా వారిలో పెరిగింది. ఉప్పుసత్యాగ్రహఉద్యమంలో పాల్గొని జైలుశిక్షలను అనుభవించటంతో వారిలో ఆత్మవిశ్వాసం పెరిగి, స్త్రీపురుషలసమానత్వ సాధనకై పురుషులతో పాటు తమకు కూడా సహజమైన సమానత్వం ఉండాలని భావించిన విషయం తెలిసింది. స్త్రీలందరూ స్వతంత్ర జీవనావశ్యకతకై స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్యాన్ని గుర్తించటంతోపాటు తమ జీవితాల మీద తమకే హక్కులుండాలనే భావన పెరగటం, దానికై సాంఘిక, ఆర్థిక, రాజకీయ

సమానహక్కులను సాధించాలనుకోవటం, పురుషులతో పాటు సమాన ఆస్తిహక్కు కావాలనుకోవటం స్పష్టమైంది. అయితే ఆర్థిక హక్కులను పొందటానికి రాజకీయ హక్కులు ఉండాలని భావించారు.

ఆ రాజకీయహక్కులను సాధించటానికి తమకు వోటు హక్కు కావాలనీ, నియోజక స్వాతంత్రం కావాలనీ, లోకల్ బోర్డుల్లో, శాసనసభలలో పురుషులతోపాటు తమకి సభ్యత్వం ఉంటే, స్త్రీల సమస్యలు తీరగలుగుతాయనే భావన పెరిగింది. స్త్రీలకు సంపూర్ణస్వేచ్ఛకావాలని, కుటుంబంలో భర్తఏకపత్నివ్రతుడుకాకపోతే విడాకులహక్కుకై బిల్లులను రూపొందించుకున్నారు. దానికై పెళ్ళిని రిజిష్టరు చేయించాలనుకొన్నారు. తమశరీరాలపై తమకే హక్కు ఉండాలనుకొని తమ ఆరోగ్యానికి భంగంకలుగుతుంటే గర్భస్రావంచేసుకునే స్వేచ్ఛ కావాలనుకొన్నారు. అందుకని స్త్రీలు స్వాతంత్రోద్యమంలో మరింతగా భాగస్వాములు కావాలని భావించి 1937-38 సం.లో జరిగిన ఎన్నికలలో శాసనసభలలో సభ్యురాండ్రు కాగలిగారు. ముందుగా ఇంట్లో పురుషుడి బానిసత్వం నుండి విముక్తిని చెందుతూ స్త్రీలు పురుషులతో కలిసి దేశ బానిసత్వాన్ని రూపుమాపటానికి కంకణం కట్టుకున్నారనే సత్యం భారతదేశ స్వాతంత్రసిద్ధి జరిగేంత వరకు వచ్చిన స్త్రీల సాహిత్యంలో ప్రతిఫలించింది. దీనికంతటికి స్త్రీవిద్యాభివృద్ధియే ప్రధానవసరుగా భావింపబడటం నాటి స్త్రీలసాహిత్యంలో స్పష్టమైంది.

స్త్రీలయొక్క అక్షరాస్యత 0.5 శాతంగా ఉన్నకాలంలోనే వైజ్ఞానిక పరికరాల సదుపాయాలు, ప్రోత్సాహం ఏమీలేని రోజుల్లో స్త్రీలు చైతన్యవంతులై, జాతీయ, అంతర్జాతీయ సామాజిక – సాంస్కృతిక, ఆర్థిక – రాజకీయ పరిణామాలను గురించిన అవగాహనను ఏర్పరచుకొన్నారు. అభ్యుదయభావాలతో కూడిన తమ రచనలద్వారా తోటి స్త్రీలను చైతన్యపరచటానికి మార్గదర్శకంగా నిలిచారు. జనాభాలో స్త్రీల శాతం, స్త్రీలవిద్యకు సంబంధించిన ఈ గణాంకాలు స్త్రీల జీవనహక్కులకు నిదర్శనం. స్త్రీవిద్యా ఉద్యమఫలితంగా ఆధునికయుగ ఆరంభానికి 0.5 శాతంగా ఉన్న స్త్రీవిద్య భారతదేశ స్వాతంత్ర్యసాధన సమయానికి 10 శాతం వరకు అభివృద్ధి చెందిందనేది ఆనాటి గణాంకాలలో, స్త్రీలసాహిత్యంలోను ప్రతిఫలించింది. స్త్రీవిద్యాఉద్యమంతోనే స్త్రీలహక్కులచైతన్యం అంచలంచెలుగా ఎదిగి స్త్రీలవ్యక్తి స్వాతంత్ర్యానికి పునాదులువేసి దేశస్వాతంత్ర్యానికి రహదారులను ఏర్పరచగలగింది కాబట్టే స్వాతంత్ర్యానంతరం వివక్షారహిత భారతదేశరాజ్యాంగానికి రూపకల్పన జరిగిందనేది స్పష్టమౌతుంది. అందుకే తెలుగుస్త్రీలు విద్యావంతులై తోటిస్త్రీల విద్యాభివృద్ధికై కొనసాగించిన స్త్రీవిద్యాఉద్యమాన్ని ప్రతిఫలించిన నాటిస్త్రీల సాహిత్యపరిశీలన నేటికీ కరదీపికయే.

బ్రిటిష్ వలసవాద సమాజంలో మగపిల్లలు ఆంగ్లవిద్యను అభ్యసించటంతో వరకట్నాల బెడద ఎక్కువైంది. కాస్తచదువుకున్న ఆడపిల్లలు వ్యక్తిత్వాన్ని పుంజుకోవటంతో తమ తల్లిదండ్రులు

ఆస్తిపాస్తులు, నీడనిచ్చిన యింటినికూడా అమ్మి వరుడికి కట్నాన్ని యివ్వవలసిన దుస్థితికి బాధనొంది ఆత్మబలిదానం చేసిన స్నేహలత రాసిన లేఖద్వారా బాలికల విషాదాంత చైతన్యాన్ని రాయప్రోలు సుబ్బారావు 1912 లోనే తన కవితలో చెప్పటం జరిగింది. ఆడపిల్లలు చదువుకోవటంతో, వారు కాస్త వ్యక్తిత్వాలను పుంజుకొని స్వీయ ఆలోచనలను పెంచుకొనే క్రమంలో వారికి ఈ వరకట్నసమస్య యొక్క తీవ్రత అవగాహనకు వచ్చింది.

1921 లో కాళ్ళకూరి నారాయణరావు రాసిన వరవిక్రయం అనే నాటకంలో పురుషోత్తమరావు కూతుళ్ళకు ఇంటి దగ్గర కొద్దిగా చదువు చెప్పించటంలో పెద్ద కూతురు కాళింది తన పెళ్ళికి కట్నం ఇవ్వటం ఇష్టం లేదనీ అటువంటి 'వెలమగల' చేత పుస్తె కట్టించుకునే అవమానపు బ్రతుకును కొని తెచ్చుకోలేనని భావించింది. ఆత్మహత్యకు పాల్పడుతుంది. కాని కట్నపుడబ్బు లింగరాజు చేతిని చేరటంతో రెండో కూతురు కమల తాను చదువు వల్ల పొందిన మనోధైర్యంతో ఆ లింగరాజుకే కాక కట్నం తీసుకునే ప్రతి ఒక్కరికి బుద్ధి చెప్పాలనుకున్న దృష్టితో తన మేధాశక్తిని పణంగా పెట్టి పరిష్కరించుకునే చైతన్యాన్ని తెట్టుకోగలిగింది.

వరకట్నమనే వ్యాపార క్రీడను తన తర్కపరిజ్ఞానంతో అరికట్టాలనుకుని, స్త్రీ పుట్టుకకు విలువ చేకూర్చే దిశగా చైతన్యాన్ని తెచ్చుకుంటుంది. అందుకే కట్నానికి క్రయధనానికి తేడా లేదనీ, వేలంపాట అనే మార్కెట్లో బజానా యిచ్చి అగ్రిమెంట్ చేసుకొని కట్నం డబ్బు ముందు చెల్లించి తాను భర్తను కొనుక్కున్నాను కాబట్టి తన భర్తపై తనకే అధికారం ఉందని న్యాయమూర్తి ఎదుట పితృస్వామ్యంలోని అధికార సంబంధాలలోని ఆర్థిక స్వభావాన్ని బయటపెడుతుంది.

మానవతా విలువలకు ఆస్కారం లేని సజీవవ్యాపార వ్యసనమే వరవిక్రయమని, వరుడు కోరినంతగా వెలయిచ్చి కొనుక్కున్న భర్తలకు దాస్యం చేసే ఆడపుట్టువు యొక్క గౌరవహీన స్థితిని సమాజానికి అర్ధమయ్యేట్లుగా చేసిన మహిళగా కమల చైతన్యం అర్థం అవుతుంది.

ఆర్థికవ్యవస్థ కారణంగా ఏర్పడిన చారిత్రక 'సామాజిక కుటుంబ' నిర్మాణపు నేపథ్యంలోకి తొంగిచూసి లింగవివక్ష కారణంగా ఏర్పడిన స్త్రీ పురుషుల మధ్య నున్న అసమానతలు తొలగిపోయేటట్లు చేస్తేనే వరకట్న సమస్యను నిర్మూలించగలమనే చైతన్యం కలుగుతుంది.

20 వశతాబ్దపు మూడవ దశకంలో వచ్చిన శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రిగారి కథలలో 'ఇల్లుపట్టిన విధవాడబడుచు' అనే కథలో పుట్టింట్లో వితంతుస్త్రీగా ఆనవాయితీగా వచ్చిన ఇంటిచాకిరి చేయటానికి, ఆమెకు డబ్బుపెట్టె తాళంచెవి యిచ్చినట్లే యిచ్చి కోడలికి ఆ డబ్బుపెట్టె పెత్తనాన్ని యివ్వటం జరిగింది. అప్పుడు ఆ విధవాడబడుచు ఆర్థికవిషయాలతో సంబంధంలేని ఇంటిచాకిరి విలువలేనిదని భావించి, తనకు లభ్యమైన మనోవర్తి డబ్బును తాను స్వేచ్ఛగా వినియోగించుకోవాలనే ఆర్థికస్వేచ్ఛాచైతన్యం తెచ్చుకొని ఆ యింటిని వదిలి వెళ్ళిపోతుంది.

శ్రీపాద రచించిన 'కన్యాకాలేయత్నాద్వరితా' అనే కథలో తనకు జరిగిన పెళ్ళి యిష్టం లేకపోయినా, ఆమె రజస్వలానంతరం కాపురానికి వెళ్ళాల్సిన సమయంతో అతడు చనిపోతాడు. ఆమె వితంతువుగా తయారు చేయబడుతుంది. రంగనాయకి తన పెళ్ళికి పూర్వమే పార్వతీశం అనే వాళ్ళింటి దగ్గరబ్బాయిపై యిష్టం ఏర్పరచుకుంటుంది. పెళ్ళి కాకపోయినా పార్వతీశాన్ని ఆమె మనసులో పెనిమిటిగా భావిస్తూనే ఉంటుంది. అందుకే తాను వితంతువయినా ఆమె కన్యగా ఉన్నప్పుడు కోరుకున్న పురుషుడితోనే లైంగిక సంబంధాలు ఏర్పరచుకోవాలనుకొంది. అతని భార్యతో మిత్ర సంబంధాలలోకి ప్రవేశించి ఆత్మీయతను పెంచుకొని, ఆమె కూడా తనని ఆ కుటుంబ సంబంధాలలోనికి ఆహ్వానించేటట్టుగా చేసుకోగలుగుతుంది. అయితే రంగనాయకి తండ్రి, అన్నలు పార్వతీశంతో ఆమె సంబంధాన్ని సంస్కృతికి విరుద్ధంగా భావించి నియంత్రించాలను కుంటారు. అప్పుడు ఆమె వారితో తనకిష్టంలేని పెళ్ళి చేసిన కారణంగానే తానిప్పుడు వారికిష్టంలేని లైంగిక స్వేచ్ఛను కోరుకున్నట్లుగా చెబుతుంది. ఆమె పార్వతీశం యింటికి వెళ్ళిపోతుంది. స్త్రీ తన జీవితాన్ని తాను నిర్మించుకునే హక్కు కొరకు పోరాడటం, స్త్రీలపట్ల అమలులో ఉన్న వివక్షతలను వ్యతిరేకించటం, స్త్రీ స్వేచ్ఛకై నియంత్రణను ధిక్కరించటం జండర్ స్పృహగా భావిస్తే అది శ్రీపాద కథలలో కదులుతూ కనబడుతుంది.

'అన్నంతపనీ జరిగింది' కథలో వితంతువైన జానకి యింట్లో ఎవరికి యిష్టం లేకపోయినా తాను చదువుకున్న 7వ తరగతి చదువుతోనే ప్రైవేట్లు చెప్పుకొని బ్రతకాలనుకుంటుంది. అయితే ఆమె చెప్పులు తొడుక్కొని గొడుగు వేసుకొని బజార్లో వెళ్ళటాన్ని సమాజంలో వ్యక్తులు కూడా సహించలేక ఆమె యింటి మీద రాళ్ళు రువ్వుతారు. ఆమె ప్రైవేట్లు మానేసి, తన ఊరికి వెళ్ళాలనుకున్న సమయంలో తన దగ్గర ప్రైవేటు చెప్పించుకుంటున్న ఒక అమ్మాయి ఈమెను తమ యింట్లోనే ఉండమని అడుగుతుంది. శిష్యురాలి కోరిక మేరకు అప్పటికి భార్య చనిపోయి ఉన్న ఆ అమ్మాయి తండ్రి పంతులు గారితో జానకి 'పెళ్ళి' అనే తంతులేకుండా కుటుంబ సంబంధాలలోకి ప్రవేశిస్తుంది. పంతులుగారి కూతురు బాలవితంతువు. ఆమెకు పునర్వివాహం జరిగేటట్టు చేస్తుంది. ఈ విధంగా సమాజంలో భార్య చనిపోయిన మొగవాళ్ళు ఏవిధంగా మళ్ళీ పెళ్ళిచేసుకుంటూ బ్రతుకుతున్నారో ఆడవాళ్ళు కూడా అలా బ్రతకడాన్ని ఆమె ఒక సమాజ వాస్తవం చేసి చూపించింది.

శ్రీపాదసుబ్రహ్మణ్యశాస్త్రిగారు రచించిన "అరికాలిమంటలు' కథలో బాల వితంతువైన రుక్మిణి తనకు జరుగబోయే శిరోముండనం క్రియను వ్యతిరేకించి, తన జుత్తు మీద తనకే అధికారముందని నిరూపించుకుంది. ఆ క్రమంలో పితృస్వామ్య కుటుంబ సంస్కృతిని అధిగమించి అర్ధరాత్రి ఒంటరిగా

చీకట్లో బయటకు వెళ్ళి బండివాడి సహాయంతో పునర్వివాహం చేసుకోవటానికి వీరేశలింగంగారి ఇల్లు చేరుకున్న ధైర్యవంతురాలిగా స్త్రీ పరిణామం చెందటం ఆనాటి వ్యవస్థకు విస్తుకలిగించే పరిణామమే.

లింగ వివక్ష కారణంగా పితృస్వామ్యంలో అభివృద్ధి చెందిన స్త్రీ పురుష అసమానతను నిరసించటం, ఆ అధికారం నుండి అణచివేతనుండి విముక్తికై అవసరమయితే కుటుంబాన్ని కూడా వదిలిపెట్టి వెళ్లాలనుకోవటం జండర్ స్పృహలో భాగమే అని 'కీలెరిగిన వాత' కథలో కృష్ణవేణి పాత్ర ప్రవృత్తి ద్వారా అర్థం అవుతుంది. పెళ్ళికి కట్నం ఇవ్వటం అంటే అపరాధ రుసుమును చెల్లించటమనీ, కట్నం తీసుకొని యువకుడు దొరికేంత వరకూ వివాహాన్ని చేసుకోవాలని భావించి స్త్రీ కోసం పాఠశాల పెట్టి డ్రైవింగ్, ఈత, గణితం యిట్లాంటివెన్నో నేర్పిస్తుంది. ఇలా స్త్రీలందరూ మిత్ర సంబంధాలలో ఉంటే సీత సమస్యలు పరిష్కరించుకోవచ్చని భావిస్తుంది. 'కట్నం లేకుంగా పెళ్లి చేసుకుంటానని' వచ్చిన వ్యక్తితో 'పెళ్ళి ఒప్పందం' లో భాగంగా స్త్రీని బానిసగా చూడకూడదనీ, కుటుంబ సంబంధాలలో స్త్రీని సమాన భాగస్వామిగా చూడాలనీ, కుటుంబంలో భార్యగా తన హక్కును పూర్తిగా అమలు పరుచుకునే అధికారం ఉండాలనీ, పెళ్ళైన తరువాత కూడా సభలకు వెళ్ళటం పురుషులతో కలిసి కూర్చోవటం చేస్తానని చెబుతుంది. ఆమె వెనకాల ఉన్న ఆస్తిపై కన్నువేసి కట్నం అక్కర లేదంటూనే పెళ్ళి చేసుకున్నాడనీ ఆ తరువాత ఆమెకు అర్థం అవుతుంది. కథా సందర్భంలో భాగంగా కృష్ణవేణి తల్లి చేత 'బి.ఏ. చదివిన భార్య భర్తను పూజిస్తూ గౌరవించటం, బి.ఏ. చదివిన భర్త భార్యను మోసం చెయ్యటమా" అని పలికించటం శ్రీపాద వారికున్న జండర్ స్పృహకు నిదర్శనం కథలో "మొగుడులేని ఆడది ఎలా బ్రతుకుతుందంటే, ఆడదిలేని మొగుడు మాత్రం ఎలా బ్రతుకుతాడని ప్రశ్నించటం జరుగుతుంది. భర్త అధికారంతో ఆంక్షలు పెట్టాలనుకునే సరికి ఆమె ఆ అధికార సంస్కృతిని అణచివేతను నిరసించే విధంగా "హిందూ లాలో విడాకుల శిక్షాస్మృతి లేకపోయినా తాను మరో మొగవాడిని వరించటానికి లక్ష మార్గాలున్నాయని చెప్పి "పురుషాధిక్య కుటుంబ చట్రం నుండి విముక్తిని కోరుకోవటంగా అతనితోడి కుటుంబాన్ని వదిలిపెట్టి వెళ్ళిపోతుంది. సమాజంలో మళ్ళీ పెళ్ళి చేసుకోవటానికి మగవాళ్ళకు అవకాశాలున్నట్టే ఆడవాళ్ళకు మళ్ళీ పెళ్ళి చేసుకోవటానికి లక్షమార్గాలున్నాయని చెప్పటం జండర్ స్పృహయే.

చలం తన రచనలలో స్త్రీలస్వేచ్ఛాచైతన్యాలకు పెద్దపీట వేసాడు. చలం రచనలలోని స్త్రీలలో లైంగికస్వేచ్ఛను అనుభవించాలనుకొనే చైతన్యం కనబడుతుంది. అయితే ఆర్థికస్వాతంత్ర్యంలేని స్త్రీలలో ఆ చైతన్యానికి విలువకట్టటం కష్టం. "స్త్రీలకు శరీరం ఉంది, దానికి వ్యాయామం కావాలి, స్త్రీలకు మెదడు ఉంది, దానికి జ్ఞానం కావాలి, స్త్రీలకు హృదయం ఉంది, దానికి స్పందనలుంటా"

యనే చలం కథలలో మహిళల లైంగికత మీద, జీవితం మీద పురుషుల పెత్తనాలను ఎత్తిచూపుతూ కుటుంబాలలో భర్తల పెత్తనపు రూపంలో ఉన్న సంస్కృతి స్త్రీల చైతన్యానికి అడ్డుగోడగా ఉందని చెప్పటం జరిగింది. స్త్రీల లైంగికత్వాన్ని, మాతృత్వాన్ని శ్రమను నియంత్రించటం జరిగిందనీ, మునుపటి సమాజాలలో స్త్రీ-పురుషులు జతకూడి ఉండే వ్యవస్థలో ఉన్న స్వేచ్ఛ స్త్రీకి ఉంటే తప్ప, ఆమెపై భర్త నియంత్రణ తగ్గదనీ భావించటం చేత స్త్రీలకు లైంగిక స్వేచ్ఛ కావాలనీ చెప్పటం జరిగింది. కాని ఆర్థికస్వాతంత్రం లేని మహిళ ఆ స్వేచ్ఛను పొందటంలో వైఫల్యం చెందక తప్పదు. చలం రాసిన 'మైదానం' నవలలో రాజేశ్వరి పాత్ర భర్త అధికారం క్రింద యిమడటం ఇష్టంలేకగాని, తనతో గడపటానికి భర్తకు తీరికలేనితనంగాని, వయోతారతమ్యభేదంవంటి కారణాలతో రాజేశ్వరి కుటుంబానికి దూరంగా వెళ్ళి, లైంగిక స్వేచ్ఛను అనుభవిస్తూ జీవితాన్ని గడపాలనుకోవటం చలంనాటికి అది విస్మయపరిణామముగా అనిపించినా నేటికి అది ఆచరణలో ఉంటూనే వున్నది.

అలాగే పానుగంటి లక్ష్మీ నరసింహారావు తన 'సాక్షి' వ్యాసాలలో స్త్రీలకు అవసరమైన స్వాతంత్ర్యంగురించి రాస్తూ దానికై స్త్రీలు తెచ్చుకోవాల్సిన చైతన్యాన్ని తెలియజేసాడు.

2.2. జాతీయోద్యమకాలంనాటి స్త్రీల సాహిత్యం – స్త్రీలహక్కుల చైతన్యం

భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందటానికై సంఘసంస్కరణలరూపంలో జాతీయోద్యమం ప్రారంభమైంది. దేశంలోని మూఢాచారాలు, మహిళా సంస్కృతి బ్రిటిష్ వారి అవహేళనకు గురికావటంతో సంఘసంస్కరణ అవసరమైంది. ఆంధ్రదేశంలో కందుకూరి వీరేశలింగంవంటివారు సాంఘిక మూఢాచారాలను, కులవివక్షను నిర్మూలించటమేకాక స్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యం ఉండాలని భావించారు. స్వాతంత్ర్యం అంటే బాధ్యతాయుతంగా స్వేచ్ఛను అనుభవించగలస్థితి. ఆ స్వేచ్ఛ స్త్రీలకు సాధికారికతను కలిగిస్తుంది. ఆ సాధికారికత వారికున్న హక్కులచైతన్యాన్ని బట్టి ఉంటుంది. అందరితోపాటు సమానమైన గౌరవప్రదమైన జీవన సాధికారికతను కలిగి ఉండాలనుకొనే మానవులయొక్క ఆలోచనల క్రమంలోనే హక్కులచైతన్యం ఉద్భవిస్తుంది. చైతన్యం అంటే హక్కుల స్పృహనుకలిగి ఉండటం. హక్కు అనేది ప్రతి వ్యక్తికి బాధ్యతాయుతమైన సాధికారికతను యివ్వగలుగుతుంది. అప్పుడే సమాజంలో వ్యక్తులు స్వతంత్రంగా స్వేచ్ఛగా జీవించగలుగుతారు. అటువంటి చైతన్యంతోనే స్త్రీలు తమజీవితాలను తీర్చిదిద్దుకోగల హక్కుల వినియోగార్హతతో నిర్ణయాత్మకశక్తిని గలిగిన స్వేచ్ఛను వారు పొందగలుగుతారు. అందుకే స్త్రీలు తమ వ్యక్తిస్వాతంత్ర్యం కోసం హక్కులచైతన్యం తెచ్చుకొన్నారు. భారతదేశ స్వాతంత్ర్యానికై చేసిన పోరాటంలో భారతీయులు తమకు జాతీయహక్కులు కావాలని బ్రిటిష్ వారిని చట్టాలను చేయవలసిందని అడిగినట్టుగానే,

సమాంతరంగా స్త్రీలు తమ వ్యక్తిస్వాతంత్ర్యంకోసం జీవనహక్కులు కావాలని, దానికై చట్టాలుచేయాలని ఆకాంక్షించి, స్త్రీలు ఉద్యమంలో భాగంగా సాహిత్యాన్ని సాధనంగా చేసుకొన్నారు. ఆ సాహిత్యమే ప్రత్యేకంగా చెప్పుకోదగిన స్త్రీలసాహిత్యం.

స్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యం ఉండటమంటే స్త్రీలు పురుషులతోపాటు సమానంగా సాంఘిక, ఆర్థిక, రాజకీయహక్కులను కలిగిఉండటం. చట్టాలద్వారా ఆ హక్కులకు రక్షణ ఉంటుంది. స్వాతంత్ర్యసాధన నాటికే స్త్రీలలో హక్కుల చైతన్యం అభివృద్ధిచెందిందని ఆనాడు స్త్రీలు రాసిన సాహిత్యంలో ప్రతిఫలించింది. స్త్రీలలో హక్కుల చైతన్యం కలిగించటానికై హిందూసుందరి, అనసూయ, సావిత్రి, స్త్రీధర్మ పత్రిక, ఆంధ్రపత్రిక, గృహలక్ష్మి వంటి పత్రికలలో ప్రచురింపబడిన ఆనాటి స్త్రీలసాహిత్యం సమాజంలో తోటిస్త్రీలను చైతన్యపరచటానికి కృషిచేసింది. స్వాతంత్ర్యానికి పూర్వమే తోటిస్త్రీలు వ్యక్తిస్వాతంత్ర్యాన్ని పొందటానికి తగిన చైతన్యవంతులు అవటానికి స్త్రీలు అనంత సాహిత్యాన్ని సృజించారు. సాంఘికసమానత్వం గల మానవహక్కులు స్త్రీలందరికీ ఉండాలనుకోవటాన్ని ఈ స్త్రీలసాహిత్యం ప్రతిఫలింపజేసింది.

స్త్రీలందరిలో హక్కులచైతన్యం కలిగించటం కోసమే 20 శతాబ్దం ప్రారంభంనుండి స్త్రీలసాహిత్యసృజన జరిగింది. అందుకే ఈ స్త్రీలసాహిత్యం సామాజిక వాస్తవచైతన్యాలలోనుండి పుట్టింది. స్త్రీలలో ఈ హక్కుల చైతన్యం కలగటానికి కారణం వారు తమ అస్వతంత్రతనుండి విముక్తులు కావాలనుకోవటమే. అందుకే దేశస్వాతంత్ర్యానికి మునుపే స్త్రీలు గృహబానిసత్వంనుండి విముక్తులు కావాలనుకున్నారు. దేశానికి దాస్యవిముక్తితో పాటు గృహబానిసత్వంనుండి స్త్రీలు విముక్తులుకావాలని ఆకాంక్షించారు. 'స్వాతంత్ర్యం తమ జన్మహక్కు' అని స్త్రీలు భావించారు.

సమాజంలో స్త్రీలు పురుషులతో సమానంగా జీవించగల హక్కును పొందటంకోసం స్త్రీలకు స్వతంత్రజీవనం ఉండాలనుకొన్నారు. ఆ క్రమంలోనే ముందుగా స్త్రీలు విద్యావంతులు కావాల్సిన అవసరాన్ని గుర్తించారు. అయితే ఆధునికయుగంలో అంటే 20 శతాబ్దపు ప్రారంభంలో స్త్రీవిద్యను అంతగా ఆమోదించే కుటుంబాలు తక్కువ. బాల్యవివాహాలసంస్కృతి ఉండేది. అందుకని స్త్రీలు పెళ్ళికి మునుపు చదువుకున్న తమ ప్రాథమికవిద్యను అభివృద్ధిచేసుకుంటూ తోటిస్త్రీలుకూడా విద్యావంతులుకాగల చైతన్యాన్ని కలిగించారు. దానికై 1902 నుండి స్త్రీసమాజాలను ఏర్పాటుచేసుకొని స్త్రీవిద్యకు ఉన్న ప్రాధాన్యతను తమ ఉపన్యాసాలద్వారా ప్రచారంచేసారు. స్త్రీలు తాముకూడా స్వతంత్రంగా బతకాలంటే తమకు విద్యఉండాలని భావించారు. కాస్తచదువుతోనే పత్రికాపఠనం చేయటం, విదేశీపరిజ్ఞానాన్ని తెలుసుకోవటం మొదలుపెట్టి తమకు విద్యాహక్కు ఉండాలని భావించారు. ఉన్నతవిద్యను, వృత్తివిద్యలను అభ్యసించాలనుకొన్నారు. తమ విద్యకు ఆటంకప్రాయమైన

స్త్రీపురుష అసమానసంస్కృతిని గుర్తించి తాముకూడా పురుషులతో సమానులే అన్న చైతన్యంతో సమానత్వ హక్కులు ఉండాలని ఆలోచనలుచేసారు. అయితే ప్రభుత్వాలు ప్రజలహక్కులకు చట్టభద్రతను కలిపించాలి. అప్పుడే అవి సక్రమంగా వినియోగింపబడతాయి. అందుకే ఆనాటి స్త్రీలు తమ వ్యక్తిస్వాతంత్ర్యతకై అవసరమైన హక్కుల సాధనకై చట్టాలుచేయాలని కోరుకుంటూ స్త్రీలు వ్యక్తిగతంగాను, స్త్రీసంఘాలద్వారాను తమ అభిప్రాయాలను నాటి బ్రిటిష్ ప్రభుత్వానికి తెలియజేసారు. ఆ అభిప్రాయాలను అందరి స్త్రీలతో పంచుకుంటూ వారు రాసిన అనేక వ్యాసాలు, కథలు నాటి స్త్రీలసాహిత్యంలో చోటుచేసుకొన్నాయి. ఆ హక్కులసాధన, వాటిచారిత్రక విలువలను నేటికీ తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

స్త్రీలు విద్యను పొందటం తమ జన్మహక్కుగా భావించారు. హక్కులకు సంబంధించిన చైతన్యం స్త్రీలను అభివృద్ధిమార్గంలో నడిపించగలుగుతుంది అనేది నిర్వివాదాంశం.

నూలు సత్యవతమ్మ 'స్త్రీవిద్య' (ఫిబ్రవరి–మార్చి 1905 హిందూసుందరి) ను గురించి రాస్తూ ప్రస్తుతం మనదేశాన్ని పరిపాలించే ఇంగ్లాండ్ దేశప్రభుత్వం భారతదేశంలో స్త్రీలు తప్పక చదవుకునేటట్టు చట్టాలు చేయాలని తెలిపింది.

పెనుగొండ తాలూకాలోని కొత్తచెర్వులో జరిగిన 'సంఘసంస్కరణ' సభలో కమ్మచిన్నారప్ప వెంకమ్మ స్త్రీ పురుషులను సంబోధిస్తూ 'స్త్రీ విద్య'ను (మార్చి 1911 హిందూసుందరి) గురించి చేసిన ఉపన్యాసంలో భాగంగా స్త్రీలకు విద్యలేనందువల్ల కలిగే మూఢత్వానికి ప్రతీకారం ఆలోచించలేక పోతున్నారనీ, భండారు అచ్చమాంబ, పులుగుర్త లక్ష్మీనరసమాంబ విద్యావంతులుగా ప్రశస్తి పొంది ఉన్నారనీ, విద్యాదేవత సరస్వతి కాబట్టి, పురుషులకంటే స్త్రీలకే చదువుకునే హక్కు ఎక్కువగా ఉందని చెప్పింది. స్త్రీల విద్యాహక్కును ప్రతిపాదించటం జరిగింది. స్త్రీలు తమ విద్యాహక్కుల చైతన్యాన్ని పొందటమే స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్య సాధనకై చేరుకొనే మార్గంగా భావించాలి.

స్త్రీలు తమహక్కులను సామూహికత్వంలో సాధించుకోగలుగుతామని భావించి స్త్రీలమధ్య ఐకమత్యాన్ని పెంపొందించుకోవటానికి స్త్రీసమాజాలను ఏర్పాటుచేసుకొని, స్త్రీవిద్యాఉద్యమాన్ని ఉపన్యాసాలద్వారా ప్రచారంచేసుకొన్నారు. స్త్రీసమాజాలు స్త్రీలమధ్య ఐకమత్యానికి దారి చూపించాయి. ఐకమత్యంతో స్త్రీలు తమ హక్కులసాధనకై స్త్రీలందరూ చైతన్యవంతులు కావటానికే అనంతమైన స్త్రీలసాహిత్యం రచింపబడింది. అప్పుడు ఉన్న ప్రభుత్వం బిల్లులనుపెట్టి చట్టాలరూపంలో స్త్రీలకు హక్కులు ఏర్పడాలని భావించారు. పత్రికారంగంలోకి ప్రవేశించి వ్యాసాలు రాసారు తమకు మానవహక్కులు ఉండాలనుకొన్నారు. ఆ మానవహక్కులను పొందాలంటే తామెందుకు పురుషులతో సమానంగాలేరనే ఆలోచనలను పెంచుకునే క్రమంలో స్త్రీలు తమకు పురుషులతోపాటు సమానమైన ఆర్థిక హక్కులు ఉండాలనుకొని 1904 సం.లోనే తమకు వారసత్వపు ఆస్తి హక్కు ఉండాలనుకొన్నారు.

పురుషులకువలె స్త్రీలకు విద్య, ఆస్తిహక్కు ఉండాలని 1904 సం. లోనే కళ్ళేపల్లి వెంకట రమణమ్మ వ్యాసాన్ని రాసింది.

కళ్ళేపల్లె వెంకటరమణమ్మ చేసిన ఉపన్యాసం 'మహిళా మనోరమ' (1904 ఫిబ్రవరి సావిత్రి) అనే శీర్షికాప్రచురణలో దేశంలోని స్త్రీల హీనస్థితికి పురుషులే కారణం అనీ, స్త్రీ, పురుషుల స్వాతంత్ర్యంలో తేడా ఉండకూడదనీ, 'నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అనేది పురుషుడు కల్పించినదనీ, స్త్రీధనాన్ని ఎగవేస్తున్నారనీ, స్త్రీలకు ఆస్తిహక్కులేదనీ, స్త్రీలు విద్యావంతులయితే తప్ప స్త్రీలకు స్వాతంత్ర్యం ఉండదని చెప్పటం జరిగింది.

స్త్రీలయొక్క ఆస్తిహక్కును గురించి ఆలోచన చేయటమే స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్యానికై వేసిన మలి అడుగు. పురుషాధిక్యతను విమర్శకుపెట్టటమేకాక, స్త్రీవిద్యకు స్త్రీల స్వాతంత్ర్యానికి ఉన్న సంబంధాన్ని కళ్ళేపల్లె వెంకటరమణమ్మ తోటి స్త్రీలు గ్రహించ గలిగేటట్లు వ్రాసింది.

స్త్రీవిద్యకు ఆటంకప్రాయమైన బాల్యవివాహసంస్కృతిని రద్దుచేసే చట్టాలువస్తే తప్ప తమ విద్యాహక్కుకు భద్రత లేదనుకొనే చైతన్యం తెచ్చుకొన్నారు. 1905 సం.లో మోటుపల్లి రామాబాయమ్మ బాల్యవివాహాలను ఆపుచేసే చట్టాలు రావాలని, తమ శరీరాలమీద తమకే హక్కు ఉండే విధంగా వితంతు కేశఖండనాన్ని శిక్షించే చట్టం రావాలని ఆశించారు.

'వితంతుకేశఖండనాన్ని' (అక్టోబర్–నవంబరు 1905 హిందూ సుందరి) గురించి ఈమె వ్రాసిన వ్యాసంలో బ్రాహ్మణ కుటుంబములో ఉండే వితంతువుల ఆచారాన్ని దుయ్యబడుతూ బాల్యవివాహాలను అరికట్టాలనీ, వేదకాలంలో ఇటువంటి ఆచారాలు లేవనీ, మహమ్మదీయ కాలంలో ఆరంభించబడినవని తెలిపింది. స్త్రీల కామోద్రేకాన్ని అణచటానికి పెట్టినట్టుగా చెప్తూ ఆచారాన్ని సమాజంలోని పురుషులే పెట్టారనీ, బాల్యవివాహాలను చట్టబద్ధంగా ఆపుచేయాలనీ, వితంతు కేశఖండనాన్ని కూడా శిక్షించే చట్టాలు రావాలని మోటుపల్లి రామాబాయమ్మ తెలియజేసింది.

1910 సం.లోనే స్త్రీలకు ఓటు హక్కు ఉండాలనే బ్రిటిష్ స్త్రీలయొక్క పోరాటాన్ని స్త్రీలు ఆకళింపుచేసుకొన్న విషయం స్త్రీలు నిర్వహించిన 'హిందూసుందరి' పత్రికా సంపాదకీయంలో ఉంది.

'స్త్రీలకు వోట్లు' (ఆగష్టు 1910 హిందూసుందరి) అనే పత్రికా సంపాదకురాలి ప్రచురణలో దేశదేశాలలో స్త్రీలకు 'వోట్లు' అనే నినాదాలు మ్రోగుతున్నాయనీ, ప్రజాప్రతినిధులను ఎన్నుకొనే హక్కుకోసం స్త్రీసంఘాలు స్థాపించుకున్నారని తెలిపింది. ఆస్ట్రేలియా, కొలరెడోలో, న్యూజిలాండు దేశాలలో వలె తమకు ఓటుహక్కు కావాలనీ ఇంగ్లాండులోని స్త్రీలు ఓటు హక్కుకై ఉపన్యాసాలిస్తున్నారని తెలియజేసింది.

బాల్యవివాహాలు, బహుభార్యాత్వపు సంస్కృతి వల్ల వైవాహికవ్యవస్థలో తమకు జీవనభద్రత లేదని భావించారు. పురుషుడు పెళ్ళిళ్ళమీద పెళ్ళిళ్ళుచేసుకుంటే 1912 సం. నాటికే విడాకులు తీసుకునే హక్కు ఉండాలనుకున్న విషయం అర్థమౌతుంది.

కళ్ళేపల్లి వెంకటరమణమ్మ 'స్త్రీవిద్యకు భంగకరమగు వైవాహికధర్మములు, వానిని తొలగించునుపాయములు' (మే 1912 హిందూసుందరి) అనే వ్యాసంలో ప్రస్తుతం పురుషులు నీతిబాహ్యములగు స్వాతంత్ర్యాన్ని కలిగి ఉండటం చేతనే బాల్యవివాహాలు చేస్తున్నారనీ, భర్త ఎంతమంది భార్యలు లేదా స్త్రీలతో గడిపినా అతన్ని సహించి సేవకురాలిగా భార్య పడుండాలనే భావన అసహ్యమని చెప్పింది. భర్తచనిపోతే భార్య అతనికోసం బ్రహ్మచర్యంతో గడపటం అన్యాయమనీ, అదే వివాహధర్మానికి అడ్డంకి అని చెప్పి స్త్రీలను మూర్ఖురాండ్రుగా చేయటంచేతనే స్త్రీ విద్యాభ్యుదయానికి ఆటంకం కలుగుతోందనీ, రజస్వలానంతర వివాహాలకై ఉద్యమాలు చేయాల్సి ఉందనీ, బాల్యవివాహాలను రూపుమాపి దేశాభ్యుదయానికి కృషిచేయాలని భావించింది. బాల్యవివాహాలను రూపుమాపాలనీ, స్త్రీలకు మైనారిటీ తీరువరకు గర్భాదానం కూడదనియు, సంరక్షకులు చేసిన వివాహములు రద్దుచేసుకొనేటట్లుగా యువతులకు స్వాతంత్ర్యం ఇప్పించే విధంగా బిల్లులు ప్రవేశపెట్టాలని కూడా తెలియజేసింది.

స్త్రీలు విద్యావంతులవుతున్న క్రమంలోనే 1912 సం.లో వ్యభిచారవృత్తి నిషేధంకోసం శిక్షాస్మృతిలోని సెక్షను 372, 373 'స్త్రీలను, బాలికలను రక్షించుట' (అక్టోబరు 1912 హిందూసుందరి) అనే పత్రికా సంపాదకురాలి ప్రచురణలో బాలికలను, స్త్రీలను అవినీతినుండి కాపాడటానికి నౌరోజీ బిల్లును ప్రవేశపెడుతున్నారని తెలిపింది. 16 సంవత్సరాలు తక్కువ వయస్సుగల బాలికలను రక్షించాలనీ, ఇండియాలో వ్యభిచార వృత్తిని నాశనం చేయాలనీ 1869 సం. నుండి ఉత్తరప్రత్యుత్తరాలు 30 సంవత్సరాలుగా జరుపుతున్నా విషయం పరిష్కరింప బడలేదని చెప్పింది. దేశంలో విద్యాభివృద్ధి జరుగుతున్న కొలది స్త్రీలను రక్షించే విషయాలను ఆలోచించి 372-373 సెక్షన్‌లు సవరించాలని చేసిన విన్నపం 1911 సంవత్సరంలో కాస్త ముందడుగును వేయించిందని తెలియజేసింది. అంతేకాక, ఇదివరకు ప్రభుత్వం శిశుహత్య, నరబలులు, సహగమనాన్ని మాన్పించగలిగారనీ, ప్రభుత్వం ఆలోచిస్తే వ్యభిచార గృహాలను నిర్మూలించగలరనీ, అటువంటి బాలికలకు రక్షణశాలను ఏర్పరచాలనీ, స్త్రీలను దేవాలయాలకు సమర్పించటం కూడా శాస్త్రవిరుద్ధమనీ, ఈ బిల్లువల్ల స్త్రీలను కాపాడవచ్చని భావించినట్టు పత్రిక తెలియజేసింది.

స్త్రీలను వ్యభిచార కూపాలనుండి కాపాడటం కూడా దేశాభివృద్ధి కార్యక్రమంలో భాగమని దానికై బిల్లును ప్రవేశపెట్టాలనే 'ఆకాంక్ష'ను రేకెత్తించిన వ్యాసమిది. స్త్రీలను లైంగికపీడను గురిచేసే

వేశ్యావృత్తియొక్క నిషేధం గురించి ఆలోచించి, అది స్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యం లేకుండాచేస్తున్నదనీ, స్త్రీల లైంగికతపై ఉన్న పితృస్వామ్యపు హక్కును నిరసించటంగా భావించాలి.

స్త్రీలు హక్కులను పొందాలంటే చట్టాలు అవసరమనీ, దానికోసం తాము చట్టాలనిర్మాణంలో భాగస్వాములు అవ్వాలంటే తమకు రాజకీయ హక్కులు ఉండాలనుకొన్నారు. ఆ విధంగా స్త్రీలకు ఆర్థిక, సాంఘిక, రాజకీయ హక్కులు ఉంటేనే స్వతంత్రజీవనం ఉంటుందనే చైతన్యం తెచ్చుకున్నారు. స్త్రీల అభివృద్ధికోసం చట్టపరమైన హక్కులు కావాలంటే తాము శాసనసభలలోకి ప్రవేశించాలనుకొన్నారు. భారతదేశ చట్టం, 1919 ప్రకారం ముస్లిములకు ప్రత్యేక నియోజకవర్గ స్వాతంత్ర్యం ఉన్నట్లే, స్త్రీలకు ప్రత్యేకనియోజకాలు ఉన్నప్పుడే స్త్రీలు రాజకీయహక్కులను పొందగలుగుతారని భావించారు. 1919 సం.లో తమకు ప్రత్యేక నియోజకస్వాతంత్ర్యం ఉండాలని జరుగుమిల్లి రామాబాయమ్మ వ్యాసాన్ని రాసింది.

జరుగుమిల్లి రామాబాయమ్మ వ్రాసిన 'స్త్రీనియోజక స్వాతంత్ర్యము' (జులై 1919 అనసూయ) అనే వ్యాసంలో సౌతుంబరో విచారణ సంఘంవారు భారతాంగనలకు నియోజకవర్గ స్వాతంత్ర్యమును వినియోగించుకునే అర్హత లేదని ఇచ్చిన నివేదికను రాజదాససతీ, అనిబిసెంటు, సర్ నారాయణ సావర్కరు వ్యతిరేకించారనీ. భారతాంగనలకు నియోజకవర్గ స్వాతంత్ర్యం ఉండాలని తెలిపింది. స్త్రీలు రాజకీయ విద్యను నేర్చుకోవాలనీ, ప్రపంచంలో జరిగే ప్రతివిషయంపట్ల అవగాహన పెంచుకోవాలనీ, అమెరికా, ఫ్రాన్స్, ఐరోపా దేశాలలో స్త్రీలు పార్లమెంట్ సభ్యులుగా ఉన్నారనీ, అలా భారతాంగనలు రాజకీయోద్యోగాలలో ఉండాలంటే భారత స్త్రీలకు ప్రత్యేక నియోజకవర్గ స్వాతంత్రం ఉండాలని పేర్కొన్నది. దానికి అవసరమైన విద్యావంతులైన స్త్రీలు భారతదేశంలో ఉన్నారనీ, సరోజనిదేవీ బ్రిటిష్ సభకు తెలియజేసిందనీ, అనిబిసెంటు స్త్రీలకు జాతీయ ప్రబోధం చేస్తున్నారని రచయిత తెలియజేసింది.

స్త్రీలు తమ రాజకీయ హక్కులను ఒడిసి పట్టుకోవాల్సిన అవసరాన్ని తెలియజేయటం జరిగింది. 1919, చట్టం ముస్లింలకు సభలలో ప్రాతినిధ్యం వహించటానికి ప్రత్యేక నియోజపు వర్గం కేటాయించినట్లుగానే, కేంద్ర రాష్ట్రశాసన సభలలో స్త్రీలు కూడాప్రాతినిధ్యం వహించగల సభ్యులుగా ఉండాలనే అలోచనలతో స్త్రీలకు కూడా ప్రత్యేక నియోకవర్గ స్వాతంత్ర్యం కావాలని భావించారు. స్త్రీలలో తమ హక్కుల సాధనకై రాజకీయస్వాతంత్ర్యం పొందాలనే చైతన్యం కలగటమే, స్త్రీవ్యక్తి స్వాతంత్ర్యసాధనలో చేరుకొనే ఉన్నతమైన మెట్టుగా భావించాలి.

'మద్రాసు కార్పొరేషన్ వారి తీర్మానాలను' (స్త్రీధర్మపత్రిక, ఏప్రిల్ 1924) పత్రికాధిపురాలు ప్రచురిస్తూ ఏడేళ్ళ వయసులోపల ఉన్న బాలబాలికలకు నిర్బంధవిద్య ఉండాలనీ, స్త్రీలు శిశు

పోషణ చేసేవారు, గ్రామారోగ్యాన్ని కాపాడేవారు స్త్రీలే కాబట్టి మహిళాఉద్యమఫలితంగా మద్రాసు పౌరసభ బాలికలకు నిర్బంధవిద్యను చట్టంగా చేసిందని తెలిపింది. శాసనసభలకు ఎన్నికకాబడే అధికారం స్త్రీలకు ఉండాలనీ, స్త్రీపురుషులకు సమాన పౌరసత్వం ఉండాలనీ, స్త్రీపురుషులకు సమానమైన సాంఘిక, రాజకీయ, నైతికసమానత్వ సాధనకై 'సర్వదేశీయశాంతి' అనే స్వాతంత్రసమితి ఏర్పాటయినదని పేర్కొంది.

సమర్థి స్వర్ణమ్మ 'నిర్బంధవిద్య' ను (స్త్రీధర్మపత్రిక, డిశెంబరు 1924) గురించి వ్రాస్తూ బాలికలకు విద్య సర్వార్థసిద్ధినిచ్చు కల్పవృక్షమనీ, కామధేనువనీ, దానిని కులాచారంచేయాలనీ, స్త్రీలపురోభివృద్ధికై స్త్రీలకు ఎన్నికల అధికారం యివ్వాలని రాసింది.

1924 సం.లో మహిళా ఉద్యమ ఫలితంగా మద్రాసు పౌరసభ బాలికలకు నిర్బంధవిద్యను చట్టంగా చేసిందని స్త్రీధర్మ పత్రిక తెలియజేసింది.

1924 లో వి.పద్మ తన వ్యాసంలో విద్య ప్రతిమానవునికి సర్వసామాన్యమైన హక్కు అని తెలియజేసింది.

వి.పద్మ 'స్త్రీవిద్య' (స్త్రీధర్మ, డిశెంబరు1924) ను గురించి వ్రాస్తూ స్త్రీలు విద్యను సేకరించటానికి మార్గాలను సూచిస్తూ సత్సాంగత్యం, సద్గ్రథపఠనం, దేశసంచారం అవసరమనీ, ప్రతిమానవులకు విద్యను అభ్యసించుట సర్వసామాన్యమైన హక్కు అని తెలిపింది.

1924 సం.లోనే స్త్రీధర్మపత్రిక శాసనసభలలో పురుషులకుమాత్రమే ఎన్నికల అధికారం యిచ్చారనీ, దానికై స్త్రీలు పోరాడాలనీ, స్త్రీలకు సమానమైన రాజకీయసాంఘిక చట్టాలు ఉండాలని పేర్కొన్నది.

'వృత్తాంతం' అనే శీర్షికన, (స్త్రీధర్మపత్రిక మే 1924) పత్రికాధిపులు వ్రాస్తూ శాసనసభలలో పురుషులకు మాత్రమే ఎన్నికల అధికారాన్ని యిచ్చారనీ, దానికై స్త్రీలు పోరాడాలనీ, సమావేశాలను ఏర్పాటుచేసుకొని స్త్రీపురుషభేదం పోగొట్టాలనీ, జాతిభేదం ఉండకూడదని తెలిపింది. నిర్బంధవైధవ్యపద్ధతిని ఆపాలనీ, స్త్రీలకు సమానమైన రాజకీయ, సాంఘికచట్టాలు ఉండాలనీ, స్వరాజ్యంకోసం స్త్రీలను భాగస్వాములను చేస్తున్నారుగాని వారికి స్వాతంత్ర్యం ఉండకూడదనటం అన్యాయమని తెలియజేసింది.

1925 సం.లోనే పులవర్తి కమలావతిదేవి భారతీయుల స్వరాజ్యానికై ఉన్న నిర్దిష్టమైన జాతీయ మానవహక్కుల అర్థాన్ని స్త్రీలందరూ అవగాహన చేసుకొని స్వాతంత్ర్య ప్రచారానికి పూనుకోవాలని స్పష్టంచేసింది. 1919, చట్టాన్ని బాగా అర్థంచేసుకొని భారతీయుల స్వరాజ్యపు కోసం పట్టుబట్టాల్సిన అవసరాన్ని గ్రహించేటట్లు చేసింది.

పులవర్తి కమలావతిదేవి వ్రాసిన 'స్వరాజ్య సంపాదన యందు స్త్రీల విద్యుక్త ధర్మం' (ఆంధ్రపత్రిక వార్షిక సంచిక మార్చి1925) అనే వ్యాసంలో 'స్వరాజ్యమం'టే ఏమిటో స్త్రీలే తెలుసుకోవాలనీ, పాలన నచ్చకపోతే వ్యతిరేకంగా తీర్మానాలు చేసినా రాజద్రోహం కాదనీ, దానికి స్వరాజ్యం అవసరమని తెలిపింది. మానవహక్కులు ముఖ్యమనీ, ముఖ్యంగా భారతీయులచే ఎన్నుకోబడిన వ్యక్తికి కోశాధికారమును ఇవ్వమని అడగటమే స్వరాజ్యమనీ, ఆ స్వరాజ్యాన్ని పొందటానికి సహాయ నిరాకరణోద్యము మొదలుపెట్టారని చెప్పింది. అంతేకాదు, భారతీయులు ప్రజాప్రతినిధులుగా గల రాష్ట్రప్రభుత్వం ఉండాలనీ, ఆంగ్లప్రభుత్వం క్రిందఉన్న మనహక్కులను సంపాదించుకుంటే దేశాన్ని ఎలా పరిపాలించుకోవాలో చెప్పుకోవచ్చనీ, పైఅధికారం బ్రిటిష్ ప్రధాని చేతిలో ఉన్నా కూడా భారతదేశంలోని ప్రజలకు మంత్రులు నచ్చకపోయినా, ఆర్థికమంత్రి సరిగ్గా లేకపోయినా వారిని తొలగించుకునే అధికారం భారత ప్రజలకు ఉండటమే 'స్వరాజ్య' సంపాదన అని చెప్పింది.

1926 సం.లో విద్యాకమిషన్ లోను, స్టాండిగ్ కమిటీలలోను స్త్రీపురుషులకు సమానహక్కులు ఉండాలని స్త్రీధర్మపత్రిక తెలియజేసింది.

'స్త్రీవిద్య – వెంటనే చేయవలసిన పని' (స్త్రీధర్మపత్రిక, జూన్1926) అనే శీర్షికన శ్రీమతి ఎ.ఎల్ హైడికోపర్ వ్రాస్తూ 'స్త్రీలకమిషన్' ను వెంటనే నియమించాలనీ, దానివలన భారతస్త్రీలకు విద్యాలాభమేకాక, స్త్రీలసమస్యలకు పరిష్కారం ఏర్పడుతుందని తెలిపింది. పాఠ్యాంశాలను, పరీక్షలను నిర్ణయించేందుకు స్త్రీలే స్టాడింగ్ కమిటీలో ఉండాలనీ, స్త్రీకార్మికులు పనిచేసేచోట శిశుపోషణాలయాలు ఉండాలనీ, స్త్రీపురుషులకు సమానహక్కులు ఉండాలని తెలియజేసింది.

ఆ తర్వాతనే స్త్రీలు మద్రాసువిశ్వవిద్యాలయంలో సెనేట్ మెంబర్లుగా నియమింపబడ్డారు. ఆ తర్వాతనే విద్యావంతులైన స్త్రీలకు ఓటింగ్ హక్కు వచ్చింది. స్త్రీలు 1927సం.లో ఓటుహక్కును పొంది 1931 సం.నాటికి మున్సిపాలిటీలపాలనలో భాగస్వామ్యం వహించారు.

'అఖిలభారత స్త్రీమహాసభ' (స్త్రీధర్మపత్రిక, ఫిబ్రవరి1927) లో బరోడామహారాణి చేసిన ఉపన్యాసంలో స్త్రీలు చేస్తున్న ఉద్యమానికి పురుషులసహకారం ఉండాలనీ, అతిబాల్యవివాహాలను రూపుమాపటానికై హరిసింగ్ గౌరు గారు 16 ఏళ్ళకు తక్కువగాని వివాహవయసును నిర్ణయించే చట్టాన్ని సామ్రాజ్యశాసనసభలో చేయించారని చెప్పింది. స్త్రీలు బానిసలుగా ఉంటే మనుష్యులు స్వాతంత్ర్యాన్ని పొందలేరనీ, దేశం అభివృద్ధి చెందాలంటే స్త్రీలు, పురుషులు సమానమైన రాజకీయ, సాంఘిక, ఆర్థికస్వాతంత్ర్యాలను పొందాలని తెలిపింది. దేశపరిస్థితులకు అనుగుణమైన వృత్తి విద్యలను స్త్రీలకు అందించాలనీ, స్త్రీలు తమ భర్తల ఆస్తులలో భాగస్వాములుగా అయ్యే శాసనాలను తేవాలనీ, బాలబాలికలకు నిర్బంధప్రారంభవిద్య ఉండాలని తీర్మానంచేయాలని తెలియజేసింది.

అవిభక్త కుటుంబాలలో భర్త మరణానంతరం భార్యకు భరణమిచ్చే ఆచారాన్ని రద్దుచేసి, భర్త ఆస్తిని భార్య, తత్సంతానం అనుభవించేటట్టుగా హరిశంకర్ గౌరుగారు పెట్టిన బిల్లును చట్టంచేయాలని ఆలపాటి సీతమ్మ 1929 సం.లో తన వ్యాసంలో పేర్కొంది. స్త్రీలుకూడా పురుషుల వలె శక్తినిచూపే స్వాతంత్ర్యాభిలాషతో ఉన్నారనీ, స్వాతంత్ర్యం స్త్రీలజన్మహక్కు అనీ, స్త్రీలకు గౌరవం ఇవ్వాలనీ, స్త్రీలు విద్యావంతులు అవుతున్నారు కాబట్టి వారిహక్కులు పునర్వికసితములు కావాలని ఆలపాటి సీతమ్మ పేర్కొన్నది.

ఆలపాటి సీతమ్మ వ్రాసిన 'స్త్రీల హక్కులు' తత్సంస్కరణములు' (డిసెంబరు 1929 గృహలక్ష్మి పత్రిక) అనే వ్యాసంలో స్త్రీలుకూడ పురుషులవలె శక్తిని జూపే స్వాతంత్ర్యాభిలాషతో ఉన్నారనీ, స్వాతంత్రం స్త్రీల జన్మహక్కు అనీ, స్త్రీలకు గౌరవాన్ని ఇవ్వాలనీ, స్త్రీలు విద్యావంతులు అవుతున్నారనీ, వారి హక్కులు పునర్వికసితములు కావాలని తెలిపింది. ప్రస్తుత శతాబ్దంలో హరివిలాసశారదగారు పెట్టిన బిల్లును వివాహ వయోనిర్ణయచట్టంగా తెచ్చి స్త్రీలోకానికి ఉపకారం చేశారనీ, అవిభాజ్యపు కుటుంబాలలో భర్త మరణానంతరం భార్యకు భరణమిచ్చే ఆచారాన్ని రూపుమాపే విధంగా శ్రీ హరిశంకరగారు పెట్టిన వారసత్వపు బిల్లులో భర్త ఆస్తిని భార్య, తత్సంతానం అనుభవించే విధానాన్ని చట్టం అయ్యేవిధంగా రూపొందించి సామ్రాజ్య శాసనసభలో పెడుతున్నారని తెలియజేసింది.

స్త్రీలకు ఆస్తిహక్కును యివ్వగల చట్టాన్ని రాష్ట్ర శాసనసభలలో ప్రవేశపెడుతున్నారని చెప్పి, అవి స్త్రీలకు ఎలా ఉపయోగపడతాయే తెలియజేసారు. కుటుంబంలో భర్త శాసకుడిగా ఉండే కుటుంబస్థితినుండి స్త్రీలు శాసనసభలలో తమ జీవితాలకు మార్పును కలిగించగల శాసనాలను గురించి తెలుసుకొనే స్థితికి చేరుకోవటమే స్త్రీలు వ్యక్తి స్వాతంత్ర్యోద్యమ సాధనాక్రమంలో అభివృద్ధిని సాధిస్తున్నట్లుగా అర్థమవుతుంది.

తుర్లపాటి రాజేశ్వరి 'బెజవాడలో జరిగిన ఆంధ్ర మహిళా సభలో' (డిసెంబరు1929 గృహలక్ష్మి పత్రికలో) ఇచ్చిన ఉపన్యాసంలో భర్తయొక్క ఆస్తి భార్యకు చెందటమే కాక, తండ్రి ఆస్తి కూడా కుమారులతోపాటు కూతుళ్ళకు సమానంగా ఇవ్వాలని చెప్పింది. మున్సిపాలిటీలు, లోకల్ బోర్డులలో స్త్రీలకు కొన్ని ప్రత్యేక స్థానాలు ఇవ్వాలనే చట్టం తయారు చేయబడాలని చెప్పింది.

స్త్రీలకు ఆస్తిహక్కు ఏర్పడితే స్త్రీలు దేశంకోసం పోరాడటానికి తగిన స్వేచ్ఛ ఉంటుందని భావించటం జరిగింది. ఈమె ఆలోచనయే 1985 సం.లోనూ, దాని సవరణగా 2005 లోనూ చట్టం రూపంలోకి వచ్చింది. స్త్రీల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్యమే స్త్రీలవ్యక్తి స్వాతంత్ర్యానికి, దేశస్వాతంత్ర్యానికి చిహ్నమని భావించింది.

1929 సం.లోనే స్త్రీలసంక్షేమానికి కావలసిన హక్కులకు సంబంధించిన విషయాలను ఎన్నికలకు ముందుగానే శాసనసభ్యులుగా ఎన్నిక కాబోయేవ్యక్తులకు స్పష్టంచేసిన వారి ముందుచూపు ఈనాటి స్త్రీలు గ్రహించగలగాలి. శాసనసభ్యులకు చట్టాలుచేసే అర్హత ఉంటుంది కాబట్టి, ఎన్నికలకు ముందే స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యానికి అవసరమైన చట్టాలను తేగలగటంలో ఆ అభ్యర్థుల అభిప్రాయసేకరణ చేసి మరీ ఓటును వెయ్యాలనుకొన్నారు.

'మదరాసు శాసనసభ ఎన్నికలు' (మే 1929, విద్యానంద పత్రిక) అనే శీర్షికన స్త్రీసంఘములు ఎన్నికలలో నిలబడే అభ్యర్థులకు ప్రశ్నావళిని రూపొందించి మద్రాసు ఎన్నికల సంస్థకు పంపించారు. అవి వరుసగా స్త్రీలకు ఉన్నతవిద్యాభివృద్ధికి తగిన సాధనములను సమకూర్చుతున్నారా అనీ, మాతాశిశు వైద్యశాలలను పాఠశాలలలో పిల్లలకు వైద్యతనిఖీని ఏర్పాటుచేసున్నారా అనీ, శారదాబిల్లును సమర్థిస్తున్నారా లేదా అనీ, పసికూనలను వివాహమాడే ముసలివానిని శిక్షిస్తారా లేదా అనీ, వరశుల్క దురాచారాన్ని అణగద్రొక్కుతారా లేదా అనీ, 18 ఏండ్ల వయసు గర్భాదానాన్ని అంగీకరిస్తారా లేదా అనీ, వితంతువివాహాన్ని ప్రోత్సహిస్తారా లేదా అనీ, వ్యభిచారంనుండి బాలికాసంరక్షణ, దేవదాసివ్యవస్థ నిర్మూలన, భార్యాభర్తలకు అర్హనీయ వివాహములు, భార్యకు, కుమార్తెకు పారంపర్య ఆస్తిహక్కును కూర్చగలరా లేదా అనీ, మద్యపాననిషేధం, అస్పృశ్యతానిర్మూలనం, కార్మికస్త్రీల దురవస్థను పోగొట్టే చట్టాలను కలిగిస్తారా లేదా అనీ ఎన్నికలలో కాబోయే శాసనసభ్యులయొక్క అభిప్రాయసేకరణ చెయ్యాలనుకొన్నారు.

స్త్రీలు దేశసేవ, సంఘసేవచేయాలంటే పురుషులతోపాటు స్త్రీలకు సర్వహక్కులుగల సహభాగస్వామ్యం ఉండాలని 1929 సం.లో ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ తన వ్యాసంలో పాల్గొన్నది.

ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ వ్రాసిన 'స్త్రీవిద్యావిజయధ్వజం' (ఆగష్టు 1929 గృహలక్ష్మి) అనే వ్యాసంలో దేశసేవకు, సంఘసేవకు స్త్రీ పురుషుల పరస్పర సహకారం ఉండాలనీ, స్త్రీలు వంచితులవటం వల్లనే దేశపతనం ప్రారంభమైందనీ, స్త్రీలు సర్వహక్కులు గల సహభాగస్వాములని గుర్తించాలని చెప్పింది.

స్త్రీవిద్యాభివృద్ధి జాతీయతతో ముడిపడి ఉండాలనీ, పురుషుల సహకారముంటే స్త్రీలు సంఘసేవ చేయగలరని భావించింది.

వి.సరస్వతి వ్రాసిన 'స్త్రీస్వాతంత్ర్యం' అనే వ్యాసంలో (సెప్టెంబరు 1929 గృహలక్ష్మి) మనుధర్మ శాస్త్రంలో చెప్పినట్లుగా భారతీయస్త్రీలు బానిసలుగా ఉంటే దేశానికి స్వాతంత్ర్యం ఎలా వస్తుందనీ, స్త్రీకి తన దేహంపై తనకు స్వాతంత్ర్యం లేదనీ, ఒకరికి తమ శరీరాలపై స్వాతంత్రం లేనప్పుడు, మరొకరికి దేశంపై స్వాతంత్ర్యం కావాలా అనీ, పురుషులు స్వాతంత్ర్యాన్ని పొందటానికి ముందు స్త్రీకి స్వాతంత్ర్యం ఉండేటట్లు చూడాలని నొక్కి వక్కాణించింది.

1929 సం.లో పెద్దాడ కామేశ్వరమ్మ రాసిన 'ఇది యశాస్త్రీయమా?' అనే కథలో సంతోషంగా జీవించటం స్త్రీలయొక్క మానవహక్కు అనీ, ప్రతిస్త్రీకి జీవించే హక్కు ఉంటుందనీ పురుషులు వివవక్షతతతో పెట్టిన శాస్త్ర భావాలన్నీ అశాస్త్రీయాలనీ, స్త్రీలకు పునర్వివాహపు హక్కు శాస్త్రీయమని చెప్పింది.

పెద్దాడ కామేశ్వరమ్మ వ్రాసిన 'ఇదియశాస్త్రీయమా?' (డిసెంబరు1929 గృహలక్ష్మి) అనే కథలో సంతోషంగా జీవించటం మానవహక్కుఅనీ, బాల్యవివాహానంతరం వదిలిపెట్టిన భర్త యిచ్చిన అనుమతి పత్రం ద్వారా, పురుషునివలె స్త్రీ కూడా పునర్వివాహంచేసుకొని సంతోషంగా జీవించటం స్త్రీల హక్కు అని చెప్పింది. ప్రతిస్త్రీకి జీవించే హక్కు ఉంటుందనీ, పురుషులు వివక్షతతో పెట్టిన శాస్త్రభావాలన్నీ అశాస్త్రీయాలనీ, స్త్రీ పునర్వివాహపు హక్కు అశాస్త్రీయం కాదనీ తెలిపిన కథ యిది.

రచయిత స్త్రీలకున్న పునర్వివాహహక్కు శాస్త్రీయమనీ, దానిని సాధించుకునే మార్గాన్ని సూచించి చైతన్యపరచి పితృస్వామ్యపు కుట్రను బహిర్గతం చేసిన కథ ఇది. అంతేకాదు స్త్రీలకు గౌరవప్రదంగా జీవించే మానవహక్కులు ఉన్నట్లుగా భావింపజేయటంగా ఈ కథ ఆలోచింపజేస్తుంది.

1929 వ సం.లోనే తమ జీవనహక్కుకు, మానవహక్కుకు సంబంధించిన చైతన్యం స్త్రీలలో కలగటం గుర్తింపదగినది.

1930 లో పులవర్తి కమలావతిదేవి వ్రాసిన 'విడాకుల చట్టం' అనే వ్యాసంలో (మార్చి 1930 గృహలక్ష్మి) 'చెన్నరాష్ట్ర స్త్రీ విద్యా సాంఘికసంస్కరణ' సభలో భాగంగా విడాకుల చట్టం మీద చర్చ జరిగిందని, త్రాగుబోతులు, జారులు, దుష్టులైన భర్తలతో సంసారం చేయాల్సిన అవసరం లేదని భావించారని తెలిపింది. పురుషులు ఇవ్వకపోయినా స్త్రీ కోరితే విడాకులివ్వాలని చర్చకు పెట్టారనీ, స్త్రీలకు సాంఘిక కట్టుబాట్లనుండే స్వతంత్రం కావాలనే ఆలోచనలు పెరగడంతో ఈ చర్చ జరిగిందని తెలియజేసింది.

స్త్రీల ప్రగతికి, స్వాతంత్ర్యానికి అడ్డుగా ఉన్న కుటుంబసంస్కృతినుండి విముక్తిపొంది స్త్రీలలో తాము స్వతంత్రులు కావాలనే ఆలోచనలు పెరిగాయి. స్త్రీలకు అవసరమైన వైవాహిక స్వాతంత్ర్యాన్ని పొందటానికి అవసరమైన విడాకుల చట్టం ఉండాలని తెలియచేసింది. స్త్రీ స్వాతంత్ర్యానికి, ప్రగతికి మొదటి నుండి అడ్డుగోడగా నిలిచినది ఈ వివాహసంస్కృతియే అని స్త్రీల సాహిత్యం ప్రతిఫలింపజేసింది.

1930 సం.లో కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాసిన 'స్త్రీలకు నవీనచట్టములు, వాని ప్రయోజనము' (ఏప్రిల్ 1930 ఆంధ్రపత్రిక ఉగాది సంచిక) అనే వ్యాసంలో శారదాచట్టము, వయోవివాహనిర్ణయం,

స్త్రీపునర్వివాహ చట్టములు ఏర్పడి స్త్రీలకు వైవాహిక స్వాతంత్ర్యమును ఒనగూర్చాయని తెలియచేసింది. అంతేకాక, వారసత్వచట్టంవల్ల స్త్రీలకు ఆర్థికలాభం తోడ్పడుతుందనీ, దేవదాసీల చట్టములు, వ్యభిచార నిరోధక చట్టము స్త్రీలనైతికాభివృద్ధికి సహాయం అవుతుందని చెప్పింది. చట్టసభలో, స్థానిక సంఘములో స్త్రీలకు ఇచ్చిన హక్కు స్త్రీలకు రాజకీయ స్వాతంత్ర్యాన్ని కలగజేస్తుందనీ, కాని వీటిని స్త్రీలు వినియోగించుకొనే నేర్పుకావాలనీ విద్యలేకపోవటంచేత ఆ హక్కులపై అవగాహన స్త్రీలకుండటం లేదని భావించింది. అంతేకాదు, స్త్రీలు విద్యను అభివృద్ధి చేసుకుంటే కన్యాశుల్కం, బాల్యవివాహాలు తగ్గుతాయనీ, బాలవితంతువులు ఉండాల్సిన అవసరం ఉండదనీ, స్త్రీలకు సాంఘిక నిర్భంధాన్ని విధించారనీ, ఆర్థిక హక్కు లేకుండా చేయటంతో స్త్రీలు అస్వతంత్రులుగా ఉన్నారనీ, దానికై స్త్రీలు సంఘాలుగా ఏర్పడి, సభలు జరుపుకుంటూ తీర్మానాలు చేసుకోవాలని చెప్పింది. స్త్రీలు రాజకీయాలలో కృషిచేసేలా స్త్రీసమస్యలు తీర్చుకోగలిగే చట్టాలను ప్రవేశపెట్టేస్థితికి స్త్రీలు చేరుకుంటేనే భారతదేశ పురోభివృద్ధికి, పునర్నిర్మాణానికి దోహదం కాగలుగుతుందనికూడా తెలియజేసింది.

స్త్రీలు మహిళాసభలను ఏర్పాటుచేసుకొని తీర్మానాలు చేసి శాసనసభ్యులకు పంపటం వల్ల శారదాచట్టం, హరవిలాస శారదగారివల్ల బాల్యవివాహాలను నిషేధించే శారదాచట్టం వచ్చిందని, స్త్రీపునర్వివాహచట్టం వైవాహికస్వాతంత్ర్యానికి దారులు ఏర్పడ్డాయనీ, బిల్లురూపంలో పెట్టిన వారసత్వచట్టంవల్ల స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యం వస్తుందనీ, దేవదాసీ చట్టం, వ్యభిచార నిరోధక చట్టాలవల్ల స్త్రీలఅభివృద్ధి ఉంటుందని కనుపర్తి వరలక్ష్మమ్మ పేర్కొంది.

1930 సం.లో జరిగిన నాల్గవ అఖిల భారత మహిళా మహాసభలలో శారదాచట్టం వచ్చినాకూడా ప్రౌఢవివాహాలలో భాగంగా స్త్రీలవయస్సు 14 సం.లకు కాకుండా 16 సం.లకు పురుషుల వయస్సు 21 సం.లకు పెంచి శాసనాలు చేయాలనీ, నిర్బంధ వివాహాలు ఉండకూడదనీ, బహుభార్యాతత్వాన్ని నిషేధించాలనీ, అసమాన వయో వివాహాలుచేసే తల్లిదండ్రులను శిక్షించాలని తీర్మానంచేసారని చెప్పింది. అంతేకాక, హిందూ వితంతువుకు భర్తభాగంలో ఆస్తిహక్కు మరియు దత్తతహక్కు ఉండాలనీ, బిడ్డలసంరక్షకులుగా తల్లిదండ్రులిద్దరికీ సమానాధికారాలుండాలని తీర్మానంచేసారనీ పత్రిక తెలిపింది. ఘోషా పద్ధతివల్ల స్వేచ్ఛలేక అసమర్థత పెరుగుతుంది కాబట్టి ఘోషాపద్ధతిని నిషేధించాలనీ, వేశ్యావ్యవస్థను రూపుమాపి వారిలో వివాహేచ్ఛకలిగే విధంగా ముత్తులక్ష్మి బ్రోతల్ బిల్లును పెడుతున్నారనీ, బిడ్డల చెడుప్రవర్తనకు కోర్టులో శిక్షించటం కంటె కూడా వారిలో సత్ప్రవర్తన కలిగించేందుకు ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేసి దండనాధికారాన్ని దయాళులైన స్త్రీలకే ఉండాలని తీర్మానించారు.

1931 సం.లో దర్శి అన్నపూర్ణ రాస్తూ స్త్రీలు అంతరంగమున స్వతంత్రించనిదే బహిరంగస్వేచ్ఛను అనుభవించలేరనీ, అప్పుడే సాంఘిక, రాజకీయస్వాతంత్ర్యాన్ని పొందగలరని చెప్పింది. 1932 సం.లో హరివిలాస శారదగారు హిందూవితంతువులబిల్లును, వివాహవిచ్ఛేదబిల్లును పెడితే నాటి మెజారిటీ శాసనసభ్యులు స్త్రీలు శాసనసభ్యురాండ్రయిన తరువాత బిల్లులను చర్చకుపెట్టవచ్చని భావించారు.

1932 సం.లో చిలుకూరి లక్ష్మీనరసమ్మ వ్రాసిన 'లోకల్ బోర్డులు' 'స్త్రీలు' (జులై 1932 భారతి) అనే వ్యాసంలో లోకల్ బోర్డులంటే గ్రామానికి సంబంధించిన పంచాయితీలు, తాలుకా జిల్లా బోర్డులనీ వీటిలో అల్పసంఖ్యాక వర్గములతో పాటు స్త్రీలకు కూడా ప్రత్యేక స్థానము కల్పించినప్పటికీ, పురుషులతో సమానంగా స్త్రీలు కూడా ఆ బోర్డులలో ఎన్నిక కావచ్చని తెలిపింది. స్త్రీలు జాతీయ జీవనంలోకి వచ్చి తమ హక్కులను కాపాడుకోవాలనీ రాజకీయ వాతావరణంలోని మార్పులు గమనించితేనే, దేశానికి సంఘానికి సేవ చేయగలరనీ అప్పుడే దేశంలో సంపూర్ణజీవన విధానం ఏర్పడుతుందనీ తెలిపింది. ప్రభుత్వ నిర్మితములైన లోకల్, మున్సిపాలిటీ, శాసన సభలలోనే కాక ప్రభుత్వేతర సంస్థలలోను స్త్రీలు ధైర్యసాహసాలతో సమానంగా పాల్గొంటున్నారనీ, స్త్రీలు లోకల్-బోర్డుల్లోను, మద్రాస్ లోకల్-బోర్డుల్లోనూ 1931 సం.లో కొత్త చట్టాలు తెచ్చి స్త్రీలకు అధిక సౌకర్యాలు కల్పించారని చెప్పింది. స్త్రీలకు ఓటింగ్ అధికారాన్నే గాక స్త్రీలు చట్టాన్ని ఉపయోగించుకొని లోకల్ బోర్డుల్లో స్త్రీలు మెంబరుగా కూడా ఎన్నిక కావాలనీ, స్త్రీలు ప్రభుత్వం చేత మెంబర్లుగా నియమింపబడిన దానికంటే ఎన్నికలలో నిలిచి అధికారం పొందితేనే స్త్రీలు తమ నిర్ణయాలను నిర్భయంగా ప్రభుత్వానికి తెలియజేయవచ్చని భావించింది.

లోకల్ బోర్డులలో స్త్రీలు తమరాజకీయ హక్కులను అనుభవించే దిశగా ఎదగాల్సిన అవసరాన్ని తెలియజేసింది. స్త్రీలు సంఘసేవచేయాలన్నా తమ రాజకీయహక్కులు వినియోగించుకోవాలన్నా స్త్రీలు విద్యావంతులైతేనే సక్రమంగా పరిపాలన చేయగలుగుతారని భావించింది. స్త్రీవిద్యకు, స్త్రీల రాజకీయ హక్కులకు ఉన్న సంబంధాన్ని వ్యక్తం చేయటం జరిగింది. స్త్రీల హక్కులకు స్త్రీల జాతీయజీవనానికి ఉన్న సంబంధాన్ని గుర్తించగలిగారు.

కొప్పర్తి కృష్ణవేణి ఆంధ్రరాష్ట్రము - స్త్రీలు (మే.1932 గృహలక్ష్మి) తన వ్యాసంలో స్త్రీలకు సమానహక్కులు ఉండటమే గౌరవప్రదమని, అదే నాగరికతా చిహ్నమని, స్త్రీలు తమ జన్మ హక్కును అనుభవించటానికి స్త్రీలకు వివక్షారహితమైన స్వాతంత్ర్యం కావాలని తెలియచేసింది.

1933 సం.లో పాకల సౌభాగ్యవతి పురుషులతో సమానంగా బ్రతకటం స్త్రీలహక్కు అని వక్కాణించింది. తమహక్కులను సాధించుకోవటానికి న్యాయవ్యవస్థను కూడా ప్రశ్నకుపెట్టారు.

పాకల సౌభాగ్యవతి వ్రాసిన 'స్త్రీలు – బ్రహ్మ సమాజం' (జనవరి 1933 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీలు విద్యావిహీనులై పురుషుల కామోపశాంతికి ఉన్నంతకాలం దేశం బాగుపడదనియు, రాజా రామమోహనరాయలు స్త్రీలఅభివృద్ధియే జాతీయాభివృద్ధి అవుతుందని భావించి స్త్రీలకెక్కువ గౌరవాన్ని ఇచ్చారని తెలిపింది. స్త్రీలకుప్రత్యేక హక్కులు, ఆస్తి, స్వాతంత్ర్యం ఉండాలనీ, స్త్రీలకుప్రత్యేక మానవత్వం ఉందని భావించటంచేతనే సతీసహగమనాన్ని నిషేధించాలని భావించారని తెలిపింది. స్త్రీ సత్వం గూడా ఆత్మాభిమానం పొందాలనీ, తెలియజేసింది. పురుషులతో సమానంగా బ్రతకటం స్త్రీలహక్కనీ, స్త్రీలు తమ స్వాతంత్ర్యానికే కాక నాగరికతా పరిరక్షణకు కూడా ప్రాధాన్యతనిచ్చి దానికి నూతన రూపాన్ని కలిగించగలరనే భావాన్ని వ్యక్తం చేసింది.

స్త్రీలు తమకు గౌరవప్రదమైన సామాజికజీవనం ఉండాలంటే సాంఘికహక్కులు ఉండాలనీ, సాంఘికహక్కులను సజావుగా అనుభవించటానికి ఆర్థికహక్కు ఉండాలని భావించారు. కాని అవి చట్టరూపంలో ఉంటేనేగాని వాటికి రక్షణ ఉండదని భావించి, స్త్రీలసమస్యలను తీర్చగల చట్టాలను రూపొందించటానికిగాని, సమానహక్కుల రక్షణకుగాని స్త్రీలకు రాజకీయ హక్కులు ఉండాలను కున్నారు. స్త్రీలు తమ వ్యక్తిస్వాతంత్ర్యసాధనలో ముందుగా స్త్రీపురుషసమానత్వంగల సాంఘిక స్వాతంత్ర్యాన్ని పొందాలనుకొన్నారుగాని దానికై తమకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని గ్రహించారు. అయితే ఈ రెండిటిని పొందాలంటే రాజకీయస్వాతంత్ర్యం అవసరమని గ్రహింపుకు వచ్చి అంచెలంచెలుగా తాము హక్కులసాధన దిశగా చైతన్యాన్ని తెచ్చుకొన్న విషయాన్ని స్వాతంత్ర్యోద్యమ కాలంలో స్త్రీలు సృజించిన సాహిత్యం స్పష్టంచేసింది.

1934 సం.లో కేంద్రం స్త్రీలకు వ్యవసాయభూములను వారసత్వపు ఆస్తిహక్కుగా పేర్కొన్న, 1935 చట్టం రాష్ట్రీయస్వాతంత్ర్యం ప్రకటించటంతో దానిప్రకారం వ్యవసాయభూములు రాష్ట్రప్రభుత్వం క్రింద ఉన్నాయంటూ స్త్రీలకు ఆస్తిహక్కును కోర్టు నిరాకరించటం జరిగింది. కొడుకులు చూడనప్పుడు స్త్రీకి ఆస్తి వారసత్వం లేకపోవటంతో వితంతు స్త్రీలకు మనోవర్తిని భరణం రూపంలో యివ్వాలని చట్టం తీసుకొని వచ్చినట్లే, భర్తనుండి విడిపోయిన భార్యకు భర్త ఆమె పోషణకై భరణాన్ని చట్టప్రకారం యివ్వాలనే ప్రతిపాదనను చేసింది.

1935 సం. జనవరి నాటి గృహలక్ష్మి పత్రికలో స్త్రీలు మహిళాసభలు పెట్టి 'స్త్రీలహక్కుల'ను గురించిన చర్చపెట్టారని, ఆ సభలో స్త్రీలు మాట్లాడుతూ తమ హక్కులకోసం శాసనసభలో బిల్లులను పెట్టినా నెగ్గటంలేదనీ, స్త్రీలకు సమగ్ర స్వాతంత్ర్యం రావాలంటే పురుషులతోపాటు సమానమైన ఆస్తిహక్కు ఉంటే ఆర్థికస్వాతంత్ర్యం ఉంటుందని నిర్ణయించుకొన్నారు. కన్యాశుల్క, వరకట్న నిషేధం ఉండాలనీ, ఆర్థికహక్కు స్వయంపోషణకేకాక రాజకీయహక్కులకు పునాదులై, సాంఘికహక్కులకు

కూడా పెట్టని కోట అవుతుందనీ, దానితోపాటు వివాహహక్కు దానంతట అదే సిద్ధిస్తుందని, విద్యావంతులైన వారికేకాక స్త్రీలందరికీ ఓటు హక్కు ఉండేందుకు స్త్రీలు ఉద్యమించాలనే నిర్ణయాలు చేసారని మహిళాసభల విశేషాలను పత్రిక పేర్కొన్నది.

1935 సం.లో పొణకా కనకమ్మ స్త్రీలు తమస్వాతంత్ర్యాన్ని, స్వత్వములను (హక్కులను) సంపాదించుకోవటానికి శాసనసభలలో, స్థానికసంస్థలలో పాల్గొనాలనీ, ఎన్నికలలో స్త్రీలకిచ్చిన ప్రత్యేకనియోజకాలలోనే కాక, సమష్టి నియాజకవర్గాలలో కూడా నిలబడి శాసనసభ్యులుగా సమానమైన స్వాతంత్ర్యం, అధికారం పొందాలని చెప్పింది.

పొణకా కనకమ్మ చేసిన 'స్త్రీల కర్తవ్యం' (ఫిబ్రవరి 1935 ఆంధ్రభూమి) అనే ఉపన్యాసంలో స్త్రీలు తమస్వాతంత్ర్యాన్ని, స్వత్వములను (హక్కులను) సంపాదించుకోవటానికి శాసన సభలలో, స్థానిక సంస్థలలో పాల్గొనాలనీ, ఎన్నికల్లో స్త్రీలకిచ్చిన ప్రత్యేక స్థానాలలోనే కాక అన్ని నియోజకవర్గాలలో పురుషులతో సమానంగా ఎన్నికలలో స్త్రీలకు సమాన ప్రాతినిధ్యం కావాలనీ. స్త్రీలకు అన్నిచోట్ల పురుషులతో సమాన స్వాతంత్ర్యం, అధికారహక్కు ఉండాలని తెలియజేసింది.

రాజకీయవ్యవస్థలలో ప్రాతినిధ్యంవహించే విధంగా స్త్రీలు తమ స్వతంత్రజీవనహక్కునే సాధికారహక్కుగా భావించటమే స్వాతంత్ర్యసిద్ధి అని భావించింది.

కె.ఎస్.రత్నమ్మ వ్రాసిన 'స్త్రీల వ్యవస్థ' (డిసెంబరు 1935 గృహలక్ష్మి) అనే వ్యాసంలో భారత జాతీయాభివృద్ధికై స్త్రీలను గౌరవించాలనీ, వివిధ సంస్థానాధిపతుల భార్యలుగా రాణులు స్త్రీల అభివృద్ధికి పాటుపడుతున్నారనీ, మైసూరు దివాన్ గారి భార్య బెంగుళూరు నందు జరిపిన మహిళాసభలో ప్రసంగిస్తూ భార్యలు వేరొకరిని వివాహంచేసుకుంటే ఎటువంటి శిక్ష ఉంటుందో, అదేవిధమైన శిక్షను భార్య ఉండగా వేరొక స్త్రీని వివాహం చేసుకునే పురుషులకు వేసి శిక్షించాలని ఆ సభలో తీర్మానం చేసినట్లు తెలియజేసింది. అంతేకాక, దేశరాజకీయాలలో భాగంగా స్త్రీని ఓటరుగా పరిగణించాలనుకుంటున్నారనీ, చదువుకున్న స్త్రీలు ఓటర్లుగా అవుతారనీ, అప్పుడు స్త్రీలకు ప్రాతినిధ్యం ఉండి, స్త్రీలహక్కులు రక్షించుకునే శాసనాలు, స్త్రీల స్వాతంత్ర నిర్వహణమునకు వలయు సాధనములను నిర్మించుకొని స్త్రీజీవనానికి ఔన్నత్యం కల్గించుకొనే అవకాశం వారికి వస్తుందని తెలియజేసింది. ఆ సభలో నిస్సంతులైన హిందూ వితంతువులకు భర్త ఆస్తి వారసత్వంగా భార్యకు సంక్రమించాలనీ పురుషులతో పాటు స్త్రీలకు పుట్టింటి ఆస్తిలో భాగం ఉండాలనీ, స్త్రీల విషయాలలోవలె పురుషుడు ఇంకొక స్త్రీని పెండ్లాడితే శిక్షకు పాత్రుడు అవ్వాలనీ తీర్మానం చేసారని తెలియజేసింది.

స్త్రీలకు ఆస్తిహక్కును, పురుషునియొక్క బహుభార్యత్వాన్ని ఎదుర్కొవటానికి స్త్రీలు విద్యావంతులు అవటమే కాక రాజకీయాలలోకి కూడా రావలసిన అవసరాన్ని తెలియజేసింది. స్త్రీవిద్య, స్త్రీల

రాజకీయ, ఆర్థిక హక్కులపట్ల స్త్రీలను చైతన్యవంతం చేయగల వ్యాసమిది.

కేరళలో జరిగిన 'అఖిలభారత మహిళా సభను' (ఫిబ్రవరి 1936 గృహలక్ష్మి) గురించి పత్రికాధిపుల తెలియజేస్తూ ఆ సభలోని స్త్రీలు బ్రిటీష్ ప్రభుత్వం క్రింద ఉన్న భారతదేశంలో 3 శాతం మహిళావిద్య ఉంటే, కేరళలో 16.8 శాతం స్త్రీ విద్య ఉందని ప్రశంసించారని పత్రిక తెలిపింది. కొత్తరాజ్యాంగంలో స్త్రీలకు ప్రాధాన్యత ఉండాలనీ, ఆస్తి హక్కుకై చట్టాలు చేయాలనీ, స్త్రీలకివ్వబడిన ఎన్నికల హక్కులను, శాసనసభలకు ప్రత్యేకస్థానాన్ని తిరస్కరించకూడదనీ, ఆ హక్కునే వినియోగించుకొని స్త్రీలు శాసనసభా ప్రవేశంగావించి దేశాభివృద్ధికి పాటుబడే తీర్మానాలు చేయాలనీ, సాంఘిక మతభేదాలు లేక స్త్రీలు అంతర్జాతీయ స్త్రీలతో కలసి హక్కులకై పోరాడాలని కూడా నిర్ణయించారని పత్రిక తెలియజేసింది.

స్త్రీలకు చట్టబద్ధమైన హక్కులను యిచ్చినంతమాత్రాన సరిపోదని, వాటిని ఉపయోగించుకొని స్వేచ్ఛను అనుభవించటం దాని పరమావధి కావాలనే ఆలోచనలతో స్త్రీలకు ఉండవలసిన సంపూర్ణస్వేచ్ఛను గురించిన అభిప్రాయాలను స్త్రీలనుండి సేకరించాలనుకొన్నారు.

1936 సం.లో బి.వెంకటలక్ష్మి స్త్రీలకు గర్భస్రావం చేసుకొనే హక్కు ఉండాలని తన వ్యాసంలో పేర్కొంది.

బి.వెంకటలక్ష్మి వ్రాసిన 'గర్భస్రావం చేసుకొను హక్కు ఉండవలెను' (ఫిబ్రవరి 1936, ఆంధ్రభూమి) అనే వ్యాసంలో ఇష్టం లేనప్పుడు స్త్రీ తన ఆరోగ్యానికి, ప్రతిష్ఠాభంగానికి గానీ, దారిద్ర్యభయంతో గానీ, గర్భస్రావం చేసుకునే హక్కు ఉండాలని భావించింది.

స్త్రీల అణచివేతలో ముఖ్యమైనది స్త్రీల లైంగికత అనే భావన ఆ రోజుల్లోనే కలగటంతో స్త్రీల లైంగిక హక్కుకు రక్షణ ఉండాల్సిన భావనను తెలియజేసింది. ఈ 'లైంగికత'యే సామాజిక, రాజకీయార్థిక విషయాలలో అణచివేతకు ప్రధాన సాధనమని గుర్తించటం జరిగింది. తన శరీరంమీద తనకే హక్కు ఉండాలని భావించటమే స్త్రీల వ్యక్తి స్వాతంత్ర్యానికి ముఖ్యమని భావించారు. కుటుంబంలో భార్య తన వారసులను కని యిచ్చేందుకు తగినట్లుగా మాతృత్వం ఆరాధనీయమని ప్రచారంచేసిన పితృస్వామ్యభావజాలాన్ని అధిగమించటానికి ఆనాడే స్త్రీలుగర్భస్రావం చేసుకొనే హక్కు తమకు ఉండాలంటూ అభిప్రాయాలను వ్యక్తం చేయటం అంటే స్త్రీలు తమ లైంగికహక్కులను గుర్తించటమే. దీనిని ఒక విప్లవాత్మకసంస్కృతిగా భావించాలి.

'తల్లి నగుట నాకు ఇష్టములేదు' అనే (నవంబరు 1936 ఆంధ్రభూమి) శీర్షికన వేదుల విశాలాక్షి వ్రాస్తూ స్త్రీ అంటే సంతానాన్ని కనటానికే అనే దృష్టితోచూసే సమాజంలో స్త్రీ గర్భిణీగా

ఉన్నప్పుడు ఖైదు జీవితంలా చాలా యిబ్బందులు పడుతుందనీ, పథ్యం పేరుతో తిననీయరనీ, ప్రసూతిరోగాల బారిన పడటం అంటేనే అదొక గర్భధారణ వ్యాపారమనీ, స్త్రీ పాలను ఉత్పత్తిచేసే ప్రాణంగల యంత్రంగానూ భావింపబడటంచేతనే ఆమె శుష్కించిపోతుందని తెలిపింది. భుక్తి కోసం స్త్రీ ఏదో ఒక వృత్తిని అవలంబించే రోజులలో సంతానోత్పాదన పెద్ద అడ్డంకి అని తెలియచేసింది. పురుషుడు కామపురుషార్థాన్ని పొందుతుంటే, పథ్యం చేస్తూ పిల్లల్ని కనిపెంచే కష్టమంతా స్త్రీదనీ, సమాన స్వాతంత్రం కోరే ఈరోజులలో స్త్రీ తల్లికావటం అనే పనిని విరమించుకోవాలని తెలియజేసింది.

స్త్రీల 'లైంగికత'ను గురించిన ఆలోచనల పరిణామంలో గర్భధారణ స్త్రీజాతిని నికృష్టం చేసేవ్యాపారమని, స్త్రీని సంతానాన్ని కని యిచ్చి పాలను ఉత్పత్తిచేసే ప్రాణయంత్రంగా భావిస్తున్నారనీ అనాదిగా సమాజంలో స్త్రీపురుష సమానత్వం లేకుండా చేయటానికై గర్భధారణకు, పిల్లల పెంపకానికి స్త్రీని పరిమితం చేసారని భావించింది. బాహ్యప్రపంచంలో స్త్రీ ఉద్యోగాలకు వెళ్ళలేని స్థితిని కల్పించి ఆర్థికస్వావలంబన లేని పరాధీనస్థితిలో ఉంచాలనుకున్నారని తెలియజేయటమంటే, రచయిత్రి ఆనాడే స్త్రీ వాద భావనలు పుణికిపుచ్చుకుని స్త్రీల ఇక్కట్లను వ్యక్తం చేసిందని అర్థం అవుతుంది. ఆనాటికి అది ఒక విప్లవాత్మక అలోచన. పనివిభజనతో ఏర్పడ్డ పితృస్వామ్యపు మూలాలను కదిలించటం జరిగింది.

కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాసిన 'చట్ట సభలల్లో మెజారిటీ మీదేగా' (జులై1936 గృహలక్ష్మి పత్రిక) అనే మరో కథలో స్త్రీలు సభలకు హాజరవటానికి పిల్లలతో సహా బయలుదేరుతున్నప్పుడు ముందుగా పిల్లలకు కావలసినవన్నీ సమకూర్చుకొనేందుకు భర్తను డబ్బు అడగాల్సిన స్థితికి వగచి స్త్రీలు సంపాదన పరురాలైతేనే పరాధీనత పోతుందని, అదే స్వతంత్రంగా జీవించటం అని భావించింది. అంతేకాక, రచయితలు స్త్రీని భోగవస్తువని తోచినట్లు వ్రాస్తారు గానీ నారీ హృదయాన్ని అర్థం చేసుకోలేరనీ, స్త్రీ పురుషునితో సమానమైన ప్రాణి అని గుర్తించరనీ, స్త్రీకి పురుషులతో సమానమైన స్వతంత్ర హక్కులు ఉంటాయని భావించరని బాధపడింది. ఆమె హాజరైన 'విడాకులచట్ట నిర్ణయ సభ' లోని విశేషాలుగా ఇంటికి వచ్చిన తర్వాత భర్త అడుగగా, ఆమె పెళ్ళిళ్ళ మీద పెళ్ళిళ్లు చేసుకొనే భర్త నుండి స్త్రీ విడాకులు తీసుకుంటే పిల్లలు ఇబ్బంది పడతారు కాబట్టి పురుషుడు భార్య జీవించి ఉండగా మరో వివాహం చేసుకోవటానికి వీలులేకుండా బిల్లును తయారుచేసుకున్నామని చెప్తుంది. దానికి భర్త మహిళా సభలలో లక్షతీర్మానాలు చేసుకొన్నా తమకు భయంలేదనే సరికి, ఆ బిల్లు చట్టరూపం దాల్చటానికి చట్టసభలో మెజారిటీ పురుషులకు ఉండటంతో భర్త అటువంటి మాటలు అనగలిగాడని భార్య గ్రహించటాన్ని కథలో కనుపర్తి వరలక్ష్మమ్మ తెలియజేసింది.

ఈ రచయిత్రి వ్రాసిన కథలలో స్త్రీలు లోకల్ బోర్డుల్లో, చట్టసభలో స్త్రీల ప్రాతినిధ్యం పెరగాలని ఎన్నో రచనలు చేయటం జరిగింది. చట్టాలు తయారుచేసే శాసనసభలో స్త్రీల ప్రాతినిధ్యం ఉంటే తప్ప స్త్రీల సమస్యలు తీరవని ఆనాడే ప్రతిపాదించిన క్రాంతదర్శినిగా కనుపర్తి వరలక్ష్మమ్మ అర్థం అవుతుంది. ఆనాడే మహిళాబిల్లు చట్టంగా రూపొందించాల్సిన అవసరాన్ని గుర్తించి నేటికీ స్ఫురణను కల్గించటంగా ఈ కథ అర్థమవుతుంది.

'భారత స్త్రీ సంపూర్ణ స్వేచ్ఛనెప్పుడు బడయగలదు' (మే 1936 గృహలక్ష్మి) అనే వ్యాస రచయితయైన పాకల చంద్రకాంతామణి స్త్రీ స్వేచ్ఛను పొందాలనుకోవటాన్ని నాటి సమాజంలో ప్రబలమైన సమస్యగా భావించి స్త్రీల అభిప్రాయాలసేకరణకై పత్రికాముఖ ఆహ్వానాన్ని ఇచ్చింది. స్త్రీలకు చట్టపరమైన హక్కులు ఉన్నప్పుడే వారు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను అనుభవించగలరని భావించటంవల్ల, స్త్రీల స్వేచ్ఛకు, స్వాతంత్ర్యానికి ఎటువంటి హక్కులు అవసరమౌతాయని ఆంధ్ర రాష్ట్రంలో నలుమూలలనుండి స్త్రీల అభిప్రాయసేకరణ చేయాలనుకొన్నారు.

'భారతస్త్రీకి సంపూర్ణ స్వేచ్ఛ' (జులై 1936 గృహలక్ష్మి) అనే శీర్షికన యల్లాప్రగడ సీతాకుమారి (హైదరాబాద్) వ్రాస్తూ పురుషులతో సమానమైన వారసత్వపు హక్కు ఉండాలనీ, స్త్రీలకు తమ అభిరుచికి తగిన విద్యను అభ్యసించగల స్వేచ్ఛ ఉండాలని చెప్పింది. స్త్రీల వివాహ వయోనిర్ణయిం శారదాచట్టం ప్రకారం జరగాలనీ, అలాంటి పరిస్థితులు స్త్రీలకు లేకపోవటమే వారికున్న పెద్దసమస్యలుగా భావించాలని తెలియజేసింది. పురాణ పతివ్రతల చరిత్రలోని ఉత్ప్రేక్షలు, ఊహలు తీసివేయగా వారి నిజచరిత్ర అర్థం అవుతుందనీ, పురుషులు పెద్ద పెద్ద చదువులు చదువు కుంటున్నారనీ, వారివలె స్త్రీలు కూడా చదువుకుంటే వారికి సంపూర్ణ స్వేచ్ఛ గౌరవాలు లభిస్తాయని అభిప్రాయపడింది.

పురాణాలలో చెప్పిన విషయాలలోని మార్మికతను బయటపెట్టటం జరిగింది. స్త్రీలకు పురుషులతో సమానమైన విద్య, వైవాహిక స్వాతంత్ర్యం, ఆస్తిహక్కు ఉంటేనే స్త్రీకి సంపూర్ణస్వేచ్ఛ ఉన్నట్టనీ, అదే స్త్రీలవ్యక్తి స్వాతంత్ర్యానికి చిహ్నమని భావించింది.

దీనికి అనుబంధంగా 'భారత స్త్రీల స్వేచ్ఛ' ను గురించి పాకాల రాజమణెమ్మ మదరాసు నుండి వ్రాస్తూ "స్త్రీ స్వాతంత్ర్యం" అంటే స్త్రీలకు పురుషులతోపాటు సమాన హక్కులు ఉండాలంటూ స్త్రీవిద్య, సాంఘికవివాహం, విడాకులచట్టం, స్త్రీలు దేశసేవచేయాలనే కేకలు వినబడుతున్నాయనీ, కన్నతల్లిదండ్రుల వద్దను, భర్త ఆధీనములో స్త్రీలకు స్వతంత్రం ఉండటమే నిజమైన స్త్రీ స్వేచ్ఛ అని తెలిపింది.

దీనికి అనుబంధంగా ఇదే పత్రికలో గంటి కృష్ణవేణమ్మ బొంబాయినుండి వ్రాస్తూ పురుషుల వలె స్త్రీలకు పిత్రార్జితాన్ని భర్త యార్జించిన విత్తము నందు అనుభవించే స్వాతంత్ర్యం మాత్రం ఉండాలని తెలియజేసింది.

దీనికి ముగింపుగా గృహలక్ష్మి పత్రికాధిపులు స్వాతంత్ర్యం ఒకళ్ళిచ్చేది కాదనీ, హైందవ స్త్రీకి తగిన విద్యలేకుండుటయే స్వాతంత్ర్యం లేకపోవటానికి కారణమని భావించటం జరిగింది. పరభాషలు నేర్చుకొనుట తప్పు కాదనీ, స్త్రీలు సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని పొందవచ్చని పత్రిక పేర్కొనటం జరిగింది.

బాధ్యతాయుత స్వేచ్ఛకు, సంపూర్ణ స్వేచ్ఛకు మధ్యనున్న గీతను స్త్రీలు అర్థంచేసుకొని బాధ్యతతో మెలగాలని స్త్రీల అభిప్రాయంగా అర్థమవుతుంది. పైన పేర్కొన్న స్త్రీల అభిప్రాయ సేకరణను బట్టి భారతీయ మహిళలు కుటుంబ నిర్వహణ వరకు స్వేచ్ఛఉంటే చాలని సంప్రదాయ స్త్రీలు కొంతమంది అభిప్రాయపడ్డారు. పురుషులతోపాటు సమాజంలో సమాన హక్కులు ఉండాలనీ, ముఖ్యంగా ఆస్తి హక్కు ఉండాలనీ, తన కిష్టమైన చదువు నభ్యసించే విషయంలోగానీ, వివాహ విషయంలో గానీ స్వేచ్ఛ ఉండాలని భావించిన ప్రగతిశీలురుగా మరికొంతమంది స్త్రీలు తమ అభిప్రాయాలను వెల్లడించటం జరిగింది. నాడు భర్తల ఇష్టానుసారంగా ప్రవర్తించే సంస్కృతిగల స్త్రీలు, నేడు భర్తతో సమానంగా జీవించే స్వేచ్ఛకావాలనుకొనే స్థితికి చేరుకోవాలనుకోవటంలోనే వారి ఆలోచనలలోని పరిణామశీలత అర్థమవుతుంది.

స్త్రీల సమస్యలన్నింటికి కుటుంబ సామాజిక సంస్కృతి కారణమనీ, అది స్త్రీలకు స్వతంత్రం లేకుండా చేస్తోందనీ, స్త్రీలు కూడా మానవులేనని భావించాలనీ, స్త్రీలు తమ స్వేచ్ఛాధికారాలను సంపాదించుకొని సాంఘిక, ఆర్థిక, రాజకీయ హక్కులను సాధించుకొని స్వాతంత్ర్యాన్ని పొందితేనే దేశస్వాతంత్ర్యం కలుగుతుందని భావించారు. స్త్రీలలో మానవహక్కుల గురించిన ఆలోచనలు ఏర్పడ్డాయి. స్త్రీలకు, పురుషులతో సమానంగా స్త్రీలకువిద్య, వివాహస్వాతంత్ర్యం, ఆర్థిక, రాజకీయహక్కులు గల శాసనసభ్యత్వం ఉంటేనే స్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యం ఏర్పడుతుందనీ, స్త్రీల స్వాతంత్ర్యమే దేశస్వాతంత్ర్యానికి మూలమని భావించారు.

స్త్రీలకు పురుషులతోపాటు సమానమైన సామాజిక, రాజకీయ, ఆర్థిక హక్కులు ఉంటేనే, తమ శక్తిసామర్థ్యాలను వృద్ధిచేసుకొంటూ స్త్రీలు వ్యక్తిస్వాతంత్ర్యాన్ని పొంది దేశస్వాతంత్ర్యాన్ని సాధించగలుగుతారని భావించింది. స్త్రీలుకూడా తమని తాము అబలలుగా భావించుకోకూడదు.

మైదవోలు పద్మావతి వ్రాసిన 'స్త్రీ పురుష సమానత్వమావశ్యకమా, ఎందేని యనర్థదాయకమా?' (నవంబరు 1936 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీ గౌరవమే దేశగౌరవమనీ, మహిళాభివృద్ధియే

దేశాభివృద్ధి అనీ, స్త్రీలు వెనుకబడిన దేశము వెనుకబడటమేననీ, స్త్రీ పురుషులు సమానస్థితి యందున్నప్పుడే స్వరాజ్యమున కర్హత వస్తుందనీ, జపాన్, టర్కీ, రష్యాదేశములు స్వతంత్ర దేశములగుటకు స్త్రీ-పురుష సమానత్వమే కారణమని తెలియజేసింది. అంతేకాదు దేశానికి స్వరాజ్యము కావాలంటే స్త్రీలకు స్వాతంత్ర్య మిచ్చుట మొదటి మెట్టని భావించింది. వనితలకు వ్యక్తిత్వం ఏర్పడాలంటే ఆమె పురుషుని సొత్తుకానీ, బానిసకాని కాదనీ, ఆమె ఒక ప్రత్యేక వ్యక్తియన్న భావమేర్పడాలని, అలా భావించక పోవటానికి పురుషుల దౌర్జన్యమే కారణమని తెలిపింది. అంతేకాక, స్త్రీని వంటయింటి, పడకటింటి వస్తువుగా భావిస్తున్నారనీ, మగవాడిగా ఆడుదానిపై అధికారం ఉండటమే కాక అతడు అయోగ్యుడై హింసించినా అతని నుండి విడిపోయే అధికారం స్త్రీకి లేకపోవటం అన్యాయమనీ, 'నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అనే వజ్రాయుధాన్ని వాడటానికి కారణం ఆ శాస్త్రాలను పుట్టించినది పురుషులేనని తెలియజేసింది. స్త్రీ జాతి కూడ మానవజాతికి సంబంధించినదేనని, స్త్రీ పురుషులు సమానమైనా స్త్రీలకు పురుషులకంటే నాల్గురెట్ల బుద్ధి ఆధిక్యత ఉన్నందువల్ల స్త్రీలే అధికులని ఆ శాస్త్రకారుడే చెప్పాడనీ, స్త్రీలకు న్యూనతను కల్గించి స్త్రీ ప్రతిభను మాటుపరచటం పురుషుల స్వార్థపరత్వమేననిచెప్పింది.

స్త్రీలకు వ్యక్తిత్వం ఏర్పడటానికి స్త్రీకి పురుషునితో పాటు సమానంగా విద్యాహక్కు, శాసన సభ్యత్వము ఉండాలని అప్పుడే స్త్రీల శక్తియుక్తులు దేశానికి ఉపయోగపడతాయని తెలియజేసింది. పురుషులతో సమానమైన గౌరవం స్త్రీలకుండాలనీ, అందుకని స్త్రీ స్వాతంత్ర్యానికి స్త్రీలే పనిచేయాలనీ, సంఘాన్ని సంస్కరించటం కూడా స్త్రీల పనియనీ, పురుషులు స్త్రీలకు స్వాతంత్ర్యం ఇవ్వకపోతే తమ కాళ్ళకున్న కట్టుతాళ్ళు తామే స్త్రీలు తెంచుకోవాలనీ స్త్రీలకు స్వాతంత్ర్యం ఉంటేనే దేశానికి స్వాతంత్ర్యం ఉంటుందని చెప్పింది. స్త్రీలే కొత్త స్వేచ్ఛాధికారాలను సంపాదించుకోవాలనీ, స్త్రీలు శాసనసభలలో చట్టాలు చేయించగల సంఖ్యాబలాన్ని పెంచుకోవాలనీ, హక్కుల కంటే ఆచరణ కూడా ముఖ్యమని భావించింది. ఆస్తిహక్కు పురుషులతో సమానంగా స్త్రీలకుండాలనీ, డబ్బులేకపోతే స్వతంత్రం రాదనీ, స్త్రీలకు వివాహమే జీవనాధారమయిందనీ, భర్త ఆస్తి భాగం రాకపోయేసరికి జీవనంకోసం స్త్రీలు వంటలక్కలు గాను, నీళ్ళుమోసుకుంటూనో వారు జీవితాన్ని గడుపుతున్నారనీ, తండ్రి ఆస్తి కొడుకుతో పాటు కూతురుకు సమానంగా రావాలని భావించింది. స్త్రీకి విద్య ఉంటేనే సాంఘిక, రాజకీయ, ఆర్థిక సమస్యలను ఎదుర్కొనే సమాన బాధ్యత స్త్రీకి కలుగుతుందనీ, స్త్రీలకు పునర్వివాహపు హక్కు ఉండాలనీ, స్త్రీకి స్వాతంత్ర్య సమానత్వం ఉంటేనే దేశస్వాతంత్ర్యం ఏర్పడుతుందని తెలియజేసింది.

వేదుల మీనాక్షి వ్రాసిన 'స్త్రీపురుష సమానత్వమావశ్యకమా?– ఎందేని యనర్థదాయకమా?' (నవంబరు 1936 గృహలక్ష్మి) అనే వ్యాసంలో శరీరతత్వంలో, హృదయంలో, బుద్ధిలో స్త్రీ పురుషులు సమానమేననీ, స్త్రీలను బానిసలుగా చూడకూడదనీ, స్త్రీలుకూడా తమని తాము అబలలమని అనుకోకూడదనీ, స్త్రీ పురుషులకు సమాన విద్యావకాశాలను కలిగించే ప్రభుత్వమును ఎన్నుకొనేవిధంగా రాజకీయ విషయాలలో స్త్రీలు సమానులే అని గుర్తింపబడాలనీ, ఎన్నిక హక్కు ఆత్మహక్కుగా భావించాలనీ, శాసనసభలో ఆచంట రుక్మిణమ్మలాగా పాల్గొనవలెననీ, స్త్రీలకు ఆర్థిక సమానత్వం కూడా కావాలనీ, వారసత్వపుహక్కు ఉండాలనీ, స్త్రీలకు ఉద్యోగం చేసే అవకాశాలుండాలనీ, ఇంట్లో స్త్రీలు ఖైదీలుగా కాక ఆత్మగౌరవం, స్వేచ్ఛ కలిగి ఉండాలని తెలియజేసింది. వివాహ విషయంలో స్త్రీలకు స్వేచ్ఛ ఉండాలంటే బాల్యవివాహాలు ఉండకూడదనీ, సంసారంలోని ఆలోచనలలోను స్త్రీలకు సమానత్వం ఉండాలనీ, కళలలోనూ స్త్రీలకు సమానావకాశాలుండాలనీ, స్త్రీలకు సాంఘిక, రాజకీయ, ఆర్థిక సమానత్వం ఉంటే స్త్రీలకున్న భౌతిక, మానసికశక్తుల వృద్ధి దేశసేవకు ఉపయోగపడుతుందనీ, అప్పుడే భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందగలుగుతుందని తెలియజేసింది.

'ఒక సోదరి' పేరుతో వ్రాసిన 'గృహిణీత్వానికి జీతాలా?' (డిసెంబరు 1936 గృహలక్ష్మి) అనే వ్యాసంలో విద్యావంతులైన స్త్రీలు ఉద్యోగాలు చేయాలని ప్రయత్నిస్తున్నారు గాని వివాహిత ఉద్యోగం చేస్తే జీవితం సుఖంగా జరగదనీ, పి.ఎన్.మొహిలి బాంబే క్రానికల్లో వ్రాసిన దానిని పేర్కొంటూ. స్త్రీలు ఉద్యోగాలు చేయటం అనే సమస్య మొదలైందనీ, నేటి విద్యావంతులైన స్త్రీలకు ఆత్మగౌరవం, ఆర్థికంగా స్వతంత్ర జీవితం కావాలని కోరుకుంటున్నారని తెలిపింది. పెళ్ళికి ముందే స్త్రీ ఉద్యోగ విషయంలో వధూవరులు చర్చించుకోవాలనీ, పెళ్ళయిన తర్వాత భర్త, భార్య ఉద్యోగాన్ని ఒప్పుకోకపోతే కుటీర పరిశ్రమలు పెట్టుకొని సంపాదించాలనీ, లేదా భర్త గృహనిర్వాహకత్వానికి జీతం ఇవ్వాలని భార్య భర్తను అడగాలని చెప్పింది. ఆ రకంగా భర్త జీతం యిస్తే స్త్రీ తాను స్వతంత్రాన్ని నిల్పుకొన్న భావన ఆమెకు కలుగుతుందనీ, సోదరి పేరుతో రచయిత్రి మొహిలీ గారి అభిప్రాయాన్ని సమర్థించింది.

స్త్రీలలో ఉద్యోగాలు చేయాలనే భావన పెరిగిన కొలదీ, వారికి కావల్సిన జీతమిస్తే వారు ఇంటిదగ్గరే ఉండగలుగుతారనీ, అదే స్త్రీని ఆర్థిక స్వతంత్రురాలిని చేస్తుందని కుటీర పరిశ్రమలు నిర్మించటం ఆత్మస్వభావంగా చేసుకోవాలనీ, ఇంటిచాకిరీకి ఆర్థిక విలువలు ఇవ్వాలనే భావన అర్థం అవుతుంది.

యల్లాప్రగడ సీతాకుమారి 'భార్యలకు జీతాలా !! ఇచ్చేవారు భర్తలా !!! (ఫిబ్రవరి 1937 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ భార్యలు జీతాలు కావాలని భర్తలనడిగితే సంసారాలలో ప్రశాంతత

పోతుందనీ, ఏ జీతాల గొడవలేకుండానే భార్య పోషణంతా భర్త భరించాలనీ, కానీ స్త్రీ ఉద్యోగం చేస్తూ ఆర్థికంగా నిలబడితే తను నీచంగా లోబడి ఉండదనీ, స్త్రీలు తమ చదువంతా గృహనిర్వహణకే ఉపయోగిస్తూ భర్తను సంతోషపెడితేనే భర్త కొంతజీతం ఇవ్వటం ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతుందని తెలియజేసింది. స్త్రీ ఉన్నతచదువు చదువుకోవటంవల్లగానీ, వితంతువుగానో, పర్యక్తగానో అయినప్పుడు జీవనాధారం కోసం ఉద్యోగం చేస్తోందనీ, భార్యకు జీతాలిచ్చే స్థితి భర్తలకులేదనీ, భర్త అయితే ఉద్యోగం నచ్చకపోతే నచ్చిన వేరొక చోట ఉద్యోగం చేసుకోగలడు గానీ, భార్యమాత్రం నచ్చినా నచ్చక పోయినా ఇంట్లోనే జీతం కోసం ఇంటిపని అనే ఉద్యోగం చేయాల్సివస్తుందని భావించింది. స్త్రీలు ఉద్యోగానికి వెడతానంటేనే ఇంటి నిర్వహణలో స్త్రీ విలువ పురుషుడికి తెలిసి వస్తుందనీ, సంసారాలు సజావుగా సాగాలంటే పురుషుడు స్త్రీని బానిసగా కాక ఇంటి నిర్వహణ చేస్తున్నందుకు ఆమె యిష్టానికి విలువనిచ్చి భార్యను కష్ట సుఖాలలో సమభాగస్వామినిగా భావించాలని చెప్పింది. భార్యా భర్తల మధ్య న్యూనతాధిక్యతలు లేకపోతే స్త్రీలకు జీతాలు అవసరం లేదనీ, భార్యలకు ఆర్థిక సదుపాయాలను పరిచయం చేయాలిగానీ, భర్తలు భార్యలకు జీతాలివ్వటం మొదలు పెట్టితే స్త్రీల బానిసత్వం మరింత ఎక్కువవుతుందని తెలియజేసింది.

ఇంటినిర్వహణలో భార్యయొక్కవిలువ భర్తకు తెలియాలంటే ఆమె ఉద్యోగం చేయాలనీ, కుటుంబ సంబంధాలలో స్త్రీలు కేవలం జీతాలకోసం ఉద్యోగం చేయటంగాక సమాజ సంబంధాలలోకి వెళ్ళటంగాకూడా అర్థం చేసుకోవాలి. భర్తలు భార్యలను ఆర్థికవ్యవహారాలలో సమభాగస్వాములుగా చూడనపుడు స్త్రీ బయటకు వెళ్ళిఉద్యోగంచేస్తే జీతమిచ్చినట్లుగానే, ఇంటిచాకిరీ, శిశుపోషణకై భార్యకు జీతం ఇస్తే స్త్రీలకు ఆర్థికస్తోమత కలుగుతుంది. అదే స్త్రీలకు ఆర్థికస్వాతంత్ర్యజీవితం ఉండటమని కుటుంబాలకు పెను సవాల్ విసరినా, తిరిగి అవి యజమాని–బానిస సంబంధాలు అవుతాయనే భయాన్నికూడా వ్యక్తం చేయటం కనబడుతుంది.

ఇంటిచాకిరికి ఆర్థిక విలువలను ఇవ్వటం స్త్రీలకు ఉండాల్సిన ఆర్థిక హక్కు అని భావించారు.

'ధర్మ శాస్త్రములలో స్త్రీహక్కులు' (జూన్ 1937 గృహలక్ష్మి) అనే పత్రికాధిపుల ప్రచురణ అనంతపురంలోని న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ఉటంకిస్తూ, భర్త మరొక స్త్రీని వివాహమాడటంతో అనారోగ్యం ఏర్పడిందనీ, తనకు ప్రాణహాని ఉంటుందనే భయంతో భర్త నుండి విడిపోయి మనోవర్తి అడిగేసరికి భర్త ఆమెను తనదగ్గరకు వచ్చి ఉండమన్నా ఆ భార్య ఒప్పుకోక దావా వేసిందని తెలిపింది. క్రింది న్యాయస్థానం భర్తకు అనుకూలమైన తీర్పునిస్తే ఆమె హైకోర్టులో అపీలుకు వెళ్ళగా ఆ కోర్టు తిరిగి విచారించవలసిందనీ క్రింది కోర్టును ఆదేశించింది. క్రింది కోర్టు జడ్జి స్త్రీని

పశువుగా చూడకూడదనీ స్త్రీకి ప్రాణహాని ఉన్నప్పుడు భర్త దగ్గరే ఉండమని తీర్పు నివ్వాల్సిన అవసరం లేదనీ, ధర్మశాస్త్రాలలో లేకపోయినా సారమెరిగి న్యాయం జరిగేటట్లుగా చూడాలంటూ ఆ తీర్పును కొట్టివేస్తూ ఆమెకు మనోవర్తి ఇవ్వాలని న్యాయస్థానం తిరిగి నిర్ణయించిదనీ, భర్తా బాధితులైన వివాహిత స్త్రీలను స్వతంత్రంగా జీవించేటట్లు చేసిందని పత్రిక తెలియజేసింది.

న్యాయవ్యవస్థలో స్త్రీలు తమ జీవనహక్కులకై చేసిన వ్యక్తిస్వాతంత్ర్యపు పోరాటమే స్త్రీల సాధికారికతకు బాటలు వేయగలుగుతుంది.

1937 సం. లో ఆచంట సత్యవతమ్మ 'ఆంధ్రనారీమణులకు కొన్ని సలహాలు' (జూన్ 1937 గృహలక్ష్మి) అని వేమగిరిలో (రాజమండ్రి తాలుకా) చేసిన మహిళాసభయొక్క అధ్యక్షోపన్యాసంలో అఖిలభారత మహిళా సభ హూణభాషలో (ఆంగ్లభాష) జరుగుతుంది కాబట్టి దానికోసం రాష్ట్రాలవారిగా ఏటేటా సభలు పెట్టాలని తెలిపింది. విద్యావంతులైన స్త్రీలు తమకు కావల్సిన హక్కులను వాటి దిద్దుబాటును తెలియజేస్తూ నివేదికలు తయారుచేసి అఖిలభారత మహిళాసభలకు పంపుతున్నారనీ, రాష్ట్రీయ, జిల్లా, తాలుకా, గ్రామ స్థాయిలో సభలు ఏర్పాటుచేసి స్త్రీలను విజ్ఞానవంతులను చేస్తేనే మహిళాభ్యుదయం జరుగుతుందని తెలియజేసింది. స్త్రీ విద్యాసంస్థలు పట్టణాలలోనే తక్కువగా ఉన్నాయని మరి పల్లెలో బాలికాపాఠశాలలైనా లేవనీ, కాబట్టి చదువుకున్న స్త్రీలు పల్లెల్లో విద్యాబోధన చేసి స్త్రీల అభ్యుదయానికి, స్త్రీలు తమ వ్యక్తిస్వాతంత్ర్యంను నిలబెట్టేందుకైనా హక్కులను తెలుసుకునేటట్లు చేయాలని తెలియజేసింది. అంతేకాదు శారదాచట్టం అమలు జరిగేటట్లు చేసి ప్రౌఢవివాహాలు జరిగేటట్లు చూడాలనీ, స్త్రీలకు దేశసేవ చేయాలనుకునే వారికి నిర్భంధ వివాహం చేయాల్సిన అవసరంలేదుగాని దుర్బలలైన వితంతువులకు పునర్వివాహాలు చేయాలని చెప్పింది. దేశముఖ్ గారు పెట్టిన హిందూ స్త్రీల వారసత్వబిల్లును ఫలవంతం చేసేందుకు కృషిచేయాలనీ, స్త్రీలకు గౌరవం ఉండేటట్లు చూడాలని తెలియజేసింది.

కనుపర్తి వరలక్ష్మమ్మ 'మనసులో మాటలు' (సెప్టెంబరు,1937 గృహలక్ష్మి) అనే శీర్షికకిందరాస్తూ కాంగ్రెస్ శాసనసభ్యులు స్త్రీలసమస్యలను పరిష్కరిస్తూ స్త్రీవిద్య, ఆరోగ్యం, ఆర్థికాధికారం, మత, సాంఘీకహక్కులను కల్పించటానికి శాసనకర్తలదృష్టికి తీసుకొని వెళ్ళాలనిచెప్పింది. ఈమెయే వ్రాసిన 'కృషితో నాస్తి దుర్భిక్షం' (డిసెంబరు 1937 గృహలక్ష్మి) అనే మరొక వ్యాసంలో బాపట్లలోని మహిళాసభను తలచుకుంటే ఆశ్చర్యం, ఆనందం, ఉత్సాహం కలుగుతోందనీ స్త్రీజనాభివృద్ధికై ఈ సభలు పూనుకుంటున్నాయనీ, గ్రామ, తాలూక స్థాయినుండి దేశం మొత్తంమీద స్త్రీలకు సంబంధం ఉండటానికి అఖిలభారత మహిళా సభలు వచ్చాయని

తెలిపింది. స్త్రీలలో ఇప్పుడిప్పుడే అభ్యుదయ తేజస్సు పొడచూపుతోందనీ, స్త్రీలకు రాబోయే రాజ్యాధికారం గానీ, హక్కు గాని కేవలం మహిళాసభలలోని తీర్మానాల వల్లనేనని తెలిపింది. 'సమాజం సాధించనిదేదీ లేదు' (మార్చి 1938 గృహలక్ష్మి పత్రిక) అనే వ్యాసంలో ఈమె స్త్రీసమాజాలలో, స్త్రీలవోటింగ్ హక్కు, శారదాచట్టం, స్త్రీలహక్కులకు సంబంధించి దేశముఖ్ గారిబిల్లు, స్త్రీపురుష సమాన హక్కులకై తీర్మానాలు చేయబడ్డాయని తెలియజేసింది. 'మనసులో మాటలు' (జూన్ 1938 గృహలక్ష్మి) అంటూ ఈమెయే వ్రాసిన ఇంకొక వ్యాసంలో ఆంగ్ల విద్య, డబ్బు ఉన్న వరుడికి వరకట్నం యిచ్చే దురాచారం ప్రబలిందనీ, వరుడితోపాటు ఆతనితల్లి తోబుట్టువులు కూడా శుల్కాన్ని స్వీకరించి అధికారులుగా మారారనీ, అందుకే బీహార్‌లో వరకట్న నిషేధపు బిల్లును ప్రవేశపెట్టారని చెప్పింది. ప్రజలు తమ వివేకంచేత సవరించుకోవాల్సిన లోపాలకు రాజశాసనాలు అవసరమవటం సిగ్గుచేటయిన విషయమనీ, అయినా మద్రాసు శాసనసభ కూడా ఇటువంటి బిల్లునుపెట్టి చట్టం చేయాలనీ భావించిందని తెలియచేసింది.

అ.రాధమ్మ వ్రాసిన 'స్త్రీలు–నిర్బంధవిద్యా శాసనం' (మార్చి1938 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీల విద్యావ్యాప్తికి పాఠశాలల నెలకొల్పినా, అది స్త్రీల జ్ఞానాభివృద్ధికి తోడ్పడి అక్షరజ్ఞానం కలిగినా, స్త్రీలు కార్యనిర్వహణలో తికమక పడుతున్నారని తెలిపింది. ప్రతిగ్రామంలో నిర్బంధ బాలికా పాఠశాలలు పెట్టాలనీ, రాట్న పరిశ్రమలను నేర్పించాలనీ, వీటితోపాటు స్థిర, చర గ్రంథాలయాలు ఉండాలనీ, విద్యా గంధం ఉంటేనే స్త్రీలకు స్వతంత్ర జీవనం ఏర్పడుతుంది కాబట్టి స్త్రీలకు 'నిర్బంధ బాలికా విద్యా శాసనాన్ని' చేయాలని తెలిపింది.

దర్శి సుభద్రమ్మ వ్రాసిన 'భారతస్త్రీల ప్రస్తుత స్థితి' (మే 1938 గృహలక్ష్మి) అనే వ్యాసంలో దేశంలో దారిద్ర్యం, బానిసత్వం ప్రజలను బాధపెడ్తుంటే స్త్రీలు మరింతగా అణగద్రొక్కబడుతుంటే, స్త్రీలకు స్వేచ్ఛగానీ, ఆర్థిక, రాజకీయ, సాంఘిక హక్కులుగానీ లేవని తెలిపింది. స్త్రీల సమస్యలను ప్రత్యేకంగా చూడటం కాక అవి పురుషుల సమస్యల్లో కలిసి ఉన్నాయనీ, అవి ప్రజలందరి సమస్యగా భావించాలనీ తెలియజేసిందిర్థ్యం పెరుగుతుందని భావించింది.

1937సం. నాటికి చట్టసభలకు ఎన్నికకాగలిగే రాజకీయ హక్కులను పొందారు. అందుకే భారత చట్టం, 1935 ప్రకారం స్త్రీలకు కేటాయించిన ప్రత్యేక నియోజకవర్గాలలో 1937 సం. ఎన్నికలలో 9 మంది స్త్రీలు ఎన్నికకాబడి శాసనసభ్యులు కాగలిగారు. అయితే ఆర్థికబిల్లును రద్దుచేసే అధికారం బ్రిటిష్ గవర్నరుకే ఉండటంతో శాసనసభ్యుల రాజీనామాతో ఏమిచేయలేకపోయినా.

1938 సం.లో పాకల రాజమణెమ్మ తన కథలో లింగవివక్షా స్వభావంగల న్యాయచట్టాలు స్త్రీలసమానహక్కులను వీలుగా లేవని చెప్పింది.

పాకల రాజమణెమ్మ వ్రాసిన 'నా స్వప్నము' (జులై 1938 గృహలక్ష్మి) అనే మరో కథలో ఒక స్త్రీకి వచ్చిన కలలో భాగంగా ఆమెకు న్యాయ వ్యవస్థలోని లింగవివక్షను ప్రశ్నిస్తున్న స్త్రీలు కన్పడ్డారనీ, కాషాయాంబర ధారిణులైన స్త్రీలు ఊరేగింపు చేస్తుంటే పోలీసులు అడ్డుకున్నారనీ, వారు శాసనసభాధ్యక్షుల వారితో న్యాయచట్టాలను ప్రశ్నించాలనుకుంటున్నామని చెప్పగా, వారికి అడ్డుతగిలి జైలుకెడతారనీ పోలీసు బెదిరించారని అనిపించింది. అయినా వారు లోపలికివెళ్ళి అక్కడున్న అధ్యక్షుల వారిని కలిసినట్లుగా కలలో భావించింది. అక్కడకు వెళ్ళినవారిలో ఒక ఆమె తన భర్త మరొక స్త్రీని యింటికితెచ్చి వ్యభిచరిస్తూ తనను నిర్లక్ష్యం చేస్తూ ఇంటి నుండి పొమ్మంటున్నాడు కాబట్టి పోషణకు డబ్బు యిప్పించమని అడిగిందనీ, దానికి న్యాయాధిపులు అలా అడగటానికి తగినవిధమైన చట్టంలేదని చెప్తాడు. మరొక స్త్రీ తన భర్త ఎలాంటివాడైనా బానిసగాపడి ఉంటానన్నా, ఒప్పుకోకుండా ఇంటినుండి పొమ్మంటున్నాడనీ, అత్తగారువాళ్ళు తన కన్నబిడ్డలను కూడా చూడనీయకుండా కష్టాలు పెడుతుంటే వారిని శిక్షించే చట్టాలు లేవా అని న్యాయాధిపతిని అడుగుతుంటుంది. స్త్రీగా పుట్టటంచేత తండ్రియాస్తిలోనూ వాటా లేకపోయేసరికి ఆస్తిలో వాటాఇచ్చే విధంగా చూడమని ఇంకొక స్త్రీ న్యాయాన్ని అడుగగా, అటువంటి చట్టాలూ లేవని చెప్పాడు. మరి ఆ స్త్రీలు తమను ఉద్ధరించే చట్టాలు నిర్మించమని ఆ శాసనసభాపతిని అడిగారు. ఆ సభాధ్యక్షుడు ఆ స్త్రీలను సంఘాలుగా ఏర్పడి తమ కష్టాలను, వాటిపరిష్కారానికి తగిన ప్రణాళికను తయారుచేసుకొనివస్తే శాసనసభలో ఆ నివేదికను తాను పెట్టగలనని చెప్పాడనీ, దానికే సంతోషపడిన స్త్రీలు ఆ క్రమంలోనే జయజయధ్వానాలతో ఊరేగింపు చేస్తూంటే తనకు ఆ కల నుండి మెలకువవచ్చినట్టు పాకల రాజామణి తెలియజేసింది.

కలలు స్వేచ్ఛకు నిదర్శనం. అందుకే కలలో కలిగిన చైతన్యం జీవితాన్ని సామాజిక కోణంనుండి చూసేటట్లు చేసింది. న్యాయచట్టాలయొక్క లింగవివక్షాస్వభావం స్త్రీల బాధల పరిష్కారాలకు, సమానహక్కులకు వీలుగాలేదనీ, న్యాయ చట్టాలను సంస్కరించాల్సిన అవసరం ఉందని భావించింది. చట్టాలపై స్త్రీలు అవగాహన పెంచుకోవటమే స్త్రీలు తమ స్వతంత్రసాధనకై తొలి, మలి, తుది అడుగులు వేయటంగా భావించాలి. స్త్రీలు లింగవివక్ష కల్గిన న్యాయశాస్త్రాలపట్ల అవగాహనపెంచుకొని దాన్ని ఎదుర్కొనే కలలు కని సాకారం చేసుకోవాలనుకొనే మార్గమే స్త్రీలన్యాయానికి దారులు వేయటంగా అర్థం అవుతుంది. సమాజంలో కుటుంబ సంస్కృతిలో భాగంగా ఉన్న అధికారవ్యవస్థను, ఆర్థిక వ్యవస్థను ప్రశ్నకు పెట్టటం అర్థం అవుతుంది. స్త్రీలకు సమాన న్యాయం స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్య సాధనకు నిదర్శనం. ఇది ఒక చైతన్యస్రవంతికి అద్దంపట్టే కథ.

1938 సం.లో ఆర్.అలివేలుమంగాదేవి తన కథలో కార్మికసంఘాలచట్టాలు చేసినా అవ్యవస్థీకృత రంగంలోని మహిళాకార్మికులకు ఉపాధి రక్షణలేదని, లైంగికవేధింపులు ఉంటున్నాయని చెప్పింది.

ఆర్.అలివేలుమంగాదేవి వ్రాసిన 'లక్ష్మి' (అక్టోబరు 1938 గృహలక్ష్మి) అనే కథలో, మురికివాడలో నివసిస్తూ భార్యాభర్త లిద్దరూ కార్మికులుగా పనిచేస్తుంటే పగలు వారిపిల్లలు తల్లుల కోసం రోదిస్తూ ఆకలికి ఏడుస్తూ ఉండే పిల్లల్ని తలచుకుంటూనే నాటి పనిని పూర్తిచేసి మాతాకార్మికులు ఇల్లుచేరతుంటారు. ఫ్యాక్టరీలో కూలీగా చేస్తున్నా భర్త మద్యపాన వ్యసనానికి బానిసుడవుతుంటే తల్లిపాలు సరిలేక ఒకామెయొక్క పిల్ల ఏడుస్తోందనీ, ఆమె నీరసించటంచేత ఫ్యాక్టరీ పనికి వెళ్ళటంలేదు. అలా నీరసంగా ఉండికూడా కూలికి వెళ్ళినప్పుడు, ఆమెను, ఆమె తోటి కార్మికులను మనుషులుగా గాక యంత్రాలుగా చూసే మిల్లు యజమానియొక్క సౌభాగ్యానికి తనకూ ఉన్న తేడా ఆమెకు గ్రహింపుకు వచ్చింది. యజమానికి, కార్మికులకు ఉన్న అంతరం ఆమెకు అర్థం అయింది. పోయిన నెలలో కొన్నాళ్ళు పనిచేసిన కాలానికి కూలిని అడగటానికి యజమాని దగ్గరకు వెళ్ళింది. పిల్లల ఆకలిబాధను గురించి చెప్పినా, అతడు కూలీని ఇవ్వకపోగా తన కోర్కెను తీరిస్తే ఇస్తానని చేయిపట్టుకుంటుంటే ఆమె విదిలించేసరికి కూలిదానికింత పొగరా అని బలాత్కరించబోతాడు. అదే సమయంలో ఆ యజమాని బాకీ తీర్చటానికి వచ్చిన ఋణగ్రస్తుడొకడు గమనించి ఆమెను కాపాడుతాడు. ఆ కూలిదాని జీవిత చరిత్రను విన్న తరువాత కార్మిక సంఘం ఏర్పరచాల్సిన అవసరం ఉందని ఆ కార్మిక శ్రేయోభిలాషి భావించి, ఆమెకు తిండికి డబ్బులివ్వగా, ఆమె ఇంటికి వెళ్ళింది. ఆమె భర్త ఆ డబ్బులు తీసుకోవాలని భావించి ఆ డబ్బును అడిగుతాడు. ఆమె ఇవ్వనందుకు ఆమెను కొట్టాడు. కాని ఆ తరువాత ఆమె భర్త శ్రేయోభిలాషుల యొక్క హితబోధతో త్రాగుడు మానేసాడు. 5 సంవత్సరాల తర్వాత ఆ శ్రేయోభిలాషి తన ఆస్తితో ఆ కార్మికవాడ రూపురేఖలు మార్చాడనీ, బడులు కట్టించాడనీ, అందుకే నాడు కార్మిక సమితి వార్షికోత్సవంగా ఊరేగింపుచేస్తూ జాతీయగీతాలు పాడుకుంటున్నారని కథలో తెలియజేయటం జరిగింది.

ఇంటా, బయటా కార్మికస్త్రీలు కష్టాలలో నలిగినట్లు అర్థమవుతుంది. కార్మికుల కష్టాలు తీరాలంటే కార్మిక సంఘాలు ఏర్పడాల్సిన అవసరాన్ని సూచించిన కథ ఇది. ముఖ్యంగా మహిళా కార్మికులు బిడ్డ ఏడుస్తున్నా పాలివ్వలేని స్థితి, చేసిన పనికి కూలీ ఇవ్వకపోవటం, భర్త వ్యసనంవల్ల ఇంట్లోని ఆర్థిక దుస్థితి, చేసినపనికి కూలి అడిగినందుకు ఇవ్వకపోగా యజమాని-కార్మిక సంబంధాలలో భాగంగా మహిళా కార్మికురాలుకి అదనంగా లైంగిక వేధింపులుంటాయని తెలియజేసిన

కథ. 1926 లో కార్మిక సంఘాల చట్టం ఏర్పడినా, అవ్యవస్థీకృత రంగంలోని కార్మికులకు రక్షణ లేదని గుర్తించాలి. అంతేకాక పని ప్రదేశంలో యజమానినుండి స్త్రీకార్మికులలకు లైంగిక వేధింపులు అదనంగా ఉంటాయని అర్థం అవుతుంది. సాహిత్య సృజన జరిగిన తర్వాత అసంఘటిత రంగాలలోని కార్మికుల హక్కుల రక్షణకు స్వతంత్ర భారతదేశం 1970 లో చట్టాన్ని తీసుకువచ్చింది.

భారతదేశంలో కమ్యూనిష్టుల అభ్యుదయ దృక్పథానికి ప్రచారం జరుగుతున్న రోజులలో దాని ప్రభావంతో స్త్రీకార్మిక అభ్యుదయం కోరుతూ కార్మిక సంఘాల ప్రాధాన్యతను తెలుపుతూ వచ్చిన కథ ఇది. వ్యవస్థీకృత రంగంలో యూనియన్ చట్టాలు 1926సం.లో వచ్చాయి గాని అవ్యవస్థీకృత / అసంఘటిత రంగాలలో పనిచేసే ఒప్పంద కార్మికుల రక్షణకై కార్మిక సంఘాలు ఏర్పడాల్సిన అవసరాన్ని సూచించింది.

క్రొవ్విడి మాణిక్యాంబ వ్రాసిన 'శాసనసభలు – స్త్రీ కర్తవ్యం' (ఫిబ్రవరి 1938 గృహలక్ష్మి పత్రిక) అనే వ్యాసంలో నూతన సంస్కరణలవల్ల శాసనసభలలో కొంతమంది మహిళలు ఎన్నుకో బడటం, మరికొంతమంది నియమింపబడటం జరుగుతుందనీ, పరిపాలనలో స్త్రీలకుకూడా పురుషులవలె సమానహక్కులున్నాయనీ, దీనికి స్త్రీ సంఘాలు కృషి చేయాలని తెలియజేసింది.

కొమర్రాజు అచ్చమాంబ రాసిన 'నేటి రాజకీయాలు–స్త్రీలు' (జూన్ 1937, గృహలక్ష్మి) అనే వ్యాసంలో రాజకీయార్థిక విషయాలలో పురుషునితో సమానమైనహక్కు, బాధ్యత, వ్యక్తిత్వంతో సంపూర్ణస్వేచ్ఛగా పెరిగే అవకాశాలు స్త్రీలు ఏర్పరచుకోవాలనీ, దానికై స్త్రీలు శాసనసభ్యురాండ్రుగా ఎదిగితేనే దేసరాజకీయస్వాతంత్ర్యానికి స్త్రీలు తమ యావచ్ఛక్తిని వినియోగించగలరని చెప్పింది. స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్యం దేశస్వాతంత్ర్యానికి మూలస్థంభంవంటిది.

అ.రాధమ్మ రాసిన 'స్త్రీలు–నిర్బంధబాలికావిద్యాశాసనం' వ్యాసంలో (మార్చి 1938 గృహలక్ష్మి) అని బాలికలకు నిర్బంధవిద్యను ప్రవేశపెడుతూ శాసనం

చేయాలని తెలిపింది. దీనికి ప్రేరణాంశంగా 1938 సం.లో చదువుకున్న స్త్రీలకు ఓటుహక్కు వచ్చిందనేది భావించాలి.

దర్శి సుభద్రమ్మ దేశంలో దారిద్ర్యం, బానిసత్వం స్త్రీలను మరింతగా అణగద్రొక్కుతుంటే స్త్రీలకు స్వేచ్ఛగానీ, ఆర్థిక, రాజకీయ, సాంఘికహక్కులుగాని ఉండవనీ, అవి ఉండాలంటే దేశ ఆర్థికవిధానం మారాలనీ, స్త్రీలుకూడా స్వాతంత్ర్యం తమ జన్మ హక్కు అని భావించాలని చెప్పింది.

దర్శి సుభద్రమ్మ వ్రాసిన 'భారతస్త్రీల ప్రస్తుత స్థితి' (మే 1938 గృహలక్ష్మి) అనే వ్యాసంలో దేశంలో దారిద్ర్యం, బానిసత్వం ప్రజలను బాధపెట్టుంటే స్త్రీలు మరింతగా అణగద్రొక్కబడుతుంటే,

స్త్రీలకు స్వేచ్ఛగానీ, ఆర్థిక, రాజకీయ, సాంఘిక హక్కులుగానీ లేవని తెలిపింది. స్త్రీల సమస్యలను ప్రత్యేకంగా చూడటం కాక అవి పురుషుల సమస్యల్లో కలిసి ఉన్నాయనీ, అవి ప్రజలందరి సమస్యగా భావించాలనీ తెలియజేసింది.

స్త్రీల 'అణిచివేత' విశ్వరూపాన్ని తెలియజేయటం నాటికది క్రాంతదర్శనం. స్త్రీలకు ఉండవలసిన హక్కులను పేర్కొంది. స్త్రీల సమస్యలు పురుషుల సమస్యల్లోనే ఉన్నాయన్న భావన కాలం గడిచిన కొద్దీ నిరూపింపబడుతున్న సత్యం. ఓల్గా వ్రాసిన విముక్త వంటి కథాసంపుటిలో ఈ సత్యమే తెలియజేయబడింది.

ఈమె వ్రాసిన 'భారతస్త్రీలఉద్యమం – భావపరిణామం' (అక్టోబరు 1938 గృహలక్ష్మి పత్రిక) అనే మరొక వ్యాసంలో ప్రపంచ స్త్రీలు తమ సంకెళ్ళను తెంచుకోవటానికి చేస్తున్న ఉద్యమ ప్రభావం భారతస్త్రీల మీద కూడా ఉండి పరివర్తన ఏర్పడుతోంది కానీ పురాణాలు, ధర్మశాస్త్రాలు, మూఢభక్తి విశ్వాసాలు భారతదేశస్త్రీల సంకెళ్ళను తెంచలేకపోతున్నాయని తెలిపింది. సంఘసంస్కరణలను, శాసనాలను ఆచరణలో పెట్టటం లేదనీ, భారత స్త్రీల అభ్యుదయానికి స్త్రీ ఉద్యమం వచ్చినా ఆశయం నెరవేరటంలేదనీ తెలిపింది. కొంతవరకు ప్రభుత్వపుపాలన భారతీయుల స్వాధీనంలోకి వచ్చింది కనుక సాంఘిక లోపాలను తొలగించి స్త్రీలను ఉన్నతదశకు తేవాలనీ, స్త్రీల యొక్క ప్రతి విషయం ఆర్థిక, రాజకీయ, సాంఘిక పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది కాబట్టి ప్రధానమైన దేశఆర్థిక విధానం మారాలి చెప్పింది. స్త్రీలకు ఆర్థిక, రాజకీయ, సాంఘిక హక్కులు కావాలని, భారతదేశ స్త్రీలు స్వాతంత్ర్యం తమ జన్మహక్కని భావించాలని దర్శి సుభద్రమ్మ తెలియజేసింది.

యెల్లాప్రగడ సీతాకుమారి వ్రాసిన 'పునిస్త్రీ పునర్వివాహం' (1937 ఆంధ్రపత్రిక వార్షిక ఏప్రిల్ సంచిక) అనే కథలో పెళ్ళిచేసుకున్న యువకునికి తెలియకుండానే ఆతని తండ్రి వియ్యంకునితో కట్నం పూర్తిగా యిచ్చినప్పుడే పిల్లను కాపురానికి తీసుకువెడతానని చెప్తాడు. ఇటు కొడుకుతో అమ్మాయిని వారు కాపురానికి పంపడం లేదని అబద్ధమాడి అతడికి మళ్ళీ పెళ్ళి చేయాలనుకొంటాడు. అదే సమయంలో, ఆ పెళ్ళికూతురు తన స్నేహితురాలియొక్క భర్తయే తనను పెళ్ళి చేసుకుంటున్నాడని తెలిసుకొని, ఆమె తనకు కాబోయే వాడితో అతని మాజీ భార్యకు విడాకులిప్పిస్తుంది. ఆ స్నేహితురాలు కూడా విడాకులు తీసుకొని, తనని ఇష్టపడిన వ్యక్తిని రెండవ పెళ్ళిచేసుకొంటుంది.

విడాకులచట్టం అప్పటికి రాలేదు కాబట్టి పురుషులకు రెండవ పెళ్ళి చేసుకోగల స్వతంత్రం ఉండటంతో దానికి విరుగుడుగా స్త్రీ చేసిన ప్రయత్నం అర్థమవుతుంది. పురుషుడు రెండో పెళ్ళి చేసుకునే అవకాశం ఉన్న రోజుల్లో, విడాకుల చట్టానికి అంకురార్పణగా పరస్పరం విడాకులు

తీసుకుంటే స్త్రీ కూడా పునర్వివాహం చేసుకునే స్వతంత్రం కలిగియుండటమే స్త్రీపురుషుల సమాన హక్కుకు నిదర్శనమని ఈ కథలో భావించటం అర్థం అవుతుంది. ఇది స్త్రీలు వైవాహిక స్వాతంత్రాన్ని పొందటానికి చేరుకొన్న మరోమెట్టు. మునుపు వితంతువుల పునర్వివాహచట్టం ఉన్నది కాని విడాకులచట్టం లేనందువల్ల భర్తపరిత్యక్తయైన స్త్రీనిపెళ్ళిచేసుకోవటమే పునిస్త్రీ పునర్వివాహం చేసుకోవటం అనే ఒక నవీన సాంస్కృతిక ఆలోచనను ముందుకు తీసుకురావటం జరిగింది.

'శ్రీమతి సుబ్బరాయను గారి బిల్లు' (సెప్టెంబరు 1938గృహలక్ష్మి) ను గురించి కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాస్తూ ఈ బిల్లును స్త్రీ, పురుషులకు వర్తింపజేయాలని భావించినా అందులోని మినహాయింపులను సవరించాల్సిన అవసరం ఉందని తన అభిప్రాయలను తెలియజేస్తూ పురుషుల బహుపత్నిత్వాన్ని నిరోధించటం బిల్లుయొక్క ఉద్దేశ్యమని తెలిపింది. భార్యలపై హక్కుఉంటుందని భావించే మగవారును, అల్లుడుగా అడిగినపుడల్లా అత్తవారు తనకు డబ్బుఇవ్వనప్పుడును, పిల్లలు కలుగలేదనే వంకతోనూ పురుషులు మరొక స్త్రీని వివాహ మాడటం సబబుకాదనీ, భర్తచే అవమానింపబడిన స్త్రీని సమాజంలోని పురుషులు అవమానంగా చూస్తారనీ అది అత్యాచారం కంటే దుర్భరమని చెప్పింది. భార్య ఉన్నప్పుడు భర్త వివాహమాడటానికి ఇచ్చిన మినహాయింపులు ఉచితంగా లేవని తెలియజేసింది. అయిదు సంవత్సరాలు వ్యాధి గల భార్యను, ఐదేండ్లు భార్యకు దూరంగా ఉన్నాకానీ, ఆమె వ్యభిచారిణిగా ఒక సంవత్సరంపాటు ఉన్నాగానీ, ఆరోగ్యానికి భద్రత గానీ, భంగకరమగు క్రూరప్రవర్తన కలిగియున్నాగాని అటువంటి భార్యల విషయంలో భర్తలు సివిల్ కోర్టులో పిటిషన్ వేసినచో అతనికి కోర్టు పునర్వివాహనికి అనుమతినివ్వవచ్చని బిల్లులో ఉందని చెప్పింది. ఈ మినహాయింపులు స్త్రీలకు కూడా వర్తిస్తాయని చెప్పినా, 'స్త్రీ వ్యాధిగ్రస్థురాలైతే పుట్టింటివారిచ్చిన కట్నాన్ని, సొమ్ములోను ఆస్తిలో మూడవ వంతు భాగాన్ని ఆమెకు కోర్టులో ఇవ్వాలనీ', దూరంగా ఉన్నారని విడాకులు ఇవ్వవచ్చని భావిస్తే, బిల్లు యొక్క ప్రయోజనం ఉండదని భావించింది. అంతేకాదు దేశంలో చేయబడిన చట్టాలు చేసేటప్పుడు అన్ని వర్గాల వారిని గురించి ఆలోచించాలనీ, రాధాబాయి సుబ్బరాయనుగారు విద్యాధికులను సంపన్నులను తమ దృష్టిలో పెట్టుకొని ఈ బిల్లును రూపొందించినట్టు అర్థమవుతోందని భావించింది. శాసనాలకంటే నైతిక ప్రవర్తన ముఖ్యమనీ, సనాతన ధర్మపరులు కాలానుగుణమార్పులను అంగీకరిస్తేనే దేశం అభివృద్ధిచెందుతుందని కనుపర్తి వరలక్ష్మమ్మ అభిప్రాయపడింది.

ద్వివేది సత్యవతి బిల్లును (అక్టోబరు 1938 గృహలక్ష్మి) గురించి వ్రాస్తూ రాధాబాయి సుబ్బరాయనుగారు శాసనసభలో పెట్టాలనుకున్న బహుపత్నినిరోధ చట్టానికి తన స్పందనను తెలియజేస్తూ, భార్యకు తెలియకుండా భర్త మరోపెళ్ళి చేసుకొనే అవకాశాలు ఎక్కువగా ఉన్నప్పుడు

ఐదు సంవత్సరాలు సంతానవతిగా అనారోగ్యంగా ఉంటే ఆమె బాధ్యతను భర్త పట్టించుకోవాలనీ, భారతీయ స్త్రీ అనారోగ్యం కలిగి ఉన్నా భర్తకు శుశ్రూష చేసుకొనే తత్త్వం ఆ స్త్రీలకుంటుంది కాబట్టి ఆ షరతును తీసివేయాలని చెప్పింది. అసలు భార్యను గౌరవంగా చూసుకుంటే భర్తకు భార్యలో ఏలోపం కనపడదనీ చెప్పింది. ఈ బిల్లువల్ల భర్త భార్యయొక్క అనారోగ్యకారణాలను చూపి విడాకులు తీసుకొనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి కాబట్టి బిల్లును గురించి లోతుగా ఆలోచించాలని తెలియజేసింది.

దీనికి అనుబంధంగా ఈ పత్రికలోనే ఒం.వెంకటరత్నమ్మ వ్రాస్తూ స్త్రీలకు నిర్భంధ విద్యాశాసనం లేకపోవటంతో స్త్రీలు చదువుకోకపోయేసరికి విద్యావంతుడైన భర్తకును ఆమెకును అంతరం ఎక్కువగా ఉంటోందనీ, అందుకనే ఏభైయేళ్ళ ముసలివాడు భార్య చనిపోయినా చిన్నపిల్లలను పెళ్ళి చేసుకోకూడదనే షరతు పెట్టాలనీ, యాక్టులను పకడ్బందీగా రూపొందించాలని పేర్కొంది. స్త్రీ విద్యకు, ముసలివాళ్ళ పునర్వివాహ సంస్కృతి ఉన్న లంకెను తెలియజేసింది. వివాహ చట్టాలకు–స్త్రీ విద్యకు ఉన్న సంబంధాలను గుర్తింపుకు వచ్చేటట్టు చేసింది.

దీనికి అనుబంధంగా ఈ పత్రికలోనే మేరీ కె.మాణిక్యాంబ బిల్లును గురించి తన అభిప్రాయాన్ని తెలుపుతూ రాధాభాయి బిల్లునందు చూపబడినట్లుగాక, కారణాలులేకుండానే పురుషుడు పెళ్ళిచేసుకుంటే ఆ పురుషుడికి ఆతడు పెండ్లాడే స్త్రీకి, ఆ స్త్రీయొక్క తల్లిదండ్రులకు శిక్షలను వేసే విధంగా బిల్లును సవరించాలని చెప్పింది. ఐదు సంవత్సరములు జబ్బుగాఉన్న భార్యను వదిలిపెట్టి భర్త పునర్వివాహము చేసుకొంటే, భార్యయొక్క రోగానికి ఋజువు చూపించినపుడు భార్యకు ఆస్తిలో మూడవభాగం ఇవ్వాలని సూచించింది. ఆమెయొక్క 'స్త్రీధనాన్ని' తిరిగి ఇచ్చేయాలనీ, బిల్లులో ఉందికాని ఆస్తిలేని భర్త విడాకులిచ్చేటప్పుడు భార్యకు ఏమివ్వగలడనీ, మరియు స్త్రీధనాన్ని భర్తచదువుకు, అవసరాలకు వాడితే ఇంక స్త్రీధనము ఎక్కడుంటుందని భావించింది. భర్త ఉద్యోగస్థుడైతే వేతనములో మూడవవంతు ఇవ్వాలనీ, పిల్లలు మైనర్లయితే వారివిద్య, పోషణకు డబ్బులివ్వాలని తెలియజేసింది. అంతేకాక 5 సంవత్సరములనుండి అనారోగ్యురాలైన భార్యకు పరిహారము ఇవ్వకుండానే విడాకులు ఇవ్వకూడదనీ, భర్త రహస్యపుపెళ్ళి చేసుకొని కోర్టులో అబద్ధమాడితే భార్య ఏ రకంగా ఋజువుచేయగలదని తెలియజేసింది. పుట్టింటివారు చేరదీయకపోతే ఆమెకు ఆత్మహత్య ఆధారమనీ, భర్త వేశ్యాలోలుడై భార్యను పరిత్యజించ గలుగుతాడు కాబట్టి వ్యభిచారవృత్తి పూర్తిగా నిర్మూలనం అయ్యేవరకు బిల్లుయొక్క ప్రయోజనము ఉండదని చెప్పింది. ప్రతిస్త్రీ తాను పరిణయం చేసుకొనేటప్పుడు భార్యనువదలిన పురుషుడిని వివాహము చేసుకోకుండా ఉండటమే

స్త్రీల కర్తవ్యమని తెలియజేసింది. ప్రేమరాహిత్యమే విడాకులకు దారి తీస్తోందని భావించింది. చట్టనిబంధనలు స్త్రీలకు సమస్యకాకుండా స్త్రీలే నిర్ణయించుకొనే విధంగా అటువంటి పురుషుడికి రెండవ భార్యగా వెళ్ళకూడదనికూడా భావించింది.

కొరప్రోలు వెంకటరంగమ్మ వ్రాసిన 'శ్రీమతి సుబ్బరాయనుగారిబిల్లు – ఇది ఎట్లు పరిణమించునో' (నవంబరు 1938 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీ–పురుషల ప్రేమలతకు కొడవలి వంటి బిల్లును సవరణలతోనే తేవాలనీ, అప్పుడే ఆ బిల్లు ప్రయోజనకారి కాగలుగుతుందని భావించింది.

దీనికి అనుబంధంగా ఈపత్రికలోనే నెమలి చంద్రమతి వ్రాస్తూ 'బహుపత్నీత్వ నిరోధచట్టం' అవసరంగానీ, విడాకుల చట్టం అవసరంలేదనీ, భార్యభర్తలు విడిపోరాదని తెలిపింది. భర్తలు దుర్మార్గులైతే శిక్షించేటట్లుగా చట్టాలు ఉండాలనీ, త్రాగుబోతు, పరస్త్రీలోలుడు, భార్యను పీడించే వాడు, భార్య జీవించి యుండగా మరొక స్త్రీని వివాహమాడే భర్తలను శిక్షించే చట్టాలు కావాలని భావించింది.

వేదవల్లి తాయారమ్మ బిల్లుకు 'సవరణలు కావలెనా'? (నవంబరు 1938 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ భారతదేశంలో స్త్రీ తన భర్తతో విడాకులంటే గుండెలు బాదుకునే స్థితి అనీ, ఐదేండ్ల తర్వాత ఆనారోగ్యవతియైన స్త్రీని పోషించే బాధ్యత ఎవరు తీసుకుంటారనీ, పురుషుల జారత్వం నిరూపించటం కష్టమని తెలిపింది. చట్టంలోని వెసులుబాటుతో పురుషుడు రెండో వివాహం చేసుకుని ఆ స్త్రీని భార్యతోపాటు కలిపి ఉంచితే నష్టాలేఉంటాయనీ, కనీస మనోవర్తికూడా లేక చచ్చిపోయే పరిస్థితి అనీ, ఈ బిల్లువల్ల పురుషులలో పునర్వివాహ ఇచ్ఛను రేకెత్తించటమేననీ, వాటికి విరుగుడుగా బాల్యవివాహాలుమాని స్త్రీ పురుషులిద్దరూ పరస్పరం అర్థం చేసుకొనే ప్రౌఢవివాహాలు రావాలని తెలియజేసింది.

పాలూరి సత్యకుమారి 'శ్రీమతి సుబ్బరాయను గారి బిల్లు' (డిసెంబరు 1938 గృహలక్ష్మి) ను గురించి వ్రాస్తూ పురుషులకే ఉపయోగంగా ఉంటుందనీ, చట్టంలోని విషయాలలో భార్యను పురుషుడు వదలిపెడితే ఆస్తి లేని ఆ భార్య ఎలా బ్రతుకుతుందనీ, అలా వదిలిపెట్టే భర్త భార్యకు తన ఆస్తిలోగాని, తన జీతంలోగాని 3 వ వంతు భార్యకు ఇస్తేనే విడాకులకు స్త్రీలు ఒప్పుకోవాలని సూచించింది. భర్త విడాకులిస్తే భార్యకు భరణం ఇవ్వాల్సిన అవసరాన్ని తెలిపి భరణం ఇవ్వాలంటేనే భర్త భార్యనుంచి విడాకులు తీసుకోవటానికి కాస్త వెనకాడతాడని తెలియజేసింది. వితంతుస్త్రీల భరణంవంటిది కాక భర్తనుండి విడాకులు తీసుకొన్న స్త్రీకి భరణం యిచ్చే స్థితి ఉండాలని భావించింది.

దీనికి అనుబంధంగా రచయిత్రులు రాధా సుబ్బరాయను ప్రవేశపెట్టబోయే విడాకుల బిల్లును గురించి తమ అభిప్రాయాలను తెలియజేసారు.

కాకులపాటి రాధాసుందరమ్మ 'పురుషుల కవకాశమీయరాదనీ' (డిశెంబరు 1938, గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ భార్య జబ్బుకు భర్త మందులిప్పించాలిగానీ, దాని బదులు మరొక స్త్రీని వివాహమాడటం అమానుషత్వం అనీ, ఆమెయొక్క నగలను, తన ఆస్తిలో సగభాగాన్ని ఆమెకు ఇచ్చి విడాకులివ్వవచ్చునీ తెలియజేసింది.

దీనికి అనుబంధంగా ఈ పత్రికలోనే ఈ బిల్లును గురించి రామాబాయమ్మ వ్రాస్తూ బిల్లు స్త్రీలకు మహోపకారాన్ని కలిగిస్తుందనీ, విడాకులు తీసుకొని స్త్రీలు నిర్భయంగా బ్రతకవచ్చునీ, భర్తల, అత్తమామల దౌర్జన్యం భరించక్కరలేదనీ, శాసనసభ్యులందరూ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించాలని తెలియజేసింది. భర్త సరియైనవాడు కానప్పుడు విడాకులు కోరుకోవటమే నయమని ఈ రచయిత్రి అభిప్రాయపడింది.

ఈ పత్రికలోనే పంగలూరి రాజ్యలక్ష్మి 'హెచ్చరిక' చేస్తూ రోగిష్ఠి భార్య అయినా పురుషుడు మరో వివాహం చేసుకున్నా మొదటి భార్యను ఇంటిదగ్గరే చూసుకొనే బాధ్యత వహించాలనీ పురుషుని యొక్క వైవాహిక బాధ్యతను తెలియజేసింది.

ఇదే పత్రికలో డి.భారతీదేవి బిల్లును 'పురుషులకే వర్తించవలెను' అని వ్రాస్తూ స్త్రీ వితంతువివాహ నిషేధం ఉన్నచోట స్త్రీలకు ఈ బిల్లువల్ల ప్రయోజనం ఉండదనీ, ఇది పురుషులకే మిక్కిలి ఉపయోగకరమనీ, పురుషుడు భార్యకు ఐదేండ్లు దూరంగా ఉండి భర్తరాకకై ఎదురుచూస్తున్న భార్యకు విడాకులివ్వటం సమంజసం కాదని తెలిపింది. పురుషులు స్వల్ప విషయాలకే ఋజువు చేసినట్లుగా స్త్రీలు చేయలేరనీ, అనారాగ్యపీడిత భార్యకు నష్టపరిహారమివ్వక విడనాడే ఈ బిల్లును నిరాకరించాలని చెప్పింది.

కందర్ప కమలకుమారి ఇదే పత్రికలో 'సవరించాలి' అంటూ వ్రాస్తూ బిల్లు సవరణకు సూచనలిస్తూ ద్వితీయ వివాహం చేసుకునే పురుషుడికి పిల్లనిచ్చే తల్లిదండ్రులను, పెండ్లాడే పిల్లను శిక్షించాలనీ భార్య సుఖదుఃఖాలను పట్టించుకోని భర్తను విడిచివేయాటానికి ఆమె మూగజీవికాదనీ, అవసరమైన మూడవ వంతు జీతాన్నిచ్చి కోర్టులో విడాకులు తీసుకోవాలనే సవరణను చేయాలనీ ప్రతిపాదించింది.

రాధాసుబ్బరాయను బిల్లును సవరించే విషయంలో రచయిత్రి ఇంకొక అడుగు ముందుకువేసి పురుషుడి ద్వితీయ వివాహానికి పిల్లనిచ్చేవారిని కూడా చట్టపరంగా బాధ్యుల్ని చేస్తే పురుషునికి ద్వితీయ వివాహాలను తగ్గించవచ్చని భావించింది.

భూపతిరాజు వెంకమ్మ వ్రాస్తూ 'బిల్లును దీర్ఘరోగాలకే వర్తింపచేయాలని' (డిశెంబరు 1938, గృహలక్ష్మి) శాసనాల ద్వారా భర్తలకు సహనాన్ని కలిగించాలిగానీ, ద్వితీయ వివాహానికి అనుమతి ఉండకూడదనీ, పురుషులు కోర్టుకెళ్ళినట్లుగా రోగిష్ఠి భర్త విషయంలో స్త్రీలు వెళ్ళలేరనీ, ఒండొరుల యిష్టప్రకారం నష్టపరిహారం ఇచ్చి విడాకులు పొందవచ్చని అభిప్రాయపడింది.

స్త్రీలోలుడై, పీడించే భర్తనుండి విముక్తి పొందే ఈ విడాకుల బిల్లు భార్యలకు ఉపయోగ పడుతుందనీ, స్త్రీలందరూ ధైర్యంగా బిల్లును ఆమోదించాలని పాకల రాజమణి అభిప్రాయపడింది.

స్త్రీలు భర్తపరిత్యక్తలవుతున్నప్పుడు స్త్రీల స్వీయపోషకత్వానికి వీలుగా బిల్లును తయారుచేస్తున్న క్రమంలో స్త్రీల అభిప్రాయసేకరణతో శాసనసభ్యురాండ్రు బిల్లును ప్రవేశపెడితే బాగుంటుందని అనుకొన్నారు. విడాకుల బిల్లు ప్రతిపాదనల స్థాయిలోనే బిల్లును గురించిన చర్చలు పత్రికా ముఖంగా రాగలిగితేనే రాజ్యాంగ శాసనంలో స్త్రీల ఆలోచనలకు ప్రాతినిధ్యం ఉంటుందనే భావన అర్థం అవుతుంది.

'పెళ్ళిళ్ళు రిజిష్టరు చేయుట అవసరము' (డిసెంబరు 1938 భారతి) అనే శీర్షికన బి.కామేశ్వరమ్మ వ్రాస్తూ అఖిలభారత మహిళాసభలకు సంబంధించిన సభలలో స్త్రీలు తమకు సమాన హక్కులు కావాలనీ, పెళ్ళిళ్ళు రిజిష్టరు చేయాలనీ, రాధాబాయ్ సుబ్బరాయన్ భారత శాసనసభలో బిల్లును ప్రతిపాదింప బోతున్నారని తెలియజేసింది. శాస్త్రాలు స్త్రీలపట్ల వివక్షతను చూపిస్తున్నా, భర్త ఆస్తికి భార్య వారసురాలు కావల్సిన అవసరాన్ని గుర్తించాలనీ, ఏదో ఒక నెపం మీద భర్త, భార్యను వదిలిపెట్టకూడదనీ, సివిల్ మారేజి చట్టం 1872 వర్ణాంతర, మతాంతర వివాహాలను అనుమతించింది కాబట్టి పెళ్ళిళ్ళను రిజిష్టరు చేస్తే స్త్రీలకు చట్టపరమైన రక్షణ ఉంటుందని తెలియజేసింది.

కుటుంబంలో కారణాలను సృష్టించి భార్యలను వదిలించుకునే భర్తలకు చెంపపెట్టుగా భార్యలకు రక్షణ కవచాన్ని ఏర్పాటుచేయాల్సిన అవసరాన్ని ఆనాడే గుర్తించటం జరిగింది. విడాకుల బిల్లు కంటే ముందుగా పెళ్ళిళ్లు రిజిష్టరు చేయబడేవిధంగా స్త్రీలు చట్టపరహక్కులను పొందగలిగితేనే రాధాబాయి సుబ్బరాయన్ బిల్లులో ఉన్నట్టుగా భార్యలు కోర్టులలో తమ పెళ్ళిని నిరూపించుకో గలుగుతారని భావించటం రచయిత్రి ముందుచూపుకు నిదర్శనం.

స్త్రీలు తమ సమస్యలయొక్క నివారణకై చట్టాలు చేయాలని కోరుకొంటూ బిల్లును ప్రతిపాదించగానే స్త్రీలు ఆ బిల్లుపై తమ అభిప్రాయాలను వ్యక్తంచేయటంతోపాటు, దానికి చేయాల్సిన సవరణలను సూచించటమంటేనే స్త్రీలు తమకున్న సాంఘిక, ఆర్థిక, రాజకీయహక్కులను

ఉపయోగించాలను కోవటంగా అర్థమవుతుంది. స్త్రీలు కుటుంబంలోని సంస్కృతిని ప్రశ్నిస్తూ వివాహం తమప్రగతికి అడ్డుపడకుండా దాన్ని ఎదుర్కొనే క్రమంలో అవసరమైన విడాకులు తీసుకోవచ్చనుకొని, దానికి బిల్లును ప్రవేశపెడుతూ దాని ఉద్దేశాలను విమర్శకు పెట్టుకోవటం జరిగింది. కాని ఆబిల్లు ఆస్తిలేని స్త్రీలకు వీలుగాలేదనీ, అందుకని ఆ భార్యకు ఆస్తిని ఇవ్వాలని భావించారు. పెళ్ళి రిజిష్టరు చేయాలనే ఆనాటి ప్రతిపాదన 40 ఏళ్ళ తరువాత చట్టరూపం దాల్చింది. బిల్లుకంటే కూడ ఆధునిక పరిస్థితులకు అనుకూలంగా ప్రజలలో రావల్సిన మార్పు ముఖ్యమని భావించింది. ఎప్పటికప్పుడు రచయిత్రులు వ్రాసిన వ్యాసాలలో వారికున్న రాజకీయచైతన్యపు స్పృహ స్పష్టమవుతోంది.

1860 లో బ్రిటిష్ ప్రభుత్వం చేసిన అన్యసంబంధాల నిషేధచట్టం ఉన్నా నిరుపయోగం అని స్త్రీలు ఆనాడే భావించారు. అందుకే నేడు నేరవిచారణ సంహిత 1973 (సి. ఆర్.పి.సి) లోని 497 సెక్షన్ ను రద్దుచేయటం జరిగింది.

కామరాజు సరోజినీ దేవి వ్రాసిన 'ఏ జీవిక స్త్రీలకు?' (ఏప్రిల్ 1939 భారతి) అనే వ్యాసంలో స్త్రీవిద్యవల్ల స్త్రీలకున్న హక్కులేమిటో అర్థమవుతాయనీ, ఆర్థికస్వాతంత్ర్యం ఉంటేనే వారికి దాస్యవిమోచనం కల్గుతుందనీ, స్త్రీలలో స్వయంనిర్ణయం చేయగలశక్తి పెరుగుతుందని భావించింది. తమహక్కులకోసం పోరాడాలంటే న్యాయశాస్త్రపఠనం అవసరమని తెలియజేసింది.

సామాజిక, రాజకీయమార్పులకు అనుగుణంగా స్త్రీల జీవికకు, స్త్రీలధర్మాలు మారాల్సిన అవసరం ఉందనీ, అప్పుడే స్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యం ఏర్పడే వీలుంటుందనీ, ఆ జీవిక, జీవితం స్త్రీలకు ఉండాలని భావించింది.

సోమయాజుల లక్ష్మీకాంతమ్మ వ్రాసిన 'స్త్రీలకు స్వాతంత్ర్యమవసరము' (అక్టోబరు 1939 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీలను హృదయరాణి అంటుంటే సంతృప్తి పడక విద్యావంతులై పురుషుల అన్యాయాధికారాన్ని తిరస్కరించాలని తెలిపింది. భార్యత్వం దాసత్వానికి పర్యాయపదంగా భావిస్తున్నారనీ, స్త్రీస్థానం పురుషుని స్థానంబట్టి నిర్ణయింపబడుతోందని, స్త్రీల స్వాతంత్ర్య నిరోధమే అవినీతి అనీ, స్త్రీలు పరిశ్రమ చేసినప్పుడే స్వాతంత్ర్య ఫలాన్ని పొందటానికి అర్హులవుతారనీ, స్త్రీలను సమానంగా చూడాలనీ, స్త్రీలు తమ హక్కులకై పోరాడాలని తెలియజేసింది.

స్త్రీల స్వాతంత్ర్య నిరోధమే 'అవినీతి' అంటూ ఆ పదానికి క్రొత్త అర్థాన్ని నిర్వచించింది. స్త్రీలకు సమాజంలో కష్టపడి పనిచేసే మెసులుబాటు ఉండటమే స్త్రీలవ్యక్తి స్వాతంత్ర్యానికి అర్హతను ఇస్తుందని భావించింది. కుటుంబంలోగాని, సమాజంలోగాని పురుషుడు స్వతంత్రుడైతేనే స్త్రీని గౌరవించగలడనీ, అప్పుడే స్త్రీపురుషసమానత్వం కలుగుతుందని భావించింది.

ఆ క్రమంలోనే 1938 నాటికి స్త్రీలుపురుషులతో సమానంగా జీవించేహక్కు ఉంటేనే స్త్రీలస్వతంత్రజీవన హక్కుకు రక్షణ ఉంటుందని భావించారు. 1938 లో బత్తుల కామాక్షమ్మ ఆంధ్రాయూనివర్సిటీ సెనేట్ మెంబరుగా విద్యావిధానంలో మార్పులను ప్రవేశపెట్టిందనీ, పురపాలకసంఘసభ్యురాలిగా స్త్రీవిద్యాభివృద్ధికి కృషిచేసింది. అందుకే 1939లో స్త్రీవిద్యవల్ల వారికి స్త్రీల హక్కులను గురించి తెలుస్తుందని కామరాజు సరోజినీదేవి తన వ్యాసంలో తెలిపింది.

కనుపర్తి వరలక్ష్మమ్మ 'మనసులో మాటలు' (జూన్ 1941 గృహలక్ష్మి) అంటూ వ్రాస్తూ 1937 వ సంవత్సరపు హిందూ స్త్రీల వారసత్వపు చట్టం గురించి అవగాహన కల్పిస్తూ స్త్రీలకు ఉపయోగకరమైన ఏ బిల్లును శాసనసభలో పెట్టినా అందులోనూ ఆస్తిహక్కుకు సంబంధించినది అయినచో ఏకాభిప్రాయంతో వ్యతిరేకిస్తారనీ, స్త్రీలను అణగద్రొక్కి వారికి తమతోబాటు సమానవాటా ఇవ్వటానికి పురుష శాసనసభ్యులు ఒప్పుకోరని తెలియజేసింది. విగతభర్తృకకు కొడుకులు చందాలు వేసుకొని మనోవర్తి ఇవ్వటం చాలా బాధాకరమనీ, కానీ 1934 లో విగతభర్తృకలకు హిందూస్త్రీల వారసత్వం చట్టాన్ని ఒప్పుకొన్నా దానికి అవాంతరం కల్గిస్తూ కేంద్రప్రభుత్వం వారసత్వానికి సంబంధించి వ్యవసాయ భూములు 1935, ఇండియా చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉంటాయి కాబట్టి వాటిని తప్పించి హక్కులిచ్చిందని తెలిపింది. వ్యవసాయ భూములే ఆస్తిగా ఉండేచోట ఆ వ్యవసాయ భూములివ్వనపుడు విగతభర్తృకలకు హిందూ స్త్రీల వారసత్వ చట్టం అనుపయోగమని భావించింది. వ్యవసాయభూములు వారసత్వంగా రావటానికి వీలుగా స్త్రీలు రాష్ట్రప్రభుత్వాన్ని అడగాలనీ, అవసరమైతే ఆవిషయంలో పోరాడాలని పిలుపునిచ్చింది.

'స్త్రీస్వాతంత్ర్యం' (ఉదయభారతి త్రైమాసిక పత్రిక డిశెంబరు 1940) అనే శీర్షికన నర్రా జానకీదేవి వ్రాస్తూ స్త్రీకి గృహిణి అనే పేరుపెట్టి పురుషుడు స్త్రీని గృహంలో బంధించి స్త్రీకి స్వాతంత్ర్యం లేకుండాచేసాడనీ తెలిపింది. స్త్రీలకు పురుషులకు సమానమైన చట్టాలు లేవనీ, సమర్థత ఉన్నా స్త్రీలకు ఉద్యోగాలు యివ్వరనీ, విద్య, వివాహం, పిల్లల విషయాలలోగాని, జీవిత నిర్ణయాలుగాని చేసుకొనే హక్కుగాని, స్వాతంత్ర్యంగాని స్త్రీలకు లేదని అభిప్రాయపడింది.

1941లో చెరుకూరి నాగభూషణమ్మ తనవ్యాసంలో స్త్రీలు తమశక్తిసామర్థ్యాలవల్ల గుర్తింపు పొందాలనీ, తమకు పురుషులకువలె హక్కులున్నాయని స్త్రీలు తెలుసుకుంటే తప్ప స్త్రీల అభివృద్ధి జరగదని చెప్పింది.

చెరుకూరి నాగభూషణమ్మ వ్రాసిన 'స్త్రీలు చెడ్డవారా?' (మార్చి 1941 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీలకు ఆస్తిహక్కు లేకపోవటంలో పురుషుడి దౌర్జన్యాధికారాల క్రింద యిక్కట్లుపడుతూ

భయంతో అబద్ధమాడవలసిన వారైనారనీ, స్త్రీల అస్వతంత్ర జీవనాన్ని గుర్తించక వారిపై దోషారోపణచేస్తూ కపటధర్మాలను అంటగడుతున్నారనీ, వారిని సమభాగినులుగా భావించి సర్వవిధమైన హక్కులు ఇస్తే వారెంతటి విజ్ఞానవంతులో సత్యసంధులో కూడా అర్థం అవుతుందనీ తెలియజేసింది.

ఈమెయే వ్రాసిన 'ఇంకెన్నాళ్ళు మనకీ బానిసత్వం' (అక్టోబరు 1941 గృహలక్ష్మి పత్రిక) అనే మరో వ్యాసంలో కుటుంబసంబధాలలోని అన్నిపనులలో పురుషులకు స్త్రీలు భయపడుతూ ఉంటున్నారంటే స్త్రీలకు స్వతంత్ర వ్యక్తిత్వం లేదనీ, స్త్రీలు తమ బానిసత్వాన్ని వారు గుర్తించలేక తాము మనుషులు అన్నవిషయాన్ని కూడా మరచిపోతున్నారని తెలిపింది. పురుషులకున్న హక్కులన్నీ తమకు ఉన్నాయని భావించి స్త్రీలు స్వతంత్రాన్ని పొంది పురుషుల సహకారంతో పరస్పర గౌరవంతో జీవనాన్ని సాగించాల్సిన అవసరాన్ని చెప్పింది. పురుషులతోపాటు ఆస్తి, వివాహం, విడాకులవంటి విషయాలలో స్త్రీలకు సమాన స్వాతంత్ర్యం ఉండాలనీ, స్త్రీలు ఆత్మగౌరవంతో బ్రతకటానికి స్త్రీలే ముందుకువచ్చి కృషిచేయాలని రచయిత్రి అభిప్రాయపడింది. స్త్రీలకు తమ వ్యక్తిత్వం, స్వాతంత్ర్యానికి విలువ ఉందనీ, భర్తలపరంగా గుర్తింపు పొందటంగాక తమశక్తి సామర్థ్యాలవల్ల సమాజంలో గుర్తింపు పొందాలనీ, పురుషుల వలె తమకు హక్కులున్నాయనీ తెలిస్తే తప్ప స్త్రీల అభివృద్ధి జరగదని చెరుకూరు నాగభూషణమ్మ భావించింది. స్త్రీలకు 'విడాకుల' వంటి విషయాలలో సమానత్వం ఉండాలనీ కూడ ఈ వ్యాసంలో ప్రతిపాదించటం జరిగింది.

ఆస్తిహక్కు విషయాలలోనూ వైవాహిక హక్కులలోను స్త్రీ, పురుషులకు సమానత్వం ఉండాలనీ, పరస్పరం గౌరవించుకోవటంలోనే స్త్రీల స్వాతంత్ర్యం ఇమిడి ఉన్నదని భావించింది. స్త్రీలకు ముందుగా తమ బానిసబ్రతుకును గురించిన స్పృహ కలిగితే తమకు సమాన హక్కులున్నాయని తెలుస్తుందనీ, వ్యక్తిస్వాతంత్ర్యం కావాలనే భావన ఏర్పడుతుందని భావించింది. స్త్రీల వ్యవహారాలు స్త్రీలే సరిచేసుకోవాలనీ, ఆస్తి, వివాహం, విడాకులలో స్త్రీకి కూడా సమాన స్వాతంత్ర్యం ఉండాలని తెలియజేసింది.స్త్రీలవ్యక్తిత్వపు ఉనికి దేశాభివృద్ధికి ప్రధానమని ఆనాడే భావించటం వారి క్రాంతదర్శనత్వానికి నిదర్శనంగా భావించవచ్చు.

1941 లో పురుషుడు మేధావి అయితేనే స్త్రీకి తనతోపాటు సమానమాన హక్కులున్నాయని గ్రహిస్తాడని శనివారపు అన్నపూర్ణాదేవి పేర్కొంది.

శనివారపు అన్నపూర్ణాదేవి వ్రాసిన 'ప్రపంచమున స్త్రీకిగల గౌరవం' (ఆగష్టు 1941 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీల సమానత్వాన్ని కోరుకొనే నవ్యనాగరికత ప్రపంచంలో ఉందిగానీ, హిందూ

దేశంలో మాత్రం నిరక్షరాస్యులైన స్త్రీలను హింసిస్తూ అడ్డుకత్తెలవలె చూస్తున్నారనీ, విద్యావంతుడు, మేధావి, క్రమవర్తనుడైన పురుషుడైతే స్త్రీకి పురుషునితో సమానహక్కును ఇస్తాడనీ, భారతదేశంలో స్త్రీలు విద్యతో ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మరక్షణను చేసుకోగల సామర్థ్యం పెంచుకోవాల్సిన అవసరాన్ని నొక్కివక్కాణించింది.

కామరాజు మైత్రేయి వ్రాసిన 'పంజరంలో చిలక' (అక్టోబరు 1941 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీలకు, ఆర్థికంగా స్వాతంత్ర్యము ఉంటేనేకాని స్వాతంత్ర్యం ఉండదనీ, ఆడపిల్ల పుట్టుకను హీనంగా చూస్తారనీ ఆచరణలో స్త్రీలకు పురుషులతోపాటు సమానహక్కులివ్వటానికి ఇష్టపడరనీ, కూలీనాలీ చేసుకునే స్త్రీలు ఆర్థికసమానత్వం కోసం ప్రయత్నిస్తారనీ, స్త్రీలకు ఆర్థికస్వాతంత్ర్యం ముఖ్యమని చెప్పింది. స్త్రీలకు వ్యవసాయభూములు లేని ఆస్తి హక్కు ఇవ్వాలనుకుంటున్నారనీ, ఆచరణలో స్త్రీ ధనం ఆడపిల్లలకు చెందటంలేదనీ, స్త్రీధనంతో పురుషుడు అప్పులు తీర్చుకుంటున్నాడనీ, అన్ని సమానత్వాలు, హక్కులు అర్థం / ధనం మీదనే ఆధారపడి ఉన్నాయని తెలిపింది. పురుషులకువలె తాము సమానంగా ఆర్థికస్వాతంత్రం, సాంఘిక స్వాతంత్రాన్ని పొందాలనే ఆలోచనలు స్త్రీలలో బలంగా ఏర్పడిన విషయంగా అర్థం అవుతుంది. స్త్రీల పుట్టుకకు విలువ ఉందనీ, స్త్రీ పురుషుల సమాన ఆర్థిక హక్కులు స్త్రీ పురుషుల సాంఘిక సమానత్వానికి చిహ్నమని భావించటం జరిగింది. శ్రామికవర్గపు స్త్రీలలో ఆర్థికస్వాతంత్ర్యకాంక్ష ఉన్నట్లు తెలియజేసింది.

దేశిరాజు భారతీదేవి వ్రాసిన 'అభివృద్ధి కావలెనన్నా' (అక్టోబరు 1941 గృహలక్ష్మి) అనే వ్యాసంలో రాజకీయ పరిస్థితులవల్ల ప్రపంచ సాంఘిక వ్యవస్థలలో మార్పులు జరుగుతూ ఉంటాయనీ, కాని స్త్రీల విషయంలో సంఘాచారాలు, వివాహాచారాలు, స్త్రీలహక్కులు మాత్రం మారక గడ్డకట్టుకొని ఉన్నాయనీ, మహమ్మదీయుల పరిపాలనలోనూ హిందూ స్త్రీల హక్కులు మారలేదని తెలియజేసింది. తండ్రియందు సోదరులతోపాటు ఆస్తిహక్కులేదనీ, హిందూరాజులు శాస్త్రాలలో చెప్పినట్టుగా స్త్రీలస్థితిని మార్పుకు గురికాకుండాచేస్తూ 'నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అనేది ఉందనీ, నేడు స్త్రీల దుస్థితిని చూసి శాసనసభలో చట్టాలు పెడుతున్నారుగానీ ముఖ్యమైన ఆస్తిహక్కు చట్టం రావటంలేదని తెలిపింది. 1934 స్త్రీల వారసత్వచట్టంలో వ్యవసాయ భూములను అన్వయింపరాదని ఫెడరల్ న్యాయస్థానంవారు నిర్ణయించారనీ. దానివల్ల ప్రయోజనంలేదని భావించింది. అంతేకాక శారదాచట్టంవల్ల స్త్రీ విద్యాభివృద్ధి, బాలికారోగ్యం జరిగినా కొంత ఉపయోగమేకాని, శారదాబిల్లుకూడా భయపెట్టలేక పోతోందనీ, దేశంలో మరోచోటకెళ్ళి బాల్యవివాహాలు చేయించివస్తున్నారని తెలియజేసింది. శారదాబిల్లుచట్టాన్ని అమలుచేస్తూ 15 ఏండ్లు లోపల వివాహం కాకుండా విద్యాభ్యాసం చేయిస్తే

స్త్రీలకు కొంతవరకు బాధతగ్గుతుందని భావించింది. ఆస్తిహక్కుఉంటే స్త్రీ దేశంలో ఏసంఘమునైనా పోషించగలదనీ, దేశసేవ చేయగలదనీ స్త్రీకి ఆర్థికస్వాతంత్ర్యం వల్ల సమాజాభివృద్ధి జరుగుతుంది కాబట్టి స్త్రీలకు పురుషులతో పాటు సమానమైన ఆస్తి హక్కు ఉండాలని తెలియజేసింది.

రాజకీయపరిణామాలతో ప్రజాస్వామ్యం అభివృద్ధి చెందుతున్నప్పుడే దానికి తగ్గట్టుగా స్త్రీల సాంఘిక, ఆర్థిక హక్కులలో మార్పులు రావాలనీ, అప్పుడే స్త్రీలవ్యక్తి స్వాతంత్ర్యసాధన ఫలవంత మవుతుందని భావించింది.

'దేవదాసీల సంస్కరణము' (నవంబరు 1941 గృహలక్ష్మి) అనే శీర్షికన పత్రిక ప్రచురిస్తూ కొచ్చిన్ లో డా.ఎస్.ముత్తులక్ష్మిరెడ్డి సభలో చేసిన ఉపన్యాస ప్రభావంతో కొచ్చిన్ ప్రభుత్వము వారు దేవాలయాలలో దేవదాసీల నాట్యమును, గానమును నిషేధించుచూ ప్రకటన చేసారని తెలియజేసింది. దేవదాసీవ్యవస్థ రూపంలో అవినీతిని, అపవిత్రతను ప్రోత్సహించకూడదనీ, దేవదాసీలంటే కన్యాత్వంతో గాన, నాట్యాలలో దేవాలయాలలో దైవసేవ చేసేవారనీ, 1909 లోనే మైసూరు సంస్థానం వారు దేవదాసీల సేవను నిషేధించారని తెలిపింది. 1930సం.లో మదరాసు శాసన సభలో హిందూమతధర్మాదాయముల చట్టము సవరించి దేవాలయములో దేవదాసీల సేవను నిషేధించి వారికి ఇనాము హక్కులిచ్చారనీ, బాలికలను దేవదాసీ వ్యవస్థకు అర్పణ చేస్తే, వారు శిక్షార్హులని చెప్పింది. గాంధీనాయకత్వంలో దేవదాసీ సంస్కరణ చట్టమును చేయాల్సిన అవసరముందనీ, మదరాసులో సెలెక్షన్ కమిటీ స్థాయి దాటి దేవదాసీ సంబంధమైన బిల్లును చట్టం క్రింద తీసుకురావాలని డాక్టరు ముత్తులక్ష్మి కోరటాన్ని పత్రిక తెలియజేసింది.

1944 లో పి.రాజేశ్వరి స్త్రీలు తమ హక్కులకోసం పోరాడుతుంటే పురుషుడు అర్థంచేసుకోకుండా స్త్రీని తనకింద బానిస అనుకుంటున్నాడనీ,స్త్రీలకు ఆస్తిహక్కు, విడాకుల హక్కు ఉండాలని చెప్పింది.

పి.రాజరాజేశ్వరి వ్రాసిన 'స్త్రీలహక్కులు' (అక్టోబరు,1944 రూపవాణి పత్రిక) అనే వ్యాసంలో నూతన శక్తుల ప్రేరేపణతో స్త్రీలు చేస్తున్న అన్వేషణ కొంతవరకు ఫలించింది కానీ, స్త్రీలు హక్కులకోసం ఉద్యమం చేస్తున్నా, పురుషులు స్త్రీని అర్థంచేసుకోకుండా తనకింద బానిస అని అనుకుంటున్నాడని తెలిపింది. భార్యలు కర్మసిద్ధాంతంతో బతుకుతున్నారనీ, స్త్రీలకు విద్యావకాశాలు లేక తమ శక్తియుక్తులను వంటయింటికే పరిమితంచేస్తున్నారనీ, బాల్యవివాహాలు పోవాలనీ, పునర్వివాహాలు జరగాలనీ, స్త్రీలకు ఆస్తిహక్కు, విడాకులు యిచ్చేహక్కు ఉండాలని భావించింది.
స్త్రీలలో హక్కుల చైతన్యాన్ని కలిగించే వ్యాసమిది.

పాకల రాజామణెమ్మ వ్రాసిన 'సంఘాన్ని బాగుచేసే ముఖ్య శాసనాలేవి' (జనవరి 1947

గృహలక్ష్మి పత్రిక) అనే వ్యాసంలో భారతస్త్రీల కష్టాలుపోయి కుటుంబంలో శాంతి సౌఖ్యం ఏర్పడేటట్లుగా చట్టాలు చేయటానికి స్త్రీలు కష్టపడాలని చెప్పింది. వరకట్న వివాహాలు, బాల్యంలోనే వైధవ్యం ఏర్పడటానికి, తండ్రి ఆస్తిలోగానీ భర్త ఆస్తిలోగానీ హక్కులేక పడియుండటానికి గానీ, అనుకూల దాంపత్యాలు లేకపోవటానికి, బహుపత్నీ నిరోధకానికిగానీ అవసరమైన స్త్రీపురుష సమాన హక్కులు శాసన రూపంలో కావాలని తెలియజేసింది.

స్త్రీల సంఘం బాగుపడటానికి, స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్యానికి అటువంటి శాసనాలు దోహద పడతాయని రచయిత్రి భావించింది.

స్వాతంత్ర్యం రాకమునుపే స్వతంత్ర భారతదేశంలో స్త్రీలసమస్యలు తీరటానికి తయారు చేయాల్సిన రాజ్యాంగ నిర్మాణాన్ని గురించి ప్రతిపాదించటం స్త్రీల ముందుచూపుకు నిదర్శనం. వారియొక్క రాజకీయ చైతన్యంలో ప్రజాస్వామ్య దృక్పథం స్పష్టమౌతోంది.

వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ 'భోగంమేళాల నిషేధం' (ఫిబ్రవరి 1947 గృహలక్ష్మి) అనే బిల్లును గురించి వ్రాస్తూ మదరాసు రాష్ట్రం చట్టంగా చేసిందనీ, దాని ప్రకారం ఇది కళావంతుల మేళముల నిషేధ చట్టం 1947 అని బోగం, సాని, నాగవాసీలు, దేవదాసీలు, కూర్మాపులు అని పిలువబడిన వారందరూ కళావంతులని తెలిపింది. మేళమనగా ఒక అవివాహిత స్త్రీ గానీ, ఎక్కువ మందిగానీ, ఇతరులెవ్వరితో కలసి గాని దేవాలయాలు, వివాహాలు, మతసాంఘిక ఊరేగింపులలో, రహస్యప్రదేశాలలో గానీ నృత్యం చేయరాదనీ, 16 సం.లు పైబడినవారు ఇటువంటి పనులు చేస్తే 1898 శిక్షాస్మృతి ప్రకారం నేరస్థులుగా పరిగణింపబడతారని చెప్పింది. చట్టాన్ని తయారుచేస్తే పురుషులు కొంతమంది భోగంమేళం నిషేధచట్టాన్ని వ్యతిరేకించటం పురుషుల భోగలాలసకు చిహ్నమని తెలియజేసింది.

1947 ఫిబ్రవరిలో మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం భోగంమేళాలనిషేధ చట్టాన్ని చేసింది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అదే దేవదాసి నిషేధ చట్టంగా వచ్చింది. చివరికి డా.ముత్తులక్ష్మి రెడ్డి ప్రయత్నం ఫలించిందని అర్థమవుతుంది.

బోడపాటి అలివేలమ్మ వ్రాసిన 'రావుకమిటీ శిఫార్సులు' (జులై 1947 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీలకు సంపూర్ణ స్వతంత్ర్యం వస్తే బహుపత్నీ నిరోధం, విడాకుల బిల్లు వంటివి చట్టాలుగా వస్తాయనీ, స్త్రీలకు ఏవిధమైన ఆస్తిహక్కు లేదనీ, ఆస్తి హక్కును యిస్తే మహిళాభ్యుదయం కలుగుతుందని రావు కమిటీ అభిప్రాయపడిందని తెలియజేసింది. 1937 సం.లో స్త్రీలవారసత్వపు హక్కును కేంద్రప్రభుత్వం ఇచ్చినా దానికింద చట్టంలో సాగు భూములు లేకుండా చేయటంతో, దానిని కోర్టు

కూడా ఆమోదించాల్సివచ్చింది. స్త్రీలకు భూమిమీద హక్కు లేకుండా పోతుందనీ, వీలునామా రాయకపోతే తండ్రి ఆస్తిని కొడుకుకు, కూతురుకు సమానంగా ఇవ్వాలనీ, కానీ వీలునామా ముందే వ్రాసుకొని కూతురికి తల్లియొక్క ఆస్తిమీద హక్కుఉన్నా కొడుకుకి సగం వాటాలివ్వాలంటారని చెప్పింది. పిత్రార్జితానికి మనుమడు హక్కుదారుడై ఉన్నాడనీ, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా ఉండాలంటే మనుమరాలికి కూడా పుట్టుకతో ఆ హక్కును కలిగిస్తే రావు కమిటీ న్యాయం చేసినట్లని తెలియజేసింది.

కూతురికి పిత్రార్జిత ఆస్తిహక్కులేకపోగా, స్త్రీధనంగా వచ్చిన ఆస్తిలో కూడా వాటా లేకుండా చేస్తున్న సామాజికసంస్కృతిపట్ల నిరసనను వ్యక్తంచేసింది. అందులో విడాకులను యిచ్చేముందే స్త్రీలకు ఆస్తిహక్కును యివ్వమని తెలియజేసింది. ఆంధ్రదేశంలో స్త్రీలకు వారసత్వపు ఆస్తిహక్కు చట్టాన్ని 1985 నుండి అమలు చేయబడి, దానికే 2005 సం.లో కూతుర్ల జన్మహక్కునుకూడా పొందుపరచి సవరణ చేయటాన్ని, ఆనాటి స్త్రీలు ముందుగానే కోరుకొన్నారని అర్థం అవుతుంది.

1900 నుండి 1947 సం. వరకు అంటే దేశానికి స్వాతంత్ర్యంవచ్చే మునుపువరకు స్త్రీలు దేశస్వాతంత్ర్యంకోసమేకాక స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యం కోసం, స్త్రీలహక్కులకోసం పోరాటంచేసే చైతన్యాన్ని అందించిన ఆనాటి స్త్రీలసాహిత్యమే వివక్షారహిత భారత ప్రజాస్వామ్యపు రాజ్యాంగనిర్మాణానికి రహదారులను వేసింది. భారతదేశ రాజ్యాంగంలో స్త్రీలకు పురుషులతో పాటు సమానంగా అన్ని హక్కులను పొందుపరిచారు. దేశస్వాతంత్ర్యానంతరం హిందూలా, వరకట్న నిషేధచట్టం వంటిచట్టాలకు దేశస్వాతంత్ర్యానికి పూర్వమే ఆనాడున్న స్త్రీల చైతన్యం పునాదులు వేసిందని స్పష్టమౌతుంది. కాని పితృస్వామ్యసంస్కృతి ఆచరణలో అమలుపరచనీయటం లేదు. కాని ఆ హక్కుల విలువను స్త్రీలుచైతన్యవంతులై పురుషులతోపాటు సమానంగా జీవించగలహక్కు తమకు ఉందని స్త్రీలు కూడా భావించటమే ముందున్న కర్తవ్యం.

స్త్రీలయొక్క అక్షరాస్యత ఒక్కశాతంగా ఉన్నకాలంలోనే వైజ్ఞానిక పరికరాల సదుపాయాలు, ప్రోత్సాహం ఏమీలేని రోజుల్లో స్త్రీలు చైతన్యవంతులై, జాతీయ, అంతర్జాతీయ సామాజిక–సాంస్కృతిక, ఆర్థిక–రాజకీయ పరిణామాలను గురించిన అవగాహనను ఏర్పరచుకొన్నారు. అభ్యుదయభావాలతో కూడిన తమ రచనలద్వారా తోటి స్త్రీలను చైతన్యపరచటానికి మార్గదర్శకంగా నిలిచారు. జనాభాలో స్త్రీల శాతం, స్త్రీలవిద్యకు సంబంధించిన ఈ గణాంకాలు స్త్రీల జీవనహక్కులకు నిదర్శనం. స్త్రీవిద్యా ఉద్యమఫలితంగా ఆధునికయుగ ఆరంభానికి 1 శాతంగా ఉన్న స్త్రీవిద్య భారతదేశ స్వాతంత్ర్యసాధన సమయానికి 10 శాతం వరకు అభివృద్ధిచెందిందనేది నాటి స్త్రీలసాహిత్యంలో ప్రతిఫలించింది.

స్త్రీవిద్యాఉద్యమంతోనే స్త్రీలహక్కులచైతన్యం అంచలంచెలుగా ఎదిగి స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్యానికి పునాదులువేసి దేశస్వాతంత్ర్యానికి రహదారులను ఏర్పరచగలగింది. కాబట్టే స్వాతంత్ర్యానంతరం వివక్షారహిత భారతదేశరాజ్యాంగానికి రూపకల్పన జరిగిందనేది స్పష్టమౌతుంది. అందుకే తెలుగుస్త్రీలు విద్యావంతులై తోటిస్త్రీల విద్యాభివృద్ధికై కొనసాగించిన స్త్రీవిద్యాఉద్యమాన్ని ప్రతిఫలించిన నాటిస్త్రీల సాహిత్యపరిశీలన నేటికీ కరదీపికయే. స్వాతంత్ర్యానంతరంనుండి నేటికీ కొనసాగుతున్న స్త్రీవిద్యా ఉద్యమ ఆకాంక్షల పరిణామశీలత, పరిపక్వతను కూడా తెలుసుకోవలసిన అవసరం ఉంది.

బ్రిటిష్ వలసవాద సమాజంలో మగపిల్లలు ఆంగ్లవిద్యను అభ్యసించటంతో వరకట్నాల బెడద ఎక్కువైంది. కాస్తచదువుకున్న ఆడపిల్లలు వ్యక్తిత్వాన్ని పుంజుకోవటంతో తమ తల్లిదండ్రులు ఆస్తిపాస్తులు, నీడనిచ్చిన యింటినికూడా అమ్మి వరుడికి కట్నాన్ని యివ్వవలసిన దుస్థితికి బాధనొంది ఆత్మబలిదానంచేసిన 'స్నేహలత' రాసిన లేఖద్వారా బాలికల విషాదాంత చైతన్యాన్ని రాయప్రోలు సుబ్బారావు తన కవితలో చెప్పటం జరిగింది. ఆడపిల్లలు చదువుకోవటంతో, వారు కాస్త వ్యక్తిత్వాలను పుంజుకొని స్వీయ ఆలోచనలను పెంచుకొనే క్రమంలో వారికి ఈ వరకట్నసమస్యయొక్క తీవ్రత అవగాహనకు వచ్చింది.

1921 లో కాళ్ళకూరి నారాయణరావు రాసిన వరవిక్రయం అనే నాటకంలో పురుషోత్తమరావు కూతుళ్ళకు ఇంటి దగ్గర కొద్దిగా చదువు చెప్పించటంలో పెద్ద కూతురు కాళింది తన పెళ్ళికి కట్నం ఇవ్వటం ఇష్టం లేదనీ అటువంటి 'వెలమగల' చేత పుస్తె కట్టించుకునే అవమానపు బ్రతుకును కొని తెచ్చుకోలేనని భావించింది. ఆత్మహత్యకు పాల్పడుతుంది. కాని కట్నపుడబ్బు లింగరాజు చేతిని చేరటంతో రెండో కూతురు కమల తాను చదువు వల్ల పొందిన మనోధైర్యంతో ఆ లింగరాజుకే కాక కట్నం తీసుకునే ప్రతి ఒక్కరికి బుద్ధి చెప్పాలనుకున్న దృష్టితో తన మేధాశక్తిని పణంగా పెట్టి పరిష్కరించుకునే చైతన్యాన్ని తెచ్చుకోగలిగింది.

వరకట్నమనే వ్యాపార క్రీడను తన తర్క పరిజ్ఞానంతో అరికట్టాలనుకుని, స్త్రీ పుట్టుకకు విలువ చేకూర్చే దిశగా చైతన్యాన్ని తెచ్చుకుంటుంది. అందుకే కట్నానికి క్రయధనానికి తేడా లేదనే వేలంపాట అనే మార్కెట్లో బజానా యిచ్చి అగ్రిమెంట్ చేసుకొని కట్నం డబ్బు ముందు చెల్లించి తాను భర్తను కొనుక్కున్నాను కాబట్టి తన భర్తపై తనకే అధికారం ఉందని న్యాయమూర్తి ఎదుట పితృస్వామ్యంలోని అధికార సంబంధాలలోని ఆర్థిక స్వభావాన్ని బయట పెడుతుంది.

మానవతా విలువలకు ఆస్కారం లేని సజీవవ్యాపార వ్యసనమే వరవిక్రయమని, వరుడు కోరినంతగా వెలయిచ్చి కొనుక్కున్న భర్తలకు దాస్యం చేసే ఆడపుట్టువు యొక్క గౌరవహీన స్తితిని సమాజానికి అర్థమయ్యేట్లుగా చేసిన మహిళగా కమల చైతన్యం అర్థం అవుతుంది.

ఆర్థికవ్యవస్థ కారణంగా ఏర్పడిన చారిత్రక 'సామాజిక కుటుంబ' నిర్మాణపు నేపథ్యంలోకి తొంగిచూసి లింగవివక్ష కారణంగా ఏర్పడిన స్త్రీ పురుషుల మధ్య నున్న అసమానతలు తొలగిపోయేటట్లు చేస్తేనే వరకట్న సమస్యను నిర్మూలించగలమనే చైతన్యం కలుగుతుంది.

20 వ శతాబ్దపు మూడవ దశకంలో వచ్చిన శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రిగార కథలలో 'ఇల్లుపట్టిన విధవాడబడుచు' అనే కథలో పుట్టింట్లో వితంతుస్త్రీగా ఆనవాయితీగా వచ్చిన ఇంటిచాకరి చేయటానికి, ఆమెకు డబ్బుపెట్టె తాళంచెవి యిచ్చినట్లే యిచ్చి కోడలికి ఆ డబ్బుపెట్టె పెత్తనాన్ని యివ్వటం జరిగింది. అప్పుడు ఆ విధవాడబడుచు ఆర్థికవిషయాలతో సంబంధంలేని ఇంటిచాకిరి విలువలేనిదని భావించి, తనకు లభ్యమైన మనోవర్తి డబ్బును తాను స్వేచ్ఛగా వినియోగిచుకోవాలనే ఆర్థిక స్వేచ్ఛాచైతన్యం తెచ్చుకొని ఆ యింటిని వదిలి వెళ్ళిపోతుంది.

"తల్లి ప్రాణం" అనే కథలో వితంతువైన కూతురుకు చదువు చెప్పించాలనీ, మళ్ళీ పెళ్లి చేయాలనీ ఆ తల్లి ఆరాటపడటం, దానికై కుటుంబ పరిధిలోనే పోరాటం చేయటం గమనించవచ్చు, ఆమో భర్త ఆమెతో 'తన కూతురికి చదువుకొని ఉద్యోగం చేసుకోవాల్సిన ఖర్మ ఏమిటనీ' అని అంటే 'మొగవాళ్ళందరూ చదువుకోవటం ఉద్యోగాలు చేయటానికేనా' అనీ చదువుకుని కూడా ఉద్యోగాలు చెయ్యని పురుషులంటున్నారు కదా ! అనీ అంటూ మొగవాళ్ళలాగా ఆడవాళ్ళు అన్ని విషయాలలో సమానంగా ఎందుకుండకూడదనే స్పృహతో మాట్లాడుతుంది.

"ఆడపిల్లకు చదువు చెప్పిస్తే వంశం పరువుపోతుందని" భర్త అంటే ఆమె "మొగవాళ్ళు చదువుకుంటుంటే వంశం పరువుపోతుందని సహేతుకంగా లింగ వివక్షను ప్రశ్నకు పెడుతుంది. ఆమె భర్త తన "కూతురుకు ఉద్యోగం చేయాల్సిన అవసరం లేదనీ మళ్ళీ అంటే" కూతురు చదువుకుంటే అవసరం వచ్చినప్పుడు ఉద్యోగం చేస్తుందనీ ఎంత ఉండినా పుట్టింటివారి ఆస్తిలో అధికారం ఆడపిల్లలకు ఏదీ అంటూ మాట్లాడడం జండరస్పృహలోని భాగమే. స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని, స్త్రీలు ముఖ్యంగా వితంతు స్త్రీలు చదువుకుని ఉద్యోగాలు చెయ్యాల్సిన పరిస్థితిని స్పృహలోకి తెచ్చుకోగలిగింది. కొడుకులతో పాటు కూతురుకు కూడా సమానమైన ఆస్తిహక్కు ఉండాలనే భావన ఆమెలో స్పష్టమవుతుంది.

శ్రీపాద రచించిన 'కన్యాకాలేయత్నాద్వరితా' అనే కథలో తనకుజరిగిన పెళ్ళి యిష్టం లేకపోయినా, ఆమె రజస్వలానంతరం కాపురానికి వెళ్ళాల్సిన సమయంతో అతడు చనిపోతాడు. ఆమె వితంతువుగా తయారు చేయబడుతుంది. రంగనాయకి తన పెళ్ళికి పూర్వమే పార్వతీశం అనే వాళ్ళింటి దగ్గరబ్బాయిపై యిష్టం ఏర్పరచుకుంటుంది. పెళ్ళి కాకపోయినా పార్వతీశాన్ని ఆమె

మనసులో పెనిమిటిగా భావిస్తూనే ఉంటుంది. అందుకే తాను వితంతువయినా ఆమె కన్యగా ఉన్నప్పుడు కోరుకున్న పురుషుడితోనే లైంగిక సంబంధాలు ఏర్పరచుకోవాలనుకొంది. అతని భార్యతో మిత్ర సంబంధాలలోకి ప్రవేశించి ఆత్మీయతను పెంచుకొని, ఆమె కూడా తనని ఆ కుటుంబ సంబంధాలలోనికి ఆహ్వానించేటట్టుడా చేసుకోగలుగుతుంది. అయితే రంగనాయకి తండ్రి, అన్నలు పార్వతీశంతో ఆమె సంబంధాన్ని సంస్కృతికి విరుద్ధంగా భావించి నియంత్రించాలను కుంటారు. అప్పుడు ఆమె వారితో తనకిష్టంలేని పెళ్ళి చేసిన కారణంగానే తానిప్పుడు వారికిష్టంలేని లైంగిక స్వేచ్ఛను కోరుకున్నట్లుగా చెబుతుండి. ఆమె పార్వతీశం యింటికి వెళ్ళిపోతుంది. స్త్రీ తన జీవితాన్ని తాను నిర్మించుకునే హక్కు కొరకు పోరాడటం, స్త్రీలపట్ల అమలులో ఉన్న వివక్షతలను వ్యతిరేకించటం, స్త్రీ స్వేచ్ఛకై నియంత్రణను ధిక్కరించటం జండర్ స్పృహగా భావిస్తే అది శ్రీపాద కథలలో కదులుతూ కనబడుతుంది.

'అన్నంతపనీ జరిగింది కథ' లో వితంతువైన జానకి యింట్లో ఎవరికి యిష్ట లేకపోయినా తాను చదువుకున్న 7వ తరగతి చదువుతోనే ప్రైవేట్లు చెప్పుకొని బ్రతకాలనుకుంటుంది. అయితే ఆమె చెప్పులు తొడుక్కొని గొడుగు వేసుకొని బజార్లో వెళ్ళటాన్ని సమాజంలో వ్యక్తులు కూడా సహించలేక ఆమె యింటి మీద రాళ్ళు రువ్వుతారు. ఆమె ప్రైవేట్లు మానేసి, తన ఊరికి వెళ్ళాలనుకున్న సమయంలో తన దగ్గర ప్రైవేటు చెప్పించుకుంటున్న ఒక అమ్మాయి ఈమెను తమ యింట్లోనే ఉండమని అడుగుతుంది. శిష్యురాలి కోరిక మేరకు అప్పటికి భార్య చనిపోయిఉన్న ఆ అమ్మాయి తండ్రి పంతులు గారితో జానకి 'పెళ్ళి' అనే తంతులేకుండా కుటుంబ సంబంధాలలోకి ప్రవేశిస్తుంది. పంతులుగారి కూతురు బాలవితంతువు. ఆమెకు పునర్వివాహం జరిగేటట్టు చేస్తుంది. ఈ విధంగా సమాజంలో భార్య చనిపోయిన మొగవాళ్ళు ఏవిధంగా మళ్ళీ పెళ్ళిచేసుకుంటూ బ్రతుకుతున్నారో ఆడవాళ్ళు కూడా అలా బ్రతకడాన్ని ఆమె ఒక సమాజ వాస్తవం చేసి చూపించింది.

శ్రీపాదసుబ్రహ్మణ్యశాస్త్రిగారు రచించిన "అరికాలిమంటలు" కథలో బాల వితంతువైన రుక్మిణి తనకు జరుగబోయే శిరోముండనం క్రియను వ్యతిరేకించి, తన జుత్తు మీద తనకే అధికారముందని నిరూపించుకుంది. ఆ క్రమంలో పితృస్వామ్య కుటుంబ సంస్కృతిని అధిగమించి అర్ధరాత్రి ఒంటరిగా చీకట్లో బయటకు వెళ్ళి బండివాడి సహాయంతో పునర్వివాహం చేసుకోవటానికి వీరేశలింగంగారి ఇల్లు చేరుకున్న ధైర్యవంతురాలిగా స్త్రీ పరిణామం చెందటం ఆనాటి వ్యవస్థకు విస్తుకలిగించే పరిణామమే.

లింగ వివక్ష కారణంగా పితృస్వామ్యంలో అభివృద్ధి చెందిన స్త్రీ పురుష అసమానతను నిరసించటం, ఆ అధికారం నుండి అణచివేతనుండి విముక్తికై అవసరమయితే కుటుంబాన్ని కూడా

వదిలిపెట్టి వెళ్లాలనుకోవటం జండరస్పృహలో భాగమే. శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రి రాసిన 'కీలెరిగిన వాత' అనే మరొక కథలో కృష్ణవేణి పాత్ర ప్రవృత్తి ద్వారా అర్థం అవుతుంది. పెళ్ళికి కట్నం ఇవ్వటం అంటే అపరాధ రుసుమును చెల్లించటమనీ, కట్నం తీసుకోని యువకుడు దొరికేంత వరకూ వివాహాన్ని చేసుకోవాలని భావించి స్త్రీ కోసం పాఠశాల పెట్టి డ్రైవింగ్, ఈత, గణితం యిట్లాంటివెన్నో నేర్పిస్తుంది. ఇలా స్త్రీలందరూ మిత్ర సంబంధాలలో ఉంటే సీత సమస్యలు పరిష్కరించుకోవచ్చని భావిస్తుంది. 'కట్నం లేకుండా పెళ్లి చేసుకుంటానని' వచ్చిన వ్యక్తితో 'పెళ్ళి ఒప్పందం' లో భాగంగా స్త్రీని బానిసగా చేయకూడదనీ, కుటుంబ సంబంధాలలో స్త్రీని సమాన భాగస్వామిగా చేయాలనీ, కుటుంబంలో భార్యగా తన హక్కును పూర్తిగా అమలు పరుచుకునే అధికారం ఉండాలనీ, పెళ్ళైన తరువాత కూడా సభలకు వెళ్ళటం పురుషులతో కలిసి కూర్చోవటం చేస్తానని చెబుతుంది. ఆమె వెనకాల ఉన్న ఆస్తిపై కన్నువేసి కట్నం అక్కర లేదంటూనే పెళ్ళి చేసుకున్నాడనీ ఆ తరువాత ఆమెకు అర్థం అవుతుంది. కథా సందర్భంలో భాగంగా కృష్ణవేణి తల్లి చేత 'బి.ఏ. చదివిన భార్య భర్తను పూజిస్తూ గౌరవించటం, బి.ఏ. చదివిన భర్త భార్యను మోసం చెయ్యటమా' అని పలికించటం శ్రీపాద వారికున్న జండర స్పృహకు నిదర్శనం కథలో "మొగుడులేని ఆడది ఎలా బ్రతుకుతుందంటే, ఆడదిలేని మొగుడు మాత్రం ఎలా బ్రతుకుతాడని ప్రశ్నించటం జరుగుతుంది."

భర్త అధికారంతో ఆంక్షలు పెట్టాలనుకునే సరికి ఆమె ఆ అధికార సంస్కృతిని అణచివేతను నిరసించే విధంగా "హిందూ లాలో విడాకుల శిక్షాస్మృతి లేకపోయినా తాను మరో మొగవాడిని వరించటానికి లక్ష మార్గాలున్నాయని చెప్పి" పురుషాధిక్య కుటుంబ చట్రం నుండి విముక్తిని కోరుకోవటంగా అతనితోడి కుటుంబాన్ని వదిలిపెట్టి వెళ్ళిపోతుంది. సమాజంలో మళ్ళీ పెళ్ళి చేసుకోవటానికి మగవాళ్ళకు అవకాశాలున్నట్టే ఆడవాళ్ళకు మళ్ళీ పెళ్ళి చేసుకోవటానికి లక్షమార్గాలున్నాయని చెప్పటం జండర్ స్పృహయే.

చలం తన రచనలలో స్త్రీలస్వేచ్ఛాచైతన్యాలకు పెద్దపీట వేసాడు. చలం రచనలలోని స్త్రీలలో లైంగికస్వేచ్ఛను అనుభవించాలనుకొనే చైతన్యం కనబడుతుంది. అయితే ఆర్థికస్వాతంత్ర్యంలేని స్త్రీలలో ఆ చైతన్యానికి విలువకట్టటం కష్టం. "స్త్రీలకు శరీరం ఉంది, దానికి వ్యాయామం కావాలి, స్త్రీలకు మెదడు ఉంది, దానికి జ్ఞానం కావాలి, స్త్రీలకు హృదయం ఉంది, దానికి స్పందనలుంటా" యనే చలం కథలలో మహిళల లైంగికత మీద, జీవితం మీద పురుషుల పెత్తనాలను ఎత్తిచూపుతూ కుటుంబాలలో భర్తల పెత్తనపు రూపంలో ఉన్న సంస్కృతి స్త్రీల చైతన్యానికి అడ్డుగోడగా ఉందని చెప్పటం జరిగింది. స్త్రీల లైంగికత్వాన్ని, మాతృత్వాన్ని శ్రమను నియంత్రించటం జరిగిందనీ,

మునుపటి స్త్రీ-పురుషులు జతకూడే లైంగిక జంట పెళ్లి వ్యవస్థలో ఉన్న స్వేచ్ఛ స్త్రీకి ఉంటే తప్పు, ఆమెపై భర్తల నియంత్రణ తగ్గదనీ భావించటం చేత స్త్రీలకు లైంగిక స్వేచ్ఛ కావాలనీ చెప్పటం జరిగింది. కాని ఆర్థికస్వాతంత్రం లేని మహిళ ఆ స్వేచ్ఛను పొందటంలో వైఫల్యం చెందక తప్పదు. చలం రాసిన 'మైదానం నవలలో రాజేశ్వరి పాత్ర భర్త అధికారం క్రింద యిమడటం ఇష్టంలేకగాని, తనతో గడపటానికి భర్తకు తీరికలేనితనంగాని, వయోతారతమ్యభేదంవంటి కారణాలతో రాజేశ్వరి కుటుంబానికి దూరముగా వెళ్ళి, లైంగిక స్వేచ్ఛను అనుభవిస్తూ జీవితాన్ని గడపాలనుకోవటం చలంనాటికి అది విస్మయపరిణామముగా అనిపించినా నేటికి అది ఆచరణలో ఉంటూనే వున్నది.

స్వాతంత్ర్యానంతరం భారతరాజ్యాంగం ప్రతి వ్యక్తికి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను లిఖితపూర్వకంగానే యిచ్చింది. కాని దానియొక్క అమలులోని లోపాలవల్ల ప్రజలు స్వతంత్రభారతదేశంలో స్వేచ్ఛగా జీవించలేకపోతున్నారు. ప్రజాస్వామ్యపు ప్రాతిపదికన ఏర్పడిన భారతరాజ్యాంగాన్ని అమలుపరచేది భారతీయ మానసికప్రవృత్తులే. ముఖ్యంగా సామాజిక వ్యవస్థలో వర్గ, కుల, మతభేదాలు స్వేచ్ఛను అడ్డుకుంటున్నాయి. అవినీతి రాజకీయాలు రాజ్యమేలుతూ ఆర్థికవ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని శాసిస్తున్నాయి. అందుకే వ్యక్తులకంటే కూడా ముందుగా వ్యవస్థలను సంస్కరించాలి.

కొడవటిగంటి కుటుంబరావు కథ 'పెళ్లి లోని అసమానత్వాలను విప్పి చెప్పటమే కాక 'పిన్ని' కథలో కుటుంబంలో భర్త అధికార సంబంధాలతో ఉండి తనకొక విలువ నివ్వటం లేదని భావించిన స్త్రీ యిల్లు వదలి అక్క యింటికి వస్తుంది. కుటుంబంలో తనకు పెత్తనం యిస్తే తప్ప సాధికారికత ఉండదనీ తను కావాలని వచ్చిన భర్తకు తెగేసి చెప్పింది. భర్త ఆమెకు ఆపెత్తనాన్ని యిస్తానంటూ, యింటికి తీసుకుని వెడతాడు. కుటుంబంలో సమాన సాధికారికత, వల్ల వచ్చే స్వేచ్ఛను కోరుకున్న చైతన్యం ఆమెది.

కొడవటిగంటి కుటుంబరావు రచించిన "పంచకళ్యాణి" అనే కథలో జానకిపాత్ర కుటుంబంలోని భర్తపెత్తనాన్ని నిలదీసే చైతన్యశీలిగా అర్థమవుతుంది. వీరి పిన్ని కథ లో పిన్నిపాత్ర తనకు కుటుంబలోని ఆర్థిక వ్యవస్థలో అధికారం ఉంటే విలువ ఉంటుందని భావించి కుటుంబంలో స్త్రీల సాధికారానికి చైతన్యబీజం వేసింది.

2.3 జాతీయోద్యమ స్త్రీల సాహిత్యంలో దళితస్పృహ

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు దాటినా దళితుల అభివృద్ధి ఇంకా మిగిలే ఉండటానికి కారణం దళితస్పృహ కొరవడటమే. అందుకే దళితస్పృహకుగల చారిత్రక నేపథ్యంలోకి తొంగిచూడవల సిన అవసరం ఉంది. వర్ణవివక్ష గల హిందూమతాన్ని బ్రిటిష్ వారు అజ్ఞానమతంగా పేర్కొని స్వాతంత్ర్యార్హత లేదన్నారు. అ క్రమంలోనే బ్రిటిష్ వారు సమాజంలో అంటరానివారుగా భావింపబడే

అస్పృశ్యులను క్రైస్తవమతస్థులుగా మార్చాలనుకొన్నారు. అందుకే భారతీయులలో దళితస్పృహ జాతీయోద్యమ సమయంలో ఏర్పడటానికి ఆనాటి రాజకీయ వాతావరణమే ముఖ్యమైన కారణంగా అర్థమౌతుంది. జాతీయదృక్పథంతో సంస్కరణలలో భాగంగా అస్పృశ్యత నిర్మూలనమై సమానత్వ సాధనదిశగా సాగి భారతీయులందరూ ఒకే జాతి అనే భావన కలిగి జాతీయత బలపడితేనే స్వాతంత్ర్య సంపాదన సాధ్యమౌతుందని భావించారు. అందుకే సత్యాగ్రహఉద్యమ కార్యక్రమాలలో హరిజనోద్ధరణకు ప్రాధాన్యతను ఇచ్చారు.

బ్రిటిష్ వారు తమ పాలనను సుస్థిరంచేసుకోవటానికి విభజించి పాలించే రాజనీతితో హిందూముస్లిములమధ్యన విభేదాలనేకాక, హిందూవులమధ్యకూడా వర్గ, వర్ణభేదాలను సృష్టించదలచి శాసనసభలలో వర్గ విభేదపు ప్రాతినిధ్యం ఉంటే తమకు ఉపయోగం అని భావించి 1932 ఆగస్టు 10న 'కమ్యూనల్ అవార్డు' ను ప్రకటించాడు. దానిలో ముస్లిములు, క్రైస్తవులు, శిక్కులు, యూరోపియన్‌లతో పాటు అస్పృశ్యులకు కూడా రాష్ట్ర, కేంద్ర శాసనసభలలో ప్రత్యేకనియోజక వర్గాలను కేటాయించారు. అస్పృశ్యులు కూడా హిందువులేనని, వారిని హిందూవులనుండి వేరుచేయరాదని గాంధి నిరసించినా, మాలవ్య ముందుకువచ్చి పూనాలో సభను ఏర్పాటుచేసాడు. దానికి అస్పృశ్యుల నాయకులు, వారిలో అగ్రస్థానానికి చెందిన అంబేద్కరు హాజరు అయ్యాడు. సభలో చర్చల తరువాత నాయకులందరూ రాజీకివచ్చి ఒక ఒడంబికను చేసుకున్నారు. అదే పూనా ఒడంబడిక.

1932 లో పూనా ఒడంబడికలో అస్పృశ్యులమీద ఉన్న ఆంక్షలన్నింటినీ తొలగించారు. ఇదంతా అస్పృశ్యులను క్రైస్తవులుగా మారకుండాచేసి హరిజనుల కింద వారిని గుర్తించి అగ్రవర్ణాలవారు కలుపుకొని ముందుకుపోయే ప్రయత్నం చేయటంతో కొంతగా భారతీయుల ఐకమత్యాన్ని కాపాడగలిగింది. అస్పృశ్యులను కలుపుకొనే రాజకీయవాతావరణం ఏర్పడగలిగిందనేది చరిత్ర స్పష్టంచేసింది. ఆ రాజకీయవాతావరణంలో సాంఘికసమానత్వ సాధనఉంటేనే అది ఫలప్రదమవుతుందని భావించిన నాటి రచయితలు సమాజాన్ని చైతన్యపరచటానికి సాహిత్యాన్ని సాధనంచేసుకున్నారు.

20 వ శతాబ్దప్రారంభంనుండి స్త్రీలు పురుషులతోపాటు సమానత్వాన్ని కోరుకునే క్రమంలో మానవహక్కుల స్పృహ ఏర్పడటంతో తమ సమస్యలను పరిష్కరించుకోవాలనుకొన్నారు. అంతేకాక, తమవలె సమాజంలో గౌరవప్రదమైన జీవనహక్కులు లేని అస్పృశ్యులను గురించిన ఆలోచనలు పెంచుకునే క్రమంలోనే జాతీయోద్యమకాలంలో వారిని కలుపుకొని భారతీయులు ఐకమత్యాన్ని కాపాడుకోగలిగితేనే స్వాతంత్ర్యం వస్తుందనే భావన కలగటంతో స్త్రీలలో దళిత స్పృహకూడా ఏర్పడింది.

దానితో సమాజంలో దళితస్పృహను కలిగించటానికై స్త్రీలు సాహిత్యాన్ని సృజించారు. చారిత్రక నేపథ్యంగల దళితస్పృహ నేటికీ కొనసాగటానికై ఆనాటి స్త్రీల సాహిత్యపఠనం అవసరం.

జాతీయోద్యమంలో భాగమైన సత్యాగ్రహఉద్యమ కార్యక్రమాలలో భాగంగా గాంధి హరిజనోద్ధరణను సాధించగలిగితే భారతీయులందరూ సమైక్యంగా బ్రిటిష్ వారికి ఎదురొడ్డి నిలబడగలుగుతారని, అప్పుడే స్వాతంత్ర్యసాధన సులభసాధ్యమవుతుందని భావించాడు. అంతేకాదు జాతీయోద్యమంలో ప్రధానమైనది స్వీయసంస్కరణ. దానిలో భాగంగా అటు అగ్రవర్ణాలవారికి, ఇటు హరిజనులకు అవసరమైన స్వీయసంస్కరణా చైతన్యాన్ని కలిగిస్తూ ఉన్నవ లక్ష్మీనారాయణ 1921 సం.లో 'మాలపల్లి' అనే నవలను రాసిన విషయం ప్రసిద్ధమైనదే.

1932 సం.లో పూనా ఒడంబడిక రాజకీయంగా చేసుకున్నప్పటికీ సామాజికంగా ఆచరణలో ఉంటేనే భారతీయులమధ్య ఐకమత్యం పెరుగుతుందని, అప్పుడే బ్రిటిష్ వారిని ఎదుర్కోగలమని అనుకొన్న స్త్రీలు తోటి స్త్రీలలో దళితస్పృహను పెంచాలనుకొన్నారు. ఆ క్రమంలో చిలకపాటి భారతీదేవి 1933 సం. జనవరి, గృహలక్ష్మిపత్రికలో ఒక వ్యాసం రాస్తూ దేశారిష్టాలు తొలగాలంటే అస్పృశ్యత పోవాలనీ, లింగవివక్షతతో స్త్రీలు, సామాజిక వర్గదృష్టితో హరిజనులు బాధితులుగా ఉన్నారనీ, వారి అభివృద్ధి ఉంటేనే స్వాతంత్ర్యసాధన మరింత సులభతరమౌతుందని తెలిపింది. ఆ సంవత్సరం మార్చి, గృహలక్ష్మి లో ప్రచురితమైన వ్యాసంలో స్థానాపతి రుక్మిణమ్మ పంచములకు దేవాలయప్రవేశం ఉండాలని తెలియచేసింది.

దేశిరాజు భారతీదేవి 1933 మే గృహలక్ష్మి పత్రికలో అస్పృశ్యతా నిర్మూలన అనే వ్యాసంలో పంచములనగా సంకరజాతివారుకారనీ, గుణగణాలనుబట్టి వర్ణాలు ఏర్పడ్డాయనీ, మాలతనయుడైన పరాశరుడు బ్రహ్మర్షి అయ్యాడనీ, మాలకన్యయైన అరుంధతిని వివాహమాడిన వశిష్టుణ్ణి రాముడు గురువుగా గౌరవించాడని తెలిపింది. అంతేకాక, శాకాహారులు, మాంసాహారులు విడిపోయి పరస్పరం గౌరవంగా బ్రతికారనీ, ప్రస్తుతకాలంలో స్త్రీలు వారికి విద్య, శుభ్రతనేర్పి జాతి, మత విచక్షణలేక ఏకమై ఉంటేనే దేశదుస్థితి తొలగుతుందని చెప్పింది. దేవాలయాలలో మాలవారిని రానిచ్చినంత మాత్రాన మైలబడరు కాబట్టి స్త్రీలు అస్పృశ్యతా నివారణకై తమ అధీనంలో ఉన్నకార్యక్రమాలలో అస్పృశ్యులను ఆహ్వానించాలనీ, మాలస్త్రీలుకూడా పరిశుభ్రతపాటించే విధంగా తయారవ్వాలని చెప్పింది. జాతిసమైక్యతతో సత్యాగ్రహ ఉద్యమ కార్యక్రమాలలో ఒక్కటై మెలగటానికి అవసరమైన అస్పృశ్యతానివారణకు స్త్రీలే ఎక్కువగా బాధ్యతవహించాలని తెలియజేసింది.

1933 సం. మే నెల గృహలక్ష్మిపత్రికలోనే మందా ముత్యాలమ్మ తన వ్యాసంలో స్త్రీలు

ప్రత్యేక సభలు జరుపుకొని పురుషులతో సమానహక్కులు కావలెనని తీర్మానం చేస్తున్నారనీ, అస్పృశ్యతా నివారణమువంటి కార్యక్రమాలలో జనసామాన్యంలో స్త్రీలు చైతన్యం కలిగిస్తున్నారని తెలిపింది. మానవులెవరైన వారియొక్క వృత్తిని ముగించి, పరిశుద్ధ స్నానం చేసిన తరువాత స్పృశ్యులే అగుదురనీ, పిల్లల మలమూత్రములు తీసే తల్లి అస్పృశ్యురాలిగా భావిస్తున్నామా అని ప్రశ్నించుకోవాలని తెలియజేసింది. అంతేకాదు, పూర్వకాలంలో ఏ కులంలో పుట్టిన వారైనా బ్రహ్మజ్ఞానం కలిగిన వారయ్యారనేది గుర్తుంచుకోవాలనీ, తండ్రి చెప్పులు కుట్టేవాడైతే అస్పృశ్యుడిగా భావించినా, అతని కొడుకు కలెక్టరయితే స్పృశ్యుడిగానే భావిస్తున్నారనీ, హరిజనులను ఉద్ధరించటం అటుంచి, ఇండ్లలో దేవాలయాలలో, పాఠశాలలో వారికి ప్రవేశం కల్పించాలని తెలియజేసింది. హరిజనోద్ధరణకై హేతుబద్ధమైన అభిప్రాయాలు వెల్లడించటం స్త్రీల మేధాశక్తికి, ప్రతీకంగా భావించి విజ్ఞానవంతులుగా ఆలోచింపజేయటం నేటికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

పరుచూరి భువనేశ్వరి మరియు అన్నపూర్ణాదేవి కలిసి వ్రాసిన 'తెలుగుబిడ్డ' (జులై 1933 గృహలక్ష్మి) అనే కవితలో హరిజనుల స్థితిని తెలియజేస్తూ హరిజనోద్ధరణలకై ప్రజలను చైతన్యపరుస్తూ

"కడుపునిండార త్రాగంగ గంజి నీరు / కట్టుకొనుటకు చింపిరి బట్టలేదు / నిద్రవచ్చుచో జానెడు నేల లేదు / దీనహరిజనస్థితి యిదే తెలుగుబిడ్డ / ఉపవసించే గాంధి యిరువదొక్క దినము/ వారి క్షేమాభివృద్ధికి పాటుపడుచూ / పన్నమోర్చెను వారికే ప్రాణములను / పిరికి చేరదీయవదేని తెలుగుబిడ్డ / హరిజనోద్ధార కార్యంబునాదరించి / వారి క్షేమాభివృద్ధికి పాటుపడుచు / వారు సోదరుల్ మనకంచు జేరదీసి / అలరుచుండుము దేశాలతెలుగుబిడ్డ / గాంధిమహోజ్వాలకఠినతపస్సు / శీఘ్రుకాలమునసిద్ధించుగాక" అని సత్యాగ్రహ నిర్మాణకార్యక్రమాలలో భాగంగా ఉద్యమాన్ని బలోపేతం చేయటానికి, ప్రజలంతా ఐకమత్యంతో పోరాడటానికిని దీనులైన హరిజనోద్ధారణ కావల్సిన అవసరాన్ని గుర్తించిన గాంధీ దాన్ని సత్యాగ్రహంలో భాగంచేసారు.

వింజమూరి వెంకటరత్నమ్మ వ్రాసిన 'పాకీవాడు' (సెప్టెంబరు 1933 గృహలక్ష్మి) అనే కవితలో

"నెయ్యుడా ! నీవు తాకరాని నరుఁడంచు
శుచియెరుఁగనివాడవంచు జనవితతి
పల్కహేతువేమొకొ? ప్రతి పదమునందు
శుద్ధినినువెంబడింప, మాసుఖము గోరి
నీ పవిత్రసేవాస్రవంతి బహుమతిన
వస్తు నివహంబ దవ్వుగా బరిహరించి
తానుమాత్రము శుద్ధమై తనరునెపుడు
భూమికి విషప్రళయబాధ పొరయకుండ

పుడిమి నీవు రక్షింతువు మురికినుండి
మనుజునకు గల్గు దుర్యశోమల పదార్థ
మంతయు వహించుదాక మానవాళిసేవ
సలుపు ధైర్యసంపద మాకొసంగుమయ్య"

అని అస్పృశ్యుడిగా భావింపబడే 'పాకివాడు' తమ జీవితాలకు శుభ్రతనొసంగు చున్నారనీ, మనుషుల మనసులలో మాలిన్యం పోగొట్టి మానవాళి సేవను అనుగ్రహించమని పాకివానిని కోరటం ఆనాటి హరిజనోద్ధరణలో భాగంగా చెప్పటం జరిగింది. వింజమూరి వేంకటరత్నమ్మ పాకిపని వారిని గురించి ఆలోచించమని వెన్నుతట్టటం సత్యాగ్రహ ఉద్యమానికి వెన్నెముక వంటి కవిత.

అస్పృశ్యులుగా సమాజంలో వారికి జరుగుతున్న అన్యాయాలను, చిత్రికరిస్తూ స్త్రీలు కథలు వ్రాసారు.

1934 సం.లో పులవర్తి కమలావతీదేవి వ్రాసిన 'మాదిగ వెంకడు' (జూన్ 1934 వాసవి) అనే మరొక కథలో ఒక డిప్యూటి కలెక్టరు తన ఆఫీసులోని మఱుగుదొడ్డిని శుభ్రంచేసే దళితకార్మికుడు అస్వస్థతతో ఒక రోజు పనికి రాకపోయేసరికి అధికారమదంతో ఆ డిప్యూటి కలెక్టరు రోగగ్రస్థుడైన ఆ కార్మికుడ్ని యింటినుండి పిలిపించి, మరుగుదొడ్డిని శుభ్రంచేయమని అంటాడు. అతదు చేయనని ఎదురు సమాధానం చెప్పినందుకు అతడ్ని చితగగొట్టాడు. అప్పుడు మాదిగ సఫాయీ కార్మికుడు తిరగబడి ఆ డిప్యూటి కలెక్టరును తిరిగి కొట్టాడు. తనని బాధపెట్టిన కలెక్టరుమీద కోర్టులో ఫిర్యాదుచేయాలంటే ప్లీడర్లెవరూ సహకరించక పోయినా, మాదిగ వెంకడి చేతిలో తన్నులుతిన్న కలెక్టరుగా అందరూ నవ్వుతుంటే ఆ కలెక్టరు మాత్రం ఆ ఊరినుండి బదిలీ చేయించుకున్నాడని పులవర్తి కమలావతీదేవి తెలియజేసింది. ఇక్కడ శ్రీశ్రీ గారి 'కనకదుర్గా చండ సింహం జూలుదులిపి ఆవులించింది' అనే కవిత గుర్తుకు రాక తప్పదు. స్త్రీ వ్రాసిన ప్రథమ దళితోద్యమ కథగా దీన్ని భావించవచ్చు. దళితునియొక్క తిరుగుబాటులోని సత్యాన్ని ఒక దళితేతర రచయిత్రిగా స్పష్టంచేసింది.

డి.యస్.రాజేశ్వరమ్మ వ్రాసిన 'అస్పృశ్యతా నివారణమవసరమా' (మార్చి 1936 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్వప్రయోజనార్థమైన వర్ణభేదములవల్ల సుహృద్భావం తగ్గి స్వరాజ్య సంపాదనకు అవరోధంగా ఉన్నదనీ. నాల్గువర్ణములు పుట్టుకచేతగాక గుణకర్మలవల్ల ఏర్పడ్డాయనీ, భారతగ్రంథ రచనానంతరమే పంచమవర్ణము ఏర్పడినదని తెలిపింది. అంతేకాదు, మానవధర్మము ఏకజనితులగు తోటి సోదరులను అంటరాదని నిషేధించుట తప్పనీ, హిందూసంఘమున స్థానం లేకపోవటం చేతనే పంచములు క్రైస్తవులను ఆశ్రయించుచున్నారనీ, వారిపరాధీనత భారతజాతీయతను బలహీన పరుస్తోందని చెప్పింది. భారతదేశాభివృద్ధికై అస్పృశ్యతాపిశాచాన్ని హతమార్చాలనీ ఐకమత్యముతో

స్వతంత్ర్యోద్యమం ముందుకు సాగాల్సిన అవసరముందని తెలియజేసింది. హరిజనులను కలుపుకుంటూ స్వతంత్రోద్యమం సాగితేనే భారతదేశానికి స్వాతంత్రం సులభతరమవుతుందని భావించింది.

గొట్టుముక్కల వెంకాయమ్మ వ్రాసిన 'అయ్యోపాపం' అనే (మార్చి 1935 గృహలక్ష్మి) కథలో హరిజన దంపతులు అనారోగ్యంతో ఉన్న ఆమె తల్లిని చూడటానికి గ్రామానికి బయలుదేరి 15 మైళ్ళు నడిచేసరికి దారి మధ్యలో వేసవి కాలం కారణంగా దాహమై వరుసగా చలివేంద్రం పెట్టిన బ్రాహ్మణుని, మరొక బ్రాహ్మణ యిల్లాలినీ, వేశ్య యింటికి వెళ్ళి త్రాగునీటిని అడిగినా, వారు మాలలకు పోయమని తరిమిగొట్టారు. వారు స్పృహ తప్పిపడిపోయినప్పుడు ఒక సాహెబ్ ముందుకువచ్చి వారి దప్పిక తీర్చటంతో వారు తేరుకున్నారని తెలియజేస్తూ 'అస్పృశ్యత' మానవత్వాన్ని మంటగలిపిన విషయాన్ని తెలియజేసిన కథయిది.

తల్లా ప్రగడ విశ్వసుందరమ్మ వ్రాసిన 'మేలుకొలుపు' అనే కవితలో (సెప్టెంబరు 1936 గృహలక్ష్మి)

"మేలు కొనుమో భారతీయుడా..../ మేలుకొనుమో దేశభక్తుడ / మేలుకో నీతల్లిదేశపు / గాంధిప్రభుని సుబోధలందున / గణ్యతనుంచి / జ్యోతివెల్గునజూడు / మానవభారతీయదైవసృష్టిని/ సర్వులునుసమమనెడిభావము / స్వాంతమందునను / అంటరాదుముట్టరాదన / తుంటరత్వము మాని బుద్ధిని / గనవయ్య ముక్తి" అని గాంధీ చెప్పిన అస్పృశ్యతా నివారణను ఆలోచించమంది. ఆరకంగా ప్రజలంతా ఐక్యమై స్వాతంత్రోద్యమంలో పాల్గొనాలని బోధచేసింది.

పాకల చంద్రకాంతమణి వ్రాసిన 'తండ్రియా? తనయుడా?' (సెప్టెంబరు 1937 గృహలక్ష్మి) అనే కథలో ఒక మాలపిల్ల క్రిందపడితే ఆమెను లేవదీసినందుకు మరియు చెరువులో మునిగిపోతున్న మాలపిల్లవాడ్ని రక్షించినందుకును ఆ మనవడిని ఒక అగ్రహారిక బ్రాహ్మణుడు ఇంట్లోనుండి వెడలగొట్టాడు. కొడుకు ఉండాలనుకుంటే తన కూతుర్ని కూడా బయటకు పొమ్మని చెప్పేసరికి, ఆమె వెళ్ళకుండా తండ్రి ఇంట్లోనే ఉండిపోతుంది. బయటకు వెళ్ళిపోయిన ఆ మనవడు మాలపాకలో కలరా వస్తే హరిజన సేవా సంఘం తరపున మాలవారికి సహాయంచేస్తూ కలరా వచ్చి చనిపోతాడు. బ్రాహ్మణ నిర్భంధాలవల్ల చివరి క్షణాలలో ఉన్న తండ్రిని ఆ కూతురు వదలలేక అటు కొడుకు శవం దగ్గరకు వెళ్ళలేక ఆ తల్లి ఘర్షణపడింది. ఈ కథ అస్పృశ్యత సమాజంలో ఎంత బలంగా ఉందో తెలియచేస్తూ, నవనాగరిక యువకులు ముందుకొచ్చి అశ్పృశ్యతా నివారణకై పాటుపడితే సంఘం వారినెంత బహిష్కరిస్తుందోకూడా స్పష్టం చేయటం జరిగింది. కులవివక్షవల్ల సహజ మానవసంబంధాలు, సమాజసంబంధాలు విచ్ఛిన్నం అవుతున్నాయనే ఒక సామాజిక వాస్తవాన్ని

ప్రతిబింబించిన సాహిత్యం యిది.

చుండూరి రమాదేవి వ్రాసిన "ధర్మతల్లి" (మార్చి 1938 గృహలక్ష్మి) అనే కథలో దారిలో మాలపిల్ల అడ్డుగా వచ్చిందనీ ఆమెను అంటరాని పిల్లగా చూస్తూ మాయదారి స్వరాజ్యం (రాష్ట్రీయ స్వాతంత్ర్యం) రావటంతో మాలపిల్ల అలా నిర్భయంగా అగ్రవర్ణాలప్రక్కన దారిలో నడిచిందని తిట్టిపోస్తుంది. ఆమె మరో సంఘటనను కూడా చెప్తూ తన సోదరికి జ్వరం వచ్చి ఉపాధిలేక అన్నం లేకపోయేసరికి, బిచ్చమెత్తటానికి వెళ్లినప్పుడు తానుకూడా ఆకలితో అలమటించి ఒక బ్రాహ్మణ కుటుంబపు అరుగుమీద స్పృహతప్పి పడిపోతే, ఆ బ్రాహ్మణస్త్రీకి తాను మాలపిల్లనని తెలిసినా తనకు నోట్లో అన్నరసం పోసి బ్రతికించిందనీ, తన సోదరునికి కూడా అన్నాన్ని తీసుకెళ్ళమని ఇచ్చిందనీ, ఆమెయే దళితులపట్ల ధర్మదేవత అని భావించింది. ఇద్దరు అగ్రకుల స్త్రీల మనస్తత్వాలలోని తారతమ్యమే అస్పృశ్యతకు కారణమని గ్రహించాలనీ, కులము కారణం కాదని తెలియజేసింది. పూనా ఒడంబడిక ప్రకారం అస్ప్రశ్యులకు అధికసంఖ్యలో ప్రత్యేకనియోజకవర్గాలను కేటాయించటంవల్ల వారికి అధికారం వచ్చిందనే భావనతో మొదటిస్త్రీ అలా మాట్లాడినట్లు అర్థమవుతుంది.

సి.వి.కృష్ణమ్మ వ్రాసిన 'అనాథ వనిత' (మే 1938 గృహలక్ష్మి) అనే కథనంలో మహాలయ అమావాస్య రోజున ఒక హరిజనస్త్రీ త్రాగుబోతైన తన భర్త బియ్యానికి డబ్బుతెచ్చి యివ్వక పోవటంతో ఆకలితో అలమటిస్తున్న తనకూతుళ్ళతో వచ్చి ఆమె వీధులలో బిచ్చం అడుగుకుంటూ తిరుగుతుంది. ఒకయింటి వనిత వారికి పెట్టటానికై అన్నం తీసుకొని వస్తుంటే అత్తగారు వచ్చి తిథిరోజున పెట్టకూడదని వారించిందనీ, తర్వాత ఆ హరిజనస్త్రీ సమీపంలోని చెరువులో పడి చనిపోయిన వార్త తెలిసిందనీ, ఇటువంటి ఘోరాలు జరుగకుండా శాసనసభ్యురాండ్రు బాధ్యత వహించాలని తెలియజేసింది. రచయిత్రి ఈ కథలో హరిజనులయొక్క బీదరికపు నిర్మూలనతో పాటు అస్పృశ్య నివారణకై శాసనసభ్యులు చట్టం తేవాల్సిన అవసరాన్ని సూచించింది. శాసనసభలలో హరిజనులకు ప్రత్యేకంగా అధిక స్థానాలను యిచ్చి గుర్తించటంతోపాటు, వారికి సామాజిక అస్థిత్వన్యాయం అవసరమని ఆనాడే స్త్రీలు గుర్తించారు.

పులవర్తి కమలావతిదేవి రాసిన 'పోశమ్మగండి' (ఆగష్టు1938 వాసవి) అనే కథలో భద్రాచలం–పోలవరానికి మధ్య ఒక 'గండి' గా కనపడే కొండ ప్రాంత మైదానానికి స్వయంగా నడుపుకుంటూ వస్తూన్న బ్రిటీష్ దొరసాని విమానం కొండను ఢీకొని కిందపడిపోతుంది. ఆ గిరిజన ప్రాంతంలో కొండ మీద ఉన్న పోశమ్మ గుడి పూజారి శంభన్న దొర, ఆ చప్పుడు విని క్రిందకు వచ్చి చూస్తాడు. కాని విమానంలో నుండి రాత్రిపూట సహాయానికై దొరసాని 'హెల్ప్' అని అరుస్తుంటే విని ఆ భాష అర్థంకాక ఆ విమానాన్ని 'పెనుభూతం' అని భయపడి తిరిగి కొండమీదకు వెళ్ళాడు. తెల్లవారి

తిరిగి వచ్చి దానిలోపల ఆత్మ మూలుగుతోందని తీయాలనుకునేసరికి లోపల కాలికి గాయం అయిన దొరసాని పెద్దగా అరిచేసరికి భూతం అనుకొని భయపడి మళ్ళీ శంభన్న తిరిగి కొండపైకి వెళ్ళి మరి కాసేపటికి తిరిగి వస్తాడు. కానీ, ఈ లోపల ఆ పోశమ్మ గుడి పూజారిత్వానికి ఆశపడుతున్న మరొక గంటందొర, అతనితోపాటు వచ్చిన ఆతని కొడుకు కలిసి నిర్భయంగా ఆ దొరసానిని బయటకు తీస్తారు. దానికి కోపం వచ్చిన శంభన్నదొర ఆ భూతాన్ని భుజముమీద వేసికొని కొండమీద ఉన్న గుడిదగ్గరకు తీసుకువెళ్ళి ఆ భూతంలోని ఆత్మను పోగొట్టటానికై దానికి పసుపు కుంకుమలు పూసి పోశమ్మగుడి దగ్గరున్న బలిపీఠంమీద పడుకోపెడ్తాడు. అక్కడ దొరసానిని బలియివ్వటానికి శంభన్న కత్తితో ఉండగా, అదే సమయానికి దొరసానిని వెతుకుతూ వచ్చిన బ్రిటిష్ దొరలు చూసి, తమ దొరసానిని ఆ గిరిజనులు చంపుతున్నారని భావించి ఫైరింగ్‌కి ఆర్డరు ఇచ్చేసరికి శంభన్న చచ్చిపోతాడు.

ఈ కథలో ఎప్పుడూ విమానాన్ని గురించి వినని, చూడని గిరిజనుడు దాన్నొక పెనుభూతంగా భావించి, అందులో ఉన్న ఆమెను భూతాత్మకింద భావించి పోశమ్మగుడిలో బలి ఇవ్వాలనుకోవటం జరిగిందంటే అది గిరిజనుల అవిద్యకు చిహ్నమనీ, ఆ దొరకూడా అతనిని అర్థంచేసుకోలేదని తెలుస్తుంది. వారిని బాధపెట్టకుండా విద్యావాసనలేని గిరిజనులను ప్రపంచంపట్ల జ్ఞానవంతులను చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉంటుందని తెలియజేసేకథ. గోదావరి, విశాఖపట్టణపు కొండప్రాంతపు గిరిజన తెగలు బ్రిటీష్ వారిపై తిరుగుబాటు చేసినందుకు కలిగిన భయం బ్రిటీష్ వారిలో ఉండటం చేత సాయుధ సంస్కృతిని పాటించి 1870 నుండి ఉన్న నేరస్తజాతుల చట్టాన్ని వారు అమలు చేసేవారనే దానికి అద్దంపట్టినది ఈ కథ. అప్పటికే శాసనోల్లంఘన సమయంలోనూ, సత్యాగ్రహ ఉద్యమ సమయంలోనూ అవిద్య, అధికారం మధ్య హింసకు గురియైన ఆదివాసీల చరిత్రకు దర్పణంగా ఉంది. పులవర్తి కమలావతిదేవి రచించిన ఈ కథనే స్త్రీలసాహిత్యంలోని మొదటి గిరిజన కథగా భావించవచ్చు.

ఆయపెళ్ళి రామలక్ష్మి వ్రాసిన 'ధన్యజీవులు' (అక్టోబరు 1941 గృహలక్ష్మి) అనే కథలో బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన కొడుకు మాలవారికి వైద్యం చేయటం నచ్చక ఆతని తండ్రి యింట్లోనుండి వెళ్ళకొట్టగా అతనితో పాటు ఆతని భార్యకూడా వెంటవెళ్ళి మాలపల్లిలోనే ఉంటారు. వారిద్దరూ మాలపిల్లలకు చదువు చెప్తూ, రాట్నంవడకటం నేర్పిస్తూ, వారిని ఖద్దరు ధరించేటట్లు చేస్తూ ఉంటారు. అంతేకాక వారికి వైద్యంచేస్తూ వారియొక్క జీవితాలలో అభివృద్ధిని ఆకాంక్షించిన వారుగా, ఆ భార్యాభర్తలిద్దరూ ధన్యజీవులనీ, మాలవారిని కూడా సోదరభావంతో చూడాలనీ, వశిష్ఠుడే అరుంధతిని భార్యగా స్వీకరించాడని గ్రహించాలని రచయిత్రి తెలియజేసింది. మధ్యలో అంతస్థుల తేడాతోనే వారు బీదరికంలోకి నెట్టబడటంతో వారికి పరిశుభ్రత లేకపోయిందనీ, వారిని

అస్పృశ్యులని భావించటంకంటె కూడా వారికి శుభ్రత నేర్పి సోదరులక్రింద భావించటమే దేశసేవ అనికూడా తెలిపింది. మాలవారిని కలుపుకోవటం స్వాతంత్ర్య సాధనకు మార్గమవుతుందనే భావనను కలిగించే కథయిది. అస్పృశ్యతకు, బీదరికానికి, శుచికి, వెలికి ఉన్న స్వభావాన్ని అర్థం చేసుకోవాలని రచయిత్రి తెలియజేసింది.

సి. హెచ్. చంద్రమతి 'దిక్కుమాలు మాలబాలకుని రక్షణ' (జూన్, జులై 1944 హిందూ సుందరి) అనే కథను వ్రాస్తూ తన అనుభవంలో తెలిసిన వాస్తవ సంఘటన విషయంగా చెబుతుంది. కడపజిల్లా రాయచోటిలో డిప్యూటి కలెక్టరు గారు తన కుటుంబాన్ని సంఘం వెలివేసినప్పటికి, భార్యాభర్తలుగా దిక్కులేని ఒక మాల బాలుడిని దగ్గరకు తీసి శుభ్రత నేర్పి, విద్య నేర్పించి పెంచిన విధానం హరిజనోద్ధరణ స్ఫూర్తిని కల్గిస్తుందనీ, అప్పుడే భారతీయులకు ఐకమత్యం పెరిగి, స్వాతంత్ర్య సాధన, దేశాభివృద్ధి జరుగుతుందని తెలియజేసింది. ఇది హరిజనోద్ధరణను ఆచరణలో పెట్టినదానిని రుజువుచేసిన సామాజిక ప్రయోగాత్మక సాహిత్యం.

ప్రతిఇంట స్త్రీలు హరిజనులను ఆదరించగలిగితే సమాజంలో అస్పృశ్యులు కలిసిపోగలరనీ, స్త్రీలు తమ రచనలద్వారా తోటిస్త్రీలను చైతన్యపరచారు. దేశస్వాతంత్ర్యోద్యమంలో హరిజనోద్ధరణ రాజకీయప్రక్రియ అయినా నేడు అదిసాంఘికన్యాయమనీ, కర్మసిద్ధాంతంతో కాక సామాజిక స్వభావంతో, మానవత్వంతో కూడుకొన్నదని భావించి ఎవరికివారు కర్తవ్యాన్ని నిర్వహించాలి. ప్రజాస్వామిక సమాజంలో సమాన మానవహక్కులను అనుభవించగలహక్కు అన్ని వర్ణాలవారికి ఉంది. అందుకే స్వాతంత్ర్యానంతరంకూడా దళితసాహిత్యసృష్టి జరుగుతూనే ఉంది. ప్రతి ఒక్కరికీ దళితస్పృహ ఉండటం దేశనాగరికతకు, స్వాతంత్ర్యానికి చిహ్నంగా భావించాలి.

3. స్వాతంత్ర్యానంతర తెలుగు సాహిత్యంలో స్త్రీలవ్యక్తిత్వ చైతన్యం

బ్రిటిష్ వారి అధికారానికి, పెట్టుబడిదారి వికృత నాగరికతకు వ్యతిరేకంగా జరిగిన పోరాటమే స్వాతంత్ర్యోద్యమం. ఆనాడు భారతీయులు స్వాతంత్ర్యంకోసం బ్రిటిష్ వారి ఆర్థికదోపిడికి, శ్రమదోపిడికి వ్యతిరేకంగాను, భౌతిక, బౌద్ధిక స్వేచ్ఛ, పౌరసమానత్వం కోసం పోరాడారని అర్థమౌతుంది. ప్రజలసాంఘిక, ఆర్థిక, రాజకీయ హక్కులవినియోగం స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు పట్టుగొమ్మలు. వాటి సాధనయే వ్యక్తిత్వస్వాతంత్ర్యసాధన. వాటిని వినియోగించుకోవాలనుకోవటమే సాధికార స్వాతంత్ర్య చైతన్యం.

1947లో భారతదేశానికి రాజకీయస్వాతంత్ర్యం వచ్చింది. కానీ ఆ స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నామని అనటానికి భారతీయులయొక్క ఆర్థిక, సాంఘికసమానత్వమే నిదర్శనమౌతుంది. ప్రతిపౌరునియొక్క స్వేచ్ఛ, సమానత్వం దేశస్వాతంత్ర్రానికి మూలస్థంభాలవంటివి. ఇటువంటి స్వాతంత్ర్యానికై నాడు స్వాతంత్ర సమరయోధులు ఉద్యమాలుచేసి ప్రాణత్యాగాలు చేసారు. శ్రీశ్రీ అన్నట్లు "స్వాతంత్ర్యం ఒక సున్నితమైనపువ్వు, వాడియైనకత్తి, విలువైన వజ్రంకూడా". ఆ స్వాతంత్ర్యపుష్పాన్ని వసివాడకుండా చూసుకోవాలి. ఆ స్వాతంత్ర్యఫలాలను భారతీయులందరూ అనుభవించలేకపోతే స్వాతంత్ర్యం నేతిబీరకాయ చందమౌతుంది. ప్రజలు బాధలకు లోనవుతున్నారంటే వారికి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు కొరవడినట్లే.

స్వాతంత్ర్యానంతరం భారతరాజ్యాంగం ప్రతి వ్యక్తికి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను లిఖిత పూర్వకంగానే యిచ్చింది. ప్రజాస్వామ్యపు ప్రాతిపదికన ఏర్పడిన భారతరాజ్యాంగాన్ని అమలుపరచేది భారతీయ మానసికప్రవృత్తులే. ముఖ్యంగా సామాజిక వ్యవస్థలో వర్గ, కుల, మత లింగభేదాలు స్వేచ్ఛను అడ్డుకుంటున్నాయి. అందుకే వ్యక్తులకంటేకూడా ముందుగా వ్యవస్థలను సంస్కరించాలి.

వ్యవస్థపై ప్రజలుసాగించే రాజకీయ, ఆర్థిక, సాంఘిక పోరాటాలతో వారి ఆశయాలు ముడిపడి ఉంటాయి. స్వాతంత్ర్యానంతరం భారతీయులహక్కుల వినియోగాన్ని బట్టి స్వాతంత్ర్య పరిరక్షణ ఆధారపడి ఉంటుంది. దానికై పరిస్థితులను మరింతగా అవగాహన చేసుకోవటానికి సాహిత్యం దోహదపడుతుంది. దానికి ఆయా రాష్ట్రాలప్రజలు తమతమ మాతృభాషలలో సృజించిన

సాహిత్యపరిశీలన చేయాలి. స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యానంతరం, నేటి ప్రపంచీకరణ సందర్భాలలో ఏఏ సామాజిక, ఆర్థిక, రాజకీయవిషయాలు ప్రజలకు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు లేకుండా చేస్తున్నాయో, ఆయాసందర్భాలలో వాటిని పొందటానికి ఎటువంటిస్ఫూర్తిని తెచ్చుకోవాలో రచయితలు ఎప్పటికప్పుడే ప్రజలను చైతన్యపరుస్తుంటారు.

సమాజంలో పురుషులవలె స్త్రీలు సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వాన్ని అనుభవించగల అవకాశాలతోపాటు, గౌరవప్రదమైన సామాజిక జీవనం ఉండటాన్ని స్త్రీలసాధికారస్వాతంత్ర్య చిహ్నంగా భావించాలి. జనాభాలో సగభాగం స్త్రీలు కాబట్టి స్త్రీలస్వేచ్ఛాచైతన్యానికి సంబంధించిన విషయాలే ఎక్కువగా స్త్రీలసాహిత్యంలో ప్రతిఫలిస్తాయి. అయితే స్త్రీలయొక్క సాధికారస్వాతంత్ర్యాలకు సామాజిక, ఆర్థిక – రాజకీయస్వభావం గల వ్యవస్థకు సంబంధం ఉంటుంది, కాబట్టి ఆయా సందర్భాలలో వ్యవస్థ స్పష్టమవుతూనే ఉంటుంది. స్త్రీలసాధికారికతకు ముఖ్యమైనది స్త్రీలవ్యక్తిత్వ స్వాతంత్ర్యస్ఫూర్తి. స్త్రీలస్వేచ్ఛకు, వ్యక్తిస్వాతంత్ర్యానికి ఆటంకప్రాయమైన విషయాలు స్త్రీలు రాసిన సాహిత్యంలో ఎక్కువగా ప్రతిఫలించటం సహజం.

స్వాతంత్ర్యానంతరం మహిళావిద్య ఆశించినంతమేరకు అభివృద్ధి చెందలేదంటే స్త్రీవ్యక్తి స్వాతంత్ర్య స్ఫూర్తి తగ్గిందని భావించాలి. ఎందుకంటే స్వాతంత్ర్యం వచ్చిన ఏభైఏళ్ళు గడిచినా భారతదేశస్త్రీల అక్షరాస్యతా శాతం 25 మాత్రమే ఉంది. దానికి కారణం ఆడపిల్లపుట్టుకకు విలువలేనితనంతోపాటు స్త్రీలవివాహసంస్కృతిలో ఆశించినంత మార్పు రాకపోవటంతో, స్త్రీలు తమ వ్యక్తిత్వసాధనకై తమజీవితాలమీద తమకే ఆర్థిక–సాంస్కృతిక హక్కులుండే విధంగా సాధికారిక చైతన్యాన్ని పెంపొందించుకునే విధంగా రచనలు వచ్చాయి. ఆర్థికస్వాతంత్ర్యం ఉంటే సాంస్కృతిక స్వాతంత్ర్యాన్ని పొందే మార్గాలు ఏర్పడతాయి. మహిళలకు తమ శరీరంమీద, మనస్సులమీద నిర్ణయాలు తీసుకోగలిగే హక్కు ఉండటమే వారు అనుభవించే వ్యక్తిస్వాతంత్ర్యానికి నిదర్శనం. అప్పుడే వారి వ్యక్తిత్వాలకు విలువ ఉంటుంది. అదే వ్యక్తిత్వస్ఫూర్తిని గలిగించే చైతన్యం. స్త్రీలయొక్క వ్యక్తిత్వపు విలువలు, స్వేచ్ఛ, సాధికారికత పరస్పర ఆశ్రితాలు. అప్పుడే స్త్రీలకు తమ వ్యక్తిత్వపుజీవికకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోగలిగి సాధికారికత ఏర్పడే అవకాశాలుంటాయి. ఆ విధమైన చైతన్యాన్ని తెచ్చుకోగలగటమే స్త్రీల సాధికారిక చైతన్యం. అయితే దీన్ని పొందటానికి స్త్రీలు తమ శక్తియుక్తులకు పదునుపెట్టుకుంటూ తగిన సామర్థ్యాలను పెంపొందించుకోవాలి. అప్పుడే వారి వ్యక్తిత్వ వికసనం జరుగుతుంది.

భారతదేశ స్వాతంత్ర్యానంతరం స్వీయరాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత స్త్రీలలో వచ్చిన చైతన్యానికి ప్రతిఫలిస్తూ వచ్చిన సాహిత్యాన్ని పరిశీలించాలి. అనంతమైన ఆధునిక

తెలుగుసాహిత్య సింధువులో లభ్యమైన బిందువులవంటి సాహిత్యాన్ని మచ్చుతునకలుగా గ్రహించి పరిశీలనలో పరిణామశీలమైన స్త్రీలవ్యక్తిత్వ చైతన్యాన్ని తెలుసుకోవాలి.

మహిళా స్వేచ్ఛకై అవసరమైన చైతన్యం తెచ్చుకోవటం రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి – తాము చైతన్యం తెచ్చుకోవడం, రెండవది – తోటి వారిని చైతన్యపరచటం, సామూహిక మహిళా చైతన్యమే మహిళా స్వేచ్ఛకు సోపానాలు వేయగలుగుతుంది.

స్త్రీ పురుష సమానత్వం కొరకు, స్త్రీ తన జీవితాన్ని తాను నిర్మించుకునే హక్కు కొరకు పోరాడి స్త్రీపట్ల అమలులో ఉన్న వివక్షతల్ని వ్యతిరేకించాలనుకోవటం స్త్రీవాదం. అయితే ఆ ఛాయలు శ్రీపాదవారి 'కీలెరిగిన వాత' అనే కథలో కనబడతాయి. 1948 సంవత్సరంలో అంటే స్వాతంత్ర్యం వచ్చిన కొత్తల్లో వ్రాసిన కథ "కొత్తచూపు". స్త్రీ 'లైంగికత' కు సంబంధించిన అభద్రతా భావం నుండి విముక్తికై స్త్రీలు అలవరచుకోవలసిన నవీన దృక్పథాన్ని సూచిస్తూ వ్రాసిన కథ. 'రజాకార్ల దాడి' సందర్భంగా తెలంగాణాప్రాంతంలో స్త్రీల లైంగికత' కు అభద్రత ఏర్పడిన రోజులవి. 'పెళ్ళి' అనేది లైంగిక భద్రతకై ఏర్పడిందనీ, ఆభద్రతను యివ్వలేని వ్యక్తిని కట్నం యిచ్చి మరీ పెళ్ళిచేసుకోవాల్సిన అవసరం లేదనీ మగవాళ్ళు తమని రక్షించటం కంటే కూడా తమను తామే రక్షించుకోగల సత్తాను తాము పెంచుకోవాలనీ ఈ కథలో అన్నపూర్ణ అనే స్త్రీ అనుకొంది. ఆత్మరక్షణ చేసుకోవటానికి తగిన ఆత్మికశక్తిని పెంపెందించుకునే క్రమంలో సమాజంలో మగవాళ్ళు నేర్చుకునే విద్యలుగా భావించబడుతున్న సాము గరిడీలు, కత్తి విద్యలు, కుస్తీపట్లను అన్నపూర్ణ అభ్యసిస్తుంది. అన్నపూర్ణ స్ఫూర్తితో తోటి వాళ్ళు చేర్చుకుంటారు. ఈమెతో పోటీపడుతూ ఆ ఊరి యువకులూ నేర్చుకుంటారు. ఈమె విద్యా ప్రదర్శనను చూసిన స్త్రీలు తమను ఆమెతో పోల్చుకొని ఆ విద్యలు నేర్చుకోనందుకు తమ బతుకులు పురుగులవంటివని, తమ వ్యక్తిగత లైంగిక భద్రతకై అటువంటి విద్యలు అవసరం అనే చైతన్యం తెచ్చుకొంటారు. స్త్రీలు తమ శరీరాలమీద తమకే అధికారం ఉండాలనుకొనే వ్యక్తిత్వ చైతన్యానికి బీజప్రాయమైన కథ యిది.

కొడవటిగంటి కుటుంబరావు కథ 'పెళ్లి లోని అసమానత్వాలను విప్పి చెప్పటమే కాక 'పిన్ని' కథలో కుటుంబంలో భర్త అధికార సంబంధాలతో ఉండి తనకొక విలువ నివ్వటం లేదని భావించిన స్త్రీ యిల్లు వదలి అక్క యింటికి వస్తుంది. కుటుంబంలో తనకు పెత్తనం యిస్తే తప్ప సాధికారికత ఉండదనీ తను కావాలని వచ్చిన భర్తకు తెగేసి చెప్పింది. భర్త ఆమెకు ఆపెత్తనాన్ని యిస్తానంటూ, యింటికి తీసుకుని వెడతాడు.

కుటుంబంలో స్త్రీల వ్యక్తిత్వానికి విలువలను యిచ్చినప్పుడే సమాన సాధికారికత వస్తుందని భావించిన చైతన్యం ఆమెది. కుటుంబంలో సమాన సాధికారికత వల్ల వచ్చే స్వేచ్ఛను కోరుకున్న

చైతన్యం ఆమెది. పిన్ని తనకు కుటుంబలోని ఆర్థిక వ్యవస్థలో అధికారం ఉంటే విలువ ఉంటుందని భావించి కుటుంబంలో స్త్రీల సాధికారానికి చైతన్యబీజం వేసింది.

20 వ శతాబ్దంలో స్వాతంత్ర్యానంతరం సమాజంలో తండ్రులు తాగుడు వ్యసనానికి బలయి, ఆర్థికంగా చితికిపోయి కుటుంబాన్ని పట్టించుకోని స్థితిలో ఉన్నప్పుడుగాని, కుటుంబంలో సంపాదించే పురుషులు లేనప్పుడుగాని చదువుకొన్న స్త్రీలు ఉద్యోగాలు చేయాల్సి వచ్చింది. ఆ క్రమంలోసామాజిక సంస్కృతికి లోబడకుండా తమ జీవితాల మీద తామే పట్టు సాధించే క్రమంలో తమ స్వాతంత్ర్యానికి, స్వేచ్ఛకు, అధికారానికి అడ్డురాని వ్యక్తిని వివాహమాడాలనుకొనే స్వతంత్ర జీవన వ్యక్తిత్వం గల పాత్రగా ఇందిర డా.శ్రీదేవి రచించిన 'కాలాతీత వ్యక్తులు' నవలలో కనబడుతుంది. వ్యక్తిత్వపు చైతన్యం గల ఇందిర పాత్ర సాహిత్యంలో నూతన చైతన్యానికి ఒరవడిగా నిలిచింది.

తెలుగు గడ్డపై ఉన్న అమరావతికి సంబంధించి సత్యం శంకరమంచి 1978 సం.లో రాసిన 'అమరావతి కథల' సంపుటిలో "పక్కవీథి జన్మంతదూరం" అనే కథలో ఒక స్త్రీ కుటుంబ సంబంధాలలో ఉండటంకంటే కూడా వ్యక్తిత్వంతో ఒక మహిళగా, స్వతంత్రంగా జీవించటానికి ప్రాధాన్యత యిస్తుంది. చక్కగా వండిపెడుతున్న రంగమ్మను ఆమె భర్త దేవుడు పేరుకేగాని ఆమెను విసుక్కుంటూ తను చెప్పిన రంగు చీర కట్టుకోవాలని అనటమేకాక వంటల విషయంలోనూ చీటికిమాటికి ఆమెను మానసిక హింసకు గురిచేస్తాడు. దానితో రంగమ్మ ఒక రోజు ఇంటి పనులు చేయటం మానేసి తన విలువేంటో భర్తకు తెలియచేయాలనుకొంది. కాని, పితృస్వామ్య సంస్కృతి వంట పట్టించుకున్న ఆ భర్త ఆమె మీద కోపం తెచ్చుకుని పక్కవీధిలో ఇల్లు తీసుకుని వేరుగా ఉంటూ, ఈమెకు బియ్యం, పప్పు పంపిస్తూ ఉండేవాడు. అతడు వెళ్ళిపోయినందుకు ఆమె బాధపడదు కాని, నాలుగు రోజుల అనంతరం అలా పరాధీనంగా బతకటం యిష్టం లేక అతడు పంపించిన బియ్యం పప్పును తిరిగి పంపించేస్తుంది. రంగమ్మ పొలంలో కూలి పని చేసుకుని బ్రతుకును గడపాలనుకుంటుందే కాని తనకు విలువ లేని అతడి యింటికి వెళ్ళాలనుకోదు. అతడు రెండవ పెళ్ళి చేసుకున్నా బాధపడదు. కొన్నాళ్లకి అస్వస్థత వచ్చి, లేవలేకపోయిన పరిస్థితిలో ఉన్నాకూడా, సవతి రమ్మన్నా పక్క వీధిలో ఉన్న భర్త ఇంటికి వెళ్ళక తన వ్యక్తిత్వానికి విలువను నిలుపు కుంటుంది.

ఈ కథలో రంగమ్మ భర్తతో కుటుంబ చట్రంలో ఉన్నప్పుడు పని విభజనలో భాగంగా అతనికి వండిపెట్టి ఇంటి పనులు చేస్తూ ఉండటంతో, తను చేసే ఇంటిపనులకొక ఆర్థిక విలువలున్నాయనే భావనతో అతడు తెచ్చిన బియ్యం వండి వాటిని ఉపయోగించగలిగింది. అప్పుడు

తను చేసిన యింటి పనులకొక ఆర్థిక విలువలున్నాయనే భావనతో కూడిన వ్యక్తిత్వచైతన్యం ఆమెది. కాబట్టే అతడు ఇంట్లో ఉండనప్పుడు అతనికోసం యింటి పనులు, వంటపని చేయాల్సిన అవసరం లేనప్పుడు, అతడు పంపించే బియ్యం, పప్పు తీసుకోవాలని ఆమెకు అన్పించదు. ఆమెకు చదువులేకపోయినప్పటికీ వ్యక్తిత్వపు స్పృహ ఉండటంతో పరాధీనురాలుగా కుటుంబ హింసను భరిస్తూ తన జీవితాన్ని గడపటం యిష్టంలేని ఆమె, భర్త అలా చేసినందుకు బాధపడదు. తన శక్తిని పొలంలో కూలి పనులకు వెచ్చించి సంపాదించుకుని బ్రతకాలనుకోవటం 1978 సం. నాటికే మహిళలు తమనుతాము మనుషులుగా భావించుకుని, తమకూ వ్యక్తిత్వాలు ఉంటాయనే స్పృహతో బతకాలని అనుకోవటం కనపడుతుంది.

అంతేకాక భర్తకు వండిపెట్టి చేసే ఇంటిపనులకు ఉపయోగించిన శక్తిలో సగం పొలంలో కూలీగా వినియోగించి స్వతంత్ర వ్యక్తిగా బ్రతకాలనుకోవటం, తన మనసుకి, తన శరీరానికి, జీవితానికి విలువ నివ్వటంగా భావించింది. కుటుంబ హింస భరించేకంటే ఆర్థికంగా నిలదొక్కుకుని స్వతంత్ర వ్యక్తిగా బ్రతకగలిగితేనే మహిళల జీవితాలకు ఒకసాధికారికత ఏర్పడుతుందనే చైతన్యాన్ని కలిగించే కథ ఇది. కుటుంబంలో మహిళా సాధికారికత సాధించితే ఆ సాధికారికతే సమాజంలో విస్తృతమవుతుందనేది సత్యం.

సత్యం శంకరమంచి రాసిన మరొక కథలో "ఆరేసిన చీర" కథలో కూడా 'లచ్చి' తన భర్తకిష్టమైనట్టుగా కాక, తనకిష్టమైన పద్ధతిలో అలంకారం చేసుకుని, తన శరీరం మీద తనకే హక్కుందనే స్పృహ ఉన్నట్లుగా అర్థం అవుతుంది.

అమరావతి ప్రాంతమందలి సామాజిక జీవన సంస్కృతిలోని స్త్రీ–పురుష సంబంధాలలోని డొల్లతనాన్ని పోగొట్టుకొని గట్టి వ్యక్తిత్వంతో స్త్రీలు బ్రతకొచ్చనే భావన కలిగించేవిధంగాను, కుటుంబంలో సంతానాన్ని కనిచ్చే యంత్రంగా మారి బానిసగా ఉండటం కంటె కూడా, స్వీయ శ్రమ శక్తితో, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని, వ్యక్తిత్వాన్ని నిలుపుకోటానికి అవసరమైన చైతన్యాన్ని మహిళలు తెచ్చుకోవాల్సిన అవసరాన్ని అమరావతి కథలు తెలియచేస్తాయి.

మేనేజ్ మెంట్ చదువులు చదివినా కుటుంబ నిర్వహణలో నిర్ణయాత్మక శక్తులుగా ఉండలేని నేటి మహిళలకు, 1978 నాటికే చిన్న పరిశ్రమలు, ఉత్పత్తి సేవలు, అమ్మకాలు వంటి విషయంలో యాజమాన్య నిర్వహణా సమర్థురాలిగా ఉన్న సుబ్బమ్మ వంటి స్త్రీలు సాహిత్య కరదీపికలు కాగలరు. ఆ సమర్థతతోనే కుటుంబంలో కూడా మహిళా సాధికారితను సాధించిన మహిళగా "ఎవరికీ చెప్పబోక !" కథ అర్థం అవుతుంది.

మహిళలు సమాన అవకాశాలు పొందుతూ వ్యక్తిత్వం గౌరవంగల మనుషులు గాను,

మేధావంతులుగాను యాజమాన్య సమర్థులుగా ఉండగలరని మహిళలలో భావచైతన్యాన్ని ఇవ్వగల కథలు "అమరావతి కథలు". ఇందులో మహిళలు కుటుంబ చట్రంలో కుటుంబ హింసకు ఒదిగి పరాధీనులుగా బానిస బ్రతుకు బ్రతికే కంటే కూడా ఆర్థికంగా పుంజుకొని స్వతంత్ర వ్యక్తిత్వంతో బతికి తమ జీవితాలకు విలువనిచ్చుకోవాలనే సాధికారచైతన్యాన్ని నింపుకొన్న స్త్రీలుగా వారు అర్థమౌతారు.

స్త్రీలు రాసిన సాహిత్యంలో స్త్రీలకు తమ జీవితాలపై తమకు సాధికారం లేదని గుర్తించటం, దానికై ప్రయత్నించే చైతన్యం తెచ్చుకోవటం కనపడుతుంది.

కోడూరి కౌసల్యాదేవి రచించిన 'కల్పతరువు' అనే కథలో కూతురు, కొడుకు పెంపకాలలో తేడాను చూపిస్తున్న తల్లిని విమర్శకు పెట్టిన కల్పకం పాత్ర అవసరమైనపుడు కూతురే ఆ ఇంటిని ఆదుకొనే వ్యక్తి అని నిరూపించి కూతుర్లకు ఉన్న వ్యక్తిత్వపు విలువలను తెలియజేసి తల్లిని చైతన్యపరుస్తుంది.

రంగనాయకమ్మ రాసిన 'పెళ్ళానికి ప్రేమలేఖ' అనే కథలో పుట్టింటికి వచ్చిన విమలకు తన భర్తకు ఇంటిపని చేసిపెట్టటానికి తప్ప, తన వ్యక్తిత్వానికి విలువను ఇవ్వలేని భర్త దగ్గరకు తిరిగి వెళ్ళాల్సిన అవసరంలేదని భావించటానికి కారణం విమలలో వ్యక్తిత్వపు స్పృహ ఏర్పడటమే. స్త్రీలకు భౌతిక స్వేచ్ఛను, బౌద్ధిక స్వేచ్ఛను లేకుండా చేసి ఆర్థిక స్వావలంబన, సాధికారికత లేకుండా చేసిన వ్యవస్థలోని వివక్షా సంస్కృతిని ఎదుర్కొనే క్రమంలో ఆ సంస్కృతిని అమలు చేయటానికి ప్రాథమిక వేదిక కుటుంబం అనే అవగాహన కల్గింది. 1978-80 సం.ల మధ్య వచ్చిన రంగనాయకమ్మ రాసిన 'జానకి విముక్తి' నవలలో కుటుంబంలో భర్తపెట్టే హింస నుండి విముక్తి చెందే వ్యక్తిత్వచైతన్యం స్త్రీలకు ఉండాలని జానకి పాత్ర ద్వారాను, స్త్రీపురుష సంబంధాలలో ఉండాల్సిన సమానత్వాన్ని శాంతపాత్ర ద్వారా తెలియజేశారు. పరస్పరం ప్రేమ, నమ్మకం కలిగిన స్త్రీ-పురుషులు 'పెళ్ళి తంతు' లేకుండా ఒక యింట్లో సహజీవనం చేయగలరనీ, సమాజాభివృద్ధిలో భాగస్వాములు కాగాలరనీ, ఈ నవలలోని శాంత - సూర్యం సంబంధాలలో వ్యక్తమయిన విషయం. దాని ప్రభావంతో పెళ్ళిని నిరసించే ఆలోచనలు వచ్చాయి. వేదకాలం నుండి మహిళలపై హక్కుల బదలాయింపుగా వచ్చిన 'పెళ్ళితంతుకు' పుట్టకీళ్ళు కదలటం మొదలైంది. కుటుంబ హింస నుండి జానకివంటివారు విముక్తి చెందాల్సిన అవసరాన్ని గ్రహించిన స్త్రీ పాత్రగా 'శాంత' రంగనాయకమ్మ రాసిన 'జానకి విముక్తి నవలలో కనబడుతుంది. పెళ్లి అనేది పురుషుడికి స్త్రీ మీద అధికారాన్ని కలిగియుండటమే అనీ, అదే కుటుంబ హింసకు కారణమని గ్రహించి సమస్థాయీ సంబంధాలు, సాధికారికత కలిగిన కుటుంబజీవనాన్ని కోరుకున్న శాంత చైతన్యం ఆధునికమైనది.

ఇల్లిందల సరస్వతీ దేవి రాసిన 'పెళ్ళి కూతుళ్ళు' (1979) అనే నవలలో ఉద్యోగినులైన స్త్రీలకు పురుషులతో పాటు సమానహక్కులు కావాలని భావించటంతో పాటు స్త్రీలు ఉద్యోగాలు చేయటాన్ని అవకాశంగా తీసుకొని పురుషులు కుటుంబ బాధ్యతల నుండి తప్పుకుంటున్నారని స్త్రీలు గుర్తించగలిగేట్లుగా వ్రాసారు. చదువుకొని ఉద్యోగం చేస్తున్నా స్త్రీని భర్త బానిసగా చూస్తున్నాడు అనీ, స్త్రీలను సమస్యల నుండి ఎవడో వచ్చి విముక్తి చేయాలనుకోవటం అజ్ఞానం అనీ, తమమీద తమకు అధికారం లేకుండాపోతోందని, అసలు మగవాడే సమస్యలకు కారణం అయితే అతడెట్లా విముక్తి చేస్తాడని స్త్రీలు తమ వ్యక్తిత్వపు ఆలోచనలను పెంచుకునే చైతన్యాన్ని కలిగించింది ఈ నవల.

వాసిరెడ్డి సీతాదేవి రాసిన 'వైతరణి' (1980) అనే నవలలో కొడుకులతో పాటు కూతుళ్ళకు కూడా సమానమైన ఆస్తిహక్కు లేకపోవటంతో, తమజీవితాలమీద తమకు సాధికారంలేక స్త్రీల జీవితం నరకప్రాయంగా మారుతుందనే విషయాన్ని గ్రహించగలిగే వ్యక్తిత్వచైతన్యం నవలలోని నాగమ్మ, పార్వతి పాత్రల ద్వారా వ్యక్తం అవుతుంది.

1980 సం. తర్వాత తెలుగు సాహిత్యంలో స్త్రీవాదం చోటు చేసుకుంది. ఫ్రెంచి రచయిత్రి సైమన్ డి బారో తాను రాసిన 'ది సెకండ్ సెక్స్' అనే గ్రంథంలో పుట్టుకతో ఆడపిల్ల కాని, ఆమె సమాజం చేత స్త్రీగా తయారు చేయబడుతుందని చెప్పిన భావన ప్రసిద్ధిపొందింది. ఓల్గా రాసిన 'రాజకీయ కథలు' లో సమాజంలో స్త్రీల శరీరం ఎంతో హింసకు గురి అవుతుందనీ, ఆమె అవయవాలను చూస్తూ, చొంగ కార్చుకుంటూ చూడటం, తాకటం చేసేవారి హింసకు గురి అయిన స్త్రీలు బయటకు వెళ్లే కనీస భౌతికస్వేచ్ఛ లేక ఆందోళన చెందటం, స్త్రీలకు తమ శరీరాలమీద తమకు సాధికారం లేకపోవటాన్ని గుర్తించే వ్యక్తిత్వచైతన్యం స్త్రీలలో కనపడుతుంది.

అంతేకాదు, పెళ్లి దాని వల్ల వచ్చే పరిణామాలలో భాగంగా స్త్రీల మీద పురుషుడి అధికారాన్ని నిలబెట్టేదయితే ఆపెళ్ళిని తిరస్కరించాలనీ, స్త్రీ లైంగికానుభవాన్ని పొందటంలోనే గాక తన యొక్క శరీరం మీద, బ్రతుకు మీద భర్తకు ఆధికారం ఉండకూడదనే వ్యక్తిత్వచైతన్యాన్ని ఈ రాజకీయ కథలు కలిగించాయి. స్త్రీల శరీరం స్త్రీది కాకుండా చేస్తున్న స్త్రీల స్వేచ్ఛా రాహిత్యాన్ని తెలియచేస్తూ ఓల్గా రాసిన 'రాజకీయ కథలు' వచ్చాయి.

లక్ష్మీ సుహాసిని కవితలో చెప్పినట్టుగా 'నేను మౌనంగా ఉండిపోను, ఆడవారి మీద సాగే ప్రతి అణచివేత, అత్యాచారాల మీద అక్షర యుద్ధం సాగిస్తాను' అంటూ స్త్రీవాదం ముందుకొచ్చింది. ఇక్కడ శీలాసుభద్రా దేవి కవితలో చెప్పినట్టుగా "ఎన్నో ఏళ్లుగా నిద్రించిన మా వ్యక్తిత్వం తుళ్లి పడిలేచింది. ఆవులించి జూలు విదిల్చింది స్వేచ్ఛకోసం పెనుగులాటలో సంప్రదాయపు తాళ్లు తెగిపడ్డాయి" అనేది గుర్తుకు వస్తుంది.

1980 లలో ఓల్గా రాసిన 'స్వేచ్ఛ' అనే నవలలో స్త్రీకి పెళ్ళివల్ల తన మనస్సుమీద, ఆలోచనలమీద, ఆశయాలమీద భర్త ఆధిపత్యం ఉన్నప్పుడు తనజీవితానికి స్వేచ్ఛలేదని కుటుంబాన్ని వదిలివెళ్ళి పోవటం జరిగింది. అంతేకాదు, పెళ్ళి, కుటుంబం అనే సాంస్కృతిక దిగ్బంధనం లేకపోతేనే స్త్రీకి స్వేచ్ఛ ఉంటుందనే వ్యక్తిత్వ చైతన్యం తెచ్చుకోవటం కనపడుతుంది.

జొన్నలగడ్డ లలితాదేవి రాసిన 'అగ్నిపుత్రి' (1981) నవలలో పురుషులు తమ స్వార్థం కోసం ఏ విధంగా స్త్రీని లైంగిక దోపిడీకి గురిచేస్తారో అంజన పాత్ర ద్వారా తెలియజేశారు. అనాథ అయిన అంజనను వాళ్ళ మామయ్యలు అనుభవించటమే గాక చివరికి సత్యం అనే మామయ్య అతని ప్రమోషన్ కోసం పై అధికారికి ఆమెను తారుస్తాడు. దానితో తన శరీరంమీద సాధికారచైతన్యాన్ని తెచ్చుకున్న అంజన పోలీస్ రిపోర్ట్ ఇచ్చి సత్యాన్ని జైల్లో పెట్టించింది.

తురగా జానకీ రాణి 'నా జీవితం నాకు ఇయ్యి' అనే కథలో కుటుంబంలో భర్త హింసను పడలేక విడాకులు తీసుకోవాలని భావించి తను అతని సాహచర్యంలో కోల్పోయిన విలువైన జీవితాన్ని తిరిగి తనకు యిమ్మంటుంది. ఇదే స్త్రీలకుండాల్సిన వ్యక్తిత్వచైతన్యం.

పి.సత్యవతి రాసిన 'మాఘసూర్యకాంతి' అనే కథలో అల్లుడియొక్క అధికారం, అనాగరికత, అమానవీయమైన లైంగిక పీడనను తన కూతురు భరించాల్సిన అవసరం లేదని, అతనిదగ్గరకు వెళ్ళి కాపురం చేయాల్సిన పనిలేదని ఆ తల్లి చైతన్యం తెచ్చుకోవటం కనపడుతుంది. తమ కూతుర్లు కుటుంబ పీడనను భరించాల్సిన అవసరంలేదనే వ్యక్తిత్వచైతన్యం ముందుగా తల్లిదండ్రులలో రావలసిన అవసరాన్ని గుర్తింపుకు తెచ్చేకథ ఇది. ఈమె రాసిన 'ఇల్లలకగానే.... అనే మరొక కథలో శారద తనను పేరుతో ఎవరూ పిలవక పోవటానికి కారణంగా ఫలానా వారి కూతురు, ఫలానా వారి చెల్లెలు, ఫలానా అతని భార్యగా మాత్రమే పిలవబడటమేననీ, తన పేరును తానే చివరికి మర్చిపోయినందుకు బాధపడి తన ఉనికికి గుర్తింపు తనపేరేనని, దాన్ని తెలుసుకునే అన్వేషణ చేయటం, తన వ్యక్తిత్వచైతన్యానికి ప్రయత్నించటంగా భావించాలి. పి.సత్యవతి రాసిన మరికొన్ని కథలలో మధ్యతరగతి స్త్రీలు జీవితాలలోని పరాధీనతను అధిగమించి తాము స్వతంత్రంగా జీవించాలనుకోవటం కన్పడుతుంది. ఈమె వ్రాసిన 'గోవు' కథలో గౌతమిని ద్వితీయ భార్యగా చేసుకొన్న ఆమె భర్త మొదటి భార్య సంతానానికి అన్యాయం జరగకుండా ఉండేందుకు గౌతమికి గర్భం వస్తే అబార్షన్ చేయిస్తాడు. అప్పుడు గౌతమి తన శరీరం మీద తన మాతృత్వం మీద తనకు హక్కు లేదని, పిల్లల్ని కనాలనుకునే స్వాతంత్ర్యం తనకి లేదని గ్రహించి తనకూ తలవూపే 'గోవు'కు తేడా లేదనుకుంటుంది. పి.సత్యవతి 'బదిలీ' కథలో పదోన్నతికి వీలయిన ట్రాన్స్ఫర్ వచ్చిన రజని

హైదరాబాద్ వెళ్లటానికి ఆమె భర్త ఒప్పుకోడు. కాని, రజని తన భౌతిక, మానసిక స్వేచ్ఛను నిర్దేశించుకుని పిల్లల్ని తీసుకుని వెళ్లిపోతుంది.

ఆర్.వసుంధరాదేవి రాసిన 'గుర్తు' అనే కథలో ఇంటిచాకిరీలో భాగంగా గిన్నెలన్నీ తోముతున్నా ఆ గిన్నెలపైన భర్తపేరు తప్ప తనపేరు ఉండకపోవటాన్ని గుర్తించిన ఆ మహిళ తానురోజు చేస్తున్న పనిలోని పరాయికరణను గుర్తించగల వ్యక్తిత్వ చైతన్యాన్ని తెచ్చుకొంది.

అబ్బూరి ఛాయాదేవి రాసిన 'బోన్సాయి బ్రతుకులు' అనే కథలో సమాజంలో స్త్రీలను అణగదొక్కుతూ వారిని ఎదగనీయకుండా చేస్తున్నట్టే స్త్రీలజీవితాలుకూడా ఎత్తుకు పెరగనీయకుండా కోతలకు గురిచేయబడే బోన్సాయి మొక్కలవంటివే అనే వ్యక్తిత్వస్పృహను పొందటం కనపడుతుంది. ఈమె రాసిన 'శ్రీమతి ఉద్యోగిని' అనే మరొక కథలో ఉద్యోగిగా ఉన్నా, కుటుంబంలో తన స్థానం రెండవ పౌరురాలి స్థాయిలో ఉందనే స్పృహ కలగటం కూడా వ్యక్తిత్వ చైతన్యమే.

మరుగుదొడ్ల కొరత పల్లెలో స్త్రీల మీద అత్యాచారాలకు కారణమౌతోందని పరిశుభ్రత లేని జీవితాలను స్త్రీలు గడపాల్సి వస్తోందని భావించి, తమకు ఆరోగ్యకరమైన లైంగిక భద్రత గల జీవితాలకై పోరాడే దిశగా సంఘటితంగా ఉద్యమాన్ని చేపట్టిన శక్తిమంతమైన వ్యక్తిత్వంగల స్త్రీలు 'ఓల్గా రచించిన "ఆకాశంలో సగం' నవలని అక్రమించుకొన్నారు.

1993 సం.లో 'ఓల్గా' రాసిన 'ప్రయోగం' అనేకథలో స్త్రీ-పురుషులిద్దరికీ పెళ్ళి అనే ప్రయోగం పాత విలువల కొనసాగింపుగానే ఉండి స్త్రీ-పురుషులిద్దరికీ సుఖ శాంతులనివ్వటం లేదనీ, నరేంద్ర-సంధ్యల జీవితాల వల్ల అర్థమౌతుంది. ఆర్థిక స్వాతంత్ర్యంతో వ్యక్తిత్వపు చైతన్యం గల సునంద విడివిడిగా ఉంటూనే పెళ్ళి తంతులేకుండా ఒక ఇంట్లో అవసరము వచ్చినప్పుడల్లా కలుసుకోవచ్చు అని, కనాలనుకున్నపుడు పిల్లలని గురించి ఆలోచన చేయవచ్చు అని, సమాన సాధికార స్త్రీ-పురుష సంబంధాలు ఉండగల నూతన ప్రయోగం చేసింది. అరుణ పాత్ర పితృస్వామ్య కుటుంబనిర్మాణం ఏర్పడటానికి నిర్ణయించిన పెళ్ళిని నిరసించి వ్యక్తిత్వ చైతన్యవంతమైన నూతన స్త్రీగా కనపడుతుంది.

కుటుంబ హింసను భరించలేక భర్త నుండి విడిపోయి ఉద్యోగం చేసుకుంటూ పిల్లలను పోషించుకునే స్థాయికి చేరుకోవటమే గాక తనకు ఇష్టమైన వ్యక్తిని మళ్ళీ పెళ్ళి చేసుకుని సమాజంలో నిలదొక్కుకున్న వ్యక్తిత్వంగల మహిళగా ఓల్గా వ్రాసిన "సహజ' అనే నవలలో సహజ అనే స్త్రీ పాత్ర కనిపిస్తుంది. ఓల్గా రచించిన 'మానవి' అనే నవలలో వసంతపాత్ర తన భర్త అన్యసంబంధాలు పెట్టుకోవటంతో ప్రేమలేని కుటుంబసంబంధాలలో ఉండటం అనవసరం అని భావించి కుటుంబానికి

దూరమై స్వతంత్రంగా జీవించటమే మేలు అనే వ్యక్తిత్వపు చైతన్యము తెచ్చుకొన్న స్వతంత్రజీవికగా అర్థమవుతుంది.

పొత్తూరి విజయలక్ష్మి రచించిన 'అబలాయానం' అనే నవలలో మూడు తరాల స్త్రీల కుటుంబ చరిత్రకు సాక్షీభూతంగా నిలచిన స్త్రీ పాత్ర, స్త్రీల సమస్యలన్నిటికి అజ్ఞానం కారణమని భావించి, స్త్రీలకు అక్షరాస్యతవల్ల ప్రపంచజ్ఞానం పెరుగుతుందని అప్పుడే స్త్రీలు తమ వ్యక్తిత్వాలను నిలుపుకోగలుగుతారని భావించటం అమెలో కలిగిన చైతన్యానికి అద్దం పడుతుంది.

1996 సం.లో హోతాపద్మినీ దేవి వ్రాసిన 'గాజుకళ్లు' లో స్త్రీలయొక్క వ్యక్తిత్వాన్ని అణగదొక్కాలంటే 'ఆర్థిక అసహాయత్వం ఒకటి ముఖ్య సూత్రం అని భావించింది. స్త్రీ బానిసగా పడుండాలంటే, స్త్రీ ఉద్యోగం చేయకూడదనే భావనగల శారద భర్త పిల్లల బాధ్యత కూడా పట్టించు కోకపోతే, ఆమె తాను ఉద్యోగం చేయగల వాతావరణాన్ని సృష్టించుకొంది. పురుషులతోపాటు సమానంగా స్త్రీలు సంపూర్ణస్వేచ్ఛను పొందాలంటే ఆర్థికస్వాతంత్ర్యం ఉండాలని భావించారు. ఉద్యోగినులుగా స్త్రీలు సమానసాధికారికత కావాలనే చైతన్యం తెచ్చుకోవటం కనపడుతుంది.

ఉద్యోగిగా ఉన్న స్త్రీకి సామాజిక భద్రత లేకపోవటంతోపాటు, ఆర్థిక స్వాతంత్రంకూడా లేదని అమె శరీరాలమీద, అలోచనల మీద అమెకు హక్కు లేకుండా పోతోందని, స్త్రీల లైంగికతపై ఉన్న పితృస్వామ్య భావ జాలాన్ని ప్రశ్నించే స్త్రీలుగా, 'నీలిమేఘాలు' అనే స్త్రీ వాద కవితా సంపుటిలో వెల్లడైన కవయిత్రుల చైతన్యమే సామాజిక స్త్రీలకు అవసరమైన సాధికార చైతన్యంగా అర్థమవుతుంది. మృణాళిని రాసిన 'స్వర్ణోత్సవసంసారం' అనే కథలో స్వాతంత్ర్య వచ్చిన ఏభైఏళ్ళకుకూడా సంసారంలో స్త్రీలకు తమ భావాలను ప్రకటించుకొనే వ్యక్తిస్వాతంత్ర్యంలేదని తెలిపింది. మాదిరెడ్డి సులోచన రాసిన 'హక్కు' అనే కథలో స్వాతంత్ర్యం వచ్చిన తరువాతకూడా యింటి బాధ్యతను నిర్వహిస్తున్నప్పటికీ, కూతురికి తండ్రి ఆస్తిమీద హక్కులేకుండా చేస్తున్న ఆన్నదమ్ముల దాష్టీకాన్ని బయటపెట్టింది.

కుప్పిలి పద్మ వ్రాసిన 'పొద్దుకెదురు తిరిగిన పువ్వు' కథలో స్వేచ్ఛను అనుభవించాలన్నా, ఇంకొకళ్ల స్వేచ్ఛను కాపాడాలన్నా మనోధైర్యం అవసరమనే చైతన్యాన్ని తెలియజేయటమేకాక, ఆడపిల్లలు రోడ్డుమీద స్వేచ్ఛగా నడిచే స్థితిలో ఉండాల్సిన సామాజిక బాధ్యతకై రావల్సిన జనచైతన్యాన్ని గుర్తుచేస్తుంది ఈ కథ. స్త్రీలకు ఆస్తిహక్కు లభించినప్పుడే స్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యం ఉన్నట్టు భావించాలనీ, అన్ని వర్గాలవారి సమస్యలు తీరేవిధంగా సామాజిక జీవనప్రమాణాలలో భద్రత ఏర్పడినప్పుడే దేశానికి ప్రజాస్వామికమైన స్వాతంత్ర్యం వచ్చినట్లని భావించింది.

స్వాతంత్ర్యానంతరం మిశ్రమఆర్థికవిధానం ప్రవేశపెట్టబడింది. కాని బలహీనమైన ఆర్థికవ్యవస్థలో విద్యావంతులైన స్త్రీలు కుటుంబపోషణకై ఉద్యోగాలు చేయాల్సిరావటంతో స్త్రీలలో ఆర్థికస్వాతంత్ర్యాన్ని పొందాలనే ఆకాంక్ష పెరిగింది. కాని పితృస్వామ్యవ్యవస్థలో స్త్రీలకు

ఆర్థికస్వాతంత్ర్యం ఉండటం కల్ల అని గ్రహించారు. పాటిబండ్ల రజని రాసిన 'జేబు' అనే కథలో మగవాళ్ళకువలె ఆడవాళ్ళకు కూడా జేబు ఉంటేనే ఆర్థికస్వావలంబన ఉంటుందని, అప్పుడే స్త్రీ ఆర్థికస్వేచ్ఛను పొందగలదని భావించటం కనపడుతుంది.

స్వాతంత్ర్యానంతరంకూడా కొనసాగుతున్న అగ్రవర్ణాలవారి అంటరానితనాన్ని గురించిన స్పృహను జాషువా తన 'గబ్బిలం' కావ్యంద్వారా కలిగిస్తే, కొలకులూరి ఇనాక్ తన 'ఊరబావి' అనే నవలికలో అంటరానితనాన్ని ఎదుర్కొనే వ్యక్తిత్వచైతన్యం చిదంబరంయొక్క భార్యపాత్రలో కనపడుతుంది.

మాలతీచందూర్ రాసిన 'హృదయనేత్రి' అనే నవల. స్వాతంత్ర్యానంతరం ఆడపిల్లలో కలగాల్సిన ధైర్యసాహసాల చైతన్యాన్ని తెలియజేయటమేకాక, స్వాతంత్ర్యానంతరం పెరిగిన రాజకీయ అవినీతివల్ల దేశస్వాతంత్ర్యం కొడిగట్టిపోకుండా దేశసంరక్షణకై నడుముకట్టేందుకు, దేశసేవలో యువతులు భాగస్వామ్యమయ్యే వ్యకిత్వ చైతన్యాన్ని కలిగించగలిగింది.

కొండవీటి సత్యవతి వ్రాసిన 'ముందడుగు' అనే కథలో గాయిత్రి మహిళలకు కేటాయించిన గ్రామసర్పంచిగా ఎన్నికగాబడుతుంది. కాని ఆమె భర్త సర్పంచ్ అధికారాలను తానే నిర్వహిస్తూ గ్రామపరిపాలనలో అమెకు చోటులేకుండా చేస్తాడు. అయితే గ్రామీణాధికారిగా వచ్చిన విమల గాయత్రిని మహిళాసమస్యలపట్ల అలోచించేందుకు వీలుగా సర్పంచ్ బాధ్యతలను గాయత్రినే నిర్వహించమని చెప్తుంది. గాయత్రి తన భర్తకు ఇష్టంలేకపోయినా గ్రామవ్యవహారాన్ని తనే చూసుకొనేందుకును తోటిమహిళాసర్పంచులతో మీటింగు పెట్టుకొని స్త్రీలు తమ సామర్థ్యాలను పెంచుకొనే దిశగా సంఘటిత శక్తిగా మారి సర్పంచులుగా పరిపాలించే సాధికార చైతన్యాన్ని స్త్రీలలో కలిగించినది.

మాలతీచందూర్ రాసిన మరొక నవల 'శతాబ్దిసూరీడు' లో పితృస్వామ్య కుటుంబసంస్కృతిని అధిగమించే చైతన్యంతెచ్చుకొన్న కమల స్త్రీలోలుడు వ్యసనపరుడైన భర్తను దూరంపెట్టి ఒంటరిగా తనకాళ్ళమీద తాను ధైర్యంగా నిలబడగల సాధికారచైతన్యాన్ని పొందింది. స్వాతంత్ర్యానంతరం మహిళలు చదువుకొనటం, ప్రజాస్వామ్యపు విలువలను వంటబట్టించుకొనే చైతన్యవంతులు కావటం ఈ నవలలో అర్థమౌతుంది. అంతేకాదు. 21వ శతాబ్దంలోకి అడుగుపెడుతున్న తరుణంలో మహిళలు ఉన్నతచదువులకై ఒంటరిగా విదేశాలకు వెళ్ళగలిగే సాధికారిక చైతన్యాన్ని పుంజుకున్నట్లు ఈ నవల తెలియజేస్తుంది.

4. ప్రపంచీకరణ సందర్భం-తెలుగు సాహిత్యం- స్త్రీలఅస్తిత్వ - సాధికారచైతన్యం

పెట్టుబడిదారీవ్యవస్థ రూపాంతరంచెంది ఆర్థికపెట్టుబడిగా మారి మార్కెట్టుశక్తులుగా స్థిరపడటమే నేడు అమలులో ఉన్న ప్రపంచీకరణ. మారుతున్నవ్యవస్థకు తగ్గట్టుగా స్త్రీల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు ఆటుపోట్లు తప్పవు. వాటిని అధిగమించేందుకై, తగ్గట్టుగానే మహిళలు చైతన్యవంతులు కాక తప్పదు. నేడు స్త్రీలస్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు ఎటువంటి రక్షణ ఉందో తెలుసుకోవాలంటే ప్రపంచీకరణ సందర్భంలో వచ్చిన స్త్రీలసాహిత్యాన్ని పరిశీలించాలి. 'ప్రపంచీకరణం' అనేది ఆధునికమైన ఆలోచన అయినప్పటికీ అందులో భాగమైన పెట్టుబడిదారీ వ్యవస్థ పారిశ్రామిక విప్లవానంతరం నుండి కొనసాగుతున్న విషయమే. ఆర్థికాభివృద్ధిలో భాగంగా మొదలైన దేశీయ మార్కెట్‌కై పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క ఉత్తత్పుల పెంపుదల, అధికమై ఆ ఉత్పత్తుల పంపకానికై అంతర్జాతీయ మార్కెట్లు అవసరమవటంతో ఈ ప్రపంచీకరణ భావన పుట్టుకొచ్చింది. మార్కెట్ల ద్వారా ఆధిపత్యపు ధోరణికి దారులు ఏర్పడటం ఈ ప్రపంచీకరణ ఫలితమే. ఉత్పత్తులు, మానవ వనరులు అన్నీ మరింతగా పరాయీకరణం చెందటమే.

ప్రపంచీకరణలో భాగంగా ప్రైవేటీకరణ ఫలితంగా వచ్చిన ఉద్యోగాలలో స్త్రీ-పురుష సంబంధాలలో వచ్చిన మార్పును గుర్తించటం జరిగింది. అధిక లాభాలు, అధికారం, వస్తు సంస్కృతి, స్త్రీల పై పురుషులకున్న 'లైంగికతా దృష్టి, ఉద్యోగరంగాలలో స్త్రీ – పురుష సంబంధాలు సంక్లిష్టతను పొందటంలో స్త్రీలు అస్తిత్వచైతన్యపు సమస్యలు ఎదుర్కొంటున్నారు. కుటుంబస్త్రీ గానే కాక, ఉద్యోగినిగా స్త్రీ ఎదుర్కొంటున్న 'లైంగిక అణిచివేత వల్ల స్త్రీ పురుష సంబంధాలలోని అమానవీయతను గుర్తించడం జరిగింది, తత్ఫలితంగాస్త్రీలు అస్తిత్వచైతన్యం తెచ్చుకొని ముందుకు సాగే ప్రయత్నంలో కుటుంబ వ్యతిరేక ధోరణి, పెళ్ళి తంతు నిరసన, పునర్వివాహ సంస్కృతి చోటుచేసుకోవటం జరిగింది.

నల్లూరి రుక్మిణి రచనయైన 'మృత్యుస్పర్శ' అనే కథా సంపుటిలోని 'భరించలేని అస్తిత్వం' అనేకథలో ప్రపంచీకరణ వలన మారిన మానవ సంబంధాలలో స్త్రీలు మరింతగా స్వేచ్ఛను కోల్పోయిన విషయాన్ని, ఉద్యోగినిగా ఇంటిపనివల్ల వత్తిడికి గురి అయి అస్తిత్వ సమస్యకు గురి అయినప్పుడు స్త్రీల అస్తిత్వాలను పురుషులు భరించలేరనీ అర్థం చేసుకుంటుంది. స్త్రీల మీద జరిగే అన్ని రకాల

దాడులను ఎదుర్కొనే చైతన్యం మహిళల్లో వస్తేనే మహిళలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకోగలరని అస్తిత్వ చైతన్యాన్ని కలిగించిన కథ.

పిల్లల్ని కనిపెంచే సామాజిక బాధ్యతలో ఉద్యోగిని అయిన స్త్రీకి అదొక పీడనగా మారుతోందవి భావించి భౌతిక స్వేచ్ఛకై ఓల్గా రాసిన 'కేసు' అనే కథలో 'స్త్రీలకు ప్రసూతి శెలవు ఆరు నెలల వరకు ఇవ్వాలనటంతో పాటు 'ఆ తర్వాతి కాలంలో కుటుంబంలో భర్తకూడా పిల్లల్ని పెంచే బాధ్యత వహించటానికి ఆమెకు, అతనికి చెరొక నాలుగు గంటల పనిదినాలు మూడేళ్ల పాటు ఉండాలని కేసు పెడుతుంది. పిల్లల్ని పెంచే పని తను వహించటానికి ఇష్టం లేని ఆమె భర్త, ఆమెను, ఆ 'కేసు' వెనక్కి తీసుకోకపోతే విడాకులు యిస్తానని బెదిరిస్తాడు. అయినా బెదరని అస్తిత్వచైతన్యం ఆమెది. ఓల్గా రాసిన 'ఒక రాజకీయకథ' లో కుటుంబసంబంధాలలో పురుషుడి అంగవైకల్యాన్ని భరించాలిగాని అదే స్త్రీవిషయంలో కలిగితే ఆ స్త్రీకి కుటుంబంలో స్థానం ఉండదనే అస్తిత్వపుస్పృహకలిగిన ఒక స్త్రీ అటువంటి సమస్యలు తోటిస్త్రీలకుకూడా ఉన్నాయని గ్రహించి దానిని సామూహికంగానే ఎదుర్కోవాలనే అస్తిత్వచైతన్యం తెచ్చుకోవటం కనపడుతుంది.

1990 సం. జరిగిన దేశాల ఆర్థిక పునర్వ్యవస్థీకరణ క్రమంలో ఎగుమతి దిగుమతుల విధానంలో వచ్చిన సరళీకరణ, చోటు చేసుకున్న ప్రైవేటీకరణ, ప్రపంచీకరణల ఫలితంగా వాణిజ్యరంగంలో ఉనికిలోకి వచ్చిన గ్యాట్ ఒప్పందం ఉత్పత్తి విధానంలో పెను మార్పులు తీసుకొని వచ్చింది. ప్రపంచీకరణం పరోక్షంగా స్త్రీల స్వేచ్ఛపై బుసలు కొడుతున్న విషయాన్ని కుప్పిలి పద్మ వ్రాసిన 'కుబుసం' కథలో స్త్రీ తన అస్తిత్వం మీద, తన భావస్వేచ్ఛకు అడ్డంవచ్చే పురుషసంస్కృతిని, ప్రపంచీకరణ సంస్కృతిని ఎదుర్కొనే చైతన్యం తెచ్చుకుంటుంది.

కుప్పిలి పద్మ రచించిన 'సాలభంజికలు' అనే కథలో పెట్టుబడులను ఆకర్షించే క్రమంలో ఏర్పడిన పర్యాటకాభివృద్ధిలో భాగంగా కార్పోరేట్ సంస్థల యజమానుల విందువినోదాలకై అందమైన అమ్మాయిలను సాలభంజికలుగా ఏర్పాటుచేయటం జరుగుతుంది. అన్యసంబంధాలతో లైంగికదోపిడికి గురి అయిన స్త్రీలు ఎయిడ్స్ బారిన పడుతుంటే అదే ఉద్యోగము చేస్తున్న మాధవి ఆ ఉద్యోగాన్ని మానివేసి తోటి స్నేహితురాలైన అంజలికి కూడా ఎయిడ్స్ ప్రమాదం గురించి హెచ్చరించిన అస్తిత్వచైతన్యశీలిగా మాధవి పాత్ర అర్థమవుతుంది.

గీతాంజలి రాసిన 'ఊరికి పోదాం భూదేవి' అనే కథలో ప్రపంచీకరణవల్ల ఏర్పడిన మార్కెట్ శక్తుల విపణిలో పెరిగిన వస్తుసంస్కృతి, భార్యాభర్తసంబంధాలను శత్రు సంబంధాలలోకి మార్చటమేగాక, మనసులో అమానవీయ భావాలను పెంచుతోందని అర్థం అవుతుంది. ఒత్తిడిని

తట్టుకోలేక శివానీ తనదికాని తన జీవితం నుండి పారిపోవాలనుకున్నా పోలేని నిస్సహాయతతో, తన శరీరాన్ని కూడా ఒక ఖరీదైన వస్తువుగా భర్త భావిస్తున్నాడని, తన శరీరంలో ఒక్కో భాగాన్ని కోసి వస్తువుగా మార్చి యింటిని అలంకరిస్తున్నాడని అనుకుంటూ తన వెంటబడుతున్న పెద్ద భూతంగా భర్తని భావించుతుంది. అందుకే ఆ వత్తిడి నుండి "స్వేచ్ఛకోసం నిద్రమాత్ర వేసుకొని కలత నిద్దురలో వేధిస్తున్న భర్తను చంపేద్దామనుకొని తన అస్తిత్వాన్ని నిలబెట్టుకోవాలనుకొంటుంది.

2002 సం.లో 'అమెరికా కథలసంపుటి' లో వచ్చిన ఆర్.సీతారామయ్య వ్రాసిన 'సావాసం–సహవాసం' కథలో అమెరికాలో ఉండే కమలా, సుబ్బారావులు స్నేహంతో, ప్రేమతో, గౌరవంతో కూడిన భావైక్యతతో కలిసి జీవించటానికి 'పెళ్ళి' తంతు అవసరం లేదని భావిస్తారు. ఒకరి మీద ఒకరికి బాగా నమ్మకం ఉంటే స్నేహం, ఇష్టం చాలా బలీయంగా ఉంటుందనీ అప్పుడు పెళ్ళి సంబంధమైన లీగాలిటీ అవసరంలేదనీ, ఇష్టం లేనపుడు విడాకుల గొడవలేకుండా విడిపోవచ్చని అనుకోవటంలో ఆమె అస్తిత్వచైతన్యం కనపడుతుంది. గతంలో భర్త అయిన రామారావును వదిలిపెట్టిన తర్వాత కమల అమె ఉద్యోగము చేసుకుంటూ ఉంది. కాని ప్రేమలేని కుటుంబసంబంధాలు ఏర్పరచే పెళ్ళి అనవసరమని, ప్రేమ, గౌరవము అనే భావైక్యతగల సావాసుడైన సుబ్బారావుతో సహవాసం చేస్తూ, సహజీవనంచేయటమే మేలు అని అవసరమైనపుడు విడిపోవచ్చని భావించే అస్తిత్వచైతన్యాన్ని తెచ్చుకోవటంగా అర్థం అవుతుంది.

ప్రపంచీకరణ సందర్భంలో స్త్రీ తన సృజనాత్మక శక్తుల వికాసానికి అడ్డుగా ఉన్న వివాహాన్ని తిరస్కరించి అమెరికా వెళ్ళి నూతన ఆవిష్కరణలు చేసి అణువణువునా అస్తిత్వచైతన్యంగల నందిని అనే మహిళ అక్కిరాజు భట్టిప్రోలు రాసిన 'నందిని' అనే కథలో కనబడుతుంది.

"నందిని" అనే కథలో ఆడపిల్లలు, ఆర్థిక స్వాతంత్రం లేకపోవటం లేదా నిత్యావసరాలు తీరకపోవటం వల్లనే పెళ్ళి తప్ప బతకటానికి మరో ఆధారం లేకనే పెళ్ళితో రాజీపడుతున్నారనీ, పెళ్ళి ఆడవాళ్ళ ఉద్యోగానికి, జీవితానికి అడ్డంకి అని భావించిన నందినికి 'పెళ్ళి' తంతు మరీ అన్యాయంగా అనిపించింది. ఆమెకు పెళ్ళిమీద నమ్మకం లేదు. అది రక్షణ నివ్వటం లేదు కదా ఆడవాళ్ళు అవమాన పడేవిధంగా ఉందని భావించి. ఆడవాళ్ళు చదువు వారి ఆర్థికస్వావలంబనకొరకు కాకుండా పెళ్ళి కోసం చదువుగా సమాజం భావించటాన్ని గుర్తించింది. స్త్రీలయొక్క అస్తిత్వాన్ని గుర్తించని, విలువ నివ్వని వివాహవ్యవస్థ మీద నందినికి నమ్మకం లేదు.

ఈ కథలో కుటుంబ వ్యవస్థ ఏర్పడటానికి పెళ్ళి అనే తంతు, పెళ్ళి వెనుకాల ఉన్న పితృస్వామ్య అధికార సంస్కృతి పట్ల నిరసనను వ్యక్తంచేసి, సమానత్వం గల ప్రజాస్వామిక కుటుంబ వ్యవస్థాపనలో

జీవించాల్సిన చైతన్యాన్ని నందిని తెచ్చుకున్నట్లు అర్థమౌతుంది. అప్పుడే తన అస్తిత్వానికి విలువ ఉంటుందని భావిస్తుంది. తల్లిదండ్రులకు పెళ్ళిచేసుకోనని ఖరాఖండిగా చెప్పి అమెరికా వెళ్ళి పరిశోధనలు చేస్తుంది. ఆ క్రమంలో వివాహం చేసుకుంటే విడాకుల ఖర్చు తప్ప మరేమీ వుండదని గ్రహించిన నందిని వివాహపు తంతు లేకుండానే తనకు బాగా నమ్మకం ఏర్పడిన వ్యక్తితోనే సహజీవనం చేయాలనుకుంటుంది. నందిని తనకు వీలైన సమయంలో గర్భాన్ని ధరించి పిల్లవాణ్ణి కని తన జీవితం మీద తన ఆలోచనల మీద తనకే హక్కు ఉండాలన్న పరిపూర్ణ స్వతంత్ర అస్తిత్వచైతన్యానికి నమూనాగా నిల్చినది నందిని పాత్ర. నేటికీ 'స్టాట్యూ అఫ్ లిబర్టీ' కి సాహిత్య ప్రతీకగా ఈ నందిని కనబడుతుంది.

మహిళాభివృద్ధి మహిళాస్వేచ్ఛకు మార్గాన్ని ఏర్పరుస్తుంది. మహిళా సాధికారికత మహిళాభివృద్ధికి కారకమౌతుంది. నిర్ణయాత్మకశక్తితో మహిళాసాధికారికత ఏర్పడాలంటే మహిళలయొక్క సామర్థ్యాలవృద్ధి జరగాలి. అదే అస్తిత్వచైతన్యానికి ప్రతీక అవుతుంది. ఈ విషయాన్ని ప్రతిఫలిస్తూ వచ్చిన కథ కుప్పిలి పద్మ వ్రాసిన 'ఆకాంక్ష' అనే కథ. కంప్యూటర్ నైపుణ్యం, సంభాషణాచాతుర్యంతో ఎదుటి వారిని ఒప్పించ గల సామర్థ్యంగల ఆకాంక్ష అనే అమ్మాయి ఒక మార్కెటింగ్ సంస్థలో డి.జి.యం. క్రింద పనిచేస్తూనే, ఆ అధికారియొక్క స్వార్థపూరిత కుట్రనుండి తెలివిగా తప్పించుకొని తనసామర్థ్యంతో జి.యమ్.గా నియమింపబడటంతో ఆకాంక్ష ఉన్నత పదవిని చేరుకో కలుగుతుంది.

కథలో ఆకాంక్ష తనకున్న యాజమాన్య నిర్వహణ నైపుణ్యాన్ని వ్యక్తం చేసుకోవటానికి సెమినార్ హాలులో గుర్తింపు పొందటానికి అడ్డుగా ఉన్న పురుషాధికారి కుట్రను ఎదుర్కొని కంపెనీలో ఉన్నత పదవిని పొందుతుంది. ఆకాంక్ష ఆధునిక వ్యవస్థలో ఉద్యోగాలలోని 'గ్లాస్ సీలింగ్' ప్రభావాన్ని బద్దలుకొట్టి ఉన్నత యాజమాన్య పదవిని పొందిన అస్తిత్వచైతన్యశీలిగా కనబడుతుంది.

కుప్పిలి పద్మ వ్రాసిన 'సర్వస్వము' అనే కథలో గగన్ అనే పాత్ర అమె సర్వస్వమును దోచుకున్న మురళివంటి వారికి సంస్థలలోని తోటిమహిళలను గౌరవించేవిధముగా జండర్ సెన్సిటివిటిని కలిగించే శిక్షణ ఇవ్వాలనుకోవటమే స్త్రీల అస్తిత్వ సమస్యలకు అసలుసిసలైన పరిష్కారముగా భావించటమనేది ఒక గొప్ప సామాజిక పరిణామానికి దారితీసే చైతన్యంగా అర్థమవుతుంది.

ఆధునికానంతర కాలంలో అన్నికులాల, వర్గాల స్త్రీలలో అస్తిత్వచైతన్యం వేళ్ళూనుకుంటున్న తరుణంలో దళితస్త్రీలలోని చైతన్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. భారత రాజ్యాంగం

పంచాయితీరాజ్యవ్యవస్థలో దళిత మహిళలకు ప్రత్యేక స్థానాలను కేటాయించినా రోజువారి కూలిపనిచేసుకొని బతికే దళితమహిళలకు రాజరికం యిచ్చినా ఏమి చేయగలుగుతారనే దానిని ఎదుర్కొనే చైతన్యంతో జూపాక సుభద్ర రాసిన 'రాణిత్కరం' అనే కథలో సర్పంచియైన స్త్రీ తమ బతుకుకోసం చేసుకొనే కూలిపని రాణిత్కరం తరువాతనే అనిచెప్పి ప్రజాపాలనపట్ల దళితస్త్రీలకు ఉండే అస్తిత్వచైతన్యాన్ని తెలియజేసింది.

జాజుల గౌరి రాసిన 'హొయినం' అనే కథలో భర్త మరణానంతరం నీలమ్మ తమ ఆస్తిని పెత్తందారితనంతో కాజెయ్యాలనుకున్నవారి కుట్రను సాగనీయకుండాచేసి తనే వ్యవసాయాన్ని చేసుకొని పిల్లలను పోషించుకునే అస్తిత్వచైతన్యాన్ని తెచ్చుకోవటం దళితస్త్రీలందరూ ప్రభావితులయ్యే విషయంగా భావించాలి.

జూపాక సుభద్ర రాసిన 'యేకులుమేకులై' అనే కథలో దళితస్త్రీలు తెచ్చుకొన్న రాజకీయ–సాధికారికచైతన్యం పెత్తందారీవ్యవస్థకు చెంపపెట్టుగా మారటం, దానిని జీర్ణించుకోలేని స్థితి స్పష్టమౌతుంది.

స్వాతంత్ర్యానంతరం స్త్రీల అస్తిత్వపు విలువలను, స్త్రీలహక్కుల గురించి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకున్న విలువలను పట్టించుకోకపోవటమేకాక, ప్రపంచీకరణ సందర్భంలో స్త్రీల ఆలోచనలు తిరోగమనంవైపు మళ్ళుతున్న విషయం పి.సత్యవతి రాసిన 'మంత్రనగరి' అనే కథలో అర్థమౌతుంది. ఇది నాల్గుతరాల స్త్రీల కథ. కుటుంబంలో సంతానాన్ని కనే యంత్రస్థాయిలో ఉన్న దమయంతి తన కూతురు కృష్ణవేణిని చదివిస్తుంది. ఆమెలో అస్తిత్వచైతన్యం కలిగిస్తే, ఆమె కూతురైన ఝాన్సీ తన శరీరం మీద, ఆలోచనల మీద తనకే హక్కులుండాలంటూ స్త్రీల భౌతిక, బౌద్ధిక స్వేచ్ఛకై ఉద్యమాలు చేస్తుంది. కాని, ఝాన్సీ కూతురు గీత మాత్రం ప్రపంచీకరణలో మార్కెట్ శక్తుల ప్రతినిధిగా వచ్చిన మాంత్రికుడు చెప్పినట్లుగా స్త్రీకి సౌందర్యం ముఖ్యమనీ, మొగుడి మాటకు ఎదురు చెప్పకుండా ఉండాలనే ప్రబోధానికి ప్రభావితురాలై అలా ఉండాలని అనుకుంటుంది. అనగా ప్రపంచీకరణ సంస్కృతి స్త్రీల స్వేచ్ఛకు అడ్డుకట్ట వేస్తూ స్త్రీల అస్తిత్వచైతన్యాన్ని నిర్వీర్యం చేయటానికి కంకణం కట్టుకుందని అర్థం అవుతుంది. ఇలాంటి విషయాన్నే వివిన మూర్తి రాసిన 'ఎవరి సంకెళ్లు వాళ్లవే' అనే కథ అద్దం పడుతోంది.

ఓల్గా రచించిన 'విముక్త' అనే కథాసంపుటిలో రచయిత్రి పురాణపాత్రలపరంగా ఏ మహిళకూడా పితృస్వామ్య నిర్దేశించిన సంస్కృతికి బలికావాల్సిన అవసరం లేదని, ఒకరి అధికారంకింద పడి ఉండాల్సిన అవసరం లేదని తెలియజేయటం జరిగింది. అందుకే ఎవరి అస్తిత్వ చైతన్యాలు వారివే అనే భావన వ్యక్తమౌతుంది.

సాహితి రచించిన 'లివింగ్ టుగెదర్' అనే కథలో మాజీ ప్రియురాలైన ప్రసన్నను తెచ్చి నిశాంత్ ఇంటిలో పెట్టుకోవటం చేత నిశాంత్ యొక్క భార్య అయిన మహతి పిల్లలతోసహా

కుటుంబానికి దూరముగా లండన్‌లో ఉద్యోగం చేసుకుంటూ ఉంటుంది. ఆ క్రమంలో తనను, తన పిల్లలను గౌరవముగా చూసే అండర్సన్ అనే వ్యక్తిని పెళ్ళి చేసుకొని స్థిరపడి స్వతంత్ర అస్తిత్వ చైతన్యంతో బ్రతుకుతుంది.

కె.యన్. మల్లీశ్వరి వ్రాసిన శతపత్ర సుందరి కథలోనూ, నీల అనే నవలలోనూ నీల పాత్ర సహజీవనమనే చైతన్యాన్ని పుణికిపుచ్చుకున్న పాత్ర. శతపత్ర సుందరి కథలో శతవిధాలుగా తమ వ్యక్తిత్వవికాసం చేసుకోవాలనే ఆకాంక్ష గల నీల తనతో సహజీవనంలో ఉంటున్న సదాశివలో మిగిలి ఉన్న పితృస్వామ్య సంస్కృతిని ఎదుర్కొనే అస్తిత్వచైతన్యం కనబడుతుంది. కాని ఆమె రాసిన 'నీల' నవలలో పెళ్ళితో ఏర్పడిన భర్తృ సంబంధాన్ని వదిలించుకొన్న నీల ఏకకాల, ఏకనిష్ఠ స్త్రీ–పురుష సంబంధాలు గల సహజీవన సంస్కృతిలో జీవించటం కనబడుతుంది. ఆమె కూతురు మినో కూడా నేటి యువతకు ప్రాతినిథ్యం వహించి సామాజిక అవసరాలకు కృషిచేయాలని అనుకొంటూ తనతోపాటు స్నేహితుడైన షాలెంతో సహజీన సంబంధాలలో ఉండటమనేది అస్తిత్వచైతన్యపు కొనసాగింపుగా అర్థం అవుతుంది.

2023 లో కత్తి పద్మ రాసిన పులస అనే కథలో వ్యవసాయంలో గ్రామీణ స్త్రీల శ్రమ నిష్ఫలమై దానిమీద వారసత్వపు హక్కులేకుండా చేసిన తరతరాల పితృస్వామ్యసంస్కృతికి ఎదురీదే చైతన్యాన్ని తెచ్చుకొని తన తండ్రి భూమిమీద హక్కును పొందింది. పెళ్ళయినతరువాత భర్తవ్యసన పరుడైతే తానే ఆతని భూమిని సాగుచేసింది. మళ్ళీ కొడుకు 2005లో ఆస్తిహక్కులవిషయమై వచ్చిన భూసవరణచట్టాల్ని అటు ప్రభుత్వం, ఇటు కొడుకు పట్టించుకోకుండా లంచమిచ్చి తనపేరుమీద పట్టాపాసుబుక్కులను పొంది సగం పొలాన్ని అమ్మాడు. అప్పుడు భూమిపై తనకుగాని, తన కూతుర్లకుగాని హక్కులేకుండా చేస్తూ పితృస్వామ్య రాజ్యసంస్కృతిని కొనసాగిస్తున్న ప్రభుత్వాన్ని, కొడుకు వారసత్వపు హక్కును ప్రశ్నించే చైతన్యాన్ని ప్రదర్శించటం భావితరాల స్త్రీల భూభాగస్వామ్యానికి బంగారుబాటలు వేయటమే.

మార్కెట్ శక్తుల ప్రకటనలో స్త్రీలను సౌందర్య ఉత్పత్తి వస్తువులుగా చేసి స్త్రీలను తక్కువ చేయటాన్ని నిరసించే అస్తిత్వ చైతన్యం చాలా అవసరం. ఆర్థిక శక్తులుగా స్త్రీలను చైతన్యవంతులుగా చేస్తూ ఆర్థికాభివృద్ధికి అవసరమైన ఉత్పత్తి, సేవల రంగాలలో స్త్రీ భాగస్వామ్యాన్ని కోరుకుంటూ స్త్రీలు అర్థికస్వావలంబనులుగా తయారుకాగల అస్తిత్వచైతన్యాన్ని పత్రికారంగం కలుగజేస్తోంది.

సామాజిక చరిత్రలోని స్త్రీలు పితృస్వామ్య సంస్కృతిని ఎదుర్కొనే క్రమంలో సమాజంలోని తమ వ్యక్తిత్వాలకు, అస్తిత్వాలకు విలువలు సంతరింపచేసుకోవాలనుకొన్న ధ్యేయాన్ని తెలుగుసాహిత్య చరిత్రలోని స్త్రీ పాత్రల చైతన్య పరిణామశీలత నేటి మహిళలకు దిశా నిర్దేశం చేయగల చైతన్యాన్ని అందించగలుగుతుందనే విషయంలో అతశయోక్తి లేదు.

ఆధునిక కాలంలో భూస్వామ్య వ్యవస్థలో రైతుకూలీలు శ్రమ దోపిడీకి గురి అవుతుంటే వాళ్ళు బతకలేక ఆత్మహత్యల దారిని వెతుక్కుంటున్నారు. అలాంటప్పుడు రైతాంగపోరాటం అనివార్యమవుతుంది. కాని రైతుల పోరాటాలకు మద్ధతు ఉన్నప్పుడే ఆ పోరాటాల ఫలితాలను వాళ్ళు అందుకోగలుగుతారు. ఆ విధంగా రైతులకు అండగా నిలబడినది కమ్యూనిష్టుల విప్లవోద్యమం. ఉద్యమంలో సాయుధపోరాటం చేస్తూ చివరివరకు నిలబడి జీవితాలను పణంగా పెట్టిన స్త్రీమూర్తుల చైతన్యానికి అక్షరవిలువలను సంతరింపజేస్తూ 2019 లో నల్లూరి రుక్మిణి రాసిన నవల 'మేరువు'. రచయితకు పరిచయమైన అనసూయ కమ్యూనిస్టు ప్రజా రాజకీయ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న వ్యక్తి. ఆమె విప్లవోద్యమంలో సాగించిన రైతాంగపోరాటాలు, భూస్వామ్యవ్యవస్థలోని పితృస్వామ్య భావజాలానికి ఎదురొడ్డి నిలిచిన తీరుకు వాస్తవ రూపకల్పన నవలలోని సావిత్రమ్మ పాత్ర. కమ్యూనిష్టుపార్టీ రైతాంగ పోరాటంలో దళసభ్యురాలిగా భూమికొరకు, భుక్తికొరకు, దేశంకొరకు పోరాడే విప్లవ చైతన్యమూర్తి చిత్రణ పాఠకులలో తదనుగుణ చైతన్యాన్ని రగిలించేవిధంగా రచించిన నవల 'మేరువు'. అలాగా తెలంగాణా రచయిత్రులు వ్యవస్థలోని దోపిడీకి వ్యతిరేకంగా విప్లవసాహిత్యాన్ని రాసారు. సింగరేణిబొగ్గుగనులలో కార్మికులు పోరాటంచేయటం మామూలే. కాని పారిశ్రామిక సత్సంబంధాలకై అమలుపరచాల్సిన సంక్షేమకార్యక్రమాలు సజావుగా జరగనప్పుడు పరోక్షపారిశ్రామిక సంబంధాలలో ఉండే కార్మికకుటుంబస్త్రీలుకూడా పోరాటాలు చెయ్యాల్సివచ్చింది. కార్మికకుటుంబాలకు నివాసయోగ్యమైన పరిస్థితులుంటే అతడు ఉత్పత్తిని సక్రమంగా చేయగలడు. కాని నీళ్ళసరఫరా విషయంలో అధికారులకు, కార్మికులకు మధ్యన వివక్ష స్పష్టమవుతుంటే ఇళ్ళదగ్గర కార్మిక కుటుంబస్త్రీలుకూడా పోరాటాలు చేసినట్లుగా తుమ్మేటి రఘోత్తమ రెడ్డి రాసిన 'నీళ్ళతగవు' అనే సింగరేణి బొగ్గు గనులకు సంబంధించిన కథలో స్పష్టమవుతుంది.

స్త్రీవాద కవితలలో భాగంగా నేను లొంగుబాటు సంగీతాన్ని కాదు అంటూ సుధ రాసిన 'లొంగుబాటు సంగీతాన్ని కాదు' అనే కవితలో సహచరిగా తిరుగుబాటు సంగీతాన్ని వినిపిస్తానంటుంది. 'ఆకాశంలో సగభాగాన్ని మోస్తాను, సర్వజగతిని అక్కున చేరుస్తాను, నా మూలాల్ని బలహీనంగా భావించవద్దు, నా విముక్తి నినాదాన్ని ఆచరిస్తే పోయేది నీ ఆధిపత్యమే, దొరికేది అమూల్యమైన సాహచర్యం' అనే విప్లవ సంగీతాన్ని వినిపించింది. ఓల్గా రాసిన 'ఆకాశంలో సగం' అనే నవలలో స్త్రీలు పోరాటంచేసి పంచాయితీలోని రాజకీయ వ్యవస్థను ఎదుర్కొని స్త్రీలు సంఘటితశక్తిగా తయారయి తమ జీవనసౌకర్యం, భద్రతకు అవసరమైన మరుగుదొడ్లను తామే నిర్మించుకోవటం విప్లవ చైతన్యమే. ఈమే రాసిన 'విముక్త' కథాసంపుటిలో కూడా ఒకరిమీద

ఒకరికి అధికారం ఉండకూడదనే వ్యక్తిత్వ చైతన్య భావన పురాణపాత్రలద్వారా చెప్పాలనుకోవటం విప్లవ పంథాయే. 2000లో వచ్చిన ఓల్గా రాసిన 'ప్రయోగం' అనే కథలో ఒకస్త్రీ పాత్ర పురుషుడి అధికారవ్యవస్థగా ఉండే కుటుంబానికై పెళ్ళిపేరుతో తన వ్యక్తిత్వాన్ని బలిపెట్టదలచుకోలేదనీ, కలుసుకోవాలనుకొన్నప్పుడు ఇద్దరిలో ఎవరింటిలోనైనా కలుసుకొనేవిధమైన స్నేహసంబంధాలుగల స్త్రీపురుషసంబంధాలు మాత్రమే ఉండాలనుకోవటం పురుషాధిక్యకుటుంబనిర్మాణాన్ని నిరసించే విప్లవధోరణియే. స్త్రీలస్వేచ్ఛను హరిస్తూ స్త్రీలకు పీడనగా ఉన్న విషయాలపట్ల తెచ్చుకోవాల్సిన విప్లవధోరణికి నమూనాగా ఆమె రాసినదే 'కేసు' అనే కథ. అదే విధంగా వృద్ధాప్యంలో స్త్రీపురుషసంబంధాలలో అవసరమైన 'తోడు' అనే కథ రచయిత్రి రాసేటప్పటికి విప్లవభావనయే కాని అది సమాజంలో ఆచరణకు దారిచూపిందనేది కాదనలేని వాస్తవం.

స్త్రీవాదం పుంజుకున్నతరువాత ముస్లిమ్ మహిళల్లోకూడా చైతన్యం వచ్చింది. మైనారిటీవాద సాహిత్యంలో భాగంగా వచ్చిందే షహనాజా రాసిన 'బురఖా' అనే కవిత. పంజరంలాంటి బురఖాను నిరసిస్తూ రాసిన మతసాంప్రదాయాలపై రాసిన విప్లవ కవిత అది. ఆమె రాసిన 'స్వయంకృతం' అనే కథలో పురుషాంహకారాన్ని నిరసిస్తూ స్వతంత్రంగా జీవించాలనుకొన్న ముస్లిమ్ మహిళ చైతన్యచిత్రణ అలాంటిదే. ముస్లిమ్ మతంలో స్త్రీలను పీడనకు గురిచేస్తున్న మతసంప్రదాయాల ఉనికిని తెలియచేస్తూనే వాటిపట్ల స్త్రీలు తెచ్చుకోవాల్సిన చైతన్యాన్ని కలిగించేవి షేక్ హుస్సేన్ సత్యాగ్ని రాసిన కథలు. ముస్లిమ్ మహిళలపాలిటి సంకెళ్ళవంటిది 'తలాక్'. మగపిల్లవాడ్ని కననందుకు 'యంత్రం' అనే కథలో భర్త తలాక్ చెప్పటం అన్యాయమని, భార్యాభర్తలు ఇరువురు కలిసి ఉండి జీవించలేని పరిస్థితులలో మాత్రమే ఇరువురి అంగీకారంతో విడాకులు ఉండాలని రచయిత మతవిశ్వాసాలలోని మౌఢ్యానికి విరుగుడుగా కథలు రాయటం ముస్లిమ్ మహిళలల్లో చైతన్యాన్ని కలిగించిన కథలే. ఇంకాస్త విప్లవధోరణిలో 'ఖులా' అనే కథలో ఒక భార్య తన శీలాన్ని అనుమానిస్తూ తలాక్ చెప్పిన భర్తను కోర్టులో నిలబెట్టి, అటువంటి అతనితో తాను కలిసి ఉండలేనని అంటూ తానే 'ఖులా' (స్త్రీలు ఇచ్చే విడాకులు) ఇస్తానని చెప్పినకథ. ఇటువంటి కథలు ముస్లిమ్ స్త్రీల స్వేచ్ఛను హరించే మతసాంప్రదాయాలపాలిటి తెచ్చుకోవలసిన విప్లవచైతన్యాన్ని సూచిస్తాయి. రచయితలు ముస్లిములు అయినప్పటికీ మతంపేరిట స్త్రీలకు కల్పించిన ఆచారాలను నిరసించటం విప్లవ చైతన్యమే.

ఆదివాసి స్త్రీలు చదువుకున్నందుకు వారిలో తమ సాంస్కృతిక జీవనవిధానంపట్ల చైతన్యం వెల్లివిరిసింది. తమ కోయలు పాటించే మతసాంప్రదాయాలపై అన్యమతస్థులదాడిని నిరసిస్తూ

పద్దం అనసూయ అనే ఆదివాసి మహిళ 2009లోనే 'మూగబోయిన శబ్దం' అనే కథ రాసింది. అంతే 2019 లో 'చప్పుడు' అనే కథాసంపుటిలో నాలుగు కథలను ప్రచురించింది. ఈమె ప్రథమ ఆదివాసి కథారచయిత్రిగా కొనియాడబడుతోంది. ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తున్నది ఆదివాసీ స్త్రీలసాహిత్యం. అడవిలో నివసించే ఆదివాసిల జీవనవిధానాన్ని వర్ణిస్తూ 2025 లో కుంజా కల్యాణి రాసినది 'కంపపొద' అనే కవితా సంపుటి. దానిలో కవయిత్రి స్వయంచోదిత చైతన్యశీలియైన ప్రథమ ఆదివాసికవయిత్రిగా చెప్పుకోబడింది. నిత్యం పులిసంచారాలుండే అడవిలో జీవిస్తుండే కవయిత్రి సెజ్‌లకోసం టైగర్ ఏరియాగా నిర్ణయించిన అధికారవ్యవస్థను నిరసించే విప్లవచైతన్యం 'యుద్ధం' అనే కవితలో అర్థమౌతుంది.. "రాజకీయ రంగులు పూసుకొని కొన్ని గుంటనక్కలు ఊలలచేస్తున్నాయ్ అడవి మీదికాదనీ బడితెలే కొన్నిసార్లు బరిసెలైతాయ్ జరంత భద్రం.. యుద్ధం మేమెరిగిన విద్య కదా ! అడవిమీద హక్కులేదను పిడివాదానికి అనే హక్కు యాంచొచ్చింది." అనే హెచ్చరిక చేసింది. "పచ్చులు" అనే కవితలో వ్యయప్రయాసాలు మరచీ సాహితీముచ్చటలో మునిగితేలీ రేపొద్దున జ్ఞాపకాల్నారబెట్టుకన్నాయి అనుభూతుల్ని మదిసంచి నిండా నింపుకున్నాయి, సాహితీ ఆలింగనాలను పుచ్చుకొన్న అక్షరాలు". ఈ కవితలో అడవిలో స్వేచ్ఛను అనుభవించే పక్షులు సాహితీమచ్చట్లు పెట్టుకోవటం మదిసంచినిండా అనుభూతుల్ని నింపుకుంటూ ఆలింగనాలు చేసుకుంటున్న అక్షరసాహితులు అనటం అక్షరలక్షలు చేసే కవితానుభూతి కదా. అంతేకాదు అడవిలో మహిళలపై మనుషుల ముసుగులో అత్యాచారాలు చేసే మదమృగాలపాలిటి 'వేటబాణం నేన్నవుతా' అనే చైతన్యశీలి ఆదివాసి స్త్రీ. దీనికి స్ఫురణగా నస్రీన్ ఖాన్ రచించిన 'కొత్తపొద్దు' కథలో ప్రాజెక్టునిర్వాసితుల హక్కులకై పోరాడే తండావాసులలోని గిరిజన మహిళ అడవిలోకి తరిమి సాగుచేయించటమేకాదు ఆ భూములమీద పట్టాల హక్కులను నిర్ణయించనిదే ఊరుకునేది లేదని తోటివారిని కూడబెట్టుకొని తాలుకా ఆఫీసును ముట్టడించాలనుకోవటం గిరిజన చైతన్యమే.

2023 లో ఓల్గా రాసిన 'పంపాతీరం' అనే నవలలో రామాయణంలో ఆదివాసి స్త్రీగా చెప్పబడే శబరి ఆటవికులను నాగరికులుగా చేస్తామంటూ రాజ్యకాంక్షతో వారిపై ఆధిపత్యాన్ని కోరుకున్న వ్యవస్థను ప్రశ్నకు పెట్టింది. ప్రకృతిని బాధ్యతతో కాపాడుకుంటూ ప్రకృతిలో స్వేచ్ఛగా సహజీవనం చేయగల జ్ఞానమే మానవత్వపు నాగరికత అని రాముడికి చెప్పటం ఆదివాసి స్త్రీల చైతన్యానికి నిదర్శనం. పర్యావరణాన్ని కాపాడే బాధ్యతయే నాగరికత అనే జ్ఞానాన్ని ఒక పురాణపాత్రయైన ఆటవిక ఆదివాని స్త్రీయైన శబరిభక్తిలో జొప్పించి సామ్రాజ్యకాంక్షలో భాగమైన ఆధిపత్య భావనయే పర్యావరణానికి ముప్పుకలిగిస్తోందనే చైతన్యాన్ని కలిగించే అవసరమైన రచన ఇది.

5. స్త్రీపురుషసంబంధాలు-లైంగికత్వం-స్త్రీలచైతన్యం

నేడు సమాజంలో వేగంగా మారుతున్న స్త్రీపురుషసంబంధాలలోని లైంగికత్వం గురించి అర్థం చేసుకోవాలంటే కాలక్రమంగా వచ్చిన సాహిత్య పఠనం అవసరం. చారిత్రక సామాజిక నాగరికతలో భాగంగానే స్త్రీపురుషసంబంధాల ప్రాతిపదికగానే సామాజిక కుటుంబాలు ఏర్పడ్డాయి. సంపదల అభివృద్ధి, ఆధిపత్యాలను ఏర్పరచుకొనేక్రమంలోను, వాటి రక్షణకై లైంగికసంబంధాలలో ఖచ్చితమైన పురుషవారసుల కోసం స్త్రీలపాతివ్రత్యం ముఖ్యంగా స్త్రీపురుషసంబంధాల నిలయంగా పెళ్ళితంతుతో కుటుంబం ఏర్పడింది. అందుకే నాటి నుంచి నేటి వరకు స్త్రీపురుష సంబంధాలలో ఆర్థిక-రాజకీయ లైంగికత్వం ప్రధానమైన విషయంగా మారింది. సంతానోత్పత్తి పరంగా స్త్రీలకు మాతృత్వపు అనుభూతి, పురుషపరంగా శారీరక అనుభూతిపరంగా స్త్రీపురుష లైంగిక సంబంధాలు కుటుంబ నాగరికతలో చోటుచేసుకొన్నాయి. ఆర్థిక-రాజకీయ విషయాలప్రభావిత లైంగిక సంబంధాలకోసం అసమనైతికతతో కుటుంబ సంస్కృతియే విస్తరించి పితృస్వామ్య రాజ్యసంస్కృతిగా స్థిరపడింది. అందువల్లనే స్త్రీపురుష సంబంధాలలో లైంగికత్వం, ఆర్థికం, రాజకీయం పరస్పర ఆశ్రితాలు అని తెలుగులో ఫెమినిస్టు సిద్ధాంతకర్త ఓల్గా నిర్ధారించటం జరిగింది. పెళ్ళితంతుగల పితృస్వామ్య కుటుంబాలలో స్త్రీలను మానసిక, శారీరక అణచివేతలకు గురిచేస్తున్న ప్రేమరహిత లైంగిక సంబంధాలను విశ్లేషించాలి.

నేటి ప్రపంచీకరణ సందర్భంలో అందునా గతపాతికేళ్ళుగా ఈ లైంగికత్వం పెను సవాళ్ళను ఎదుర్కొంటోంది. ప్రపంచీకరణం అంటేనే స్వేచ్ఛా మార్కెట్ శక్తుల ఆధిపత్యం. వాణిజ్యంలో -వాడుకో-విసిరేయ్- అనే ప్రచారభావనలే లాభార్జనకు సోపానాలు. ఇటువంటి ఆర్థిక-రాజకీయాల వాణిజ్యసంస్కృతి ప్రభావం లైంగికత్వంపై కూడా ఉంటుంది. లైంగికత్వంకూడా వ్యాపారధోరణిని పుంజుకుంటుంది. లైంగికత్వంలో ఆధిపత్యంతో మిళితమైన శారీరకభోగానుభూతిని పురుషుడు కోరుకుంటే, స్త్రీ కోరుకునేది ప్రేమసంబంధాలు గల మానసిక లైంగికానుభూతి. ఈ రెండు పరస్పరం భిన్న ధోరణులు. ఇదే ప్రస్తుత సమాజంలోని లైంగిక సంబంధాలలోని అలజడులకు, సామాజిక రుగ్మతలకు ప్రేరకాంశాలు కాగలిగాయి. అటు వివాహం, ఇటు సహజీవనం కాని లేదా

వివేహేతర సంబంధాలలో కాని మౌలికమైన మనస్సును పట్టించుకోగలిగితేనే ఏ లైంగిక సంబంధాలైనా మానవ సంబంధాల మనుగడలోని సామాజిక జీవన భద్రతను కలిగి ఉంటాయనే సత్యావిష్కరణను ప్రతిఫలించిన సాహిత్యాన్ని పర్యాలోచించాలి.

సమాజంలో స్త్రీపురుషసంబంధాలు ప్రధానంగా మూడురకాలుగా ఉన్నాయి. 1) వివాహసంబంధాలు- విడిపోవటాలు 2) సహజీవనసంబంధాలు, 3) వివాహేతరసంబంధాలు. సాహిత్యంలో సామాజిక ప్రతిఫలనం సృజనకారుల చైతన్యస్థాయినిబట్టి ఉంటుంది. సామాజిక, ఆర్థిక-రాజకీయ పరిణామాల ప్రభావంతో స్త్రీపురుష సంబందాలలోని లైంగికత్వం రూపాంతరం చెందటానికి గల ప్రేరకాంశాలు తెలుగు సాహిత్యంలో ప్రతిఫలించిన తీరును విశ్లేషణ, విమర్శనాత్మకంగా పరిశీలించినప్పుడు లైంగికత్వ భావనయొక్క స్వభావాన్ని అర్థం చేసుకొనవచ్చు.

1. వివాహసంబంధాలు-విడిపోవటాలు : సంపదల సృష్టి, వాటి రక్షణకై లైంగికసంబంధాల నియంత్రణలో భాగంగా వివాహపుతంతు ప్రధానంగా ఏర్పడిన కుటుంబంలో నియంత్రణ స్త్రీలపరంగా పరిమితమయ్యాయి. సామాజిక పరిణామాలలో భాగంగా సంపదలపై స్వామ్యం పురుషాధిక్యతను సంతరించుకోవటంతో అసమనైతిక లైంగికసంబంధాలుగా వివాహసంబంధాలు పరిణామం చెందటం చారిత్రక సత్యం. ఆదిమ సమాజపు వాసనలు వదలని పురుషులయొక్క లైంగికస్వేచ్ఛ ఫలితంగా కుటుంబం బీటలు వారటం ప్రారంభమైంది. పురుషపరమైన కామవాంఛలు శరీరానికి సంబంధించినవిగా చెలామణి అవుతూ, స్త్రీ పరంగా మాత్రం మనసా, వాచా, కర్మణా నియంత్రిత లైంగిక సంబంధాలుగా వివాహ సంబంధాలు అభివృద్ధి చెందాయి. కుటుంబ చట్రంలోని స్త్రీపురుష లైంగిక సంబంధాలలో అసమతుల్యత దానంతట అదే చోటుచేసుకుంది. ఇది భూస్వామ్య కుటుంబసంస్కృతి. సామాజిక ఆర్థిక-రాజకీయ చలనసూత్రాల పరిణామంలో ప్రజాస్వామ్యం ఏర్పడి స్వేచ్ఛాగాలులు వీచినా, చాపకింద నీరు లాంటి పితృస్వామ్య సంస్కృతి కుటుంబాలలో కొనసాగటంవల్ల పురుషపరమైన లైంగిక సంబంధాలు యధావిధిగానే కొనసాగుతున్నాయి. ఆధునిక ప్రజాస్వామ్య ఆలోచనల పరిణామంతో స్త్రీలు తమస్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఆలోచించటం మొదలు పెట్టినప్పటి నుండి స్త్రీపురుష లైంగిక సంబంధాలు అలజడులను సృష్టించాయి. కుటుంబ సంబంధాలలోని అసమానత్వాన్ని ప్రశ్నించటం మొదలైంది. దానికి సమాధానంగా పితృస్వామ్యపు అణచివేత అధికమైంది. కుటుంబ సంబంధాలలో స్త్రీస్వేచ్ఛ, పితృస్వామ్యపు అణచివేతలకు సంఘర్షణ మొదలైంది. స్త్రీపురుష లైంగిక సంబంధాల నిలయంగా ఏర్పడిన కుటుంబ సంస్కృతి పెనుసవాళ్ళను ఎదుర్కోవలసిన అవసరం ఏర్పడింది. అందుకనే పురుష ప్రయోజనాలకు అనువైన లైంగిక

సంబంధాలు, కుటుంబ మహిళలు కోరుకున్న నైతిక శారీరక, మానసిక సంబంధాల విషయంలోని అసమానత్వం ప్రశ్నకు దారితీయటంతో ప్రజాస్వామ్యం విడాకుల చట్టాలను రూపొందించే స్థితి ఏర్పడింది. అయినా స్త్రీపురుషసంబంధాలకు ఆటుపోట్లు కలుగుతూనే ఉన్నాయి. ఆ క్రమంలోనే కుటుంబసంబంధాలలో స్త్రీ స్వేచ్ఛ, వ్యక్తిత్వాలు అణచివేతకు గురైనప్పుడల్లా ప్రేమరాహిత్య కుటుంబ సంబంధాలను వదిలివెళ్ళాలనుకొనే సంస్కృతి పెరగటంతో నేడు కుటుంబాలు విడిపోతున్నాయి

2. సహజీవనసంస్కృతి

ఆధునిక ప్రజాస్వామ్యంలో కూడా తమను మాతృత్వానికి, పాతివ్రత్యానికే పరిమితంచేస్తూ పోషింపబడే స్థితిలోకి నెట్టబడ్డారనే స్పృహ కలిగిన స్త్రీలలో, ఆర్థిక-రాజకీయాలు పునాదులుగా ఏర్పడిన కుటుంబంలో ముందుగా స్త్రీలు తమ ఆర్థిక స్వావలంబనతోపాటు రాజకీయశక్తులుగా ఎదగాల్సిన అవగాహనను పెంచుకోవటం అనివార్యం అయింది. 1975 అంతర్జాతీయ మహిళా సంవత్సరం స్త్రీల ఆలోచనలకు పదునుపెట్టటంతో సమాజంలో వివక్షాపూరిత అసమనైతికలైంగిక సంబంధాలు ప్రశ్నకు గురికావటం క్రమానుగత పరిణామం. స్త్రీలు తాము భార్యలుకాక మునుపు తాము మనుషులమనీ, తమకొక మనసు ఉంటుందనీ, ఆ మానసిక తృప్తి పితృస్వామ్య కుటుంబాలలోని స్త్రీపురుష సంబంధాలలో తమకు లభించటం లేదనే అవగాహన విడాకులకు, పునర్వివాహ సంస్కృతికి దారులు వేసాయనే సాహిత్యప్రతిఫలనాలు తెలియజేస్తాయి. ఈ రకమైన వివాహసంస్కృతిలో కూడా పెళ్ళిపేరుతో స్త్రీల లైంగికతను అణచివేసే స్థితి ఉండటం, పెళ్ళితంతు వల్ల విడాకుల అవసరం ఏర్పడింది. తమ మానసికస్వేచ్ఛకు అదనంగా సంక్లిష్టతలను కలిగిస్తున్నందుకు పెళ్ళి-విడాకులు ప్రశ్నకు గురి అయ్యాయి. దానిఫలితంగానే పెళ్ళితంతుకు ప్రాధాన్యతలేకుండానే స్త్రీపురుషులమధ్య మానసికతృప్తిగల స్నేహంగల ప్రేమపూరక లైంగికసంబంధాలు ఉండటంలోనే విలువలుంటాయని తెలియజేయటానికి గత పాతికేళ్ళకు మునుపే రంగనాయకమ్మ రాసిన 'జానకివిముక్తి', ఓల్గా వంటి రచయిత్రులు రాసిన 'ప్రయోగం' కథ, 'వాళ్ళు ఆరుగురు' అనే నాటిక రూపంలోను సాహిత్య సృజన చేసారు.

ఈ నేపథ్యంగల స్త్రీపురుష సంబంధాలు, ప్రపంచీరకణ సందర్భంలోని మార్కెట్టుశక్తుల ప్రభావంతో సామాజిక మానవ సంబంధాలు అనేక అలజడులకు గురిఅవుతూ, స్త్రీపురుష సంబంధాలలోని లైంగికత్వం పరిణామశీలతను సంతరించుకొని, పెళ్ళి, విడాకుల కుటుంబచట్రం అవసరంలేని సహజీవన సంస్కృతిని అభివృద్ధిచేసుకొంది. అక్కిరాజు భట్టిప్రోలు రాసిన 'నందిని' కథ, సాహితి (ఎస్.శ్రీదేవి) రాసిన 'లివింగ్ టుగెదర్' కథ, ఆరి సీతారామయ్య రాసిన 'సావాసం-

సహవాసం' కథలు ప్రథమోదాహరణలు. అయితే ఈ తరహా సహజీవన స్త్రీపురుష సంబంధాలు కూడా పితృస్వామ్యం చోటుచేసుకుంటే సహజీవనసంస్కృతి కూడా స్త్రీలను మానసిక సంఘర్షణలకు లోనుచేస్తుందనేందుకు కె.ఎన్.మల్లీశ్వరి రాసిన 'శతపత్రసుందరి' కథ సాక్ష్యం. అయితే ఈ సహజీవన సంస్కృతి పెడపోకడలు పోకుండా ఉండాలంటే స్త్రీపురుష సంబంధాలలో పరస్పర స్నేహం, నమ్మకం తప్పనిసరి. అయితే వీటికి స్థిరత్వం లోపిస్తే విడిపోయి ఎవరికివారే తమ వ్యక్తిత్వగౌరవాన్ని, భావస్వేచ్ఛను నిలుపుకొనే అవకాశం సహజీవనసంస్కృతిలో ఉంటుంది. అందుకే ఉన్నత న్యాయస్థానాలు కూడా ఈ సహజీవన సంస్కృతిని సమర్థించాయి. అయితే ఈ సహజీవనసంస్కృతి స్త్రీలమానసిక తృప్తిని కలిగించగల స్త్రీపురుష సంబంధాలవిషయమై అనుమానాలు కలగటాన్ని వివిన మూర్తి రాసిన 'క్రమం' కథ ఆలోచనలను రేకెత్తిస్తుంది. అంతేకాదు మానవజాతి మనుగడ పోషణ విషయమైన పిల్లలపెంపకం ప్రశ్నార్థకం కావచ్చు. దానికి సమాధానంగా వచ్చిన కథయే సాహితిపేరుతో ఎస్. శ్రీదేవి రచించిన 'లివింగ్ టుగెదర్' కథ.

3. వివాహేతర సంబంధాలు :

మార్కెట్టు శక్తుల ఆధిపత్యపు వాణజ్యసంస్కృతి అభివృద్ధికావటం కుటుంబసంస్కృతిలో మార్పులను తెచ్చింది. ఉత్పత్తుల పరాయీకరణ, స్వేచ్ఛామార్కెట్టువల్ల అధిక ధరలతో మానవజీవనం అతలాకుతలం అవుతోంది శారీరకశ్రమకు తగిన ఆదరణ లేకపోవటంతో జీవితం నిరాశానిస్పృహలకు దారితీయటం సహజపరిణామం. వాటివల్ల కలిగిన మానసిక సంఘర్షణలనుండి పలాయనం చెందటానికి, మానసిక ఉపశమనం పొందటానికి లైంగికసంబంధాలు అవసరమయ్యాయి. మరొకపక్క ప్రైవేటీకరణ వల్ల నిరంతరశ్రమజీవి అలిసిసొలసి కుటుంబజీవితాన్ని సరిగా గడపలేకపోవటంతో పాటు, లాభార్జనకై వాణిజ్యసంస్కృతి అభివృద్ధిచేసిన వాడుకో–విసిరేయ్ అనే భావజాల ప్రచార వస్తుసంస్కృతి ఆకర్షణలకు లొంగి స్త్రీలు అన్యసంబంధాలవైపు మొగ్గుజూపటం జరుగుతోంది. అయితే స్త్రీల అన్యసంబంధాలను సులువుగా నిరూపించే వెసులుబాటు ఉంటుంది. అదికూడా లైంగికత్వంలో స్త్రీల గర్భధారణను అనుమానపు ప్రవృత్తితో పునరుత్పత్తి రాజకీయాలుగా వాడుకొని విడాకులు ఇచ్చేవీలుంటుంది. అయితే పురుషుని అన్యసంబంధాలు నిరూపణ చేయటం కష్టం. కాని పట్టుబడితే పురుషుడు 1680 నాటి భారతశిక్షాస్మృతి క్రిమినల్ చట్టంలోని 497 సెక్షను, ప్రకారం శిక్షార్హుడు. కాబట్టి దాన్ని రద్దుచేయటంతో అతడు కూడా విడాకుల చట్ట పరిధిలోకి వచ్చే సమన్యాయాన్ని ఉన్నతన్యాయస్థానం నిర్ధారించింది. సమాజంలో మార్కెట్టు స్వేచ్ఛ ప్రభావంతో క్రయవిక్రయాలసంస్కృతి జీవనాధారంగా మారటంతో వివాహేతర సంబంధాలు ఎక్కువయ్యాయి.

ప్రపంచీకరణ ఆర్థిక–రాజకీయసంస్కృతి ఆదిపత్యపు సంస్కృతి పితృస్వామ్యాన్నే బలపరుస్తుంది. దాని ఫలితంగా స్త్రీపురుష సంబంధాలలో చావబడటమో, చంపటమో అనేది ఎక్కువగా వినటం జరుగుతోంది. అయితే ఈ విషసంస్కృతి మానవ జీవన మారణకాండకు దోహదకారి కాబట్టి వర్తమానసంస్కృతిని ప్రతిఫలించిన సాహిత్యమథనంచేసి, స్త్రీపురుషసంబంధాలలో మరింతగా నిర్మాణాత్మక దృష్టిని పెంపొందించే చారిత్రక అవసరం ఉంది. భవిష్యత్తరాలకు దిక్సూచిని అందించే మేధావులు, సృజనకారుల క్రియాశీలత స్త్రీపురుషసంబంధాలలోని సంక్లిష్టతలను పారద్రోలే మానవసంబంధాల జీవనసంస్కృతికి బాటలు వేయాల్సిన చారిత్రక అవసరం ఏర్పడింది. గత పాతికేళ్ళ తెలుగు సాహిత్యం అంటే 2000–2026 వరకు వచ్చిన సాహిత్య ప్రతిఫలనాలుగా ఉన్న సామాజిక స్త్రీపురుషసంబంధాల పరిశీలన, లోతైన విశ్లేషణ, విమర్శవల్ల నూతన సత్యావిష్కరణ జరుగుతుందనీ అది మానవభవితవ్యానికి దిక్సూచికగా దిశానిర్దేశం కాగలుగుతుందని భావన చేయాలి.

1. సాహిత్యం–వివాహసంబంధాలు–విడిపోవటాలు

2000 నాటికే నేటి ప్రపంచీకరణ ప్రభావం సామాజిక కుటుంబాలలోని స్త్రీపురుష సంబంధాలలో ప్రకంపనాలు సృష్టిస్తోందనీ, దంపతులు ఇరువురు కృషిచేసిన పంటభూమిని ఫ్యాక్టరీలకై అమ్మటానికి భార్య ఒప్పుకోకపోవటం జరిగింది. ఆర్థిక విషయాలకై వృద్ధాప్యంలో భార్యాభర్తలమధ్యన మనస్పర్థలు కలిగి మానసికంగా దూరమవటానికి కారణం ఈ ప్రపంచీకరణ అవుతోందనే స్పృహను కలిగించటమేకాక, దాని ప్రభావంవల్ల కుటుంబంలోని స్త్రీపురుష సంబంధాలలోని మార్పులకు పునాదులు పడటంగా కుప్పిలి పద్మ రాసిన ప్రకంపనలు (వార్త – మే, 2000) అనే కథలో వ్యక్తమైంది. ఈమె రాసిన కుబుసం (ఇండియాటుడే మాసపత్రిక – జనవరి2001) అనే మరొక కథలో ప్రపంచీకరణ వల్ల భర్తకు మరొకచోట మంచిజీతంతో ఉద్యోగం వచ్చినా వాళ్ళు భార్యతో కలిసి స్త్రీపురుషసంబంధాలలో ఉంటే పనితనంలో నాణ్యత ఉంటుందని భావించటం జరిగింది. దానితో అతడు లెక్చరర్‌గా పనిచేస్తున్న భార్యను ఉద్యోగం వదిలిపెట్టి వారు చూపించిన ఉద్యోగంలో చేరవచ్చు అన్నా, వ్యక్తిత్వం గల భార్యకు ఇష్టముండదు. ఆతని స్నేహితుడు పనిచేసేచోట ఇంటికివెళ్ళే సమయం తక్కువైనప్పుడు క్యాజుయల్ సెక్సును పొందే అవకాశం ఉంటుందని చెప్పటమే పురుషులకు లైంగికానుభూతి శారీరకమైనదని స్పష్టమైంది. అందుకే ప్రపంచీకరణం అనేది పడకగదిలో బుసలు కొట్టే కుబుసం వంటిదని, అది స్త్రీపురుష సంబంధాలపై ప్రభావం చూపుతోందని అర్థమౌతుంది.

అంతేకాదు, ప్రపంచీకరణంలో ఆర్థిక పెట్టుబడిదారులను ఆకర్షించటానికై టూరిజమ్‌ని

అభివృద్ధిపరచటం ఒక ఆర్థిక-రాజకీయ విషయం. ఆ క్రమంలో కుప్పిలి పద్మయే రాసిన సాలభంజికలు (ప్రజాతంత్ర-మార్చి 2001) అనే ఇంకొక కథలో కుటుంబ ఆర్థికపరిస్థితులు, చదువు సరిగా లేని అమ్మాయిలు తమకిష్టం లేకపోయినా పెట్టుబడిదారులకు లైంగికానుభూతులను కలిగించే ఉద్యోగం తప్పనిసరి అవటంతో, స్త్రీపురుష లైంగిక సంబంధాలలోని మానసిక స్పందనలు దూరమవటం స్పష్టమయింది. అంతేకాదు లైంగిక సంబంధాలవల్ల ఆడపిల్లలు అనారోగ్యం పాలై జీవనహక్కులను కూడా కోల్పోవటాన్ని ప్రతిఫలించిన కథ ఇది.

ఓల్గా రాసిన మార్పు (జూన్ ఇండియా టుడే 2001) అనే కథలో ఉద్యోగంలో భాగంగా దక్షిణాసియా మహిళా సంక్షేమ అధికారిణిగా తాను విదేశీయానం చేయటం, అక్కడ తాను పురుష అధికారులతో కలిసి చూసిన ప్రదేశాల గురించి చెప్పినందుకు భర్త భరించలేక అపోహపడి భార్యకు దూరమవ్వాలని భావించటం, ఆ విషయం తెలిసిన భార్య ఇంట్లోంచి వెళ్ళిపోవాలనుకోవటం జరిగింది. ఆ రకంగా సామాజిక చలనసూత్రాలకు అనుగుణంగా వచ్చిన పరిణామ సంస్కృతిని భర్త తరతరాలుగా వచ్చిన పితృస్వామ్యభావాలతో భరించలేకపోవటంతో కుటుంబంలోని స్త్రీపురుషసంబంధాలు చెల్లాచెదరవటం కనపడుతుంది.

ఓల్గా రాసిన పెళ్ళి (డిసెంబరు 2002) అనే కథలో ఇద్దరు స్నేహితురాళ్ళమధ్యన జరిగిన సంభాషణలలో పెళ్ళి అంటే ఒక అభాగ్యజీవి బలి అవటమే అని, ఆ చావును చూడటానికి సింగారించుకొని వెళ్ళాలా అనీ, పెళ్ళి వలన ఆడవాళ్ళు బాధితులుగా ఉన్నారని అంటుంది. అయితే అలాంటప్పుడు నచ్చిన వ్యక్తిని ప్రేమించి పెళ్ళిచేసుకున్నా, ఆ ప్రేమించిన వాడు తనను ఎక్కడ మోసంచేస్తాడోననే భయం ఉంటోంది. ప్రేమ, భద్రత దొరకని పెళ్ళి ఎందుకు స్త్రీలకు, సెక్సు అవసరమేగానీ, పెళ్ళిలో తప్ప తమ కోరికలు తీరవని భావిస్తూ ఆడపిల్లలు తమ ఆత్మాభిమానాన్ని చంపుకోకూడదని తెలియజేసింది. పైపెచ్చు ప్రేమకోసమో, భద్రతకోసమోకాక పెళ్ళిని ఒక వ్యాపారంలాగా భావించి పెళ్ళిలో దిగుతారనీ, పైసా లాభంలేకుండా ఉండటం కోసం పాతివ్రత్యం మాతృత్వం వగైరాలుపెట్టారుగానీ, ప్రైవేటు ఉద్యోగాలలో చాలీచాలని తిండితో కష్టపడటంకంటే పోషణభారాన్ని వహించే పెళ్లియే లాభసాటిగా భావిస్తున్నట్టుచెప్తుంది. ప్రపంచీకరణంలోని లాభసాటి వ్యాపారసంస్కృతి దృక్కోణంనుంచి మగాడినే పెట్టుబడిగాపెట్టి అతని దగ్గరనుంచి ఎంతైనా రాబట్టుకోవచ్చనీ, పెళ్ళికి కొత్తనిర్వచనం చెప్పటం జరిగింది. పెళ్ళిలో ఒక ఉద్యోగస్తురాలిలా, లాభంకోసం ఒక వ్యాపారస్తురాలిలా హక్కులకోసం పోరాడవచ్చనీ, పెళ్ళి తరువాత ఎవరియెడలనైనా ప్రేమోలేదా మోహం కలిగితే వివాహితగా ఎక్కువ అవకాశం ఉంటుందనీ, మగవాడైతే శిక్షార్హుడుకాని,

వివాహితను వ్యభిచార నేరం కింద శిక్షించదు అంటుంది. ఆర్థికపెట్టుబడిదారీ వ్యాపారసంబంధాల ప్రభావంతో పెళ్ళిని స్త్రీలు వ్యాపారదృష్టితో ఆలోచిస్తే మగవాళ్ళసంగతేమిటి అని ఆలోచించమనే కథ ఇది. పెళ్ళి-వ్యాపారం అంటూ జరిగిన చర్చల అనంతరం ఆమె తాను ప్రేమించిన వ్యక్తితో పెళ్ళిచేసుకోకుండానే అభిరుచులు, అభిప్రాయాలు కలిసిన నవజీవన సహజీవన స్నేహసంబంధాలలో కలిసి బతకాలనుకుంటున్నామని చెప్పింది.

ఈమె యే రాసిన భద్రత (డిసెంబరు, 2002) అనే మరొక కథలో భార్య ఉండగా అతడు వివాహేతరసంబంధం పెట్టుకుంటాడు. తన భార్య అందంగా లేదంటూ తన అందాన్ని మెచ్చుకున్న అతడంటే ఇష్టం కలిగి దగ్గరయిన అమ్మాయి కొన్నాళ్ళ తరవాత అతనిమీద తనకే పెళ్ళి రూపంలో హక్కు ఉంటేనే తనకు భద్రత అని భావిస్తుంది. కాని అతని భార్య పెళ్ళిలో తనకు భర్తదగ్గర భద్రత లేదనీ అయినా పిల్లలకోసం కలిసి ఉందామనుకొన్నా, కాని వివాహేతరసంబంధం పెట్టుకొన్న వ్యక్తిదగ్గర తనకు ఎప్పటికైనా భద్రత ఉండదనీ, పిల్లలుకోసం కూడా స్త్రీ త్యాగంచేస్తూ భద్రతలేని వైవాహిక జీవితం భార్యకు అనవసరమని భావిస్తుంది. తల్లిదండ్రులు కలిసి ఉన్నా కూడా పిల్లలు హాస్టల్లో ఉన్నట్టే ఉంటారని, ఇంకా అక్కడ తల్లిదండ్రులు విడాకులు తీసుకున్నవారి పిల్లలు కొందరు ఉన్నారనీ వాళ్ళతో కలిసి ఉంటే వారికి అవగాహన పెరుగుతుందనీ భావిస్తుంది. తానొక ఉద్యోగం చూసుకొని తన జీవితానికి తనే భద్రతను కలిగించుకోవాలనుకొంది. అలాగే అతనిని ఇష్టపడ్డ అమ్మాయి కూడా అందమైన భార్యను వదిలిపెట్టి తనను మోసంచెయ్యాలనుకొన్న వ్యక్తి తనకు దగ్గరగా ఉండాలనుకోవటంలోనే భద్రత లేదని భావిస్తుంది.

కుప్పిలి పద్మ రాసిన వర్షపు జల్లులలో (ఆంధ్రప్రభ- ఫిబ్రవరి, 2003) అనే కథలో ప్రపంచీకరణ సందర్భంలో మార్కెట్టు లాభార్జనకై వస్తుసంస్కృతి చోటుచేసుకొంది. ఇంట్లోవాళ్ళు ఫోన్ ఇవ్వనందుకు, కొని ఇవ్వకపోవటంతోను డబ్బున్న స్నేహితుడు ఫోన్ని కొనిస్తాననిచెప్పి తనతో రైన్ జాన్సింగా క్లబ్బులకు పబ్బులకు ఆమెను తిప్పుకొనేవాడు. అతని మోజులో ఉన్న ఆ అమ్మాయి పెళ్ళిచేసుకున్న తరువాతనే లైంగికసంబంధాలలో ఉండాలని చెప్పినందుకు అతడు పెళ్ళితో సంబంధాలు లేని లైంగికసంబంధాలలో ఉండటమే ఫన్ అంటూ చెప్పేసరికి ఆ అమ్మాయి సామాజిక ఆమోదంపొందే వివాహసంబంధమైన లైంగిక సంబంధాలపైనే మొగ్గుచూపాలనుకోవటంవల్ల ఆమె సంఘర్షణకులోనై వర్షపుజల్లులో తడిసి అతనికి దూరమవటానికే నిర్ణయించుకుంది.

సాహితి పేరుతో ఎస్.శ్రీదేవి రాసిన లివింగ్ టుగెదర్ (విపుల మాసపత్రిక - ఆగస్టు 2003) కథలో పెళ్ళిచేసుకొని ఎనిమిదేళ్ళుగా సంసారం చేసుకుంటూ ఉండగా ఆమె భర్త మాత్రం

వివాహేతరసంబంధాలలో ఉంటాడు. ఆ విషయం తెలిసిన ఉద్యోగినియైన ఆ భార్య నమ్మకద్రోహం జరిగిందని గ్రహించి అతనికి దూరమవ్వాలనుకొంది. విడాకులు తీసుకోవాలనుకొంది. అయితే అతనికి కుటుంబం, భార్య కావాలి కాబట్టి విడాకులు ఇవ్వనంటాడు. పైపెచ్చు ఉంచుకున్న ఆవిడకు ఎటువంటి హక్కులు ఉండవంటాడు. అయితే ప్రేమరాహిత్య లైంగికసంబంధాలైనా పిల్లలపెంపకం మహిళలను కట్టిపడేస్తుందని, చచ్చినట్లు రాజీపడుతుందనుకొనే పితృస్వామ్య కుటుంబసంస్కృతికి చెంపపెట్టుగా ఆమె పిల్లలను హాస్టల్ లో వేసి వారు కూడా అర్థంచేసుకొని స్వతంత్రంగా ఎదిగేటట్లు చేయాలనుకుంది. ఆ రకంగా ఆమె ప్రేమసంబంధాలులేని కుటుంబాన్ని నిరసించి విడాకులు తీసుకొంది. అయితే కొన్నాళ్ళ తరువాత ఉద్యోగరీత్యా లండన్ వెళ్ళిన ఆమెకు తనను తన పిల్లలను అర్థంచేసుకొనే విదేశీయుడితో స్నేహం, అతనిపట్ల నమ్మకం ఏర్పడటంతో ఆతనిని పెళ్ళిచేసుకుంది. ఆతడు ఆమె పిల్లలనుకూడా తన పిల్లలలాగా చూసుకోవటం, పిల్లలుకూడా అతనిని అర్థంచేసుకొంటారు. ఆ రకంగా సుడిగుండం వంటి వివాహసంబంధాలతో తెగతెంపులుచేసుకొని తిరిగి నమ్మకమైన స్నేహసంబంధాలుగల వివాహంతో కుటుంబాన్ని ఏర్పరచుకుంది. ఇక్కడ పెళ్ళితంతు, కుటుంబ నిర్మాణం కంటే స్త్రీపురుషులమధ్యన పరస్పరం గౌరవించుకొనే స్నేహం, నమ్మకం కలిగిన స్త్రీపరుషసంబంధాలు అవసరమని, మొదట వివాహపు సంతానం ఆమె పునర్వివాహానికి అడ్డుకాలేదని రచయిత ఉద్దేశం అర్థమయింది.

ఆధునిక ప్రపంచంలో రంగులరాట్నం తిరిగినట్లుగా అతడు లైంగికసంబంధాలను చూడాలనుకొని వివాహేతర సంబంధాలలో ఉండాలనుకొన్నాడు. అతనియొక్క ప్రేమ సంబంధాలలోని కల్మషం అర్థమై, తనకున్న ఆర్థికస్వావలంబనవల్ల తనకు అతనిపై ఆధారపడాల్సిన అవసరంలేదని భావించింది. పెళ్ళితో కుటుంబం ఏర్పడుతుంది కాని కుటుంబం అంటే గోడలు అనుకొని దాన్ని ప్రేమిస్తున్నారు గాని, ఆ గోడలమధ్యన ఉన్నవే ప్రేమసంబంధాలు అనీ, పెళ్ళి అంటే కుటుంబం లోపల ఉండే వ్యక్తులమధ్యనున్న ప్రేమసంబంధాలని అర్థం చేసుకోమంటుంది. ప్రేమ, నమ్మకంలేని కుటుంబంలోని స్త్రీపురుషసంబంధాలలో తాను ఉండటానికి ఇష్టపడలేదు. అందుకే ఆమె నమ్మకస్తుడైన స్నేహితుడ్ని పెళ్ళిచేసుకుంటుంది. అయితే విదేశీయులను వివాహం చేసుకున్నప్పుడే కుటుంబంలో అటువంటి స్నేహపూరిత లైంగికసంబంధాలుకు అవకాశం ఉందనీ, భారతీయకుటుంబవ్యవస్థలో భార్యాభర్తలమధ్య నమ్మకం స్థిరంగా ఉండలేకపోతోందని, అటువంటప్పుడు స్నేహపూరక స్త్రీపురుష సంబంధాలపై నమ్మకంగల విదేశీయుడిని పెళ్ళాడటమనే కుటుంబసంబంధాలే ఆమెకు సంతృప్తిని కలిగించాయని, అతనితో బిడ్డలను కనటమే దానికి తార్కాణంగా భావించవచ్చు. స్త్రీపురుషులు తమకు ఇష్టమైనవారితో ఉండటం తప్పుకాదనీ,

సహజీవనంలో పెళ్ళి, పిల్లలు లేని ఒంటరితనమే ఉంటుందనీ, కుటుంబంలోని ప్రేమ సంబంధాలను ఆలోచనకు పెట్టటం జరిగింది.

ఓల్గా రాసిన మృణ్మయనాదం (ఆంధ్రజ్యోతి – ఫిబ్రవరి 2006) అనే కథలో రామాయణంలోని అహల్యపాత్ర ద్వారా భర్త రూపంలో వచ్చిన ఇంద్రుని తాను గుర్తించి అతనితో లైంగికసంబంధం పెట్టుకుందా లేదా అనేదాంట్లో సత్యాసత్యాలవిషయం కంటే తనయొక్క వయోవృద్ధుడైన భర్తకున్న అనుమానప్రవృత్తియే సమాజానికి ప్రధానమైందనీ, అక్కడ లైంగికత్వం విషయంలో స్త్రీల మనసువైపు నుండి సత్యాన్ని ఎవరూ గ్రహించాలనుకోలేదని, తాను భర్తనుండి దూరమై కుండలు చేసుకుంటూ ఒంటరిగా బతకటంలోనే స్వేచ్ఛను అనుభవిస్తున్నానని చెప్పటం జరిగింది. అంటే ఆనాటి అహల్య రాయిగా జీవించి రామస్పర్శతో పునీతం అయి భర్తతో కలిసి ఉందిగానీ, నేడు స్త్రీలు తామేమిటో, సమాజంలో తమ స్థితిని అవగాహనచేసుకొని, వివాహితగా పితృస్వామ్యకుటుంబసంస్కృతికి బలి అయ్యేబదులు ఒంటరిగా సమాజానికి దూరంగా స్వేచ్ఛగా బతకాలనుకొంటుంది అనే అవగాహన కలిగించిన కథ. రామునిచేత విడవబడిన ఆధునిక పునర్లిఖిత సీత కూడా తన గురించిన సామాజిక అనుమానాన్ని నమ్మిన భర్తతో కన్నా తాను అడవులలో జీవించటంలోనే తన మనసుకు శాంతి అనుకొంది. తరతరాలుగా పురాణపాత్రలు వేసిన ముద్రలనుండి స్త్రీలు బయటపడి తమ ఆలోచనలకు పదునుపెట్టి, సత్యాసత్యవిశ్లేషణ కోసం పునర్లిఖిత పురాణపాత్రల కథలు వచ్చాయి.

అలాగే ఓల్గా రాసిన సైకతకుంభం (సాహితీప్రస్థానం–జనవరి, 2010) అనే కథలో కూడా పితృస్వామ్య కుటుంబాలలో భర్త, కొడుకుకి కూడా స్త్రీల పాతివ్రత్యం ముఖ్యమని, పరపురుషుని చూసినా చూడకపోయినా ఆ పాపానికి చంపబడిన స్త్రీ జీవితాన్ని గురించి అవగాహన చేసుకొన్న ఏ ఆధునిక మహిళ యైనా నాటి పాతివ్రత్యపు అనసూయగా ఉండదనీ, భర్త దగ్గర తానెంతటి పాతివ్రత్యంతో ఉన్నా స్త్రీపురుషసంబంధాలలోని లైంగికత్వంలో స్థిరం ఉండదనే భావనయే ఈ సైకతకుంభం తెలియజేస్తుందని పురాణ పునర్లిఖితమైన అనసూయ చెప్పింది. అప్పుడప్పుడు సైకతకుంభాన్ని తయారుచేస్తుంటాన్ని, ఎంత ఏకాగ్రతతో దాన్ని తయారుచేసినా అది ఎంతోసేపు నిలవదనీ, అలాగే కుటుంబంలో శ్రద్ధగా తాను పాతివ్రత్యాన్ని పాటించినా పితృస్వామ్యకుటుంబంలో తన భార్యస్థానం ఎంతో సేపు నిలబడదనే స్పృహ కలుగుతుంటే తనకు భర్త దగ్గరకంటే అడవులలోనే మనిషిగా బతకగలుగుతున్నాననే భావన కలిగిందని చెప్పింది.

స్త్రీలు స్త్రీపురుష సంబంధాలలోని సత్యాసత్యవిశ్లేషణద్వారా జ్ఞానాన్ని పెంచుకోవటంకోసం పునర్లిఖిత పురాణపాత్రల కథలను రాయటంగా భావించాలి.

పి.సత్యవతి రాసిన దమయంతి కూతురు (ఆంధ్రజ్యోతి – సెప్టెంబరు 2012) అనే కథలో భర్తదగ్గర జీవితం నచ్చక ఆమె అతడిని పిల్లలను వదిలి వెళ్ళిపోతుంది. ఆ భర్త మళ్ళీ పెళ్ళి చేసుకొని ఆమెను అమ్మ అని పిలవమంటే వారికి ఇష్టముండదు. అత్త దగ్గర పెరిగి పెద్దవాళ్ళయిన తరువాత వాళ్ళు సమాజం తన తల్లి ఇంకొకరిని మళ్ళీ పెళ్ళిచేసుకొందని నిందిస్తున్నారని తెలిసి బాధపడతారు. అయితే ఆమె తమ నాన్న దగ్గర ఎన్ని కష్టాలు పడకపోతే అలాంటి నిర్ణయం తీసుకొందని అనుకొంటారు. ఆమె దగ్గరకు వెళ్ళినా అక్కడ తల్లి మాత్రమే ఉంటుంది. ఇక్కడా తండ్రి మాత్రమే ఉంటాడు. ఎందుకంటే తాము సవితి తల్లిని ఎలా అమ్మగా భావించలేకపోతున్నారో అలాగే అక్కడికి వెళ్ళినా సవితి తండ్రిని నాన్న అనుకోలేమనీ, తమ తల్లికి ఎక్కడున్నా తమ మీద ప్రేమ ఉంటుందని భావిస్తారు. పిల్లలు అటువంటి స్థితి ఏర్పడినప్పుడు తల్లిని అర్థంచేసుకొనే స్థితి ఉండాలిగాని, తల్లిని ద్వేషించకూడదనే అభిప్రాయాన్ని వెళ్ళడించటం జరిగింది.

వివిన మూర్తి రాసిన జిందగీ ఏక్ మిలేగా దుబారా అనే కథలో ఒకసారి పెళ్ళయితే, బయటకు వెళ్ళాలనుకొన్నా ఏర్పడిన లైంగిక సంబంధాలనుండి స్త్రీకి విముక్తి ఉండదనే భావన అర్థమౌతుంది.

షేక్ హుసేన్ రాసిన ఖులా (సత్యాగ్నికథలు 2023) అనే కథలో అత్తగారింట్లో సమానత్వం లేని పితృస్వామ్యపు బానిసత్వాన్ని సహించలేక నాదిరా అనే ముస్లిమ్ స్త్రీ పుట్టింటికి వెడతాననేసరికి, భర్త తన శీలాన్ని అనుమానించి తలాక్ చెప్తానంటాడు. అయితే ఆ విడాకుల చట్టబద్ధతకోసం కోర్టుకెళ్ళి అటువంటి వ్యక్తితో తాను సంసారం చేయదలచుకేలేదని నాదిరా తానే ముందుగా అతనికి ఖులా (స్త్రీవైపునుండి ఇచ్చే తలాక్ లాంటిది) ఇస్తానని చెప్పి, తాను ఆ బానిసత్వం నుండి విముక్తి పొందాలనుకొంది.

సలీమ్ రాసిన నాలో మరో నేను (ఈనాడు – ఆదివారం 22 ఫిబ్రవరి, 2026) అనే కథలో భర్త తాగొచ్చి, చెడుతిరుగుళ్ళు తిరిగి ఇంటికొచ్చి హింసపెడుతుంటే శారీరకంగా బలమైనవ్యక్తిని ఎదుర్కోలేక రహస్యంగా చంపాలనుకొన్న ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. భర్తను వదిలి పెట్టాలనుకొంది. కాని కడుపులో బిడ్డ తల కాళ్ళకు బంధం వేసింది. అలా ఇద్దరుపిల్లలు పుట్టిన తరువాత కూడా ఆతని హింసను భరించింది. తాను ఉద్యోగం చేస్తూ కూడా భర్తపెట్టే హింసను పిల్లల పెళ్ళివరకు భరించింది. ఇక భర్తను వదిలిపెట్టి హింసకు దూరమవ్వాలని బయలుదేరుతున్న సమయంలో అతనికి పక్షవాతం వచ్చి పడిపోతాడు. పిల్లలు వస్తారు. వాళ్ళకు అప్పగించి తాను భర్తకు దూరంగా ప్రశాంతంగా బతకాలనుకొంటే, పిల్లలు ఇద్దరూ ఆ లేవలేని స్థితిలోఉన్న భర్తను

వదిలి పెట్టి వెళ్ళటం సమంజసం కాదనీ, అతడు ఒంటరితనంతో చచ్చిపోతాడని తల్లిని నిందిస్తారు. అప్పుడామె భర్తమీద కసిని ద్వేషాన్ని ఇన్నాళ్ళు పిల్లలకోసం దిగమింగి తనకసిని కడుపులో దాచుకున్నానని, ఇప్పుడు తాను ఇక్కడే ఉంటే అశక్తుడై ఎదుర్కోలేనిస్తితిలో ఉన్న భర్తను కసితో చంపాలనుకునే మనస్తత్వానికి తాను దూరమైతేనే అతడు బతుకుతాడని చెప్తుంది. అన్నాళ్ళు ఆ హింసను పిల్లల బాధ్యత కోసం భరించానని, మీకు తండ్రి మీద ప్రేమ ఉంది కాబట్టి మీరే చూసుకోవచ్చునిచెప్పి భర్త తనను ఇన్నాళ్ళు హింసపెడుతుంటే ఎప్పటికప్పుడు చంపాలనే ఉద్దేశం ఉండేదని, తనలో మరో మనిషి ఉందని, తానిక్కడే భర్తకు సేవచేస్తుంటే అతడుపెట్టిన హింస గుర్తుకు వచ్చి అశక్తుడిని చాలాసులభంగా చంపటం కంటే తాను అతనికి దూరమవటమే అతనికి చేసే సేవ అనే అభిప్రాయాన్ని వెళ్ళడి చేస్తుంది. తాగొచ్చి ఇష్టానుసారం తిరిగొచ్చి భర్త భార్యను హింసకు గురిచేస్తే ఆ భార్యకు భర్తను చంపాలనే ఉద్దేశం రావటం సహజమనేది సమాజంలో అటువంటి భర్తలను చంపటంలో అర్థం చేసుకోవచ్చు.

2. సహజీవనసంస్కృతి

ఆరి సీతారామయ్య రాసిన సావాసం – సహవాసం (అమెరికా తెలుగు కథల సంపుటి.–జనవరి 2002) అనే కథలో సహవాసం అంటే పెళ్ళి వలన ఏర్పడే స్త్రీ పురుష సంబంధం అనీ, సావాసం చేయటం అంటే పెళ్ళి లేకుండా స్నేహసంబంధాలలో స్త్రీ–పురుషులు ఉండటమని నిర్వచించటం జరిగింది. చిన్నప్పుడు సావాసగాళ్ళతో స్నేహం ఇష్టమైనన్ని రోజులు ఉంటుంది. ఇష్టం లేకపోతే విడిపోయినట్లే సావాసం గల స్త్రీపురుష సంబంధాలలో కూడా ఇష్టమైనన్నాళ్ళు కలిసి ఉండి ఇష్టంలేకపోతే వీడిపోయే అవకాశం ఉంటుంది. పెళ్ళి అనేది వంటకోసమో, పనిమనిషికోసమో, వెచ్చని సుఖంకోసమో పురుషుడు పెళ్ళిచేసుకుంటుంటే దానిలో ప్రేమ, పవిత్రతకు తావులేదనీ, ప్రేమపెళ్ళిళ్ళలో కూడా బేరాలు, కాంట్రాక్టులు, మోసాలు ఉంటాయనీ, సాంప్రదాయంగా పెళ్ళిచేసుకొని అమెరికా తీసుకొని వెళ్ళి రెండునెలలు వాడుకొని బజార్లో వదిలేయటంలో పవిత్రత ఉందా అని పెళ్ళిని ప్రశ్నకు పెట్టింది. స్త్రీపురుష సంబంధాలలో, పెళ్ళి తంతుకంటే, గౌరవం, అభిమానం, భావైక్యత గల సావాసగాళ్ళుగా స్నేహసంహబంధాలలో ఉండాలని చెబుతుంది. ఒకవేళ ఇద్దరిలో ఎవరికి ఇష్టం లేకపోయినా విడాకుల అవసరం లేకుండా విడిపోయి ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళిఉండగల స్వేచ్ఛ సావాసంలో ఉంటుందని చెప్పటం జరిగింది. కాబట్టి పెళ్ళితో నచ్చని వ్యక్తిని వదిలించుకోవాలంటే చట్టపరమైన విడాకులు అవసరమని, సావాసమనే సహజీవన సంబంధాలలో లీగాలిటీ అవసరం ఉండదనీ వ్యక్తం చేయటం జరిగింది.

సి.సుజాత రాసిన బీటెన్ ట్రాక్ (గమనం పత్రిక-2002) అనే కథలో విమలాప్రకాశ్‌లు మూడేళ్ళుగా స్నేహితులుగా లైంగికసంబంధాలలో ఉంటారు. అతడు పెళ్ళిచేసుకుందామని అన్నా ఆమెకు తన తల్లి కుటుంబ సంబంధాలలో బందీ అవటం, పిల్ల పెంపకంతో సతమతమవటం చూసి కుటుంబ చట్రంలో ఇమడటం ఇష్టముండదు. పైగా కుటుంబ చట్రంలో తాను వ్యక్తిత్వాన్ని, స్వేచ్ఛను కోల్పోవటం ఇష్టముండదు. అసమానతలుగల కుటుంబంలో స్నేహపూర్వక స్త్రీపురుష సంబంధాలకు ఆస్కారం ఉండదని భావించి, పెళ్ళిని నిరసిస్తుంది. పితృస్వామిక కుటుంబాలలోని స్త్రీపురుష సంబంధాలలో మానసిక తృప్తిని కలిగించే ప్రేమసంబంధాలకు అవకాశం ఉండదనే భావన కుటుంబం ఏర్పడటానికి ప్రాతిపదికయైన వివాహసంస్కృతిని నిరసించటం, సహజీవన సంస్కృతిని ఇష్టపడటంగా స్త్రీపురుష లైంగిక సంబంధాలు పరిణామశీలతను సంతరించుకోవటాన్ని అర్థం చేసుకోవచ్చు.

అక్కిరాజు భట్టిప్రోలు రాసిన నందిని (తానాసంచిక - జులై 2003) అనే కథలో స్త్రీ పరంగా వివాహం కంటే సహజీవనం మేలనే ఆలోచనలు రావటం, ఆ సంస్కృతిని యిష్టపడుతూ పెళ్ళితంతు లేకుండానే అవసరమనుకొంటే గర్భవతియై పిల్లలను కనవచ్చని భావిస్తుంది. ఆమె దృష్టిలో పెళ్ళికంటే కూడా ముందుగా ప్రపంచీకరణంలోని పోటీ ప్రపంచంలో పేటెంటు హక్కులకై ఉన్నతమైన విద్యా ఉద్యోగం ముఖ్యమని భావిస్తుంది. పితృస్వామ్యాన్ని బలపరిచే వివాహతంతుతో స్త్రీలు రాజీపడటం అంటే బానిసత్వమే కాని సాహచర్యం కాదని, తోడుకోసం కాక నిత్యావసరాల కోసం ఆడపిల్లలకు పెళ్ళి తప్ప ఆధారం లేకపోవటమే అని అంటుంది. పెళ్ళిలేకుండానే తన ఆశయాలను, సాధించే క్రమంలో స్నేహితుడిగా పాలుపంచుకొన్న విదేశీయుడైన వ్యక్తిపై నమ్మకం, ప్రేమ, సాన్నిహిత్యం తన మనసులో మోహాన్ని కలిగించగా పెళ్ళితంతు లేకుండగానే అతనితోటి సంబంధాలతో ఆమె గర్భవతి అవుతుంది. తల్లిదండ్రులు కూడా వారిద్దరిమధ్య ఉన్న స్నేహపూరిత లైంగిక సంబంధాలను అవగాహన చేసుకోవటం జరిగింది. అతడు వివాహసంస్కృతిని లేవనెత్తినా ఆమె వివాహం అవసరమైనప్పుడు ఆలోచిస్తాననంటుంది. ఆమె ప్రసవ సమయంలో అతడు ఆమె కూడా ఉండి సహకారం అందించటం, తమ స్నేహసంబంధాలపై నమ్మకం కలిగిన తరువాతనే ఆమె ఆతడు ఉంగరాన్ని తొడుగుతుంటే నందిని అడ్డుకోదు. ఇది ఒక రకంగా విదేశీపెళ్ళిలో ఉండే స్నేహసంబంధాన్ని రచయిత చెప్పాలనుకున్నట్టు అర్థమౌతుంది.

కె.ఎన్.మల్లీశ్వరి రాసిన శతపత్ర సుందరి (ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక -జూన్ 2016) అనే కథలో నీల సదాశివలు పరస్పరం ఇష్టపడి ఒకరికొకరు ఎదుటివారి అన్ని స్వేచ్ఛలను గౌరవించుకొనే

విధంగా ఎనిమిదేళ్ళనుండి పెళ్ళి లేకుండా సహజీవనసంబంధాలలో ఉన్నారు. కాని చిత్రదర్శకుడైన గౌతమ్ నీల నటనను మెచ్చుకొని దగ్గరకు తీసుకున్నందుకు సదాశివలో తన నీలను అతడు ఎక్కడ లాగేసు కుంటాడో అనే భయం పట్టుకుంది. నీలకు తన భయం అర్థం కావాలని అతడు మరొక అమ్మాయికి దగ్గరగా ఉన్నట్టుగా భావించేటట్టు చేసి ఆమె కూడా తనలాగే అనుకోవాలనుకొంటాడు. కాని నీలలో ఉన్న స్థిరత్వం ఆమెను అలా భయపడేట్టు చేయలేదు. సహజీవనంలో పరస్పరం నమ్మకం ఉంటే అటువంటి భయాలు ఉండవని, అతనికి చెప్పినప్పటికీ అతను నీలకు దగ్గరగా వచ్చినప్పుడు తన నుండి ఆమె ఎక్కడ దూరం అవుతుందో అనే భయంతో ఆక్రమించినట్లు నీలకు అనిపించింది. అతనిలో ఉన్న తనది అన్న భావన భయాన్ని కలిగించి నమ్మకం పోయి అతనిలో ప్రేమ తగ్గినట్లుగా భావించింది నీల. పెళ్ళిలోగాని సహజీవనాలలో గాని నమ్మకం ఉండాలి గాని చేయిజారిపోతారేమో అనే భయం రాకూడదనే భావన అర్థం అవుతుంది.

కె.ఎన్.మల్లీశ్వరియే రాసిన నీల (జనవరి 2018) అనే నవలలో పెళ్ళిద్వారా కుటుంబ సంస్కృతిలో ఉన్న నీల, మరియు నీల యొక్క తల్లి కూడా భావస్వేచ్ఛలేక, భౌతిక మానసిక దాడులకు గురి అవుతున్నప్పుడు జీవనహక్కును కొనసాగించలేని స్థితిలో కుటుంబ సంబంధాల నుండి విముక్తులవుతారు. తరువాత నీల సమాజ పరిశోధనలో భాగంగా స్నేహితుడైన పరదేశిపై ప్రేమ ఏర్పడినా, అతడు మరొకరితో లైవ్ రిలేషన్స్‌లో ఉన్నాడని తెలిసి మూడవవ్యక్తిగా అతనితో లైంగిక సంబంధాలలో ఉండాలనుకోదు. కొన్నాళ్ళ తరవాత వృత్తిగత పరిచయస్థుడైన సదాశివకు నీలతో స్నేహం పెరిగి ఇద్దరూ ఏక కాల సహజీవనసంబంధాలలో ఉండాలనుకొన్నారు. అయితే ఆమెకు సంపూర్ణస్వేచ్ఛను ఇవ్వాలనే ఉద్దేశంతో ఆమె ఇష్టమనుకొంటే పరదేశితో నీలను తన లైంగిక హక్కును పొందమంటాడు సదాశివ. కాని నిర్భయత్వం స్థిరత్వంగల నీల తన జీవితం మీద విశ్వాసాన్ని పెంచుకొని ఆర్థికంగా కూడా ఆధరపడకుండా కేవలం సదాశివతో ప్రేమ, స్నేహం గల సహజీవనాన్ని కోరుకుంటుంది. అలాగే అజిత అనే స్త్రీ కూడా భార్యాబిడ్డలుగల వ్యక్తులు తనతో రహస్యసంబంధాలు పెట్టుకుందామనుకొనేవారికి చెంపపెట్టుగా తాను, ఏక కాల ఏక వ్యక్తి నిష్ఠ సంబంధాలలో ఉండాలనుకొంది. అలా రహస్యసంబంధాలలో ఉండటం కంటే ఒంటరిగా ఉండటం మేలు అనుకొంది. ప్రకృతిలోని స్వచ్ఛతను కాపాడాలనే ప్రయత్నంలో భాగంగా స్వచ్ఛమైన స్వేచ్ఛాయుత స్నేహసంబంధాలలో యువత కూడా సహజీవనాన్ని కోరుకుంటున్న విషయంతో నవల ముగుస్తుంది. స్వచ్ఛమైన ప్రేమ, గౌరవం, స్నేహం, నమ్మకంతో మిళితమైన ఏకకాల, ఏక వ్యక్తి నిష్ఠంగా ఉన్నప్పుడే స్త్రీపురుష సహజీవనసంబంధాలు సత్ఫలితాలనివ్వగలుగుతాయనే భావన స్పష్టమవుతుంది. నేడు స్త్రీలు స్వేచ్ఛగా స్త్రీపురుష సంబంధాలలో తమ మానవహక్కులను కాపాడుకోవాలనుకొంటే అది

పురుషులలో అభద్రతను కలిగిస్తోందని అందుకే సెక్సురోబోల తయారీపనిలో పడ్తున్నట్టు అర్థమవుతుంది.

వివినమూర్తి రాసిన క్రమం అనే కథలో స్త్రీపురుష లైంగిక సంబంధాలలో పెళ్ళి అనే తరతరాల సామాజిక క్రమాన్ని నిరసించి సహజీవన సంబంధాలలోనే స్నేహపూర్వక ప్రేమసంబంధాలు ఉంటాయనే భావన స్త్రీలలో కలగటాన్ని తెలియజేసిన కథ ఇది.

విమల రాసిన దేహకాంక్ష (ఆంధ్రజ్యోతి-22 మార్చి, 2026) అనే కథలో జాతకాలు చూసి మరీ పెద్దలు చేసిన పెళ్ళి ద్వారా ఆమె కొడుకును కని, ఆరేళ్ళపాటు సంసారం చేసిన తరువాత భర్త ఇంటికి సరిగా రాకుండా రెండో పెళ్ళి చేసుకుంటాడు. పూర్తిగా ఇంటికి రావటం మానేస్తాడు. ఆ తరవాత అతడు చనిపోతాడు. ఆమె ఒంటరితనంతో బాధపడుతుంది. సమాజం వితంతువుల్ని పిల్లలను చూసుకుంటూ బతకమంటుంది. తన పిన్ని భర్త చనిపోతే ఏకాంతాన్ని భరించలేక డిప్రెషన్ లోకి వెళ్ళిపోయిందని భావించింది. తనకు పరిచయమైన వ్యక్తి వచ్చి ఇద్దరం కలిసి ఉందామని, ఇష్టం లేకపోతే విడిపోవచ్చని సమాజాన్ని పట్టించుకోవలసిన అవసరం లేదని అంటాడు. స్త్రీలకు వాంఛలు తీర్చుకొనే అవకాశం లేక తమలోని దేహకాంక్షను చంపుకొంటారని, సామాజిక ఆంక్షలను దాటుకొని ప్రేమపూర్వకస్పర్శ వారికి అవసరమని, తన కోసం మనిషి ఉన్నాడనే నమ్మకం దేహకాంక్షలవల్ల కలుగుతుందని ఆమె భావించింది.

జడా సుబ్బరావు రాసిన క్వాంటమ్ డేటింగ్ (మార్చి 8 ఆంధ్రజ్యోతి 2026) అనే కథలో మనిషి ఇష్టమైతే ప్రేమించవచ్చుగాని, తనకే కావాలని పెళ్ళిచేసుకోవాలని అనుకొన్నా చేసుకోలేక మనోవ్యథను స్త్రీలు అనుభవిస్తున్నారు. ఒకవేళ పెళ్ళిచేసుకున్నా దానిలో మానసిక, శారీరక భావోద్వేగాలు ఉంటాయని, బరువు బాధ్యతలు తెంచుకోవటానికి వీలుండదని అనుకుంది. పట్టించుకోవట్లేదని కోర్టుమెట్లు ఎక్కి విడాకులు తీసుకోవాలి. కాలం మారింది స్వేచ్ఛపెరిగి ప్రేమబంధాలలో చిక్కుకుంటున్నారు. కాని ప్రేమ ప్రకృతి సహజంగా పుట్టకుండా ఆకర్షణలలో పుడుతోందనీ, ఆ ఆకర్షణలకే కామాన్ని అద్ది ప్రేమ అంటున్నారనీ, దానితో జాలి, బెదిరింపు, అభద్రత, అనుమానాలలో చిక్కుకుంటున్నారని భావిస్తుంది. ఆకర్షణ, వ్యామోహం తగ్గిన తరువాత ఒకరినొకరు శారీరకంగా మానసికంగా హింసించుకోవటం జరుగుతోందని, డేటింగ్ లో కూడా శారీరకకాంక్ష తప్ప ప్రేమ ఉండటం లేదని, పెళ్ళిచేసుకుందామనే వాగ్దానాలు ఉంటాయి కాని కోరిక తీరిన తరువాత మొహం చాటేస్తున్నారని అనుకుంది. సహజీవనంగా కలిసి ఉందామని స్నేహితుడు అడిగితే కలిసి నడవాలనుకొనే నిర్ణయం తీసుకొనేటప్పుడు బాగానే ఉంటుందిగాని

విడిపోవాలనుకొంటే అక్కడకూడా బాధే మిగులుతుందని అంటుంది. ఆమె అటుపెళ్ళిలోగాని, సహజీవనంవంటి డేటింగ్ లలో గాని స్థిరత్వం ఉండదనే సంఘర్షణకు లోనవుతుంది. క్వాంటమ్ అంటే కంప్యూటర్లో ఒకేసారి రెండు కమాండ్లు పనిచేసినట్టు జీవితంలో పెళ్ళి, డేటింగ్ వంటి సహజీవనాన్ని ఒకేసారి ఆపరేట్ కాగలుగుతాయా అనే సందేహాన్ని వ్యక్తపరచటం కథలో అర్థమవుతుంది.

3. వివాహేతరసంబంధాలు

ఓల్గా రాసిన స్పర్శ (విపుల–మార్చి 2006) అనే కథలో స్త్రీపురుషసంబంధాలమధ్య స్నేహసంబంధాలు ఉండేటట్టుగా ఎవరికి వారు స్పర్శతో పరీక్షలుపెట్టుకొని మోహసంబంధాలు శాశ్వతంగాదనీ, ఇద్దరిమధ్య లైంగికసంబంధాలకంటే ప్రేమపూరిత స్నేహసంబంధాలు విలువైనవనే అభిప్రాయం అవసరమని, అదే ఈస్తటిక్ సెన్స్ అనే అభిప్రాయాన్ని వెల్లడించటం జరిగింది..

ఆరి సీతారామయ్య రాసిన పరివర్తన (ఆంధ్రభూమి–ఆగస్టు, 2009) అనే కథలో పెళ్ళితో మగవాడికి భార్యపై లైంగిక హింస చేసే అధికారం లేదనీ, పోర్న్ వీడియోలలో ఉన్నట్టు సెక్సు కోరుకోవటంతో లైంగికహింస భరించలేక భర్తను చంపి శిక్షకు గురియైన భార్య చెబుతూ తన పెళ్ళికి కొద్దిరోజుల మునుపు తనపై ఏ హక్కులేని తన చిన్ననాటి స్నేహితుడు, మామయ్య కొడుకుతో తనకు కలిగిన లైంగికానుభూతి ఇష్టమైందనీ, అమెరికాలో వచ్చిన తరువాత తన భర్త భార్య శరీరంపై తనకు పెళ్ళి ఇచ్చిన హక్కుతో లైంగిక హింసకు గురిచేయటంతోనే భరించలేక చంపానంటుంది. ఆమెను అమెరికాలో జైలులో పెట్టినా సత్యం విషయంలో గాని భర్తను చంపినందుకు గాని ఆమెలో పరివర్తన రాదనీ అర్థమవుతుంది.

దగ్గుపాటి పద్మాకర్ రాసిన ఈస్తటిక్ స్పేస్ (ఆంధ్రజ్యోతి–మే, 2009) అనే కథలో భర్త చనిపోయి పిల్లల బాధ్యత తీరిన ఒక స్త్రీ, పరిచయస్థుడైన భార్య లేని పురుషుడితో సామాజిక విషయాలన్నింటినీ స్వేచ్ఛగా మాట్లాడుకోవటంతో ఇద్దరి మధ్య స్నేహసంబంధాలు ఉంటాయి. కాని ఒకరోజు. అతనికేమో పెళ్ళితో సెక్సు అనుభవం తనకు లేకుండా ఉంటే బాగుండేదని అంటాడు, ఆమె తాను స్త్రీగా పుట్టి ఉండకపోతే బాగుండుననే అసంతృప్తుల ఫలితంగా ఇద్దరిమధ్య లైంగిక సంబంధం ఏర్పడింది. కాని ఇద్దరికిద్దరూ పశ్చాతప్తులై గత అనుభవాలను నెమరువేసుకొనే సంస్కారం, నిగ్రహం చిన్నప్పటినుండి నేర్పితే తమ మధ్య ఇటువంటి లైంగిక సంబంధం ఏర్పడేది కాదని భావిస్తారు. అంటే స్నేహితులైన ఇరువురు స్త్రీపురుషల మధ్యన స్నేహసంబంధాలు ఉండవచ్చు గాని అవి మోహంతో కలుషితం కాకూడదనే రచయిత భావన అర్థమౌతుంది.

సి.సుజాత రాసిన రాతిపూలు (జనవరి 2010) అనే నవలలో ఆర్థికలోటు ఉన్న భర్త తన భార్యచేత ఉద్యోగం చేయించాలనుకొంటాడు. ఆమె ఉద్యోగం కోసం, ఆ పైన ప్రమోషన్ కోసం ఒక వ్యాపారితో లైంగిక సంబంధం పెట్టుకుంటుంది. అతను రమ్మన్నప్పుడల్లా క్లబ్బులు, పబ్బులో గడుపుతుంది. జీతం డబ్బును భర్తకు పంపుతుంటే అతడు అన్ని సుఖాలను కొనుక్కుంటూ అనుభవిస్తూనే భార్యమీద అపనమ్మకంతో ఉంటాడు. ఆమె కూడా డబ్బుకు అలవాటుపడి అతనిని నమ్మిస్తూ జీవితాన్ని గడుపుతుంది. స్నేహితురాలు తన భర్త తాగుబోతు అనీ, వాడిని వదిలించుకోవాలని విడాకుల కేసు వేస్తే భర్త వెనక్కి తీసుకోమంటాడు. లాయరు దగ్గరకు వెళ్ళిన స్నేహితురాళ్ళకు ఆ బడా వ్యాపారి ఆమెను పెళ్ళిపేరుతో మోసంచేసి బిడ్డపుట్టిన తరువాత మోసంచేసాడని తెలుసుకుంటారు. అదే వ్యాపారి పెళ్ళిచేసుకొన్న భార్య చాలా అందగత్తె అని తెలుసుకొని ఆ విషయంలో అబద్ధమాడి తనతో గడుపుతున్నాడని ఈమె గ్రహిస్తుంది. అంతేకాదు వాళ్ళ ఇంట్లో ఫంక్షను నిర్వహించమంటూ నలగురిలో అతడు భార్యకే గౌరవస్థానం ఇచ్చాడని తనంటే అతనికి ఇష్టం కంటే కూడా తనని శారీరకంగా వాడుకుంటున్నాడని అర్థమైన తరువాత తాను డబ్బుకై అవసరార్థం తప్పుచేస్తోందని అనుకొంటుంది. తనది తప్పు అవునా కాదా అని స్నేహితురాలిని అడిగితే సందర్భాలను బట్టి, పరిస్థితులను బట్టి ఎవరి మనసు వారినే తప్పుచేస్తున్నావో, లేదో తెలుపుతూనే ఉంటుందని చెబుతుంది. తాను తప్పు చేసింది అనే భావన కంటే భర్తకు ఆర్థికంగా సహాయపడటంకోసం తాను చేసినవి పొరపాటు పనులని అనుకుంది. ఆమె తాను చేసిన పొరపాటుల పనులలో తన భర్తకు కూడా షేర్ ఉందనీ, తన మనసుకు తప్పని తోచిన పనులు చేయటం ఇష్టంలేక ఆమె ఉద్యోగం వదిలి పిల్లలను దగ్గరుండి పెంచుకోవాలనుకుంది. అంటే వివాహేతర సంబంధాలు ఆర్థిక అవసరార్థం పెట్టుకోవటం పొరపాటు పని అనీ, పరిస్థితులు తనని తప్పుచేసేట్లు చేసాయనీ, అయినా వివాహేతర సంబంధాలలో గౌరవం, ఇష్టం అనేవాటికి ఆస్కారం ఉండదనే గ్రహింపు కలగటమే రచనోద్దేశంగా అర్థమౌతుంది.

వి.రాజా రామమోహనరాయ్ రాసిన ఉన్నంతలో (స్వాతి మాసపత్రిక 2012) అనే కథలో పక్షవాతం వచ్చి రోగిష్ఠి గా మంచాన పడ్డ భర్త యొక్క వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం చేసి తనని ఓదార్చినందుకు, ఆతని స్నేహితునితో కృతజ్ఞతకై లైంగిక సంబంధాలకు ఒప్పుకుంది. అది కొనసాగింది. అయితే తాను భర్తకు సేవ చేయటానికి ఆతడు గంట మోగించినప్పుడల్లా ఆ స్నేహితుడ్ని వదిలి వెళ్ళిపోతున్నందుకు అతడు ఆమె భర్తను తానే ఖర్చులు భరిస్తూ నర్సింగ్ హోమ్ లో చేర్పిస్తాడు అక్కడకు వెళ్ళి భర్తమీద ప్రేమతగ్గని భార్యగా మానవసేవలను అందిస్తుందని అర్థం అవుతుంది. ఆమె భర్త యొక్క స్నేహితుడికి పురుషుడిగా శారీరక సుఖం కావాలనుకొంటే, స్త్రీగా

భార్యకు పెళ్ళితో ప్రేమసంబంధాలు శాశ్వతంగా ఉంటాయనే స్పృహను కలిగించాలనుకొన్నట్టుగా కథ అర్థమౌతుంది.

విమల రాసిన నీలా వాళ్ళమ్మ మరికొందరు (నవ్య – జూన్ 2013) అనే కథలో నీలకు ప్రేమ అనే మాటమీద నమ్మకం లేకపోవటానికి కారణం, వాళ్ళ అమ్మ. ఆమె తనకున్న ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని భార్య ఉన్న రాజేశ్‌ని గుళ్ళో పెళ్ళి చేసుకొంది. కాని పిల్లపుట్టిన తరువాత, మోహం తీరిన అతడు ఆమె దగ్గరకు రాకపోగా ఆతని మొదటి భార్య బంధువులు వచ్చి ఆమెను హింసించేసరికి చనిపోతుంది. ఆ హింసను చూసిన చిన్నపిల్లయైన నీల భయపడి స్కూల్ వెనక దాక్కోవటం, అదే సమయంలో పెళ్ళి చేసుకుంటానని తనని నమ్మించి రహస్య లైంగిక సంబంధాలతో ఉండి పెళ్ళిచేసుకోని వ్యక్తి వల్ల మోసపోయిన సుజాత ఆమెను చూసి కాపాడి, పెంచి పెద్దచేయటం జరిగింది. అంటే పెద్దల సమక్షంలో జరిగిన పెళ్ళి బాగుంటుందనీ, రహస్య సంబంధాల పెళ్ళి విషాదాంతమని రచయిత అభిప్రాయంగా అర్థమౌతుంది. ప్రేమ అనేది హృదయం లోతుల్లోంచి రావాలనీ, అదే గొప్పదైతే భౌతిక అవసరాలకు, స్వార్థానికీ లొంగదని భావిస్తుంది.

స.వెం.రమేశ్ రాసిన పాంచాలమ్మ పాట (విశాలాక్షి – అక్టోబరు, 2014) భారతకథను ప్రతిబింబిస్తూ స్త్రీ, పురుషులు తమ మనసుకు నచ్చిన వ్యక్తిని ఇష్టపడినప్పటికీ, సామాజిక ధర్మం బట్టే లైంగిక సంబంధాలు ఉంటాయనీ, ఆర్థిక రాజకీయవిషయాలనుబట్టి ఆ సామాజిక ధర్మం ఉంటుందనీ, అక్కడ ప్రేమ, మనసుకు చోటు ఉండే అవకాశం లేదనీ భారతకాలం నుండి స్త్రీపురుష లైంగిక సంబంధాల విషయంలో వైరుధ్యం ఉంటూనే ఉందనీ తెలియజేయటం జరిగింది.

పాలగిరి విశ్వప్రసాద్ రాసిన ఆకులు రాలిన కాలం (కథాసంచిక–2014) అనే కథలో సవితితల్లి ఆరళ్ళు పడలేక కల్పన తమ్ముడి స్నేహితుడిగా ఇంటికి వచ్చిన మహేష్ ను పెళ్ళిచేసుకుంది. కొన్నాళ్ళ తరువాత అతడు వేరే అమ్మాయిని పెళ్ళిచేసుకొని ఇంటికి రావటం మానేస్తాడు. కూతురికి జబ్బుచేస్తే మందులకు డబ్బు లేకపోయేసరికి ఎదిరింటి ప్రసాద్ మందులు తెచ్చి తన శరీరాన్ని కోరుకుంటాడు. అలా కొన్నాళ్ళు ఉన్న తరువాత కూతురిని హాస్టల్‌లో వేసింది. కాని కూతురు ఒకరోజు తన రహస్య సంబంధాన్ని చూసి పోలీసులకు చెప్పటం, వాళ్ళొచ్చి దండించటం జరిగింది. తానక్కడ ఉండలేక ఇల్లు మారాలనుకున్నప్పుడు డబ్బులు సాయంచేసే నెపంతో నారాయణ అనే మరోవ్యక్తి తన శరీరాన్ని కోరుకుంటాడు. చివరికి నారాయణ కూడా డబ్బులు ఇవ్వకపోయేసరిగి అతడినీ దూరంపెట్టింది. కొన్నాళ్ళకు ఆమె రాజకీయాలలో చేరుతుంది. ఆ క్రమంలో పరిచయమైన రెవిన్యూ ఆఫీసర్ శివారెడ్డి దగ్గర ఆమెకు నిజమైన ప్రేమ దొరుకుతుంది. తన కూతురికి తండ్రిస్థానంలో

ఉండి కన్యాదానం కూడా చేసాడు. ఆర్థికలోటు ఉన్నన్నాళ్ళు ఆమె లైంగికంగా దోపిడీకి గురయిందని, వాటిలో ప్రేమ సంబంధాలకు ఆస్కారం ఉండదనీ అర్థమవుతుంది.

పెద్దిభొట్ల సీతారామయ్య రాసిన చుక్కమ్మ కథ (కథాసంపుటి–2015) లో కట్టుకొన్న భర్త మరొక అమ్మాయిని మరిగి వెళ్ళిపోగా చుక్కమ్మ టీ కొట్టును పెట్టుకొని జీవనం సాగిస్తూ ఒంటరిగా పిల్లను పెంచుతుంది. అతడొచ్చి డబ్బును తీసుకొని వెడతాడు. తరువాత ఆమె రెండవ పెళ్ళిచేసుకొంది. అయితే అతను కూడా ఈమె దగ్గర డబ్బును తీసుకొని తాగి తందనాలాడుతూ పరారవుతాడు. రెండుసార్లు ఆమె పెళ్ళి రూపంలో ఆర్థిక దోపిడీకి గురి అవుతుంది. మళ్ళీ మొదటి భర్త వచ్చి కాళ్ళావేళ్ళా పడి ఉంటానంటే ఆమె ఒప్పుకోక తరిమేస్తుంది. అలాగే మోసం చేసిన రెండవ భర్త వచ్చినా టీ నీళ్ళుపోస్తుంది కాని అతడు ఉంటానంటే ఒప్పుకోదు. అతడు ఆమె శీలాన్ని శంకించి మాట్లాడినందుకు వెంటబడి తరిమేస్తుంది. పెళ్ళిలో మగవాడికి స్త్రీ పై నియంతృత్వం తప్ప మరేమి ఉండదనీ, పైపెచ్చు ఆమె శీలాన్ని కూడా శంకించేతత్వం ఉంటుందనీ, అటువంటి మగవాళ్ళ విషయంలో మానవత్వం చూపించవచ్చుగాని, నమ్మి రానీయకూడదనీ, అతనితో కుటుంబ సంబంధాలకు దూరమవ్వటమే మేలు అనే భావన వ్యక్తమైంది.

కాశీనాథుని సువర్చలాదేవి రాసిన ప్రేమంటే భయం ఎందుకు (కథాసంపుటి–2017) అనే కథలో భర్త తన మనసుకు నచ్చేటట్లుగా ప్రేమను చూపించడు. కాని ఇంటికి వచ్చిన భర్త స్నేహితుడు తన మనసుకు నచ్చినట్లుగా ప్రేమగా ఉంటాడు. కాని అతను తనని స్పృశించినప్పుడు తప్పుగా అనిపిస్తుంది. ఇద్దరూ ఆ స్పర్శలను తమ బలహీనతలను జయించే పరీక్షగా భావిస్తారు. ఎప్పటివలె స్నేహితులుగా ఉండాలనుకొంటారు. ఆమె కోరుకొన్న ప్రేమ, లాలిత్యాన్ని ఆమెకు అందించమని ఆమె భర్తకు ఆ స్నేహితుడు చెప్పటం ఆతడు భార్య మనసును తెలుసుకోవటం జరిగింది.

పితృస్వామ్యంలో పెళ్ళిద్వారా ఏర్పడిన కుటుంబంలోని స్త్రీపురుష లైంగిక సంబంధాలలో అసమనైతిక సంస్కృతి స్త్రీలను బానిసలుగా చేసినప్పుడు అధికార సంబంధమే తప్ప మానవ సహజమైన ప్రేమ, లాలిత్యం, సున్నితత్వం, కొరవడినప్పుడు స్త్రీ తాను శారీరకహింసకు గురి అవుతున్నట్టు భావించింది. దానినుండి ఆమె స్వేచ్ఛను కోరుకోవటం వల్లనే పెళ్ళిలేని సహజీవన సంబంధాలు బాగుంటాయనే ప్రయోగాలు జరిగాయి. అయితే పెళ్ళిలోనైనా, సహజీవన సంబంధాలలోనైనా, పితృస్వామ్య సంస్కృతి చాపకింద నీరులా ఉంటే అవి సత్ఫలితాలను ఇవ్వకపోగా వివాహేతర సంబంధాలుగా పరిణమించటం వర్తమాన సామాజిక చరిత్రయే సాక్ష్యం. పెళ్ళిలో గాని, సహజీవనంలో గాని ఆర్థిక, రాజకీయ ప్రభావిత లైంగిక సంబంధాలు ఉంటే ప్రేమ, నమ్మకం.

పరస్పర గౌరవం, మానసికస్వేచ్ఛ, స్నేహం కొరవడినప్పుడు ఏ రాయి అయినా ఒకటే అన్న భావన రాకతప్పదు.

కుటుంబాలలో స్త్రీపురుష సంబంధాలు యాంత్రికం కాదనీ, స్నేహంగల ప్రేమపూరక లైంగికసంబంధాలు అనే స్పృహను ఏర్పరచుకోవాల్సిన అవసరాన్ని సాహిత్యం నిరూపించింది. పితృస్వామ్య లక్షణంగా స్త్రీ తన సొంతమనీ, ఆమె మనస్సుమీద, శరీరంమీద తనకే హక్కు ఉంటుందని అనుకున్నచోట ప్రేమసంబంధాలకు ఆస్కారం ఉండదు. గత పాతికేళ్ళుగా లైంగిక సంబంధాలలో స్త్రీలు తమకేమి కావాలో ఆలోచించుకోవటం, తమ వ్యక్తిత్వాలను గౌరవించనప్పుడు స్త్రీల లోపల స్వేచ్ఛాభావన దానంతటఅదే పుట్టుకొస్తుందనీ, ఆ స్వేచ్ఛకోసం వారు అన్వేషణ చేస్తారనీ, అందులో కూడా మోసాన్ని తెలుసుకోగలిగి స్త్రీపురుష సంబంధాలలోని ఆర్థిక – రాజకీయాలను అర్థం చేసుకోవాలనే స్పృహ కలగటంతో, జరుగుతున్న పరిణామాలకు సమాజంలోని లైంగిక సంబంధాలలోని అమానుషత్వమే నిదర్శనం. కాబట్టి రాబోయే పాతికేళ్ళలో వివాహాలలో గాని, సహజీవన సంస్కృతిలో గాని ఆర్థిక, రాజకీయాల పరిణామాల ప్రభావితమైన స్త్రీపురుష లైంగిక సంబంధాలలో మౌలికమైన పితృస్వామ్యసంస్కృతీరహిత మానవత్వంతో స్నేహపూరక మనసులకు ప్రాధాన్యతనిస్తే అవి ప్రేమసంబంధాలుగా శాశ్వతత్వాన్ని పొందుతాయి. అప్పుడే కాలానుగుణ చలనసూత్రాల ప్రభావితమైన స్త్రీపురుష సంబంధాలు పరిణామశీలతను సంతరించుకుంటున్నాయి. సమాజంలో స్త్రీపురుష సంబంధాలు ఏ రూపంలో ఉన్నా పటిష్ఠంగా ఉంటాయి.

.

6. తెలుగుసాంఘికనాటకాలు - స్త్రీవాదచైతన్యం

భారతదేశ రాజ్యాంగం స్త్రీపురుషులకు సమానన్యాయం, భావస్వేచ్ఛ, భావప్రకటన, క్రియాస్వేచ్ఛవంటి ప్రాథమిక హక్కులను ఇచ్చింది. కాని అవి పురుషులకువలె స్త్రీలకు ఆచరణలో ఉందా లేదా అనేది ప్రశ్నార్థకం. అన్వేషణలో లింగవివక్ష కారకాంశం అని తేలింది. లింగవివక్షను ఎందుకు రూపుమాపలేకపోతున్నారు. అసలు ఈ లింగవివక్ష యొక్క పుట్టుపూర్వోత్తరాలను గురించిన జిజ్ఞాస తప్పనిసరి. పరిశీలనకై సామాజిక చరిత్రను తవ్వితీరాల్సిందే. కాలానుగుణ సమాజాన్ని తెలుసుకోవటానికి, ఆయాసామాజిక జీవితాల్ని ప్రతిఫలించిన సాహిత్యం ప్రధాన ఆధారం. సమాజంలో ఏవైనా అలజడులు కలిగినప్పుడు ఆయా సమస్యల పరిష్కారానికై రచయితలు తమ సృజనాత్మక రచనల ద్వారా సమాజాన్ని చైతన్యపరిచే ప్రయత్నం చేస్తుంటారు. మరింతగా వెంటనే స్పందించటానికి వీలైన సాహిత్యప్రక్రియను చేపట్టి రచనలు చేస్తారు. ఆ విధంగా పుట్టుకొచ్చిన సాహిత్య ప్రక్రియ నాటకం. సమస్యను దృశ్యమానం చేసినప్పుడు అది హృదయపు లోతుల్లోకి చేరుకొని ఆలోచింపచేస్తుంది. నాటకాలు సద్యఃక్రియాన్వితం కాబట్టి ఆ ఆలోచన స్థాయిలో స్పృహ కలిగి, ప్రేరణాంశక చైతన్యానికి బీజం వేస్తుంది. కాలక్రమేణ అది సామూహికత్వాన్ని పొంది, క్రియాశీలకతను సంతరించుకొని ఉద్యమస్థాయికి చేరుకుంటుంది. ఇది సామాజిక సమస్యలపట్ల ప్రకంపనలను సృష్టించినప్పుడు ఆ సమస్యలకు పరిష్కారమార్గం దొరుకుతుంది. స్త్రీల వైవాహిక సమస్యలపట్ల అటువంటి ప్రయత్నం నాటకాలు ప్రతిఫలింపచేసాయేమో తెలుసుకోవటానికి తెలుగునాటక చరిత్రను పరిశీలన చేయాలి.

తెలుగు నాటకం ఆధునికయుగంలో వచ్చిన ప్రక్రియ అంటారు. సంస్కృతనాటకప్రక్రియ అప్పటికే ఉంది కాని ఆంగ్లప్రభావంతో మాత్రమే తెలుగులో వచ్చాయి అనే అభిప్రాయం గట్టిగా ఉంది. తెలుగులో పద్యనాటకం 19 వ శతాబ్దపు ప్రారంభంనాటికే ఉన్నట్టు తెలుగుసాహిత్యనాటక చరిత్రలో ఆనవాళ్ళు ఉన్నాయి. అంటే ప్రాచీనయుగ సాహిత్యంలో పద్యనాటకాలరూపంలోనే స్త్రీల వైవాహిక సమస్యలపట్ల స్పృహకలగటం అంకురప్రాయంగా కనపడుతుంది. రంగాజమ్మ 'మన్నారుదాస విలాసము' అనే పద్యనాటకాన్ని రాసినట్లున్నా అది అలభ్యం. కాని క్రీ.శ.1840 వరకు జీవించిందని

చెప్పబడుతున్న తరిగొండ వెంకమాంబ రాసిన 'శివనాటకం', 'రమానాటకం', 'చెంచునాటకం' అనే పద్యనాటికలు ఉన్నాయి. ఈ నాటకాలలో రెండు పురాణపాత్రలున్నా సామాజిక కుటుంబ సమస్యలనే ప్రతిబింబించాయి. చెంచునాటకం ఆదివాసి గిరిజనజీవనాన్ని ప్రతిఫలించిన సాంఘిక పద్యనాటకం. ఈ మూడునాటకాలు కుటుంబ స్త్రీల వైవాహిక సమస్యను ముందుకు తీసుకొచ్చినవే. శివనాటకం, రమా నాటకంలోను పురుషుని బహుభార్యాత్వం అనే అసమనైతిక వివాహసంస్కృతివల్ల స్త్రీలు బాధితులుగా సవతులు ఒకరినొకరు కయ్యానికి దిగితే భర్త రాజకీయంగా తన తప్పులేనట్లుగా ప్రవర్తించటం, ఆధ్యాత్మిక హితబోధతో వారిని ఉపశమింపచేయటం కనపడుతుంది. అయితే దానికి కారణం పితృస్వామ్యపు సామాజికసంస్కృతి అనీ, దానిపట్ల ఎటువంటి చైతన్యం తెచ్చుకోవాలో గ్రహింపుకు రాని స్థితి వారిది. తరిగొండ వెంగమాంబ రాసిన చెంచునాటకంలో కుటుంబం నిర్దేశించిన పనివిభజన తారుమారై, ఈ చెంచుస్త్రీ ఆహారసేకరణకై వేటకు వెళ్ళటం, అతడ్ని ఇంట్లో శిశు సంరక్షణచేయమన్నా పట్టించుకోకపోవటంతో ఆ పిల్లవాడు కనపడకపోయేసరికి పులిబారిన పిల్లవాడు పడ్డాడేమో అని ఆమె మాతృత్వం బాధకుగురికావటం, చివరకు దైవం కాపాడినట్లు ఉంటుంది. కాని ఇక్కడ పిల్లలపెంపకంతో పాటు స్త్రీ ఆహారసేకరణకూడా చేయగలుగుతుంది కాని పురుషుడు శిశుపోషణ చేయలేకపోయాడని అర్థం అవుతుంది. అది ఒకరకంగా స్త్రీలు చేసే ఇంటిపనికి ఉన్న విలువను గ్రహించేస్పృహ కలుగటమే. ఈ మూడుపద్యనాటకాలు స్త్రీలు ఎదుర్కొన్న వైవాహిక సమస్యలను ప్రతిఫలించినవే.

ఆధునికయుగ తెలుగు సాంఘికనాటకాలలోని సామాజిక ప్రతిఫలనంలో స్త్రీలు ఎదుర్కొన్న వైవాహికసమస్యలు ఎటువంటివి, దాని పట్ల సామాజిక స్పృహ ఎలా ఉంది, ఆ సమస్యలు పరిష్కరింపబడ్డాయా, లేదా, ఇంకా కొనసాగుతున్నాయా అనేది ఆలోచించాల్సిన అవసరం ఏర్పడింది. ఎందుకంటే ప్రస్తుత సమాజంలో కుటుంబ వ్యతిరేక ధోరణి ప్రబలుతున్న రోజులివి. సమాజంయొక్క స్థిరత్వం కుటుంబస్థితిని బట్టి ఉంటుంది. ఆ స్థిరత్వం స్త్రీపురుషసమానత్వమనే అంశంపై ఆధారపడి ఉంటుంది. మానవజాతి అభివృద్ధికై స్త్రీపురుష లైంగికసంబంధాల నిలయంగా చారిత్రక కుటుంబం ఏర్పడింది. అందుకే సమాజంలో సంతానోత్పత్తిశక్తికి, దానికి మూలాధారమైన స్త్రీలలైంగికత ప్రధానమై దానిని పెళ్ళితంతుతో ముడిపెట్టటం కుటుంబసంస్కృతి అయింది. పెళ్ళి అనేది స్త్రీలకు వైవాహికసమస్యలను సృష్టించింది. కాబట్టి స్త్రీలవైవాహిక సమస్యలను నిర్మూలనం చేయనిదే కుటుంబసంస్కృతికి రక్షణ ఉండదు. అందుకే కుటుంబసంరక్షణ అనేది ఒక చారిత్రక అవసరంగా పరిణమించిందని గుర్తించాలి. అటువంటి సమస్యపట్ల చైతన్యం కలిగించే ప్రయత్నం చేసిన

నాటకాలను కాలానుగుణంగా సామాజికవ్యవస్థల పరిణామాలక్రమంలో అవగాహనచేసుకోగలిగితేనే ఆ సమస్యల స్వరూపస్వభావాలు గ్రహింపుకు వస్తాయి. దానివల్ల స్త్రీలసమస్యకున్న మూలాలు అర్థం కాగలుగుతాయి. అప్పుడే స్త్రీల వైవాహికసమస్యల పరిష్కారానికి ఆస్కారం ఏర్పడుతుంది. అందుకు అందుబాటులో ఉన్న తెలుగు సాంఘికనాటకాల పరిశీలన అవసరమైంది.

స్త్రీలవైవాహిక సమస్యలను అర్థంచేసుకోవటానికి స్త్రీవాదాన్ని ఒక సాంఘికకొలమానంగా తీసుకోవాలి. ఎందుకంటే చేకూరి రామారావుగారు చెప్పినట్లుగా "స్త్రీవాదం ఒక ప్రపంచదృక్పథం, సామాజికసిద్ధాంతం, పరిశోధనాపరికరం". నిజానికి స్త్రీవాదం స్త్రీలవైవాహిక సమస్యల మూలాల్లోనించే పుట్టుకొచ్చింది. ఆధునికయుగంలో స్త్రీవాద సిద్ధాంతం వెలుగులోకి వచ్చినా, స్త్రీలజీవితాలలో వివాహం సమస్యలను సృష్టించినప్పటినుంటి స్త్రీవాదచైతన్యం అవసరమైంది. అసలు స్త్రీవాదం అంటే ఏమిటి అని తెలుసుకోవాలి. ఆడపిల్లగా పుట్టటం, పెరగటం. పెళ్ళి, ఇంటిపని, మాతృత్వం వంటి స్త్రీల జీవనవ్యవస్థలచుట్టూ అభివృద్ధిచెందిన పితృస్వామ్యపు సామాజికసాంస్కృతిక భావాలు స్త్రీలకు సమస్యలను కలగచేసినప్పుడు వాటిని అధిగమించటానికి తెచ్చుకొనే చైతన్యమే స్త్రీవాదచైతన్యం. అందుకే స్త్రీవాదంయొక్క బలం దాని సాంఘికవిశ్లేషణపై, విమర్శపైనా ఆధారపడి ఉంటుంది. స్త్రీలజీవితాలలో సమస్యలు ఎందుకు ఎప్పుడు సృష్టింపబడ్డాయి అనే సాలోచన చేసినప్పుడు స్త్రీల లైంగికతపై ఉన్న అదుపు ప్రధానవిషయంగా ఉన్న సామాజిక కుటుంబసంస్కృతి అని స్పష్టమైంది. స్త్రీపురుషుల లైంగికసంబంధాలకు నిలయం కుటుంబం. కుటుంబంలో స్త్రీల లైంగికతను అదుపుచేయాల్సిన అవసరం ఎందుకు ఏర్పడిందని తెలుసుకోవటానికై మానవ సామాజికచరిత్రలోకి తొంగిచూడాలి.

మానవ సామాజికచరిత్రలో ఆదిమమానవుల ఆహారసేకరణ సమయంలో స్త్రీపురుషులమధ్య గుంపుసంబంధాలు ఏర్పడటంతో ప్రకృతిగత స్వేచ్ఛాయుత స్త్రీపురుష లైంగికసంబంధాలు ఉండేవి. స్త్రీ నిండు గర్భిణిగా ఉన్నప్పుడు, శిశుపోషణ విషయంలోను, వేటాడి ఆహార సంపాదన చేయలేనిస్థితిలో ఉన్నప్పుడు, ఆమె ఏ పురుషునితో జతకూడి ఉంటే ఆ పురుషుడు ఆహారాన్ని తెచ్చి యిచ్చేవాడు. గర్భిణిగా ఉన్న ఆమె తనవాసస్థానంలో వ్యవసాయానికి బీజం వేసింది. అయితే మానవనాగరికత యొక్క పరిణామక్రమంలో, క్షేత్రంలో విత్తనం మొలకెత్తటాన్ని గమనించిన పురుషునికి, స్త్రీ సంతానోత్పత్తిలో తన భాగస్వామ్యం ఉందని గ్రహింపు కలిగింది. క్రమంగా వ్యవసాయనాగరికత అభివృద్ధిచెందుతున్నప్పుడు సంపదలపై పురుషుడు స్వామ్యం ఏర్పరచుకొనే దశలో దాని సంరక్షణకై తనకు వారసులు ఉండాలనుకోవటం జరిగింది. ఆ వారసుల విషయంలో ఖచ్చితత్వంకోసం, శిశు

పోషణకోసం స్త్రీని శాశ్వతంగా తనదగ్గరే ఉంచుకోవటానికై యిష్టమైనవ్యక్తితో వెళ్ళిపోయి జతకూడే స్త్రీయొక్క మునుపటి స్వేచ్ఛను ఆమెకు లేకుండా చేయాలనుకొన్నాడు. ఆ క్రమంలోనే ఆహారసంపాదనాశక్తి, మరియ సంతానోత్పత్తిశక్తి అనే రెండుశక్తులుగల స్త్రీ తనకంటే మిన్నగా అనిపించి, ఆమెకున్న రెండుశక్తులలో తనకు అవకాశం లేని పునరుత్పత్తిశక్తికి మాత్రం స్త్రీని పరిమితంచేసి ఆమె స్వేచ్ఛను అరికట్టగలిగితేనే ఆ తల్లిపిల్లలు తనదగ్గర ఉండగలరని భావించాడు. అందుకే స్త్రీ తన యిష్టానుసారం వెళ్ళిపోయే స్వేచ్ఛను ఆమెకు లేకుండా కట్టడి చేయాలనుకొనే క్రమంలోనే వివాహపుతంతుతో కుటుంబనిర్మాణం జరిగింది. అందుకే భూస్వామ్యవ్యవస్థగల సమాజంలో సూక్ష్మాంశమైన కుటుంబనిర్మాణపు పునాదులలోనే స్త్రీల లైంగికత ప్రధానవిషయమైంది. స్త్రీలలైంగికతపై అదుపుకోసమే పితృస్వామ్యకుటుంబనిర్మాణం జరిగిందనేది సామాజికశాస్త్ర విశ్లేషకులు అంగీకరించే విషయం. మౌలికమైన ఆర్థిక–రాజకీయ విషయాల పునాదులపై పితృస్వామ్యకుటుంబ సంస్కృతి ఏర్పడిందనేది తేటతెల్లమైన విషయం. ఆ సంస్కృతి స్త్రీలస్వేచ్ఛను అరికట్టటానికే ఏర్పడిందనేది నిర్వివాదాంశం. కాబట్టి కుటుంబం ఏర్పడిన నాటినుంచే స్త్రీలకు శారీరక, మానసిక స్వేచ్ఛలేకుండా ఆమె లైంగికతపై అదుపు చేయటానికిని, ఆమె తనకేసొంతం అని సమాజానికి తెలియజేయటానికి వివాహపుతంతు ఉనికిలోకి వచ్చింది. లైంగిక అదుపు వివాహవ్యవస్థలో ప్రధానమైన విషయం అయింది. దానికోసమే స్త్రీకి పాతివ్రత్యనియమం వివాహసంస్కృతిలో భాగమైంది. దాన్ని సజావుగా నిర్వహించటానికి స్త్రీని నిరంతరం అనుమానిస్తూ ఆమె లైంగికతను అదుపుచేయటం పరిపాటి అయింది. దానికై స్త్రీలకు సామాజిక ఉత్పత్తిసంబంధాలు లేకుండాచేసే సంస్కృతి అభివృద్ధిచెందింది.

భూస్వామ్య రాజరికపువ్యవస్థ రాజుకు ఆ రాజ్యంమీద అధికారాన్నిచ్చినట్లే, కుటుంబంలో స్త్రీమీద పురుషుడికి, అంటే భార్యమీద అధికారం భర్తకు వచ్చింది. ఇదే కుటుంబంలో ఏర్పడిన అధికారవ్యవస్థ. ఈ అధికారం సజావుగా సాగాలంటే మరొకరిపై అదుపు ఉండాలి. ఆ రకంగా పురుషుడి అధికారవ్యవస్థగాఉన్న కుటుంబంలో స్త్రీ అణచివేతకు గురిఅయింది. అందుకే ఇదొక రాజకీయ – ఆర్థికసంస్కృతి. రాజు శత్రువులబారినుండి తన అధీనంలో ఉన్న రాజ్యాన్ని కాపాడుకున్నట్లే కుటుంబంలో భర్త తన అధీనంలో ఉన్న భార్యను, భార్యలైంగికతను కాపాడుకొనే క్రమంలో పరపురుషదర్శనం పాతివ్రత్యనియమానికి భంగకరం అనే సంప్రదాయాన్ని ఆచరణలో పెట్టాడు. అందుకే ఈ అధికార రాజకీయసంస్కృతి స్త్రీల లైంగికతపై అదుపును మరింతగా పెంచింది. చారిత్రక క్రమంలో ఈ అదుపు అనేకరూపాలను సంతరించుకుంటుంది. స్త్రీకి స్వేచ్ఛలేకుండాచేసిన వివాహంవల్ల కుటుంబస్త్రీలకు సమస్యలు ఏర్పడటం సహజ పరిణామం. అంతేకాదు, అధికారవ్యవస్థలో పురుషుడు

గుంపుసంబంధాల కంపువదలలేక వేశ్యావ్యస్థను, బహుభార్యాత్వపు సంస్కృతిని ఆచరణలో పెట్టుకోగలిగాడు. దీనితో కుటుంబంలో అసమాననైతికసంస్కృతి చోటుచేసుకుంది.

ఆధునికయుగంలోని పారిశ్రమీకరణంవల్ల భారతదేశంలో పెట్టుబడిదారివ్యవస్థ ఏర్పడింది. అయితే పూర్వపు భూస్వామ్యవ్యవస్థ, పెట్టుబడిదారీవ్యవస్థ సమాంతరంగా కొనసాగటంవల్ల పితృస్వామ్యసంస్కృతి ఆచరణలో కొనసాగింది. అయితే పెట్టుబడిదారివ్యవస్థలోని యాంత్రికతవల్ల పురుషులు, కార్మికులుగాను, ఉద్యోగస్థులుగాను తయారుకాబడ్డారు. వ్యవసాయనాగరికతోబాటు, పారిశ్రామికనాగరికతవల్ల పురుషులకు పనిప్రదేశంలో గడిపే సమయం అధికమవటంతో, కుటుంబనిర్వహణకై స్త్రీలకు సమాజసంబంధాలు అనివార్యమయ్యాయి. దానికోసం స్త్రీలు విద్యావంతులు కావలసిన అవసరం ఏర్పడింది. అందుకే ఉత్పత్తిసంబంధాలు మార్పుకు గురియైనప్పుడల్లా ఈ కుటుంబసంస్కృతిలో మార్పు అనివార్యం అవుతుంది. అప్పటివరకు స్త్రీలకు గృహబానిసత్వం, మాతృత్వం, పాతివ్రత్యాన్ని పాటించటమే తెలుసు. స్త్రీలచదువు వారిదృష్టిని సమాజం, ప్రపంచంవేపు మళ్ళించగలిగింది. స్త్రీలజీవితాలలో ఇదొక చారిత్రాత్మక మలుపు. సామాజిక పరిజ్ఞానం పెరిగి స్త్రీలు తమ ఉనికికి ఉన్నవిలువలను గ్రహించుకోగలిగారు. కాని అదే పెట్టుబడిదారివ్యవస్థలో పెళ్ళి అనే దానిని కూడా వ్యాపారంకింద భావించారు. భూస్వామ్యవ్యవస్థలో కుటుంబనిర్మాణంలో లైంగిక అదుపు ప్రధానం కాబట్టి రజస్వలకాకమునుపే అంటే ఎనిమిదేళ్ళకే ఆడపిల్లకు పెళ్ళిచేసేవారు. భూస్వాములు ఆడపిల్లలకు వివాహసమయంలో పసుపుకుంకాలకింద కొంత భూమిని ఇచ్చేవారు. కాని వ్యాపారనాగరికత అభివృద్ధిచెందినక్రమంలో అసమాన నైతిక కుటుంబసంస్కృతి, స్త్రీల లైంగికతపై ఉండే అదుపు కలిసి వెరసి వివాహాలలో కన్యాశుల్కసంస్కృతికి బీజంవేసింది. తండ్రులు కన్యాశుల్కపు కాసులకు ఆశపడి, ఆవిడ మరణాంతం ఎన్నిపెళ్ళిళ్ళు అయినా చేసుకొనే వెసులుబాటు ఉన్న ముసలివాడికి పసిగుడ్డుగా ఉన్న ఆడపిల్లను యిచ్చి పెళ్ళిచేయటం సామాజికసంస్కృతిగా మారింది. అదే బాల్యవివాహపు సంస్కృతి.

రాజకీయ – ఆర్థికవ్యవస్థలో మార్పు చోటుచేసుకొన్నప్పుడల్లా పితృస్వామ్య సమాజంలోని స్త్రీలజీవనసంస్కృతిలో మార్పు అనివార్యం అయింది. అంటే స్త్రీల పుట్టుక, చదువు, వివాహం, మాతృత్వం, ముసలితనం వంటి ప్రతిజీవన వ్యవస్థలోను స్త్రీలు సమస్యలకు లోనవటం, అందులోను ముఖ్యంగా స్త్రీల లైంగికతపై అదుపురూపంలో వచ్చిన వివాహంలోను స్త్రీలు సమస్యలకు ఎదుర్కోవాల్సి వచ్చింది. స్త్రీలలైంగికతపై అదుపే దానికి ప్రధానకారణం. ఆ అదుపుకై స్త్రీని నిరంతరం అనుమానించటం, నిఘాపెట్టటం పితృస్వామ్యసంస్కృతిలో భాగమైంది. ఆ అదుపు సమాజంలో

అలజడులను సృష్టించినప్పుడు రచయితలు ముందుకు వచ్చి ఆ అలజడులకు పరిష్కారమార్గాలను సూచించాలనుకునే క్రమంలోనే సాహిత్యసృజన జరుగుతుంది. అయితే నిరక్షరాస్యత ఎక్కువగా ఉన్న సమాజంలో సమస్యలపట్ల ఆలోచనలను కలిగించటానికి రచయితలు దృశ్యమానకళయైన నాటక రచనకు ప్రాధాన్యతను ఇవ్వటం జరుగుతుంది. అందుకే ఆధునిక నాటక రచయితలు ఆ బాధ్యతలను వహించారు. ఆ క్రమంలోనే ఆడపిల్లల బాల్యవివాహసంస్కృతివల్ల వితంతుస్త్రీల పెరుగుదల, వారిపై ఆచరణలో ఉన్న లైంగికఅదుపు ఫలితంగా మానవోత్పత్తిశక్తి నిర్వీర్యంకావటం సహజంగానే అలజడులను కలగజేస్తుంది. ఇది స్త్రీలలైంగికతకు, మాతృత్వానికి సంబంధించిన విషయంకాబట్టి రచయితలు తమ ఆలోచనలకు పదునుపెట్టారు. ఆ క్రమంలో రచయితలకు వచ్చిన చైతన్యమే స్త్రీవాదచైతన్యానికి పాదులు వేసింది. అందుకే స్త్రీవాద చైతన్యంలో స్త్రీల లైంగికత, మాతృత్వం, స్త్రీలకు శారీరక, మానసిక స్వేచ్ఛను అరికట్టిన పితృస్వామ్యకుటుంబసంస్కృతి అనేవి ముఖ్యవిషయాలయ్యాయి. ఇవే స్త్రీలకు వైవాహికసమస్యలుగా పరిణమించాయి కాబట్టి ఈ విషయాలపట్ల అవగాహన ఏర్పరచుకోవటానికి సాహిత్యంలో ప్రతిఫలించిన స్త్రీవాదచైతన్యం ప్రధానసాధనం. ఎందుకంటే స్త్రీలలైంగికతపైగల అదుపును, మాతృత్వాన్ని, లింగవివక్షను, పితృస్వామ్యంలో కుటుంబసంస్కృతిగా ఉన్న అధికారవ్యవస్థను ప్రశ్నకుపెట్టింది స్త్రీవాదచైతన్యమే కాబట్టి. ప్రస్తుతాంశంగా తెలుగు నాటకాలలో ప్రతిఫలించిన స్త్రీల వైవాహిక సమస్యలను స్త్రీవాదచైతన్యాన్ని పరికరంగా చేసుకొని పరిశీలించినప్పుడే స్త్రీలసమస్యలకు పరిష్కారమార్గం లభిస్తుంది. అప్పుడే ప్రజాస్వామ్యంలో స్త్రీలు పురుషులతో సమానులు కాగలుగుతారు.

స్త్రీలసమస్యలను సహానుభూతితో అర్థంచేసుకొనేప్రయత్నంలో నాటక రచన సాగినప్పుడు ఈ స్త్రీవాదచైతన్యానికి ఉనికి ఉంటుంది. ప్రజాస్వామ్యపు ఆలోచనలప్రేరణతో మొదలైన స్వాతంత్ర్యోద్యమ సమయంలో స్త్రీలు, పురుషులు కలిసి పాల్గొనాల్సిన సమయంలో స్త్రీలసామజికసంబంధాలకు ప్రాధాన్యత పెరిగింది. స్త్రీల సామజికసంస్కృతి ఆటంకవిషయంగా గుర్తించే క్రమంలోనే ఆడపిల్లల బాల్యవివాహసంస్కృతి, స్త్రీలవితంతుసంస్కృతి సమాజంలో స్త్రీలను ఎదగనీయకుండా చేస్తోందనే స్పృహకలగటమే స్త్రీవాదచైతన్యానికి మూలాలు ఏర్పడ్డాయి. పురుషులలోగాని, స్త్రీలలోగాని స్త్రీలసమస్యపట్ల స్పృహకలగటం, అది ఆలోచనలనుపెంచి స్పందింపచేసినప్పుడు కలిగేదే స్త్రీవాదచైతన్యం. అయితే ఇది వ్యక్తిగతంగా ఉన్నప్పటికీ, ప్రదర్శనకళగా రూపాన్ని సంతరించుకొంటే అది సామూహికప్రయోజనాన్ని పొందుతుంది. సామూహికత్వ ప్రయోజనంగా స్థిరపడాలంటే ఈ స్త్రీవాదచైతన్యం క్రియాశీలతను సంతరించుకొనే ప్రచార

పరిణామశీలతను పొందాలి. అందుకే నాటకరచనలలో ఈ స్త్రీవాదచైతన్యమే స్త్రీలసమస్యలకు దారులను వేయగలిగింది. అందుకే స్త్రీవాదచైతన్యంయొక్క బలం దాని సాంఘికవిశ్లేషణపై ఆధారపడి ఉంటుంది. స్త్రీల సమస్యలకు వివాహమే ముఖ్యసమస్యగా పరిణమించటంతో ఆ సమస్యలను చిత్రీకరించిన రచనలను స్త్రీవాదచైతన్యదృక్కోణం నుండి పరిశీలించగలిగితే స్త్రీలవైవాహికసమస్యల నిర్మూలనానికి అవకాశం ఏర్పడుతుంది. ఆ దృష్టితోనే బాల్యవివాహసంస్కృతిని చిత్రీకరించిన కందుకూరి వీరేశలింగంగారి 'బ్రాహ్మవివాహం' అనే నాటకరచన క్రీ.శ.1878లో వచ్చింది. అయితే ఇందులోని వివాహం కన్యాశుల్కం తీసుకొనే ఆర్థికప్రయోజనానికే ప్రాధాన్యత ఉండటంతో స్త్రీలవైవాహికజీవితంపట్ల చైతన్యంగా కాకుండా ఆస్తిపాస్తుల తగాదాలుగా మాత్రమే కనపడుతుంది. ఆర్థిక–రాజకీయంగా స్త్రీలలైంగికతపై అదుపుగా ఏర్పడిన కుటుంబసంస్కృతిలో వివాహపుతంతుకు ఎంతటిప్రాముఖ్యత ఉందో, ఆర్థిక లావాదేవీలకు కూడా అంతటి ప్రాముఖ్యతను ఇచ్చిన విషయం ఈ బ్రాహ్మవివాహమనే నాటకంలో స్పష్టంచేసింది. కుటుంబంలో అధికారవ్యవస్థలో తండ్రి ఉండటంతోపాటు ఆర్థికవిషయంకూడా చోటుచేసుకొని స్త్రీజాతిని ఎదగనీయకుండా చేసిందనే ఆలోచనను రేకెత్తించగల నాటకం ఇది.

బాల్యవివాహసంస్కృతి ఫలితంగా ఏర్పడిన అసమవయోవివాహాల ప్రాబల్యంవల్ల వితంతుస్త్రీలసంఖ్య పెరిగింది. ఆమెకు భర్తతో ఆ మరణాంతరసంబంధం ఉంటుందనే నమ్మకాన్ని సృష్టించి, ఆమె లైంగికతపై అదుపుచేసే క్రమంలో ఆమెకు వికృతరూపాన్ని సంతరింపచేయటమేకాక, ఆమె ఆహార, నిరీహాలను పితృస్వామ్యసంస్కృతి నిర్దేశించింది. అంటే ఆమెయొక్కశరీరం, మనస్సులపైన పితృస్వామ్యసంస్కృతి యొక్క అదుపు స్పష్టమయిన విషయం. సమాజంలోని బాల్యవివాహసంస్కృతిని, వితంతుస్త్రీల దుర్భరస్థితిని చిత్రీకరించి ఆ సమస్యలపట్ల స్పందించాల్సిన తీరును తెలియజేయటానికి కుటుంబానికి అవతల ఉన్న మధురవాణి అనే వేశ్యపాత్రను సృష్టించి గురజాడ అప్పారావు 1882 లో 'కన్యాశుల్కం' అనే నాటకాన్ని రచించాడు. కుటుంబస్త్రీలు స్పందించినా మనోభావ ప్రకటనచేసే స్థితిలో ఉండరు, ఉన్నా పితృస్వామ్యసంస్కృతి ఒప్పుకోదు. అయితే ఈ నాటకంలో బాల్యవివాహాలు నిర్మూలించాలి అనేభావనయేకాక, స్త్రీపునర్వివాహ ఆలోచనలను రేకెత్తించాలనుకొన్నాడు. బాల్యవివాహాలలో కన్యాశుల్కమనే ఆర్థికత్వమే స్త్రీల వితంతుతనానికి కారణంకాబట్టి, ఆ ఆర్థికవిషయమైన ఋణం తీరిస్తే పైలోకాలలో ఉన్న ఆ మొగుడితో సంబంధం తెగిపోతుందని, అప్పుడు స్త్రీ పునర్వివాహం నిక్షేపంలా చేసుకోవచ్చని గిరీశంపాత్రచేత చెప్పించటం జరిగింది. అయితే బాల్యవివాహాలను అరికట్టాలనే క్రియాచైతన్యాన్ని మధురవాణిలో కనబరిచాడు. 1881లోనే

కందుకూరి వితంతు పునర్వివాహాన్ని జరిపించినప్పటికీ, గురజాడ అప్పారావు ప్రభుత్వ ఉద్యోగిగా వితంతుసంస్కృతిలోని లోటుపాట్లను, సమాజంలోని కుహనాసంస్కర్తల స్వభావాన్ని, గర్భస్రావంవంటి ఫలితాలను సూచించగలిగాడు కాని, వితంతుస్త్రీ పునర్వివాహపు ఆచరణప్రయోగాన్ని స్పష్టంచేయలేదు. బాల్యవివాహాలు, స్త్రీపునర్వివాహనిషేధం స్త్రీలలైంగికతను అణచివేయటానికి యేర్పాటుచేయబడ్డ పితృస్వామ్యసంస్కృతి అని స్పష్టమైన విషయం. అయితే ఈ కన్యాశుల్కమనే నాటకం పితృస్వామ్య సంస్కృతిలోని అసమనైతికతను ఆలోచింపచేసి స్త్రీవాదస్పృహను కలిగించే నాటకం.

1902 లోనే విన్నకోట లక్ష్మీజోగమ్మరాసిన 'అవివేకపు వెంకమ్మ' అనే లఘునాటకంలో కాపురానికి రాని కోడలికి ఆమె పుట్టింటివారు ఆమె చదువును కొనసాగించటాన్ని కుటుంబంలో కొడుకుతల్లిగా అధికారసంబంధాలలో ఉన్న అత్త యిష్టపడదు. యక్తవయసు వచ్చిన స్త్రీ ఉన్నత చదువును చదువుకుంటుంటే సమాజం ఆమె లైంగికతను అనుమానించే అవకాశం ఉండటంతో ఆ అత్త అలా భావించింది. దానికి కారణం పితృస్వామ్య కుటుంబసంస్కృతి. అది పెళ్ళితంతుద్వారా స్త్రీలలైంగికతపై అదుపుకోసమే ఏర్పడింది. స్త్రీలు చదువుకోవటానికి వీలులేని వైవాహిక సమస్య. స్త్రీలు ఉన్నత చదువుచదువుకుంటే వారిలో ప్రపంచజ్ఞానం పెరిగి పితృస్వామ్య అధికారాన్ని ప్రశ్నించే అవకాశం లేకుండా చేయటానికి ఆమె లైంగికతను అనుమానించటానికి వీలుగా వివాహిత స్త్రీలు చదువును కొనసాగనీయకుండా చేసే ఎత్తుగడ అని అర్థం అవుతుంది. అయితే ఆ కోడలు తన జీవితంమీద తనకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఉండాలనుకొనే భావనతో ఆమె అలా చదవాలనుకోవటం ఒకరకంగా కుటుంబసంస్కృతిని అధిగమించాలనుకొన్న చైతన్యమే. అందుకే ఆమె కాపురంకంటే చదువుకే ప్రాధాన్యతను ఇచ్చింది. ఈ రకమైన వ్యక్తిత్వచైతన్యం స్త్రీలకు ఉండాల్సిన అవసరాన్ని తెలియజేసే నాటకాన్ని 1902 లోనే స్త్రీ రచయిత రాయటం గొప్ప విషయం.

జాతీయోద్యమసంస్కరణలలో భాగంగా అనివార్యమైన స్త్రీల చదువు స్త్రీలఆలోచనలకు పదునుపెట్టింది. స్త్రీలవైవాహిక సమస్యలపట్ల స్త్రీలు తెచ్చుకోవాల్సిన చైతన్యాన్ని ప్రతిఫలింపచేస్తూ ఒక స్త్రీరచయిత్రి 1906 లో రాసిన 'విమల' అనే నాటకం స్త్రీల రచనలకోసం పెట్టిన హిందూసుందరి అనే పత్రికలో ప్రచురింపబడింది. ఈ నాటకంలో తండ్రి కన్యాశుల్కానికి ఆశపడి ముసలివాడికి యిచ్చి పెళ్ళి చేయాలనుకొన్నప్పుడు ఆ పిల్ల తన స్నేహితురాలిదగ్గర తనకు ఆ బలవంతపు పెళ్ళి అంటే యిష్టంలేదని చెప్పింది. సంఘసంస్కర్త చెల్లెలు అయిన ఆ మిత్రురాలు, ఆ ముసలాడు కట్టిన తాళి వాడిమొహాన కొట్టి, చదువుకొని యుక్తవయసువచ్చిన తరువాత నచ్చిన వ్యక్తిని వివాహమాడమని ఆమెకు సలహా యిచ్చింది. స్త్రీ చదవుకొని ఎదగనీయకుండా చేసే బాల్యవివాహంపట్ల, అసమవయోభేద

వివాహంపట్ల విముఖత్వాన్ని చూపించాలని తెలియజేయటం జరిగింది. అంతేకాదు, తదుపరి పునర్వివాహం స్త్రీలు చేసుకోవచ్చనే ప్రత్యామ్నాయపు ఆలోచనలను పంచి వివాహసంస్కృతిని అధిగమించాలనే చైతన్యాన్ని కలిగించాలనుకోవటమే స్త్రీగా నాటకరచయిత్రియొక్క స్త్రీవాదచైతన్యానికి మచ్చుతునక ఈ నాటకం.

వివాహమనేది స్త్రీలకు శారీరక, మానసికస్వేచ్ఛ లేకుండాచేసిన సంస్కృతిపట్ల వ్యతిరేకచైతన్యం తెచ్చుకోవటం ఈ నాటకంలో కనపడుతుంది. వ్యక్తిగతమేకాక, సామూహికంగా స్త్రీలు తమ లైంగికతపై నిర్దేశించిన సమాజసంస్కృతిని అధిగమించే చైతన్యం వస్తేనే స్త్రీలబాల్యవివాహాలు, అసమవయో, అనైతిక వివాహాలనిర్మూలనం జరుగుతుందని భావించారు. అటువంటి చైతన్యాన్ని కలగజేయటానికే స్త్రీలు ఒక యింటి దగ్గర వారానికి ఒకసారి కలుసుకొనే స్త్రీసమాజాలను ఏర్పరచుకొనేనారు. ఆసమాజాల గదులలోనే హంగు, ఆర్భాటాలు లేకుండా నిరక్షరాస్యులైన స్త్రీలలోకూడా చైతన్యాన్ని తేవటానికే స్త్రీలు నాటకరచనకు ఉపక్రమించారని అర్థమవుతుంది. ఆహార్యాదులు లేకపోయినప్పటికీ సంభాషణాత్మకంగా స్త్రీలవైవాహికసమస్యలను చిత్రీకరించి స్త్రీలు చిన్న, చిన్న నాటికలను రాసి ప్రదర్శించటం, తెలుగునాటకచరిత్రలో స్త్రీవాదచైతన్యానికి అడుగులు వేయించటమే.

1910లో కవికొండల సుబ్బలక్ష్మి 'స్త్రీపునర్వివాహప్రహసనం' అనే లఘునాటకాన్ని రచించింది. దానిలోని పాత్రలయొక్క సంభాషణలలో భాగంగా వితంతుస్త్రీలకుకూడా మనసు ఉంటుందని, భర్తచనిపోతే స్త్రీపునర్వివాహం చేసుకోవాలని ప్రచారంచేయాల్సిన అవసరాన్ని తెలిపింది. అంతేకాదు స్త్రీలకు పురుషులవలె పునర్వివాహ స్వాతంత్ర్యం ఉండాలని పాత్రలచేత చెప్పించింది. ఈమెయే 1911లో 'స్త్రీపునర్వివాహప్రహసనం' అనే మరొక లఘునాటకాన్ని రచించింది అందులో కందుకూరి రాజ్యలక్ష్మివంటి పాత్రలచేత స్త్రీపునర్వివాహాన్నిగురించి చెప్పిస్తూ, శాస్త్రాలు సమ్మతింపకపోయినా స్త్రీలుగా ఆలోచిస్తే, కామం అనేది స్త్రీపురుషులకు సమానమే అని, స్త్రీకి పునర్వివాహం చేయటంవల్ల ఆత్మహత్యలు, రాజదండనలు, భ్రూణహత్యలు లేకుండా ఉంటాయని తెలియజేసింది. ఇందులో స్త్రీపాత్రచేత స్త్రీలకు కామం ఉంటుందనే శారీరక, మానసికస్పృహను, స్వేచ్ఛను వెల్లడించటమే కాక లింగవివక్షను ప్రశ్నించటమనేది స్త్రీవాదచైతన్యానికి మచ్చుతునక. అంటే 20 శతాబ్దం ప్రారంభంలోనే స్త్రీలలో స్త్రీవాదస్పృహ చైతన్యంగా పరిణమించటం స్త్రీలజీవితాలకు లైంగిక అణచివేతనుండి విముక్తిమార్గానికి పునాదులు ఏర్పడ్డాయని స్త్రీ రచించిన ఈ నాటకంద్వారా అర్థంఅవుతుంది.

1921లో కాళ్ళకూరి నారాయణరావు రచించిన 'వరవిక్రయం' అనే నాటకంలో వరకట్నం యివ్వటానికి కారణమైన లింగవివక్షా సంస్కృతిని విమర్శకుపెట్టే స్త్రీవాదచైతన్యం చైతన్యం

కాళిందిపాత్రలో కనపడుతుంది. అర్ధభూస్వామ్య అర్ధపెట్టుబడిదారీ సంస్కృతిలో అసమవైతిక, వయోవివాహాలసంస్కృతి కన్యను కొనుక్కునే కన్యాశుల్క దురాచారాన్ని సృష్టిస్తే, పెట్టుబడిదారీ వలసవాదవ్యవస్థలో మగపిల్లవాడు కాస్త చదువుకునేసరికి కన్యాశుల్కం వరుడిని కొనుక్కొనే వరకట్నసంస్కృతిగా రూపాంతరం చెందింది. రెండుసంస్కృతులలోను క్రయవిక్రయాలసందర్భంలో స్త్రీని ఒకవస్తువుగా భావించటం జరిగింది. వరుడు అడిగిన కట్నంచెల్లించకపోతే ఆడపిల్లకు వివాహంకాదు. అదొక సమస్య అవుతుంది. స్త్రీలు పురుషులు సమానంగా పుట్టినప్పుడు పురుషుడికి కట్నం యివ్వవల్సిరావటాన్ని ఆలోచనలకు తెచ్చుకొన్న కాళింది వెలపెట్టి కొనుక్కొన్న స్త్రీ వెలయాలు అయినప్పుడు పురుషుని వెలపెట్టి కొనుక్కోవటమంటే వారు 'వెలమగలు' కారా అని ప్రశ్నకు పెట్టింది. పైగా స్త్రీకి సంపాదనలేకుండా చేసిన పితృస్వామ్యసంస్కృతికి భిన్నంగా తాను ఖాదీబట్టలను తయారుచేసి ఆర్థికస్వావలంబనను పొందగలిగి వివాహంలేకుండా బతకవచ్చని భావిస్తుంది. అంటే స్త్రీలలైంగికతలో భాగమైన మాతృత్వ పోషణకే వివాహం అనే పితృస్వామ్య దృక్పథాన్ని అర్థంచేసుకోవటంవల్లనే కాళింది తన శరీరపోషణకోసం తాను ఆర్థికస్వావలంబనకై ఆలోచనచేయటం, తన శరీరానికి ఒక విలువను, ఆత్మగౌరవాన్ని పొందాలనుకోవటం కనపడుతుంది. అయితే కన్యాశుల్కంలోగాని, వరకట్నవిషయంలోగాని క్రయవిక్రయాదులలో అధికారవ్యవస్థ కనపడుతుంది. అయితే చదువుకొన్న కమల కట్నమిచ్చి కొనుక్కోవటంచేత అతడిమీద తనకే అధికారముందని వాదిస్తుంది. కమలకున్న తెలివిడి అధికారవ్యవస్థగా ఉన్న పితృస్వామ్యపు లింగవివక్షా సంస్కృతియొక్క పుట్టకీళ్ళను కదిలించే స్త్రీవాదచైతన్యవిషయం.

1927 లో వచ్చిన పానుగంటి లక్ష్మీనరసింహం రచించిన వృద్ధవివాహం అనే నాటకంలో బాల్యవివాహం జరిగిన పన్నెండేండ్ల బాలిక అరవైఏళ్ళ ముసలివాడి దగ్గరకు రెండవభార్యగా కాపురానికి వచ్చినప్పుడు పితృస్వామ్యసంస్కృతియొక్క పరాకాష్ఠస్థితికి, అదేమేరకు స్త్రీవాదచైతన్యపు క్రియాశీలతకు మైలురాయివంటిది ఈ నాటకరచన. బాలికయైన భార్యకు ముసలివాడైన తానంటే లైంగికంగా యిష్టం ఉండే అవకాశంలేదనే దృఢమైన అభిప్రాయంతో ఆ బాలికపై నిఘాపెట్టటం చేసేవాడు. తన మొదటి భార్యకొడుకైన యవ్వనవంతుడైన సవతికొడుకుకు ఆమె చదువుచెప్తున్నా అనుమానించేవాడు. అనుమానించటం ఆతని సహజస్వభావం అయి చివరికి ఉన్మాదిగా తయారయి చనిపోతాడు. జీవితంలో ఎటువంటి శారీరక, మానసికస్వేచ్ఛను తాను అనుభవించలేకపోవటానికి బాల్యవివాహసంస్కృతి కారణమనే స్పృహను పొందిన ఆమె తనలాంటి బాలికలకు దురవస్థను కలిగించే బాల్యవివాహాలను అడ్డుకోవాలని నిర్ణయించింది. దానికై ఆమె ఊరూర తిరుగుతూ

బాల్యవివాహాల నిర్మూనాచైతన్యం కలిగించటానికి ప్రచారం చేయటం స్త్రీవాద ఉద్యమచైతన్యపు స్వభావమే. అంతేకాదు, ఆమె నేర్పించిన చదువువల్ల ఆమె సవతికొడుకుకూడా బాల్యవివాహాలవల్ల వితంతువులుగా మారిన స్త్రీలు పునర్వివాహంచేసుకోవాలంటూ ప్రచారంచేసాడు. ఆ రకంగా స్త్రీలలైంగికతపై వివాహసంస్కృతి రూపంలో ఉన్న అదుపునుండి స్త్రీలువిముక్తులు అయ్యేందుకు స్త్రీలు, పురుషులు తెచ్చుకోవాల్సిన సామూహిక స్త్రీవాదచైతన్య ప్రచారాన్ని కలిగించిన నాటకం ఇది.

1929 లో మున్నా కోటేశ్వరమ్మ రాసిన 'సరిసమానులుకారా!' అనే నాటకంలో కట్నాల ఆశతో భర్తలు స్త్రీలను అనుమానిస్తూ చంపుతున్నారని, 12 ఏళ్ళకే కాపురానికి పంపిస్తే భర్త, అత్తల అధికారాలకింద స్త్రీ నలిగిపోదని, కట్నాలసమస్య తీరాలంటే స్త్రీలు చదువుకొని శాసనసభ్యత్వాన్ని పొందితే తప్ప స్త్రీలసమస్యలు తీరవని పాత్రలసంభాషణలో భాగంగా తెలియజేసింది. కట్నంకోసం కూడా స్త్రీల లైంగికతను అనుమానించటాన్ని ఆయుధంగా చేసుకోవటంలోనే ఉన్నఅధికారానికి, పితృస్వామ్యసంస్కృతిలోని రాజకీయ–ఆర్థికకోణంగల స్త్రీలలైంగికతపై ఉన్న అదుపుకు ఉన్నసంబంధం స్త్రీలకు వైవాహికసమస్యలను సృష్టించిందని అర్థం అవుతుంది.

1929లో ఒద్దిరాజు సోదరులు రచించిన 'మగసంసారం' అనే నాటకంలో కుటుంబస్త్రీలు తాముచేసే ఇంటిచాకిరీకి, శిశుపోషణకు విలువలేకుండా పోవటానికి కారణం లింగవివక్ష అనీ, అదే స్త్రీపురుషులకు సమానహోదా లేకుండాచేసిందనే చైతన్యం తెచ్చుకొన్నారు. దానికోసం ఒకరోజు స్త్రీలందరూ గుడిదగ్గర కలిసి ఇంటిపని, పిల్లలపనిని చేయకుండా సామూహిక నిరసనదీక్షను ప్రారంభించారు. మగవాళ్ళు ఆ పనులుచేసుకోలేక సతమతమై, ఇంటికిరమ్మని ప్రాధేయపడ్డారు. స్త్రీలు ససేమిరా అంటూ కుటుంబంలో తమకు పురుషులతోపాటు సమానహక్కులు ఉండేంతవరకు ఇంటికి రామని భీష్మించుకొని అక్కడే ఉంటారు. అప్పుడు మధ్యవర్తిత్వం వహించిన ఒక మహిళవచ్చి కుటుంబంలో స్త్రీలసమస్యకు పరిష్కారంగా స్త్రీపురుషులు ప్రేమసంబంధాలలో ఉంటూ పరస్పరం సహకారాన్ని అందించుకోవాలని, అప్పుడే స్త్రీపురుషులకు కుటుంబంలో సమానస్థాయి ఉంటుందనే చైతన్యాన్ని కలిగించింది. ఆ నాటకం యొక్క అంతర్గత పరిశీలనలో విలువ ఇవ్వని ఇంటిపనికి స్త్రీని పరిమితంచేస్తూ ఆమెకు సామాజికసంబంధాలు లేకుండాచేయటమే పితృస్వామ్యఅధికార వ్యవస్థకు బలం. కాబట్టి ముందుగా స్త్రీలు ఇంటినుండి బయటకువచ్చి లింగవివక్షాసంస్కృతికి వ్యతిరేకంగా సామూహికత్వచైతన్యంతో తమకు పురుషులతోపాటు సమానస్థితి కావాలనుకోవటమే స్త్రీవాద చైతన్యం.

1930లో పి.వి.రాజమన్నారు రచించిన 'తప్పెవరిది?' అనే నాటకంలో వృద్ధుడైన భర్త తన రెండవ భార్య సంగీతంలో భాగంగా జావళీలు (శృంగారపదకవితలు) పాడుకుంటుంటే సహించలేక

పితృస్వామ్యం ఇచ్చిన అధికారంతో వాటిని పాడవద్దని అంటాడు. ఆమె ఆ పాటలు తనకు మానసిక ఆనందాన్ని ఇస్తాయని చెపితే భక్తిగీతాలు పాడుకోమంటాడు. ఆమె భాగవతంలో గోపికలు కృష్ణునిగురించి పాడితే అవి ఆధ్యాత్మికం అయినట్లే తను పాడుకొనే జావళీలు అలాంటివే అని, తాను పాడటం మాననని అంది. దానికి భర్త ఆమెను ఇంట్లోనుంచి పొమ్మంటే, ఆమె తన మనసుకు నచ్చినట్లుగా ఉండే స్వేచ్ఛ తనకు లేనప్పుడు వెళ్ళిపోవటానికి సిద్ధపడుతుంది. ఆ భర్త క్షమించమని అడిగి, ఆమె తన మరణాంతరంకూడా పెళ్ళిచేసుకోననే మాటను యిమ్మని అడుగుతాడు. అంటే ఆమె జావళీలు పాడుకుంటున్నందుకే ఆమె మనసును శంకించి, ఆమెలైంగికతను అనుమానించటం, ఆ తరువాత ఆమె దగ్గర తనమరణాంతరంకూడా ఆమెపై తనహక్కును స్థిరపరచుకోవాలనుకోవటం పితృస్వామ్యకుటుంబ సంస్కృతియొక్క లక్షణం అయితే, ఆమె ఈ కుటుంబ సంస్కృతిని వ్యతిరేకించి ఇంటిని వదిలి వెళ్ళిపోవాలనే చైతన్యం తెచ్చుకోవటం జరిగింది. చేసేదిలేక వృద్ధుడైన ఆ భర్త తాత్కాలికంగా తన పితృస్వామ్య అధికారాన్ని తగ్గించుకోగలిగాడనేది స్పష్టమైన విషయం. స్త్రీలకు మానసికస్వేచ్ఛలేనప్పుడు కుటుంబాన్ని వదిలివెళ్ళాలనే స్త్రీవాదచైతన్యమే నేడు బలంగా పుంజుకుంటున్న కుటుంబవ్యతిరేకచైతన్యం. ఈ చైతన్యానికి 1930లోనే పాదులు ఏర్పడ్డాయని తెలుస్తోంది.

1933లో బళ్ళారి రాఘవ రాసిన సరిపడని సంగతులు అనే నాటకంలో మేనమామ సంరక్షణలో ఉన్న వితంతు బాలికపై ఆమె మేనమామ లైంగికదాడికి పూనుకోవటంతో ఆమెకు గర్భం వచ్చింది. సమాజంకళ్ళను కప్పిపుచ్చడానికి వితంతుసంస్కృతిని ఆసరాచేసుకుంటూ ఆ బాలికకు జుట్టుతీయించి వితంతువికృతరూపాన్ని కలిగించాలనుకొంటాడు. ఆ రకంగా ఈ మేనమామ ఆ బాలిక శరీరంపైనా, ఆమె మనస్సుమీద పితృస్వామ్యసంస్కృతి యిచ్చిన అధికారాన్ని వినియోగించుకొని తన తప్పును కప్పిపుచ్చుకోవాలనుకొంటాడు. గర్భధారణ అనేది స్త్రీల లైంగికతకు సంబంధించిన విషయం. ఆ పిల్లను గర్భస్రావంచేయించుకోమని అడగగా, ఆమె దానిని పాపకర్మగా భావించి ఒప్పుకోనంది. అంతేకాక ఆ బాలిక మాతృత్వం స్త్రీల అనుభూతికి సంబంధించిన విషయమని చెప్పి గర్భస్రావాన్ని వ్యతిరేకించి, ఆమె ఇంటినుండి వెళ్ళిపోతుంది. ఇదొకస్త్రీవాదచైతన్యం. పెళ్ళితో సంబంధంలేకుండా గర్భాన్ని ఉంచుకోవాలా లేదా అనే మాతృత్వపు హక్కు స్త్రీలకు ఉండాలని అంటారు. అంటే 1933 లోనే స్త్రీలలో ఇటువంటి చైతన్యం ఉండాలని రచయిత సూచించటం ఆనాటికది విప్లవాత్మకమైన విషయం. ఇంటినుండి వెళ్లిపోయిన ఆమె ఒక సంఘసంస్కారి అండన చేరుతుంది. ఆ సంస్కారి మునుపు ఆమెను యిష్టపడిన ఆ మేనమామ కొడుకును ఆదర్శవివాహం చేసుకోమంటే, ఆతడు గర్భవతిని పెళ్ళి చేసుకోవటానికి అంగీకరించడు. ఆ యువకుడియొక్క

ఆదర్శాలను మరింతగా పటాపంచలు చేయటానికి సమాజంలో ఆచార్యులువంటివారు ముందుకు వచ్చి 'ఆడవాళ్ళు ప్రజోత్పాదక యంత్రాలు అని, ఆడవాళ్ళకు ఎక్కువస్థానం యిస్తే పురుషులకు ధర్మం తక్కువ అవుతుందని' అంటాడు. ఎందుకంటే స్త్రీలలైంగికతపై అనుమానిస్తూ ఉన్నంతకాలం పితృస్వామ్య అధికారానికి ముప్పుఉండదు. అందుకోసమే ఆ యువకుడు ఆమెను ఆదర్శవివాహం చేసుకోనీయకుండా అడ్డుపడతాడు. దీనినే స్త్రీవాదంలో పునరుత్పత్తి రాజకీయం అంటారు. అప్పుడు ఆతని తల్లివచ్చి కొడుకుతో సమాజకట్టుబాట్ల విషయంలో ద్రవ్యానికి ఒక శాస్త్రం, దారిద్ర్యానికి ఒక శాస్త్రం అనీ, ఇది రోకలియుగం అని అంటుంది. అంతేకాదు మగడుగొంతుకోత, మంగలినెత్తికోతతో స్త్రీలు బాధితులుగా ఉన్నారని, వితంతువులు ముత్తైదువులు కావచ్చని, పూర్వపు మతం పనికిరానప్పుడు, పూర్వపు మగడు ఎట్లాపనికి వస్తాడని, మగాడి పునర్వివాహాన్ని ప్రశ్నకుపెట్టి ఈ విషయాలన్నీ భార్యలు రాజకీయసభలలో మాట్లాడాలని అంది. గర్భవతియైన వితంతుస్త్రీని పునర్వివాహం చేసుకోవటం మరింత ఆదర్శమని చెప్పి ఒప్పిస్తుంది. ఆమె వివాహాలలోని అసమనైతికతను, లింగవివక్షను ప్రశ్నకు పెట్టింది. అంతేకాదు మాతృత్వపుహక్కు స్త్రీలకే ఉండాలనే స్త్రీవాదసచైతన్యపు ఆలోచనను రేకెత్తించిన నాటకం.

ఈ నాటకంలో వితంతుస్త్రీపై లైంగికదాడి, గర్భధారణ ఆమెకు వైవాహికసమస్యగా మారింది. ఎంతటి ఆదర్శాలు కలిగిన యువకుడైనా స్త్రీయొక్క లైంగికతను అనుమానాస్పదంగా భావించాల్సిందే. స్త్రీల లైంగికతపై అదుపును ఇచ్చిన పితృస్వామ్యపు అధికారవ్యవస్థ స్త్రీపై లైంగిక భక్షణచేసే బలం యిచ్చి, మరొకపక్క స్త్రీయొక్క లైంగికతను అనుమానించే ప్రవృత్తిని పెంచటం సరిపడని పరస్పర వైరుధ్యమైన సంగతి. ఈ విషసంస్కృతియే స్త్రీలకు లైంగికసమస్యలను తెచ్చిపెట్టి స్త్రీలుగాను, వితంతువులుగాను వైవాహికసమస్యలను ఎదుర్కొనటానికి కారణం అనే విషయాన్ని తెలియజేసిన నాటకం. అంతేకాదు, పితృస్వామ్యసంస్కృతిలో సామాజిక అసమనైతికత స్త్రీలలైంగికతను అణచివేసే బలాన్ని పురుషుడికి యివ్వటమే స్త్రీలకు సమస్యలకు కారణమనే స్పృహను కలిగించి, గర్భవతియైన వితంతువును వివాహమాడే చైతన్యం తెచ్చుకోవాల్సిన అవసరాన్ని కూడా తెలియజేసింది. స్త్రీలలైంగికతకు పెద్దపీటవేసిన పితృస్వామ్యకుటుంబ సంస్కృతిలోని వైరుధ్యం, డొల్లతనాన్ని స్పష్టం చేసిన నాటకం.

1945 లో మల్లాది వెంకటశర్మ రచించిన 'స్త్రీ' అనే నాటకంలో స్త్రీలహక్కులకోసం పోరాడే మహిళను పాత్రగా చూపించి, స్త్రీ తన శారీరక, మానసిక స్వేచ్ఛను అనుభవించాలనుకోవటం, దానివల్ల ఆమె కష్టాలను ఎదుర్కోవటానికి ఆర్థికస్వావలంబనను పొందటం కనపడుతుంది. పితృస్వామ్యం నిరంతరం భార్యను అనుమానిస్తూ ఆమెకు స్వేచ్ఛలేకుండా చేయగలిగితేనే కుటుంబంలో

పురుషుని అధికారం చెక్కుచెదరకుండా ఉంటుంది. అందుకే సమాజంలో పురుషులతో భార్యకు పురుషులతో స్నేహసంబంధాలు ఉండటాన్ని భర్త యిష్టపడడు. ఆమె తన స్నేహాన్ని వదులుకోనందుకు ఇంట్లోనుండి వెళ్ళిపోమంటాడు. ఆమె నిర్భయంగా వెళ్ళిపోయి, ఆర్థికస్వావలంబనను పొంది బతకగలుగుతుంది. కాని భర్త తన భార్యను శంకించినందుకు పశ్చాత్తాపడినట్లుగా ఆ భర్తపాత్ర చిత్రింపబడింది. కుటుంబనిర్మాణంలో స్త్రీల లైంగికతపైన ఉండే అదుపు సమాజంలోని స్నేహ సంబంధాలను విచ్ఛిన్నంచేస్తూ మానవసంబంధాలను మంటగలపగలదనే స్ఫురణనుకూడా కలిగించిన నాటకం యిది. కాని రచయిత స్త్రీలకు పురుషులతో స్నేహసంబంధాలు ఉన్నంతమాత్రాన ఆమెను అనుమానించటం ఆ భర్తకే అనర్థదాయకం అనే స్పృహను కలిగించాలని అనుకోవటంతో పాటు, మునుపటివలె స్త్రీ పాతివ్రత్యమే జీవితాశయంగా చేసుకుంటూ తన స్వేచ్ఛను పణంగా పెట్టదనీ, ఆర్థికస్వావలంబనతో స్త్రీ తన వ్యక్తిత్వాన్ని, స్వేచ్ఛను కాపాడుకోగలదనే చైతన్యాన్ని ఇవ్వగలిగిన నాటకం ఇది.

1946లో శ్రీపాదసుబ్రమణ్యశాస్త్రి రాసిన 'టీపారి' అనే లఘునాటకంలో రెండవ ప్రపంచయుద్ధకాలంలో పురుషులు సైన్యంలో చేరి యుద్ధానికివెళ్ళటానికి వెనకాడుతుంటే స్త్రీ ముందుకువచ్చి తాను ఢిల్లీవెళ్ళి సైన్యంలో చేరుతానని, తాను తిరిగివచ్చేసరికి తన భర్తను ఇంటిపని, పిల్లలపని చేసి తన రాకకై ఎదురుచూడమని అంటుంది. అంటే స్త్రీలను ఇంటిచాకిరీకి పరిమితంచేసి ఆమె శక్తిసామర్థ్యాలకు విలువలేకుండా చేస్తూ జరిగిన పనివిభజన స్త్రీని సమాజంలో తక్కువస్థానంలో ఉంచిందనే గ్రహింపుతో, ఆమె ఆ సందర్భాన్ని ఉపయోగించుకుంటూ కుటుంబం నిర్దేశించిన పనివిభజన సంస్కృతికి వ్యతిరేకమైనచైతన్యం చూపించటం జరిగింది. అంటే సమాజంలో పురుషుల కంటే స్త్రీలు శక్తిమంతులని, స్త్రీలస్థానం తక్కువకాదనే స్పృహను కలిగించటానికి ఆమె ప్రదర్శించిన స్త్రీవాదక్రియారూప చైతన్యానికి నిలువెత్తు నిదర్శనం.

1948 లో శ్రీపాదసుబ్రమణ్యశాస్త్రి రాసిన 'కొనుక్కొన్నమొగుడు' అనే మరొక లఘు నాటకంలో కన్యాశుల్కం యిచ్చి కొనుక్కున్న భార్యవని, తన యిష్టం ప్రకారం ఆమె ఉండాలని, మరింతగా పితృస్వామ్యకుటుంబ అధికారాన్ని చూపిస్తాడు. అయితే ఆతని మరదలి పెళ్ళిసమయానికి వరకట్నసంస్కృతి వచ్చింది. తోడల్లుడికి వరకట్నం ఇచ్చినందుకు, తనకు ఇవ్వాలని లేకపోతే భార్యను పుట్టింటికి పంపించేస్తానని అంటాడు. విధిలేక మామగారు కూతురుసంసారానికై తిరిగి పెద్దల్లుడికి వరకట్నం యిచ్చాడు. పెళ్ళి అనేది క్రయవిక్రయవ్యాపారం అని భావించి కొనుక్కున్నవాళ్ళకి అధికారాలను ఇస్తోందనే గ్రహింపు భార్యకు కలిగి కన్యాశుల్కం యిచ్చినందుకు యిన్నాళ్ళు తనమీద

అధికారంచూపించిన భర్తకు గుణపాఠం చెప్పాలనుకొంది. ఆమె తన భర్తతో వరకట్నమిచ్చి కొనుక్కున్నాము కాబట్టి తాను చెప్పినట్లుగా ఆతడు వినాలని, ఆతడిమీద తనకే అధికారం ఉందని చెప్పింది. ఏ సంపదల స్వామ్యంతో పురుషుడు స్త్రీపై అధికారాన్ని చేజిక్కించుకొన్నాడో అటువంటి డబ్బే కుటుంబాన్ని తలకిందులుగా తిరగబడేట్లుచేసి స్త్రీకి అధిపత్యాన్ని యిస్తే ఎలా ఉంటుందో తెలుసుకోమనే గుణపాఠాన్ని భర్తకు నేర్పిస్తుంది. అసలు మర్మమేమిటి అంటే కుటుంబంలో స్త్రీనిపోషింపబడే స్థితిలో ఉంచి, ఆర్థికసామర్థ్యంలేకుండా చేసి, ఆమె స్వేచ్ఛను అరికట్టేందుకును, ఆమెపై భర్త అధికారంచెలాయించే విధంగాను కుటుంబనిర్మాణం జరిగింది. అంతేకాదు, కుటుంబఅధికారం తిరగబడితే ఎలాఉంటుందో చూపించే క్రియాశీలచైతన్యం కూడా ఆమెది.

1950 లో చలం రాసిన విడాకులు అనే నాటకంలో పితృస్వామ్యకుటుంబంలోని అసమనైతిక వివాహవ్యవస్థ పురుషుని భోగలాలసుడ్ని చేసింది. ఆతడు భార్య కోరికలను పట్టించుకోడు. తన గురించి పట్టించుకొన్న మరొకనిపై ఆమెకు యిష్టం ఏర్పడుతుంది. అతనితో ఆమె లైంగికంగా మానసికస్వేచ్ఛనుపొందాలని అనుకొంటుంది. ఆమె తన లైంగికస్వేచ్ఛను అనుభవించాలనుకొని భర్తను వదిలిపెట్టి వెళ్ళిపోవాలని అనుకొంది. ఆమెను తీసుకొనివెళ్ళటానికి ఆమె ప్రియుడు వస్తున్న విషయం తెలుసుకొన్న ఆమె భర్త ఆమెను వెళ్ళనీయకుండా చేస్తాడు. కుటుంబసంస్కృతి ఇచ్చిన స్త్రీలలైంగికతను అదుపుచేసే అధికారాన్ని వినియోగించుకోవాలని అనుకొంటాడు. అయితే భర్త తన ప్రియుడ్ని చంపించాలనుకునేసరికి ఆమె చచ్చి పోవాలని అనుకొని, స్త్రీలు విడాకులు తీసుకొనే వీలుకలగటానికి స్త్రీలు శాసనసభ్యులుగా చేరాలని చెప్పింది. ఆ సమయంలో స్త్రీలు తమ వైవాహిక స్వేచ్ఛకై విడాకులు తీసుకొనే వెసులుబాటు ఉండాలనీ, దానికై రాధాసుబ్బరాయనుగారి ఆధ్వర్యంలో ప్రవేశపెట్టబోతున్న విడాకులబిల్లును గురించి నలుమూలలనుండి తెలుగుస్త్రీల అభిప్రాయసేకరణకై 1938లో పత్రికాముఖ ప్రకటన చేయటం, స్త్రీలు విడాకులు తీసుకొని తమవైవాహికసమ్యలనుండి విముక్తులయిస్వేచ్ఛను పొందాలనుకోవటం, పితృస్వామ్యకుటుంబ సంస్కృతికి చెంపపెట్టువంటిది. స్త్రీలకు లైంగికస్వేచ్ఛ లేకుండాచేసిన ఆర్థిక-రాజకీయవ్యవస్థను స్త్రీలు ఎదుర్కోవాలంటే స్త్రీలు రాజ్యసభలలో ప్రవేశించి చట్టాలుచేయించగలగాలని, అప్పుడే స్త్రీమానసికస్వేచ్ఛను అనుభవించగలదనే చైతన్యాన్ని యిచ్చిన నాటకం ఇది.

1950లో స్త్రీపురుషులకు సమానంగా స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను లిఖితపూర్వక భారతదేశ రాజ్యాంగం యిచ్చింది. దానిలో భావప్రకటనా స్వేచ్ఛను ప్రాథమికహక్కుగా నిర్ణయించింది. అయినా 1951 లో బుచ్చిబాబు రాసిన 'ఆత్మవంచన' అనే నాటకంలో స్త్రీలు వివాహవిషయంలో తమకు నచ్చిన వరుని గురించి చెప్పే భావప్రకటన స్వేచ్ఛను వినియోగించుకోలేక వైవాహికజీవితంలో

అసంతృప్తిని పొందటం జరిగింది ఆస్వేచ్ఛను స్త్రీ వినియోగించుకోకపోతే తనని తాను ఆత్మవంచన చేసుకోవటం అని, స్త్రీ మానసికస్వేచ్ఛను అనుభవించేస్థితిలో ఉండాలనే చైతన్యాన్ని యిచ్చిన నాటకం. స్త్రీలకు రాజ్యాంగం ఇచ్చిన భావప్రకటనచేసుకొనే హక్కును, ఆచరణలో పెట్టుకోగలిగితేనే స్త్రీలు స్వేచ్ఛను అనుభవించగలరనే చైతన్యం కలిగించిన నాటకం.

1958 లో అవసరాల రామకృష్ణారావు రాసిన 'పంజరం' అనే నాటకంలో భార్య లైంగికతపై సమాజం చేసిన దుష్ప్రచారానికి భయపడ్డ భర్త ఆమెను అనుమానించటం తన పితృస్వామ్య కర్తవ్యంగా భావించి ఆమెను యింటినుండి వెళ్ళగొడతాడు. అయితే ఆతర్వాత ఆ అనుమానం అతని ఉన్మాదస్థితికి కారణంకాగా పిచ్చివాడవుతాడు. వివాహితయైన భార్యను భర్త వెళ్ళగొడితే ఆమెకు సమాజంలో స్థానం ఉండదనే భావనతో ఆమె తాను కన్యనని చెప్పి డాక్టరు దగ్గర నర్సుగా చేరుతుంది. ఆమెకు యిష్టంలేకపోయినా తరువాత పెళ్ళిచేసుకుంటానంటూ డాక్టరు ఆమెపై లైంగిక అధికారాన్ని కోరుకొంటాడు. ధన ప్రలోభంతో వృత్తికికూడా కళంకాన్ని తెచ్చే క్రమంలో ఆ డాక్టరు తన దగ్గరకు ఒక అన్న తమ్ముని ఆస్తికోసం అతనిని పిచ్చివాడని ధృవీకరించమని డాక్టరు దగ్గరకు తీసుకువచ్చినప్పుడు ఆనర్సు ఆ పిచ్చివాడిగా ఉన్న తన భర్తను, ఆతడు తన భార్యను పరస్పరం గుర్తించుకొంటారు. భర్త తాను ఆమెను యింట్లోనుంచి వెళ్ళగొట్టినందుకు. క్షమించమని అడుగుతాడు. ఇక్కడ కుటుంబం స్త్రీల యొక్క లైంగికతపై అనుమానించే సాంస్కృతిక పంజరాన్ని సృష్టించినందుకు ఆ కుటుంబసంస్కృతియే ఆతనిపాలిటి అశనిపాతమవుతుందనే ఆలోచనను రేకెత్తించిన నాటకం.

1983 లో ఇసుకపల్లి మోహనరావు రాసిన 'తర్జని' అనే నాటకంలో మొదటిపెళ్ళికి తీసుకొన్న కట్నం ఖర్చుకాగా భర్త మళ్ళీ కట్నంకోసం రెండవ పెళ్ళిచేసుకోవాలనుకొంటాడు. అందుకని భార్యను ఇంట్లోంచి వెళ్ళిపొమ్మంటాడు. అయితే ఆమె మీద కన్నేసిన ఆతని తండ్రి ఆమెను పెళ్లిచేసు కొంటానంటాడు. అలా అనేసరికి ఆమె లైంగికతపై తనకే హక్కు ఉండాలని అనుకొని, ఆమెను చంపి తాను గర్భవతియైన మరొకస్త్రీని రెండవపెళ్ళి చేసుకోవాలనుకునే సమయంలో, ఆ భార్య చైతన్యం తెచ్చుకొని తన చావుకు భర్త కారణమని లేఖరాసిపెట్టి పుట్టింటికి కూడా పోస్టుచేసానని బెదిరించింది. అదేసమయానికి ఆతడు తన రెండవపెళ్ళికి భంగం ఏర్పడిందని తెలిసి తోకముడవటాన్ని చిత్రించిన నాటకం. ఇక్కడ కుటుంబంలో స్త్రీయొక్క లైంగికతపై భర్తగా ఆమె లైంగికతపై తనకే హక్కు ఉందని భర్తనుకోవటం, మామకూడా ఆమె మనసుస్సుతో సంబంధంలేకుండా లైంగికహక్కును పొందాలనుకోవటం వెరసి స్త్రీలలైంగికతపై అదుపుకోసం ఆర్థికపునాదులతో ఏర్పడిన కుటుంబ సంస్కృతిని అదే ఆర్థికవిషయం తిరిగి వ్యతిరేకంగా పనిచేసినప్పుడు, భార్యలైంగికతపై భర్తకు ఉన్న

హక్కు మరొకనికి బదలాయింపు జరిగే అవకాశాన్ని యిస్తుంది. దానిని భరించలేని భర్త ఆమెను చంపాలనుకొన్నాడు. పురుషుడు మాత్రం ఎంతమంది స్త్రీలపైన అయినా లైంగికహక్కులను పొందాలనుకోవటమే కుటుంబంలోని తర్జనితో వేలెత్తి చూపించే వైరుధ్యపుసంస్కృతి అని అర్థం అవుతుంది.

1994 లో మార్గశీర్ష అనే పేరుతో బి.వి.రమణమూర్తి రాసిన 'శ్వేతపత్రం' అనే నాటకంలో కూతురిగా, భార్యగా, తల్లిగా స్త్రీ నిర్ణయాలను చేసుకొనే స్థితిలేకుండా చేస్తూ, పురుషుడుమాత్రం ఒక తండ్రిగా, భర్తగా, కొడుకుగా తన అధికారాన్ని చెలాయింపజేసుకోవాలని అనుకోవటమే కుటుంబంలో స్త్రీలకు వైవాహికసమస్యలను సృష్టించిందనే పితృస్వామ్యవ్యవస్థకు నిలవెత్తు ఉదాహరణ ఈ నాటకం. కూతురు తన వివాహాన్ని నిర్ణయించుకొంటే తనకు ఆమెపై అధికారం లేకుండా చేసిందని ఆమె తండ్రి ఆమె పెళ్ళిచేసుకోవాలనుకొన్న యువకుని హత్యచేయించాడు. వివాహం అంటే స్త్రీపురుషలైంగిక సంబంధాలకు సంబంధించిన విషయం. కూతురికి అటువంటి లైంగికస్వేచ్ఛకు సంబంధించిన విషయంలో నిర్ణయం తీసుకొనే హక్కులేకుండా చేయటమే పితృస్వామ్య అధికారవ్యవస్థ లక్షణం. ఒక భార్యగా ఉద్యోగినియైన మహిళ తన సోదరుని అనారోగ్యానికై ఖర్చులకింద తాను సంపాదించిన డబ్బు పంపిస్తానంటే అడ్డుతగిలి ఇంటినుండి పంపేస్తానంటాడు. స్త్రీకి ఆర్థికస్వేచ్ఛ లేకుండాచేయటానికై ఆమెకు తన సంపాదనమీద హక్కులేకుండా చేసిన పితృస్వామ్య కుటుంబవ్యవస్థ యొక్క మూలాలలోని ఆర్థికస్వభావం అర్థమవుతుంది. స్త్రీ ఒక తల్లిగా తాను పాలిచ్చిపెంచిన కొడుకు తనకు వారసత్వంగా వచ్చిన ఆస్తి విషయంలో తనపైనే అధికారం చూపించాలనుకొన్నప్పుడు ఆమె ఒప్పుకోదు. ఆ కొడుకు ఒక పోలీసు. రోడ్డుమీద స్త్రీలు సారాకు, కుటుంబహింసలకు వ్యతిరేకంగా ఊరేగింపు చేస్తుంటే ఆ మహిళలపై లాఠీచార్జి చేయాలని కిందిపోలీసులను ఆదేశిస్తాడు. దానితో ఆ తల్లిలో స్త్రీవాదచైతన్యం పెల్లుబికి, స్త్రీలస్వేచ్ఛను భరించలేని కొడుకువైఖరిని వ్యతిరేకించి, పురుషాధిక్యతకు, పితృస్వామ్య అధికారాన్ని నిరసిస్తూ ఆ ఊరేగింపు చేస్తున్న స్త్రీలలో తాను భాగస్వామ్యురాలుగా చేరిపోతుంది. శక్తినీది, స్వేచ్ఛనీది, శాంతి, క్రాంతినీది, నీది, రీతికి, గతికి ముక్తివి, దారిచూపించు, నారిసారించు అనే వారి ఉద్యమగీతంతో గొంతు కలిపింది. ఆ రకమైన నినాదాలతో స్త్రీలస్వేచ్ఛను అరికట్టే కుటిలవాదులకు, కుహనాధర్మరక్షకుల కుళ్ళిన ఈ శ్మశానవ్యవస్థమీద, మానవత్వమున్న మహాజనానికి స్త్రీ సమర్పించిన శ్వేతపత్రం ఈ నాటకం.

1995 లో ఓల్గా రచించిన 'వాళ్ళు ఆరుగురు' అనే నాటకంలో అధికారవ్యవస్థగా వచ్చిన పితృస్వామ్య కుటుంబంలో స్త్రీ శారీరక, మానసికస్వేచ్ఛలను అనుభవింపలేకుండా చేసిన వివాహాన్ని

చలం కథానాయికలైన ఆరుగురు స్త్రీపాత్రలు తమ జీవితానుభవసారంతో చర్చకుపెడతారు. స్త్రీలమనస్సుకు నచ్చిన ప్రేమసంబంధాలలోని లైంగికస్వేచ్ఛకు, మాతృత్వపుహక్కుకు అవకాశంలేని వివాహం అవసరమా అనే ప్రశ్నను సంధించి మహిళాలోకాన్ని తమ హృదయాలలోకి తొంగిచూసుకొని ఆలోచింపచేసే చైతన్యాన్ని కలిగించిన స్త్రీవాద చైతన్యనాటకం. ఈ నాటకం 21 శతాబ్దపు వివాహాలకు సవాళ్ళను విసిరింది.

2010 లో భాస్కర చంద్ర రాసిన 'ఇక్కడ కాసేపు ఆగుదాం' అనే నాటకంలో భార్యకు గర్భధారణ శక్తి లేనందుకు ఆతడు ఆమెతో విడాకులు తీసుకోవాలనుకొని రెండవపెళ్ళి చేసుకోవాలను కొంటాడు. ఆ విషయం తెలిసి ఉద్యోగియైన ఆతనిభార్య అభిమానంతో వేరే ఊరికి బదిలీ చేయించుకుంటుంది. అప్పుడు తమకు పిల్లలులేనందుకు ఆ భర్తను తాము పెంచుకొన్నామని ఆతని తల్లిదండ్రులు చెప్పారు. ఇక్కడ కాసేపు ఆగి తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే కుటుంబంలో భార్య కేవలం సంతానాన్ని కని ఇవ్వటానికే అనే కుటుంబ సంస్కృతికి వ్యతిరేకంగా స్త్రీపురుషులు తెచ్చుకోవాల్సిన చైతన్యాన్ని ఇచ్చిన నాటకం.

భారతరాజ్యాంగం స్త్రీపురుషులకు సమానస్వేచ్ఛాస్వాతంత్ర్యాలను యిచ్చినప్పటికీ స్త్రీలు స్వేచ్ఛను అనుభవించలేక పోతున్నారనేది సామాజిక సత్యం. భూస్వామ్య, పెట్టుబడిదారివ్యవస్థలలోను, ప్రస్తుత ప్రపంచీకరణసమాజంలోను వచ్చిన రాజకీయ–ఆర్థిక పరిణామవ్యవస్థలలోకూడా కొనసాగుతున్న సామాజికకుటుంబ సంస్కృతి స్త్రీలలైంగికతపై అదుపుచేస్తూ అనుశ్రుతంగా వస్తున్న విషయమే. అందుకే ఆధునికయుగంలో కుటుంబసంస్కృతికి వ్యతిరేక ధోరణి ప్రబలటం, దాని పరిణామాల పరంపరలోనే సహజీవనం అనే నూతనదృక్పథానికి దారులు ఏర్పడటం గమనించిన విషయమే. కాబట్టి సమాజపటిష్ఠతకై కుటుంబ పునర్నిర్మాణదిశగా సాగుతున్న మేధావుల ఆలోచనలు మహిళల మానసిక, శారీరకస్వేచ్ఛలకు పెద్దపీటవేయగల నూతనసంస్కృతికై స్త్రీపురుషులు ఆలోచించాల్సిన అవసరమైన చారిత్రకసమయమిది.

7. నిరంతరం... స్త్రీలచైతన్యం

1936 సం.లో కస్తూరి రామలక్ష్మి 'సాహిత్యం–దాని మహత్యం' అనే శీర్షికన వ్యాసాన్ని రాస్తూ 'జాతియొక్క యుక్తమాన జీవన విధానం సాహిత్యంలో ప్రతిబింబించాలని, సాంఘిక, రాజకీయ, ఆర్థికసమస్యలందు గొప్ప మార్పులకై మహానలమైనటువంటి అలజడులను సృష్టించి, సమాజంలోని దురాచారాలను పోగొట్టే విప్లవాత్మక చైతన్యాన్ని కలిగించే సాహిత్యంద్వారా జాతిని రక్షించుకోవచ్చు' అని తెలిపింది. ఆచంట సత్యవతమ్మ రాసిన 'అభ్యుదయానికి అవసరమైన రచనలు' అనే వ్యాసంలో (అక్టోబరు 1938 గృహలక్ష్మి) స్త్రీల అభ్యదయానికి అనుకూలించే విజ్ఞానాన్ని అందించే రచనలు సమాజానికి కావాలని చెప్పింది. ఈమె రాసిన 'స్త్రీకి స్వాతంత్ర్యం ఎంతవరకు' అనే మరొక వ్యాసంలో (మార్చి1941 గృహలక్ష్మి) సంఘంవల్ల స్త్రీ హృదయానికి గాయమైనప్పుడు, స్త్రీలలో ప్రేమ ఉన్నా కూడా అక్కడే ద్వేషం పుడుతుందని, అందుకే స్త్రీలకు ఉండే ప్రేమ, పగ సాహిత్యంలో ప్రతిఫలిస్తాయని చెప్పింది. వట్టికొండ విశాలాక్షి రాసిన 'శపథం' (మార్చి 1946 తెలుగుతల్లి) అనే కవితలో 'హృదయనేత్రములకుపడేది, హృదయసీమలకెగబడేది, కష్టనిష్ఠూర లోకవృత్తము కావ్యవస్తువుగా చేసుకోవాలని, తాను కష్టములు ఎన్నైనారానీ, ఇష్టపడి స్త్రీజాతికొరకే కష్టపడతాన' ని చెప్పింది. ఈ వాక్యాలను ఆదర్శంగా తీసుకొని సామాజిక చలనసూత్రాల ప్రభావం కల కాలప్రవాహంలో స్త్రీలు కొట్టుకుపోకుండా జాతిని చైతన్యపరిచే రచనలు సాహిత్యచరిత్రలో చోటుచేసుకోవాలి.

ఏ కాలంలోనైనా మహిళల జీవనసమస్యపట్ల స్త్రీలలో స్వీయ ఆలోచనలలోను, చదువు వల్లను, ఉపాధి కారణంగాను విప్లవాత్మక చైతన్యం పుట్టుకొస్తుంది కాబట్టి ఆ చైతన్యానికి విలువలు ఉంటాయి. మధ్యయుగాల భూస్వామ్యవ్యవస్థలో వచ్చిన ప్రాచీన తెలుగుసాహిత్యంలో స్త్రీలు తమజీవితాలపై నిర్దేశించిన పితృస్వామ్యసంస్కృతిపట్ల సంఘర్షించే చైతన్యం తెచ్చుకొన్నా, అది కుటుంబ పరిధిలోనే ఉండటంచేత అది ఒంటరిమహిళల మూగ సాంస్కృతిక చైతన్యంగా ఉండి ఎవరికీ స్పష్టమవలేదు. అయితే ఆధునికయుగ ప్రారంభంలో ఏర్పడిన సామాజిక చలనసూత్రాల పరిణామంలో పుట్టిన జాతీయోద్యమంవల్ల స్త్రీవిద్యకు ప్రాధాన్యత కలిగింది. దానితో స్త్రీలకు సామాజిక సంబంధాలు అభివృద్ధిచెంది మహిళల చైతన్యం సామూహికత్వాన్ని సంతరించుకొని, అది

స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యం చైతన్యంగా పరిణామం చెందింది. భారతదేశంలో ప్రజాస్వామ్యం ఏర్పడినా మహిళలకు ఇంటాబయటా స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు లేకపోయేసరికి మహిళలు తమ గౌరవప్రదమైన జీవనానికై తమవ్యక్తిత్వాలకు విలువ ఉండాలని భావిస్తూ జీవితాలపై సాధికారచైతన్యం తెచ్చుకొనే క్రమంలో మహిళాచైతన్యం సైద్ధాంతిక తాత్వికతను సంతరించుకొని స్త్రీవాదచైతన్యంగా స్థిరపడింది. ఆ క్రమంలోనే మార్కెట్ శక్తుల వ్యాపారసంస్కృతి స్త్రీలజీవితాలను శక్తియుక్తులను కబళిస్తుంటే వ్యక్తిత్వ, అస్థిత్వచైతన్యాలుగా బలాన్ని పుంజుకోవటం జరిగింది.

దేశంలో ఆర్థికవిధానాలు మారినప్పుడల్లా వాటి ప్రభావం ముందుగా స్త్రీలజీవితాలమీద పడుతుంది. కాబట్టి ఆయా పరిస్థితులపట్ల మహిళలను అప్రమత్తంచేస్తూ వారిని చైతన్యపరచటానికి వచ్చిన సాహిత్యాన్ని తెలుసుకుంటూ ఉండాలి. కాలం నిరంతర చైతన్యశీలి. అది మానవజీవనంలోని ఎన్నోసంఘటనలు, సంఘర్షణలను ప్రోదిచేసుకుంటూ, పొదవిపుచ్చుకుంటూ ముందుకు సాగుతుంటుంది. మహిళల జీవితాలలో అలజడులను సృష్టించే ఆయా సంఘర్షణలపట్ల మహిళలు నిరంతర చైతన్యశీలురు కావాలి. మహిళలందరూ సామూహిక చైతన్యవంతులు కావాలంటే వారికి దిశానిర్దేశం చేసేది సాహిత్యం మాత్రమే. కాబట్టి మహిళాభ్యుదయానికి అవసరమైన సాహిత్య సృజన నిరాటంకంగా నిరంతరం జరుగుతూనే ఉండాలని, మహిళలు నిరంతర చైతన్యాన్ని తెచ్చుకుంటూ ఉండాలి కాబట్టి దీనికి అంతం ఉండదు. ఆ నిరంతర చైతన్యానికి ఆకాశమే హద్దు. అందుకే ఆకాశంలో స్త్రీలు సగభాగం అన్నారు. సామాజిక జీవనంలో తరతరాలుగా చాపకింద నీరులాగా పారుకుంటూ వస్తున్న పితృస్వామ్య సంస్కృతి సాగినన్నాళ్ళు వివక్షకు గురి అవుతున్న మహిళలలో దానిని అధిగమించగల విప్లవాత్మకమైన సాంస్కృతిక చైతన్యం, ఆర్థిక–రాజకీయచైతన్యం, ఆత్మరక్షణచేసుకోగల సాధికార అస్తిత్వ చైతన్యాలను తెచ్చుకునేప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ఆ ప్రయత్నాలలో భాగంగా మహిళలు తమ స్వాతంత్ర్య జీవనానికి విలువలను పెంచుకొనే భౌతిక, బౌద్ధిక సామర్థ్యాలను అభివృద్ధిచేసుకోవాలి. అందుకే మహిళల జీవితాలకు దిశా–దశా నిర్దేశంచేస్తూ వారిని నిరంతర చైతన్యపథంలో నడిపించేది కూడా సాహిత్యం మాత్రమే.

గత పాతికేళ్ళుగా వివాహసంస్కృతిలోని పితృస్వామ్యపు ఆధిపత్యధోరణుని నిరసిస్తూ అసలు పెళ్ళితంతునే నిరాకరించే భావజాలం అభివృద్ధిచెందింది. అయితే మేధావులు సహజీవనాన్ని ప్రత్యామ్నాయంగా చూపించారుగాని చదువు జ్ఞానంలేనివాళ్ళు ఆ సహజీవనసంస్కృతిలోని తాత్వికతను గ్రహించలేక వివాహితులు అన్యసంబంధాలు పెట్టుకోవటం రివాజుగా మారి ఈ పద్ధతిలోను స్త్రీలు లైంగికదోపిడీకి గురికావటం లేదా చంపబడటం జరుగుతున్న చరిత్ర. అయితే స్త్రీవాదులుగా

స్త్రీరచయితలు పెళ్ళిని నిరసిస్తున్నారనే అపప్రథ తొలగిపోగొట్టటమే గాక పురుషులుకూడా స్త్రీలు పెళ్ళిని నిరసించటం సబబుగా అనిపించిన ధోరణిని 2025 లో బి.స్ రాములుగారు రచించిన 'తోడునీడ' అనే కథ స్పష్టం చేసింది. స్త్రీవాద చైతన్యం కేవలం స్త్రీలలోనే కాక పురుషులలోకూడా చైతన్యం కలిగించే రచనలు రావటం సామాజికచైతన్యానికి ఆనవాళ్ళుగా నిలిచే చైతన్య దీపికలు.

ప్రపంచీకరణ సందర్భంలో సంస్థాగత నిర్వహణ సామర్థ్యానికి మచ్చుతునకలైన ప్రాజెక్టులను తయారుచేసి ప్రదర్శించటం చదువులో భాగం. అందుకే నిట్టల సౌమ్య 2025 లో రాసిన 'గాజుగోడ' అనే కథలో అటువంటి విషయంలో ఒక యువకుడు వెనకబడ్డా తోటివిద్యార్థిని అందరి ప్రశంసలుపొంది ప్రథమస్థానంలో గుర్తింపబడటం జరుగుతుంది. కాని వాళ్ళిద్దరూ వివాహం చేసుకొన్నతరువాత అతడు పెద్దఉద్యోగంలో చేరుతాడు. ఆమె యింటికి, పిల్లలపోషణకు నియమితమౌతుంది. కొన్నాళ్ళకు ఆమె భర్త తన ఎదుగదలయే కాకుండా ఆనాడు తనకంటే క్లాసులో తెలివైనదిగా నిరూపింపబడిన తన భార్య ఇలా ఇంటిపనులకే పరిమితంకాకుండా భార్య తెలివితేటలు సమాజాభివృద్ధికై వినియోగపడాలనుకొంటాడు. భర్తకు రోజూ ఆమెయొక్కసామర్థ్యం గాజుగోడలలో స్పష్టమవుతుంటే ప్రాజెక్టువర్కులను తీసుకొంటూ ఫర్మ్‌లలో ఆమె సామర్థ్యాన్ని నిరూపించుకోమంటాడు. 2000 లలో కుప్పిలి పద్మ రాసిన 'ఆకాంక్ష' అనే కథలో మహిళలను ఉన్నత స్థానాలకు ఎదగనీయకుండా 'గ్లాస్ సీలింగ్' కి గురిచెయ్యాలనుకున్న పురుషుల దృక్కోణంనుండి, నేడు భర్తలు తమ భార్యలు వారి సామర్థ్యాలతో ఉన్నతస్థానంలో గుర్తింపబడాలని కోరుకోవటం కూడా గత పాతికేళ్ళనుండి స్త్రీవాద రచయితలు కలిగించిన సాహిత్య చైతన్య ఫలితమే. అందుకే ఈ కథలో నేడు కుటుంబంలోని పనిసంస్కృతిలో బార్యాభర్తల మధ్యనున్న 'గాజుగోడలు' బద్దలవాల్సిన చైతన్యం కలిగించటం సాహిత్యప్రయోజనం సిద్ధించటంగా భావించవచ్చు. ఇలాంటి సాహిత్యం మరింతగా నిరంతరం రాగలిగితేనే వివక్షా సంస్కృతి బీటలువారటమేగాక సామాజికప్రగతి దానంతట అదే చోటు చేసుకుంటుందని ఆశించవచ్చు.

ప్రజాస్వామ్యమని చెప్పుకుంటున్న నేటి సమాజంలో నిరంతరం ఇంటాబయటా మహిళలపై జరిగే దాడులతో పాటు స్త్రీలశక్తియుక్తులను పీల్చి పిప్పిచేస్తూ, నిస్సహాయస్థితిలోఉంచే సంఘటనలు అనేకం జరుగుతూనే ఉన్నాయి. ఒకపక్కన మహిళలు రోదసిలో ప్రయాణంచేసి ఆకాశపు అంచులను చేరుకోవాలనే చైతన్యశీలురవుతుంటే, మరొకపక్కన మహిళలపై అత్యాచారాలతో వారిని అథోగతి పాలుచేస్తున్న సమాజం కనపడుతోంది. ప్రపంచీకరణ సందర్భంలో మహిళలు తమ శక్తియుక్తులను పణంగా పెట్టి విశాల విశ్వానికి చేరుకొంటున్నా గగనసదృశమైన చైతన్యాన్ని పుంజుకోవాల్సి వస్తోంది.

ఆర్థిక విధానాలవల్ల ద్రవ్యవినిమయం పెరిగి ఆకర్షణలు పెరగటంతో, వాటికై అర్రులుసాచే మహిళలను బుట్టలో వేసుకోవటంతో, స్త్రీపురుషులు వివాహేతరమైన సహజీవనసంబంధాలు ఏర్పరచుకుంటుంటే చావులు, చంపటాలుగా మారిన సమాజంలో మహిళలకు జీవనభద్రత కరువవుతోంది. సంఘటనలు జరిగినప్పుడల్లా మహిళాసంఘాలు ముందుకు వచ్చి వారికి భరోసాగా ఉన్నా, అటువంటి సంఘటనలు జరగటానికి మునుపే మహిళలు అప్రమత్తతతో ఉండగల చైతన్యాన్ని కలిగించటానికి, స్త్రీపురుష సంబంధాలు సజావుగాసాగే మానవసంబంధాలుగా కొనసాగించగలగటానికి సాహిత్య చైతన్యం అవసరం. దానికి ఆకాశమే హద్దు. మహిళలలో రాజకీయ–ఆర్థికమైన సాంస్కృతిక చైతన్యాన్ని అందించగలిగినప్పుడే మహిళలజీవనానికి భద్రత ఏర్పడి, వారు ఆకాశమంత ఎత్తుకు ఎదగగలుగుతారు.

జీవితసమాచారం (బయో-డేటా)

డాక్టరు జంధ్యాల కనకదుర్గ

జన్మతేదీ, స్థలం : 10 ఏప్రిల్ 1953, పిడపర్రు (గుంటూరు జిల్లా)

తల్లిదండ్రులు : కీ॥శే॥ జంధ్యాల కుమార స్వామి, కీ॥శే॥ జంధ్యాల లక్ష్మీ ప్రసన్నమ్మ.

భర్త : శ్రీ ఎమ్.వి.శాస్త్రి

చిరునామా : డా॥ జె.కనక దుర్గ,
ఇంటి నెం.5-35-18, 3వ లైను, 18వ అడ్డరోడ్డు, బ్రాడిపేట,
గుంటూరు-522002 ఆం.ప్ర.

ఫోను : 0863-2279999

చరవాణి : 9491140299

వృత్తి అనుభవం : 35 సం॥లు తెలుగు లెక్చరర్, రీడర్, వైస్ ప్రిన్సిపల్ మరియు ప్రిన్సిపాలుగా సింగరేణి కాలరీస్, మహిళా డిగ్రీకళాశాల, కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ *(ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లోని ఖమ్మం జిల్లా)*

కళాశాల విద్య : బి.ఏ.1969-72, ఆంధ్రా యూనివర్సిటీ ప్రభుత్వ మహిళా కళాశాల, గుంటూరు.

ఉన్నత విద్య : అ) ఎమ్.ఏ. తెలుగు ఆంధ్ర యూనివర్సిటీ, 1972-74 *(స్వర్ణ పతకం)*
ఆ) ఎమ్.ఫిల్. కాకతీయ యూనివర్సిటీ,1989-91 *(రెండు స్వర్ణ పతకాలు)*
ఇ) పి,హెచ్.డి కాకతీయ యూనివర్సిటీ, 1992-94.

అభిరుచి : తెలుగు సాహిత్యం-మహిళా అధ్యయనం-సమస్యలు-సహాయ సహకారాలు

ప్రస్తుతం : నిరంతర తెలుగు సాహిత్య పఠనం

ప్రత్యేక గుర్తింపులు :

1. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపు ఉత్తమ ఉపాధ్యాయురాలు పతకం - 1994
2. బెస్ట్ ఎన్.ఎస్.ఎస్. ఆఫీసరు 1996 కాకతీయ విశ్వవిద్యాలయం
(జాతీయ సేవా పథకం, ఖమ్మంజిల్లా సుజాతనగర్ దగ్గర వాటర్ షెడ్ ప్రోగ్రాం,

హేమచంద్రా పురం గ్రామ దత్తత, రోడ్లు వేయుట,ఉన్నత పాఠశాల ఏర్పాటు, సులభ మరుగుదొడ్ల నిర్మాణానికి ITDA సహకారానికై ప్రచోదనం, గ్రామంలో ఉన్న నీటి ఎద్దడి నివారణకై ట్యాంకు నిర్మాణం–సింగరేణి గనుల నీటి మళ్ళింపు, 'లిఫ్ట్ఇరిగేషన్' ప్రచోదకసేవ, అక్షరాస్యత, చెట్లు నాటటం, తూర్పుగోదావరి, ప్రకాశం జిల్లాలలోతుఫాను వరదబాధితుల సహాయ కార్యక్రమాలు మొదలైనవి.)

3. జన్మ భూమి అవార్డు–ఆం.ప్ర.ప్రభుత్వంచే – జ్ఞాపికా సత్కారం – 1996
4. గొలుసు రామాంజనేయ గోల్డ్ మెడల్ ఎమ్.ఏ – 1975
5. ముక్కవల్లి అన్నపూర్ణ మెమోరియల్ ప్రైజ్ ఎమ్.ఏ – 1975
6. ఈశ్వరీదేవి మెమోరియల్ ప్రైజ్ – ఎమ్.ఏ. 1975
7. మహాకవి గురజాడ అప్పారావు గోల్డ్ మెడల్ ఎమ్.ఫిల్. 1991.
8. వెంకట రంగా రెడ్డి మరియు వరదయ్య గోల్డ్ మెడల్ – ఎమ్.ఫిల్. 1991.
   పోపూరి సుబ్బారావు స్మారక పురస్కారం–2022–శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం – తిరుపతి – ఆంధ్రప్రదేశ్
9. రచయిత్రి ఉత్తమగ్రంథ సాహితీపురస్కారం–2025–శ్రీ సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం – హైద్రాబాద్

యూనివర్సిటీ గ్రాంట్ కమీషన్ గుర్తింపు :

1. యు.జి.సి ఫెలోషిప్ అవార్డు – 1975
2. యు.జి.సి. మైనర్ రీసెర్చ్ ప్రాజెక్ట్ అవార్డు – 1998–2000
   (సింగరేణి గనికార్మిక సాహిత్యం–పారిశ్రామిక సంబంధాలు)
3. యు.జి.సి.మేజర్ రీసెర్చ్ ప్రాజెక్ట్ అవార్డు – 2002–2005.
   (ప్రపంచీకరణ సందర్భంలో స్త్రీ పురుష సంబంధాలు)

ఇతరములు :

ఎయిర్ ఇండియా బోల్ట్ (BOLT) అవార్డు 2004

BROAD OUT - LOOK LEARNING & TEACHING)

బెస్ట్ వార్డెన్ గా – సింగరేణి యాజమాన్యం నుండి ప్రతిభా పత్రము –1996

బెస్ట్ టీచర్‌గా కొత్తగూడెంలో స్థానిక లయన్స్, వాసవీ, రోటరీ సంస్థలచే సన్మానం 1994, 1995, 1996.

పత్రసమర్పణ : వివిధ విశ్వవిద్యాలయ జాతీయ సాహిత్య సదస్సులలో 30 కి పైగా పత్ర సమర్పణ.

జాతీయసెమినార్ల నిర్వహణ - సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల, కొత్తగూడెం :

1. దేశాభివృద్ధిలో అగృహీతమైనస్త్రీశక్తులు - 2000
2. ఔత్సాహిక మహిళల పారిశ్రామికాభివృద్ధి - 2009

ప్రచురించిన పుస్తకాలు :

1. "కొరవిగోపరాజు సింహాసన ద్వాత్రింశిక- మహిళా జనజీవనం" - 1992 లో తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్ వారి ఆర్థిక సహాయంతో ప్రచురించిన ఎమ్.ఫిల్. సిద్ధాంతగ్రంథం.
2. "తెలుగు స్వతంత్ర కథా కావ్యాలు-స్త్రీ జన జీవన చిత్రణ" - పి.హెచ్.డి సిద్ధాంతగ్రంథం 1995 లో తెలుగు విశ్వ విద్యాలయం హైదరాబాద్ వారి ఆర్థిక సహాయముతో ప్రచురణ.
3. సింగరేణి సాహిత్యం - శ్రమ శక్తుల జీవనం 2005 లో స్వీయ ప్రచురణ.
4. తెలుగు సాహిత్యం - మహిళా చైతన్య ప్రస్థానం 2009 లో ప్రచురణ.
5. సాహితీ సుమాలు (కవితలు-కథలు-నాటకాలు) 2010 లో ప్రచురణ
6. తెలుగు సాహిత్యం-మహిళా చరిత్ర-సంస్కృతి (సహరచయిత్రి) ఎమ్.ఏ. తెలుగు ద్వితీయ-పాఠ్యాంశం (తెలుగు) కోసం కాకతీయ యూనివర్సిటీ-1997.
7. "సూత పురాణం నవీన దృక్పథం" ఎమ్. ఏ. తెలుగు సిలబస్ (సహరచయిత్రి) అంబేద్కర్ యూనివర్సిటీ ఎమ్.ఏ. ఫైనల్ కోర్సు మెటీరియల్ 2007
8. 'నూరేళ్ళ కథకు నీరాజనం' కథాసంకలనం సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ కళాశాల కొత్తగూడెం (ఖమ్మంజిల్లా) వారి ప్రచురణ - 2008.
9. 'సాహిత్యం-సత్త్వదర్శిని'- పరిశోధనావిమర్శ వ్యాససంపుటి జులై, 2021)
10. స్వతంత్రతనుండి....స్వాతంత్ర్యానికి (తెలుగులో స్త్రీలసాహిత్యం-1900-1947) జులై, 2021
11. గతశతాబ్దపు సాంస్కృతిక స్రవంతి - (మాలతూచందూర్ నవల-శతాబ్దిసూరీడు) 2025
12. హృదయనేత్రి-సహృదయసంధాత్రి (మాలతీచందూర్ నవల-హృదయనేత్రి) 2025
13. ఆకాశమే హద్దుగా.. (ప్రాచీన, ఆధునిక తెలుగు సాహిత్యంలో స్త్రీల చైతన్యం) 2026
14. అమరావతిలో అస్థికలు - కథాసంపుటి (2026)

ప్రచురిత పరిశోధనావ్యాసాలు :

1. 'మధ్య యుగాలనాటి సాహిత్యం లో మహిళా సంస్కృతి'- *ఆంధ్రజ్యోతి డైలి- 06-06-1990.*
2. 'నాచికేతోపాఖ్యానం' నాటి స్త్రీలఆలోచనల వ్యాఖ్యానాలు-*ఆంధ్రజ్యోతి తేదీలు10 & 17-08-1990*

3. 'మధురవాణి వంటి మరోచతురవాణి' – *ఆంధ్రప్రభ దినపత్రిక 01-10-1993.*

4. 'పారిజాతాపహరణం లో పరిమళించిన సంస్కృతి' – *జూలై 1996, తెలుగు సాహిత్యపత్రిక.*

5. కాలిన కలలు–బహుమతిపొందిన పుస్తక సమీక్ష – *చతుర మాసపత్రిక – ఆగష్టు 1996.*

6. మాతృత్వమా? మహిళా న్యాయమా? – *భారతంలో 'స్త్రీపర్వం' ఆగష్టు 1998 తెలుగు త్రైమాసిక పత్రిక, తెలుగు అకాడెమి.*

7. పర్యావరణంలో ప్రమదలు – *1999 'యోజన' మాసపత్రిక– ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణ.*

8. 'రాధికా సాంత్వనం–లైంగిక న్యాయం' – *2001 శ్రీ పద్మావతీ విశ్వవిద్యాలయం, తిరుపతి.*

9. ఇంటివెలుగు–కథ – *సింగరేణి జమాన్య ప్రచురణ, కొత్తగూడెం, 2002.*

10. దేశాభివృద్ధిలో స్త్రీల శక్తియుక్తులు – *'వార్త' దిన పత్రిక, 31-10-2002.*

11. 'హరి వంశం' లో నారీ శక్తి' వాఙ్మయి – *జనవరి–మార్చి (త్రై మాసికం) 2003 తెలుగు విశ్వ విద్యాలయం, బొమ్మూరు.*

12. 1975–2000 మధ్య వచ్చిన స్త్రీల నవలలు – వ్యాసం *(తెలుగులో స్త్రీల సాహిత్యం)* కాకతీయ *విశ్వవిద్యాలయం ప్రచురణ, ఆగష్టు 2003.*

13. రాయప్రోలు రచనలు–స్త్రీల సామాజిక దృక్పథం – వాఙ్మయి *(జనవరి–మార్చి) 2004.*

14. ప్రపంచీకరణ–తెలుగు సాహిత్యం–మహిళా కథనాల ప్రతిఫలనాలు – వాఙ్మయి *(అక్టోబర్–డిసెంబర్, త్రైమాసికపత్రిక 2004)*

15. శ్రీపాద కథలు–స్త్రీ వాద కదలికలు – *మార్చి2005 'జండర్ స్పృహ'* కాకతీయ విశ్వవిద్యాలయ *ప్రచురణ.*

16. తెలుగు కథానిక–ప్రపంచీకరణంలో స్త్రీపురుషసంబంధాలు – *ఖనిత్ర పరిశోధనా పత్రిక, సింగరేణిమహిళా కళాశాల ప్రచురణ, కొత్తగూడెం, 2009.*

17. భూమిమీద సాంస్కృతిక ప్రభావం – *ఖనిత్ర పరిశోధనా పత్రిక, సింగరేణిమహిళా కళాశాల ప్రచురణ, కొత్తగూడెం, 2009.*

18. వాతావరణ పునర్వివేచన – ఖనిత్ర పరిశోధనా పత్రిక, సింగరేణిమహిళా కళాశాల ప్రచురణ, కొత్తగూడెం, 2009.

19. కదనంలో రుద్రమ–కవనంలో సత్యభామ – *ఏప్రిల్ 2013 'తెలుగు వెలుగు' మాసపత్రిక.*

20. సామర్థ్యమే సర్వస్వం – *మార్చి2014 తెలుగు వెలుగు మాసపత్రిక.*

21. 'అమరావతి కథల్లో ఆకాశంలో సగం' – *ఆంధ్ర జ్యోతి–వివిధ–07-03-2016.*

22. 'ఓ మహిళా మేలుకో' – 'తెలుగు వెలుగు', మార్చి 2016.
23. 'గాథాసప్తశతిలో బాధా తప్తసతులు' – ఆంధ్ర జ్యోతి దినపత్రిక-వివిధ-26-09-2016.
24. ఆధునిక తెలుగు సాహిత్యం-మహిళా స్వేచ్ఛ- చైతన్యం – జనవరి 2017 'మిసిమి' మాసపత్రిక.
25. 'సాహిత్యంలో రుద్రమ శక్తి' తెలంగాణ ప్రపంచ తెలుగు మహా సభల ప్రత్యేక సంచిక – 2017 (తెలుగు అకాడెమి)
26. జైమినీ భారతం-వీరవనితలు – మిసిమి, సెప్టెంబరు 2017.
27. భార్యలెందుకు భర్తలను చంపుతున్నారు – 21.01.2018 ఆంధ్రజ్యోతి దినపత్రిక.
28. 'సింగరేణి సాహిత్యంలో గని కార్మిక జీవితం' – మార్చి2018 'తెలంగాణ చరిత్ర- సంస్కృతి' వ్యాస సంపుటి-తెలుగు యూనివర్సిటీ ప్రచురణ.
29. తాళ్ళపాక తిమ్మక్క-సుభద్రా కల్యాణం – మిసిమి, ఏప్రిల్ 2018.
26. 'తెలుగు సామెతలలో స్త్రీ వివక్ష' – ఆంధ్రప్రభ-10.06.2018.
27. 'ఆఁడుమళయాళం-అంతర్గత సంస్కారం' వ్యాసం – కందుకూరి వీరేశలింగం శతజయింతి ప్రచురణ 'క్రాంతదర్శి-కందుకూరి' (చెన్నై తెలుగు ప్రకాశం), 2018.
28. 'తెలుగు సామెతలలో సేద్యం' – ఆంధ్రజ్యోతి దినపత్రిక, (23.06.2018-30.06.2018)
30. 'స్వాతంత్రోద్యమ చరిత్రలో స్త్రీల సాహిత్య చైతన్యం' – (మిసిమి- నవంబరు2018).
31. నేరమా? కాదు! (497 సెక్షన్ రద్దు) – ఆంధ్రజ్యోతి దినపత్రిక- 12.10.2018, ఎడిటోరియల్ పేజి
32. 'దార్ల సుందరమ్మ భావలింగాత్మకత' – ఆంధ్రజ్యోతి-వివిధ, 22.10.2018.
33. 'సాహిత్యంలో సహజీవనం-నవజీవనం' – తెలుగు వెలుగు నవంబరు, 2018.
34. 'సాహిత్యంలోని వింతలే నేటి శాస్త్రమా?' – 24.12.2018 ఆంధ్రప్రభ.
35. 'శమంతకమణి' కావ్యవిశిష్టత-రామ బ్రహ్మంగారు – మిసిమి, జనవరి 2019.
36. 'తెలుగు సాహిత్యం గుణాత్మక విమర్శ' – మిసిమి, మార్చి 2019.
37. తరిగొండ వెంగమాంబ-'నృసింహశతకం' – తెలుగు వెలుగు, జూలై 2019.
38. బుద్ధుని నడిపిన యశోధర – ఆంధ్ర జ్యోతి-వివిధ, 08-04-2019.
39. మాతృమూర్తి-రాజ్యాంగస్ఫూర్తి – ఆంధ్రజ్యోతి దినపత్రిక, 08-03-2019
40. ఎలాంటి సాహిత్యం కాంతాసమ్మతం? – ఆంధ్రజ్యోతి దినపత్రిక-వివిధ, 16-08-2021.
41. మహిళాబిల్లు-ప్రజాస్వామ్యపరిరక్షణ – (ఆంధ్రజ్యోతి దినపత్రిక, 07-03-2021) ఎడిటోరియల్ పేజి.
42. నాణాలు చెప్పిన చరిత్ర – మిసిమి, మార్చి, 2022.

43. ఆధునికాంధ్ర ప్రథమకవయిత్రి – *ఆంధ్రజ్యోతి దినపత్రిక–వివిధ, 21–03–2022.*

44. క్విట్ ఇండియా ఉద్యమంలో స్త్రీలసాహిత్యస్ఫూర్తి – *ఆంధ్రప్రభ, 05–06–2022.*

45. కనకపుష్యరాగం పొణకా కనకమ్మ – *ఆంధ్రజ్యోతి దినపత్రిక, 09–06–2022.*

46. శతవసంతాల శారదానికేతనం – *ఆంధ్రజ్యోతి దినపత్రిక, 20–07–2022.*

47. మహిళాకథాసాహిత్యంలోసత్యాగ్రహం – *ఆంధ్రప్రభ, 07–08–2022.*

48. స్వాతంత్ర్యస్ఫూర్తిని చిత్రించిన కథా రచయిత్రులు – *ఆంధ్రప్రభ, 14–08–2022.*

49. పులవర్తి కమలావతీదేవి – *మిసిమి మాసపత్రిక, అక్టోబరు 2022.*

50. మాగంటి అన్నపూర్ణ–తెలుగువీరలేవరా వ్యాసపుటి – చెన్నపురి *తెలుగు అకాడెమి ప్రచురణ, సెప్టెంబరు 2022.*

51. స్త్రీల స్వరాజ్యోద్యమస్ఫూర్తి–దేశస్వాతంత్ర్య దీప్తి (స్త్రీలసాహిత్యం)–స్వరాజ్యస్ఫూర్తి@75 వ్యాససంకలనం – వెలుగు రామినాయుడు ప్రచురణలు విజయనగరం, ఆగస్టు 2022.

52. స్త్రీసాహిత్యం–దళితులు – *మిసిమి మాసపత్రిక, సెప్టెంబరు 2023.*

53. స్వాతంత్ర్యానికి పూర్వసాహిత్యంలో స్త్రీలహక్కుల చైతన్యం – మానవి *మాసపత్రిక, జులై 2023.*

54. మాలపల్లి నవల–మానవస్వేయోద్ధరణ – *మిసిమి మాసపత్రిక జూలై 2023.*

55. తరిగొండ వీరతరుణి–వెంకటాచల మహాత్మ్యం – మిసిమి *మాసపత్రిక, ఏప్రిల్ 2023.*

56. స్వాతంత్ర్యం–స్త్రీ వ్యక్తిస్వాతంత్ర్యం – *మిసిమి మాసపత్రిక, ఆగస్టు 2024.*

57. తెలుగు సాంఘిక నాటకాలు–స్త్రీవాద – *జూన్, 2025–మిసిమి మాసపత్రిక.*

58. సంవేదం–కథ – *మల్లెతీగ మాసపత్రిక–జులై, 2025.*

రచయిత : **డా. జంధ్యాల కనకదుర్గ**



పుట్టినతేది : 10.04.1953

తల్లిదండ్రులు : శ్రీ జంధ్యాల కుమారస్వామి, శ్రీమతి లక్ష్మీప్రసన్నమ్మ

భర్త : శ్రీ ఎమ్.వి.శాస్త్రి

విద్యార్హతలు :

1. ఎమ్.ఏ – ఆంధ్రా విశ్వవిద్యాలయం (బంగారుపతకం) 1974
2. ఎమ్.ఫిల్ – కాకతీయ విశ్వవిద్యాలయం (రెండు బంగారు పతకాలు) 1990
3. పి.ఎచ్.డి – కాకతీయ విశ్వవిద్యాలయం 1994

వృత్తి అనుభవం : 34 సం.లు – లెక్చరర్, రీడర్ (అసోసియేట్ ప్రొఫెసర్), ప్రిన్సిపాల్ – సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ కళాశాల, కొత్తగూడెం, ఖమ్మంజిల్లా.

సత్కారం :

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపు ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారం, 1994 మరియు ఇతర సంస్థల పురస్కారాలు
- ఉత్తమ గ్రంథం రచయిత్రి సాహితీ పురస్కారం2025 – సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వ విద్యాలయం, తెలంగాణ
- శ్రీ పోపూరి సుబ్బారావు స్మారక సత్కారం–2022 : శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం, తిరుపతి.
- ఉత్తమ ఎన్.ఎస్.ఎస్ ఆఫీసర్ :1996, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.
- BOLT అవార్డు ఆఫ్ ఎయిర్ ఇండియా

పరిశోధనలు :

- యు.జి.సి. రీసెర్చ్ ఫెలోషిప్ అవార్డు – 1975
- యు.జి.సి.మైనర్ రీసెర్చ్ ప్రాజెక్టు–సింగరేణి గని కార్మిక జీవన చిత్రణ 1998.
- యు.జి.సి.మేజర్ రీసెర్చ్ ప్రాజెక్టు– ప్రపంచీకరణ సందర్భంలో స్త్రీ పురుష సంబంధాలు – 2004

ప్రచురణలు : 1. కొఅవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక **2.** తెలుగు స్వతంత్ర కథాకావ్యాలలో మహిళా జీవన చిత్రణ **3.** తెలుగు సాహిత్యం–మహిళా చైతన్య ప్రస్థానం **4.** సింగరేణి సాహిత్యం–శ్రమ శక్తుల జీవనం **5.** సాహితీ సుమాలు **6.** సాహిత్యం–సత్త్వదర్శిని **7.** స్వతంత్రత నుండి... స్వాతంత్ర్యానికి – (తెలుగులో స్త్రీల సాహిత్యం 1900–1947) **8.** గత శతాబ్దపు సాంస్కృతిక స్రవంతి **9.** హృదయనేత్రి – సహృదయ సంధాత్రి **10.** ఆకాశమే.. హద్దుగా **11.** అమరావతిలో అస్థికలు–కథావాహిని.

వివిధ పత్రికలలో ప్రచురింపబడిన విమర్శ వ్యాసాలు 60 పైగా

అభిరుచి – నిరంతర తెలుగు సాహిత్యాధ్యయనం – పరిశోధన

ISBN: 978-93-5782-171-1